కొమెరమూడి రాఘవేంద్రరావు

సినీ వినీలాకాశంలో ఆయన అక్షరాలా దర్శకేంద్రుడే.
సన్నివేశాలను అందంగా, పాటలను శృంగారభరితంగా మలచడంలో ఆయనకు ఆయనే సాటి.
అడవిరాముడు లాంటి మాస్ చిత్రాన్ని అన్నమయ్య లాంటి భక్తిరసప్రధాన చిత్రాన్ని
తెరకెక్కించడం ఆయనకే చెల్లింది.



ఈ యేడాదితో దర్శకునిగా కె. రాఘవేంద్రరావు 50 ఏళ్లు పూర్తి చేసుకున్నారు.

దర్శకునిగా రాఘవేంద్రరావుకు ఉన్నంత సక్సెస్ రేట్ మరే తెలుగు దర్శకునికీ లేదంటే అతిశయోక్తి కాదు. 109 చిత్రాలకు దర్శకత్వం వహించగా, వాటిలో దాదాపు 75 శాతం చిత్రాలు తెలుగు బాక్సాఫీస్ వద్ద విశేషంగా సందడి చేసినవే. మహానటులు యన్టీఆర్, ఏయన్నార్‌తోపాటు తరువాతి తరం హీరోలు కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు, మోహన్‌బాబు, మురళీమోహన్, చంద్ర మోహన్, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్, మహేశ్‌బాబు, అల్లు అర్జున్, శ్రీకాంత్, జె.డి. చక్రవర్తి, నితిన్- ఇలా అన్ని తరాల టాలీవుడ్ టాప్ స్టార్స్‌తోనూ పనిచేసిన దర్శకునిగా రాఘవేంద్రరావు ఒక్కరికే పేరుంది. ఆయన చిత్రాల ద్వారా నటనతో ఆకట్టుకొని అవార్డులు, రివార్డులు సంపాదించిన వారెందరో ఉన్నారు. ఆయన చిత్రాలు భావి దర్శకులకు పాఠ్యాంశాలు.

1942 సంవత్సరం కృష్ణాజిల్లా కోలవెన్ను గ్రామంలో జన్మించిన రాఘవేంద్రరావు తండ్రి కె.ఎస్. ప్రకాశరావుగా ప్రసిద్ధులైన కోవెలమూడి సూర్యప్రకాశరావు ఆ రోజుల్లో మేటి నటుడు, దర్శకుడు, నిర్మాత, స్టూడియో అధినేత, రచయిత- ఇలా అప్పట్లోనే తన బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించారు కె.ఎస్. ప్రకాశరావు. ఆయన ఎన్ని చిత్రాలు రూపొందించినా, ప్రకాశరావు పేరు చెప్పగానే అందరికీ ముందుగా గుర్తుకు వచ్చే చిత్రం ఏయన్నార్‌తో రూపొందించిన ప్రేమనగర్. ఆ చిత్రాన్ని తమిళ, హిందీ భాషల్లోనూ ప్రకాశరావే తెరకెక్కించడం విశేషం. అన్నిచోట్ల ఆ సినిమా ఘనవిజయం సాధించింది. ఈ విషయంలో తన తండ్రి తనకంటే మిన్న అని రాఘవేంద్రరావు చెప్పుకుంటారు. ఎందుకంటే రాఘవేంద్రరావు తండ్రిలాగే హిందీలో పలు చిత్రాలకు దర్శకత్వం వహించి, విజయం సాధించారు. అయితే తమిళంలో తండ్రిలాగా జయకేతనం ఎగురవేయలేకపోయారు. అలాగే తన తండ్రి నటనలోనూ రాణించారని, తాను అభినయానికి దూరం అంటూ ఉండేవారు. అలాంటి రాఘవేంద్రరావు తొలిసారి పెళ్లిసందD లో నటించారు.

కె.రాఘవేంద్రరావు ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేవారు కాదు. తన సినిమా, దానిని జనరంజకంగా ఎలా తెరకెక్కించాలి అన్న వాటిపైనే ఆయన ధ్యాస ఉండేది. అందుకే అందరికీ మౌనిలా కనిపించేవారు. ఈ మౌనమును మౌనం వీడి తొలిసారిగా ఈ టీవీ ఆధ్వర్యంలో 'సౌందర్యలహరి' అనే కార్య క్రమంలో ఏకంగా ఏడాదిపాటు తన సినీ అనుభవాలను పంచు కున్నారు. ఇలా ఒక సంవత్సరంపాటు ఒక సినిమా వ్యక్తిపై టీవీ కార్యక్రమం ప్రసారం కావడం అదే తొలిసారి. అదే చివరిసారి కూడా. అయినా, అప్పట్లోనూ ఆయన పెదవి విప్పి మీడియాతో తన సినిమాల గురించి గొప్పగా చెప్పుకున్న సందర్భాలు లేవు.

యన్టీఆర్‌తో *అడవిరాముడు, వేటగాడు, డ్రైవర్ రాముడు, గజదొంగ, కొండవీటి సింహం, జస్టిస్ చౌదరి, మేజర్ చంద్రకాంత్* వంటి బ్లాక్ బస్టర్స్ అందించిన రాఘవేంద్రరావు, 'రామారావుగారు లేకుంటే తనకు ఈ స్థాయి ఉండేది కాదు,' అని వినమ్రంగా చెబుతూ ఉంటారు. ఎన్టీఆర్‌తో పదకొండు సంవత్సరాల్లో పన్నెండు చిత్రాలు నిర్మించిన ఘనత రాఘవేంద్రరావుగారిది.

రాఘవేంద్రరావు సినీజీవితంలో ఎన్నో కలికితురాయి లున్నాయి. ఆయన దర్శకత్వం వహించిన 109 చిత్రాల్లో అరవైకి పైగా శతదినోత్సవ చిత్రాలు, ఏడాదిపాటు ఆడిన సినిమాలు అరడజను దాకా ఉన్నాయి. వేటగాడు చిత్రం ఏకంగా అరవై వారాల పాటు ఆడి రికార్డు సృష్టించింది.

రాఘవేంద్రరావుగారి సినీజీవితంలో ముప్ఫైయారు మంది హీరోలతోనూ, డెబ్భైయేడు మంది హీరోయిన్‌లతోనూ సినిమాలను రూపొందించడం ఆయనకే చెల్లింది. భారతదేశ చరిత్రలో ఇది ఒక రికార్డు. మరొకరు లేరు. ఇవాళ ప్రముఖ హీరోలుగా వెలుగొందు తున్న వెంకటేష్, మహేష్‌బాబు, అల్లు అర్జున్ వంటివారు పరిచయ మైంది రాఘవేంద్రరావు సినిమాల ద్వారానే. ఇలా ఏరకంగా చూసినా సినీరంగంలో ఆయన ఒక మైలురాయి. ఆయన ప్రయాణం అలుపెరుగనిది. ఎనభై ఏళ్ల వయసులోనూ ఇంకా సినిమాలకు దర్శకత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నారు.

2015లో ఎన్టీఆర్ నేషనల్ అవార్డు, 2009లో బి.ఎన్. రెడ్డి నేషనల్ అవార్డు అందుకోవడంతోపాటు అనేక సంవత్సరాల్లో వివిధ సినిమాలకు ఉత్తమ దర్శకుడిగా నంది పురస్కారాలు అందు కున్నారు. అటు సినీరంగంతోపాటు బుల్లితెర మీద కూడా అనేక ప్రయోగాలు చేస్తూ సీరియల్స్ నిర్మిస్తూనే ఉన్నారు.

రాఘవేంద్రరావుగారికి తానాతో విశేషమైన అనుబంధం ఉంది. అనేక సందర్భాల్లో తానాకి సహకరిస్తూ సభలకు హాజరయ్యారు.

ఆ నిత్య కృషీవలుడికి, భారతీయ చలనచిత్ర రంగంలో తలమానికం అనదగ్గ దర్శకుడికి వారి సేవలను గుర్తిస్తూ **తానా-ఎన్టీఆర్ తెలుగు సాంస్కృతిక సేవాపురస్కారంతో సత్కరించు కుంటోంది.**

కొమ్మినేని వెంకటేశ్వరరావు

సామాజిక, వ్యాపార, కళారంగాల్లో విశిష్టంగా కృషి చేసిన

కీ.శే. ఎల్.వి. ప్రసాద్ గారికి

తానా విశిష్ట సేవాపురస్కారం

అక్కినేని లక్ష్మీవరప్రసాద్ 1908లో పలూరు తాలూకా సోమవరప్పాడులో పుట్టారు. చిరుప్రాయం నుంచి సినిమాల్లో నటించాలని కోరిక. 1956లో ప్రసాద్ ప్రొడక్షన్స్ అనే నిర్మాణసంస్థను స్థాపించి విజయాల పరంపర సృష్టించారు. చెన్నపట్నంలో 1976లో ప్రసాద్ ఫిల్మ్ లాబ్స్ నిర్మించారు. 1980-85ల మధ్యకాలంలో దేశంలోని అన్ని సినిమా రాజధానులకూ వీటిని విస్తరించారు. 1982లో భారత ప్రభుత్వంవారు దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారంతో సత్కరించారు. ఇది వారి కీర్తి కిరీటంలో కలికితురాయిగా అమరింది. 2007లో భారత ప్రభుత్వం వీరి పేరిట ఒక స్మారక తపాలాబిళ్ల విడుదల చేశారు. భారతదేశ చలనచిత్రరంగంలో చెరగని ముద్రవేసిన తెలుగుబిడ్డ ఎల్.వి. ప్రసాద్‌గారిని మరణానంతరం గౌరవించుకునే అదృష్టానికి తానా గర్వపడుతున్నది.



భారతీయ సినిమాలోనే కాదు, ప్రపంచ చిత్రచరిత్రలోనే ఎల్.వి. ప్రసాద్ వంటివారు ఇంకొకరు లేరన్నది ఎవ్వరూ కాదనలేని పరమసత్యం. ఆయన భారతీయుడు, ముఖ్యంగా మన తెలుగువాడు కావడం మనందరికీ గర్వకారణం. ఎల్వి ప్రసాద్‌గా ప్రపంచ ప్రసిద్ధి చెందిన అక్కినేని లక్ష్మీవర ప్రసాద్ జీవితాన్ని, సినిమా జీవితాన్ని తెలుసుకుంటే అత్యాశ్చర్యం, పరమానందం కలుగుతాయి. ఒక సాధారణమైన మనిషి అసాధారణంగా ఎలా ఎదుగుతాడో, ఎదిగిన క్రమంలో ఎన్ని సవాళ్లను ఎదుర్కొంటాడో, ఎన్ని ప్రయోగాత్మక, ప్రయోజనాత్మక పనులు చేయగలుగుతాడో ఎల్వి ప్రసాద్ జీవితం చెబుతుంది. అది కేవలం జీవితం కాదు, మానవ జీవన సారం. ఏ విశ్వవిద్యాలయాలలో కూడా దొరకని గొప్ప జీవితపాఠం. సినిమా ప్రపంచానికి 'పెద్ద బాలశిక్ష'. మారుమూల పల్లెటూరులో పుట్టి, హైస్కూల్ కూడా దాటని చదువుతో, కేవలం పట్టుదలే పెట్టుబడిగా పెట్టి అంచలంచలుగా ఎదిగి, మహా సామ్రాజ్యాన్ని నిర్మించిన మహామనిషి, మనీషి ఎల్.వి. ప్రసాద్. తెలుగు, తమిళ, హిందీ సినిమా రంగాలకు ఆయన చేసిన కృషి, అందించిన ఫలాలు అనితర సాధ్యం. 24 కళల సమాహారంగా చెప్పుకొనే 'సినిమా' మాధ్యమంలో అన్ని కళల్లో ఆధిపత్యం వున్న అగ్రశ్రేణి వ్యక్తి. ఆయన నిర్మించిన సినిమాలు, దర్శకత్వం వహించిన చిత్రాలు, పరిచయం చేసిన నటులు, కళాకారుల జాబితా చూస్తే ఒడలు ఉప్పొంగుతాయి.

ఎన్నో ప్రఖ్యాత నిర్మాణ సంస్థల తొలి సినిమాలు ఆయన దర్శక, పర్యవేక్షణలోనే పురుడుపోసుకున్నాయి. ఎందరో అగ్ర కథానాయకులు ఆయన ద్వారానే వెండితెరకు పరిచయమయ్యారు. ఎందరో కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపారు. భారతీయ సినిమాలను ప్రపంచపటంపై రెపరెపలాడించారు. టాకీయుగం ప్రారంభం నుంచి వున్న తొలితరం వ్యక్తిగానే కాక, హిందీ, తమిళ, తెలుగు మొదటి టాకీల్లో నటించిన ఏకైక వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. 'బహుముఖ ప్రతిభ' అనే మాటకు నూటికి నూరుశాతం నిలువెత్తు సంతకం ఆ తేజోమూర్తి. గేట్ కీపర్ దశ నుంచి సినిమా 'లైఫ్ కీపర్' దాకా అనూహ్యమైన విజయాలను,

అనుభవ పాఠాలను సొంతం చేసుకున్న ఏకైక వ్యక్తి. 86 ఏళ్ల నిండు జీవితాన్ని పండించుకోవడమే కాక, జీవితంలో అగ్రభాగం దాదాపు ఏడు దశాబ్దాలు సినిమాతోనే జీవనం సాగించిన అరుదైన శక్తి. సహాయ నటుడు, నటుడు, కథానాయకుడు, సహాయ దర్శకుడు, దర్శకుడు, రచయిత, స్క్రీన్ ప్లే రచయిత, నిర్మాత, పర్యవేక్షకుడు, ప్రదర్శకుడు వంటి బహుపాత్రలను పోషించి, మెప్పించిన మేలిమి శిఖరం. ప్రొడక్షన్ మేనేజర్, సినిమా రిప్రజెంటేటివ్ వంటి భూమికలను కూడా పోషించిన అనుభవశాలి. భారతీయ సినిమాచరిత్రలోని ప్రతి ఘట్టంలో ఆయన పాత్ర వుంది. హిందీ-తెలుగు సినిమా ప్రపంచాల వారధిగానూ, దక్షిణాది చిత్రాల సారధిగానూ ఆయన సువర్ణాధ్యాయం లిఖించారు. తన తొలి సినిమాకు తానే కథానాయకుడు, దర్శకుడు కూడా. సంఖ్యాపరంగా రాసి తక్కువైనా వాసి చాలా ఎక్కువ. ఏ సినిమా హాల్లో గేట్ కీపర్‌గా పనిచేశాడో, అదే సినిమాహాల్‌లో అద్భుతమైన రెడ్ కార్పెట్ స్వాగతం పొందాడు. ఎక్కడైతే టిక్కెట్లు చించాడో, అక్కడే తన సొంత సినిమా రజతోత్సవాల సందడి చేయించాడు.

తన సినిమాజీవిత ప్రస్థానంలో యూనిట్‌లో సామాన్యుడుగా సామాన్లు మోసిన సందర్భాలూ వున్నాయి. తెనాలి రామకృష్ణ సినిమాలో నాలుగు పాత్రలు పోషించిన చరిత్రా వుంది. సినిమా ప్రపంచంలో ఎదుగు తూనే, సమాంతరంగా వ్యాపారాలను విస్తరించారు. అది కూడా సినిమాకు సంబంధించిన వ్యాపారమే కావడం విశేషం. ఎల్‌వి ప్రసాద్ స్టూడియోస్, కలర్ ల్యాబ్స్, ఆనంద్ సినీ సర్వీసెస్ కూడా స్థాపించారు. తన సంపాదన కేవలం కష్టార్జితం కాదు, ధర్మార్జితం కూడా. ఒక్కరూపాయి కూడా వృధా చేసేవారు కాదు. అది తన డబ్బే కాదు, ఎవరిదైనా అంతే జాగ్రత్తగా చూసేవారు. వ్యక్తిగత క్రమశిక్షణలో, ఆర్థిక క్రమశిక్షణకు కూడా సమున్నత మైన స్థానాన్ని ఇచ్చేవారు. 20 ఏళ్ల వయస్సులో కేవలం వందరూపాయ లతో బొంబాయి నగరంలో అడుగుపెట్టి, అందులో 80 రూపాయలు పోగొట్టుకొన్న చేదు అనుభవాలు కూడా ఎన్నో ఉన్నాయికదా! దర్జీ పంచన చేరి, మెల్లగా సినిమా ప్రపంచంలోకి అడుగుపెట్టి, ట్రాలీలు తోసి, వచ్చీరాని హిందీ, చిన్నప్పుడు నేర్చుకున్న ఇంగ్లీష్‌లో మాట్లాడుతూ అందరి మధ్య తిరుగుతూ అందరివాడని అనిపించుకొని, అందనంత ఎత్తుకు ఎదిగిన ఆదర్శపురుషుడు అక్కినేని లక్ష్మీవరప్రసాద్. ఎల్.వి. ప్రసాద్ విశిష్టతలు, ప్రత్యేకతలు, అనుభవాలు, ఆసక్తికర ఘటనలు, అపూర్వమైన అంశాలు, అపురూపమైన విషయాలు ఒకసారి తలుచుకుందాం.

చిన్నప్పుడు పల్లెల్లో చూసిన మూకీ చిత్రాలు, నాటకాలు, వేసిన వేషాలు ఈ రంగంపై అమిత ఆకర్షణను కలిగించాయి. తన జీవితగమ్యం పట్ల బలమైన ముద్రను వేశాయి. అవే పునాదులుగా ఆయన జీవన భవనం నిర్మాణమైంది. ప్రపధమ హిందీ (ఆలం ఆరా), ప్రధమ తెలుగు (భక్తప్రహ్లాద), ప్రధమ తమిళ (కాళిదాసు) టాకీ చిత్రాల్లో నటించిన ఏకైక వ్యక్తి ఎల్.వి. ప్రసాద్. దర్శకుడిగా,

కథానాయకుడుగా గృహప్రవేశం సినిమాతో తెలుగులో గృహప్రవేశం చేశాడు. తన తొలి కథానాయిక భానుమతి కావడం మరో విశేషం. ఎన్టీఆర్‌కు మనదేశంతో తొలి అవకాశం ఇవ్వడమేకాక షావుకారులో తొలిగా కథానాయకుడిని చేసిన ఘనత కూడా అయనదే. అక్కినేని సినీ ప్రస్థానాన్ని మలుపుతిప్పింది కూడా ఆయనే. సాంఘిక చిత్రాల్లో బాగా రాణిస్తారని చెప్పి, సంసారంతో రుజువు చేసింది కూడా ఆయనే. ఎన్టీఆర్, అక్కినేనిని జంట కథానాయకులుగా ప్రవేశపెట్టి గెలుపు రుచి చూపించిన వారు కూడా. ఎస్ వి రంగారావుకు మంచి పాత్ర ఇచ్చి, సినిమాల్లో నిల దొక్కుకోడానికి దోహదపడింది కూడా వారే.

ఇక మనోహర సినిమా తమిళ సినిమా చరిత్రలో శిఖరం. అది సృష్టించిన ఒరవడి, అలజడి అంతా ఇంతా కాదు. కమల్‌హాసన్‌తో ఏక్ దూజే కేలియేతో బాలీవుడ్ ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టారు. ఎస్వీ బాలసుబ్రహ్మణ్యాన్ని హిందీ సినిమా సామ్రాజ్యంలోకి తొట్టతొలిగా అడుగు పెట్టించిన ఘనత ఆయనది. ఎన్టీఆర్‌కు తొలి మేకప్ టెస్ట్ చేయించడం, తొలి అవకాశాలు కల్పించడమే కాదు, వరస విజయాలతో హీరోగా నిలబెట్టిన విశిష్ట దర్శకుడు కూడా ఎల్.వి. ప్రసాద్. పృథ్వీరాజ్ కపూర్ ప్రోత్సాహంతో మహారాష్ట్ర రంగస్థలంలో నాటకాలు వేసి మరాఠావారి మన్ననలు పొందిన మనిషి.

నటులే కాదు ఎందరో దిగ్ దర్శకులకు ఎల్.వి. ప్రసాద్ గురుదేవులు. ప్రత్యగాత్మ, సి.వి. రంగనాథ్‌దాస్, తాతినేని ప్రకాశరావు వంటి దర్శకులు ఆ జాబితాలో వుంటారు. తమ్ముడు సంజీవి, మేనల్లుడు కె.వి. తిలక్ సినిమా ప్రపంచ ప్రవేశానికి, ప్రగతికి ఎల్.వి. ప్రసాద్ మూలస్థంభం. 'మహాకవి' బలిజేపల్లి లక్ష్మీకాంతంతో మాటలు రాయించినా, బాలాంత్రపు రజనీకాంతరావుతో పాటలు చేయించినా, జగ్గయ్యతో శివాజీ గణేషన్‌కు డబ్బింగ్ చెప్పించినా, కరుణానిధితో సంభాషణలు కురిపించినా ఆ ఘనత, చరిత అంతా ఎల్.వి. ప్రసాద్‌కే చెందుతుంది, చెల్లుతుంది.

ఆదుర్తి సుబ్బారావును హిందీ సినిమా దర్శకుడిగా ప్రవేశపెట్టినవారు కూడా ఎల్.వి. ప్రసాద్. ఏక్ దూజేకే లియే ద్వారా కె. బాలచందర్‌ను బొంబాయిలో బ్రహ్మరథం పట్టించారు. క్రాంతికుమార్‌ను హిందీ సినిమాకు పరిచయం చేసిన ఘనత కూడా అయనదే.

విజయావారి షావుకారు, పెళ్లి చేసిచూడు, మిస్సమ్మ, అప్పు చేసి పప్పుకూడు వంటి కళాఖండాల సృష్టికర్త. ప్రసాద్ ఆర్ట్ ప్రొడక్షన్స్ వంటి సంస్థల ద్వారా అందించిన సినిమాలన్నీ అద్భుతాలు. తెలుగు, తమిళ, హిందీ సినిమా పరిశ్రమలో అద్భుతాలు చేయడమే కాక, మలయాళం, బెంగాలీ, ఒరియాలో కూడా తన సత్తాను చాటారు, విజయస్థంభాలను నాటారు. సునిశితమైన పరిశీలన, సున్నితమైన హృదయం, లోకంపోకడ ఎరిగిన అనుభవం, గతం మరవని సంస్కారం, నిలువెత్తు మానవత్వం, దాతృత్వం, నిండైన తెలుగుదనం, మెండైన ప్రతిభ మూర్తీభవించిన 'ప్రతిభారత్నం' ఎల్.వి. ప్రసాద్. దార్శనికతతో సంస్థలు స్థాపించడమే కాక, కోట్లాది రూపాయలు విలువ చేసే స్థలాన్ని నేత్ర వైద్యసేవకోసం దానం చేసిన గొప్ప శీలం ఆయన ఐశ్వర్యం.

ఉచితంగా అంత పెద్ద స్థలం ఇవ్వడమేకాక, 1986 ప్రాంతంలోనే కోటిన్నర రూపాయల నగదును కూడా నేత్ర వైద్యం కోసం దానంచేశారు. హైదరాబాద్‌లోని ఎల్.వి. ప్రసాద్ కంటి పరిశోధనా కేంద్రం నుంచి ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది వైద్యసేవలు పొందుతున్నారు. ఆ కేంద్రం కోట్లాది కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. కేవలం హైదరాబాద్ మాత్రమే కాదు, దేశవిదేశాల్లో ఎల్.వి. ప్రసాద్ అందించిన స్నేహహస్తం ఆదర్శంగా అగ్రభాగాన నిలుస్తోంది.

దాదా సాహెబ్ ఫాల్కే కళాప్రపూర్ణ, గౌరవ డాక్టరేట్లు ఎన్నో ప్రసాద్ కీర్తికిరీటంలో చేరాయి. ఇవ్వేమీ ఆయన ఆశించలేదు, ప్రయత్నించలేదు. అవే నడిచి వచ్చి ఆయనను చేరాయి. నిస్వార్థంగా లోకంపట్ల తన కృతజ్ఞతను చాటుకున్నారు. జీవితంలో ఆకాశమంత ఎదిగినా ఆయన కళ్లు, కాళ్లు నేలపైనే వున్నాయి. ఎక్కడో ఆంధ్రప్రదేశ్‌లోని సోమవరప్పాడు అనే గ్రామంలో జన్మించి, ప్రపంచమంత ఎదిగిన అక్కినేని లక్ష్మీవరప్రసాద్ యశఃకాయుడు, పరిపూర్ణ మానవుడు.

- యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

తానా - గుత్తికొండ రవీంద్రనాథ్ సామాజిక సేవాపురస్కారం

డా॥ ఈదర లోకేష్



డా॥ ఈదర లోకేష్ తెనాలిలో పుట్టారు. 1983లో అమెరికా వచ్చారు. ఫిలడెల్ఫియాలోని థామస్ జెఫర్సన్ యూనివర్సిటీలో అలర్జీ, ఇమ్యునాలజీ ఫెలోషాప్ చేశారు. వెస్టర్న్ మిచిగన్ యూనివర్సిటిలో క్లినికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. మిచిగన్ అలెర్జీ అండ్ ఆస్తమా సొసైటీ అధ్యక్షులుగానూ, కేల్ హూన్ కౌంటీ మెడికల్ సొసైటీకి అధ్యక్షులుగానూ చేశారు. 2021-22లో అమెరికన్ కాలేజ్ ఆఫ్ అలర్జీ అండ్ ఇమ్యునాలజికు హౌస్ డెలిగేట్‌గానూ చేశారు. ఆపీ గ్లోబల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ మెడికల్ స్టూడెంట్స్ సంస్థలు స్థాపించారు.తానా ఫౌండేషన్‌కు మూడు ఏళ్లు చైర్మన్‌గానూ, ట్రెజరర్‌గానూ చేశారు. తానా ఫౌండేషన్ ఇన్ ఇండియా స్థాపించారు. ఒక సంబంధిత సంస్థను భారతదేశంలో ఏర్పాటుచేసి, దాన్ని ప్రపంచ వ్యాప్త జీవ పునరుద్ధరణ సంఘంతో అనుసంధానించారు. కోవిడ్ మహమ్మారి తాకిన సమయంలో ప్రజలకు సేవలందించి, శ్రీ నారా చంద్రబాబుగారూ, శ్రీ నారా లోకేష్‌గార్ల నుంచి ప్రశంసలు పొందారు. భారతదేశంలో ప్రాథమిక విద్యాశిక్షణ కొరకు 40,000 పోస్ట్ గ్రాడ్యుయేట్ సీట్లు ఏర్పాటుచేసే ప్రయత్నంలో ఉన్నారు.

తానా - తెలుగుతేజం పురస్కారం

బొల్లినేని రాజగోపాల నాయుడు



బొల్లినేని రాజగోపాల నాయుడు ప్రసారమాధ్యమ దిగ్గజమూ, ధార్మికవేత్త. చిత్తూరు జిల్లాలోని దిగువ పూనేపల్లిలో మునుస్వామి నాయుడు, లక్ష్మీ నాయుడు దంపతులకు జన్మించారు. డిగ్రీ పూర్తయిన పిదప ఒక ప్రయాణ సహాయ సంస్థ ప్రారంభంతో మొదలైన వారి వ్యాపార సంస్థలు అనేక రంగాల్లోకి విస్తరించాయి. 2007లో శ్రేయా బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ నెలకొల్పారు. భారత దేశంలో అత్యంత ప్రజాదరణ కలిగిన టీవీ ఫైవ్ ప్రసార సంస్థ ద్వారా సమాజహితమూ, వాస్తవాధారపూర్వకమూ అయిన సమాచారాన్ని, సంస్కారవంతమైన భాషలో రోజుకు 24 గంటలూ ప్రజలకు చేరవేసే సంస్థగా తీర్చిదిద్దారు. అమెరికాలో టీవీ5 యూ.ఎస్.ఏ, టీవీ5 మనీ, యూట్యూబ్, మొబైల్ అప్లికేషన్లూ, ఐ.పి.టీ.వీ, ద్రవ్య,వాణిజ్య సమాచార పసార మాధ్యమాలూ అనేకంగా నెలకొల్పారు. 2017లో ఉగాది సందర్భంగా ఒక ఆధ్యాత్మిక ప్రసారవిభాగాన్నీ, మహాత్మాగాంధీ జన్మదిన సందర్భంగా కన్నడంలో ఒక ప్రసార విభాగాన్నీ ప్రారంభించారు. 2024లో అంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుగారిచే, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డుకు చైర్మన్‌గా నియమింపబడ్డారు. దేవస్థానంలో అనేక పాతపద్ధతులను ప్రక్షాళనం చేసి, భక్తులకు శ్రీవారి దర్శనం శీఘ్రంగా, శుచి, శుభ్రతలకు ప్రాధాన్యమిస్తూ, ప్రయాణికుల క్షేమమే ధ్యేయంగా అనేక ప్రణాళికలు అమలుపరుస్తున్నారు. వీరి ధార్మికత, నీతినియమాలకు లోబడిన ప్రవర్తనా, ప్రజలకు ఆదర్శం కావాలని కోరుకుంటూ,
తానా వారిని తెలుగుతేజం పురస్కారంతో గౌరవించుకుంటున్నది.

తానా గిడుగు రామమూర్తి స్మారక తెలుగుభాషా పురస్కారం

ప్రొఫెసర్ వెల్చేరు నారాయణరావు

గిడుగు రామమూర్తి (1863-1940) పేరు చెప్పగానే 20వ శతాబ్ది ప్రథమపాదంలో వ్యవహారిక భాషావాదానికి ఉద్యమరూపం కల్పించి గ్రాంథిక భాషావాదులపై విజయం సాధించిన ఒక భాషాయోధునిగా ఆయన్ని అందరూ పరిగణిస్తారు. దీనికి మించి ఆయన గొప్ప భాషాశాస్త్రవేత్త, పరిశోధకుడు, గ్రంథ పరిష్కర్త, శాసన పరిష్కర్త, పాఠ్యగ్రంథ రచయిత. సవరభాషకు వ్యాకరణం రచించి, సవరల జీవితచరిత్రను గ్రంథస్తం చేసి, సవరల అభివృద్ధికి కృషి చేసిన సంఘసేవకుడు, ప్రజాస్వామికవాది, మానవతావాది. జీవితకాలం తెలుగు భాషావికాసానికి కృషిచేసిన గిడుగు రామమూర్తి పేరుమీద ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి యాభైవేల రూపాయల నగదుతో కూడిన పురస్కారాన్ని అందజేయాలని తానా నిర్ణయించింది.

ఈ పురస్కారాలను 2002 డిసెంబర్ నుంచి ప్రకటిస్తోంది.

2025వ సంవత్సరానికి ఈ పురస్కారాన్ని ప్రముఖ భాషావేత్త, సాహితీవేత్త ప్రొఫెసర్ వెల్చేరు నారాయణరావుగారికి 18 మే 2025నాడు ఏలూరులో జరిగిన సభలో అందజేసింది.



ప్రొఫెసర్ వెల్చేరు నారాయణరావు జగమెరిగిన సాహిత్యాధ్యాయి. భాషాప్రాంతాల కతీతంగా, ఏ శాస్త్రీయ ప్రమాణాల ప్రకారం చూసినా ప్రపంచంలోని అత్యుత్తమ సాహిత్య పరిశోధకులుగా ఎన్నదగిన నారాయణరావు జననం ఫిబ్రవరి 1, 1932న (అధికారిక రికార్డులలో జులై 14, 1931) శ్రీకాకుళం జిల్లాలోని అంబఖండి అనే కుగ్రామంలో. ఏలూరు సి.ఆర్. రెడ్డి కళాశాలలో బి.ఎ. డిగ్రీ పూర్తి చేసుకున్న నారాయణరావు ఆ కళాశాలలోనే సుమారు ఇరవయ్యేళ్లపాటు తెలుగు సాహిత్యాధ్యాపకుడిగా పనిచేశారు. 1974లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. 'తెలుగులో కవితావిప్లవాల స్వరూపం' అన్న పేరుతో 1978లో ఆయన ప్రచురించిన పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథం తెలుగు సాహిత్య విద్యార్థులకు పరిశోధనా పద్ధతుల్లో కొత్తదారి చూపించడమేకాక, ఆనాటినుంచి ఈనాటికీ తెలుగుభాషలో వచ్చిన అత్యుత్తమ అధ్యయనాలలో ఒకటిగా ఎన్నబడుతూనే ఉంది.

1971లో అమెరికా వెళ్లిన నారాయణరావు, అక్కడి విస్కాన్సిన్ విశ్వ విద్యాలయంలో కృష్ణదేవరాయ పీఠపు విశిష్ట చార్యుడి హోదాలో తెలుగు భాషా సాహిత్యాలను 40 యేళ్లపాటు నిరాటంకంగా బోధించారు. అదే సమయంలో తన పరిశోధనలతో తెలుగు సాహిత్యానికి ప్రపంచ వేదికపై సముచిత స్థానాన్నేర్పరచారు. ఆపైన కొద్దికాలం షికాగో విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడిగా కొనసాగిన నారాయణరావును, 2015లో కొప్పాక ఫౌండేషన్‌వారు అట్లాంటాలోని ఎమరీ విశ్వవిద్యాలయంలో తాము ఏర్పరిచిన, తెలుగు సంస్కృతీ సాహిత్యచరిత్రల అధ్యయన పీఠాచార్యుడిగా ఆహ్వానించి గౌరవించారు. జెరూసలేమ్‌లోని హిబ్రూ విశ్వ విద్యాలయం, న్యూ యార్క్‌లోని జూన్ సైమన్ గూగెన్‌హైమ్ పీఠం, బెర్లిన్‌లోని వీజెన్‌షాఫ్ట్ కాలేజ్ మొదలైన ప్రముఖ సంస్థలలో నారాయణరావు విశిష్ట సభ్యత్వాలు వారి సుదీర్ఘ సమున్నత సాహిత్య ప్రస్థానంలో అందుకున్న అనేకానేక పురస్కారాల్లో కొన్ని మాత్రమే.

ఎంతో విస్తృతము, విభిన్నమూ అయిన ఇతర భారతీయ భాషలలోని సాహిత్య మంతా 'ప్రాంతీయ భాషాసాహిత్యం' పేరిట ఒక మూలకు నెట్టివేయబడి తగిన గుర్తింపుకు నోచుకోలేక పోయింది. ఇక, సుసంపన్నమయిన మౌఖిక సాహిత్యానికి ఆ నామ మాత్రపు గుర్తింపు కూడా దక్కలేదు. 20వ శతాబ్దపు మధ్యకాలానికి ఈ పరిస్థితి మారి ప్రాంతీయ, మౌఖిక సాహిత్యాల అధ్యయనం క్రమేపీ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇలా సంస్కృతేతర భాషాసాహిత్యం, మౌఖికసాహిత్యం తగినంత గుర్తింపు పొందడంలో నారాయణరావు కృషి అమూల్యమైనది. ఎ.కె. రామానుజన్, సంజయ్ సుబ్రహ్మణ్యం, డేవిడ్ షుల్మన్ వంటి ప్రసిద్ధ సాహిత్య చరిత్రకారులు, అధ్యయనశీలురతో కలిసి భారతీయ మౌఖిక, సాంప్రదాయ సాహిత్య సంస్కృతీచరిత్రలపై నారాయణరావు చేసిన పరిశోధనలు, వెలువరించిన అధ్యయన ఫలితాలు అనితరసాధ్యమైనవి అనడం అతిశయోక్తి కాదు.

అల్లసాని పెద్దన మనుచరిత్రము, పింగళి సూరన కళాపూర్ణోదయము, పాల్కురికి సోమనాథుని బసవపురాణము, నంది తిమ్మన పారిజాతాపహరణము వంటి కావ్య సాహిత్యం మొదలు కొని గురజాడ అప్పారావు కన్యాశుల్కం, చాసో కథలు, విశ్వనాథ సత్యనారాయణ నవలికలు, వచన కవిత్వం వంటి వర్తమాన, ఆధునిక సాహిత్యం దాకా ఇతర అధ్యాయులతో కలిసి నారాయణరావు ఎన్నో ఆంగ్లానువాదాలు చేశారు. ఇలా వెయ్యేళ్లపాటి సాహిత్యాన్ని ఇంత విస్తృతంగా అధ్యయనం చేసి, అనువదించి, ప్రపంచానికి తెలుగు సాహిత్యంపట్ల ఒక సమగ్రమైన అవగాహన నిచ్చిన వ్యక్తి చరిత్రలో బహుశా మరొకరు లేరు.

నారాయణరావు సాహిత్యపరిశ్రమలో అనువాదాలు కేవలం ఒక భాగం మాత్రమే. ఆంగ్లేయుల పరిపాలనాకాలం నుంచి, ఇటీవల వరకూ భారతీయ సంస్కృతి, సాహిత్యం పట్ల పాశ్చాత్యుల ధోరణి, వారి విశ్లేషణాపద్ధతి ఒకే మూసలో ఉంటూ వచ్చింది. భారతీయ సాహిత్యం ఆ పాశ్చాత్యవిశ్లేషణా పద్ధతులకు లోబడదని, దానికి విభిన్నమైన పంథా కావాలని ప్రతిపాదించి పాశ్చాత్య విమర్శా ధోరణుల పరిమితులను సుస్పష్టం చేశాడు. శ్రీనాథుని వంటి కవుల సాహిత్యచరిత్ర గురించి, తెలుగులో చాటు కవిత్వం, మౌఖిక సాహిత్యపు తీరుతెన్నులు ఇత్యాది సాహిత్య సాంస్కృతిక అంశాల గురించి నారాయణరావు పరిశోధనాపత్రాలను ప్రచురించి, వాటి ద్వారా ప్రాచీన భారతీయ సాహిత్యాన్ని చదవడానికి, అర్థం చేసుకోవడానికి సరికొత్త పద్ధతులను, దృక్కోణాలనూ ప్రతిపాదించాడు.

రామాయణాది పౌరాణిక గాథలు, భారతీయులకే ప్రత్యేకమైన నీతికథా సంప్రదాయం వంటి విషయాలపై నారాయణరావు విశ్లేషణ లోతైనది. ఆంగ్లేయుల పాలనవల్ల మనం కోల్పోయిన సాహిత్య సంస్కృతీ సంపద విలువను, మనం పోగొట్టుకున్న భారతీయతను, మనదైన సాహిత్య చారిత్రక దృక్పథాన్ని వివరించి చూపుతూ, ఆంగ్లేయుల రాకకు పూర్వమే భారతదేశంలో సాహిత్య సాంస్కృతిక ఆధునికత ఉన్నదని, ఆంగ్లేయుల ప్రభావం వల్ల వచ్చినది మాత్రమే ఆధునికత కాదనీ తన వ్యాసాల ద్వారా నారాయణరావు తెలియజెప్పాడు.

నారాయణరావు బహుముఖప్రజ్ఞాశీలి. కవి, రచయిత, విమర్శకుడు, సాహిత్య పరిశోధకుడు. సాధారణతలో అసాధారణమూ, అసాధారణలోని సాధారణతనూ చూడగల్గినవాడు. తన అభిప్రాయాలతో, పరిశీలనతో, చర్చలతో సాహిత్యాధ్యయ నంలో విద్యార్థులకు, సాటి అధ్యాపకులకూ కొత్త ఉత్తేజాన్ని కలిగించిన వాడు. తార్కిక మేధావులు, సృజనశీలురు ఎందరి గురించో వింటూనే ఉన్నాం, చదువుతూనే ఉన్నాం. కాని, తార్కికత, సృజనోద్వేగం కలగలసిన వ్యక్తులు చాలా అరుదుగా కనిపిస్తారు. నారాయణరావు అలాంటి అరుదైన వ్యక్తి.

భారతీయ సాహిత్యానికి నారాయణరావు చేసిన కృషి అపారమైనది. బహుముఖీనమైనది. అత్యంత ముఖ్యమైనది. రాబోయే ఎన్నో తరాల సాహిత్యాధ్యాయులను, చరిత్రకారులను, మేధావులను ప్రభావితం చేయగల్గినది.

వీరికి తానా-గిడుగు రామమూర్తి తెలుగుభాషాపురస్కారం అందచేసినందుకు తానా సంతోషిస్తోంది.

TANA Awards of Excellence - 2025
తానా విశిష్ట పురస్కారాలు - 2025



డా॥ పైడిపాటి బుచ్చిబాబు

వైద్యరంగం

పైడిపాటి బుచ్చిబాబు గుంటూరులో పుట్టారు. గుంటూరు వైద్య కళాశాలలో ఎం.బి.బి.ఎస్ చదువుతున్నపుడే, మెడిసిన్‌లో సిరీస్ గోల్డ్ మెడల్ సాధించారు. ఆ సమయంలోనే నెలకొకమారు సమావేశమయ్యే సాహితీసమితి మొదలుపెట్టారు. 1974లో ఇంగ్లాండు వెళ్లారు. అమెరికాకు వచ్చింది 1975లో. ఇంటర్నల్ మెడిసిన్‌లో రెసిడెన్సీ తరువాత జాన్స్ హాప్‌కిన్స్ వైద్య కళాశాలలో పల్మనాలజీలో ఫెలోషిప్ చేశారు. పిట్స్‌బర్గ్ యూనివర్సిటీలో ఐ.సి.యూ ఫెలోషిప్‌చేశాక మిచిగన్‌లో స్థిరపడ్డారు. ఇరవైసార్లు ఉత్తమ అధ్యాపకులుగా ఎన్నుకోబడ్డారు. ప్రతి ఏడాదీ భారతదేశం వెళుతూ, అక్కడి వైద్య కళాశాలల్లో పాఠాలు చెపుతూ, అనేకచోట్ల ఇంటెన్సివ్ కేర్ యూనిట్లు నెల కొల్పారు. వేన్ స్టేట్ యూనివెర్సిటి స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లోనూ, మిచిగన్ స్టేట్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లోనూ, సెంట్రల్ మిచిగన్ యూనివర్సిటి స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లోనూ అధ్యాపకులుగా ఉన్నారు. ఇరవైసార్లు ఉత్తమ అధ్యాపకులుగా ఎన్నుకోబడ్డారు. గుజరాత్‌లో భూకంపం సంభవించినపుడు రెండు వారాలపాటు వైద్య బృందాన్ని వెంట తీసుకువెళ్లి బాధితులకు సేవ చేశారు. హైదరాబాదులోని నిమ్స్‌లో డాక్టర్ కాకర్ల, డాక్టర్ సోమరాజుగార్లతో కలసి ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ విభాగం నెలకొల్పటానికి దోహదం చేశారు. వీరి సామాజికసేవకుగాను వేన్ కౌంటీ మెడికల్ సొసైటీ, మిచిగన్ స్టేట్ మెడికల్ సొసైటీ, మిచిగన్ రాష్ట్ర గవర్నరు వద్ద నుంచి పలు అవార్డులు పొందారు. అమెరికాలోనూ, భారతదేశంలోనూ తరచుగా పాఠాలూ చెపుతూ, ప్రసంగాలు చేస్తుంటారు.



డా॥ నోరి దత్తాత్రేయుడు

వైద్యరంగం

వైద్యులలో రాజు, రాజులకు వైద్యుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడుగారు. కేన్సరు వ్యాధుల చికిత్సలో విశ్వఖ్యాతిగాంచిన నిపుణులు. తెలుగునేలపై పుట్టి, అమెరికాలో ప్రజ్వలించి రచ్చ గెలిచిన ఈ అపర ధన్వంతరిని తానా ఇపుడు ఇంట గౌరవించుకొంటోంది. కృష్ణాజిల్లా, బందరు వద్ద మంటాడలో పుట్టారు. ప్రాథమిక విద్యాభ్యాసం మచిలీపట్నంలో. కర్నూలు వైద్యకళాశాల నుంచి ఎం.బి.బి.ఎస్ పట్టా పుచ్చుకుని, హైదరాబాదులోని ఉస్మానియా నుంచి ఎం.డీ అనంతరం న్యూయార్క్‌లోని మెమోరియల్ స్లోన్ కెటరింగ్ కేన్సర్ సెంటర్‌లో చేరారు. Computerized Brachotherapy అనబడే కేన్సరు చికిత్సావిధానాన్ని ప్రప్రథమంగా ప్రవేశపెట్టి ఆ విభాగాధిపతిగా కొనసాగారు. న్యూయార్క్ ప్రెస్బిటేరియన్ హాస్పిటల్/వెయిల్ కార్నెల్ వైద్యకళాశాలలో ఆచార్యులుగానూ, ఎగ్జిక్యూటివ్ వైస్ చెయిర్మన్‌గా చేశారు.న్యూయార్క్‌లో క్వీన్స్‌లోని న్యూయార్క్ మెడికల్ సెంటర్, రేడియేషన్ ఆంకాలజీ విభాగానికి ఛైర్మన్‌గా ఉన్నారు. అమెరికన్ కేన్సర్ సొసైటీవారు వీరిని 'ఆనర్ ఆఫ్ ట్రిబ్యూట్ టు లైఫ్' పురస్కారంతోనూ, మెమోరియల్ స్లోన్ కెటరింగ్ కేన్సర్ సెంటర్‌వారు 'ద మోస్ట్ డిస్టింగ్విష్డ్ ఫీజీషియన్' పురస్కారంతోనూ సత్కరించారు. 2014లో అమెరికన్ పౌరుల అత్యున్నత పురస్కారమైన 'ద ఎలిస్ ఐ లాండ్ మెడల్ ఆఫ్ ఆనర్'తో ప్రభుత్వం వీరిని సత్కరించింది. న్యూ ఇంగ్లండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్‌వారు వీరిని కేన్సర్ నిపుణతలో ప్రత్యేకులుగా గుర్తించారు. నెట్ వర్క్ ఆఫ్ ఇండియన్ ప్రొఫెషనల్స్ ఇన్ ద యు.ఎస్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ ఇన్ అమెరికా, నర్గీస్‌దత్ కేన్సర్ ఫౌండేషన్, అమెరికన్ అసోషియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్ వంటి అనేక సంస్థలు వీరిని టాప్ డాక్టర్ ఫర్ కేన్సర్ ఇన్ అమెరికా, టాప్ డాక్టర్ ఆఫ్ అమెరికా ఫర్ ట్రీట్మెంట్ ఆఫ్ కేన్సర్ ఇన్ విమెన్ వంటి బిరుదులతో గౌరవించారు. భారత ప్రభుత్వం 2015లో పద్మశ్రీతో సత్కరించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ముఖ్య సలహాదారుగా, బసవతారకం ఇండో-అమెరికన్ కేన్సర్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిటూట్ వ్యవస్థాపనలో ముఖ్య పాత్ర వహించారు. వారి శ్రీమతి డాక్టర్ సుభద్రతో వెస్ట్ బరీ న్యూయార్క్‌లో నివసిస్తున్నారు.



శ్రీ యార్లగడ్డ రఘు

ఫైనాన్షియల్ టెక్నాలజీ

యార్లగడ్డ రఘు విజయవాడలో పుట్టారు. వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బి.టెక్ చదివారు. 2006లో అమెరికా వచ్చారు డాలస్‌లోని యూనివర్సిటి ఆఫ్ టెక్సాస్‌లో మాస్టర్స్ చేశారు. హార్వర్డ్ బిజినెస్ స్కూల్ నుంచి ఎం.బి.ఎ. పొందారు. ఫాల్కన్ ఎక్స్ అనే సంస్థను స్థాపించి ఎనిమిదివందల కోట్ల డాలర్ల విలువగల సంస్థగా తీర్చిదిద్దారు. ఈ సంస్థ సంచిత వర్తకం మొత్తం లక్ష కోట్ల డాలర్ల వరకూ ఉండొచ్చని ఒక అంచనా. డాలస్‌లోని యూనివర్సిటి ఆఫ్ టెక్సస్‌వారు తమ పూర్వ విద్యార్థులలో శ్రేష్ఠులుగా గౌరవించారు. గోల్డ్‌మెన్ శాక్స్‌వారి బిల్డర్స్ అండ్ ఇన్నోవేటర్స్ అవార్డు పొందారు. సుందర్ పిచయ్‌గారి నేతృత్వంలో గూగుల్‌లో పనిచేస్తున్న కాలంలో గూగుల్ క్రోమ్ బుక్స్ విభాగాన్ని కొన్ని వందల కోట్ల డాలర్ల లాభాల వైపు నడిపించారు. ఫైనాన్స్ టెక్నాలజీతోఎన్నో సాహస ప్రయత్నాలు చేసి, అంతర్జాతీయ స్థాయిలో లాభకరమైన ఫలితాలు రాబట్టారు.



శ్రీమతి ఆత్మకూరి సంధ్యశ్రీ

కళలు (పెర్ఫామింగ్ ఆర్ట్స్)

శ్రీమతి ఆత్మకూరి సంధ్యశ్రీ డెట్రాయిట్ నగరపు నాట్యమయూరి. తెలుగువారి నాట్య సాంప్రదాయాలు భరతనాట్యం, కూచిపూడి– రెండింట్లోనూ నిష్ణాతులు. విశాఖపట్నంలో పుట్టారు. 1996లో అమెరికా వచ్చారు. పదేళ్ల చిరుప్రాయం లోనే ప్రముఖ నటీమణి శ్రీమతి జమునారమణరావుగారి చేతులమీదుగా అందుకొన్న మొట్టమొదటి స్వర్ణపతకం అ పిమ్మట వచ్చిన అనేక పురస్కారాలకు నాందిగా నిలచింది. భారత ప్రభుత్వం వారి నుంచి కూచిపూడి నృత్యానికి విద్యార్థి జాతీయ ఉపకారవేతనం పొందారు. భరతనాట్య సంయోజనానికి జాతీయ పురస్కారాన్ని గెలుచుకొన్నారు. అమెరికా, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, కెనడాల్లో వరల్డ్ థియేటర్ ఆపెరా ఫెస్టివల్‌లోనూ, జర్మనీలో ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో పాల్గొన్నారు. తాను చెన్నైలో నాట్యం నేర్చుకొన్న కూచిపూడి కళాసమితి వారివద్ద నుండే 'నాట్య విశారద', 'కూచిపూడి నృత్యమౌక్తికం, ప్రఖ్యాత సూర్‌సింగార్ సంసద్ వారివద్ద నుండి 'సింగారమణి' పురస్కారాలు అందుకున్నారు. 40 మందికిపైగా శిష్యులచే అరంగేట్రం చేయించారు. తెలుగు సాంస్కృతిక సంస్థలు తానా, ఆటా, డీ.టీ.ఏ, టీ.టీ.ఏలకు నృత్య కార్యక్రమాలకు సారధ్యం వహిస్తూంటారు. 2005లో తానావారు వీరి శిష్యుల విశేష ప్రతిభకు అరుణ్ గుత్తికొండ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. వీరి కృషిని గౌరవిస్తూ డీ.టీ.ఏ వారు వడ్లమూడి వెంకటరత్నం స్మారక పురస్కారం అందజేశారు.



శ్రీ కిరణ్ ప్రభ

సాహిత్యం, జర్నలిజం, బ్రాడ్‌కాస్టింగ్

పాత్రికేయులు, సంపాదకులు, టాక్ షో నిర్వాహకులు. నిరంతర అన్వేషి, అందరికీ దగ్గరి నేస్తులు. పాతూరి ప్రభాకరరావు కృష్ణాజిల్లాలోని పావినాశనంలో పుట్టారు. 1984లో ఫోటో పొయెట్రీ అనే నూతన ప్రక్రియ ప్రారంభించారు. ఇప్పటికి 600 పైగా ఫోటో కవితలు వెలువరించారు. 1996లో అమెరికా వచ్చారు. 2004లో సృజనరంజని అనే వెబ్ పత్రిక స్వీయ సంపాదకత్వంలో మొదలెట్టి రెండేళ్లపాటు నడిపారు. 2007లో కౌముది వెబ్ మాసపత్రిక ప్రారంభించి నిర్విఘ్నంగా నడుపుతున్నారు. నాలుగువందల పేజీలుండే సంచిక ఏ ఒక్కరోజు కూడా ఆలస్యం కాకుండా ఇప్పటికి 223 నెలలు విడుదల చేశారు. 50 ప్రకరణలుండే ప్రతి సంచికలోనూ పాత, కొత్త నవలలూ, సీరియళ్లూ, కథలూ, ఫోటో కవితా, హాస్యమూ ఉండాల్సిందే. కథ, నవలల పోటీలూ ఉంటాయి. 400 పైగా ఇ-బుక్స్ ఉచితంగా లభిస్తాయి. 45 నిమిషాల టాక్ షోలు 1700 పైగా చేసారు. ఇందులో తెలుగు, తెలుగేతర సాహిత్యమూ, సినిమాలూ, వివిధ రంగాలలో పేరొందిన ప్రముఖులూ, క్రీడాకారులూ, రాజకీయవేత్తలూ, స్వాతంత్ర్య యోధులూ, చిత్రకారులూ, వ్యాపారవేత్తలూ, గాయకులూ, స్ఫూర్తిప్రదాతలూ మొదలైనవారి జీవితాలనూ, వారి జీవితానుభవాలనూ ఎంతో పరిశోధించి, పలుమార్లు నిర్ధారించుకొని నిష్పక్షపాతంగా ఆవిష్కరిస్తారు. ఈ వ్యక్తులతో దగ్గర సంబంధం ఉన్నవారికి కూడా తెలియని ఎన్నో కొత్త సంగతులను వెలికితీస్తారు. ఇందు నిమిత్తం 2000 పైచిలుకు గ్రంధాలను సంప్రదించారు. భారతదేశంలోనూ, విదేశాల్లోనూ సగటు పాఠకుల్లోనూ, మేధావుల్లోనూ వీరికి విశేష ఆదరమున్నది. వేలమంది అభిమానులున్నారు. ఇంతపనీ చేయడానికి వీరికి ఉన్న సిబ్బంది ఒకటిన్నర వ్యక్తులే. వీరుగాక, వీరి పేరులోనూ, జీవితంలోనూ, దైనందిన శ్రమలోనూ అర్ధభాగం పంచుకొన్న శ్రీమతి కాంతికిరణ్‌గారు.



డా॥ వడ్లమూడి బాబు

సాహిత్యం, సామాజిక సేవ

డా॥ వడ్లమూడి బాబు తెనాలిలో పుట్టారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో వైద్యవిద్య. 1977లో అమెరికా వచ్చారు. మానసిక వైద్యంలో రెసిడెన్సీ, బాలల, కౌమార, న్యాయ సంబంధ మానసిక వ్యాధుల చికిత్సలలో ఫెలోషిప్ చేశారు. హగీరా హెల్త్ ఆర్గనైజేషన్‌లో 30 ఏళ్లుగా పనిచేస్తున్నారు. తెనాలిలో 'కళలకు కాణాచి' అనే సమితికి గౌరవ అధ్యక్షులు. నాటక సమాజానికి ఒక హాలు కట్టించారు. ఏటా నాటక పోటీలు నిర్వహించి ఐదు లక్షల రూపాయలు బహుమతులిస్తూంటారు. తండ్రిగారి స్వగ్రామం తాండ్రిలో వయోవృద్ధులకు ఆశ్రమం కట్టించారు. తెనాలిలో క్రీడలకు స్టేడియం, యోగాహాలు కట్టించారు. స్మశానం బాగు చేయించారు. కూరగాయలు అమ్ముకొనేవారికి వంద తోపుడుబళ్లు ఇచ్చారు. కూచిపూడి గ్రామం నుంచి తెనాలికి వెళ్లే దారిపొడవునా కూర్చునే సిమెంట్ బల్లలు వేయించారు. 2023లో గుంటూరు వైద్యకళాశాలకు పది లక్షలు విరాళమిచ్చారు. 2024లో వారి శ్రీమతి కీ.శే. డాక్టర్ సీతారావమ్మ పేరిట ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌లో గోల్డ్ మెడల్ ఏర్పాటు చేశారు. శ్రామికజనాల పిల్లలకు బడి వదలిన తర్వాత ఆహారం అందిస్తూ, ఆటలకూ ఏర్పాటుచేశారు. మొదటినించీ సాహిత్యంపై మమకారం మెండు. ఎన్నోపుస్తకాలు అచ్చు వేయిస్తుంటారు. కుమార్తె లక్ష్మితో డెట్రాయిట్‌లో ఉంటారు.



శ్రీమతి ఆసూరి విజయ

కళలు

శ్రీమతి ఆసూరి విజయ సామాజిక సేవ, సాంస్కృతికసేవ, రేడియో ప్రసారాలు, విరాళాల సేకరణ, భాషాసేవ, మహిళాభ్యుదయం, బాలలవిద్య, మొదలైన అన్నిరంగాలలోనూ ముందుంటారు. 1993-94 సంవత్సరంలో కార్యదర్శిగానూ, 1994-95సంవత్సరంలో అధ్యక్షురాలిగానూ బే ఏరియా తెలుగు అసోషియేషన్ (బాటా) కు గత ముప్పై ఏళ్లుగా సేవ, సాంస్కృతిక రాయబారిగానూ తెలుగువారి వారసత్వాన్ని నిలబెట్టుతూ కొన్ని వందల కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఉత్తర కాలిఫోర్నియా భారతీయ సంఘాల సమాఖ్యవారి సాంస్కృతిక విభాగానికి ఉపాధ్యక్షురాలిగా చేశారు. కొన్ని వందలమంది పిల్లలకు సాంప్రదాయ, జానపద నృత్యాలలో స్వయంగా శిక్షణ ఇచ్చి, ఏటా ప్రతిభాప్రదర్శనలు చేయిస్తుంటారు. తానావారి 'పాఠశాల' బాలల తెలుగు చదువు స్థాపనలో తన పాత్ర నిర్వహించారు. శాన్‌ఫ్రాన్‌సిస్కో ప్రాంత తెలుగువారికి వీరి విరిజల్లు రేడియో కార్యక్రమం సుపరిచితం. ఫ్రీమాంట్ నగర మానవసంబంధ వ్యవహారాల కమిషన్‌కు ఛైర్‌గా, కమిషనర్‌గా నగరపాలిక నుండీ, రాష్ట్ర నిధుల నుండీ స్వచ్ఛంద సంస్థలకు ద్రవ్యసహాయం అందేట్లు చూస్తుంటారు. ఆసరా అనే పేరుతో గృహహింసకు గురైన మహిళలకు రక్షణ కేంద్రం స్థాపించారు. అమెరికా తెలుగు సంఘం వారిచే 'సాంస్కృతిక కళారత్న', భారతీయ సంఘాల సమాఖ్యచే 'వలంటీయర్ ఆఫ్ ద ఇయర్', సాంస్కృతిక కార్యక్రమాలకుగాను ఫ్రీమాంట్ నగరపాలికతోనూ గౌరవింపబడ్డారు.



డా॥ కొత్తమాసు సాంబశివరావు

వైద్యరంగం, వైద్యవిద్య

కొత్తమాసు సాంబశివరావు 1972లో అమెరికా వచ్చారు వేన్ స్టేట్ యూనివర్సిటి, సెంట్రల్ మిచిగన్ యూనివర్సిటీ లలో రేడియాలజిలో క్లినికల్ ప్రొఫెసర్‌గా చేశారు. 60కి పైగా శాస్త్రవిజ్ఞాన వ్యాసాలు ప్రచురించారు. 90కి పైగా విజ్ఞాన ప్రసంగాలు చేశారు. 2000 సంవత్సరంలో సెంట్రల్ మిచిగన్ యూనివర్సిటిలో ఒక నూతన వైద్యకళాశాల కొరకై ప్రతిపాదన సమర్పించారు. 2009లో సెంట్రల్ మిచిగన్ యూనివర్సిటి స్నాతకోత్సవంలో కీలక ఉపన్యాసం చేశారు. డెట్రాయిట్ తెలుగు అసోసియేషన్‌కు అధ్యక్షుడిగా చేశారు. తానా ఉపనిబంధనల కమిటీలో పనిచేశారు. 2012- ఆ యూనివర్సిటి బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్‌లో పనిచేసి, వైద్య కళాశాలకు ప్రారంభోత్సవం చేశారు. 2015లో రోటరీ ఇంటర్నేషనల్ తాగునీరు, పారిశుధ్య పథకంలో గుంటూరు, అప్పాపురం, గోపాపురం, పెదనందిపాడులకు నిధులు సంపాదించారు. ప్రొద్దటూరులోని రోటరీ నేత్రాలయం వారి శస్త్రచికిత్స గదులకు పరికరాలకై లక్షా యాభై ఐదువేల డాలర్ల గ్రాంటు ఏర్పాటుచేశారు. 2020లో విజయవాడ సామీప్యంలోని తోటపల్లిలో వెయ్యిమంది అనాధ బాలల ఆశ్రమానికి 162 వేల డాలర్ల వ్యయంతో తాగునీరు అందించారు. 2021లో రోటరీ వారితో కోవిడ్ ఉపశమనానికి శ్రమించారు. 2024- రోటరీ క్లబ్ ఆఫ్ యాన్ ఆర్బర్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో ఉన్నారు. 2025లో ఉత్తర అమెరికా గుంటూరు వైద్య కళాశాల పూర్వవిద్యార్థి సంఘానికి అధ్యక్షునిగా ఉన్నారు. మిచిగన్ యూనివర్సిటిలోని ఇంటర్నేషనల్ హౌస్ ఆఫ్ యాన్ ఆర్బర్‌లో బోర్డ్ సభ్యునిగా ఉన్నారు.



శ్రీ గోగినేని సతీష్

క్రీడలు

గోగినేని సతీష్ పర్వతారోహకులు తెలంగాణాలోని హైదరాబాదులో పుట్టారు. 2004లో అమెరికా వచ్చారు. ప్రపంచంలో ఎత్తైనవైన మొదటి పది పర్వతాల్లోని ఐదింటిని ఎక్కారు. దక్షిణధ్రువానికి ఒంటరిగా స్కీయింగ్ చేసుకుంటూ వెళ్లిన మొట్టమొదటి భారతీయుడుగా వార్తల్లోకి ఎక్కారు. రక్తం గడ్డకట్టే చలిలో అంటార్కిటికాలో 51 రోజులపాటు 1,133 కిలోమీటర్లు ప్రయాణం పూర్తిచేశారు. అంటార్కిటికా తర్వాత గ్రీన్‌లేండ్‌లోని మంచుగడ్డ రెండో అతి పెద్దది. దీని మందం 3 కిలోమీటర్ల మేరకు ఉంటుంది. దీన్ని పశ్చిమం నుంచి తూర్పువైపుకు 30 రోజుల్లో 600 కిలోమీటర్లు దాటారు. వీరు ఎక్కిన శిఖరాలు.8000 మీటర్లకంటే ఎత్తైన పర్వతాలను 19 గంటలలో ఎక్కిన భారతీయుడుగా వేగంలో రికార్డు స్థాపించారు. అతిఎత్తైన శిఖరమైన ఎవరెస్టు-8848 మీటర్లు. టిబెట్-నేపాల్ సరిహద్దులో ఉన్న లోట్సే పర్వతం ఎత్తులో నాలుగో పెద్దది (8516 మీటర్లు). ఎత్తులో మూడోదైన కాంచన్ జంగా (8586మీటర్లు), ఏడో ఎత్తైన పర్వతం ధవళగిరి (8167 మీటర్లు), అన్నపూర్ణ పర్వతం పదవ ఎత్తైనది-(8091 మీటర్లు).



శ్రీ ఆది సత్తి

Political Strategist and Public Policy Professional

ఆది సత్తి ఇంగ్లాండులోని బర్మింగ్‌హేంలో పుట్టారు. తల్లిదండ్రులు శోభారెడ్డి, మల్లికార్జున రెడ్డిలతో 1990లో అమెరికా వచ్చారు. యూనివర్సిటీ ఆఫ్ మిచిగన్ నుండి 2013లో బాచిలర్ పట్టా, 2014లో మాస్టర్స్ పట్టాతో పట్టభద్రులయ్యారు. 2016-17 కాలంలో మిచిగన్ రాష్ట్ర రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్షులుగా పనిచేశారు. 2016-17 కాలంలో సెనెటర్ ఆరిన్ హేచ్ వద్ద లెజిస్లేటివ్ ఫెలోగా ఉన్నారు. 2017-2021లో రిపబ్లికన్ పార్టీ జాతీయ సమాఖ్య కార్యాలయ సిబ్బంది ప్రధానాధికారిగా చేశారు. లెనర్డ్ వుడ్ మిసూరిలోని అమెరికా రాణువ ప్రాథమిక పోరాట శిక్షణ మే 2021లోనూ, ఫోర్ట్ బెనింగ్ జార్జియాలోని రాణువ కాల్బల సేన అభ్యర్థుల శిక్షణ సెప్టెంబరు 2021 లోనూ పూర్తిచేశారు. రాణువ అధికారి నాయకత్వ శిక్షణలో జులై 2023లో ఉత్తీర్ణులయ్యారు. ఆసియా పసిఫిక్ మూలాలుగల అమెరికన్ పౌరుల రిపబ్లికన్ పార్టీ మిచిగన్ కమీషనర్‌గా 2018-21లోనూ, దాని జాతీయ కమిటీ సంచాలకులుగా 2017-19లోనూ చేశారు. రిపబ్లికన్ పార్టీ యువ నాయకత్వ జాతీయ సమాఖ్య కార్యాలయ సిబ్బంది సంచాలకులుగా 2017-21లో ఉన్నారు. మిచిగన్ రాష్ట్రంలోనూ, దేశవ్యాప్తంగా జరిగే అనేక ఎన్నికలలో అభ్యర్థుల ప్రచార వ్యూహరచనలోనూ. ప్రచార కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొంటూ, పలుమార్లు వారు భారీ ఆధిక్యతతో విజయం సాధించటానికి దోహదం చేస్తుంటారు. శ్వేతసౌధంలో దేశ ఉపాధ్యక్షులు జే.డి. వాన్స్‌కు అడ్వాన్స్ లీడ్‌గా ఉన్నారు.



డా. భద్రిరాజు సుబ్రహ్మణ్యం

వ్యవసాయరంగం

విశాఖపట్నంలో పుట్టారు. హైదరాబాదులోని వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి 1981లో ఉత్తీర్ణులయ్యాక, వాషింగ్టన్ స్టేట్ యూనివర్సిటీలో ఉన్నత విద్యకొరకై అమెరికా వచ్చారు. మినసోటా విశ్వవిద్యాలయంలో మాస్టర్సూ, పిహెచ్.డి చేయటం కొరకై 1982లో చేరారు. వీరి పరిశోధనల వల్ల ధాన్యాలు నిలువచేయటంలో రసాయనాలకు బదులు వేడిని వాడటం వచ్చింది. నిలువ చేసిన ధాన్యంపై క్రిమినిరోధక రసాయనాల ప్రభావం నివారించే పద్ధతులు ప్రవేశపెట్టారు. అంగళ్లలో అమ్మకానికై తయారు చేసే పొట్లాలలోని ధాన్యాన్ని పురుగులబారి నుండి రక్షించే పొరలు పెంపొందించారు. 2012-14 మధ్య డాన్ విల్బర్ ప్రొఫెసర్ ఆఫ్ పోస్ట్ హార్వెస్ట్ ప్రొటెక్షన్‌గా చేశారు. కాన్సస్ స్టేట్ యూనివర్సిటిలో డిస్టింగ్విష్డ్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. వీరి తండ్రి భద్రిరాజు కృష్ణమూర్తిగారు గొప్ప భాషాశాస్త్రవేత్త.

TANA Awards of Meritorious Achievement - 2025
తానా ప్రతిభా పురస్కారాలు - 2025



డా॥ ముక్కామల శ్రీనివాస్ (బాబీ)

వైద్యరంగం

మర్రిచెట్టు నీడన మరోమహావృక్షం పెరగటం అరుదు. కానీ,భారతదేశంలోనూ, అమెరికాలోనూ ప్రఖ్యాతిగాంచిన డాక్టర్ ముక్కామల అప్పారావు, డాక్టర్ సుమతి దంపతుల కుమారుడు తండ్రిని మించిన తనయుడుగా ఎదగటం వారికి గర్వకారణమే. నూటడెబ్భై రెండువేలమంది వైద్యులు సభ్యులుగా ఉన్న అమెరికన్ మెడికల్ అసోసియేషన్ (ఎ.ఎం.ఎ)కు అధ్యక్షులుగా జూన్ 10వ తేదీన పదవీ స్వీకారం చేయటం భారతీయులందరికీ గర్వకారణం. 180 ఏళ్ల ఎ.ఎం.ఎ చరిత్రలో భారతీయ సంతతికి చెందిన వ్యక్తి అధ్యక్షుడుగా ఎన్నికవటం ఇదే ప్రథమం. ఫ్లింట్ మిచిగన్‌లో పుట్టారు. యూనివర్సిటీ ఆఫ్ మిచిగన్ వైద్యకళాశాల నుంచి పట్టా పొందిన తరువాత చికాగోలోని లొయోలా యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌లో ఓటో లెరింగాలజీ, హెడ్ అండ్ నెక్ సర్జరీ రెసిడెన్సీ చేశాక, స్వంత ఊరు ఫ్లింట్‌కు తిరిగివచ్చి వైద్యుడుగా బల్లకట్టారు.ఆ తరువాత తన వృత్తిలోనూ, సేవలోనూ, నాయకత్వం లోనూ తారాజువ్వలా దూసుకుపోయారు. రెసిడెన్సీ చేస్తున్నప్పటి నుంచే ఎ.ఎం.ఎ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనేవారు. ఎ.ఎం.ఎ యువవైద్యుల విభాగంలో మిచిగన్‌కు ప్రాతినిధ్యం వహించారు. ఎ.ఎం.ఎ ఫౌండేషన్‌వారి 'ఎక్సలెన్స్ ఇన్ మెడిసిన్' లీడర్‌షిప్ అవార్డు పొందారు. ఎ.ఎం.ఎ హౌస్ ఆఫ్ డెలిగేట్స్‌లో 13 ఏళ్లపాటు మిచిగన్‌కు ప్రతినిధ్యం వహించారు. ఎ.ఎం.ఎ కౌన్సిల్ ఆన్ సయన్స్ అండ్ పబ్లిక్ హెల్త్‌కు 2016-2017 సంవత్సరాల్లో ఛైర్మన్‌గా చేశారు. ఫ్లింట్ నగరం ఉన్న జెనెసీ కౌంటీ మెడికల్ సొసైటీ బోర్డు సభ్యుడుగానూ, అధ్యక్షుడుగానూ, రాష్ట్రస్థాయిలోనూ మిచిగన్ స్టేట్ మెడికల్ సొసైటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో సభ్యుడుగా, ఆ పిమ్మట బోర్డు ఛైర్మన్‌గా, తర్వాత అధ్యక్షులుగా చేశారు. ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా తన భారతీయ విలువలనూ, సేవా దృక్పథాన్నీ వదలలేదు. ఫ్లింట్ ప్రాంతం తాగునీరు సీసంతో కలుషితమైనపుడు దాని బారినపడిన బాలల ఆరోగ్యం కొరకూ, నీటిశుద్ధి కొరకూ అవిరామంగా పనిచేశారు.ఫౌండేషన్ ఫర్ ఫ్లింట్ బోర్డ్‌లో పనిచేస్తూ, బాలల ప్రాథమిక విద్యావికాసాల కొరకు కృషి చేస్తున్నారు.



డా॥ బెజవాడ శ్రీనివాసరావు

Entrepreneurship

బెజవాడ శ్రీనివాసరావు ప్రకాశం జిల్లా, జమ్ములపాలెంలో పుట్టారు. 1969లో అమెరికా వచ్చారు. శస్త్రచికిత్సలో ఉపయోగించే అనేక నూతన ఆవిష్కరణల సృష్టికర్త. మోనోక్రిల్ అనే శరీరంలో కరిగిపోయే ఏకపేట తంతువును తయారుచేసినందుకు జాన్సన్ & జాన్సన్ కంపెనీ వారి జాన్సన్ మెడల్ అందుకున్నారు. 150 పైగా ఇటువంటి పాలిమర్‌లూ, పాలీ యురెతేన్లూ, పాలియెస్టర్ అమైడ్‌లూ,పాలీ ఆక్సా ఎస్టర్లూ సృష్టించి పేటెంటు హక్కులు పొందారు. బెజవాడ బయోమెడికల్స్ అనే సంస్థను స్థాపించి ఎఫ్.డి.ఏ వారి ఆమోదం పొందిన అనేక ఉత్పత్తులు తయారుచేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. వీరికే స్వంతమైన సాంకేతికతో గాయాలు మాన్పించే ఔషధాలూ, ఎముక ధాతు పునరుజ్జీవన ప్రేరేపణ మందులూ తయారుచేస్తున్నారు. ఔషధరంగంలో వీరి కృషీ, విజయాలూ ముందు తరాలకు స్ఫూర్తిదాయకం కావాలని ఆశిద్దాము.



డా॥ ముసునూరు కిరణ్

వైద్యరంగం & జీన్ థెరపీ

డా॥ ముసునూరు కిరణ్ జన్యు చికిత్సలో అగ్రగామి, మార్గదర్శి. న్యూయార్క్ నగరంలో పుట్టారు. ఫ్లోరిడాలోని పేస్కోలో పెరిగారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుతున్నపుడే తోటి విద్యార్థుల కొరకు ఒక పత్రిక పెట్టి సంపాదకత్వం వహించారు. జీవశాస్త్రమే ప్రధానంగా చదువుతున్నా, అడ్వాన్స్‌డ్ ఇంజనీరింగ్ కేలిక్యులస్, స్ఫటిక శాస్త్రమూ, బౌద్ధం వంటి వైవిధ్య అంశాలు ఎన్నుకొని అభ్యసించారు. 1997లో హార్వర్డ్ నుంచి పట్టా అందుకొన్న పిదప 2003లో రాకెఫెల్లర్ యూనివర్సిటీ నుంచి పిహెచ్.డి., 2004లో వెయిల్ కార్నెల్ వైద్య కళాశాల నుంచి వైద్యపట్టా అందుకొన్నారు. 2009లో జాన్స్ హాప్కిన్స్ బ్లూంబర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నుంచి ఎం.పిహెచ్. పూర్తిచేశారు. హార్వర్డ్‌లో ఇంటర్నల్ మెడిసిన్ రెసిడెన్సీ నుంచి ఉత్తీర్ణులలో ఉత్తమ విద్యార్థిగా గౌరవింపబడ్డారు. పెన్సిల్వేనియా యూనివర్సిటి నుంచి న్యాయశాస్త్రంలోనూ, మాస్టర్స్ ఇన్ రెగ్యులెటరీ అఫైర్స్ పూర్తిచేశారు. జాన్స్ హాప్కిన్స్‌లో ఇంటర్వెన్షనల్ కార్డియాలజీలో ఫెలోషిప్ చేశారు. ఫిలడెల్ఫియాలో బెంజమిన్ ఫ్రాంక్లిన్ స్థాపించిన అమెరికన్ ఫిలసాఫికల్ సొసైటీవారు తమ 275వ వార్షికోత్సవం సందర్భంగా జడ్సన్ డలాండ్ ప్రైజ్ ఫర్ ఔట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఇన్ క్లినికల్ ఇన్వెస్టిగేషన్ అనే బహుమతికి ఎన్నుకొన్నారు. మొదటినుంచీ డాక్టర్ కిరణ్‌కు జన్యుశాస్త్రంలోనూ, జన్యు చికిత్సలోనూ అసక్తి మెండు. ఇందులో ఎన్నో పరిశోధనలు చేస్తూ, పలు ప్రశంశలు అందుకొన్నారు. ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా వారి పెరెల్మేన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రొఫెసర్ ఆఫ్ కార్డియలజీ, పీడియాట్రిక్స్, జెనెటిక్స్‌గా అతి చిన్న వయస్సులోనే నియమింపబడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక ఏడునెలల బాలుడిని వీరివద్దకు తీసుకువచ్చారు. కాలేయ మార్పిడి ఒక్కటే అతనికిగల మార్గం. పరంపరానుగత దోష జన్యువువల్ల కాలేయం సరిగా పనిచేయక కృశిస్తున్న బాలుడికి క్రిస్పర్ సాంకేతికతో జన్యువును సంస్కరించి దాన్ని బాలుడి రక్తనాళంలోకి ఎక్కించారు. నెల, నెలా మూడుసార్లు ఇలా చేసిన పిదప ఇప్పుడు అతడు అందరివలే మామూలు ఆహారాన్ని తీసుకోగలుగుతున్నాడు. ఇది ఒక చారిత్రాత్మక చికిత్సగా అందరిచే కొనియాడబడుతున్నది. ముందు, ముందు ఈ పద్ధతి ఇంకా అభివృద్ధి చెంది అనేక జీవితాలకు వెలుగునిస్తుందనటంలో సందేహంలేదు. ఇది సాధించిన ఒక తెలుగుబిడ్డగా మనమంతా గర్వించవలసిన సమయమిది. డాక్టర్ కిరణ్‌నూ, వారి తల్లిదండ్రులు డాక్టర్ కోటేశ్వరరావు, ప్రమీల లనూ అభినందిస్తూ, తెలుగు ప్రజలందరి తరపునా గుర్తించి గౌరవించుకోవటానికి తానా ఆనందపడుతున్నది.



శ్రీ మాధవరెడ్డి

Entrepreneurship

మాధవరెడ్డి చిత్తూరుజిల్లా కలేపల్లిలో పుట్టారు. 1983లో అమెరికా వచ్చారు. 1990లో హెచ్.ట్.సి గ్లోబల్ సర్వీసెస్ అనే బృహత్తర అంతర్జాతీయ సాంకేతిక సమీకరణ వ్యాపారసంస్థ నెలకొల్పి, ప్రధాన కార్యనిర్వహణాధికారిగా పనిచేస్తున్నారు. ఈ సంస్థ వ్యాపార లావాదేవీలు ఉత్తర అమెరికా, దక్షిణాసియా, ఆస్ట్రేలియా, మధ్యప్రాచ్య దేశాలలో పెద్ద ఎత్తున సాగుతాయి. ఇంక్ మేగజిన్ వారి హాల్ ఆఫ్ ఫేంలో అతివేగంగా ఎదుగుతూ, నిలకడగా లాభార్జన చేసే సంస్థగా గుర్తింపబడ్డారు. అనేక ఫార్చ్యూన్ 500 కంపెనీలూ, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలూ ఈ సంస్థను నమ్మకమైన భాగస్వామిగా వీరిని పాతికేళ్లపైగానే గణిస్తున్నారు.ఇది వీరి విశ్వసనీయతకూ, కార్యదక్షతకూ, దార్శనికతకూ నిదర్శనం. తన జీవితంలో మొదటి నుంచీ హార్ట్‌ఫుల్ మెడిటెషన్ అనే ధ్యానమార్గాన్ని సాధన చేస్తూ, ఇతరులకు నేర్పుతూ పనిచేసేచోట ఆరోగ్యానికీ, ఉల్లాసవంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణానికి ప్రాధాన్యత ఇస్తారు. తన క్రమశిక్షణతో తన చుట్టూ ఉన్నవారికి ఆదర్శంగా నిలిచారు. వీరిని అనేక నగరాలలోనూ, రాష్ట్రస్థాయిలోనూ అనేక గౌరవ పురస్కారాలు వరించాయి. ఈమధ్యనే మిచిగన్ రాష్ట్ర గవర్నరుగారు ట్రాయ్ నగరంలోని వీరి పరిశోధనశాల సందర్శించారు. వీరి ప్రతిభను ప్రోత్సహించే తీరునూ, ఉపాధికల్పనా శక్తినీ శ్లాఘించారు. మాధవరెడ్డిగారి నిజాయితీ, కార్యదక్షతా, ధార్మికతా, దార్శనికతా ముందు తరాలకు ఆదర్శప్రాయం కావాలని కోరుకుందాం.



శ్రీ వీరనపు చినసత్యం

తెలుగుభాష వికాసం

వీరనపు చినసత్యం గుంటూరులో పుట్టారు. 2003లో అమెరికా వచ్చినప్పటి నుంచీ డాలస్‌లోనే ఉంటున్నారు. 2013 తానా మహాసభల సందర్భంగా ఆహ్వాన కమిటీ అధ్యక్షుడిగా, జ్ఞాపికల కమిటీకి సలహాదారుగా పనిచేశారు. తెలుగు వారసత్వ సంపదను ప్రతిబింబించే ఛాయా చిత్రప్రదర్శన నిర్వహించారు. 2019-20లో టాంటెక్స్ సంస్థకు అధ్యక్షుడిగా చేశారు. 2023-25లో తానా తెలుగు భాషా ప్రోత్సాహ సంఘానికి అధ్యక్షునిగా ఉన్నారు. తెలుగు భాషా, సంస్కృతుల పరిరక్షణా, పెంపొందింపుకు నిత్యం పాటుపడుతూ, తెలుగు వేదిక, తెలుగు వెలుగు పత్రిక నడుపుతున్నారు. తానావారి ఎల్లలు లేని తెలుగు కార్యక్రమంతో ప్రపంచంలో ఎక్కడ ఉన్నా తెలుగు సాహిత్యమూ, సంస్కృతిని తెలిపే సమాచారం అందేట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలుగు భాషాపటిమ పోటీలూ, అవధానాలూ, నృత్యరూపకాలూ నిర్వహిస్తుంటారు. తానా వారి పాఠశాలకై పాఠ్యప్రణాళిక రూపొందించారు. ఏకల్ విద్యాలయ, శంకర నేత్రాలయ సంస్థలకు సహాయం చేస్తుంటారు. ఫ్రిస్కో నగరం వారి ఉద్యానవనాలూ, వినోదము, డొంకలు, నామకరణ సంఘంలో పనిచేశారు.



శ్రీ కోగంటి సునీల్

సామాజికసేవ

కోగంటి సునీల్ గంటూరు జిల్లా కొల్లూరులో పుట్టారు. 2001లో అమెరికా వచ్చారు. గత పాతికేళ్లుగా తానా సంస్థకు వివిధ స్థాయిలలో విశేష సేవలు అందిస్తూ వస్తున్నారు. 2021-23 సంవత్సరాలలో తానా మధ్య-అట్లాంటిక్ ప్రాంత ప్రతినిధిగా ఎన్నికయ్యి, ఎన్నో బహుళ ప్రజాదరణ పొందిన సాంస్కృతిక కార్యక్రమాలూ, క్రీడాపోటీలూ, చదరంగ పోటీలూ, విహారయాత్రలూ, వనభోజనాలూ, బాడ్మింటన్ పోటీలూ, నడక, వ్యాయామ కార్యక్రమాలూ నిర్వహించారు. కళాప్రదర్శనలూ, నాట్య ప్రదర్శనలు అసంఖ్యాకం. కాన్ఫరెన్స్ కమిటీ సభ్యునిగా ఫిలడెల్ఫియాలో ఘనంగా జరిగిన 23వ తానా మహాసభల విజయానికి కృషి చేశారు. ఈ ఇరవై ఐదు సంవత్సరాలలో స్థానికంగానూ, జాతీయస్థాయిలోనూ నిర్వహించే అనేక కార్యక్రమాలకు ధారాళంగా సహాయం చేస్తుంటారు.



శ్రీ ఆలపాటి బిల్వన్

సామాజిక సేవ

ఆలపాటి బిల్వన్ చౌదరి గుంటూరు జిల్లా గూడవల్లిలో జన్మించారు. 2011లో అమెరికా వచ్చారు. వాయవ్య అర్కాన్సా తెలుగు సమాజంలో ఉగాది వంటి తెలుగు పండుగల వేడుకలు జరపటం, తెలుగుభాషలో పాఠాలు చెప్పటం వంటి స్వచ్ఛంద సేవల్లో పాల్గొంటారు. 2018లో తెలుగు అసోసియేషన్ ఆఫ్ మెట్రో అట్లాంటాకు విద్యా కార్యదర్శిగా, మనబడి వంటి కార్యక్రమాలతో తెలుగుభాషతో పరిచయమూ, తెలుగుభాష చదవటమూ, వ్రాయటమూ నేర్పటం చేశారు. 2019లో సాంకేతిక కార్యదర్శిగా చేశారు. 2016-20లలో స్వచ్ఛంద సేవకులకు నాయకత్వం వహించారు. ఆటల పోటీలూ, ఉపకార వేతనాలకై నిధుల సేకరణ, వారం వారం ఆరోగ్య శిబిరాలు నిర్వహించటమూ వంటి సాంఘిక సేవలంటే ప్రీతి. 2021 నుంచి ఇప్పటివరకూ తానాకు వెబ్ మాస్టర్‌గా పాఠశాల, సభ్యత్వ నమోదూ, పెళ్లిపందిరి వంటి కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరుపుతున్నారు.



డా॥ కాకరాల జగన్మోహనరావు

వైద్యరంగం

పశ్చిమ గోదావరి జిల్లా పెదపాడు గ్రామంలో పుట్టారు. పెదపాడులో హైస్కూలు, ఏలూరు సి.ఆర్. రెడ్డి కాలేజ్‌లో ఇంటర్ చదివారు. హైదరాబాదు ఎన్.బి.సైన్సు కాలేజ్‌లో బీఎస్సీ కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజ్‌లో ఎం.బి.బి.ఎస్. 1972లో అమెరికా వచ్చారు. సైనై హాస్పిటల్‌లో రెసిడెన్సీ అయ్యాక అక్కడే ఇంటర్నల్ మెడిసిన్‌లో ఉద్యోగంలో చేరి, ఆ విభాగంలో డైరెక్టరుగా ఎదిగారు. వీరి గౌరవార్థం వారి పేరున నిర్మించిన ఒక భవనం ఇప్పటికీ చూడవచ్చు. మిచిగన్ రాష్ట్ర ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అనేక సంవత్సరాలు ప్రతిష్టాత్మక వ్యవస్థాపక సభ్యులు. అసోషియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్. తెలుగు ఫిజిషియన్స్ ఆఫ్ నార్త్ అమెరికా. గ్లోబల్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజిన్. ఇంటర్నేషనల్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ హక్కులకొరకై వీరు చేసిన పోరాటం ఎంతో విశేషమైనది. స్వగ్రామం పెదపాడులో ఒక హాస్పిటల్, స్పెషాలిటీ క్లినిక్ ద్వారా ఉచిత సేవలు అందిస్తున్నారు. భార్యా, ఇద్దరు కుమార్తెలూ, కుమారుడూ, ఆరుగురు మనుమలతో యూన్ ఆర్బరులో ఉంటున్నారు.



కల్నల్ కొల్లి ప్రసాదరావు

Military Service and Defence Research

కొల్లి ప్రసాదరావు బాపట్ల జిల్లా పెదగాదెలవర్రులో పుట్టారు. 1966లో భారత సైన్యంలో సెకండ్ లూటెనెంట్ స్థాయిలో చేరి, 1989 కల్లా, కల్నల్‌గా ఎదిగారు. 1967లో వెయ్యిమంది నాగా విప్లవకారులను బంధించటంలో వీరి పాత్రకు సైన్యాధిపతి ప్రశంశలు లభించాయి. 1989లో సేన నుంచి పదవీ విరమణ చేసి, భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థలో చేరారు. విద్యుత్ కణ (ఎలక్ట్రానిక్) సమాచార ప్రసారమూ, మార్పిడికి పూర్తి స్వదేశీ సాంకేతికత అభివృద్ధిపై పనిచేశారు. నేటి బ్రహ్మోస్ క్షిపణులలో నిక్షిప్తమై వుండే ప్రాసెసర్ అతి వేగంగా ఫ్రీక్వెన్సీ మార్చుకొంటూ, తన ఉనికి శత్రువుకు అందకుండా లక్ష్యాన్ని చేరుకుంటుంది. 1995 నుంచి ఇండస్ట్రీ బోర్డులో డైరెక్టరుగా ఉన్నారు. అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేసినపుడు కల్నల్ రావుగారిని తన ఆత్మీయఅతిథిగా వెంటపెట్టుకు వెళ్లారు. 2005లో అమెరికా వచ్చి, టెక్సస్‌లో ఉంటున్నారు.



శ్రీమతి ఉదయగిరి రాజేశ్వరి

తెలుగు ప్రసారాలు

శ్రీమతి ఉదయగిరి రాజేశ్వరి హైదరాబాదులో పుట్టారు. 2005లో అమెరికా వచ్చారు. అమెరికాలోని మొట్టమొదటి రోజంతా 24 గంటలూ, వారంలోని ఏడురోజులూ నిరంతరాయంగా ప్రసారాలు చేసే రేడియో సురభి ప్రారంభించారు. ఇది ప్రవాస భారతీయులకు ముఖ్యమైన సాంస్కృతిక వేదికగా ఉపయోగపడుతున్నది. అమెరికాలో తెలుగు నాటకరంగంలో అనేక ప్రక్రియలు మొదటిసారి ప్రయోగించి కొత్తవారికి దారులు వేశారు. ద్రౌపది, మిస్సమ్మ వంటి ఐతిహాస్య శ్రేణి నాటకాలలో నటించి దర్శకత్వం వహించారు. అమెజాన్ ప్రైమ్‌లో లభ్యమయే పురూరవ నాటకాన్ని మొట్టమొదటిసారిగా దృశ్య, చిత్రమాలికా పద్ధతిలో సృష్టించారు. ఐ.టి.రంగంలో 22 ఏళ్ల పాటు పనిచేసిన పిదప టీవీ రంగంలో ప్రవేశించి, అతికొద్ది సమయంలోనే ప్రముఖ టీవీ కళాకారిణిగా ప్రఖ్యాతి పొందారు. టీవీ రంగంలోనూ, సినిమారంగంలోనూ గాత్రదానం చేసారు. ఇళయరాజా, ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం వంటి దిగ్గజాల సంగీత విభావరులకు పనిచేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో మాస్టర్ ఆఫ్ సెరెమొనీస్‌గా, వ్యాఖ్యాతగా రాణిస్తున్నారు.



శ్రీ నాదెళ్ల ప్రణయ్

విద్యావిజయాలు

నాదెళ్ల ప్రణయ్ న్యూజెర్సీలోని వెస్ట్ విండ్సర్ హైస్కూల్ చదువు తర్వాత మోసచూసెట్స్ కేంబ్రిడ్జ్‌లోని హర్వర్డ్‌లో జీవశాస్త్రం చదివారు. ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జ్ యూనివర్సిటికి గేట్స్ కేంబ్రిడ్జ్ ఉపకార వేతనం పై వెళ్లి జీవసాంక్రమిక శాస్త్రం అనగా ఎపిడెమియాలజీలో ఎం.ఫిల్ చదివారు. స్వదేశం తిరిగి వచ్చి ఫిలడెల్ఫియాలోని పెరెల్‌మేన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లో వైద్యపట్టా పుచ్చుకొన్నారు. ప్రస్తుతం బాస్టన్‌లో బ్రిగం అండ్ విమెన్స్ హాస్పిటల్‌లో ఇంటర్నల్ మెడిసిన్ రెసిడెన్సీ చేస్తున్నారు.పెరల్‌మేన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ స్నాతకోత్సవంలో స్పెన్సర్ మారిస్ మెడల్‌తోపాటు ఇరవై ఐదు వేల డాలర్ల బహుమానం వచ్చింది. ఆ సమయంలోనే ఒక ఆదర్శవైద్యునిగా ప్రణయ్‌కు మారిస్ గిన్స్‌బర్గ్ అవార్డు ఇచ్చారు. 2015లో హార్వర్డ్‌లో ఉండగా మలేరియా పట్ల అప్రమత్తత, నివారణ పై జరిగిన పోటీలో ప్రథమ స్థానం పొంది 10,000 డాలర్లు గెలుచుకొన్నారు. ఆ ఏడాదే జరిగిన గ్లోబల్ హెల్త్ కేర్ పోటీలో ప్రథమస్థానంలో వచ్చారు. ప్రాథమిక వైద్యమూ, జీర్ణకోశవ్యాధుల వైద్యసదస్సులలో పలు పరిశోధనాపత్రాలు సమర్పించారు. 2020లో నకిలీ గణాంకాలు గుర్తించడం ఎలా అని చేసిన ఒక పాఠం నమూనాకు ఆరిస్ పీపుల్స్ చాయిస్ అవార్డు వచ్చింది.



శ్రీ మిరియాల అరుణ్

కళలు

మిరియాల అరుణ్ సినీ కథన, సంభాషణల (స్క్రిప్ట్ రైటింగ్) రచయిత. ఆంగ్ల సినీరంగంలో తెలుగువారు చాలా అరుదుగా కనిపిస్తుంటారు.అప్పుడప్పుడూ మెరిసినా నిలదొక్కుకొని స్థిరపడ్డవారు తక్కువే. తెలుగువారికి అరుణ్ ఒక గర్వకారణం. అరుణ్, మినసోటా రాష్ట్రంలోని ఈడైనాలో డా॥ సుకుమార్, శారద దంపతులకు పుట్టారు. వీరు హాలీవుడ్‌లో సినీ, టీవీరంగాల్లో వర్ధమాన స్క్రిప్ట్ రచయితల్లో రాణిస్తున్నారు. హాలీవుడ్ ఆసియా-పసిఫిక్ ప్రాంత సృజనకారుల సమాఖ్య వారి ఫెలోషిప్ పొందారు. సినీరచయితల వాణిజ్యవేదికగా పేరు పొందిన 'కవర్ ప్లై' రెడ్ లిస్ట్‌లో టాప్ టెన్‌గా నిలిచారు. వీరి రచనలు ఆస్టిన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ, శ్లాండాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ప్రదర్శితమయ్యాయి. స్క్రీన్ రచయితల ఫెలోషిప్ పోటీలో ఫైనలిస్ట్‌గా వచ్చారు. హాలీవుడ్ సినిమాలకూ, టీవీ షోలకూ రచనలు చేస్తున్న వీరికి నేవిగేషన్ మీడియా సంస్థ ప్రాతినిధ్యం వహిస్తున్నది.

TANA Awards of Service Recognition - 2025
తానా సేవా పురస్కారాలు - 2025



శ్రీ పాతూరి నాగభూషణం

విద్య, సామాజిక సేవ

శ్రీ పాతూరి నాగభూషణం పెదవడ్లపూడి గ్రామంలో పుట్టారు. ఐ.టి.ఐ.లో పాలిటెక్నిక్ డిప్లొమా పొందారు కానీ, పరిశ్రమలు స్థాపించి, రాజకీయాల్లో రాణించి ప్రజలకు దగ్గరయ్యారు. గుంటూరు జిల్లాపరిషత్ ఛైర్మన్‌గా చేశారు. 1982లో డెబ్భైమంది యువకులను కూడగట్టి తెలుగుదేశం పార్టీకి మద్దతుగా సైకిల్ మెరవణి చేశారు. వీరి ఉత్సాహాన్ని గమనించి నందమూరి తారక రామారావుగారు వీరిని హైదరాబాదు సనత్‌నగర్ తెలుగుదేశం పార్టీ యువజన విభాగ అధ్యక్షులుగా నియమించారు. కరివేపాకు సాగును దేశవ్యాప్తంగా విస్తరింపజేసి, అంతర్జాతీయ విపణిలో నిలిపి కరివేపాకు కింగ్‌గా పేరుపడ్డారు. 1995లో మంగళగిరి జిల్లా పరిషత్ సభ్యునిగా ఎన్నికై, 1998 నుంచి 2006 వరకూ ఛైర్మన్‌గా సాగారు. ఉత్తమ జిల్లాపరిషత్ ఛైర్మన్‌గా ఇద్దరు ముఖ్యమంత్రులు శ్రీ చంద్రబాబు నాయుడు, వై.ఎస్.ఆర్.ల నుంచి అవార్డులు పొందారు. ఆంధ్రప్రదేశ్ బి.జె.పి రాష్ట్ర కార్యదర్శిగా చేసి, ప్రస్తుతం ఆ పార్టీ మీడియా సారధిగా ఉన్నారు. రామినేని ఫౌండేషన్ ద్వారా వందలాది విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇస్తున్నారు.ఎన్.ఆర్.ఐ. సెల్ స్థాపించి 50 లక్షల డాలర్లు సేకరించి, జిల్లా అభివృద్ధికి పాటుపడి హైటెక్ జెడ్.పి. ఛైర్మన్ అనిపించుకొన్నారు. పలు పరిశ్రమలు స్థాపించి నడుపుతున్నారు. మచ్చుకు కొన్ని– నూజీవీడు పాండురంగా ఇండస్ట్రీస్, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్, నార్వే దేశాలకు సరకు రవాణా సంస్థలూ, ట్రూలీ సొల్యూజియెస్, విశాఖలో వరల్డ్‌స్ట్ లైఫ్ సైన్సెస్, కె.పి.పాలివోల్ఫిన్ శాక్స్, నెల్లూరులో యు.పి.ఐ. పాలిమర్స్ కె.పి. సోని స్వార్ట్స్ సంస్థలకు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. పెదవడ్లపూడి శివారులో సద్గురు శ్రీ సాయిబాబా ఆలయం నిర్మించి, నిత్యాన్నదానమూ, గోసేవా చేసే వీరి క్రియాశీలత అందరికీ ఆదర్శప్రాయం.



డా॥ పరుచూరి శ్రీనివాస్

ఫైనాన్స్ టెక్నాలజీ

డా॥ పరుచూరి శ్రీనివాస్, డాక్టర్ అంజనేయులు, మీనాక్షి దంపతులకు ఒహాయోలోని సిన్సినాటిలో పుట్టారు. హార్వర్డ్ నుంచి భౌతికశాస్త్రంలో పిహెచ్.డి చేస్తూ అనువర్తిత గణితమూ, కల్పితమేధ, గణనయంత్ర మూనాసృష్టి, ద్రవ్య పరిణామశాస్త్రమూ అభ్యసించారు. ఏంజియోఇన్సైట్ అన్న సంస్థలో ముఖ్య అధికారిగా, కల్పితమేధ సాంకేతికతతో, హృదయకోశంలోని సూక్ష్మరక్తనాళాల వ్యాధినిర్ధారణ పద్ధతులను ఏర్పరచారు. విశ్రాంత ఉద్యోగుల భరణాలను భద్రపరచి, వృద్ధిచేసే హెచ్.ఎస్.బీ.సీ ఉద్యోగిగా, ఆ సంస్థ 50 కోట్ల డాలర్ల ప్రపంచవ్యాప్త సంపదను సంబాళించారు. ఎలింగ్టన్ అండ్ మిలీనియం సంస్థలో పనిచేస్తూ, గణన యంత్ర నమూనాలను ఉపయోగించి,అంతర్జాతీయ చెల్లుబడి వాణిజ్యవిపణిలో నూతన వర్తక ఒరవడులను ప్రవేశపెట్టారు.



డా॥ చెరుకుపల్లి నెహ్రూ

విద్యారంగం, సామాజిక సేవ

డా॥ చెరుకుపల్లి నెహ్రూ ఆంధ్రప్రదేశ్‌లోని జెముడుబడిలో పుట్టారు.స్టాండర్డ్ వేక్యూం ఆయిల్ కంపెనీ, భారత కేంద్ర విజ్ఞాన, పారిశ్రామిక కౌన్సిల్ వారి ఉపకారవేతనం పై 1957లో అమెరికా వచ్చారు. న్యూయార్క్‌లో వారు అప్పుడు దిగిన ఐడిల్ వైల్డ్ విమానాశ్రయమే నేటి కెనడీ ఎయిర్‌పోర్టు. కొలంబియా యూనివర్సిటిలో చదువు తర్వాత 1965–65ల మధ్య మూడేళ్లు ఇండియాలో ఎన్.ఎం.డీ.ఎస్.లో పనిచేశారు. ఆమెరికా తిరిగి వచ్చాక సిటీ యూనివర్సిటి, బ్రూక్ లిన్ కాలేజ్‌లలో పనిచేశారు. న్యూమెక్సికో యూనివెర్సిటీ తరపున ఇక్కడా, ఇండియాలోనూ అపోలో వ్యోమగాముల తెచ్చిన చంద్రశిలలపై, ఉల్కలపై పరిశోధనలు చేశారు. భూగర్భశాస్త్రంలో కాలేజ్ పట్టా, మాస్టర్స్ స్థాయి విద్యార్థులెందరికో గురువులు. తెలుగు సంఘాలేవీ ఏర్పడక పూర్వమే 1970లో తెలుగువారికి మొట్టమొదటి పిక్నిక్ ఏర్పాటుచేశారు. టి.ఎల్.సీ.ఏ.కి 50 ఏళ్ల పైగా, తానాలో యిరవై ఏళ్ల పైగా సేవ చేశారు. తానా ట్రస్టీలకు ఛైర్‌గా, తానాపత్రికకు సంపాదకునిగా చేశారు. నేటికీ చురుకుగా తానా కార్యక్రమాలలో కొనసాగుతున్నారు.



శ్రీ కిలారు అనిల్

వ్యాపారం

కిలారు అనిల్ పశ్చిమ గోదావరి జిల్లాలోని నారాయణపురంలో జన్మించారు. 1998లో అమెరికా వచ్చారు. ప్రైమస్ గ్లోబల్ సర్వీసెస్ అన్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజి సేవల సంస్థకు అధ్యక్షులూ, సీ.యీ.ఓ.గా పనిచేస్తున్నారు. ఈ సంస్థ కార్యకలాపాలు నిత్యం 5 పైగా దేశాలలో సాగుతూ ఉంటాయి. అనేక అంకుర సంస్థలు నెలకొల్పి, విజయవంతంగా వృద్ధి చేశారు. 2014లో ఐ.టీ. సెర్వ్ అలయెన్స్ ప్రారంభించి దానికి జాతీయ అధ్యక్షుడుగా కొనసాగుతున్నారు. టెక్సస్ రాష్ట్రంలోని డాలస్ వద్ద సాల్ట్ లేక్ హిందూ దేవాలయానికి బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్‌లో సభ్యుడిగా ఉన్నారు



శ్రీ అప్పలనేని నవీన్

సామాజిక సేవ

అప్పలనేని నవీన్ అన్నంభొట్లవారి పాలెంలో జన్మించారు. 2006లో అమెరికా వచ్చారు. 2015లో తన పరుగుల ప్రస్థానం మొదలుపెట్టి, తనకు 50 ఏళ్ల నిండక పూర్వమే దేశంలోని యాభై రాష్ట్రాల్లోనూ 26 మైళ్ల పూర్తి మారతాన్ పరుగులు పూర్తిచేశారు. దేశవ్యాప్తంగా పూర్తిచేసిన 100 పైగా పరుగు పోటీల్లో 65 పూర్తి మారతాన్‌లూ, ఎన్నో అర్ధ మారతాన్‌లూ, 5 కిలోమీటర్ల, 10 కిలోమీటర్ల పరుగులూ ఉన్నాయి. 150 పైగా ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చారు.13 ఏళ్ల లోపు బాలలచే తమ మొట్టమొదటి అర్ధ మారతాన్‌లు పూర్తి చేయించారు. షార్లట్ రన్నర్స్ అనే సంఘానికి రాయబారిగా వ్యవహరిస్తూ, పరుగుపోటీలపై ఎరుక పెంచి, శిక్షణ ఇస్తుంటారు. తన సహోద్యోగులలోనూ పరుగుపట్ల ఆసక్తిని ప్రోత్సహించి పరుగెత్తేవారిని విరివిపరుస్తూ ఉంటారు. నగరంలోని తెలుగు సంస్థలూ, సాంస్కృతిక సంఘాలూ వీరిని తరచూ గౌరవ అతిథిగా ఆహ్వానిస్తుంటారు.



డా॥ తోటకూర ప్రసాద్

సాహిత్యం, సామాజిక సేవ

డాక్టర్ తోటకూర ప్రసాద్ కృష్ణాజిల్లా, గన్నవరంలో పుట్టారు. 1986లో అమెరికా వచ్చారు. ఫ్యూజి ఇన్‌కార్పొరేటెడ్ సంస్థలో ఆపరేషనల్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. తానాకు అధ్యక్షులుగా పనిచేశారు. డాలస్‌లో ఉత్తర టెక్సస్ తెలుగు సంఘం (టాంటెక్స్) అధ్యక్షులుగా, ఇండియా అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సస్ అధ్యక్షులుగా చేశారు. డాలస్‌లోని అర్వింగ్‌లో మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సస్ స్థాపించి, మహాత్మాగాంధీ స్మారక విగ్రహం నెలకొల్పారు. క్రమం తప్పకుండా వీరు నిర్వహిస్తున్న సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు తానా ప్రపంచ సాహిత్య వేదిక– అంతర్జాలంలో ఇప్పటివరకూ 5 ఏళ్లుగా, 81 నెలలపాటు ప్రతినెలా ఆఖరి ఆదివారం– 2000 వేలమంది పైగా పాల్గొన్నారు. టాంటెక్స్ ఆధ్వర్యంలో నెలనెలా తెలుగు వెన్నెల ఇప్పటికి 72 నెలలుగా సాగుతున్నది. తానా సాహిత్యవేదిక ఆధ్వర్యంలో సినీగీత రచయిత పద్మశ్రీ సిరివెన్నెల సీతారామశాస్త్రి సమగ్ర సాహిత్యాన్నీ 6 సంపుటాలుగా ప్రచురించి తెలుగు రాష్ట్రాల్లో విశ్వవిద్యాలయాల గ్రంథాలయాలకు అందజేశారు. ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్‌షిప్ కౌన్సిల్‌కు అధ్యక్షులు. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికాకు అధ్యక్షులు. హైదరాబాదులోని తెలుగు విశ్వవిద్యాలయం నుండి 'మండలి వెంకట కృష్ణారావు తెలుగు సంస్కృతీ విశిష్ట పురస్కారం" అందుకున్నారు. విశాఖపట్నంలోని గీతం విశ్వవిద్యాలయంవారి నుండి గౌరవ డాక్టరేట్ అందుకొన్న తొలి, ఏకైక ప్రవాస భారతీయుడు.



శ్రీ అమర్నేని గౌతం

వ్యాపారరంగం

అమర్నేని గౌతం 1992లో అమెరికా వచ్చారు. అమెరికా కేంద్ర ప్రభుత్వ యేలుబడి సిస్టమ్స్ ఏకీకరణ, జీవ సేంద్రియ ఔషధాలు,అందరికీ అందుబాటులో ఆరోగ్య సేవలూ, నూతన ఔషధాల అభివృద్ధి పై పనిచేసే జోలాన్ టెక్ అనే సంస్థ ప్రారంభించారు. అమెరికా దేశంలో ఎన్నికలబరిలోకి దిగే భారతీయ మూలాలున్న వారిని బలపరుస్తూ ప్రోత్సహిస్తారు. తానాలో జాతీయస్థాయి తత్కాలిక సలహా సంఘములో యువత కొరకై కార్యక్రమాలూ, ఉపకార వేతనాల కొరకు నిధులూ, ఉపద్రవాలు సంభవించిన తరుణంలో నివారణా చర్యలూ మొదలైన అంశాలపై కృషి చేశారు. తానా చేయూత కార్యక్రమమూ, రొమ్ము కేన్సర్ ఫౌండేషన్, ఆరోగ్య శిబిరాలూ, మొదలైన డజనుకు పైగా ధార్మిక కార్యక్రమాలలో అమెరికాలోనూ, భారత దేశంలోనూ క్రియాశీలకంగా పనిచేస్తుంటారు.



శ్రీ తిపిర్నేని తిరుమలరావు

సామాజిక సేవ

తిపిర్నేని తిరుమలరావు కృష్ణాజిల్లా గుడివాడలో పుట్టారు. అక్కడే, బి.ఎస్.సి అయ్యాక నాగపూరులో ఇంజనీరింగ్ చదివారు. 1973లో అమెరికా వచ్చారు. న్యూజెర్సీలోని హోబోకెన్‌లోని స్టీవన్స్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీలో లోహశాస్త్రంలో ఎం.ఎస్ చేశారు. 1976లో అమెరికాలోని మొట్టమొదటి తెలుగుబడి ప్రారంభించారు. 1977లో జరిగిన మొట్టమొదటి తెలుగు మహాసభకు కార్యదర్శిగా చేశారు. అదే నేటి తానా. 1977లో వచ్చిన ఉప్పెన భాదితుల సహాయార్థం నిధులు సేకరించారు. 1978-79లో న్యూయార్క్ తెలుగు సాహిత్య, సాంస్కృతిక సంఘానికి (టి.ఎల్.సి.ఏ) అధ్యక్షులు. దాని బోర్డ్ అఫ్ ట్రస్టీస్‌కు 2000-2001లో అధ్యక్షులూ, అప్పటినుంచి జీవితకాల సభ్యులుగా ఉన్నారు. 1999 నుంచి 2007 వరకూ తానా ఫౌండేషన్ సభ్యులుగానూ, 2005- 2007 మధ్య ఛైర్మన్‌గానూ ఉన్నారు. 2024 నుంచీ టి.ఎల్.సి.ఏ కోశాధికారిగా ఉన్నారు. 1985లో స్వంత వ్యాపారం మొదలుపెట్టి విమాన, అంతరిక్ష, రక్షణరంగాలకు అనుబంధ సేవలు అందిస్తున్నారు. తెలుగు సాహిత్యం, సమాజసేవ, సంస్కృతీ పరిరక్షణ, దాతృత్వమూ వీరి సహజ లక్షణాలు.



డా॥ నల్లమోతు బ్రహ్మాజీ

వైద్య పరిశోధన

డాక్టర్ నల్లమోతు బ్రహ్మాజీ చల్లపల్లిలో పుట్టారు. 1973లో అమెరికా వచ్చారు. మిచిగన్ యూనివర్సిటీలో హృదయవ్యాధి నిపుణులు. గుండె రక్తనాళాలలో ఏర్పడే అవరోధాలను శస్త్రరహితంగా కొరొనరీ కెతీటర్ ద్వారా తొలగించే విధానాల నిపుణులు. హఠాత్తుగా సంభవించే గుండెపోటూ, ఆగిపోయిన గుండె చికిత్స పై పరిశోధనలు వీరి ప్రత్యేకత. 300 పైగా పరిశోధనా పత్రాలు అమెరికాలోని అత్యంత ప్రతిష్టాత్మక వైద్యపత్రికలలో ప్రచురింపబడ్డవి. నిపుణులు యోగ్యత నిర్ణయించిన తరువాతే ఇవి ప్రచురణకు అంగీకరించబడుతాయి. స్టీవో జూలియస్ రిసర్చ్ ప్రొఫెసర్‌షిప్ పొందారు. ప్రఖ్యాత "సర్కులేషన్" అనే వైద్యపత్రికకు ఎడిటర్ ఇన్ చీఫ్‌గా, కార్డియోవాస్కులర్ క్వాలిటీ అండ్ ఔట్ కమ్స్ పత్రికకు సంపాదకులుగా చేశారు. యూనివర్సిటి ఆఫ్ మిచిగన్ వారి ఖచ్చిత ఆరోగ్య ఉపక్రమం అన్న ప్రెసిషన్ హెల్త్ ఇనీషియేటివ్‌కు సహ సంచాలకత్వం వహిస్తున్నారు. తన తెలుగు మూలాలకూ, వారసత్వానికీ గర్వపడుతానంటున్న డాక్టర్ బ్రహ్మాజీ తన తండ్రి డాక్టర్ నల్లమోతు సత్యనారాయణగారూ, మామగారు డాక్టర్ గుత్తికొండ నరసింహారావుగారు ప్రముఖపాత్ర వహించిన స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆలయంలో సభ్యులు.



శ్రీ కొడాలి నరహరి

ఆహార కమిటీ

తానా సభలు బాగా జరిగాయా, లేదా అనే విషయం వడ్డించిన ఆహారం, తినుబండారాలూ రుచిగా ఉన్నాయా, లేదా? అందరికి సకాలంలో, సక్రమంగా అందాయా? అనే విషయం పైనే నిర్ణయిస్తారు చాలామంది. నిజం చెప్పాలంటే మహాసభల ఖర్చులో సింహభాగం ఆహారానికే అవుతుంది. ఏడుగురు కమిటీ సభ్యులూ యాభైమంది స్వచ్ఛంద కార్యకర్తలూ ఆరునెలల ముందు నుంచే దీనిపై పని మొదలుపెడతారు. ఇన్ని వేలమందికి మూడు రోజులపాటు భారీ ఎత్తున భోజనాలు వంక పెట్టడానికి వీలు లేకుండా చేయించడం ఆషామాషీ వ్యవహారం కాదు. మొదటిరోజు రాత్రి విందుతో మొదలై చివరి రోజు రాత్రి భోజనానంతర తాయిలాలూ, పళ్లుతో ముగుస్తుంది. ఎవరికీ, ఎక్కడా, దేనికీ కొరత లేకుండా తిండీ, నీళ్లూ వియ్యాలవారికి చేసినట్లు మర్యాద చేసే ఘనులు కొడాలి నరహరిగారు. డెట్రాయిట్‌లో ఇంతకుమునుపు 2005లో, 2015లో జరిగిన మహాసభలకు అన్నదాత నరహరిగారే. ఈ మారు కూడా వారే అలుపు లేకుండా శ్రమిస్తున్నారు. బాపట్ల జిల్లా, గూడవల్లిలో పుట్టారు. 1988లో అమెరికా వచ్చారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ధర్మకర్తల మండలిలో ట్రస్టీగా నాలుగుసార్లు చేశారు. ఆలయంలోకూడా ఆహార కమిటీకి వీరే సారధి. అన్నదాతా సుఖీభవ!



రవి చెరుకూరి & వంకాయలపాటి శ్రీనివాస్

కార్యక్రమాలూ, వేడుకల దండు



తానా ద్వైవార్షిక సభలు సజావుగా జరగటానికి యాభైకి పైగా కమిటీలు పనిచేస్తాయి. ఈ కమిటీల కార్యక్రమాలు జరగవలసిన సమయానికి, జరగవలసిన చోట జరిగేట్టు ఏర్పాట్లు చేయటం, ఆయా కార్యక్రమాలకు అవసరమయ్యే వేదిక, సరంజామా, సామగ్రి వంటి వివరాలు సేకరించి సకాలంలో అందేట్లు చేయాలి. కమిటీల దండలో ఈ కమిటీ దారం వంటిది. 2005లోనూ, 2015లోనూ రెండుమార్లు ఇదే పని చేసిన చెరుకూరి రవి, వంకాయలపాటి శ్రీనివాస్‌ల జట్టు మీదే మళ్లీ ఈ భారం పెట్టారు కో ఆర్డినేటర్ చాపలమడుగు ఉదయ్‌కుమార్‌గారు. ఇద్దరూ జంట కవులవలే కో చెయిర్, చెయిర్ పాత్రలు మార్చుకుంటూ సమర్థ వంతంగా పనిచేస్తారు.

వంకాయలపాటి శ్రీనివాస్: గుంటూరులో పుట్టిన వంకాయలపాటి శ్రీనివాస్, సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి. 1988లో అమెరికా వచ్చి ఈస్టర్న్ మిచిగన్ విశ్వవిద్యాలంలో మాస్టర్స్ చేశారు. లోహాలు విడదీసే సాంకేతికతపై అనేక నూతన ఆవిష్కరణలు చేశారు. భార్య డాక్టర్ జయ, పిల్లలు అమూల్య, అనీష్ బల్‌రాంలతో గత ముప్పై ఏడేళ్లుగా డెట్రాయిట్ నివసిస్తున్నారు.

చెరుకూరి రవి: విజయవాడలో పుట్టిన చెరుకూరి రవి 1986లో అమెరికా వచ్చి, మెకానికల్, సిస్టంస్ ఇంజనీరింగ్‌లలో రెండు ఇంజనీరింగ్ మాస్టర్స్ డిగ్రీలు పూర్తిచేశారు. భార్య నళిని, కుమార్తె వినీల, కొడుకు విక్రాంత్‌లతో ఉంటున్నారు.



THE UPS STORE

(Proudly Owned by Roopa and Satya Injeti

EXCLUSIVE TANA MEMBER DISCOUNT



BANNERS
STARTING @ $24.99



STAND UP BANNERS
STARTING @ $199



POST CARDS
5000 FOR $340



FLYERS/BROACHERS
5000 FOR $622



BUSINESS CARDS
1000 FOR $68.90

NORTHVILLE UPS
143 CADYCENTRE
NORTHVILLE MI 48167
(248) 344-1980
store2021@theupsstore.com

FARMINGTON UPS
35560 GRAND RIVER AVE
FARMINGTON MI 48335
(248) 477-6112
store0093@theupsstore.com

HOWELL UPS
4337 E GRAND RIVER AVE
HOWELL MI 48843
(517) 552-9629
store3239@theupsstore.com

The Gene Editor-in-Chief: Dr. Kiran Musunuru's Race to Save a Baby With a Rare Genetic Disorder Affecting One in a Million



తల్లిదండ్రులనుంచి సంక్రమించిన లోప జన్యువు వల్ల కార్బమాయిల్ ఫాస్ఫేట్ సింతటేజ్ అనే ఎంజైము లోపం పదమూడు లక్షల బిడ్డలలో ఒకరికి జరుగవచ్చు. కాలేయం రక్తాన్ని నిర్విషీకరణ చేయలేక, కాలేయ మార్పిడి అవసరమవుతుంది. క్రిస్పర్-కేస్-9 (Clustered Regularly Interspersed Short Palindromic Repeats Cas-9) అనే నూతన సాంకేతికతను ఉపయోగించి, లోపం ఉన్న జన్యువును కత్తిరించి తీసివేసి, బాగుచేసి దానిని తిరిగి దాని స్థానంలో ప్రవేశపెట్టి చికిత్సను విజయవంతంగా పూర్తిచేశారు మన తెలుగు బిడ్డ ముసునూరి కిరణ్. మే నెల 16వ తేదీన ప్రవాస భారతీయుల పత్రిక 'అమెరికన్ కహానీ' ఒక వ్యాసం ప్రచురించింది. వీరిని తానా పురస్కారంతో సత్కరించుకొంటున్న సందర్భంలో వారి సౌజన్యంతో ముద్రిస్తున్నాము.

The Indian American researcher's race against time is said to stand as a testament to what becomes possible when scientific innovation meets human compassion.

In the predawn hours of a February morning in 2025, Dr. Kiran Musunuru stood anxiously in a hospital room at Children's Hospital of Philadelphia. Before him lay six-month-old KJ Muldoon, sleeping peacefully in the same crib that had been his home since birth. As a clear liquid flowed through an IV into the infant's tiny veins, Dr. Musunuru felt a conflicting surge of emotions.

"I was both excited and terrified," recalls Dr. Musunuru, the Barry J. Gertz Professor for Translational Research at the University of Pennsylvania's Perelman School of Medicine.

What KJ received that morning was unlike any treatment given to a patient before - a personalized gene-editing therapy created specifically to correct the single DNA letter in his genetic code that had caused

a rare, life-threatening condition. That infusion would make medical history and potentially open the door to treating thousands of other genetic diseases that have long been considered untreatable.

The Midnight Email

The story began on August 8, 2024, when Dr. Musunuru received an urgent email from Dr. Rebecca Ahrens-Nicklas at Children's Hospital of Philadelphia. A newborn boy had been diagnosed with CPS1 deficiency, a rare genetic disorder affecting just one in 1.3 million babies.

CPS1 deficiency prevents the body from properly processing ammonia, a toxic byproduct of protein metabolism. If left untreated, the condition can cause severe brain damage or death. Half of all babies with the disorder die within their first week of life. In her email, Dr. Ahrens-Nicklas's asked if Dr. Musunuru can save the baby's life considering that most babies don't survive unless they get liver transplant at 3 years of age.

"At this point, the clock starts in my mind," Dr. Musunuru said, as reported by The New York Times. "This is real life. This is not hypothetical."

For the Muldoon family - parents Kyle and Nicole - the diagnosis was devastating. Doctors initially offered "comfort care," acknowledging the grim prognosis. But the Muldoons decided to give their son a fighting chance.

For the Muldoon family - parents Kyle and Nicole - the diagnosis was devastating. Doctors initially offered "comfort care," acknowledging the grim prognosis. But the Muldoons decided to give their son a fighting chance.

Dr. Musunuru wasn't a newcomer to the field of gene editing. As the Barry J. Gertz Professor for Translational Research in Penn's Perelman School of Medicine, he had dedicated years to studying how gene editing could be used to treat genetic conditions. He is also a professor of Cardiology, Professor of Genetics and professor of Pediatrics at University of Pennsylvania school of medicine. Incidentally, Dr. Musunuru has designed gene therapy for the enzyme PCSK9 that decreases high cholesterol that is undergoing stage 2 clinical trials. If approved it will change the treatment of corronary headt disease. It's like vaccine for heart attacks.

According to the Penn Medicine report, Dr. Musunuru and Dr. Ahrens-Nicklas had been collaborating since 2023 to study the feasibility of creating customized gene editing therapies for individual patients. Both are members of the NIH-funded Somatic Cell Genome Editing Consortium, which supports collaborative genome editing research.

Their focus had been on urea cycle disorders - precisely the category of disease affecting baby KJ. But developing a personalized treatment would typically take years, time the infant simply didn't have.

"Developing a gene editor to treat patients is a deliberate process that can take years," noted the New York Times report. "But KJ did not have years to wait - perhaps as few as six months before a mounting risk of severe brain damage or death."

The Race Against Time

What followed was an unprecedented scientific sprint. Dr. Musunuru assembled a team that included Dr. Fyodor Urnov at the University of California, Berkeley, and reached out to Danaher Corporation and other biotechnology companies to help produce the treatment.

Their approach used a refined CRISPR technique called "base editing," which precisely changes a single letter in the DNA sequence without cutting the DNA strand. This method, invented in David Liu's Harvard laboratory, reduces the risk of unintended genetic modifications.

The team worked around the clock. In Berkeley, as Dr. Urnov told The New York Times, "scientists burned a vat of midnight oil on this the size of San Francisco Bay." He added, "such speed to producing a clinic-grade CRISPR for a genetic disease has no precedent in our field. Not even close."

Dr. Liu himself described the timeline as "astounding."

"These steps traditionally take the better part of a decade, if not longer," he said.

Within just six months - lightning speed in the world of medical development - Musunuru's team had designed, tested, and manufactured a treatment ready for human use. The FDA expedited the regulatory approval process, recognizing the urgency of KJ's condition.

The Breakthrough

On February 25, 2025, KJ received his first infusion of the experimental therapy, followed by additional doses in March and April. The results were remarkable. Within two weeks of the first treatment, KJ

was able to eat normal amounts of protein - something that would have been dangerous before. When he contracted typical childhood illnesses, which would normally have caused dangerous spikes in ammonia levels, he "sailed through them," according to Dr. Ahrens-Nicklas.

Now 9½ months old, KJ is growing well and meeting developmental milestones. His weight has increased from the 7th percentile to the 40th percentile for his age. While he still requires some medication, the dosage has been greatly reduced, and his doctors are preparing to discharge him from the hospital - allowing him to go home with his family for the first time in his life.

"We've been in the thick of this since KJ was born, and our whole world's been revolving around this little guy and his stay in the hospital," his father, Kyle Muldoon, told Penn Medicine News. "We're so excited to be able to finally be together at home so that KJ can be with his siblings, and we can finally take a deep breath."

For Dr. Musunuru, saving KJ's life is just the beginning. The implications of this treatment extend far beyond one rare disorder.

"We want each and every patient to have the potential to experience the same results we saw in this first patient," Dr. Musunuru explained to Penn Medicine News. "And we hope that other academic investigators will replicate this method for many rare diseases and give many patients a fair shot at living a healthy life."

More than 30 million Americans suffer from one of over 7,000 rare genetic diseases. Many of these conditions are so uncommon that pharmaceutical companies have little financial incentive to develop treatments. But the approach used for KJ - essentially creating a molecular GPS that can be reprogrammed to target different genetic mutations - offers a template that could be adapted for countless other conditions.

The cost of development, while significant, was comparable to that of a liver transplant - the standard treatment for CPS1 deficiency in older children. As the process becomes more refined, Musunuru believes costs will decrease further.

"As we get better and better at making these therapies and shorten the time frame even more, economies of scale will kick in and I would expect the costs to come down," he told ABC News.

The Future of Personalized Medicine

The breakthrough represents what Dr. Peter Marks, who recently resigned from his position overseeing gene-therapy regulation at the FDA, called "one of the most potentially transformational technologies out there."

The methodology could eventually be applied to more common genetic disorders like sickle cell disease, cystic fibrosis, Huntington's disease, and muscular dystrophy.

"The promise of gene therapy that we've heard about for decades is coming to fruition," Dr. Musunuru said, "and it's going to utterly transform the way we approach medicine."

For the Muldoon family, the significance is measured in simpler terms - in milestones met and moments shared.

"Any time we see even the smallest milestone that he's meeting - like a little wave or rolling over - that's a big moment for us," Nicole Muldoon told ABC News.

As KJ prepares to leave the hospital and experience the world beyond his crib for the first time, Dr. Musunuru's race against time stands as a testament to what becomes possible when scientific innovation meets human compassion - and a reminder that behind every medical breakthrough are the very real lives hanging in the balance.



NRI CLINICS

Global Healthcare

A Concierge service using AI

Take Charge of Your Health!

Don't let your HEART stop



Next time you're in HYDERABAD !



whatsapp Nandini AI :
+91 898 565 1122
to make an appt

Golden HEART package
for only $ 299(includes)

- ★Heart CT Angiogram & Ca++ score
- Full Body Ultrasound scan
- over 10 blood tests related to Heart
- and over 20 general blood tests

Senior Advisor :
Dr.Suresh Reddy Aerra. MD
Harvard trained Radiologist
Ph: +1 617 251 1122

- **IHA: 50% of all heart attacks in Indian men occur under 50 years of age**
- **Early detection of plaques can prevent heart attacks**

★**Complimentary Free Dental Cleaning**

NRI REALTOR

Are you tired of owning and maintaining properties in India

We can help

We specialize in:

- **Farm Lands**
- **Plots**
- **Apartments**
- **Houses**






Our expert legal and accounting teams are always avaialble to help you with land sales and purchases

Address:
201 Aarohan Plaza
Lane beside Joyalukkas Jewellers
Punjagutta, Hyderabad, 500082

Contact:
Satish Aerra. MS (USA)
Ph: +91 789 333 0123
Email: realtornri@gmail.com



RISAMSOFT
Empowering Digital Transformation



PRASAD MANEPALLI

Thousands of Loan Products | **Hundreds** of Lenders | **One** Seamless Process

Loan Programs Tailored for Every Need:

800+ BANK | CMBS | BRIDGE | SBA 504 | SBA 7a | Fannie Mae | Freddie Mac | FHA/HUD | Life Insurance



Limitless Financing Options. Unmatched Expertise. One Powerful Lending Platform.

Mortgage made EZ – with Prasad

Your trusted partner for hassle-free residential & commercial mortgages.



Loan Programs Offered:

HELOC & HELOAN (Home Equity Loans & Lines) | Conventional Loans | FHA Loans | VA Loans | USDA Loans | Jumbo Loans | DSCR | ARM | Bank Statement | Foreign National



Let's Turn Your Homeownership Dreams Into Reality
ONE SIMPLE STEP AT A TIME.

Scan to Apply Now

C4D MORTGAGE | COMMLOAN

Prasad Manepalli (Director)

NMLS ID: 2528296
C4D Mortgage • NMLS ID: 1512261

Commercial Loan Originator | Residential Mortgage Loan Originator

734 2704000/ 734-395-9849 (Text /Whatsapp)

pmanepalli@commloan.com | prasad.mortgage@outlook.com



అతిథిప్రభ

ఈ అతిథిప్రభలో...

1. తెలుగుభాష ప్రాచీనతకు శాసనాలు తిరుగులేని ఆధారాలు!
   - ఈమని శివనాగిరెడ్డి, స్థపతి ... 94
2. ప్రయాణం
   - అన్వర్ ... 99
3. తెలుగుభాష వికాసం - కథ, నవల
   - వాసిరెడ్డి నవీన్ ... 104
4. తెలుగు సమాజంలో తెలుగుభాష ప్రతిష్ట పెంచేందుకు ఆలోచన
   - గారపాటి ఉమామహేశ్వరరావు ... 108
5. వెండితెర పైకి... అక్షరాల విజయయాత్ర
   - డా. రెంటాల జయదేవ ... 113
6. రేపటి తెలుగు నాటకం
   - డా. కందిమళ్ల సాంబశివరావు ... 126
7. తెలుగు భవిష్యత్తు: ప్రజలు, కథలు, భాషావికాసం
   - కన్నెగంటి రామారావు ... 131
8. కృత్రిమ మేధాయుగంలో రేపటి తెలుగు
   - డా. కె. గీతామాధవి ... 135
9. సాహిత్యము-సాహితీవేత్తలు - తొలి దశాబ్దాల తెలుగు టాకీలు
   - కిరణ్‌ప్రభ ... 140
10. కవిత్వం ఎందుకు?
    - వాసు ... 144
11. సాహిత్యం నుంచి సినిమాలోకి శ్రీశ్రీ
    - మద్దుకూరి విజయ చంద్రహాస్ ... 146



తెలుగుభాష ప్రాచీనతకు శాసనాలు తిరుగులేని ఆధారాలు!

ఈమని శివనాగిరెడ్డి, స్థపతి

ఆదిమమానవుని అడుగుజాడలను అదిమి పట్టుకొన్న తెలుగు నేల, తెలుగు ప్రజలకు లక్షల సంవత్సరాల పురాచరిత్ర ఉందని తెలిపే అనేక ఆధారాలనందించింది. తెలుగులిపి, భాషల ప్రాచీనతను తెలిపే ఆనవాళ్లన్నీ రాతిపలకల్లోనూ, రాగిరేకుల్లోనూ, నాణేలపైన నిక్షిప్తమై ఉన్నాయి. శాసనాలే మన శ్వాసనాళాలని ప్రముఖ సంపాదకులు, ఆంధ్రప్రదేశ్ అధికారభాషా సంఘం, పూర్వ అధ్యక్షులు డా. ఏబీకే ప్రసాద్‌గారన్న మాట అక్షరసత్యం. తెలుగుభాషకు విశిష్ట భాష గుర్తింపు దక్కించుకొనేందుకు ఆయన చేసిన ప్రయత్నాల్లో భాగంగా, అందుకు అవసరమైన శాసనా ధారాల సేకరణ పనిని నాకప్పగించారు. అలా సేకరించిన ఆధారాలను **తెలుగు లిపి, భాషలకు ఈ శాసనాలు తిరుగులేని ఆనవాళ్లు** అన్న పుస్తకాన్ని అధికార భాషా సంఘం తరపున 2008లో ప్రచురించారు.

2004, అక్టోబరు 12న కేంద్ర ప్రభుత్వం, తమిళభాషకు ప్రాచీన ప్రతిపత్తిని ప్రకటించినప్పటి నుంచి సి. ధర్మారావు, సామల రమేష్‌బాబు, మండలి బుద్ధప్రసాద్‌ల ఆధ్వర్యంలో తెలుగుభాషకు కూడా ఆ హోదా దక్కాలన్న ప్రయత్నాలు ప్రారంభమై, ఉద్యమానికి దారి తీసింది. 2006-2008 సంవత్సరాల మధ్య తెలుగునాట పట్టిన ఉద్యమబాట నేపథ్యంలో 31.10.2008న తెలుగు, కన్నడ భాషలకు కేంద్ర ప్రభుత్వం ప్రాచీన ప్రతిపత్తిని ప్రకటించింది. అయితే 2008, ఆగస్టులో రెండు నెలల ముందే, తెలుగు, కన్నడ భాషలకు ప్రాచీన ప్రతిపత్తినీయకూడదని, ఆ రెండు భాషలకు ఆ అర్హత లేదనీ మద్రాస్ హైకోర్టులో ఒక వ్యాజ్యం దాఖలైంది. ఇది చాలదన్నట్లు 2008 నవంబర్‌లో మరో వ్యాజ్యం తోడై తెలుగుకు ప్రాచీన ప్రతిపత్తి దక్కించుకొనే ప్రయత్నం నెత్తిన పిడుగుపాటైంది. చెన్నైకి చెందిన ఉపాధ్యాయుడు తూమాటి సంజీవరావు వేసిన ప్రతివ్యాజ్యం వల్ల 8.8.2016న వెలువడిన తీర్పు తెలుగు, కన్నడ భాషలకు ఆ ప్రతిపత్తినివ్వడం సబబేననటంతో తమిళ సోదరుని అనవసర వాదనకు తెరపడింది. తెలుగు భాషోద్యమ సమాఖ్య, ఇతర వ్యక్తులు, సంఘాలు, ఏబీకే ప్రసాద్‌గారి నేతృత్వంలో సాగిన ఉత్తర ప్రత్యుత్తరాల కృషి ఫలితంగా తెలుగు భాషకు ప్రాచీన ప్రతిపత్తి దక్కింది. తెలుగువారంతా తమ భాష, యాసకు ఘనమైన చరిత్ర ఉందని సంబరపడిపోయారు. కేంద్ర ప్రభుత్వం, తెలుగుభాషకు ప్రాచీన హోదాను ప్రకటించినా, తమ భాషే అత్యంత ప్రాచీన మైందని గగ్గోలు పెట్టుకోవటంలో అర్థముందిగానీ, తమిళ సోదరులు ఇంకా అక్కసు వెళ్లగక్కుతూ, సోదర తెలుగుభాషను కించపరచటం భావ్యం కాదేమో.

ఇప్పటికీ (2025 నాటికి) సామాజిక మాధ్యమాల్లో ఇదే వరవడి కొనసాగుతున్న నేపథ్యంలో తెలుగుభాష ప్రాచీనతను నిక్కచ్చిగా, నిరూపించగల శాసనాధారాలను ఒకచోట పొందుపరచి, తెలుగు భాష మిగతా దాక్షిణాత్యభాషల సరసన కూర్చునే అర్హత ఉందన టమే ఈ వ్యాస ఉద్దేశం.

తెలుగుభాష పుట్టుపూర్వోత్తరాలను పరిశీలించే ముందు గత 225 ఏళ్లకు పైగా, తెలుగు నేలపై తెలుగు శాసనాలపై జరిగిన పరిశోధనల గురించి తెలుసుకోవాలి.

ప్రస్తుత బాపట్ల జిల్లాలో ఉన్న భట్టిప్రోలు బౌద్ధస్థూపం వద్ద 1870-71లోనూ, 1892లోనూ జరిపిన తవ్వకాల్లో అతిపెద్ద రాతి బుద్ధధాతు పేటికలు బయల్పడినాయి. వాటిపై స్థానిక రాజు కుబిరకుని ఆరు ప్రాకృత శాసనాలు బ్రాహ్మీలిపిలో ఉన్నాయి. లిపి దృష్ట్యా అవి అశోకుని శాసనాల కంటే కొంచెం ముందరి కాలానివని శాసనలిపి పరిశోధకులు తేల్చారు. భట్టిప్రోలులోని సా.శ.పూ. 3వ శతాబ్ది ధాతుపేటిక శాసనాల్లో కేశ (కేశయ్య), పోత (పోతురాజు), పాప (పాపయ్య), ఛంగ (చెంగయ్య) అనే తెలుగు పేర్లు కనిపిస్తున్నాయి. ఇవి తెలుగుభాష ప్రాచీనతకు తొలి నిదర్శనాలు. అంతకంటే కనీసం రెండు మూడొందలేళ్లకు ముందే

తెలుగుభాష వాడుకలో ఉండబట్టి ఈ పేర్లు శాసనస్థమైనాయనేది నిర్వివాదాంశం.

ప్రకాశం జిల్లా మాలెకొండలో ఉన్న సా.శ.పూ. 3వ శతాబ్ది నాటి ప్రాకృత శాసనంలో 'అరవావాలకులం' అన్న పదం తెలుగు పదము ఉంది. ఇదే సా.శ.పూ. 3వ శతాబ్దినాటి మొదటి తెలుగు పదమని పి.వి. పరబ్రహ్మశాస్త్రి, ఎన్నెస్ రామచంద్రమూర్తి తేల్చి చెప్పారు. పెద్దపల్లి జిల్లా , ధూళికట్టలో వెలుగు చూసిన సా.శ. 1వ శతాబ్దికి చెందిన శాతవాహన చక్రవర్తి సిరి శాతకర్ణి ప్రాకృత-తెలుగు భాషల్లో రాజు పేరున్న నాణెం పైన 'రాణో వాసిటిపుతస సిరి సాతకనిస' అని బ్రహ్మీలిపిలో, ప్రాకృత భాషల్లోలోనూ, 'అర హణకు తిరుశాతకనిస సిరికు' అని తెలుగు లోనూ పేర్కొటనం ప్రత్యేకత. శాలిహుండం బౌద్ధక్షేత్రం వద్ద బయల్పడిన ఒక కుండపెంకుపై '...నకు దానం' అనే సా.శ.పూ. 2వ శతాబ్దినాటి తెలుగు పదముంది.



భట్టిప్రోలు శాసనం

విశాఖపట్నంజిల్లా, కొత్తూరు బౌద్ధ క్షేత్రం వద్ద బయల్పడిన సా.శ.పూ. 2వ శతాబ్దికి చెందిన రాతి ధాతుపేటిక మూతపైన 'తంబయదానం' అన్న పేరులోని తంబయ తెలుగు వ్యక్తి పేరు. తెలంగాణాలోని జగిత్యాల జిల్లా, కోటలింగాలలో బయల్పడిన శాతవాహనుల కంటే ముందు కాలానికి చెందిన స్థానిక రాజుల పేర్లలో 'నరన' సా.శ.పూ.2వ శతాబ్దినాటి తెలుగు పేరు. అక్కడిదే అయిన ఒక చిన్న శాసనంలో ఉన్న నాగగోపినికాయలోని 'గోపి' తెలుగు పదం. పెద్దపల్లి జిల్లా, ధూళికట్ట తవ్వకాల్లో బయల్పడిన ఒక ముద్రికపైనున్న సా.శ. 1వ శతాబ్దికి చెందిన 'కుమరియ' (కుమరయ్య) తెలుగు పదమే.

ధాన్యకటక అమరావతి తవ్వకాల్లో బయల్పడిన దాదాపు 200లకు పైగా గల చిన్న ప్రాకృత శాసనాల్లో తెలుగు పేర్లుండటం ఆసక్తి కలిగించే అంశం. సా.శ. 1వ శతాబ్దికి చెందిన నాగబుధి(ద్ధి), పులుమావి (పులు-గడ్డి, మావి - మాయ), కవులూరు, మొదలైనవి తెలుగు పదాలే.[11] నాగార్జునకొండలో సా.శ. 3వ శతాబ్దినాటి విజయ శాతకర్ణి ప్రాకృత శాసనంలో, తన ఆరో పాలనా సంవత్సరం, గ్రీష్మరుతువు, నాలుగో పక్షం, వైశాఖ పూణిమ (పున్నమి) నాడు ఒక శాసనాన్ని ఎత్తించినట్లు పేర్కొనబడింది. ఈ ప్రాకృత శాసనం లోని పూణిమ తెలుగు పదం. మహాతలవరి ఛాంతిసిరి నాగార్జున కొండ ప్రాకృత శాసనంలోని 'మహాతలవర' 'మహాతలవరి' పదాల ల్లోని తలవర, తలవరి పదాలు ముమ్మాటికి తెలుగు పదాలే.

సా.శ. 1వ శతాబ్దికి చెందిన శాతవాహన చక్రవర్తి హాలుడు మహారథి ప్రాకృతభాషలో రాసిన గాథాసప్తశతిలోని చాలా తెలుగు పదాలను తిరుమల రామచంద్ర గుర్తించారు. వాటిలో అత్త, అద్ద(ం), అంస (అంచు), అక్కోస (అక్కసు), అంక (అంకె, కొక్కెం), అమ్మ, అన్న, అట్టక, అయ్య, ఆగు, ఆనతి, ఇత్తి (స్త్రీ), ఎత్తావతా (ఏతవాతా), కంసు (కంచు) ఒరట (ఊరట), కత్తరి, కమ్మర, కుమ్మర, చ(చె)త్త, తంబువు, పల్లంక (పల్లకీ), ధోవతి, దుపట్ట, వడ్డకి, సుక్క (చుక్క), సుంకం (సుంక), సున్న అనే తెలుగు పదాలు ముఖ్యమై నవి. ఆ తరువాత, తెలుగుభాష శాసనాల్లో కెక్కింది.

సా.శ. 3 శతాబ్దినాటి ఇక్ష్వాకురాజు ఎహువల ఛాంతమూలుని పాతగండిగూడెం రాగిరేకు ప్రాకృత శాసనంలోని 'సంవచ్చరం' 'తలవర' పదాలు తెలుగుపదాలు. సా.శ. 3వ శతాబ్దికి చెందిన ఉపాసిక బోధిసిరి తన భర్త, తల్లి, ఇంకా కుటుంబసభ్యుల పుణ్యం కొరకు చులధమ్మగిరి (నాగార్జునకొండ) పై చైత్యాన్ని నిర్మించిం దన్న విషయాన్ని తెలిపే శాసనంలో మూలమ్మ, వీరమ్మ, నాగంన (నాగన్న) వీరన్న అనేవి తెలుగు పదాలు. గుంటూరు జిల్లా, తెనాలి సమీపంలోని కొండముదిలో దొరికిన సా.శ. 3వ శతాబ్దినాటి బృహత్పలాయన రాజు జయవర్మ ప్రాకృత శాసనంలో తాను బస చేసిన కూడూరు నుంచి, పాతూరు గ్రామాన్ని బ్రాహ్మణులకు దానమిచ్చినట్లు పేర్కొనబడింది. శాసనంలోని కూడూరు, పాతూరు తెలుగు పేర్లు. సా.శ. 4వ శతాబ్ది నాటి ఆనందగోత్రిన రాజు దామోదరవర్మ మట్టిపాడు రాగిరేకు శాసనంలో, కంగూరు గ్రామం, కొండి(డ)న్న, సంవచ్చరం, తెలుగు పదాలే. సా.శ. 4వ శతాబ్ది నాటి పల్లవ శివ స్కంధవర్మ మైదవోలు ప్రాకృత శాసనంలో, విరిపర (విప్పర్ల) గ్రామం, సంవచ్చరం, పట్టికా తెలుగు పదాలు. సా.శ.5వ శతాబ్దినాటి విష్ణుకుండిన గోవిందవర్మ తుమ్మల గూడెం సంస్కృత


1. (న)మో భగవతో అగపగలస
2. రణో గొతమిపుతస సిరి విజయస
3. తకఞ్జిస సవ 6 గిప 4 దివ వెసా
4. (ఖ) పూణిమ

నాగార్జునకొండ

శాసనం లోని ఎనమదల, ప్రేంకపల్లు గ్రామాల పేర్లు తెలుగులోనే ఉన్నాయి.

సా.శ. 4వ శతాబ్దికి చెందిన సాలంకాయన విజయానంద వర్మ, ఏలూరు శాసనంలో 'ముతుడ' అన్న తెలుగుపదం గ్రామ పెద్దను సూచిస్తుంది. ఇంకా, ఎలూర (ఏలూరు) కురుకాడ (కూరాడ), ముందూరు (ముందూరు) వేంగి (వేగి) మొదలైన గ్రామ నామాలు తెలుగులోనే ఉన్నాయి.

సా.శ. 4వ శతాబ్దినాటి బబ్బేపల్లి (ప్రకాశం జిల్లా) సంస్కృత ప్రాకృత మిళిత శాసనంలో పల్లవకుమార విష్ణు తన 13వ పాలన సం॥లో కర్మ రాష్ట్రంలోని కలిదొడ్డి గ్రామంలో కొంత భూమిని దానం చేసిన సందర్భంగా పేర్కొన్న సరిహద్దు గ్రామాలైన కొండ ముజునూరు (కొండముంజులూరు), పుల్లళూరు తెలుగు మాటలే. సా.శ. 4వ శతాబ్ది నాటి సాలంకాయన విజయనందవర్మ ఏలూరు రాగిరేకు శాసనంలో వేంగిపురం, ఏలూరు పేర్లు తెలుగులోనే ఉన్నాయి. సా.శ. 5వ శతాబ్దినాటి మాఠర రాజు ప్రభంజనవర్మ నింగొండి శాసనంలో దాన గ్రామమైన నింగొండి పేరు తెలుగులో ఉంది.

సా.శ. 5వ శతాబ్ది విష్ణుకుండన మాధవవర్మ పాతగండిగూడెం రాగిరేకు శాసనంలో 'దాళవ' (రెండో పంట), కదురు (నూలు వడికే రాట్నం), కాడు (శ్మశానం), కాపు (కాపు కాయటం) అన్న అచ్చ తెలుగు మాటలున్నాయి. ఇదే శాసనంలో గ్రామ నామాల చివర పర (పల్లు), కొట్ట (కొండ), చెరువు, కోడు, కుదురు, రేవు, పాక, పల్లి, వాడ, ముడ్డి, తొరె, మంచి మొదలైన తెలుగు పదాలు ఉన్నాయి, నందజ్జ (నందయ్య) ఖందజ్జ (స్కందయ్య) అనే వ్యక్తుల పేర్లు కూడా తెలుగులో ఉండటం గమనించాల్సిన విషయం. విక్రమేంద్రవర్మ చిక్కుల్ల రాగిరేకు శాసనంలో 'విజయరాజ్య సంవత్స రంబుల్' అన్న తెలుగుపదం చివరన బహువచన ప్రత్యయమైన 'ల్' ఉంది.

హైదరాబాదు సమీపంలోని కీసరగుట్ట వద్ద రాతిపై చెక్కి ఉన్న తులచువాన్టు అన్న సా.శ. 5వ శతాబ్దినాటి తొలి చిన్న శాసనంగా గుర్తింపు పొందింది.

సా.శ. 5 శతాబ్దినాటి పృథ్వీ మూలరాజు కొండవీటి (మూడో) సంస్కృత శాసనంలో కారకుండ (కారుకొండ) తాలుపాక,



నాగార్జునకొండ

వేల్కొండ, పల్లవెంచ (పాల్వంచ) అనే గ్రామాల పేర్లు తెలుగులోనే ఉన్నాయి.

విష్ణుకుండిన మాధవవర్మ సా.శ.6వ శతాబ్దిలో రచించిన 'జనాశ్రయ చందోవిచితి' వ్యాఖ్యానంలో 'శీర్షిక' పేరుతో ఉన్న చందస్సు తెలుగు సీసపద్యానికి సంబంధించిందే. అంతేకాదు. దాని చివర ఆటవెలదిగానీ, తేటగీతి కానీ ఉండాలని ప్రస్తావించటం వల్ల తెలుగులో అప్పటికే సాహితీ ప్రక్రియ ప్రారంభమైందని చెప్పవచ్చు.

సా.శ.6వ శతాబ్దిలో రేనాడు అని పిలువబడిన కడప - కర్నూలు ప్రాంతాన్ని పాలించిన తెలుగు (రేనాటి) చోళులు తమ శాసనాలను పూర్తిగా తెలుగులో వేయించారు. ఇవే తొలి తెలుగు శాసనాలు సా.శ.575 నాటి ఎరికల్ ముత్తురాజు ధనంజయని కలమల్ల శాసనం తొలి తెలుగు శాసనంగా గుర్తింపు పొందింది.

కలమల్ల శాసనంలో ధనంజయుఱు రేనాణ్టు ఏళన్ చిఱుంబూరి - రేవణకాలు (పం) పు చెనూరు కా(జు) అరికళా ఊరి(జ్జ)వారు.. అని పూర్తి తెలుగు పదాలున్నాయి. రేనాటి చోళుల 50 రాతి శాసనాలు, 4 రాగిరేకు శాసనాల్లో కేవలం 8 అచ్చులను, వాడటం వల్ల 'ఐ' వాడవలసినచోట అయి, ఔ వాడవలసిన అవు అన్న అక్షరాలను వాడాల్సి వచ్చింది. వీరి శాసనాల్లో తాండిమండ, తాడ్లరేవు, చిరుంబ్రోలు, తర్కపుబ్రోలు, ఊరిస్వాములు, మున్నూరు, ఇన్నల్వూరు, రట్టగుళ్లు, రాచమానంబు అనే సమాసాలు కూడా ఉన్నాయి. వీటితోపాటు, కొను, ఎండు (ఏడు), నాండు (నాడు), బ్రాహ్మముడు, తెనికి (దేనికి), వేసెరువులు (వేయి చెఱువులు), మగవు (నాయకుడు), పసరము (ఎద్దు), పసులు (ఆవులు), పొడిచి పదియె (పోట్లాడుతూ చనిపోయె) పుట్లు (భూమి, ధాన్యంకొలత), తూము (కొలత), ప్రాలు (బియ్యము), నేయ (నేయి), దుగరాజులు (యువరాజులు) ఆనతి (ఆజ్ఞప్తి), అణపోతు (కులపెద్ద), కుందికాళ్లు (బౌద్ధభిక్షువులు), లచ్చువాణ్రు (విధ్వంసకులు), ఇట్లుకను (ఇట్లుకాను), ఆడ్లపట్టు (విత్తనాల వేయటానికి భూమి), ముడ్లు (ముట్లు, ప్రతివిధి), దాదాపు 50 వరకూగల రేనాటి చోళ తెలుగు శాసనాలను పరిశీలిస్తే ధనం జయుని కలమల శాసనంతోనే తెలుగులో వాక్యనిర్మాణం ప్రారంభ మైందని తెలుస్తుంది.

సా.శ. 6వ శతాబ్ది నాటి వశిష్ట రాజు విశాఖవర్మ కోరోషండ రాగిరేకు శాసనంలో పేర్కొన్న దానగ్రహీతలు నాగ్గశర్మ (నాగన్న శర్మ), శివ్ణ శర్మ (శివన్న శర్మ) పేర్లు కూడా తెలుగులోనే ఉన్నాయి. సా.శ. 6 శతాబ్దినాటి జర్జింగి రాగిరేకు శాసనంలో తూర్పు గంగరాజు ఇంద్రవర్మ దానం చేసిన గ్రామం బిజ్జిక తెలుగు గ్రామమే.

సా.శ. 7వ శతాబ్దిలో తూర్పు చాళుక్యులు కూడా తమ శాసనాల్లో తెలుగు పదాలను ప్రయోగించటం మొదలుపెట్టారు. సా.శ. 624నాటి కుబ్జవిష్ణువర్ధను (విషమసిద్ధి)ని తిమ్మాపురం రాగి రేకు సంస్కృత శాసనంలో బ్రాహ్మణులకు దానం చేసిన

కుములూరు, పోటునూంక గ్రామాలు తెలుగులోనే ఉన్నాయి. అతని కుమారుడైన మొదటి జయసింహుని సా.శ. 649నాటి విప్పర్ల శాసనంలో 'స్వస్తిశ్రీమత్ సకలలోకాశ్రయ జయసింహ వల్లభ మహా రాజులాకున్ ప్రవర్థమాన విజయ రాజ్యసంవత్సరంబుల్ ఎణుం బోది,' అని పేర్కొనటం గమనించాల్సిన విషయం.

ఈ శాసనంలో సంవత్సరంబుల్ (సంవత్సరాలు), ఎణుం బోది (ఎనిమిది), పూణమనాణ్డు (పున్నమినాడు), బణిసేసిన (పని చేసిన), చెరువు పడుమాటికోట (చెరువు పడమటి కట్ట), పుట్లు (పుట్లు - వడ్లు), ఆఱ్లపట్టు (ఆడ్లపట్లు), వడ్లపట్లు = వీరి పండే భూమి, తాళుతోంట (తాంటితోపు), కుడుచువారు (అనుభ వించువారు), యిఱ్లకాను (రెండుకార్ల పంట), విత్పర్తి గాణంబు (విప్పర్రుపొలం), చువ్వుటూరు గాణంబు (చువ్వుటూరు పొలం) అని; విప్పర్లలోనే ఉన్న జయసింహుని మరోశాసనంలో సముద్రంబు నిల్పి (చెరువు తవ్వించి), మహిమీన (భూమిమీద), గుడ్లు నన్ద వనంబు (గుళ్లు, తోటలు) ప్రసాదంబుకన్నియు (ప్రసాదంబులన్నీ) కవుల ఆయంబు (కౌలు ఆదాయం), దీనికి వక్రంబువచ్చిన (ఈ దానానికి అడ్డు చెప్పినవారు) అనే మాటలు, సా.శ. 7వ శతాబ్దిలో వాడుకభాషగా తెలుగు నిలదొక్కుకుంటున్నదని తెలియ జేస్తున్నాయి.

అదే రాజవంశానికి చెందిన రెండో విష్ణువర్ధనుని సా.శ. 679 నాటి పల్నాడు జిల్లా మాచర్ల సమీపంలోని తేరాల శాసనంలో స్థానిక సిద్ధేశ్వరస్వామి ఆలయనిర్వహణకు గుట్టంబాడి, కొమ్మల గ్రామాల్లో భూమిని, బంగారు నాణేలను దానం చేసిన వివరాలు ఉన్నాయి. ఈ శాసనంలో మహారాజులకు, సంవత్సరంబులకు, ఏను (పదు), కత్తిక (కార్తీక), పఞ్చమి (పంచమి), నాణ్డు (నాడు), పసిణ్డి (బంగారం), నురు (నూరు), గుణ్ణంబాడి (గుట్టంబాడి), క్రొమ్మల (కొమ్మాల), అనే వాడుక పదాలున్నాయి. ఆ తరువాత వేంగీ చాళుక్య మంగి యువరాజు (సా.శ. 7వ శతాబ్ది) లక్ష్మీపురం శాసనంలో మరిన్ని తెలుగు పదాలున్నాయి.

సా.శ. 7వ నాటి రేనాటి చోళ ఎరికల్ ముత్తురాజు ఎఱ్రగుడి పాడు (కడప జిల్లా) శాసనం, ఎరిగల్ దుగరాజు ఇందుకూరు, పుద్యణచోలుని మాయలూరు శాసనాలు కూడ పూర్తిగా తెలుగు భాషలోనే ఉన్నాయి.

సా.శ. 8వ శతాబ్దినాటి కడపజిల్లా తొండూరు వీరగల్లు శాసనం మొత్తం అప్పటి తెలుగులోనే ఉంది. ఇందులో చేంబోలుకు చెందిన ఒక వీరుడు, ఇరుంగడికి చెందిన మరో వీరుడు, ఆత్రల పట్టులో జరిగిన పోరు (యుద్ధం)లో మరణించిన విషయం నమోదు చేయబడింది. ఇదే శతాబ్దికి చెందిన రేనాటిచోళ సత్యాదిత్య మహా రాజు మాలెపాడు శాసనం కూడ పూర్తిగా తెలుగుపదాలతో నిండి ఉంది. సా.శ. 8వ శతాబ్దినాటి రాష్ట్రకూటరాజు మొదటి కృష్ణ (అకాలవర్ష)ని నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ శాసనంలో కన్నడంతో పాటు గ్రామం పేరు ఎణ్ణూరు, చాళుక్య విద్యాధికారి



తులచువాన్లు

కేసరగుట్ట

అయ్యనయ్య ఇంకా రామయ పేర్లు తెలుగులో ఉన్నాయి.

సా.శ. 9వ శతాబ్దికి చెందిన రాష్ట్రకూటుల సంగమేశ్వరం (కర్నూలు జిల్లా) శాసనంలో ఆ ఆలయాన్ని గుండికట్టుకు చెందిన శిల్పి దోయూరి ఆచార్ల కొడుకు నడిపియోజు నిర్మించాడని చెప్ప బడింది. అదే శతాబ్దికి చెందిన వరంగల్ జిల్లా కొండపర్తిలోని పొలమెయరట్టోడి శాసనం, కర్నూలు జిల్లా ప్రాతకోట నాగేశ్వర స్వామి దేవాలయంలో ఉన్న సా.శ. 10 శతాబ్ది శాసనంలోని శ్రీ ఉత్పత్తిపిడుగు అనే చిన్న శాసనం, వేములవాడ చాళుక్యరాజు మొదటి అరికేసరి కొల్లిపర రాగిరేకు (సా.శ. 973వ సం॥) శాసనంలో పేర్కొన్న రామడుగు, పుల్చెరువు తెలుగు గ్రామాలే.

సా.వ. 9వ శతాబ్దినాటి వైదుంబరాజు గండత్రినేత్రుని బండపల్లి (కడపజిల్లా), చిత్తూరు జిల్లా కలకడ శాసనాలు, పల్నాడు జిల్లా గురజాలలోని ఖురుమైయ శాసనం, రేనాటి చోళ విక్రమా దిత్యుని లింగాల, పులపత్తూరు శాసనాలు, బాణరాజు ధవళేయని బలపనూరు శాసనం[54] అప్పటి తెలుగుకు అద్దం పడు తున్నాయి.

సా.శ. 10వ శతాబ్దినాటికి శాసనాల్లో స్పష్టమైన తెలుగు పదాలు పేర్కొనబడినాయి. వైదుంబమనుజ త్రినేత్రుని పెదబలిజపల్లి (చిత్తూరు జిల్లా), అదే రాజవంశానికి చెందిన భువనత్రినేత్రుని మద్రాస్ మ్యూజియం తొలి రాగిరేకు తెలుగు (సా.శ. 972) శాసనాలను ఇందుకు ఉదాహరణలుగా చెప్పవచ్చు.

వేంగీ చాళుక్యరాజు మొదటి భీముని సా.శ. 888వ సంవ త్సరపు బెజవాడ రాగిరేకు శాసనంలోని దానభాగంలోని కూకిపట్లు గ్రామ సరిహద్దులు, చెరువుల పేర్లు తెలుగులో ఉన్నాయి.

ఈ సందర్భంగా మల్లంపల్లి సోమశేఖరశర్మ, 'ప్రాచీనాంధ్ర భాషాస్వరూపము', శ్రీ రాజరాజనరేంద్ర పట్టాభిషేక సంచిక 48, వీరాజు వెంకటకృష్ణారావు, మోదుగుల రవికృష్ణ, గుంటూరు, 2022, పేజీ 130లో అహదనకర తెలుగు శాసనభాషను కూడా పరిశీ లించాలి.

తెలుగు శాసనాల్లో, తూర్పు చాళుక్య మూడో గుణగ విజయా దిత్యుని (సా.శ. 849-892) సేనాని పండరంగని అద్దంకి శాసనంలో తరువోజు ఛందస్సులో రాసిన తొలి పద్యం ఉంది. ఇదే పద్యాన్నం దించిన తొలి తెలుగు శాసనం. దీని తరువాత కందుకూరు,

1. .....
2. కల్ముతురా
3. జు ధనంజ
4. య ళు రేనా
5. ఱ్ఱు ఏళన్
6. చిఱుంబూరి
7. రేవణకాలు (పం)
8. పు చెనూరు కాజు
9. ఆఱి కాళా ఊరి
10. ణ్ణ వారు ఊరి
11. ... ...



కాలమ్మళ్ళ

ధర్మవరం శాసనాల్లో సీసం, మధ్యాక్కర పద్యాలు, తెలంగాణాలోని మహబూబాబాద్ జిల్లా కొరవి, హనుమకొండ జిల్లా జపర్‌ఘడ్ శాసనాలు కూడా తెలుగు పద్యాల నందించాయి.

వేములవాడ చాళుక్య రెండో అరికేసరి ఆస్థానకవి పంపని సోదరుడైన జినవల్లభుని సా.శ. 935నాటి కుర్యాలలోని సంస్కృత, కన్నడ, తెలుగుభాషల్లో ఉన్న శాసనంలో మొట్టమొదటిసారిగా కందపద్యం ప్రయోగింపబడింది. ఇదేకాలంలో జినవల్లభుని స్నేహితుడైన మల్లియరేచన రాసిన ఛందోగ్రంథం 'కవిజనాశ్రయం' కూడా వెలువడి తెలుగుభాషలో పద్యాలు రాయటానికి అవసరమైన నియమాలనందించింది. ఈ సందర్భంగా, యుద్ధమల్లుని బెజవాడ శాసనాన్ని కూడా చెప్పుకోవాలి. ఐదు మధ్యాక్కర పద్యాలున్న ఈ శాసనంలో, సంస్కృతంలోని కుమారస్వామిని 'కొమరసామి' అని అనువదించటం ఆసక్తి కలిగిస్తుంది.

ఇదే క్రమంలో కొంచెం తరువాత వచ్చిన విరియాల కామసాని గూడూరు శాసనంలో మూడు చంపకమాల, రెండు ఉత్పలమాల పద్యాలున్నాయి. సా.శ. 1053లో వెలువడిన రాజ రాజనరేంద్రుని నందంపూడి శాసనంలోని దానభాగం పూర్తిగా తెలుగులోనే ఉంది.

ఏడో విజయాదిత్యని కుమార్తె సోమలదేవి, సా.శ. 1065లో వేయించిన ద్రాక్షారామం శాసనంలో, ఒక ఆటవెలది, ఒక సీసపద్యం ఉన్నాయి. రాజరాజనరేంద్రుని కోరికపై నన్నయ భారతాన్ని తెనుగించటంతో తెలుగుభాష అటు శాసనాల్లోనూ, ఇటు సాహిత్యం లోనూ నిలదొక్కుకుంది. భద్రిరాజు కృష్ణమూర్తి (సం), తెలుగు భాషా చరిత్ర, హైదరాబాదు, 2018; ఈమని శివనాగిరెడ్డి, అలనాటి మేటి తెలంగాణా శాసనాలు (హైదరాబాద్, 2023) గ్రంథాల్లోని శాసన సంబంధ విషయాలను కూడా ఈ సందర్భంగా పరిశీలించాలి. సా.శ.పూ. 3వ శతాబ్దిలో ప్రాకృత శాసనాల్లో కొద్దిగా చోటు దక్కించుకొన్న అప్పటికే వాడుకలోనున్న తెలుగుభాష క్రమంగా వృద్ధిచెంది సా.శ. 6వ శతాబ్దికి అటు శాసన, ఇటు సాహిత్యభాషగా ఎదిగింది. ఆ క్రమంలో వాక్య నిర్మాణం కూడా జరిగి పద్య, గద్య రూపాల్లో నన్నయ కంటే బాగా ముందే వాడుక, శాసన సాహిత్య భాషగా తెలుగు రాణించిందనటానికి పై శాసనాలే చక్కటి ఆధారాలు.

సా.శ. - సామాన్య శకం (క్రీస్తు శకం)
సా.శ.పూ. - సామాన్య శకం పూర్వం (క్రీస్తు పూర్వం)



డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి దేవాలయ పునర్నిర్మాణ ప్రక్రియలో నిష్ణాతులు. ఆలంపురం, సోమశిల, నల్గొండ, రామప్ప దేవాలయాల పునర్నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పురావస్తు శాఖలో స్థపతిగా పనిచేసి పదవీ విరమణ చేసారు. గౌతమీపుత్ర శాతకర్ణి, కొండవీటి రెడ్డిరాజులు, మనము వంటి అనేక చారిత్రక గ్రంథాలు, శాసన విషయ పరమైన గ్రంథాలు 150కి పైగా రచించారు.

ప్రయాణం

అన్వర్

ప్రతిరోజో, ఏదో ఒకరోజో ఎక్కడికో ఒకక్కడికి ప్రయాణమవు తారు కదా, ఆ ప్రయాణం గురించి మాట్లాడుకుందాం. మీరు నడుస్తారో, కారెక్కుతారో, మోటారు సైకిల్ నడుపుతారో మీ ఇష్టం. ఇక్కడ ప్రయాణం ముఖ్యం. ఆ గమనం గురించి మాట్లాడు కుందాం. తిన్నని చక్కని రోడ్డు. ఎత్తుపల్లాలు, ఎగుళ్లుదిగుళ్లు, మలుపులు, మెలికలేమీ లేని సాపయిన రోడ్డు. నీటయిన నాలుగు లైన్ల రోడ్డు. చేస్తున్న ప్రయాణం మొత్తానికి మీకు అక్కడ ఒట్టి రోడ్డు మాత్రమే ఉంది. హాయైన ప్రయాణానికి మంచి తారురోడ్డుకన్నా మరింకేం కావాలి? అంత చక్కని దారిమీద ఆ వేపుగానీ, ఈ పక్క గానీ, ఒక చెట్టుకానీ, ఒక దిబ్బకానీ, గుట్టమీద ఇంత గడ్డికానీ, మైదానం మీద అంత పసిరికకానీ, నేలమీద పురుగు కానీ, ఆకాశాన ఒక పిట్టకానీ ఎటువంటి అంతరాయం లేనీ, నల్లని పొడవాటి రోడ్డది. ఆ దారి దిగంతం వరకు కనపడే ఆకాశం నీలంగా లేకపోతే మరీ మంచిది. నల్లని రోడ్డు- తెల్లని ఆకాశం. గమ్యం-గమనం తప్పా మరేం అనవసరం, అడ్డం లేని ప్రయాణం. ఇట్లాంటి ప్రయాణాన్ని ఒకసారి ఊహించండి. బోరుకు కూడా బోరుకొట్టి ఎక్కడైనా రాయి కనబడితే తలబాదుకుని చచ్చిపోదామనుకున్నా రాయి కూడా కనపడని ప్రయాణం చేస్తే ఎలా ఉంటుందంటారు?

మళ్లీ ప్రయాణం దగ్గరకు వద్దాము రండి. ప్రయాణం అంటే అదేదో, మరేదో కాదు. ప్రయాణం పేరు పెట్టి ఇక్కడ నేను మీకు



చెప్పదలుచుకున్నది ఏమిటంటే- అది ప్రయాణం కానివ్వండి, పుస్తకం చదవడం అవనీవండి. కిటికీ పక్కని సీటులో కూర్చొని అక్కడి నుంచి చూస్తే కనపడే ఇంత చల్లని మబ్బు దాని వెనుక అంత నీలాకాశం, దాన్ని కొలత వేసుకుంటూ వెళుతున్న ఒక పక్షి. దారి మధ్యలో కనపడే ఒక టీ కొట్టు, బండి చక్రాలకు గాలి కొట్టే దుకాణము, తలలూపుతూ రివ్వున వెనక్కి వెళ్లిపోయే చెట్ల వరుసలు లేకపోతే ప్రయాణం ఎంత నిస్త్రాణంగా, నిస్సారంగా, నీరసంగా ఉంటుందంటారు. అటువంటి రసహీన ప్రయాణంవంటిదే అలంకారలేమిగా అచ్చయ్యే పుస్తకం.

ఇప్పుడిప్పుడే బడి ఒడిలో పాఠాలు నేర్చుకోవడానికి కుదురుకున్న చంటివాళ్ల దగ్గరి నుండి, కాలక్షేపానికి పత్రికలు తిరగేసే వాళ్ల దగ్గరి నుండి, కొనుక్కున్న కొత్త కారు తాలూకు మెకానిజం మాన్యువల్ని కుస్తీపడదామని తిష్టవేసి కూర్చొన్న వాళ్ల దగ్గరి నుండి అనేకానేకానేకులకు అనేక రూపాలలో ఉన్న అక్షరాల కూర్పు, పంక్తుల వరుసల వెంట చకచకా మీ కళ్లు, ఆలోచన, మనసు, మస్తిష్కం పరుగులు తీయడం కూడా ఒక రకమైన ప్రయాణమే. ఒక బొమ్మ, ఒక పువ్వు, ఒక తీగ, కొంత సందర్భం. కొంత సన్నివేశం, ఒక మొహం, రెండు చిలకలు... ఇలా బొమ్మల రూపంలో ఉన్నవి, ఆకారంగా కనపడేవి మాత్రమే కళ కానక్కరలేదు. వ్యాసానికి, కథకూ, పాఠం శీర్షికలకూ వాడిన ఫాంట్ వైఖరి, దాని పరిమాణం పెద్దగానో, చిన్నగానో కనపడడం, ఆ శీర్షికను నిలువుగానో, అడ్డంగానో, ఏటవాలుగానో అమర్చడం, దాని కింద ఒక గీత గీయడం, దానిని రివర్స్ కలర్‌లో ప్రింట్ చేయడం కూడా కళే.

అక్షరాల వెంట పరుగులు తీసే కంటి చూపుకి కాస్త ఉపశాంతిని, ఊరటను, ఒక కొత్త ఆలోచనను ఇవ్వడమే అక్షరానికి బొమ్మ అనే అలంకారానికి ఉన్న సంబంధం. మానవుడనేవాడు సముద్రతీరం వెంట పచ్చి ఇసుక మీద నడిచినపుడో, నీటి నుండి బయటికి వచ్చి రాయిమీద అడుగిడినపుడో పడిన పాదముద్ర ఒక చిత్రకళ. అదిమ మానవుడు తను వేటాడే జీవాన్నీ, విసిరిన బల్లెంని బొమ్మరూపంలో పసిగట్టక ముందు ఆ గుహ గోడలమీద పడ్డ అతని చేతిముద్ర కూడా అదిమ చిత్రకళే. బొమ్మల కళకు చాలా కాలం తరువాతే భాష పుట్టింది. కొబ్బరిచెట్టు అనేది ఒక భాషలో 'నారియళ్ పేడ్' అయింది. మరో భాషలో 'తెన్కాయ్ మరం' అనబడింది, ఒక ప్రాంతంలో అది కోకనట్ ట్రీ , మరోచోట 'ఆల్బెరో డి కోకో.' భాష తన లిపిని, శబ్దాన్ని, పలుకుల విరుపును రకరకాలుగా మార్చుకున్నా బొమ్మల భాషలో కొబ్బరిచెట్టు కొబ్బరి చెట్టుగానే మిగిలిపోయింది. ఒక్క చెట్టు మాత్రమే కాదు. మనిషి, పశువు, పులుగు, పిట్ట, కొంప, గుడ్డు, ఈక, చాకు అన్నిటి ప్రపంచ భాష- బొమ్మల భాషే. బొమ్మను చూసేవాడికి కన్నులు ఉండాలి అనే ఒకే ఒక్క షరతుకు లోబడి. ఇంత ఇదిగా బొమ్మని వెనకేసుకుని రావడానికి మరీ ఇంత గస పోసుకుంటూ చెప్పనక్కరలేదు, ఆఖరుకి మనం మొబైల్‌లో రోజూ సవాలక్షసార్లు వెతుక్కునే అప్లికేషన్ల ఆచూకీని, వాటి పేర్లని, అక్షరాలనిబట్టికాక ఆకారాలని, బొమ్మల్ని బట్టి మాత్రమే తెలుసుకుంటామనేది మీరు గమనించని సత్యం.

నడుస్తున్న బ్రతుకు ఎట్లా ఉన్నా ఏదో ఒక రూపాన అందులోకి కాస్త ఆనందాన్ని నింపుకోడానికి మానవుడు తనకు వీలయినంత ప్రయత్నం చేసినట్లే, ఒక పుస్తకంలోకి అందం ఇవ్వడానికి, అక్షరాల మధ్య సౌందర్యం చూపడానికే చిత్రకళ ప్రయత్నం చేస్తుంది. ఆకారం మాత్రమే ఉన్న నల్లని అక్షరాలను, పంక్తులను చదివే కంటికి మాత్రమే అందే సుగంధం అద్దడం బొమ్మ చేసే అలంకారపు ముచ్చట. అక్షరం నుదుటన దిద్దే సౌందర్య తిలకమే బొమ్మ. తెలుగు కథ అనే ఒక కథాసంకలనానికి బాపుగారు వేసిన బొమ్మ ఒకటి గుర్తు చేస్తాను. కథాపుస్తకంలో (అద్దంలో కాదు) తన మోము తాను చూసుకుంటూ నుదుటిన బొట్టు దిద్దుకుంటుంటుంది తెలుగమ్మాయి. నిర్వచనాలకు అందని తెలుగుతనం అది.

బొమ్మ మహా చమత్కారి కూడా. ఒక కథకు ఎర్ర గులాబి అని పెట్టిన శీర్షిక అక్షరాల మీదుగా ఎర్రని హృదయాకారపు రేకులు ఎగురుతుంటాయి. అప్పుడది ప్రేమకథ అవుతుంది. అదే గులాబి ఎరుపు అక్షరాల కిందుగా రక్తపు బిందువులు జారుతుంటాయి అనుకోండి, మరిక అది నేరాల ఘోరాల రకం కథ అని చెప్పకనే తెలిసిపోతుంది. శీర్షిక చెప్పని, చెప్పలేని అసలు విషయపు ఆకర్షణ, ఆసక్తి కళ అందిస్తుంది. ఆచూకీ అనే కథ ఉంటుంది. శీర్షికలోని 'కీ' అనే అక్షరపు గుడిదీర్ఘాన్ని తాళం చెవిగా మార్చాడు చిత్రకారుడు. కథలో పోయిన తాళం చెవి గురించి జరిగిన అన్వేషణే ఈ కథ అనే సూచనామాత్రపు అలంకారం ఎంత చమత్కారంగా ఉంటుందో చూస్తే కానీ తెలియదు. ఒక కథలో చంటి పిల్లవాడు చాలా గట్టిగా ఏడుస్తున్నాడు అని రాసి ఉందనుకోండి, ఊరకే ఆ వాక్యాన్ని చదవడం వలన మీకు వాడి ఏడుపు ఎంత గట్టిగా ఉన్నదనేది వినపడదు. ఒక బొమ్మ మాత్రమే మీ చెవులవరకు వాడి ఏడుపులోని తీవ్రతను చేరుస్తుంది. బొమ్మలో ఒక పిల్లవాడు పెద్దగా నోరు తెరిచి శోకాలు పెడుతుంటాడు. ఇంటి గోడలు కూలిపోయి ఉంటాయి, పైకప్పు ఎగిరిపోయి ఉంటుంది, అమ్మా నాన్న చెరో దిక్కున కొట్టుకుపోతూ ఉంటారు. వాడి శోకం కార్చిన కన్నీరులో చేపలు ఈతలు కొడుతుంటాయి.

చదివే పేజీలలో ఒక వాక్యం మనలని ఆలోచింపచేస్తుంది. బొమ్మ ఆ ఆలోచనకు పదును పెడుతుంది. కథ మిమ్మల్ని నవ్విస్తుంది. దాని బొమ్మ మీకు చక్కిలిగింతలు పెడుతుంది. ఒక యుద్ధపు కవిత మిమ్మల్ని దుఃఖపెడుతుంది. ఆ కవితకు వేసిన బొమ్మలో తూటా దెబ్బకు కూలిన చంటి పిల్లవాడి తెరుచుకున్న నోటి దగ్గర ఎగురుతున్న ఈగ బొమ్మ తాలూకు ఝంకారం మీలో యుద్ధం అంటే ద్వేషం, అసహ్యం. మానవాళిపట్ల కరుణను, జాలిని, ఆర్తిని పెంపొందిస్తుంది. బొమ్మ వెనకాల వకాల్తా నిలబడి ఉదాహరణ సోదాహరణలతో ఎంతైనా చెప్పుకుంటూ పోవచ్చు. ఒక్కోసారి అక్షరం తను చెప్పవలసినదానిని కూడా చెప్పలేక అంతమైన దగ్గర బొమ్మ పాఠకుడి భావనాకాశంపై ఎగరేసిన గాలిపటం దిక్కులకు కొత్తదారి తీస్తుంది.

ఒకప్పుడు అనే రోజుల్లో మాకు పుష్కలంగా పుస్తకాలు ఉండేవి. పుస్తకాల సంచి తెరిస్తే క్లాసు పుస్తకాలు. ఆ క్లాసు పుస్తకాలు తెరిస్తే వాటిలో దాచుకున్న కథల పుస్తకాలు. సినిమాకి వెళితే





థియేటర్ బయట పాటల పుస్తకాలు. పాటలు. కథలు నవలలు అంటే పెద్దగా ఆసక్తిలేని పిల్లలకు ముప్పై రోజుల్లో బ్రూస్‌లీ అవ్వాలని ఉండేది. వాళ్ల పరమ ఇష్టంగా ఆ కరాటే పుస్తకాలు చదివి వాటిల్లోని బొమ్మలు చూపించిన విధంగా చేతులు చాచి, చేతులు మడిచి, కాళ్లు, పిడికిళ్లు గాల్లోకి ఎగరేసి హియ్యా కియ్యా అని అరిచేవాళ్లు. ఇంట్లో ఆడవాళ్ల కోసం ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి. సచిత్ర పత్రిక, వనితలనే పత్రికలనేకం ఉండేవి . కోళ్లు పెంచే వాళ్ల కోసం కోడిశాస్త్రం పుస్తకాలు కూడా ఉండేవి. అందులోనూ బొమ్మలు ఉండేవి. బస్సెక్కుదామని బస్సుస్టాండ్‌కు, రైలెక్కుదామని రైల్వే స్టేషన్‌కు వెళ్లినపుడు అక్కడ రైలు, బస్సు సమయానికి రాకపోయినా కిటకిటలాడుతూ, రెపరెపలాడుతూ లెక్కకు మిక్కిలిగా పుస్తకాలు ఉండేవి. ఆ పుస్తకాలు తిరగేసుకుంటూ మేము ఎక్కాల్సిన రైలు ఒక జీవితకాలం లేటయ్యేలా చూడు దేవుడా ప్లీజ్ అని దేవుడికి మొక్కునేవాళ్లం. ఆ బస్సు, రైలూ ఆగే చోట్ల అదీ ఇదీ అనికాదు అనేకరకాల పుస్తకాలు ఉండేవి. రైల్వే స్టేషన్‌లో పుస్తకాలు జాతీయసమైక్యతని చాటేవి. అన్ని భాషల, అనేక వర్గాల, అనేకానేక సైజుల్లో మంచీ, చెడూ, దైవం, దెయ్యం. బూతు, హింసా, భయం, పిల్లా, పెద్దా... విషయాలు అన్నీ పుస్తకాలుగా ఉండేవి. ప్రయాణానికి వాహనం ఎక్కిన సగంమందికి పైగా జనం పుస్తకాలు కొనేవారు, వాటిని చదివేవారు, అరువు ఇచ్చేవారు, గాలి ఆడకపోతే వాటితో విసురుకునేవారు. ఇంకా ఎంతో అదృష్టం గా ఆరోజుల్లో సోవియట్ ప్రచురణలు తెలుగులో వచ్చేవి. ఎంత మంచి పుస్తకాలు, ఎంత మంచి బొమ్మల కాలమో అది. రాతా గీత పోటాపోటీగా ఉండేది. చూడ్డానికి మాత్రమే ఖరీదుగా కనపడే ఆ పుస్తకాలు పావలా, అర్ధ రూపాయలకు కూడా వచ్చేవి. నోట్లో కరిగిపోయే చాకలెట్లకన్నా అదే ధరకు వచ్చే ఆ రంగులబొమ్మల పుస్తకాలను చప్పరించడానికే మనసు ఒగ్గేది. ఒక తరానికి అల్లా రష్యన్ సాహిత్యం చేసిన సాయం అంతాఇంతా కాదు. తొలుత మా ప్రేమ అంతా పుస్తకాలు చదవడం మీదనే ఉండేది. చదివీ చదివి కథలన్నీ చదివేసిన తరువాత కూడా మాకు చాలా సమయం ఉండేది. అప్పుడు ఆ చదివిన కథల తాలూకు బొమ్మలు కాపీ చేసేవాళ్లం. వాటి ప్రేరణతో మనం కూడా కథలు రాయాలని, వాటికి మనమే బొమ్మలు వేయాలని ఆ పనులు కూడా మొదలెట్టాము. అప్పటికి ఎంత, హైస్కూలు వయసే మాది.

మా చిన్నతనంలో బొమ్మలు గీసేవాళ్లు అంతా దేవతల బొమ్మలని ఖచ్చితంగా గీసేవాళ్లు. అతి కష్టమైన వేంకటేశ్వరస్వామి బొమ్మ దగ్గరి నుండి, ఝాన్సీ లక్ష్మీబాయ్, తాంతియా తోపే, హనుమంతుడు, చేతులు చాచి శిలువమీద యేసు ప్రభువు, గణపతి దేవుడు , ఎన్టీఆర్, మక్కా, మదీనా, భగత్‌సింగ్, కొండల మధ్య ఉదయించే సూర్యుడు... ఇలాగా అన్నమాట. అయినా స్కూలు, క్లాసు మొత్తానికి బొమ్మల్ని బాగా వేసేవాళ్లు తక్కువే ఉండేవారు, బొమ్మల్ని ప్రేమించే వాళ్లు చాలా ఎక్కువ ఉండేవారు. బొమ్మలు వేయడం చేతకానివాళ్లు సైతం సినిమాపత్రికల ముఖ చిత్రాలమీద అచ్చయ్యే ఆడతారలకైతే మీసాలు, మగ పురుషులకైతే బుర్రమీసాలు, కళ్లద్దాలు, పొడవు గడ్డాలు దిద్దేవారు. కాలేజీలో అడుగుపెట్టాక క్లాసు క్లాసునిబట్టి కాక కాలేజీ మొత్తానికి కూడా బొమ్మలు వేసేవారు ఒకరిద్దరు మాత్రమే కనపడేవారు. బొమ్మలంటే ఆసక్తి చూపేవారు కూడా తక్కువే. ఇక ఉద్యోగంలోకి వచ్చి పడ్డాక సంసారులు, ఉద్యోగస్థులు అనే జాతి దగ్గర నూటికి నూరు శాతం ఎవరికీ బొమ్మల మీదకానీ, బొమ్మల విషయంపట్లకానీ, వాటి రీతులు, గీతలపట్లకానీ ఆసక్తి శూన్యం. వయసు పెరిగేకొద్దీ మనిషి రసహీనమై వట్టి కట్టెలా ఎండుపేడులా మిగిలిపోతాడు. వాడిలో ఏది చివురించదు. పలకదు. ఎప్పుడయినా రూపాయి నాణెం కిందపడ్డ చప్పుడయితే మాత్రం గబుక్కున లేచి జేబులు తడుముకుంటాడు. ఒళ్లు సహకరించుకున్నా దానిని వంచి మరీ సోఫా క్రిందకు దూరి అక్కడ పడ్డ నాణాన్ని జయిస్తాడు.

నాకు సాహిత్యం అంటే మీదు మిక్కిలి బాలల సాహిత్యమే. రాబోయే కాలంలో మంచని, దొడ్డని, నాలుగుకాలాలపాటు మన గలిగేది ఏది జరగాలన్నా ముందు పసిప్రాణాల దగ్గర మొదలవ్వవలసిందే. మౌఖిక కథలు వినడం దగ్గరి నుండి, బాలల కథా సాహిత్యం చదువుకోవడం దగ్గరి నుండి, రేడియోలో వచ్చే అనేకానేక కార్యక్రమాలు, గేయాలు, రూపకాలు, నాటకాలు అన్నిటినీ శ్రద్ధగా

వినేది, గమనించేది, అనుకరించేది, ఆచరణలో పెట్టేది పిల్లలు మాత్రమే. అస్తమానూ ఊరికే మొబైల్ చూస్తున్నారు అని ఇప్పటి పిల్లలమీద పెద్దలు విసుక్కుంటారు కానీ, శ్రద్ధగా గమనిస్తే ఆ పిల్లలు వాటిలో చూసేదల్లా ఏ కార్టూన్ బొమ్మలో, హస్తకళలకు సంబంధించిన కార్యక్రమాలు మాత్రమే ఉంటాయి. నిజానికి మొబైల్‌లో, టీవీల్లో పరమ చెత్త చూసేదీ, వినేది, చదివేది పెద్దలు మాత్రమే.

ఇంతకుముందే చెప్పాను మా చిన్నతనంలో బడి మొత్తానికి బాగా బొమ్మలు గీసేవారు, ఆసక్తిగా బొమ్మలు గీసేవారు చాలా తక్కువగా ఉండేవాళ్లు. మహా అంటే ముగ్గురూ నలుగురు మాత్రమే. ఈరోజు చూస్తే మా బంధువుల ఇళ్లల్లో చాలామంది పిల్లలు చక్కగా బొమ్మలు వేస్తున్నారు. చాలా చక్కగా వేస్తున్నారు. నా బాల్యంలో నేనుకాక నా చుట్టూ మా చిన్నాన్నల పిల్లలు, అత్తా మామల పిల్లలు, ఇంకా ఇరుగూ పొరుగూ నేస్తాలు లెక్కకు మించి ఉన్నప్పటికీ ఎవరికీ బొమ్మలు వేయడంపట్ల పెద్ద మోజు ఉండేది కాదు. ఎవరైనా బొమ్మలు వేస్తూ ఉంటే కాసేపు ఆసక్తిగా మాత్రం చూసేవారు. ఇప్పుడు నేను కాపురం ఉండే ఇంటి దగ్గర బొమ్మలు వేసే చిన్నవాళ్లున్నారు. ఒక ఇంట్లో ఇద్దరు అన్నదమ్ములు ఉంటే ఇద్దరూ బొమ్మలేస్తున్నారు. నలుగురు మిత్రులు ఉంటే నలుగురూ బొమ్మలు వేస్తున్నారు. ప్రతి ఒక్కడు బొమ్మలు వేస్తున్నారు. ఒకరి ద్వారా ప్రేరితమై మరొకరు బొమ్మలు వేస్తున్నారు, ఒకళ్ల బొమ్మలని ఒకళ్లు మెచ్చుకుంటూ బొమ్మలు వేస్తున్నారు. ఏ సాయంత్రమైనా వారికి కథలు చెబుతాను రండి అంటే సాయంత్రమెప్పుడెప్పుడవుతుందా అని కథలు పుట్టే సాయంత్రంకోసం ఎదురుచూస్తూ కూర్చొంటున్నారు. మొత్తానికి పిల్లలు చాలా బావున్నారు, వాళ్లు ఎన్నుకున్న బొమ్మలే అదోలా ఉంటున్నాయి.

అయితే ఈ రోజు పిల్లల పసి కలల్లోకి పేదరాశి పెద్దమ్మ, గండభేరుండ పక్షులు, వాటి కాళ్లకు అంటుకున్న వజ్ర వైఢూర్యాలు, ముగ్గురు ముసలి మంత్రగత్తెలకున్న ఒకే ఒక ఒంటికన్ను, అప్రతిహతం అనే ఖడ్గం, పంచకళ్యాణి అనే గుర్రం, చిన్న గడేజంగ్ అనే కోయ యోధుడు, పద్మపాదుడు అనే మహామాంత్రికుడు, కర్పగవల్లి అనే ఓడ, సవిత్రికుడనే సుందరాంగుడు, ముప్పది రెండు పాల భంజికలు కథలు చెప్పే సింహాసనం, వాతాపి అనే మేకమాంసం, సమయస్ఫూర్తి అనే ఒక తెలివైన యువకుడు, పరోపకారి పాపన్న అనే మంచివాడు, కువలయేశ్వరి అనే అందాల చిన్నది, మణి సిద్దుడు- గోపాలుడు అనే గురుశిష్యులు, లబోదిబో అనే అన్నదమ్ములు... వీళ్లు ఎవరూ రావడంలేదు. పిలల్ల చదువులో, వాళ్ల సంభాషణల్లో, వారు చూసే టెలివిజన్ కార్యక్రమాల్లో, వారు గీసే బొమ్మల్లో మంకీ డి లూఫీ, నారూటో ఉజుమకి, గోకూ, కకాషి హటాకే, హ్యారీ పాటర్, రాన్‌వీస్లీ, హెర్మోని గ్రాన్జర్, ఆల్బస్ డంబల్ డోర్, లూనా లవ్ గాడ్, రూబెస్ హ్యాగ్రిడ్, వోల్డే మార్ట్... గట్రా గట్రాలు మాత్రమే నిండి ఉన్నారు. వాళ్లని అని తప్పేముంది? వారికి అందుబాటులో ఏదైతే ఉందో దానిని మాత్రమే వాళ్లు తమవిగా భావిస్తున్నారు. ఇంటిలోని టీవీ స్క్రీన్‌ల మీదేకాదు నోటు పుస్తకాల కవర్‌లమీద, స్కూలు బ్యాగులమీద అవే బొమ్మలు కనపడుతున్నాయి. వ్యాపార ప్రపంచం దేనివైపు వేలెత్తి చూపిస్తుందో దానినే వాళ్లు ఆర్ట్ అనుకుంటున్నారు. విదేశీకమైన చిత్రం ఎంత బావున్నా అది మనది కాదు. మన ఆచార్య వ్యవహారాలు, మన జీవనసరళి మీద దిగుమతి చేసుకున్నదేదీ మనమీద పనిచేయదు. మన ఆలోచనని ప్రభావితం చేయదు. మనల్ని మనగా ఉంచదు. మెలకువ సంగతిసరే, కలల్లో కూడా పిల్లలు పరాయిభాషలో మాట్లాడుతూ, పరాయిభాషలో ఆలోచిస్తూ పరాయిబొమ్మలని నేర్చుకుంటూ ఉండటమనేది కాస్త ఆందోళనగా అనిపిస్తుంది.

వ్యాపారం తప్పేమీ కాదు. డబ్బు పాపిష్టిదసలే కాదు. కొన్ని లెక్కలు ఉండాలి. కొంత హృదయం ఉండాలి. ఒకరకమైన మంచితనం ఉండాలి. వ్యాపారస్తుడికి కూడా ముందుతరాల కొరకు మామిడిటెంకలు నాట చూసిన ముసలితాత మనసులోని తీపి ఉండాలి (తరాలు అంటే తమ తమ మనవళ్లు, మునిమనవాళ్లు అనికాదు భావం) డబ్బు గలవాడు కళమీద వ్యాపారం చేసినా తప్పు లేదు. కనీసం దానివలన కళ బ్రతికి ఉండేట్లు చూసుకోగలగాలి. కళ అనేది ఆరిపోని దీపంలా వెలుగుతూ ఉండాలి. ఒక దీపం మరిన్ని దీపాలని వెలిగించాలి. నాకు తెలిసిన ప్రపంచంలో నాగిరెడ్డి చక్రపాణిగార్లు అదే చేశారు. వారు చందమామని దివి నుండి భువికి దింపారు. చందమామ మొహాలవంటి పసిపిల్లల దగ్గరి నుండి నెల వంకలా నోరేసుకుని నవ్వే బోసినోళ్ల తాతయ్యా, అమ్మమ్మల వరకూ అందరికీ చందమామని శాశ్వతం చేశారు. ఈరోజు నాగిరెడ్డి చక్రపాణిగార్లు లేరు. కుటుంబరావు, వడ్డాది పాపయ్య, చిత్ర, శంకర్, దాసరి సుబ్రహ్మణ్యంగార్లు, ఇంకా పేర్లు తెలియని తదీతరులు అనేకులు ఎవరూలేరు. కానీ వాళ్లు వెలిగించిన చందమామ తరతరాలుగా వెలుగుతూనే ఉంది. అది ఇంకా ఎంతకాలం వెలుగుతుందో తెలియదు. ఒక చందమామ ఇంకా బోలెడన్ని నక్షత్రాలని కూడగట్టి ఉండాల్సింది. మనదగ్గరే అవెందుకు ఆరిపోయాయో. ఇక్కడే ఇంత చీకటి ఎందుకు అలుముకుని ఉందో, ఈచోటునే ఇంత నిరక్షరాస్యత ఎందుకు ఉందో తెలియదు.

ఈరోజు ఇక్కడ మనకంటూ మనదంటూ చెప్పుకోవడానికి, మనది అని గర్వపడటానికి ఏమీలేదు, మనకు లేనిదానిని మన పిల్లలకు ఏమని ఇస్తాం? గోంగూర మనది, ఆవకాయ మనది అని గర్వంగా లొట్టలు వేసుకునే దగ్గరే, పొట్ట దగ్గరే మన గమనం ఆగిపోయింది. మనసు దగ్గరికి మన ఆలోచన సాగడంలేదు. మనసుకు మంచి చదువునివ్వాలి, మంచి సంగీతాన్ని, మంచికళని పరిచయం చేయాలి. మనసుకు ఆరోగ్యాన్నివ్వాలి అనే సోయే మనకులేదు. మన వంటిళ్లల్లో నానారకాల ఊరగాయాలకు చోటున్నది కానీ, నాలుగు పుస్తకాలకు, అందులోనూ ఒక బొమ్మల పుస్తకానికి మన ఇంటిగూళ్లల్లో చోటు చాలదు. ఏ రవివర్మ బొమ్మలోని సితార్ గాయని మన గోడమీద సంగీతం వినిపించదు. ఏ ఎన్.ఎల్. హాల్దాంకర్ బొమ్మలోని స్త్రీమూర్తి వచ్చి వచ్చి మన హృదయాలలో దీపం వెలిగించదు.

మన నాటకాలు, మన బుర్రకథలు, మన తోలుబొమ్మలాటలు, మన యక్షగానాలు, మన గొల్లసుద్దలు, ఒగ్గుకథలు మాయమయినట్లుగా బొమ్మ కూడా ఇప్పుడు మిగిలేమీలేదు. మిగుల్చుకోవాలని లేని మనుషుల దగ్గర, దాచుకోవాలని స్పృహ లేని జాతి దగ్గర నేను నీదానిని అని అది అంటుకుని కూచోదు. పద్యం

తెలుగువాడి సొత్తు అని ఒకప్పుడు గర్వపడేవాళ్లు ఇక్కడ. ఇది అవసరంలేదు, అది అవసరంలేదు అని తెలుగు అక్షరాలని కొన్నిటిని కత్తిరించి పడేసినట్లుగా పద్యాన్ని తగలేశారు. తేటగీతి, ఆటవెలది అనే మాటలు వినపడితే మీరేమట్లు అని సమకాలీన సాహితీలోకం అనుమానంగా, అసహనంగా ముక్కు మూసుకుంటుంది. ముక్కు మూసుకున్న చోట మల్లెపూవు మంచి గంధం మాత్రం ఎందుకు ఉంటాయి. ఏం వాటికి మాత్రం ఉండవా ఆత్మాభిమాన స్వీయ గౌరవాలు?

మరైతే ఏం చేయాలి? అని ఎవరూ అడగకపోయినా నేను చెప్పడానికే చూస్తాను. నా ఉద్దేశంలో బాలసాహిత్యానికి మించి మరే సాహిత్యం లేదు. మంచి సాహిత్యానికి అల్లిన బొమ్మలకు మించి మరే గొప్ప బొమ్మలేదు. సాహితీక్షేత్రంలో అన్నింటికన్నా ముందుగా ముఖ్యమైనది పిల్లల సాహిత్యం. ముందు దానిమీద శ్రద్ధ పెట్టకుండా, పిల్లల మెదళ్లకు అవసరమైన పోషకాలు ఇవ్వకుండా వదిలేస్తే వచ్చేదంతా అసందర్భ సాహిత్యమే. దాని వెనుక నిలబడి జెండా మోసే పనికిమాలిన బొమ్మల కళే. ఒక చిన్న పిల్లవాడికి ఆనందం ఇవ్వలేని తోక పోయి కత్తి ఢాం ఢాం ఢాం అనే సులువు కథ రాయలేనివాడిని, నలుగురు పిల్లలు కలిసి బుజ బుజ రేకుల పిల్లుందా? బుజ్జా రేకుల పిల్లుందా అని సంబరంగా పాడుకోలేని గేయం రాయలేనివాడిని, వీటికి చూడ చక్కని బొమ్మలు వేయలేనివాడిని నేనేం రచయితని, నేనేం చిత్రకారుడిని అని సాహితీకారుడు తనని తాను ప్రశ్నించుకోవాలి.

కేవలం ఒక అయిదు రూపాయల దినపత్రిక, ఒక పాతిక రూపాయల వారపత్రిక పేజీలలో చోటు చేసుకోలేకపోతున్న బాల సాహిత్యం, దాని తాలూకు బొమ్మలు ఏమని బట్టకడతాయి? ఎలాని తమని తాము నిరూపించుకుంటాయి? ఆదివారం అనుబంధ పేజీలలో పిల్లల కథల పేరిట వచ్చే ఊకకు, తుప్పుకు, కనీసం ఒక్కరైనా పాఠకుడు ఉన్నాడా అని నాకు అనుమానమే. ఈ తెలుగునాట అప్పుడెప్పుడో ఒకే ఒక రేడియో అన్నయ్య పుట్టాడు. అప్పటి పిలలకు పాటయ్యాడు, నోట మాటయ్యాడు, నడిచే పూలతోటయ్యాడు. ఆ తోటలో రెక్కలు విప్పి రెపరెపలాడిన సీతాకోకచిలుకలన్నీ ఆ తరువాత తెలుగు వెలుగులయ్యాయి. పిల్లల సాహిత్యంమీద శ్రద్ధ పెట్టిన పుణ్యానికి, ఆ కుదురుకు, తెలుగు సాహిత్యం, తెలుగు ఆట, తెలుగు బొమ్మ, తెలుగు పాట దేదీప్యమానంగా వర్ధిల్లింది. ఏది అట్లాంటి మరో మనిషి, మరో సంస్థ, మరో పత్రిక, మరో పూదోట, మరో తరం? నేను ఎప్పటికీ గట్టిగా నమ్మేది ఒకటే, ఎక్కడైతే ప్రత్యేకంగా పిల్లల కోసం మాత్రమే పని జరుగుతుందో, వారి కొరకు మాత్రమే సినిమాలు, సాహిత్యం, రాతలు, గీతలు, ఆటలు, పాటలు, పరిశోధనలు జరుగుతాయో. ఆ ఫలితాలలో నుండి వచ్చినవారు మాత్రమే కళని, సంస్కృతిని, జాతిని, మనదైన ప్రత్యేకతని ముందుకు తీసుకుపోగలరు, ఒలింపిక్ జ్యోతి ఒక చేతి నుండి మరో చేతికి అందించబడ్డట్లు.

కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన అని చిన్నతనం నుండి విన్నట్లు అందుకని పనిచేసేవాడు మరింత పనిచేయాలి. డబ్బున్నవాడు తన దగ్గరి వంద రూపాయలలో పావలా డబ్బులు ఈ వికాసానికి మనస్ఫూర్తిగా సమర్పించుకోవాలి. కళనికానీ, సంపదనుకానీ పోగు చేసుకుని అటక మీద దాచుకోరాదు. చేరాల్సిన చోటికి వాటిని చేర్చడానికి ప్రణాళికలు రచించబడాలి. బళ్లల్లో సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకునే వర్క్స్ షాపులు జరగాలి. ముందుగా చెప్పుకున్నట్లు బడి మొత్తానికి అద్భుతంగా రాయగలినవారు, గీయగలిగినవారు, పాడగలిగినవారు, ఆడగలిగినవారు ఇద్దరో ముగ్గురో కనాకష్టంగా అయిదుమందో ఉంటారు. పది బడుల నుండి ఒక పాతికా యాభైమంది పిల్లలని ఎన్నుకుని వారికి కళలో మెళకువలు, మర్మాలు నేర్పాలి. మొదట్లో ఏదయినా చిన్నగానే మొదలవుతుంది. మహా శ్రీశ్రీశ్రీ తంగిరాల శంకరప్పగారి సూత్రం ప్రకారంగా చదరంగపు మొదటి గడిలో ఒక వడ్లగింజ మాత్రమే మెదలవచ్చు. రెండో గదిలో రెండు, మూడో గడిలో నాలుగు, నాలుగో గడిలో ఎనిమిది... ఇలాగ వెళ్లినకొద్దీ పని, పని మంతులు రెట్టింపు అవుతారు.

చేసే ప్రతి పని మన జేబులోకి ఎంత బరువు తెస్తుంది అని లెక్క పెట్టడం మానెయ్యాలి . కళ మీ గుండెల్లోని బరువుని దింపేసి ఎంత తేలిక చేస్తుందో అని మాత్రమే చూడాలి. వ్యక్తిగతంగా మన ఖాతాలో ఉన్న అంకెలు. సంఖ్యలు, మన ఇళ్ల, స్థలాల దస్తావేజులు, ఇంటి ముందు నిలబడ్డ కార్లు, ఇంటి వెనుక ఉద్యానవనాలు సంగతి సరే. ఒక జాతి మొత్తంగా మనం సంపాదించుకున్నది ఏమిటి అని చూసుకోవాలి. తలదించుకునే వరుసలో ఉన్నమా? తలెత్తుకునే వరుసలో ఉంటామా అని మనకు మనమే నిర్ణయించుకోవాలి. లేకపోతే దశాబ్దాల క్రిందట గొప్ప సంపాదకుడు శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు ఒక ప్రశ్న అడిగినట్లుగా, "ఇంతకీ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ల తరువాత కూడా మనకు కావలసిన కామిక్స్, కార్టూన్లు, బొమ్మల పుస్తకాలు తయారు చేసుకోలేక పోతున్నాము. సారే జహాసే అచ్చా ఎలా అవుతుంది?" అనే ప్రశ్న ఇంకొన్ని దశాబ్దాల తరువాత కూడా మనకు ఎదురవుతూనే ఉంటుంది.



రాయలసీమ ప్రాంతపు నూనెపల్లె గ్రామానికి చెందిన అన్వర్ బ్రతుకుతెరువు నిమిత్తం హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. బాల్యం నుండి కథాపుస్తకాలన్నా, బొమ్మలన్నా ఆసక్తి. అడపాదడపా చిన్న చిన్న వ్యాసాలు రాస్తారు. జీవిత కథాంశపు కదంబం 'అనగనగా ఒక చిత్రకారుడు' పుస్తకం ప్రచురించారు.

తెలుగుభాష వికాసం - కథ, నవల

కాసిరెడ్డి నవీన్

భావవ్యక్తీకరణకు భాష ప్రధాన సాధనం. మనిషి బహిరంత ర్లోకాల ప్రకంపనలను రికార్డు చేసేది భాష. ఇది సర్వకాల సర్వావస్థల్లో ఒకేరకంగా ఉండదు. కాలానుగుణంగా మారుతూనే ఉంటుంది. అద్దంకి పండరంగడి తరువోజ పద్యశాసన కాలంనాటి లేదా బెజవాడ యుద్ధమల్లుడి శాసనకాలంనాటి భాషను మనం ఇవ్వాళ వాడటంలేదు. అంతెందుకు, వందేళ్లనాటి భాష స్వరూపానికి నేటి స్వరూపానికి కూడా తేడా ఉంది. ఇలా భాషలో మార్పులు రావటానికి నాగరికత ఒక కారణమైతే, ఆ మారుతున్న నాగరికతా లక్షణాల కనుగుణంగా మారుతున్న మనిషి వ్యక్తీకరణ కూడా దోహదపడుతుంది.

మనిషి సాధారణంగా మాట్లాడే భాష ఒకటుంది. ఇదికాక సాంద్రమైన, సంక్లిష్టమైన భావవ్యక్తీకరణలను, మనిషి తన అంతరంగాన్ని, తను అనుభవించిన ఆనంద, దు:ఖాలను, తను లోనైన ఉద్వేగా లను వ్యక్తం చెయ్యటానికి ఇంకేదో ప్రత్యేకమైన భాషాపరికరం కావాలి. ఆ పరికరమే సాహిత్యం. అందుకే జన సామాన్య భాషకు, సాహిత్యభాషకు కొంత తేడా ఉంటుంది. ఉదాహరణకి- సాధారణంగా 'సూర్యుడు అస్తమిస్తున్నాడు' అంటాం. అయితే ఆ దృశ్యాన్ని చూసిన వ్యక్తి అంతరంగంలో ఏవో భావప్రకంపనలు కలిగి, 'అప్పటివరకు అగ్నిగోళంలా మండిన సూర్యుడు చల్లబడి శాంతమూర్తిగా మారి, ఆకాశంలో అద్భుత రంగులు చిత్రించి కొండల మధ్యగా, లేదా చీకటిగుహలోకి జారు కున్నాడు,' అన్నాడనుకోండి- అది ఒక దృశ్యాన్ని కళ్లకు కట్టినట్లుం టుంది. అలా దృశ్యమానం చెయ్యటమే సాహిత్యం అనుకోవచ్చు. ఆ సాహితీసృజనకు సామాన్యంగా మనం మాట్లాడుకునే భాష సరిపోదు. దానికోసం కొత్త పదాలను సృష్టించుకోవాలి. లేదా ఉన్న పదాలకు కొత్త అర్థాన్ని స్ఫురింపజేయాలి. అప్పుడు ఆ పదాలు భాషలో భాగమైపోతాయి.

ఒక్కమాటలో చెప్పాలంటే అన్నిరకాలుగా అభివృద్ధి చెందు తున్న సమాజానికి అనుగుణంగా ఆధునిక దృక్పథాన్ని సంత రించుకున్న భాషని వికసితభాషగా భావించవచ్చు.

భాష కేవలం కొన్ని పదాల కూర్పు కాదు. పదాలకున్న మామూలు అర్థాన్ని దాటి శక్తిమంతమైన సూచికలేవో దాన్లో దాగుంటాయి. ఒక రచయిత చెప్పినట్లు భాషకు మాంత్రిక శక్తు లుంటాయి, సంగీత గమకాలుంటాయి. భాష ద్వారా లేదా భాష లోని ఇమేజెస్, సింబల్స్ ద్వారా మనం ప్రపంచాన్ని చూస్తాం. భాష లోని శబ్దాల్ని, దృశ్యాల్ని వాటి సింబల్స్ సాహిత్యంగా రూపాంతరం చేస్తాయి. భాషకున్న అనేకానేక శక్తులు, దాన్ని వాడే ప్రజల అనుభవాలు, అలవాట్లు, మేధస్సు, ముఖ్యంగా పున:సృజనశక్తి సాహిత్యంగా రూపాంతరం చెందుతుంది. ఇలా సాహిత్యం ద్వారా భాషకు ఒక వ్యక్తిత్వం, సృజనాత్మకశక్తి అబ్బుతుంది. ఇదే భాషకు సాహిత్యానికి ఉన్న అవినాభావ సంబంధం.

ప్రజలకున్న సృజనాత్మకశక్తి ఒక్కోసారి అవసరాలకను గుణంగా భాషలోకి కొత్త పదాలను తీసుకొస్తుంది. అవి కాలాను గుణంగా ఆ భాషాపద సంచయంలో చేరిపోతాయి. సర్కారు తుమ్మ, వయ్యారిభామ మొక్క, తప్పోడవంటి పదాలు అలాంటివే. భాష కాలానుగుణంగా మార్పు చెందుతుందని అనుకున్నాం కదా! ఆ మార్పును వివిధ కాలాల్లో వెలువడిన సాహిత్యరూపాలైన కథలు, కవితలు, నవలలు, వ్యాసాల ద్వారా గమనించవచ్చు.

కథ

గురజాడ అప్పారావు దిద్దుబాటు తెలుగులో తొలికథగా భావిస్తూ వచ్చాం. సరళ గ్రాంధికంలో రాసిన ఆ కథ తొలుత ఆంధ్రభారతి పత్రికలో 1910లో అచ్చయింది. అయితే, ఇటీవల వివినమూర్తి సంపాదకత్వంలో తానావారు ప్రచురించిన దిద్దు

బాటలు కథాసంకలనంలో దిద్దుబాటుకు ముందే (1897 నుంచి 1910 వరకు) వెలువడిన 92 కథలున్నాయి. ఇవన్నీ గ్రాంధికం లేదా సరళ గ్రాంధికంలో రాసినవే. ఈ పదమూడు సంవత్సరాల కథలు చదివితే కథాసాహిత్యం ద్వారా భాషలో వచ్చిన పరిణామ క్రమం అర్థమవుతుంది. 1897లో గ్రాంధికంతో మొదలై 1910 వచ్చేనాటికి దాదాపు కథారచన వ్యవహారశైలికి చేరింది. ఈ క్రమంలో ఆయా కథల్లో తెలుగు జాతీయాలు, పలుకుబడులు, సామెతలు ఎన్నో చోటు చేసుకున్నాయి. కొన్ని కథలకు ఇంగ్లీషు పేర్లు కూడా ఉన్నాయి. నవల, కథ- రెండూ ఆధునిక ప్రక్రియలే కావడం వల్ల వీటిల్లో భాష గ్రాంధికం నుంచి వ్యవహారంవైపు వేగంగానే మారింది. ఆధునిక వస్తువుకు, ఆధునికభాష తోడయింది. ఈ క్రమంలో భాష వాడుక విషయంలో రచయితలు ఎన్నో సమస్యలను ఎదుర్కొని ఉంటారు. అలవాటయిన సంస్కృతపద భూయిష్టమైన గ్రాంధికభాష నుండి ప్రజలు మాట్లాడుకునే తెలుగులో రాయడానికి రచయిత పడిన పాట్లు ఉన్నవ లక్ష్మీ నారాయణగారి మాటల్లో అర్థమవుతాయి. 'భాష యొక్క ప్రస్తుత స్థితిలో వాడుకభాషలో వ్రాయడం కంటే గ్రాంధికభాషలో వ్రాయడమే సులభంగా కనబడింది.' ఇలాగే, 'భావప్రకటనకు తగిన జాతీయ పదములు భాషలో లేకపోవడమే సంస్కృత పదముల వాడుకకు కారణమని తెలియుచున్నది,' అని కాశీ నాథుని నాగేశ్వరరావు పంతులు భావించారు. ఈ స్థితి మారినట్లు కనబడినా, ఇప్పుడు సంస్కృతానికి ఆంగ్లభాష తోడై కూర్చుంది. సాంకేతిక పదాల సమస్య ఎలానూ వుండనే ఉంది. ఇలా ఎన్ని సమస్యలనో దాటుకుని 1897 నుంచి ఈ 125 సంవత్సరాల కాలంలో వేలాది కథలు భాషను పరిపుష్టం చేయడంలో ముఖ్య భూమికను పోషించాయి.

గురజాడ తర్వాత భాషలోను, వస్తువులోను అదే ఆధునిక పోకడలతో కథలు రాసినవారిలో ముఖ్యులు చింతా దీక్షితులు, చలం, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. వీరి కథలు భాషకు నూతన త్వాన్ని, ప్రాంతీయ గుబాళింపులను తెచ్చిపెట్టాయి. చింతా దీక్షితులు పాత్రల స్వభావానికి అనుగుణంగా ఆంగ్లపదాలను విరివిగానే వాడారు తన వటీరావు కథల్లో. ఆయనే ప్రాంతీయ ముద్రతో భాషలోని పాత పదాలకు కొత్త అర్థా లను అద్ది సామాన్య పదాలతో అసామాన్యమైన భావచిత్రాలను తన కథల్లో రూపు కట్టించారు. 'మేడను డబ్బుతోను, గుడిసెలను మర్యాదతోను, కోవెలను భక్తితోను కట్టారు,' వంటి చిన్న వాక్యాలతో, మాటలతో సామాజిక స్వభావాన్ని చూపించారు.

చలం తన భావతీవ్రతను వ్యక్తంచేయడానికి అందుబాటులో ఉన్న భాష సరిపోలేదు. అందుకే ప్రతి పదానికి భావ తీవ్రతను జోడించారు. భాషకు భావతీవ్రతను అద్దిన తొలి తెలుగు రచయిత చలం అనవచ్చు. శ్రీపాద కథల్లో పాత్రలన్నీ గోదావరి గ్రామీణ బ్రాహ్మణ కుటుంబ భాషను మాట్లాడతాయి. ఇదొక మాండలికం. సాదాసీదా శైలితో బ్రాహ్మణ కుటుంబాల్లోని భాషను, ముఖ్యంగా స్త్రీల సంభాషణల్లో దొర్లే పదాలను ఆయన ఒడుపుగా పట్టుకున్నారు. దేశీయభాషలో ఆధునిక భావజాలాన్ని పలికించి, భాషకు కొత్త అందాల్ని సంతరించిపెట్టినవారు శ్రీపాద. 'పులుకు పులుకు చూశాడు' వంటి మాటలు అనుభవాలు జ్ఞాపకాలూనూ అంటూ ఆయన ఆత్మకథకి పెట్టిన పేరు ఇందుకు నిదర్శనం.

కుటుంబరావు కథలు రాసే సమయానికి కమ్యూనిస్టు భావ జాలం తీవ్రత ఆంధ్రదేశాన్ని బలంగానే తాకింది. ఒకవైపు రెండో ప్రపంచయుద్ధం, దానితో వచ్చిన ఆర్థికమాంద్యం, మరో వైపు కమ్యూనిస్టు ప్రభంజనం, సమాజంలో కట్టుబాట్ల పట్ల మారు తున్న అభిప్రాయాలు- ఈ స్థితివారి కథలన్నిటా పరుచుకుని ఉంటుంది. ఇందుకనుగుణంగా భాషకు అభ్యుదయ, రాజకీయ దృక్పథం అదనంగా వచ్చి చేరాయి.

ప్రయోగశీల కథలు కథాప్రక్రియకు, తెలుగుభాషకు కొత్త అర్థాన్నిచ్చాయి. కొత్త వస్తువుతో ప్రయోగం మొదలై ఉన్న పదాలతోనే అందుకనుగుణమైన భాషను సృజియించే ప్రయత్నం ఈ క్రమంలో జరిగింది. ఒక రకంగా చూస్తే ఇది 1908లో బుద్ధి రాజు ఈశ్వరప్పపంతులు కథలతోనే మొదలైందని అనుకోవచ్చు ఉత్తరాల రూపంలో, ఇంకొన్ని రిపోర్టుల రూపంలో, పత్రికా ప్రకటనల రూపంలో వీరు కథలు రాశారు. వీటిల్లో వివిధ భాషా పరమైన ప్రయోగాలు కనబడతాయి. అలా ప్రారంభమైన ఈ తరహా కథలను తరువాతి కాలంలో శ్రీశ్రీ, తిలక్, త్రిపుర నుండి నేటి కాశీభట్ల వేణుగోపాల్, డా॥ వి. చంద్రశేఖరరావు వరకు రాసారు. ఈ కథారచనలో పదాల కోసం అన్వేషణ, ఉన్న పదాలకు కొత్త అర్థాలను ఇచ్చే ప్రయత్నాలు జరిగాయి. 'నా పేరు సాల్వడార్ డాలీ, ఏం చేస్తావో అని అద్దంలో శేషాచలపతి విషునవ్వు ఒకటి మధురం గా నవ్వాడు' (త్రిపుర పాము కథలో). 'రెండు నక్షత్రాలు ఆకాశం మీదికి నిచ్చెన ఎక్కినట్లుగా ఎక్కి సూర్యుడికి, చంద్రుడుకీ మధ్య ఓచోట నిల్చునిపోయాయి. ఈ విచిత్రం చూస్తున్న మొండి చెయ్యి అంతవరకు ఏడుపు మానివేసి తిరిగి మొదలుపెట్టింది. (యుద్ధ బీభత్సాన్ని ప్రతిబింబించింది తిలక్ కథలో). చనిపోయిన మాలతిని తలుచుకుంటూ కూర్చున్న మిత్రుల మధ్య మాటల్లేని తనాన్ని, 'మిత్రులందరం భయపెట్టే మౌనంగా మారిపోయాం' (వి. చంద్రశేఖరరావు కథ హంసరెక్కలు), అదే కథలో మరోచోట, 'అతను మళ్లీ జీవించడం మొదలుపెట్టాడు, అతని చర్మం చిగురించినట్లుగా అనిపించేది.' మరోకథలో, 'నాలో కలల్ని నాటిన వాడు, ఆయన ఒక వెలుగువృక్షం, ఒక చీకటిఖండం.' ఇలాంటి వాక్‌చిత్రాలు పాఠకుల్ని కొత్త ఆలోచనల్లోకి తీసుకెళతాయి. వడ్డెర చండీదాస్ స్థానించి వంటి కొత్త పదాలు సృష్టించారు.

నిజాం ఉర్దూ పాలనలో అణగారిపోయిన తెలుగుభాషను నిలబెట్టడానికి, బతికించడానికి జరిగిన పోరాటం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంగా రూపొం దటం అరుదైన సంఘటనే. కాళోజీ, వెల్దుర్తి మాణిక్యరావు, సురవరం ప్రతాపరెడ్డి వంటి రచయితలు తెలుగుభాషాభివృద్ధి కోసం తెలంగాణ ప్రాంతంలో అహరహం కృషి చేశారు. అంత నిర్బంధ వాతావరణంలోను, తమ భావాలను, భాషపట్ల అభిమానా లను నిర్ద్వందంగా ప్రకటిస్తూ కథలు రాశారు. వాటిల్లో తెలంగాణ మాండలిక పదాలు, జాతీయాలు, సామెతలతోపాటు తెలుగులో కలగలిసిపోయిన ఉ

ర్దూ పదాలకు పట్టం కట్టి భాషాసంపదను పరిపుష్టం చేశారు. సింగమనేని నారాయణ అన్నట్లు, 'తెలంగాణ కథకులకు భాషా గతమైన మార్గదర్శకత్వాన్ని నెరపినవాడు సురవరం ప్రతాపరెడ్డి- ఇలా ప్రారంభమైన భాషా ఉద్యమం 10 వేల ఎకరాలను పంపిణీ చేయగలిగిన సామాజిక, రాజకీయ ఉద్యమంగాను, తర్వాత భూమిని కాపాడుకోవటానికి సాయుధ పోరాటం గాను రూపుదిద్దు కొంది. ఈ క్రమంలో అటు ఆంధ్ర, ఇటు తెలంగాణ ప్రాంతాల్లో వెలువడిన కథలు భాషకు కొత్త రాజకీయ భావజాలాన్ని సంత రించి పెట్టాయి. 'ఈత గింజ ఇచ్చి తాటిగింజ లాగిన జమిందారు కథ' అంటూ ఆవుల పిచ్చయ్య తన కథకు పెట్టిన పేరులోనే దోపిడీ స్వభావం అర్థమవుతుంది. ఆ తరువాత నక్సల్బరీ ఉద్యమం మళ్లీ తెలుగునేలను బలంగా తాకింది. అనేకమంది కథారచయితలు ఆ ఉద్యమాన్ని అక్షరబద్ధం చేసే క్రమంలో వెలువరించిన కథా సాహిత్యం తెలుగుభాషకు అదనపు కూర్పు. కాళీపట్నం రామా రావు, భూషణం, అప్పల్నాయుడు వంటి రచయితలు ఉత్తరాంధ్ర ప్రాంతంలోను, అల్లం రాజయ్య, రఘోత్తమరెడ్డి, పి. చంద్ వంటి కథకులు తెలంగాణ ప్రాంతంలోను ఈ ఉద్యమానికి కథా రూపాన్ని ఇచ్చారు.

సింగరేణి బొగ్గుగని కార్మికుల జీవితాలను వస్తువుగా తీసుకుని పి. చంద్, కార్మిక వంటి రచయితలు రాసిన కథలు గని జీవితపు వెతలతో పాటు అందుకు సంబంధించిన పారిభాషిక పదాలు కూడా కథల్లో విస్తృతంగా చోటు చేసుకున్నాయి. 'బొగ్గు బాయిల బొగ్గు తిని, బొగ్గు పీల్చి, బొగ్గేరిగే బతుకైపోయింది,' వంటి వాక్యాలు బలమైన భావవ్యక్తీకరణకు ప్రతీకలు.

తెలుగుదేశంలో వేరు వేరు ప్రదేశాల్లో మాట్లాడే భాషల ద్వారా తెలుగువారందరికీ సామాన్యమైన కొత్త భాషను తేలికగా స్థాపించవచ్చునని భావించిన గురజాడ ఆశ ఆచరణరూపం దాల్చడానికి, కొంతమేరకు స్థిరపడడానికి మరో డెబ్భై సంవత్స రాలు పట్టింది. అదీ పూర్తికాలేదు. తొలిరోజుల్లో నెల్లూరు ప్రాంతం నుండి కరుణ కుమార, రాయలసీమ నుండి కె. సభా, తెలంగాణ నుండి సురవరం ప్రతాపరెడ్డి, ఉత్తరాంధ్ర నుండి చాసో, కృష్ణాతీరం నుండి మల్లాది రామకృష్ణశాస్త్రి, గోదావరితీరం నుండి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, గుంటూరు మండలం నుండి మా గోఖలే వంటి కథకులు ఎందరో తమ మాండలిక కథల ద్వారా వందలాది పదాలను లిఖితభాషలో అంతర్భాగం చేశారు.

ఆమైన, బదనాయిం, సొయ్యి, బవనం, బువ్వ, ఒగ్గేసినాడు, అండ చెక్కడం, పొండుకోవడం, జోబిడి, అవ్వల్ దర్జా, వకాలతు, కిచిడీ జాగీర్ వంటి ఎన్నో ప్రజల నోళ్లలో నానే మాటలు కథల ద్వారా సాహిత్యభాషగా మారాయి. ఈ క్రమంలో కొంత విరామం వచ్చినా తర్వాత కాలంలో రావిశాస్త్రి, కాళీపట్నం రామారావు, పులి కంటి కృష్ణారెడ్డి వంటి రచయితలు ఆ ధోరణినే కొనసాగించారు.

80వ దశకంలో మాండలికాలపై జరిగిన చర్చ కథాసాహిత్య భాషలో పెనుమార్పులు తీసుకొచ్చింది. తెలంగాణ ప్రాంత రచయితలు ముఖ్యంగా అల్లం రాజయ్య, రఘోత్తమరెడ్డి వంటి రచయితలు మాండ లికాలను కేవలం పాత్రలకే పరిమితం చెయ్యకుండా రచయిత నెరేషన్‌కి కూడా వాడడంతో పెద్ద చర్చకు తెరలేచింది. మాండలికాన్ని ఒక ప్రయోగంగా కాకుండా సాహిత్య, భాషాపరమైన అవసరంగా వాడడంవల్ల తొలిరోజుల్లో కొంత వ్యతిరేకత వచ్చినా రాను రాను వారి వాదానికి అన్ని ప్రాంతాల నుండి మద్దతు లభించింది. వారి ననుసరిస్తూ ఇతర ప్రాంతాల రచయితలు మాండలికాల్లో కథలు రాయడం మొదలుపెట్టారు. అప్పటికే మాండలికంలో కథలు రాస్తున్న నామిని ఒకవైపు, ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు, ఖదీర్‌బాబు, పోలవరపు కోటేశ్వర రావు, అప్పల్నాయుడు, గోపిని కరుణాకర్, సువర్ణముఖి, నక్కా విజయరామరాజు, పాపినేని శివశంకర్, బండి నారాయణస్వామి, నాగప్పగారి సుందర్‌రాజు, వేముల ఎల్లయ్య, కాలువ మల్లయ్య, నేటి పెద్దింటి అశోక్‌కుమార్, స.వెం.రమేశ్ వరకు ఎందరో కథకులు వందలాది పదాలను లిఖితభాషలోకి ప్రవేశపెట్టిన వారయ్యారు. వీరి రచనలవల్ల మాండలిక, వృత్తిపదాలు గ్రంథస్తమై భవిష్యత్తరా లకు ఉపయోగపడే విధంగా భాషావికాసానికి దోహదం చేశాయి. అయితే, గురజాడ ఆశించినట్లు ఆ ప్రయాణం మొదలైనా అన్ని ప్రాంతాల మాండలికాలను కలుపుకుని భాషను ప్రజాస్వామీక రించుకుని, ఏకీకృత తెలుగుభాషగా రూపొందించడంలో మనం ఎక్కడో విఫలమయ్యాం. అయినా స.వెం. రమేశ్ వంటి కొద్దిమంది రచయితలు పట్టుబట్టి సంస్కృత, ఆంగ్ల పదాలను పూర్తిగా పరిహరిస్తూ అచ్చ తెలుగులోనే కథలు రాయడం మొదలుపెట్టారు. ఇది కొంత విపరీతంగా కన బడినా అనివార్య పరిణామం. దీనితో మరో పెద్ద కుదుపు రాగలదని ఆశిద్దాం.

80ల తర్వాత తెలుగునేలపై అస్తిత్వవాద చైతన్యం వెల్లి విరిసింది. ఈ నేపథ్యంలో అస్తిత్వవాద దృక్పథం ఒకటి స్థిరపడింది. స్త్రీవాదం, దళితవాదం, మైనారిటీ వాదం, బిసి వాదం వంటి అనేక అస్తిత్వ ధోరణులు ముందుకొచ్చాయి. వీటిల్లో స్త్రీ, దళిత, మైనా రిటీ వాదాలు కథాసాహిత్యంలోకి విస్తృతంగానే ప్రవేశించాయి. తద్వారా *జెండర్ స్పృహ, శరీరభాష, లైంగికత* వంటి పదాలు రాజకీయార్థాలతో ప్రయోగించడం మొదల యింది. *బడేబాపు, దువా, ఖటోర, యాద్* వంటి ఉర్దూ పదాలు మైనారిటీ వాదం ద్వారా తెలుగుభాషలోకి చేరుతున్నాయి. *ఛండాలం* వంటి పదాలు దళితవాదస్పృహతో అభ్యంతరంగా భావించడం వల్ల రచనల్లో ఉపసంహరింపబడుతున్నాయి.

నవల

దాదాపు నూరేళ్లకు పైగా తెలుగులో వెలువడుతున్న నవలల్లో భాషాప్రయోగాలను, తద్వారా జరిగిన భాషావికాసాన్ని చూద్దాం.

భాషకు భావతీవ్రతను అద్దిన తొలి రచయిత చలం అను కున్నాం కదా! ఆయన మైదానం నవలలోని వస్తువు అప్పుడప్పుడే ఆవిష్కృత మవుతున్న నూతన ప్రపంచానికి చెందినది. అందు కోసం ఆయన ఎన్నుకున్న భాష తన రచనలోని భావతీవ్రతకు ఆలంబనయింది. అది సామాన్య వాడుకభాషే. కానీ దానికొక ప్రత్యేకత ఉన్నది. అందులో ఏదో మేజిక్ ఉంది, అంతర్లీనంగా ఒక శక్తి ప్రవహిస్తున్నట్లుంటుంది. పదాలు మనమధ్య తిరుగాడే మనుషులైపోతాయి. ఏదో తెలియని అలౌకికభావన మనలోకి

ప్రవేశిస్తుంది. ఆయన వచనంలో మనల్ని కట్టిపడేసే శక్తి ఏదో ఉంది. సంగీతమూ ఉంది. డ్రామా ఉంది. వాక్యం వాక్యం నెమ్మదిగా మనలోకి ప్రవేశించి మనల్ని దహించివేస్తుంది. గొప్ప ఉద్వేగం ఆవహిస్తుంది. మైదానం నవలలో లాయర్‌గారింటికి మొదటిసారి అమీన్ వెళ్లినప్పుడు రాజేశ్వరి పొందిన అనుభూతి సన్నివేశం, భాషకు భావావేశానికి ఉండే అనుబంధానికి గొప్ప ఉదాహరణ. చలం తన రచనల ద్వారా సృజించింది ఇదే! ప్రత్యేక భాషారూపాన్ని ఆవిష్కరించాడు. మనలోపల రగులుకునే ఉద్వేగాలను, కదలికను వ్యక్తం చెయ్యటానికి అవసరమైన శక్తిని భాషకు అందించాడు. మళ్లీ అంతటి భావతీవ్రతను బుచ్చిబాబు తన నవలల్లో, కథల్లో కొత్త భాషా ప్రయోగాల ద్వారా ప్రవేశపెట్టాడు.

భాషకు భావగాంభీర్యతను అద్దిన ఘనత కొడవటిగంటి కుటుంబరావుది. ఆయన రచనల్లో వాడే సాధారణభాషలో అంతర్లీనంగా ప్రవహించే రాజకీయ, ఆర్థిక విశ్లేషణల తీవ్రత చూస్తే తెలుగుభాషకు ఇంత శక్తి ఉందా అని ఆశ్చర్యపోతాం.

ఆయనదే ఒక నవల గురించి చెప్పాలి. ఒక పెద్దమనిషి ఒక వేశ్య ఇంటికి వెళ్లి, 'నేను ఆరునెలలపాటు దేశాటన చెయ్యాలను కుంటున్నాను. డబ్బుకు బాదరబందీ లేదు. నువ్వు నాతో వస్తానంటే నెలకింతని ముట్టచెపుతాను. కానీ ఒక్క షరతు. నువ్వు మాత్రం నన్ను ఆకర్షించే ప్రయత్నం చెయ్యటానికి వీల్లేదు,' అని అడిగితే, అందుకు ఆమె ఒప్పుకుంటుంది. ప్రయాణం మొదలవుతుంది. ప్రయాణం సాగినంతసేపూ ఎంత ఆకర్షణ, ఎంత భావగాంభీర్యత, లోకభీతికి సంబంధించిన చర్చ నవల్లో కనబడుతుంది. మానవ మస్తిష్కం మొత్తం పాఠకులకు ఆవిష్కృతమవుతుంది. చదువుతున్నంతసేపూ మన మనసుల్లో ఉన్న భయాలు, ఆందోళనలు, సందేహాలు ఒక్కొటొక్కటిగా విడిపోతాయి. ఆ వేశ్య పేరు కస్తూరి, ఆ నవల పేరు నీకేం కావాలి? రాసింది 1945లో. ఆయనే రాసిన కురూపి నవల కూడా ఇలాగే సాగుతుంది.

ఇప్పుడు వడ్డెర చండీదాస్ దగ్గరకొద్దాం. ఆయన రాసింది నాలుగు నవలలే అయినా అందులో 1980లలో వచ్చిన హిమజ్వాల, అనుక్షణికం బహుళ ప్రజాదరణ పొందిన నవలలు, ప్రత్యేకమైనవి కూడా. వైయుక్తిక భావతీవ్రత, మర్యాదల ముసుగు తీసేసిన భాష ఆ కాలానికి కొత్త. అందులో పాత్రలు, సమాజం నిషిద్ధ విషయాలుగా నిర్ధారించిన వాటి గురించి, తమ అంతరంగ భావోద్వేగాల తీవ్రత గురించి నిర్భయంగా సంభాషించే భాష నవల ప్రత్యేకత. ఆ ప్రత్యేక లక్షణమే పాఠకుడిపై బలమైన ముద్ర వేస్తుంది. ఆ శక్తి ఈ నవలలకు అందులో వాడిన భాష ద్వారానే అబ్బింది.

మరొక ముఖ్యమైన రచయిత రాచకొండ విశ్వనాథశాస్త్రి. విశాఖ ప్రాంతపు మాండలిక పదాలు ఆయన రచనల ద్వారా తెలుగు లిఖితభాషకు చేరువయ్యాయి. సొమ్మలు పోనాయండి నవలలో ఆయన వాడిన పదాలు, వాక్యవిన్యాసం, పాత్రల వాగ్ధాటి తెలుగుభాషలో ఇంత జీవం ఉందా అని అబ్బురపరిచేట్టు చేస్తాయి.

90ల తర్వాత సమాజం పెను మార్పులకు లోనైంది. ఆ ప్రతిఫలనాలు సాహిత్యంలోనూ కనబడతాయి. అలా వచ్చిందే స్త్రీవాదం. తమదైన ప్రత్యేక అస్తిత్వాల అవసరం కోసం, ప్రత్యేక భావజాలాన్ని వినిపించటానికి స్త్రీవాద రచయితలు భాషను పున:సృజించుకున్నారనిపిస్తుంది. అప్పటిదాకా నిషిద్ధమైనది, లేదా స్త్రీలకే పరిమితమైన రహస్యభాష ఒకటి వెలుగులోకి వచ్చింది- ఇది నాటి స్వేచ్ఛ నవల (ఓల్గా) నుండి నేటి దేవరహస్యాలు (ఎండపల్లి భారతి) వరకు కొనసాగుతూనే ఉంది. ఈ ధోరణి స్త్రీవాద రచయితలతోపాటు, దళిత, మైనారిటీవాద రచయితలూ అందిపుచ్చుకున్నారు. నేను, నా మూలాలు, నా దు:ఖాలు, నా ఆకాంక్షలు, నా ఆశలు, నా పోరాటాలను వ్యక్తం చెయ్యటానికి వీలుగా నా భాష మారాలి లేదా మార్చుకుంటామన్నదే నేటి ఆలోచన.

ఇటీవల తానా నవలల పోటీలో బహుమతి పొందిన కొండపొలం నవల గురించి చెప్పుకోవాలి. ఇంతకుముందెప్పుడూ లిఖిత సాహిత్యంలో కనపడని పదాలు లేదా వృత్తిపదకోశాలకు మాత్రమే పరిమితమైన పదాలు ఈ నవలంతా పరుచుకుని ఉంటాయి. ఇదేకదా కావాల్సింది భాష విస్తరించటానికి.

తెలుగుభాష సాహిత్యభాషగా అత్యున్నత శిఖరాలకు ఎదిగింది. అయితే, ఇటీవల కాలంలో కొందరు రచయితలు తమ రచనల్లో సందర్భం లేకుండా ఆంగ్లపదాలను విరివిగా వాడుతున్నారు. దీనివల్ల ఆయా పదాలు మన భాషలో చేరవచ్చునేమో కానీ అందుకు సమానమైన తెలుగుపదాలు కనుమరుగయిపోయే ప్రమాదం పొంచి ఉంది. ఇది ఇప్పుడే జాగ్రత్త పడవలసిన అంశం.

ఇంతగా ఎదిగినా ఇంకా తెలుగు సాంకేతిక భాషగా రూపుదిద్దుకోలేకపోతోంది. దీనికి ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రధాన కారణం కాగా, ప్రజలకు పట్టనితనం మరో కారణం.

వీటన్నిటినీ అధిగమించి తెలుగుభాష సమున్నతంగా నిలబడాలని ఆశిద్దాం!



1954లో కృష్ణాజిల్లాలో జన్మించిన వాసిరెడ్డి నవీన్ వివిధ సామాజిక, సాహిత్య ఉద్యమాల్లో పనిచేసారు. ప్రజాసాహితి పత్రిక సంపాదకులుగా పదేళ్లపాటు కొనసాగారు. 'తెలంగాణ పోరాట కథలు', 'కథ 1960-85' సంకలనాలకు సంపాదకులు. 1990 నుంచి పాపినేని శివశంకర్‌తో కలిసి కథ సంకలనాలు ప్రచురిస్తున్నారు. 2005 నుంచి తానా సావనీర్‌లకు సలహా సంపాదకులు. 2018-22 మధ్య కేంద్ర సాహిత్య అకాడెమి జనరల్ కౌన్సిల్ సభ్యులు.

తెలుగు సమాజంలో తెలుగుభాష ప్రతిష్ఠ పెంచేందుకు ఆలోచన

గారపాటి ఉమామహేశ్వరరావు

సమాజంలో భాష చాలా కీలకం. ఇప్పుడు, భాష మీద తెలుగు సమాజంలో తీవ్రమైన చర్చ జరుగుతోంది. మాతృభాషలో చదువులు అంటేనే పేదలకు వ్యతిరేకం అనే భావజాలం నుండి బయటికి వచ్చి, అన్ని వర్గాల, కులాల పిల్లలు మాతృభాషలో చదువుకోవాలి. ప్రజలనూ, ప్రజల భాషనూ గౌరవించే, ప్రేమించే సంస్కృతి పెరగాలి. ప్రజల భాషను గౌరవించకుండా ప్రజలను గౌరవించడం ఎలా సాధ్యపడుతుంది? భారత రాజ్యాంగం, ఆర్టికల్ 350A ప్రకారం, రాష్ట్రాలు అల్పసంఖ్యాక భాషా వర్గాల పిల్లలకు ప్రాథమికస్థాయిలో మాతృభాషలో విద్యను అందించే బాధ్యతను నిర్దేశిస్తోంది.

పుట్టిన ప్రతి మనిషికీ సమానత్వం, స్వేచ్ఛ, రక్షణలతో కూడిన సార్వజనీనమైన మానవ హక్కులు అనేవి కొన్ని సంక్రమిస్తాయి. వీటికి ఒకరి కులం, మతం, జాతి, లింగం వంటి తేడాలతో పని లేదు. ఇవి ప్రధానంగా, గౌరవంగా బ్రతికే హక్కు, స్వేచ్ఛగా ఉండేందుకు హక్కు, అభిప్రాయాన్ని వ్యక్తపరచుకునే హక్కు, వ్యక్తిగత సమాచారాన్ని దాచుకొనే గోప్యతా హక్కు, విద్యా హక్కు, ఉద్యోగ హక్కు మొదలైనవి. ఇవే ప్రజాస్వామ్యానికి కొలబద్దలు.

మాతృభాషలో చదువుల అవసరం

మనిషికి జీవించే హక్కు పుట్టుకతో ఎలా వస్తుందో, గౌరవప్రదమైన జీవనానికి వారసత్వంగా వచ్చిన మాతృభాషలో చదువు కూడా అలాంటిదే. అంటే, ఇప్పుడు కొనసాగుతున్న నిర్బంధ ఆంగ్ల మాధ్యమంతో (జీ.ఓ.ఎమ్.ఎస్.నం. 81, తేదీ: 05/11/2019, ఆం.ప్ర.ప్ర.) ఆ ప్రజాస్వామిక హక్కును కోల్పోయాం. సమాజంలో మానవ సంబంధాలను ఏర్పరచుకోవడానికి, సంపదసృష్టితో జీవనం సాగించడానికి మాతృభాష ముఖ్య ఉపకరణంగా ఉంటుంది. ప్రతి మనిషికీ తన అమ్మానాన్న, తోబుట్టువులూ, బంధువులూ చుట్టూతా ఉన్న మనుషులు ఏ భాష మాట్లాడుతారో, ఆ భాషలోనే ప్రకృతినీ సమాజాన్నీ సంస్కృతినీ అర్థం చేసుకొంటారు. మాతృభాష మనిషికి ఒక బలమైన వ్యక్తిత్వాన్ని ఏర్పరుస్తుంది. జీవనానికి కావలసిన నైపుణ్యాలనూ ఆత్మస్థైర్యాన్ని నింపుతుంది. మన తెలుగు రాష్ట్రాలలోనూ బయటా సుమారు 15 కోట్లమంది తెలుగు ప్రజలకు మాతృభాష అయిన తెలుగుభాషను ఇప్పుడున్న తరాలకూ రాబోతున్న తరాలకూ (ఇంగ్లీషు మాధ్యమ విద్య ద్వారా) దూరం చేయడం వలన తెలుగు సమాజానికి జరగబోయే నష్టాలను గురించీ ప్రతి తెలుగు వ్యక్తీ ఆలోచించాల్సిన సమయం ఇది. అవసరానికి ఏ భాషనైనా ఒక విషయంగా నేర్చుకోవచ్చు, కానీ నడుస్తున్న నిర్బంధ ఇంగ్లీషు మాధ్యమ విద్య ద్వారా తరిగిపోతున్న తెలుగూ దానితో ప్రతి వ్యక్తికీ, సమాజానికీ జరుగుతున్న నష్టాల గురించి తెలుసుకోవాలి. అక్షరాస్యతలో వెనకబాటుతనం గురించీ (ప్రపంచ ర్యాంకులలో), కుదేలవుతున్న మన స్థానిక పరిశ్రమల గురించీ, చివరకు మాతృభాష తరుగుతో పెరుగుతున్న నేర ప్రవృత్తుల గురించీ తెలుసుకోవాల్సిన సమయం ఇది.

మాతృభాషలో చదువుకున్న దేశాల ఆర్థికాభివృద్ధి గురించీ, సృజనాత్మక ఆవిష్కరణలూ పేటెంట్ల రూపంలో సంపాదించిన మేధాసంపత్తి గురించీ, సాంకేతిక ప్రగతి గురించీ, ప్రపంచ మార్కెట్లలో ఎగుమతులలో సాధించిన స్థాయిల గురించీ, ఆర్థిక ప్రగతి గురించీ, స్థూల జాతీయ ఉత్పత్తిలో (జీడీపీ) ప్రపంచ ర్యాంకుల గురించీ తెలుసుకోవాలి.

మేధాసంపత్తికి మాతృభాషే ఆధారం

ఆధునిక ప్రపంచంలో దేశాలు సాధిస్తున్న మేధాశక్తి, సంపదలకు కొలమానం పేటెంట్ల సంపాదన. పేటెంట్ల సాధనే అభివృద్ధి చెందిన దేశాలకు గుర్తింపు. పేటెంట్ల సాధనకు మాతృభాషలే మూలమని చెప్పాలి. అందుకు ఆధారం ఆధునిక ప్రపంచంలో మేధా సంపత్తికి చిహ్నమైన పేటెంట్లు ఎక్కువగా సంపాదిస్తున్న దేశాలలో దక్షిణ కొరియా, జపాను, అమెరికా, చైనా, ఇజ్రాయేల్, కెనడా, జర్మనీ, ఫ్రాన్సు, రష్యా, యూకే మొదటి వరుసలో ఉన్నాయి. ఈ దేశాలలో అన్నింటా విద్యా, వైద్య, పాలన, న్యాయ, సాంకేతిక, ఆర్థిక రంగాలలో స్థానిక భాషలే వాడుకలో ఉన్నాయి. అంటే మాతృభాషలో పరిశోధనలు చేసే దేశాలే మేధాశక్తి సంపన్న దేశాలు అని అర్థమవుతుంది.

అత్యధిక పేటెంట్లు సంపాదిస్తున్న దేశాలు, 2022

క్ర. సం.	దేశం	జనాభా (2025)	పేటెంట్ల సంఖ్య	ప్రతి లక్ష మందికి
1	ద.కొరియా	5,16,67,029	1,35,180	264
2	జపాను	12,31,03,479	2,01,420	159
3	అమెరికా	34,72,75,807	3,23,410	097
4	చైనా	141,60,96,094	7,98,347	055
5	ఇజ్రాయిల్	95,17,181	05,358	055
6	కెనడా	4,01,26,723	18,125	046
7	జర్మనీ	84,075,075	25,592	031
8	ఫ్రాన్సు	66,650,804	12,421	019
9	రష్యా	1,43,997,393	23,315	016
10	యు.కె.	69,551,332	10,578	015
11	ఇండియా	146,38,65,525	30,490	002

సన్నగిల్లుతున్న మానవ సంబంధాలు

సహజంగా మనిషి సంఘజీవి. ప్రేగు తెంచుకొని పుట్టినప్పటి నుండి పిల్లలు తల్లి తోడుతో, నాన్న సంరక్షణలో పెరుగుతారు. అవ్వా తాతలూ బంధువులూ చెప్పే కథలనూ, వారి అనుభవాలనూ మాతృభాషలో వింటూ సామాజిక వ్యక్తిత్వాన్ని నడవడికనూ ఏర్పరచుకుంటారు. బడిలోకి వెళ్లాక ఇంటిభాష, బడిభాష వేరుగా అయ్యేసరికి పాఠ్యాంశాలు నేర్చుకునేందుకు కొత్త భాషతో కష్టాలు మొదలవుతాయి. ఇంట్లో చుట్టపక్కాలతో గడగడా అమ్మభాషలో మాట్లాడే పిల్లలు, బడిలో ఇంగ్లీషులో పంతులుగారి పాఠాలు పూర్తిగా అర్థంకాక, అడిగితే ఏమనుకుంటారో ఏమోనని ప్రశ్నించ కుండా నోటికి తాళాలు వేసుకుంటారు. బడిలోని ఇంగ్లీషు ఇంట్లో ఉండే తల్లిదండ్రులకూ, తోబుట్టువులకూ, అవ్వాతాతలకూ, బంధువులకూ తెలియనిది కాకపోవడంతో పిల్లల బడి చదువులతో ఇంట్లోవాళ్లకి ఎటువంటి సంబంధం లేకుండాపోతుంది. వాటికి సంబంధించిన చర్చ ఏదీ ఉండదు. అటు బడిభాష మాట్లాడలేక ఇటు తెలుగుభాష ఇంట్లో అనర్గళంగా మాట్లాడలేక ఇంట్లో అవ్వా తాతలతో తల్లిదండ్రులతో మాట్లాడటం తగ్గించుకుంటారు. ఈ విధంగా ఇంట్లోనే పెద్దలతో పిల్లలకు సంబంధాలలో తరుగుదల కనిపిస్తుంది. ఇంట్లో పెద్దవాళ్లు పిల్లలతో పంచుకోవాలనుకున్న కథలూ, అనుభవాలూ సాంస్కృతిక విషయాలూ ఏవీ కూడా పిల్లలకు చేరకుండా మాతృభాషతోపాటు పుట్టిన సంస్కృతికీ, సమాజానికీ, మానవ సంబంధాలకీ దూరం అవుతూ ఎవరి లోకంలో వారు ఉండటం మొదలవుతుంది.

తరుగుతున్న అక్షరాస్యత

భారతదేశంలోని తెలుగు రాష్ట్రల అక్షరాస్యత మిగిలిన అన్ని రాష్ట్రలతో పోలిస్తే వెనుకబడిందని తెలుసుకొని ఆశ్చర్యపడక తప్పదు. 2011 గణాంకాల ప్రకారం తెలుగు రాష్ట్రాల సగటు అక్షరాస్యత 65%. ఇది ఈ దేశంలోనే కనిష్ట అక్షరాస్యత. దేశంలో సగటు అక్షరాస్యత 74 అయితే అత్యంత కనిష్ట అక్షరాస్యత మన తెలుగు రాష్ట్రాలదే. తర్వాత వచ్చిన గణాంకాలు అంచనాలతో వచ్చినవి మాత్రమే కాబట్టి అందులో వాస్తవం ఉండకపోవచ్చు. కానీ అక్షరాస్యతలో మాత్రం తీవ్రంగా వెనుకబడి ఉన్నాం అనే విషయాన్ని మనం గమనించాలి. దీనికి కారణం మన మాతృభాషలో చదువుకునే అవకాశాలు తరిగిపోవడమే. ఇంగ్లీషు అర్థంకాక బడి మానేసిన (డ్రాప్ అవుట్స్) పిల్లలు తెలుగు రాష్ట్రాలలో ఎక్కువగా ఉన్నారు (2011). మ నకు ఉన్న అక్షరాస్యతలో కూడా కేవలం ప్రాథమిక విద్యను అభ్యసించినవారిదే ఎక్కువ శాతం గ్రాడ్యుయేట్లుగా ఉత్తీర్ణులు అయినవారు కేవలం ఆరు నుండి ఏడు శాతం మాత్రమే. అక్షరాస్యతలో ఇంత వెనుకబాటుతనానికి కారణం సామాజిక ఆర్థిక పరిస్థితులు అయినప్పటికీ చదువుల్లో నిలదొక్కుకొని ప్రతిభావంతులు అవ్వడానికి ఇంగ్లీషు ఒక ప్రతిబంధకంగా ఉందన్న విషయాన్ని మనం మర్చిపోకూడదు. ఇంగ్లీషులో చదువుకున్నా అర్థంకాక విషయావగాహన కొరవడి చదువుకున్న చదువు నిరుపయోగం అవుతోంది.

తరుగుతున్న ఉద్యోగ - ఉపాధి అవకాశాలు

ఇంగ్లీషు మాధ్యమంలో గ్రాడ్యుయేట్లుగా ఉత్తీర్ణులై ఉద్యోగం కోసం వెళితే, ఉద్యోగానికి కావలసిన నైపుణ్యాలు లేవని వెనక్కి పంపిస్తున్న వైనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇటీవల వచ్చిన సర్వేల ప్రకారం 89% మంది గ్రాడ్యుయేట్లుగా ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగాలకు కావలసిన నైపుణ్యాలు లేవని తేల్చి చెప్పాయి. చదువుకున్న చదువులు నైపుణ్యాలను అందించడంలేదు అంటే, ఆ విద్యను అందించిన తీరునూ, విద్యామాధ్యమంగా ఉపయోగించిన ఇంగ్లీషునూ మనం నిరసించాల్సిన అవసరం ఉంది. మన మాతృభాషలో విద్యను అభ్యసించి ఉద్యోగ ఉపాధి అవకాశాలను మనమే నిర్మించుకొని మన ప్రజలకు సేవ చేయాల్సింది పోయి, బ్రిటిషువారు వదిలిపెట్టి పోయిన భాషని ఇంకా ఆ భావదాస్యంతో అదే భాషలో చదువుకుని మన సమాజాన్ని ఇంకా బలహీన

పరుచుకుంటున్నాం. నేడు జరుగుతున్న ప్రపంచీకరణ స్థానిక భాషల బలంతో జరుగుతుందన్న విషయాన్ని మనం గుర్తించాలి. దక్షిణ కొరియా, జపాన్, చైనా, ఇజ్రాయేలు, జర్మనీ వంటి దేశాలు వాళ్ల మాతృభాషలోనే చదువుకొని ఉద్యోగ అవకాశాలు కూడా పొంది వారి దేశాలను అభివృద్ధి పరుచుకుని ప్రపంచానికి దారి చూపే దేశాలుగా తయారయ్యాయి. మనం మాత్రం ఇంగ్లీష్ మాధ్యమవిద్యతో నైపుణ్యాలు సాధించలేక ఉద్యోగాలు రాక ప్రపంచీకరణలో వెనకబడిపోతున్నాం.

అంతర్జాతీయ ఆర్థిక సహకార అభివృద్ధి సంస్థ గణాంకాలు, 2024

క్ర. సం.	ప్రపంచ ర్యాంకు (224 దేశాలలో)	దేశం (ఎంపిక చేసిన దేశాలు)	నిరుద్యోగ రేటు
1.	26	జపాన్	2.54
2.	40	ద.కొరియా	3.00
3.	43	రష్యా	3.12
4.	44	జర్మనీ	3.29
5.	46	యు.అరబ్ ఎమి.	3.40
6.	54	ఇజ్రాయేల్	3.70
7.	68	యూ.కే.	4.15
8.	70	అమెరికా	4.20
9.	90	చైనా	5.10
10.	96	ఇండోనేషియా	5.20
11.	120	బ్రజిల్	6.10
12.	142	ఫ్రాన్సు	7.36
13.	146	ఇండియా	7.80
14.	151	పాకిస్తాన్	8.00
15.	160	టర్కీ	8.50
16.	195	ఇరాక్	14.20

పెరుగుతున్న నేర ప్రవృత్తి

ప్రతి మనిషీ తనహక్కుల గురించి తెలుసుకోవాలి. సమాజం పట్ల మనకు ఉన్న బాధ్యతలను కూడా తెలుసుకోవాలి. చదువు అనేది మనిషిని జ్ఞానంతో వికసింప చేయటమేగాక, సమాజంపట్ల గౌరవాన్నీ బాధ్యతలను కూడా తెలియజేస్తుంది. మాతృభాషలో చదువులు కుటుంబం పట్లా సమాజం పట్లా బాధ్యతతో కూడిన ప్రవృత్తిని పెంచేందుకు తోడ్పడతాయి. వృత్తి ఉద్యోగాల కోసం మార్కులే లక్ష్యంగా చదివే చదువుల వలన మనుషుల్లో నేరప్రవృత్తి కూడా పెరిగిపోతూనే ఉంది. నిజానికి చదువులు నేరప్రవృత్తిని తగ్గించాలి కానీ, దానికి విరుద్ధంగా నేడు సమాజంలో నేరాలు పెరిగి పోతున్నాయి. దీనిగురించి ఒక్కసారి మనం ఆలోచించాలి. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన కొన్ని పరిశోధనలు నేరుగా కాకపోయినా వివిధ విషయాల కలివిడితో వలసపాలకుల భాషా మాధ్యమ చదువులు మానసిక, సాంస్కృతిక వేర్పాటుభావనను కలిగిస్తాయనీ, ఇది ఇంకా సామాజిక వేర్పాటుకూ, ప్రత్యేకించి యువతలో, విస్తృత సామాజిక అశాంతికీ లేదా అసంతృప్తికి దోహదం చేస్తుంది అని కనుగొన్నారు. ఇది అంతర్గత ఘర్షణకూ హింసకూ దారితీయవచ్చు. అణగారిన సమూహాల మధ్య నిరాశానిస్పృహలనూ, అన్యాయం అనే భావననూ కలిగిస్తాయి. వీరిలో బడి మానేసే అలవాటు పెరగడం, ప్రత్యేకించి పట్టణ ప్రాంతాలలో నేరప్రవృత్తికి కూడా దోహదపడవచ్చు. విదేశీ మాధ్యమంగా ఇంగ్లీషు అన్నిరకాల అవకాశాలకూ అడ్డుగోడగా కనబడుతోంది. ఈ అంశాలన్నీ పరోక్షంగా నేరప్రవృత్తి పెరగడానికి దోహదం చేయవచ్చు. ఈ నేరాలకు కారణం తోటివారిపట్ల ప్రేమ, మానవ సంబంధాలు సన్నగిల్లిపోవడమా? సమాజంపట్ల బాధ్యత లేకుండా పోవడమా? ఈ విషయాలు మనం అధ్యయనం చేయాలి. ఇప్పటివరకు ఇంగ్లీషు మాధ్యమం ద్వారా నేర్చుకున్న విద్య మనుషుల్ని స్వార్థపరులుగా చేస్తున్నదా? మనిషి వికాసానికి అడ్డంకిగా మారిందా? లేక, ఇంగ్లీషు చదువులు మన సొంత చరిత్రనూ సంస్కృతినీ జీవన విధానాలనూ తెలియనీయకుండా, మన సమాజంలో కొత్త అంతరాలకు తెర తీస్తున్నదా? ఈ విషయాలను మనం ప్రశ్నించుకోవాల్సిన సమయం ఇది. ప్రస్తుత పరిస్థితులను అవగాహన చేసుకుని అధ్యయనం చేసినట్లయితే, ఇంగ్లీషు మాధ్యమ విద్య ద్వారా పిల్లల్లో అసహనం, స్వార్థం, నేర ప్రవృత్తి పెరుగుతున్నాయని గమనించవచ్చు. ఆస్తి కోసం తల్లి దండ్రులనూ అన్నదమ్ములనూ అక్కచెల్లెళ్లనూ అవ్వాతాతలనూ చంపుతున్న ఘటనలు రోజురోజుకూ మనకు కనిపిస్తూనే ఉన్నాయి. కార్ల్ మార్క్స్ చెప్పిన మాటలు, 'మానవ సంబంధాలు అన్నీ ఆర్థిక సంబంధాలే' అన్నది నిజమవుతున్నట్లు అనిపిస్తోంది. ఇటువంటి భయంకరమైన పరిస్థితులను కలిగించింది అమ్మభాషలో లేని చదువులు కాదా?

సంపద సృష్టి

రెక్కాడితేనేగాని డొక్కాడని బ్రతుకులు మనదేశంలో కోకొల్లలుగానే ఉన్నాయి. భారతదేశంలో సుమారు 17.26% మంది సంఘటితరంగ (organized sector, పారిశ్రామిక, సేవారంగాలు) ఉద్యోగాల్లో ఉంటే, మిగిలిన 82.73% మంది అసంఘటిత రంగంలో (unorganized sector, వ్యవసాయ అనుబంధ రంగాలు) పనిచేస్తున్నారు (శ్రామిక-ఉద్యోగ మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం, 2019-20, 2022). ఇది భారతదేశంలో చాలా పెద్ద శాతం. అభివృద్ధి చెందిన దేశాలలో అసంఘటితరంగంలో పని చేసేవారి శాతం చాలా తక్కువగానూ సంఘటితరంగంలో పని చేసేవారి శాతం చాలా ఎక్కువగానూ ఉంటుంది. మనం నిత్యం వాడే వస్తువుల నుండి వినియోగిస్తున్న సేవల వరకూ మనదేశం లోని, మన రాష్ట్రాల్లోని సామాన్య ప్రజలు తమ మాతృభాషను తమ పనులలో ఉపయోగించి పనిచేస్తూ తయారుచేసి అమ్మినవే. ఇటీవలే చేసిన ఒక అధ్యయనం ప్రకారం (ఉమామహేశ్వరరావు, 2017)

జాతీయ గణాంకాల ఆధారంగా మన దేశ, రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిలో 85% మాతృభాషల వాడుక నుండి వస్తోందని తెలుస్తోంది. కాబట్టి మన దేశ స్థూల జాతీయోత్పత్తి మాతృభాషల వినియోగం నుండి మాత్రమే వస్తోందన్న విషయాన్ని మనం గుర్తించాలి. మనదేశ సంపద మాతృభాషల నుండి వస్తున్నప్పుడు మనం ఇంగ్లీషు మాధ్యమం ద్వారా చదువులు చదువుకోవాల్సిన అవసరం ఏముంది? కొన్ని అవసరాలకు మాత్రమే ఇంగ్లీషు అవసరమైతే ఆ భాషను ఒక విషయంగా నేర్చుకోవాలిగానీ, తెలుగు రాష్ట్రాలలో ఇంగ్లీషును పూర్తిస్థాయిలో నిర్బంధ విద్యామాధ్యమంగా అమలు పరచడం అశాస్త్రీయం.

ప్రపంచ బ్యాంకు, ప్రపంచ ఫ్యాక్ట్ బుక్ నుండి ఎంపిక చేసిన ప్రధాన దేశాలలో సంఘటిత అసంఘటిత రంగాలలో పనివారి శాతం (2021)

క్ర. సం.	దేశం	అసంఘటిత రంగం	సంఘటిత రంగం	
		వ్యవసాయిక అనుబంధ రంగాలు	పారిశ్రామిక రంగం	సేవా రంగం
1.	యు.కింగ్‌డమ్	1	18	81
2.	కెనడా	1	19	79
3.	ఆస్ట్రేలియా	2	19	79
4.	అమెరికా	2	19	79
5.	ఫ్రాన్సు	3	19	78
6.	జపాన్	3	24	73
7.	జర్మనీ	1	28	71
8.	యు.అరబ్ ఎమి.	2	27	71
9.	ద. కొరియా	5	25	70
10.	బ్రజిల్	10	21	69
11.	రష్యా	6	27	67
12.	మెక్సికో	12	26	62
13.	ఇండోనేషియా	29	22	49
14.	చైనా	24	28	48
15.	వియత్నాం	29	33	38
16.	పాకిస్తాన్	38	25	37
17.	ఇండియా	44	25	31

స్థానిక పరిశ్రమల నిర్వీర్యం

స్థానిక పరిశ్రమల ఆధారంగానే మనదేశంలో అధిక శాతం మంది జనాభా జీవనాన్ని సాగిస్తున్నారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ, గొర్రెలూ, చేపలూ కోళ్లూ మొదలైనవాటి పెంపకం, చేనేత పరిశ్రమ, గనుల తవ్వకం, ముద్రణా పరిశ్రమ, నిర్మాణ పరిశ్రమ, సినిమా పరిశ్రమ, వందలాది బుల్లితెర ఛానెళ్లూ, ప్రకటనా పరిశ్రమ, వార్తాపత్రికలూ, సామాజిక మాధ్యమాలూ, గ్రంథరచనలూ, కథా, జానపద గేయరచనలూ మొదలైన వందలాది పరిశ్రమలలో పని చేస్తున్న లక్షలాదిమంది మాతృభాషనే ఆధారంగా గల ఈ పరిశ్రమల పై ఆధారపడి జీవనాన్ని సాగిస్తున్నారు. ఈ పరిశ్రమలలో కొన్ని ప్రధానమైనవి భాషను మాత్రమే ఆధారం చేసుకుని నడుస్తున్న పరిశ్రమలు. మన తెలుగు రాష్ట్రాలలో వీటి నుండి వస్తున్న సంపద కొన్ని వేల కోట్లల్లో ఉంది. తెలుగు సినిమా పరిశ్రమ గురించి చెప్పనక్కర్లేదు. మన తెలుగు రాష్ట్రాలలో సంపాదిస్తున్న సొమ్ము కన్నా, విదేశాలలో సంపాదిస్తున్న సొమ్మే ఎక్కువ. తెలుగు మాధ్యమ విద్య లేకపోవడంవల్ల తరుగుతున్న తెలుగు ముద్రణా పరిశ్రమ, తెలుగు వార్తాపత్రికలూ, తెలుగు సినిమా చూసి ఆదరించే వీక్షకులూ తెలుగు రచనలు చదివే చదువరులూ రోజురోజుకూ తగ్గిపోతున్నారు. ఇది ఇక్కడితో ఆగదు, ఒక రెండు మూడు దశాబ్దాలలో తెలుగు చదవని, అర్థం చేసుకోలేని ప్రజలు ఈ భాషాధారిత రచనలు ఇతర సేవల నుంచీ చేజారిపోతే ఇక ఈ స్థానిక పరిశ్రమల గతి ఏమవుతుందో ఒకసారి ఆలోచించండి. ఇక ఈ భాషాధారిత పరిశ్రమలపైన ఆధారపడిన లక్షలాది కార్మికుల జీవనం వారు సృష్టించే సంపద ఏమవుతుందో ఒకసారి ఆలోచించండి. ఇంగ్లీషు మాధ్యమ విద్య ద్వారా మనకు స్థానిక పరిశ్రమల బ్రతుకు ప్రశ్నార్థకంగా మారుతుంది, దానితో సంపద సృష్టి కూడా సన్నగిల్లిపోతుంది. ఈ చేదు నిజం సమాజాన్ని ఒక సంక్షోభంలోకి నెట్టబోతోందన్న విషయం మాత్రం వాస్తవం.

కొడిగడుతున్న సాహిత్య సృష్టి

సమస్త ప్రజల సామాజిక జీవనవిధానాన్నీ, చరిత్రనూ, అట్టడుగు వర్గాల గోడునూ, మూలవాసుల గాథలనూ వారి సామాజిక పోరాటాల సాధన సంపత్తినీ పరిపక్వతనూ అందరికీ అందించడానికి వివిధ రూపాలలో లక్షల రచనల సృష్టి జరుగుతోంది. చివరకు ఇవి భాషాంతరం చెందుతూ ఎవరి మాతృభాషలో వారికి వాళ్ల హృదయాలకు హత్తుకునే విధంగా వారిని చైతన్యపరిచే విధంగా భాషాంతర సాహిత్య మారకం కూడా జరుగుతోంది. మన దేశానికి స్వాతంత్రం కోసం పాటుపడ్డ వీరుల త్యాగాల నుండి, కుల, మత, జాతి వివక్షల నుండీ సామాజికపరంగానూ శాస్త్రీయ పరంగానూ మనదేశాన్ని ముందుకు నడిపిస్తున్న ప్రగతిశీల భావాలు కలిగిన వ్యక్తుల జీవిత నేపథ్యం వరకూ ప్రజాసాహిత్యం మన మాతృ భాషల్లో వెలువడుతోంది. ఇటువంటి సాహిత్యాన్ని విద్యార్థులకు వారి పాఠ్యాంశాల్లోకి రాకుండా, ఇంగ్లీషులో రచించిన రచనలు మన సామాజిక సాంస్కృతిక నేపథ్యాన్ని తెలియకుండా దాచిపెట్టే విధానానికి తెరతీస్తాయి. మన ఆధునిక సమాజ ఆవిర్భావం గురించి, దానికోసం పాటుబడ్డ త్యాగమూర్తుల విలువల గురించి అర్థం చేసుకోలేని అనైతిక సమాజం ఈరోజు నెలకొనడానికి కారణం ఇంగ్లీషు మాధ్యమ విద్యేనని చెప్పవచ్చు. ఈ సమాజంలోని ప్రజలకి తమ రచనల ద్వారా రచయితలు తెలియజేయాలనుకున్న జ్ఞానయుక్తమైన రచనలు వెలుగు చూడకుండా చీకటిలో చిక్కుకుంటున్నాయి. వాటిమీద ఆధారపడిన రచయితల బ్రతుకు దిన

దిన గండంగా మారిపోతోంది. తెలుగుభాష చదివే విద్యార్థులు నేడు కరువయ్యారు. అలాంటప్పుడు తెలుగుభాష జీవనం కూడా ప్రశ్నార్థకంగా మారుతుంది. కాబట్టి తెలుగులో చదువుకొని తెలుగు విద్యా మాధ్యమాన్ని బ్రతికించుకునే మన సాహిత్యాన్ని మనం బల పరుచుకునే అవసరం ఎంతైనా ఉంది.

అందివచ్చిన కృత్రిమ మేధ

ఇది కృత్రిమ మేధా (ఏఐ) యుగం. చదువుల్లో ఉద్యోగాల్లో జ్ఞాన సమపార్జనలో కృత్రిమమేధ ఒక విప్లవాన్నే మోసుకొచ్చింది. సమాచారసృష్టినీ, వినిమయాన్నీ కూడా సులభతరం చేసింది. నిన్నటి వరకూ భాషను నేర్చుకోవడానికి భౌతికంగా శ్రమా కాలమూ పెట్టుబడీ అవసరమయ్యేవి. కానీ ఇప్పుడు ఇతర భాషలను నేర్చుకోవడం చాలా సులభం అయిపోయింది. ఇంకా చెప్పాలంటే అసలు నేర్చుకోవాల్సిన అవసరమే లేదు. మానవ సహజ భాషలనే కాదు సంగణకాలలో (కంప్యూటర్లలో) వాడే పరిక్రమ (ప్రోగ్రామింగ్) భాషలను కూడా ఆధునిక కృత్రిమమేధతో పనిచేసే బృహద్ భాషానిధుల యంత్రాధ్యయన విశ్లేషణతో తయారైన ఉపకరణాల ద్వారా తక్షణ అనువాదాలు ఆమోదయోగ్యమైన స్థాయికి చేరినై. మన మాతృభాషలో ఉన్నదాన్ని ఉన్నట్టుగా యంత్రానువాద వ్యవస్థలకు అందిస్తే అది ఏ భాషలోకి కావాలంటే ఆ భాషలోకి అనువాదం చేసి అందిస్తుంది. అదేవిధంగా ఇంగ్లీషు లోనూ ఇతర భాషలలోనూ ఉన్న సమాచారాన్ని కూడా కనురెప్ప పాటులోనే మన తెలుగులోకి అనువాదం చేసి మనకు అందిస్తుంది. ఇటువంటి విప్లవాత్మకమైన యుగంలో మనం ఇంగ్లీషు భాషకి పట్టం కట్టి గౌరవించే పని తల కెత్తుకోవాల్సిన అవసరం లేదు. విజ్ఞానశాస్త్ర సాంకేతిక రంగాలలో ఎక్కడ ఎప్పుడు జ్ఞానసృష్టి జరిగినా తక్షణమే మన మాతృభాషలోకి మారి కావాలసినవారు నేర్చుకునేందుకు అందుబాటులోకి వస్తోంది. అన్నిటినీమించి విశ్వవ్యాప్తమైన జ్ఞానరాశి మాతృభాషలోకి అనువదించి తెచ్చుకోగల అసీమిత శక్తి సామర్థ్యాలు పూర్తిస్థాయిలో కృత్రిమ మేధ వలన సాధ్యం అవుతోంది. ఇతర భాషలు నేర్చుకోవడానికి ఇంకా ఎంతమాత్రమూ చింతించాల్సిన అవసరం లేదు. ఎవరికి వచ్చిన భాషలో వారు మాట్లాడితే తమకు నచ్చిన భాషలో తక్షణమే వినే సౌకర్యం అందరికీ అందుబాటులోకి వస్తోంది. యంత్రానువాదంతో పూర్తిస్థాయిలో మన మాతృభాష లోనే విజ్ఞాన శాస్త్రరంగాలను కూడా చదువుకొని నైపుణ్యాలు పెంపొందించుకొని ఉద్యోగ ఉపాధి అవసరాలు తీర్చుకొనే అవకాశం మన చేతుల్లోనే ఉంది. దీనిని ఉపయోగించుకొని మన భాషను ఇంకా బలపరుచుకొని వచ్చే తరాలకు కూడా మన భాషను మనం అందించాల్సిన తరుణం ఇది.

సంబంధిత రచనలు

1. గారపాటి ఉమామహేశ్వరరావు. *2017.* తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం. విజయవాడ: తెలుగుజాతి ట్రస్టు ప్రచురణ.
2. శివదాసన్, వి. *2022.* అసంఘటిత మరియు సంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికుల శాతం, అనుత్తరిత ప్రశ్న సంఖ్య: *2157,* రాజ్యసభ. పనిజనులు మరియు ఉపాధి మంత్రిత్వశాఖ, భారత ప్రభుత్వం.
3. ప్రపంచ మేధసంపత్తి సూచికల నివేదిక. *2023. 2022*లో ప్రపంచవ్యాప్తంగా రికార్డుస్థాయిలో పేటెంట్లు. జెనీవా: ప్రెస్ విడుదల సంఖ్య: *PR/2023/910.*



ప్రా॥ గారపాటి ఉమామహేశ్వరరావుగారు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి భాషాశాస్త్రంలో డిగ్రీని, అనువర్తిత భాషాశాస్త్రం (Applied Linguistics)లో న్యూయార్క్‌లో స్టోనీబ్రూక్ యూనివర్శిటీ నుంచి ఎం.ఎ. డిగ్రీ చేశారు. తెలుగుభాషను కంప్యూటరీకరించటంలో వీరి పాత్ర ప్రముఖమైనది. తెలుగుభాష వికాసానికి ఉపయోగపడే సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేశారు. తెలుగుభాష ఉద్యమానికి సైద్ధాంతిక నేపథ్యం అందిస్తున్నారు. తెలుగుభాషపై ఎన్నో పరిశోధన గ్రంథాలు రచించారు. 2019 సంవత్సరానికి తానా-గిడుగు రామమూర్తి భాషా పురస్కారం పొందారు.

వెండితెర పైకి... అక్షరాల విజయయాత్ర

డా. రెంటాల జయదేవ

ప్రాచీన ఆలంకారికులు కావ్యాన్ని... శ్రవ్యమనీ, దృశ్యమనీ రెండుగా వర్గీకరించి, విశ్లేషించారు. పాతకాలపు దృశ్యకావ్యానికి ఒక విధమైన పొడిగింపు సినిమా. వెండితెరపై ఛాయా చలనచిత్రాలతో సాగే వినూత్న కళావిష్కారం. అలనాటి రెండు కావ్యభేదాల సరసన ముచ్చటగా వచ్చి చేరిన మూడో కావ్యభేదం. అనేక కలలు, అన్ని కళలూ కలగలసిన సమగ్రమైన కళ సినిమా.

కథ, నవల, నాటకం, బుర్రకథలు, యక్షగానాలు ఇవన్నీ అపారమైన సాహితీసంపదలో భాగాలు. వేర్వేరు ప్రక్రియలు. అయితే, ప్రాథమికంగా రచనలోనే భాగాలు. కానీ, సినిమా అలా కాదు. అక్కడ కేవలం రచనతో సరిపోదు. సినిమా అనే దృశ్య, శ్రవ్య ప్రక్రియ పూర్తిగా అనేకానేక కళల సమాహార రూపం. ఇక్కడ సంగీతం, సాహిత్యం, నృత్యం, ఇంకా అనేక కళలుంటాయి. అందుకే, సాహిత్యం ప్రధానంగా మేధాపరమైన శ్రమ అయితే... సినిమా అనేది మేధతోపాటు మనీతో ముడిపడిన విషయం. ఆలోచనతోపాటు అంతకుమించిన ఆర్థిక వ్యవహారాలూ కీలకం. ఒక వ్యక్తి సృజనాత్మకత ఒక్కటే ఉంటే సరిపోదు... ఇంకా సవాలక్ష కావాలి. సంకల్పంతోపాటు సమష్టికృషి అవసరం. కెమేరా, సంగీతం, నృత్యం, ఎడిటింగ్- ఇలా అన్ని విభాగాలనూ ఏకోన్ముఖంగా నడిపించే సమర్థుడైన సారథి అవసరం. వీళ్లందరినీ కంటికి రెప్పలా చూసుకొంటూ, పిల్లల కోడిలా కాపాడుకొనే సహనశీలి అయిన నిర్మాత అవసరం. అందుకే, సాహిత్యానికి ఉన్న కష్టం కన్నా సినిమాకు పడాల్సిన కష్టం ఎప్పుడూ ఎక్కువే!

ప్రాథమికంగా సినిమా దృశ్యమాధ్యమమే అయినప్పటికీ, భాష, సాహిత్యం లేకుండా కథ, మాట, పాట ఎలా సాధ్యం? కాబట్టి, సాహిత్యం లేని సినిమానే ఊహించలేం. కథలోని ఇతివృత్తాన్ని, నవలలోని జీవితావిష్కరణనూ, కవిత్వంలోని భాషాసౌందర్యాన్ని, నాటకంలోని సంభాషణా చాతుర్యాన్ని, విమర్శలోని ఆదర్శాలనూ ఇలా అన్నిటినీ సినిమా జీర్ణించుకుంది. సాంకేతిక శాస్త్ర నైపుణ్యాన్నీ సొంతం చేసుకొంది. చిత్రకళ-నాట్యం-గానంలాంటి లలితకళలనూ తనలో అంతర్భాగంగా కలిపేసుకుంది. అందుకే, ఆధునిక ప్రజాజీవనంలో శిఖరాగ్ర కళాస్వరూపంగా సినిమా కొలువు తీరింది.

సాహిత్యం అనేక శతాబ్దాల ప్రాచీనమైనదైతే, తెరపై కథా కథనమైన సినిమా పట్టుమని ఓ శతాబ్దం పైచిలుకు క్రితమే వచ్చిన అర్వాచీనం. వయసులో చిన్నదైన సినీమాధ్యమంపై సాహిత్య ప్రభావం ఉండడం సహజం. అందుకే, సాహిత్యానికీ - సినిమాకూ సంబంధం ఉందా అంటే, సాహిత్యం లేకుండా సినిమానే లేదు. చిన్నదో, పెద్దదో కథ... ఆ కథలో కనిపించే పాత్రలు... వాటి ప్రవర్తన... అవి మాట్లాడే మాటలు... పాడే పాటలు... ఇవన్నీ ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా సాహిత్యమే! కాకపోతే, 'సినీ 'మా' సాహిత్యం'.... కడుపు మండినవారి దృష్టిలో 'సినీ 'మాయా' సాహిత్యం' కూడా!

ఆధునిక తెలుగు సమాజాన్ని, స్వాతంత్ర్యానంతర తెలుగు సాహితీచరిత్రను గమనించినప్పుడు సాహిత్యకారులెందరికో సినీ మాధ్యమంతో సంబంధం ఉంది. వాళ్లు లేని సినిమాను ఊహించ లేం కూడా! తొలినాళ్లలో తెలుగులో సినిమాలకు పనిచేసినవారిలో దువ్వూరి రామిరెడ్డి, వేలూరి శివరామశాస్త్రి, బలిజేపల్లి లక్ష్మీకాంత కవి, గుఱ్ఱం జాషువా, తాపీ ధర్మారావు, చలం వగైరా అందరూ సాహితీలోకంలో సుప్రసిద్ధులే!



సినిమాల్లో సాహిత్యం...

ఆరంభం కాలం నుంచే సినిమాకూ, సాహిత్యానికీ అనుబంధం ఉంది. మాటలు నేర్చిన మూగ సినిమా టాకీగా మారితే, నాటకాల పద్ధతిలో అందులో మాటలకు పాటలు, పద్యాలు తోడయ్యాయి. సినిమా సువర్ణానికి సాహిత్యమనే తావి అబ్బింది. అలా వాక్చిత్రాల కాలం నుంచి సినిమాకూ, సాహిత్యానికీ బంధం ఏర్పడిందని అనుకోవడం సహజం, సమంజసం కూడా! కానీ, కొద్దిగా వెనక్కి వెళితే దేశంలో మూకీ చిత్రాల కాలం నుంచే సినిమాకూ, సాహిత్యానికీ బంధం ఉందని తెలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది.

మూకీల కాలంలోనే...

మూకీల రోజుల నుంచి మన సినిమాలన్నీ సాహిత్యం ఆధారంగా వచ్చినవే.

ఉదాహరణకు- 1. భారతదేశంలో మొదటిసారి తెరకెక్కిన మూకీ ఫిల్మ్‌లు. కలకత్తాకు చెందిన హీరాసేన్ 1900ల మొదట్లో ఫిల్మ్ చేసింది నాటకాలనే! అలాగే, 1913లో వచ్చిన తొలి భారతీయ ఫీచర్‌ఫిల్మ్ రాజా హరిశ్చంద్ర నాటకం ఆధారంగా తీసినదే! అంతకన్నా ముందే 1912లోనే వెలువడ్డ ఆర్.జి. టోర్నీ తీసిన పుండలీక్ సినిమా కూడా నాటకాల ఆధారంగా వచ్చినదే!

2. దక్షిణాదిలో వచ్చిన తొలి మూకీ కీచక వధమ్ (1918 జనవరిలో మద్రాసులో ఎల్ఫిన్‌స్టన్ థియేటర్‌లో రిలీజైందని అంటారు). దానికి మహాభారతంలోని ఘట్టం ఆధారం.

3. మన తెలుగువాడు రఘుపతి వెంకయ్య నిర్మాతగా వచ్చిన తొలి మూకీ భీష్మ ప్రతిజ్ఞ (1921), గజేంద్ర మోక్షం, మత్స్యావతార్ లాంటివి కూడా పౌరాణికకథలు, నాటకాల ఆధారంగా తయారైనవే.

4. మలయాళీలు తీసిన మూకీ చిత్రం మార్తాండవర్మ ఏకంగా అదే పేరుతో వచ్చిన మలయాళీ నవల ఆధారంగా తీసిన చిత్రం. ఆ నవలా రచయిత పేరు- సి.వి. రామన్ పిళ్లై.

5. దక్షిణాదిన రాజా శాండో దర్శకత్వంలో వచ్చిన మూకీ చిత్రం ఆర్ఫన్ గర్ల్ (అనాథై పెణ్ 1931) అలా సమకాలీన నవల నుంచి తయారైన మూకీయే. శతాధిక గ్రంథ రచయిత్రి, తొలి తమిళ మహిళా జర్నలిస్టు, తొలి డిటెక్టివ్ నవలా రచయిత్రి అయిన వై.ము. గోదైనాయకీ అమ్మాళ్ రాసిన నవల ఆధారంగా వచ్చిన సోషల్ మూకీ ఫిల్మ్ అది.

ఇంటర్ టైటిల్ కార్డులు... ఇంటర్ ప్రెటర్లు...

మాటా, పలుకూ లేని మూకీల యుగంలో సినిమా అచ్చంగా దృశ్యమాధ్యమమే. అందులో కథ వరకే సాహిత్యం అనుకోవాలి. కాకపోతే, మూకీల కాలంలో సినిమా కథ ప్రేక్షకులకు అర్థం కావడానికి తెరమీది సందర్భాన్ని వివరిస్తూ దృశ్యానికీ, దృశ్యానికీ మధ్య ఇంగ్లీషులో, దేశీయ చిత్రాలైతే ఇంగ్లీషుతోపాటు హిందీ, తెలుగు, తమిళ, తదితర స్థానిక భాషల్లో 'ఇంటర్ టైటిల్ కార్డ్‌లు' వేసేవారు. తెరమీద చూపుతున్న కథలోని అంశాలనూ, ఆ పాత్రల మధ్య మాటామంతీనీ మధ్య మధ్య వచ్చే ఆ కార్డులు తెలిపేవి. కథారచనకాక ఈ ఇంటర్ టైటిల్ కార్డుల రచన ఒక రకంగా సినిమాల్లో తొలి సాహితీ వినియోగం అనుకోవచ్చు.

అయితే, ఆ రోజుల్లో నిరక్షరాస్యత కూడా ఎక్కువే. అందుకే, ఈ దేశ, విదేశీ మూగ సినిమాలను కానీ, తెరపై ఇంటర్ టైటిల్ కార్డుల్లో కనిపించే కథా సందర్భ సంగ్రహాన్ని కానీ అర్థం చేసుకోలేని నిరక్షరాస్యుల కోసం ఇంటర్ ప్రెటర్లను, అంటే వ్యాఖ్యాతలను పెట్టే పద్ధతి వచ్చింది. సదరు వ్యాఖ్యాత హాలు మధ్యలో ఉండి, సినిమా కథనూ, తెరపై సన్నివేశాలనూ వైనవైనాలుగా వర్ణించే చెప్పడం రివాజు అయింది.

టాకీలతో తెరపై తొలిసారిగా... తెలుగు వెలుగు

కథకు మాట, పాట కూడా జత కలవడంతో టాకీల ఆరంభం నుంచి సినిమాకూ, సాహిత్యానికీ విడదీయరాని బలమైన బంధం ఏర్పడింది. మన భారతీయ తొలి టాకీ ఆలమ్ ఆరా (1931 మార్చి 14న రిలీజ్) అప్పటి ప్రసిద్ధ పార్సీ నాటక రచయిత జోసెఫ్ డేవిడ్ రాసిన నాటకం ఆధారంగా తీసినదే.

మరి, తెలుగులో అలా తెరపై తొలిసారిగా సాహిత్యవాసనలు ఎప్పుడు, ఎలా గుబాళించాయో తెలుసుకోవడం ఆసక్తికరమైన కథ. అందుకు ఇంకొద్దిగా లోతుల్లోకి వెళ్లాలి.

తొలి తెలుగు టాకీ అనగానే ఇప్పటికీ భక్త ప్రహ్లాద (1932) పేరు చెప్పేస్తుంటాం. కానీ, ఆ సినిమా కన్నా ముందే తెరపై తెలుగు మాట, పాట వినిపించిన సంగతి విస్మరిస్తుంటాం. ఇటీవల ఈ పరిశోధక రచయిత పదే పదే ప్రముఖంగా ప్రస్తావించేవరకు మన చరిత్రలో నమోదు కాని అంశం ఏమిటంటే... తమిళులు తమ తొలి టాకీగా చెప్పుకొంటున్న కాళిదాస్ నిజానికి తెలుగు సంభాషణలతో తయారైన తెలుగు టాకీ. మన మాట, పాట తెరపై తొలిసారిగా వినిపించింది అందులోనే. ఆ టాకీని తెలుగువాళ్లం మన సినిమాల లెక్కల్లో వదిలేసుకుంటే, మెజారిటీ తమిళ సినీ

చరిత్రకారులు దాన్ని తొలి తమిళ టాకీగా పేర్కొంటూ, తమ సినీ చరిత్రలో కలిపేసుకున్నారు.

తమిళులు తమదిగా చెప్పుకుంటున్న కాళిదాస్ (1931 అక్టోబర్ 31న రిలీజ్) టాకీ... వాస్తవానికి 3 వేర్వేరు లఘు చిత్రాలను కలిపి, తెరపై చూపిన కదంబ టాకీ ప్రదర్శన. అందులో కాళిదాస్ కథను తెరపై చూపేది... ప్రధాన చిత్రం. దానికి ముందూ, వెనుకా... ఆ కాళిదాస్ కథతో అసలు సంబంధమే లేని మిగతా రెండు లఘు చిత్రాలనూ జోడించారు. ప్రధానమైన కాళిదాస్ కథకు ముందు వచ్చేది... తమిళ జాతీయవాద గీతాలు, ప్రణయ గీతాలు, తెలుగు త్యాగరాయ కీర్తనల లఘుచిత్రం. కాళిదాస్ కథాచిత్రం తర్వాత చివరలో వచ్చేది... తమిళ 'కురత్తి' నృత్య (కురవంజి నృత్య) ప్రదర్శన లఘు చిత్రం. ఈ మూడూ వేటికవి తక్కువ తక్కువ నిడివి చిత్రాలే. అయితే, ఆ రోజుల్లో టికెట్ కొని థియేటర్‌కు వచ్చే ప్రేక్షకులు సుదీర్ఘ సమయపు వినోదం ఆశించేవారు. అందుకే, వారిని మెప్పించడానికి వ్యాపారపు ఎత్తుగడగా, తెలివిగా మొత్తం మూడు లఘు టాకీలూ కలిపి, కాళిదాస్ అనే ఒకే టైటిల్‌తో, ఒకే ప్రదర్శనగా హాళ్లలో రిలీజ్ చేశారు. అలాగే, ప్రదర్శించారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని తమిళ, తెలుగువారందరినీ ఆకర్షించడం కోసం ఆ ప్రదర్శనకు 'తొలి తమిళ - తెలుగు టాకీ' అని ప్రచారం కూడా చేశారు.

నిజానికి, అందులో కాళిదాస్ కథ చెప్పే ప్రధాన లఘు చిత్రం కేవలం నాలుగు రీళ్ల తక్కువ నిడివి టాకీ. ఈ లఘు టాకీ పూర్తిగా తెలుగు డైలాగులతో, తెలుగు హీరో (వి.ఆర్. గంగాధర్)ను పెట్టి, తెలుగు దర్శకుడు (హెచ్.ఎం. రెడ్డి) తీసినది. తెలుగులో తీసిన ఆ కథాచిత్రంలో తాను స్వతహాగా తమిళ వనితనైనా, మొత్తం డైలాగుల్ని తమిళ లిపిలో రాసుకొని, చదువుకొని మరీ కెమెరా ముందు తెలుగులోనే సంభాషించినట్టు ఆ చిత్ర హీరోయిన్ (టి.పి. రాజలక్ష్మి) సైతం తెలిపారు. ఆ రకంగా కాళిదాస్‌తోనే తెరపై తొలిసారిగా తెలుగు మాట, పాట (తెలుగు త్యాగరాయ కీర్తనలు) వినిపించాయి. అలా అక్కడ నుంచే మన తెలుగు టాకీ సినిమాల చరిత్ర ఆరంభమైనట్టు గ్రహించాలి. ఈ తొలి దక్షిణ భారతీయ టాకీ కాళిదాస్ (1931 అక్టోబర్ 31న విడుదల) కూడా అప్పటికే ప్రసిద్ధమైన నాటక సంప్రదాయాలతో తీసినదే.

ప్రాచీన పద్యగద్యాలకూ పెద్ద పీట

నాలుగు రీళ్ల తొలి లఘు నిడివి తెలుగు టాకీ కాళిదాస్ అయితే, తర్వాత ముచ్చటగా మూడు నెలలు దాటీదాటగానే వచ్చిన మరో తెలుగు టాకీ భక్త ప్రహ్లాద (1932 ఫిబ్రవరి 6న రిలీజ్). కాకపోతే, ఈసారి వచ్చినది... 10 రీళ్ల తొలి పూర్తి నిడివి తెలుగు టాకీ. సదరు 'భక్త ప్రహ్లాద' టాకీ ఏకంగా ఆనాటి ధర్మవరం రామకృష్ణమాచార్యుల పాపులర్ నాటకం 'ప్రహ్లాద' ఆధారంగా తెరకెక్కింది. ఆ నాటకంలోని పద్యాలు, పాటలు అలాగే సినిమాలోకీ వచ్చేశాయి. మరో నాటక రచయిత చందాల కేశవదాసుతో కొన్ని పాటలూ రాయించుకున్నారు. అదిగో... అలా జనంలో పాపులరైన సాహిత్యాన్ని సినిమా మాధ్యమం వాడుకోవడం అప్పుడే మొదలైపోయింది.

టాకీల ఆ తొలి రోజుల్లోనే జనంలో ప్రచారంలో ఉన్న ప్రసిద్ధ కాల్పనిక, జానపద కథలు వెండితెర మీదకు వచ్చాయి. ఉదాహరణకు, 1. 'గులేబకావళి' చిత్రం (అరేబియన్ నైట్స్) 2. కాశీమజిలీ కథలు, 3. మదన కామరాజు కథలు, 4. సహస్ర శిరచ్ఛేద చింతామణి, వగైరా.

అలాగే, ఈ ఆధునిక సినిమా మాధ్యమం తనకు పూర్వమే జనంలో పాపులరైన శతాబ్దాల నాటి ప్రాచీన సాహిత్యంలోని కవిత్రయ భారతం, పోతన భాగవతం, వేమన శతకం నుంచి సమీప కాలపు తిరుపతి వేంకట కవుల 'పాండవోద్యోగ విజయాలు', చిలకమర్తి లక్ష్మీ నరసింహం 'గయోపాఖ్యానం' నాటక పద్యాల దాకా అన్నిటినీ ఉపయోగించుకుంది. పండితుల పుస్తకాలకూ, పోషకుల రంగస్థలానికే పరిమితమైన పద్యాన్ని తరువాతి తరాలకూ దగ్గర చేసింది. పామరులూ ఆస్వాదించేలా సెల్యులాయిడ్ పైకి తెచ్చింది. కొన్ని అభిరుచితో చేస్తే, మరికొన్ని వాణిజ్య అవసరాలతో చేసింది.

అలా తొలి పూర్తి నిడివి 10 రీళ్ల తెలుగు టాకీ 'భక్త ప్రహ్లాద' నాటి నుంచి సాహితీవేత్తలు, వారి సినీ సాహితీ సృజనలతో వెండితెర వెలుగులీనింది. 'భక్త ప్రహ్లాద'కు ఆనాటి నాటకకర్త చందాల కేశవదాసు ప్రత్యేకంగా సినిమా పాటలు రాయడంతో పెనవేసుకున్న అనుబంధం... ఇప్పటికీ కొనసాగుతోంది.

సినిమాల్లో సాహితీవేత్తలు

ఆధునిక సమాజంలో శిఖరాగ్ర కళా స్వరూపమైన సినిమా ఆది నుంచి పండిత, పామరులను ఆకర్షిస్తూనే వచ్చింది. సినీ రాజాస్థానంలో కాసింత చోటుకై మహా మహా సాహిత్యకారులు తాపత్రయపడే రోజులు తెచ్చింది. తెలుగు సినిమా ప్రారంభ దశకాలలోనే అగ్రశ్రేణి ఆధునిక తెలుగు కవులు, రచయితలు పలువురు మద్రాసుకు వలసపోవాల్సి వచ్చింది. కవులు పాటల రచయితలుగా, కథ నవల నాటక రచయితలు స్క్రిప్ట్ రచయితలుగా సినీ రంగానికి తరలివచ్చారు. అలా వచ్చినవారిలో అధికశాతం మంది అప్పటికే మంచి కవులు కావడంతో సినిమాకు సాహితీ సుగంధం అబ్బింది. సినిమా కథకు, మాటకు, పాటకు స్వర్ణయుగం దక్కింది.

తెలుగులో సినిమాలు మొదలైన నాటికి రంగస్థలంపై పౌరాణిక నాటకాలు వీరవిహారం చేస్తున్నాయి. అందుకే, పేరున్న నాటకాలనే సినిమాలుగా తీయడం, అందరికీ తెలిసిన పౌరాణికాలపైనే ఆధారపడడం జరిగింది. అది 1931 నుంచి దాదాపు ఆరేళ్లపాటు సాగిన తెలుగు సినిమా తొలిదశ. అప్పటి సినిమాల్లోని భాష కూడా అంతే! ప్రేమ విజయముతో 1936 నుంచి తెలుగు తెరపై సాంఘికాలు రావడం మొదలైనా, చాలాకాలం వరకు పాటలోనూ, మాటలోనూ గ్రాంథికాన్ని పూర్తిగా వదిలించుకోలేదు

మన సినిమా. సాంఘికాలు మొదలైనప్పటికీ, పౌరాణికాలతోపాటు జానపదాలూ ఇబ్బడిముబ్బడిగా వస్తుండడంతో ఆసాంతం వ్యావహారిక భాషను అక్కున చేర్చుకోలేదు.

తొలి రోజుల్లోనే గుడిపాటి వెంకటచలం (మాలపిల్ల చిత్రకథ), తాపీ ధర్మారావు, త్రిపురనేని గోపీచంద్, విశ్వనాథ కవిరాజు (అసలు పేరు మల్లాది విశ్వనాథశర్మ) లాంటి సాహితీవ్రతులు సినిమా రంగానికి వచ్చి పనిచేశారని గమనించాలి. నిజానికి, తాపీ ధర్మారావే చెప్పినట్టు, "సినిమా పదిమంది కలిసి చేసే పని. రచయిత మాత్రమే బాధ్యుడు కాడు." కానీ, చిత్తజల్లు పుల్లయ్య అనుభవసారం ఏమిటంటే, తెలుగు సినిమాల 'తొలి దశలో సినిమా బాగోగులకు రచనా, రచయితే బాధ్యులని దర్శక, నిర్మాతలు భావించేవారు'.

అందుకే, అప్పట్లో సాహితీవేత్తలను సినీరంగం ఆహ్వానిస్తూ వచ్చింది. సంప్రదాయ కవి విశ్వనాథ సత్యనారాయణ నుంచి ప్రజాకవి గద్దర్ వరకు ఎందరెందరో లబ్ధప్రతిష్ఠులు సినీరంగంలోనూ కృషిచేశారు. వెండితెరకూ కలం శ్రమ చేసిన రచయితలుగా మద్దిపట్ల సూరి, బొల్లిముంత శివరామకృష్ణ నుంచి ఇప్పటి ఓల్గా, వరకు అందరూ సినిమాలకు కథలు అందించినవారే. సినిమాలకు రచన చేసిన సాహితీవేత్తలే.

కెమెరా ముందుకొచ్చిన కథలెన్నో!

సాహితీసృజనలైన కథలు, నవలలు, నాటకాలు ఒక దశలో సినిమాగా పరిణామం చెందిన క్రమం కూడా ఆసక్తికరం. కాల్పనిక కథల నుంచి సినిమాలు తయారైన ధోరణిలో బి.ఎన్. రెడ్డి రచన 'మంగళసూత్రం' ఆధారంగా వచ్చిన వందేమాతరం, గుడిపాటి వెంకటచలం రచన ఆధారంగా తీసిన విప్లవాత్మక సంఘసంస్కరణ చిత్రం మాలపిల్ల లాంటివన్నీ తొలినాళ్ల ముచ్చట్లు. ఇక, అదే చలం రాసిన 'దోషగుణం' ఆధారంగా గ్రహణం (2004) సినిమా రూపొందడం ఇటీవలి కథ. పాలగుమ్మి పద్మరాజు రాసిన 'పడవ ప్రయాణం' కథ ఆధారంగా ప్రముఖ మలయాళ దర్శకుడు కె.ఎస్. సేతుమాధవన్ తెలుగులో స్త్రీ (1995) తీస్తే, మన శ్రీరమణ కథ 'మిథునం' ఆధారంగా ప్రసిద్ధ మలయాళ రచయిత ఎం.టి. వాసుదేవన్ నాయర్ మలయాళంలో సినిమా (ఒరు చెరు పుంచిరి 2000) తీయడం మన సాహిత్యానికి పరభాషలో దక్కిన బంగారు మురుగు. ఆ తరువాత పుష్కరకాలానికి 2012లో అదే కథ తెలుగులో మిథునం పేరుతోనే తనికెళ్ల భరణి దర్శకత్వంలో సినిమాగా రావడం మరో విశేషం.

ఒకే కుటుంబంలోని సాంప్రదాయిక, విప్లవాత్మక భావాల మధ్య సంఘర్షణను ప్రతిబింబించిన రెంటాల నాగేశ్వరరావు 'తిలదానం' కథ వెండితెరపై అవార్డుల పంట పండించింది. ప్రముఖ సినీ విమర్శకుడు కె.ఎన్.టి. శాస్త్రి తొలిసారిగా మెగాఫోన్ పట్టి తెర కెక్కించిన ఆ తిలదానం (2001) చిత్రకథ ఆయనకు ఉత్తమ తొలి చిత్ర దర్శకుడిగా రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డుతోపాటు జాతీయ అవార్డు కూడా తీసుకురావడం చెప్పుకోదగ్గ అంశం. ఇక, రావిశాస్త్రి 'ఆరు సారా కథలు'లో ఓ కథ ఆధారంగా అజయ్ హీరోగా దర్శకుడు డి.ఎస్. కణ్ణన్ సారాయి వీర్రాజు (2009) సినిమా స్క్రిప్టును అల్లుకోవడం ఈ మధ్యకాలపు చరిత్ర.

సీరియల్స్ టు సినిమాలు

సమకాలీన నవలలు, పత్రికలలో వస్తున్న సీరియల్స్ నుంచి సినిమాలు తీయడం కూడా మూకీరోజులు, టాకీల తొలినాళ్ల నుంచి ఉన్నదే. వెండితెర మాటలు నేర్చి టాకీలు వచ్చాక... పత్రికల్లోని ధారావాహికలు సినిమాకు ఓ మంచి ముడిసరుకు అయ్యాయి. సుప్రసిద్ధ భరతనాట్య కళాకారిణి పద్మా సుబ్రహ్మణ్యం గారి తండ్రి తమిళ దర్శకుడు కె. సుబ్రహ్మణ్యంగారు 'ఆనంద వికటన్'లో వస్తున్న మున్షీ ప్రేమ్‌చంద్ నవల తమిళ అనువాదం చదివారు. పాఠకుల నుంచి దానికి అద్భుతమైన స్పందన వస్తుండడంతో, ఆ నవల ఆధారంగా సేవాసదన్ (1938) రూపొందించారు. కర్ణాటక సంగీత సామ్రాజ్ఞి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి ఆ చిత్రం ద్వారానే తెరంగేట్రం చేశారు. అలాగే, మన తెలుగు నటి ఎస్. వరలక్ష్మి నటించిన తొలి తమిళ చిత్రం కూడా అదే.

తెలుగు సంగతికొస్తే, 1961లో ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి చక్రభ్రమణం మొదలు 1980లలో యండమూరి మరణమృదంగం, రక్తసిందూరం దాకా అనేక నవలలు పత్రికల్లో ధారావాహికగా వస్తున్నప్పుడే సంచలనం రేపి, ఆ వెనువెంటనే వెండితెర మీదకు వచ్చాయి. అది అందరికీ తెలిసిన చరిత్రే.

వేదిక నుంచి వెండితెరపైకి...

నాటకాల నుంచి సినిమాలుగా మారిన సాహిత్యం సంగతికొస్తే... తొలినాళ్ల సినిమాలన్నీ నాటకాలకు వెండితెర అనువాదాలే. నాటక ప్రక్రియకు ఆధునిక సాంకేతిక పరిణామం- సినిమా. తెలుగులో తొలి నాటక రచన 1880లో జరిగితే, అర్ధశతాబ్దం తర్వాత తెరపై తెలుగు మాటలు తొలిసారిగా వినిపిస్తూ టాకీ సినిమా వచ్చింది.

తొలి పూర్తి నిడివి తెలుగు టాకీ భక్త ప్రహ్లాదలానే, తొలి తెలుగు సాంఘిక చిత్రమైన కృత్తివెంటి నాగేశ్వరరావు ప్రేమ విజయము (1936) కూడా పాపులర్ నాటకానికి వెండితెర వెర్షనే! వేదుల సత్యనారాయణశాస్త్రి రాసిన 'కాలేజీ గరల్' నాటకానికి మార్పులు చేర్పుల రూపమే... ప్రేమ విజయము. అలాగే, అధికారికంగా అవునన్నా, కాదన్నా హెచ్.ఎం. రెడ్డి తీసిన వాహినీ వారి గృహలక్ష్మి (1938)కి రంగస్థలంపై విజయవంతమైన 'రంగూన్ రౌడీ' (అను 'పతిభక్తి' - 1929) నాటకం ప్రేరణ అని అర్థమవుతూనే ఉంటుంది.

ఇక, విదేశీ చలనచిత్రోత్సవాలకు వెళ్లిన తొలి తెలుగు సినిమా అయిన బి.ఎన్. రెడ్డి కళాఖండం మల్లీశ్వరి (1951) సైతం రచయిత బుచ్చిబాబు రేడియో నాటిక 'రాయలవారి కరుణకృత్యం' ప్రేరణతో తయారైనదే అన్నది జగద్విదితం. బుచ్చిబాబు మూలానికి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, బి.ఎన్. రెడ్డిల ప్రతిభ, కల్పనాశక్తి, ఎన్టీఆర్

భానుమతి ద్వయం అభినయ ప్రతిభ తోడవడంతో మల్లీశ్వరి చిత్రం నేటికీ అపూర్వ కళాఖండంగా నిలిచింది.

పాపులర్ నాటకాలకు సినీరూపం!

వేశ్యా లంపటత్వం, వరకట్నం లాంటి సాంఘిక దురాచారాలను ఎత్తిచూపిన కాళ్లకూరి నారాయణరావు చింతామణి, వరవిక్రయం, అలాగే గురజాడ అప్పారావు కన్యాశుల్కం నాటకాలు అవే పేర్లతో తెరకెక్కడం తెలుగు సినిమా తొలి దశకాల విశేషం. తెలుగులో సినిమాగా రూపొందిన తొలి సాంఘిక నాటకమనే ఖ్యాతి 'చింతామణి'కి దక్కింది. కాళ్లకూరి వారి సంతతికే చెందిన సదాశివరావు దర్శకత్వంలో 1933లోనే ఆ చిత్రం విడుదలవడం విశేషం. ఆపైన 1939లో చిత్తజల్లు పుల్లయ్య దర్శకత్వంలో వరవిక్రయం, 1955లో పి. పుల్లయ్య దర్శకత్వంలో ఎన్టీఆర్ నటించిన కన్యాశుల్కం తెరపై వినోదం పంచాయి.

1960ల సంగతికొస్తే- అన్నాచెల్లెళ్ల ఆత్మీయానురాగాల చుట్టూ పినిశెట్టి శ్రీరామమూర్తి అల్లిన రంగస్థల నాటకం అన్నా చెల్లెళ్లు సినిమాగా వచ్చింది. అలాగే, డి.వి. నరసరాజు రాసిన 'ఇదేమిటి?' నాటకాన్ని 1966లో రేఖాముురళీ పతాకంపై కె. హేమాంబరధరరావు దర్శకత్వంలో సినిమాగా తీశారు. సంస్కృతంలో శూద్రక మహాకవి రచించిన 'మృచ్ఛకటికం' నాటకం ఆధారంగా 1967లో ఏయన్నార్‌తో వసంతసేన చిత్రాన్ని రూపొందించారు.

1970లలో నాటకాల నుంచి సినిమాల రూపకల్పన జోరుగానే సాగినట్టు తెలుగు సినీచరిత్ర చూస్తే కనిపిస్తుంది. దాసం గోపాలకృష్ణ పాపులర్ నాటకం 'చిల్లరకొట్టు చిట్టెమ్మ', పరిషత్తు నాటకంగా బహుమతులందిన పరుచూరి వెంకటేశ్వరరావు 'మరో మహాభారతం' (వెండితెరపై కలియుగ మహాభారతం- 1979), యండమూరి వీరేంద్రనాథ్ ప్రయోగాత్మక నాటకం 'కుక్క' (1980) లాంటివన్నీ ఆ దశకంలోనే స్టేజ్ డ్రామాల నుంచి సిల్వర్ స్క్రీన్‌కు వచ్చాయి. గంగపుత్రుల వ్యథలను చెబుతూ, ప్రముఖ రచయిత గణేష్‌పాత్రో విశాఖ మాండలికంలో సాగించిన స్వీయ రచనలు 'పావలా', 'కొడుకు పుట్టాల...' తర్వాత కాలంలో ఆ రెండు నాటకాలనూ కలిపి, ఆయనే సిద్ధం చేసిన కథ, మాటలతో కృష్ణంరాజు హీరోగా నాకూ స్వతంత్రం వచ్చింది (1975) సినిమా తయారైంది. అలాగే, ప్రముఖ నాటక రచయిత సి.ఎస్. రావు నాటకాలు ఊరుమ్మడి బతుకులు (1977 దర్శకత్వం బి.యస్. నారాయణ), ప్రాణంఖరీదు (1978 దర్శకత్వం కె. వాసు) సైతం అవే పేర్లతో సినిమాలుగా వచ్చాయి.

తరతరాలుగా పల్లకీ మోస్తున్నవారు ఒక్కసారి విసుగెత్తి, సహనం కోల్పోయి, తామెందుకు అలా ఉన్నామో తెలుసుకొని, వంచిన తల ఎత్తితే ఏమవుతుందన్నది సత్యేంద్రకుమార్, నూతన్ ప్రసాద్, రాళ్లపల్లి తదితరులు తెరపై నటించిన ఊరుమ్మడి బతుకులు ఇతివృత్తం. ఇక, అనుమానపు పిశాచి ఆవహించినవారి కండకావరానికి పేదలు ఎలా బలైపోతున్నారో, పేదవాడి ప్రాణం ఖరీదు ఎంత కారుచౌకో చిత్రించిన సినిమా ప్రాణం ఖరీదు. జయసుధ, రావుగోపాలరావు తదితరులు నటించిన ఈ చిత్రం తోనే నేటి మెగాహీరో చిరంజీవి తొలిసారిగా థియేటర్లలో ప్రేక్షకులను పలకరించారు.

మధ్యతరగతి డ్రామాలూ మంచి సక్సెసే!

1990లలోనూ ఆ పద్ధతి అడపాదడపా కొనసాగినా, క్రమంగా నాటకాల నుంచి సినిమాల రూపకల్పన ఊపు తగ్గింది. రంగస్థల, సినీనటుడు, అనంతరకాలపు రాజకీయ నేత డాక్టర్ ఎన్. శివప్రసాద్ నిర్మాణ, దర్శకత్వ బాధ్యతలు చేపట్టి, ప్రముఖ నటి నేటి రాజకీయ నాయకురాలు రోజాను వెండితెరకు పరిచయం చేసిన చిత్రం ప్రేమతపస్సు (1991 ఆగస్టు 23). అది కూడా స్టేజ్ నాటకం ఆధారంగా తీసినదే. అందమైన ప్రేమకు అంతస్తుల భేదం అడ్డురాదనీ, నిజమైన ప్రేమ... త్యాగాన్నే కోరుతుందనే ఇతివృత్తంతో పల్లేటి లక్ష్మీ కులశేఖర్ రాసిన 'తపస్సు' నాటకం ఆ చిత్రానికి మూలం.

1990ల దశకంలో తెరపై సెంటిమెంట్‌ను అద్భుతంగా పండించి, బాక్సాఫీస్ వద్ద కాసులు కురిపించిన చిత్రాలు కలికాలం, ఆమె చిత్రాలు కూడా రంగస్థలం నుంచి రంగుల తెరపైకి వచ్చినవే. ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో జయసుధ నటిస్తూ, నిర్మించిన కలికాలం (1991 మే 30) చిత్రానికి రచయిత శ్రీరాజ్ రచన 'కాలధర్మం' ఆధారం. ఇ.వి.వి. సత్యనారాయణ దర్శకత్వంలో అప్పట్లో సంచలనం రేపిన ఆమె (1994 డిసెంబర్ 9) సినిమాకు ఇసుకపల్లి మోహనరావు రాసిన 'మర్యాదస్తులకో నాటకం' మూలం. ఆ తర్వాత ఆరేళ్లకు ఇ.వి.వి. దర్శకత్వంలోనే 2000లో వచ్చిన మరో



మధ్యతరగతి సెంటిమెంట్ కథాచిత్రం అమ్మో ఒకటో తారీఖు (2000 అక్టోబర్ 20). రచయిత ఎల్బీ శ్రీరామ్ నాటకం 'ఒంటెద్దు బండి'కి అది సినీరూపం.

కొన్ని నాటికలను సినిమాలో భాగంగా వినోదభరిత సన్నివేశాలుగా వినియోగించిన సందర్భాలూ ఉన్నాయి. ఆదివిష్ణు రాసిన 'వాళ్లిద్దరితో వీళ్లు ముగ్గురు', 'పండగొచ్చింది' నాటికల్లోని సన్నివేశాలను దర్శక రచయిత జంధ్యాల తన శ్రీవారికి ప్రేమలేఖ (1984) చిత్రంలో పూర్తిస్థాయిలో ఉపయోగించారు. ఇక, ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తిన ఎం. దివాకర్‌బాబు నాటిక ఏపుటుక్కు జర జర డుబుక్కు మే' నాటికను యథాతథంగా దర్శకుడు రేలంగి నరసింహారావు చలాకీ మొగుడు - చాదస్తపు పెళ్లాం (1989) చిత్రంలో వాడారు.

మొత్తానికి, ఇలా ఎన్నో నాటకాలు జనరంజక సినిమాలుగా రూపొందినా, ఎందుకనో ఇక ఆ తరువాత కాలంలో అలాంటి ప్రయత్నాలే చాలా అరుదయ్యాయి.

భాష ఏదైనా నాటకీయతకే ఓటు!

పాశ్చాత్య నాటకాలను ఆధారం చేసుకొని ఫక్తు తెలుగు వాతావరణంలో సినిమాలు తీయడమూ మనకు చాలాకాలంగా ఉన్నదే. పల్లెటూరి రాజకీయాలు, రాజకీయాల మాటున ఊరి పెద్ద మనుషుల ఘరానా దోపిడీని తెరపై సహజంగా చూపెట్టిన చిత్రం కె.వి. రెడ్డి దర్శకత్వంలో వచ్చిన పెద్దమనుషులు (1954). గమ్మత్తేమిటంటే, నాటక రచయిత డి.వి. నరసరాజు రచన చేసిన ఆ చిత్రానికి ఆధారం ప్రసిద్ధ నాటకకర్త హెన్రిక్ ఇబ్సన్ రాసిన 'ది పిల్లర్స్ ఆఫ్ సొసైటీ' నాటకం. ఆనాటి నుంచి ఈనాటిదాకా పాశ్చాత్య రంగస్థల నాటకాల ప్రభావంతో తెలుగు తెరపైకి సినిమాలు వస్తూనే ఉన్నాయి.

వర్తమానానికి వస్తే- సాహిత్యం చదువుకొని సినీరంగంలోకి ప్రవేశించిన ఇంద్రగంటి మోహనకృష్ణలాంటివారు నూతన సహస్రాబ్దిలో ఆస్కార్ వైల్డ్, షెరిడన్ తదితర పాశ్చాత్య ప్రముఖుల నాటకాల ఆధారంగా అష్టాచమ్మా (2008), అమీ తుమీ (2017), ఇటీవల వచ్చిన సారంగపాణి జాతకం లాంటి చిత్రాలను అల్లుకోవడం విశేషం. నటుడి నుంచి దర్శకుడిగానూ అవతారమెత్తిన అవసరాల శ్రీనివాస్ తీసిన ఊహలు గుసగుసలాడే (2014) కూడా నాటకానికి సినీ అనుసరణే. 19వ శతాబ్దపు ఫ్రెంచ్ నాటకం 'సైరానో డి బెర్గెరాక్'లోని ప్రధానాంశాన్ని తీసుకొని, అవసరాల ఈ తెలుగు సినిమా కథ అల్లుకున్నారు.

తెలుగులోనే కాదు... ఇతర భాషల్లోనూ ఇలా నాటకాలు, కథలు, నవలల ఆధారంగా సినిమాలు తీయడం ఆది నుంచి ఉన్నదే. ప్రపంచ ప్రసిద్ధ విలియమ్ షేక్‌స్పియర్ నాటకాలు ప్రపంచంలో ఎన్ని భాషల్లో సినిమాలుగా వచ్చాయో లెక్కేలేదు. జపనీస్ భాషలో అకీరా కురొసావా నుంచి హిందీలో గుల్జార్, విశాల్ భరద్వాజ్ దాకా ఎందరో దర్శకుల సినీసృజనలకు షేక్‌స్పియర్ ప్రేరణ అయ్యారు. గుల్జార్ తీసిన హిందీ చిత్రం అంగూర్ (1982)కు షేక్‌స్పియర్ నాటకం 'కామెరీ ఆఫ్ ఎర్రర్స్' ఆధారంగా ఈశ్వరచంద్ర విద్యాసాగర్ రాసిన బెంగాలీ నవల 'భ్రాంతి బిలాస్', ఆ నవలపై అదే పేరుతో వచ్చిన బెంగాలీ చిత్రం మూలమయ్యాయి. ఇక, విశాల్ భరద్వాజ్ రూపొందించిన మక్బూల్ (2003- ఆధారం షేక్‌స్పియర్ 'మ్యాక్‌బెత్'), ఓంకార (2006- ఆధారం 'ఒథెల్లో'), హైదర్ (2014 - 'హ్యామ్‌లెట్'కు ఆధునికకాలపు రూపం) చిత్రాలు సమకాలికులు అందరికీ తెలిసినవే.

ఇక, మన తెలుగులో తొలి పూర్తి నిడివి పది రీళ్ల టాకీ భక్త ప్రహ్లాద (రిలీజ్ 1932 ఫిబ్రవరి 6) లాగానే తొలి పూర్తి తమిళ టాకీ హరిశ్చంద్ర (1932 ఏప్రిల్ 9) మొదలు తొలి అస్సామీ టాకీ జాయ్‌మతి (1935 మార్చి 10) సైతం నాటకాల ఆధారంగా తయారైనవే. ఆ మాటకొస్తే, అస్సామీ భాషలోని అనేక పాపులర్ రంగస్థల నాటకాలు, రేడియో నాటకాలు సినిమాలుగా వచ్చాయి. హిందీలోనూ ఇలాంటి ఉదాహరణలు అనేకం. శ్యామ్ బెనెగల్ తీసిన సూరజ్ కా సాత్వా ఘోడాకు ఆధారం ధర్మవీర్ భారతి రాసిన నాటకమే. ఇక, గిరీశ్ కర్నాడ్ పాపులర్ నాటకాలు 'నాగమండల', 'అగ్నివర్ష', వగైరా వేదికపై నుంచి వెండితెరకెక్కాయి.

వెండితెర కెక్కిన తెలుగు వెలుగు కథలు...

నాటకాల సంగతి అటుంచి కథల దగ్గరకు వద్దాం. సినిమా కోసం రాసుకున్న కథలు కాకుండా... అప్పటికే విడిగా రాసిన కథలను వెండితెరపై వెలుగులు పంచే సినిమాగా మలచిన సందర్భాలు తెలుగులో చాలానే ఉన్నాయి. కొన్ని ఉదాహరణలు చెప్పుకోవాలంటే... 1. ఒక కథ లేక పెద్ద కథ ఆధారంగా తెలుగులో వచ్చిన తొలి సాంఘిక చిత్రం గూడవల్లి రామబ్రహ్మం విప్లవాత్మక చిత్రం మాలపిల్ల (1938). ప్రముఖ రచయిత గుడిపాటి వెంకట చలం రాసిన ఒక అముద్రిత పెద్ద కథ లేక నవలిక ఆధారంగా ఈ సాంఘిక విప్లవ ప్రబోధాత్మక చిత్రం తీశారు.

2. బి.ఎన్. రెడ్డిగారు స్వీయ దర్శకత్వంలో, కె. రామ్‌నాథ్ ఛాయాగ్రాహకుడిగా తీసిన చిత్రం వందేమాతరం. నాగయ్య నటించిన ఆ చిత్రాన్ని జాగ్రత్తగా గమనిస్తే, 'వందేమాతరం' అను 'మంగళసూత్రము' అని టైటిల్ రాసి ఉంటుంది. ఆ సినిమా నిజానికి, బి.ఎన్. రెడ్డి రాసిన ఒక పెద్ద కథ, లేక నవలిక ఆధారంగా తీసిన సినిమా. ఆయన తన స్వగ్రామం కొత్తపల్లిలోని ఒక ఉన్నత ధనిక కుటుంబంలో జరిగిన నిజజీవిత సంఘటన ఆధారంగా ఆ కథ రాశారు. ఆ కథనే వందేమాతరం సినిమాగా రూపొందించారు.

3. కాళీపట్నం రామారావు ప్రసిద్ధ 'యజ్ఞం' కథ ఆధారంగా గుత్తా రామినీడు తీసిన చిత్రం యజ్ఞం (1991). ఆ కథ మీద జరిగిన చర్చలే కథ కన్నా ఎక్కువ నిడివి ఉన్నాయి. అలాగే, పి.ఎల్. నారాయణ తదితరులు నటించిన ఆ చిత్రం మీద ఎంతో చర్చ జరిగింది.

4. విలక్షణ కథలను ఎంచుకొనే దర్శకుడు నరసింహా నంది రూపొందించిన *1940*లో ఒక గ్రామం (2008), ఆ తరువాత వచ్చిన కమలతో నా ప్రయాణం (రిలీజ్ 2014 మార్చి 14), లజ్జ (2016 ఫిబ్రవరి 5) కూడా సాహిత్యం ఆధారంగా వచ్చిన సినిమాలే!



ఎ) 2008లో వచ్చిన సినిమా బాలాదిత్య నటించిన *1940*లో ఒక గ్రామం. గురజాడ అప్పారావు రచన 'ఘోష' దీనికి ఆధారమట. అదే సమయంలో చలం రాసిన 'నాయుడు పిల్ల' అనే కథను స్ఫూర్తిగా తీసుకొని, ఈ చిత్రకథను డెవలప్ చేసుకున్నట్లు దర్శకుడు నరసింహ నంది చెప్పారు. కుల ప్రాతిపదికన సాగే దుర్వి చక్షణను ధైర్యంగా చూపిన ఈ చిత్రానికి ఆ ఏడాది తెలుగులో ఉత్తమ చిత్రంగా జాతీయ అవార్డు, జాతీయ సమైక్యతను ప్రబోధించే చిత్రంగా నంది అవార్డు లభించాయి.

బి) ఇక ప్రముఖ కవి రచయిత దేవరకొండ బాల గంగాధర తిలక్ రచన 'ఊరు చివర ఇల్లు' ఆధారంగా వచ్చిన చిత్రం శివాజీ, అర్చన నటించిన కమలతో నా ప్రయాణం. ఇది కూడా ముందుగా పాఠకులను అలరించి, ఆ తరువాత ప్రేక్షకుల ముందుకు వచ్చినదే!

సి) చలం సంచలనాత్మక నవల 'మైదానం' ప్రేరణతో తీసిన చిత్రం మధుమిత నటించిన లజ్జ (2016). పై మూడింటిలో ఏదీ ఆర్థికంగా విజయం సాధించకపోయినా, విలక్షణ ప్రయత్నాలుగా దర్శకుడికి ప్రత్యేక గుర్తింపు తెచ్చాయి.

నవలా చిత్రాల శకం

నాటకం, కథ తరువాత ఇప్పుడిక నవలల సంగతి. సర్వ సాధారణంగా... సాహిత్య ప్రక్రియ అయిన నవలను చదవాలి. సాంకేతిక కళావిప్లవమైన సినిమాను చూడాలి. కానీ, చూసే నవలలుగా 'నవలా చిత్రాలు', చదివే సినిమాలుగా 'వెండితెర నవలలు' రావడం తెలుగు సినీరంగంలో జరిగిన విశేషం. మొదటగా ప్రముఖ రచయితల నవలలు... తెరకెక్కిన వైనం తెలుగుతెరపై ఒక ప్రత్యేక అధ్యాయం.

సినిమా తెలుగులో మాట్లాడడం మొదలై, పట్టుమని పదేళ్లు కాకముందే 1940లోనే మొక్కపాటి నరసింహశాస్త్రి గారి బారిస్టర్ పార్వతీశం నవల అదే పేరుతో వెండితెరపైకి (1940 ఆగస్టు 7న) వచ్చింది. రఘుపతి ప్రకాశ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా తెలుగులో తొలి నవలాచిత్రమనే రికార్డు సాధించింది. అప్పటినుంచి కరోనా అనంతర కొత్త ప్రపంచంలో రిలీజైన కొండపొలం సినిమా (2021- సన్నపురెడ్డి వెంకట రామిరెడ్డి నవల మూలం) దాకా శతాధిక నవలా చిత్రాలు వచ్చాయి.

విదేశీ రచనలు సైతం మన తెరపై ఆహ్లాదం పంచాయి. ఉదాహరణకు... విక్టర్ హ్యూగో రచన 'లే మిజరబుల్స్' ఆధారంగా నాగయ్య నటించిన బీదల పాట్లు (1950), అదే మళ్లీ అక్కినేని నాయకుడిగా, బి. విఠలాచార్య దర్శకత్వంలో బీదలపాట్లు (1972) పేరుతోనే విడుదలైంది. అమెరికన్ రచయిత మార్క్ ట్వెయిన్ 1881లో రాసిన ప్రసిద్ధ నవల 'ప్రిన్స్ అండ్ పాపర్'ను వెండితెరకు అనువదిస్తూ తెలుగులో వచ్చిన చిత్రం ఎన్టీఆర్, ఎస్వీఆర్ నటించిన రాజు-పేద (1954).

గమ్మత్తేమిటంటే, 1960లు, '70ల కాలం వచ్చేసరికి తెలుగు నాట మగ రచయితల పేర్ల కన్నా ఆడ రచయితల పేర్ల మీద రచనలు అయితే, వాటిని కళ్లకద్దుకొని ప్రచురించేవారు. ఆడ పేర్లకు అప్పుడున్న క్రేజ్ అది. అందుకే, చివరకు మన రచయితలు తమ పేర్లను ఆడపేర్లలాగా ధ్వనించేలా జాగ్రత్త తీసుకున్నారు. (శ్వేతాదేవి, లల్లాదేవి, జొన్నలగడ్డ లలితాదేవి, వగైరా). కానీ, చాలాకాలం క్రితం పాశ్చాత్యాన ఇందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి ఉండేది. ఆడవారి కన్నా, మగవాళ్లే నవలలు, రచనలు బాగా చేస్తారని అక్కడ ఓ నమ్మకం. అందుకే, 1861లో మేరీ ఆన్ ఎవాన్స్ అనే మహిళ జార్జ్ ఇలియట్ అనే మగ పేరుతో ఒక నవల రాసింది. అదే 'సైలస్ మార్నర్' అనే ఇంగ్లీషు నవల. దాదాపు వందేళ్ల తర్వాత ఆ నవలను ఆధారంగా చేసుకొని బి.ఎన్. రెడ్డి బంగారు పాప (1955) తీశారు. ఇప్పటికీ అదో సినీ ఆణిముత్యంగా మిగిలిపోయింది.

బెంగాలీ నవలల జోరు!

విదేశీ నవలల్ని పక్కనపెట్టిన మన స్వదేశీ రచనల ఆధారంగా వచ్చిన నవలా చిత్రాల ప్రస్థానాన్ని గమనిస్తే... 1940ల ద్వితీయార్ధం నుంచి 1960 ప్రథమార్ధం దాకా బెంగాలీ నవలలు, ఆ పైన 1970ల నుంచి 1990ల ప్రథమార్ధం దాకా తెలుగు నవలలు తెరపై తళుకులీనాయి. ఆ తరువాత క్రమంగా ఆ తరహా చిత్రాలు అరుదుగా మాత్రమే వస్తున్న పరిస్థితి.

ఏడున్నర దశాబ్దాల సైచిలుకు క్రితం నటుడిగా ఎన్టీఆర్‌నూ, సంగీత దర్శకుడిగా ఘంటసాలనూ తెరపై ప్రేక్షకుల ముందుకు తెచ్చిన భారత స్వాతంత్ర్య నేపథ్య చిత్రం మనదేశం (1949). అది కూడా బెంగాలీ నవలా ఆధారిత చిత్రమే. జాతీయోద్యమంలో పాల్గొని, దేశం కోసం సర్వం సమర్పించిన దేశభక్తుడి కుటుంబకథగా సాగే ఆ చిత్రానికి బెంగాలీ నవల 'విప్రదాసు' మూలం. స్వయంగా

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న రచయిత సముద్రాల సీనియర్ ఆ నవలను తెరపైకి తెచ్చే రచనా బాధ్యతలు నిర్వహించారు. 1950 నుంచి తెలుగులో ఎక్కువగా బెంగాలీ నవలల అనువాదాల ఆధారంగా సినిమాలు తీశారు. మధ్యతరగతి భద్రలోక్ జీవితాలు, మనుషులు, మానసిక సంఘర్షణలు, కుటుంబ బంధాలు, సామాజిక - నైతిక విలువలను అవి ప్రతిఫలించాయి. దేవదాసు (1953 - నవల పేరు 'దేవదాస్'), అర్ధాంగి (1955 - నవల పేరు 'స్వయంసిద్ధ'), తోడికోడళ్లు (1957 - నవల పేరు 'నిష్కృతి'), బాటసారి (1961 - నవల పేరు 'బడదీదీ'), వాగ్దానం (1961 - నవల పేరు 'దత్త') లాంటి నాటి పాపులర్ చిత్రాలకు బెంగాలీ రచయిత శరత్ నవలలే ఆధారం.

రవీంద్రనాథ్ టాగూర్ రచన 'ది రెక్' (తెలుగు అనువాదం 'పడవ మునక') ఆధారంగా చరణదాసి (1956) వచ్చింది. ఆశాపూర్ణాదేవి బెంగాలీ నవల 'అగ్నిపరీక్ష' తెలుగుతెరపై మాంగల్య బలం (1959) అయింది. ఆశాపూర్ణాదేవి బెంగాలీ నవల 'జోగ్ బియోగ్' ఆధారంగా అదే పేరుతో బెంగాలీలో 1953లో సినిమా వచ్చింది. అది తమిళంలోకి శివాజీగణేశన్‌తో పడిక్కాద మేదై (చదువుకోని మేధావి అని అర్థం - 1960)గా రీమేకైంది. అక్కడ నుంచి తిరిగి మళ్లీ తెలుగులోకి ఎన్టీఆర్‌తో ఆత్మబంధువు (1962)గా పునర్నిర్మాణమైంది.

బెంగాలీ నవలలకు దక్కిన సినీప్రాభవం, ప్రాచుర్యం క్రమంగా మనవాళ్లను తెలుగు నవలలవైపు దృష్టి సారించేలా చేశాయి. అవి తెరపైకి విస్తృతంగా వచ్చాయి. ముఖ్యంగా, 1950 -60లలో దుక్కిపాటి మధుసూదనరావు, 1970లలో డి. రామానాయుడు, 1980లలో కె.ఎస్. రామారావులాంటి పలువురు ప్రముఖ నిర్మాతలు ఈ నవలా చిత్రాల ధోరణిని పెంచి, పోషించారు.

అప్పుడంతా రచయిత్రులదే రాజ్యం!

1960, 70ల సంగతే తీసుకుంటే... ఒకరకంగా అది నవలా రచయిత్రుల యుగం. అప్పట్లో మహిళల నవలలు, వాటి ఆధారంగా వచ్చిన సినిమాలు జనాకర్షణ అంశాలయ్యాయి. అప్పట్లో రచయిత్రి పి. శ్రీదేవి రాసిన 'కాలాతీత వ్యక్తులు' నవల ఆధా రంగా వచ్చినదే చదువుకున్న అమ్మాయిలు (1963) చిత్రం. అలాగే, నవలా రచయిత్రుల్లో సూపర్‌స్టార్‌గా వెలిగిన యద్దనపూడి సులోచనారాణి నవలల ఆధారంగా ఆ నవలల పేర్లతోనే అనేక చిత్రాలు తెరమీదకు వచ్చాయి. వాటిలో కొన్ని... జై జవాన్ (1970), మీనా (1973), జీవన తరంగాలు (1973), బంగారు కలలు (1974), సెక్రటరీ (1976), ప్రేమలేఖలు (1977), రాధాకృష్ణ (1978), గిరిజాకల్యాణం (1981), ప్రేమసింహాసనం (1981), అగ్నిపూలు (1983).



ముందుగా సూపర్ హిట్ సీరియల్ నవల 'చక్రభ్రమణం' వెండితెరపై డాక్టర్ చక్రవర్తి (1964)గా వచ్చిన తర్వాత... 1970వ దశకంలో అదే రచయిత్రి కోడూరి (ఆరెకపూడి) కౌసల్యాదేవి నవలలు ప్రేమ్‌నగర్ (1971), శంఖుతీర్థం (1979) సినిమాలుగా ఆకర్షించాయి. రంగనాయకమ్మ రచనలు తెరపై రాధమ్మ పెళ్లి (1974 - నవల పేరు రాధమ్మ పెళ్లి ఆగిపోయింది), బలిపీఠం (1975), గోరింటాకు (1979 నవల పేరు ఇదెక్కడి న్యాయం)గా వచ్చాయి. ఆ దశాబ్దిలోనే కావిలిపాటి విజయలక్ష్మి నవల 'విధి విన్యాసాలు' తెరపై శోభన్‌బాబు ద్విపాత్రాభినయం చేసిన తాసిల్దారుగారి అమ్మాయి (1971)గా, అలాగే 'అపశ్రుతులు' అనే మరో రచన ఈ కాలం దంపతులు (1975)గా వచ్చాయి.

ఒక దశలో సినిమావాళ్లు... నవలా నిర్మాతలు, నవలా నాయకులు, నవలా నాయికలుగా ప్రసిద్ధికెక్కిన సందర్భాలూ ఉన్నాయి. యద్దనపూడి సులోచనారాణి, కోడూరి కౌసల్యాదేవి, రంగనాయకమ్మ... ఇలా పలువురు రచయిత్రుల రచనల్ని సినీ రంగం నెత్తిన పెట్టుకుంది. ఆ పరిస్థితుల్లోనే... 1973లో తమిరిశ జానకి విశాలి, 1976లో పాలగుమ్మి పద్మరాజు 'నల్లరేగడి' నవల (సినిమా కృష్ణ, జయప్రదల ఒక ఊరి కథ), 1981లో డి. కామేశ్వరి 'కొత్తమలుపు' (సినిమా- చిరంజీవి, రాధికల న్యాయం కావాలి) తెరమీదకు నడిచొచ్చాయి. నైజాం ప్రాంతంలో తెలంగాణ సాయుధ పోరాటం నాటి స్థితిగతులు, అప్పటికి దారుణమైన బానిస విధానాలనూ చిత్రించగా, దాశరథి రంగాచార్యకు కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు తెచ్చిన నవల చిల్లరదేవుళ్లు 1977లో సినిమాగా రావడం ఓ మరపురాని ఘట్టం.

అటు యండమూరి... ఇటు మల్లాది...

యద్దనపూడి శకం తర్వాత పాఠకలోకాన్ని ఏలిన నవలా రచయితలంటే యండమూరి, మల్లాది పేర్లు ప్రముఖంగా చెప్పుకోవాలి. వారి శకం వీక్లీల నుంచి వెండితెరకూ పాకింది. సాదా సీదా మధ్యతరగతి కుటుంబ కథల నుంచి ప్రధానంగా పట్టణ ప్రాంతపు క్రైమ్, సస్పెన్స్, రివెంజ్, కామెడీ తరహా స్టోరీల వైపు... పాఠకులు, అదే సమయంలో ప్రేక్షకులు మొగ్గిన కాలం అది. ప్రజాభి రుచిలో కలిగిన ఆ మార్పు ఆ రోజుల్లో ఆ ఇద్దరు రచయితల అప్రతిహత జైత్ర యాత్రకు ఓ ప్రధాన కారణమైంది. 1980-90లలో యండమూరి, మల్లాది రచనలు అనేకం వరుసగా సినిమాలుగా వచ్చాయి.

యండమూరి నవలల్లో అనేకం అవే పాపులర్ పేర్లతో సినిమాలయ్యాయి. అభిలాష

(1983), ఒక రాధ... ఇద్దరు కృష్ణులు (1985), రక్తసిందూరం (1985), రాక్షసుడు (1986), రక్తాభిషేకం (1988), ఆఖరి పోరాటం (1988), మరణమృదంగం (1988), రుద్రనేత్ర (1989), అగ్నిప్రవేశం (1990), స్టూవర్ట్‌పురం పోలీస్ స్టేషన్ (1991), కొంగుచాటు కృష్ణుడు (1993) లాంటివి అందులో కొన్ని. ఇక, వెండితెర కోసం పేరు మార్చుకొని చలనచిత్రాలుగా వచ్చిన యండమూరి నవల్లో 'డబ్బు టు ది పవర్ ఆఫ్ డబ్బు' (సినిమా ఛాలెంజ్ -1984), 'తులసిదళం' (సినిమా కాష్మోరా - 1986), 'నల్లంచు తెల్లచీర' (సినిమా దొంగమొగుడు - 1987), 'థ్రిల్లర్' (సినిమా ముత్యమంత ముద్దు - 1989), 'వెన్నెల్లో ఆడపిల్ల' (సినిమా హలో ఐ లవ్ యూ - 1997), 'అనైతికం' (సినిమా ఆకాశంలో సగం - 2013) వగైరా ఉన్నాయి. ఇక, విడిగా యండమూరి అనేక చిత్రాల రచనలో పాల్గొనడం, కొన్ని చిత్రాలకు స్వయంగా దర్శకత్వం వహించడం తెలిసిందే.

రాజేంద్రప్రసాద్ హీరోగా మంచి జోరుమీదున్న 1980-90 లలో మల్లాది వెంకటకృష్ణమూర్తి నవలలు అరడజనుకు పైగా ఆయన సినిమాలయ్యాయి. మల్లాది నవలల్లో రెండు రెళ్లు ఆరు జంధ్యాల దర్శకత్వంలో చంద్రమోహన్, రాజేంద్రప్రసాద్‌లు నటించగా అదే పేరుతో 1985లో సినిమాగా వచ్చింది. ప్రేక్షకులను అలరించింది. ఆపైన రాజేంద్రప్రసాద్‌తోనే డబ్బెవరికి చేదు (సినిమా టైటిలూ అదే - 1987), 'మిస్టర్ వి' (సినిమా ఝాన్సీరాణి - 1988), తేనెటీగ (తెరపై టైటిలూ అదే - 1991), 'వెడ్డింగ్ బెల్స్' (సినిమా గోల్‌మాల్ గోవిందం - 1992), 'విటమిన్ ఎం' (సినిమా లక్కీ ఛాన్స్ - 1994) వెండితెరకెక్కాయి.

ఇక, 'పెద్దలకు మాత్రమే' నవల నరేశ్‌తో శ్రీవారి శోభనం (1985)గా వస్తే చంటబ్బాయ్ నవల చిరంజీవి హీరోగా ఆ మరు సటేడే జనాన్ని వినోదపరిచింది. 'ధర్మయుద్ధం' నవల భాను చందర్‌తో ఇదేనా న్యాయం (1986)గా, నీకూ నాకు పెళ్లంట నవల అదే పేరుతో 1988లో రాజశేఖర్ హీరోగా వచ్చాయి. తరువాత రోజుల్లో మల్లాది రచనలు రేపటి కొడుకు, మ్.. గప్‌చుప్ అవే పేర్లతో, 'రేపో మాపో పెళ్లంట' నవలేమో విచిత్రం పేరుతో చలనచిత్రాలయ్యాయి. ఆమధ్య పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో ఛార్మి నటించిన జ్యోతిలక్ష్మీ (2015) చిత్రానికి కూడా మల్లాది నవలే ('మిసెస్ పరాంకుశం') ఆధారం.

మరువరాని మరికొన్ని నవలా చిత్రాలు

ఇవాళ్టికీ ఒక తరం ప్రేక్షకులు ప్రత్యేకంగా చెప్పుకొనే జంధ్యాల శ్రీవారికి ప్రేమలేఖ (1984) చిత్రం కూడా నవలా చిత్రమే. ప్రముఖ రచయిత్రి పొత్తూరి విజయలక్ష్మి రాసిన 'ప్రేమలేఖ' నవల దానికి మూలం. ఆవిడే రాసిన 'సంపూర్ణ గోలాయణం' (సినిమా పేరు ప్రేమ ఎంత మధురం - 1991), 'శంకర్‌రావు పెళ్లి' (సినిమా పేరు ప్రేమ చిత్రం... పెళ్లి విచిత్రం - 1993) నవలలు కూడా నరేశ్ హీరోగానే సెల్యులాయిడ్ పైకి ఎక్కాయి. మరో హాస్య రచయిత మల్లిక్ రచన పరుగో పరుగు అదే పేరుతో 1993లోనే రాజేంద్ర ప్రసాద్ హీరోగా సినీరూపం దాల్చింది.

పిసినిగొట్టు పాత్రలో కోట శ్రీనివాసరావు, అతనికి దీటుగా రాజేంద్రప్రసాద్ నటనతో ఇవాళ్టికీ గుర్తుండిపోయిన జంధ్యాల మార్కు హాస్య చిత్రం అహా నా పెళ్లంట (1987). అది కూడా సాహిత్యానికి సక్సెస్‌ఫుల్ సినిమా అవతారమే! ఆదివిష్ణు రచన 'సత్యం గారిల్లు' ఆధారంగా తీసిన ఆ సినిమా ప్రముఖ నిర్మాత డి. రామానాయుడుకు కనివిని ఎరుగని లాభాలు పండించి, ఆయన ఆర్థిక కష్టాలు తీర్చడం అప్పట్లో టాక్ ఆఫ్ ది సినిమా టౌన్!

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో నవలలు సినిమాలుగా వచ్చిన సంగతి అర్థమవుతుంది.

నవలను మరిచిన నవీన సహస్రాబ్ది

అయితే, కాలచక్ర భ్రమణంలో కథ మారింది. సినిమా కల మారింది. ఫక్తు వాణిజ్యధోరణి ప్రబలాక ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు తెలుగులో నవలాచిత్రాలు చాలా అరుదయ్యాయి. 2000 తర్వాత నూతన సహస్రాబ్దిలోనూ బలభద్రపాత్రుని రమణి లాంటి రచయిత్రుల నవలలు కొన్ని రేపల్లెలో రాధ (2001), మధుమాసం (2007) లాంటి సినిమాలుగా రాకపోలేదు. అలాగే, యద్దనపూడి 'మీనా' నవల నాటి బ్లాక్ అండ్ వైట్ ఫిల్మ్ యుగంలో మీనా (1973) పేరుతోనే ఒకసారి, నాలుగు దశాబ్దాల తర్వాత రంగుహంగుల నేటి డిజిటల్ శకంలో అ...ఆ... (2016) పేరుతో మరోసారి తెర కెక్కడం విశేషం. ఒక తెలుగు నవల కొద్దిపాటి మార్పులతో అలా రెండుసార్లు తెలుగు తెరపైకి రావడం అదొక్కసారే జరిగిన విశేషం. కృష్ణవంశీ సిందూరం (1997) చిత్రానికి మాటల రచయితగా నంది అవార్డు పొందిన ప్రముఖ రచయిత జర్నలిస్టు కె.ఎన్.వై. పతంజలి నవల సైతం సినిమాగా వచ్చింది. యథార్థంగా జరిగిన రైలు ప్రమాదఘటనను నేపథ్యంగా తీసుకొని, మనిషిలోని స్వార్థం, సమాజంలోని అవినీతిని వ్యంగ్యంగా చూపెడుతూ, 'మేరా భారత్ మహాన్' అనే టైటిల్‌తో ఓ పత్రికలో పతంజలి సీరియల్ రాశారు. అదే తర్వాత నువ్వే కాదు... అనే కొత్త టైటిల్‌తో నవలగా తీసుకు వచ్చారు. ఆ కథ ఆధారంగానే హీరోయిన్ తబుతో దర్శకుడు చంద్రసిద్ధార్థ ఇదీ సంగతి (2008) సినిమా తీశారు. తెలుగువాడైన హరిమోహన్ పరుపు ఇంగ్లీషులో రాసిన ది మ్యాన్ వితిన్ నవల ఆధారంగా ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో క్రికెట్ నేపథ్య చిత్రం గోల్కొండ హైస్కూల్ (2011) వచ్చింది. సినీ రచయిత జనార్దన మహర్షి తన సొంత నవల 'గుడి' ఆధారంగా స్వీయ దర్శకత్వంలో దేవస్థానం (2012) సినిమా రూపొందించారు. ఇక, చలం రాసిన పెద్ద కథ 'బ్రాహ్మణీకం' స్ఫూర్తితో ఎ ఉమన్ ఇన్ బ్రాహ్మణిజమ్ (2012) చిత్రమూ వచ్చింది. అయితే, తెరపై అసభ్యత, అశ్లీలం ఎక్కువై, వివాదంలో చిక్కుకుంది. ఒక దశలో నిషేధించాలన్న డిమాండూ వచ్చింది. ఆఖరికి పేరులో మార్పు, దృశ్యాల్లో కోతలతో ఆ సినిమా జనం ముందుకు రాగలిగింది.



తెలుగు సంగతి పక్కనపెడితే, నవలల ఆధారంగా సినిమాలు తీయడం అనేక భారతీయ భాషల్లో ఇప్పటికీ ప్రచలితంగా కనిపిస్తుంది. అంతెందుకు... గమనిస్తే, ఏటా 'ఆస్కార్ అవార్డు'లిచ్చే 'అకాడెమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్' నుంచి గౌరవ పురస్సరంగా జీవనసాఫల్య పుర స్కారం అందుకున్న మన భారతీయ దిగ్దర్శకుడు సత్యజిత్ రే తీసిన సినిమాల్లో అత్యధిక భాగం సాహితీసృజనలకు వెండితెర రూపాలే.

వాళ్లు వదలలేదు... మనమే వదిలేశాం!

అసలు దక్షిణాదిన తమిళ, కన్నడ, మలయాళ సినీసీమల్లో సాహిత్యసృజనను సినీసృష్టికి ఆలంబనగా చేసుకోవడం తరచూ కనిపించే విషయం. ఆ ప్రాంతాల్లో సినిమావాళ్ల నుంచి రాజకీయ నాయకుల దాకా చాలామంది పుస్తకాలు చదువుతారు. విచారకర మైన విషయం ఏమిటంటే, మన దగ్గర అలాంటి వాతావరణమే లేదు. అందులోనూ మన సినీ దర్శక, నిర్మాతలు, నటీనటుల్లో సంగతి ఇక చెప్పనేవద్దు. ఇవాళ్టి వారిలో అధిక శాతంమందికి సాహిత్యం చదివే అలవాటే పెద్దగాలేదు. అందువల్ల మన తెలుగులో గొప్ప సాహిత్యం ఉంది, దాన్ని తెరపై తీసుకు వచ్చేందుకు అద్భుత మైన అవకాశం ఉంది అనే విషయమే వారికి తెలియని పరిస్థితి.

ఏమైనా, ఒకప్పుడు నవలకూ - సినిమాకూ పెనవేసుకున్న బలమైన బంధం ఇప్పుడు మాత్రం బాగా బలహీనపడింది. చాటుగా కాపీ కొట్టేసి తప్ప, సాధికారికంగా చెప్పేసి సాహిత్యం నుంచి సినిమాను తీయడమనే పద్ధతే తగ్గిపోయింది. ఎప్పుడో ఒకటీ అరా పాపులర్ కథలు, నవలలు తెరపైకి వస్తే అదో పెద్ద విశేషంగా చెప్పు కొనే పరిస్థితి వచ్చింది. నవలకూ, సినిమాకూ లింకు తెలుగునాట దాదాపు తెగిపోయింది.

తమిళంలో మాత్రం 'లిటరరీ ఎడాప్టేషన్ టు సిల్వర్ స్క్రీన్' అనే ఆ బంధం బలంగా కొనసాగుతోంది. ఆ మధ్య వెట్రిమారన్ దర్శకత్వంలో వచ్చి, భాషాభేదం లేకుండా అన్ని ప్రాంతాల ప్రేక్షకు లకూ మనసు మెలిపెట్టిన తమిళ చిత్రం విసారణై (2016). యథార్థ జీవిత సంఘటనల ఆధారంగా రచయిత ఎం. చంద్రకుమార్ రాసిన 'లాకప్' నవలకు వెండితెర రూపమే అది. అలాగే, వెట్రి మారన్ దర్శకత్వంలోనే హీరో ధనుష్‌కు జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు తెచ్చిపెట్టిన అసురన్ (2019 - తెలుగులో వెంకటేశ్‌తో రీమేకైన నారప్పకు మూలం) కూడా నవలాచిత్రమే! కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు అందుకున్న రచయిత పూమణి రచన 'వెక్కై' ఆ సూపర్ హిట్ సినిమాకు ఆధారం. వెట్రిమారనే రూపొందించిన పొలిటికల్ క్రైమ్ థ్రిల్లర్ 'విడుదలై-1' (2023)కి రచయిత జయ

ఇక, తెలంగాణ వాతావరణాన్ని ప్రతిఫలించిన ప్రముఖ రచయిత నవీన్ ప్రసిద్ధ నవల 'అంపశయ్య' సైతం ప్రభాకర్ జైనీ దర్శకత్వంలో క్యాంపస్ అంపశయ్య (2016) సినిమాగా రావడం గమనార్హం. ఇటీవల ఆఖరుగా తెర కెక్కిన తెలుగు నవల అంటే... కొండపొలం. మేత దొరకని కాలంలో గొర్రెలను నెలా నెలన్నర పాటు నల్లమల అడవుల్లో మేపటానికి వెళ్లే గొర్రెల కాపరుల జీవితం చుట్టూ అల్లిన నవల... 'కొండపొలం'. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి రాసిన ఈ నవల 2019 'తానా' నవలల పోటీలో రెండు లక్షల రూపాయల బహుమతిని గెలుచుకుంది. 2021లో క్రిష్ జాగర్ల మూడి దర్శకత్వంలో అదే పేరుతో సినిమాగానూ వచ్చింది. కానీ, కారణాలు ఏమైనా ఈ నవలాచిత్రం కూడా ప్రేక్షకులను ఆకట్టు కోలేకపోయింది. ఆ తరువాత తెలుగులో మళ్లీ ఎవరూ నవలా చిత్రాల జోలికి పోలేదు.

ప్యారలల్ సినిమాకూ ప్రాణంగా...

ఒక దశలో తెలుగులో సమాంతర సినీ ప్రయత్నాలకూ సాహిత్యమే శరణ్యమైందని మర్చిపోరాదు. ప్రముఖ రచయిత కిషన్ చందర్ నవల 'జబ్ ఖేత్ జాగే' (తెలుగులో 'జైత్రయాత్ర') నవల ఆధారంగా విప్లవాత్మక చిత్రం మాభూమి (1980) (ప్రముఖ బెంగాలీ దర్శకుడు గౌతమ్ ఘోష్ దర్శకత్వం బి. నరసింగరావు, తదితరులు నిర్మాతలు) వచ్చింది. ప్రేమ్‌చంద్ హిందీ కథానిక 'కఫన్' ఆధారంగా... మృణాల్ సేన్ దర్శకత్వంలో తెలుగులో ఒక ఊరి కథ (తీసింది 1977లో. తెలుగునాట థియేటర్లలో రిలీజైంది 1978లో) రూపొందించారు. ఇక, శ్యామ్‌బెనెగల్ తెలుగులో అనుగ్రహం (1978)గా, హిందీలో కొండూరగా తీసిన చిత్రానికి మరాఠీ నవల 'కొండూర' (రచన చింతామణి టి. ఖానోల్కర్) ఆధారం. అంటే, మన ప్రధాన స్రవంతి వాణిజ్య సినిమాలకే కాదు... నవ్య చిత్రాలుగా పేర్కొనే ప్యారలల్ సినిమాకూ అక్షరాలే ఆలంబనగా నిలిచాయన్నమాట.

మోహన్ రాసిన కథానిక 'తునైవన్' ఆధారం. ఇక, ప్రసిద్ధ రచయిత కల్కి కృష్ణమూర్తి కొన్ని దశాబ్దాల కిందట రచించగా, తమిళ సాహిత్యంలో క్లాసిక్‌గా పేరొందిన పాపులర్ చారిత్రక నవల 'పొన్నియిన్ సెల్వన్' (2022) సైతం ఆమధ్య మణిరత్నం దర్శకత్వంలో రెండు భాగాల భారీ సినిమాగా వచ్చింది. తమిళంతో పాటు తెలుగు సహా వివిధ భాషల్లో పలకరించింది. తమ భాషలోని గొప్ప సాహిత్యకృషిగా భావించే నవలకు దృశ్యరూపం కావడంతో ఆ సినిమాను తమిళ ప్రేక్షకులు నెత్తినపెట్టుకున్నారు. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు కురిపించారు.

కథలున్నా... కమిట్‌మెంట్ ఏదీ?

తెలుగులో అలాంటి పరిస్థితి ఉందా అంటే, లేదని పెదవి విరవాల్సిందే! అంతెందుకు... విశ్వనాథ వారి 'వేయిపడగలు' లాంటి క్లాసిక్స్ ఇప్పటికీ మన దగ్గర సినిమాలుగా రాలేదు. చలం 'మైదానం', బుచ్చిబాబు 'చివరకు మిగిలేది', గోపీచంద్ 'అసమర్థుని జీవయాత్ర' మొదలు పిలకా గణపతిశాస్త్రి 'విశాలనేత్రాలు' దాకా చాలా నవలల్ని తెరకెక్కిస్తామంటూ చెబుతూనే ఉన్నారు. చాలా ఏళ్లుగా, పదుల మంది ప్రకటనలు చేస్తున్నా, ఆచరణలో అంగుళమైనా అడుగు ముందుకు పడలేదంటే అసలు సంగతి అర్థం చేసుకోండి.

సూపర్ హీరో ఇమేజ్ ఉన్న పాత్రనే తప్ప ఒక బలహీనత ఉన్న సహజమైన వ్యక్తి కథానాయకుడిగా ఉండే కథలనూ, నవలలనూ స్టార్ డమ్ ఉన్న మన తారలు ఒప్పుకోరు. ఒకవేళ వాళ్లు కాస్తంత సానుకూలంగా ఊగినా, వారి అభిమానగణం అసలే ఒప్పుకోదు. వెరసి, తమిళ, మలయాళాలకు భిన్నంగా ఉత్తమ సాహిత్యం తెరమీదకు వచ్చేందుకు తెలుగులో అనేకానేక అవరోధాలు.

అందుకే... తొలి తొలుగు నవలగా ప్రచారమైన కందుకూరి వీరేశలింగం గారి 'రాజశేఖర చరిత్రము' కానివ్వండి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన తొలి తెలుగు నవలైన త్రిపురనేని గోపీచంద్ 'పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా' కానివ్వండి, విశ్వనాథ సత్యనారాయణగారి సాహిత్యంలో మణిమకుటమైన 'వేయిపడగలు' కానివ్వండి, సత్యం శంకరమంచి 'అమరావతి కథలు' కానివ్వండి... ఇవేవీ వెండితెరకు ఎక్కలేదు. కేవలం అభిరుచిగల దర్శక, నిర్మాతలు, ప్రభుత్వ దూరదర్శన్ వారి ఆర్థిక అండదండల పుణ్యమా అని 1980లలో బుల్లితెరకు మాత్రం ఎక్కగలిగాయి. ఇప్పుడైతే కనీసం ఆ అదృష్టం కూడా పట్టేది కాదేమో! నిష్ఠురమైనా అది నిజం.

మరి ఏమీ చేయలేమా అంటే, చేయవచ్చు. ఇప్పటికైనా మన దగ్గర సాహిత్యంలోని క్లాసిక్స్‌ను వెండితెరకు ఎక్కించవచ్చు. కాకపోతే దానికి కావాల్సింది - పట్టుదల, అంకితభావం. అన్నిటికన్నా ముఖ్యంగా... పాత్రలకు అనేక ఛాయలుండే ఆ క్లాసిక్ నవలల్ని సమకాలీన ధోరణికి తగినట్టు మలచగలిగే తీరిక, ఓపిక, సామర్థ్యం. నేటి దర్శక, రచయితలకు అంత సమయం, సాహిత్యాభిరుచి ఉన్నాయా? పైగా, సాహిత్యాభిరుచి ఒక్కటే సరిపోదు... ఆ సాహిత్యంలో మూల రచయిత పొందుపరిచిన ఆత్మను పట్టుకొని, దాన్ని తెర మీదకు అనువదింపజేయడానికి వీలైన తాత్త్విక దృక్కోణమూ కావాలి. అది ఎంతమంది సినీ రూపకర్తలకు ఉందన్నది మరో బేతాళ ప్రశ్న.

అలాగే, నిన్న మొన్నటివరకు తమిళంలో జయకాంతన్, సుజాత, మలయాళంలో ఎం.టి. వాసుదేవన్ నాయర్‌లాంటి సాహిత్య రచయితలు సినిమాలకూ రాశారు, తీశారు, పనిచేశారు. ఇప్పటికీ జయమోహన్ (తమిళ పొన్నియిన్ సెల్వన్ చిత్రానికి మాటల రచయిత)లాంటి వారున్నారు. సాహిత్యం, సినిమా... జమిలిగా కలిసిమెలిసి సాగడమూ మన ఈ పొరుగుభాషల్లో చూస్తాం. కానీ, మన దగ్గర ఆ పరిస్థితి కనిపించదు. కాల్పనిక సాహిత్యంలో కాకలుతీరిన రచయితల్ని సినీరంగానికి ఉపయోగించుకోవడం సినిమావాళ్లకూ సరిగ్గా చేతకాలేదు. అదీ మన తెలుగు సినిమాకు పట్టిన దౌర్భాగ్యం.

సినిమాకు ఒదిగిపోయే సాహిత్యం

అయితే, కొందరు రచయితల సాహిత్యం సినిమాలుగా తీయడానికి చక్కగా ఒదిగిపోతాయి. "చార్లెస్ డికెన్స్ నవలలు సినిమా స్క్రిప్టుల్లా ఉంటాయి. ఒక అధ్యాయం తర్వాత మరో అధ్యాయంగా అలా చిత్రీకరించుకుంటూపోవచ్చు. వాటిని సినిమాగా అనువర్తించడం చాలా సులభం. అలాగే, కొంతవరకు శరత్ నవలలు కూడా అంతే." ప్రసిద్ధ దర్శకుడు శ్యామ్ బెనెగల్ అన్న మాటలివి! అందుకే, శరత్ బెంగాలీ నవలలు అనేకం బెంగాలీతోపాటు హిందీ, తెలుగు తదితర అనేక భారతీయ భాషల్లోకి సినిమాలుగా వచ్చాయి.

సాహిత్యాన్ని సినిమాగా తీసినప్పుడు, కొత్త సృజన ఏ మేరకు మూల విధేయంగా ఉందనేది మరో పెద్ద ప్రశ్న. ఎడతెగని చర్చనీయాంశం. గురజాడ 'కన్యాశుల్కం' నాటకాన్ని తెరమీదకు తీసుకువచ్చినప్పుడూ ఇదే అంశంపై రకరకాల విమర్శలు వచ్చాయి. దాదాపు ఆరేడు గంటల నిడివిగల నాటకాన్ని మూడుగంటల సినిమాగా కుదించాల్సి వచ్చినప్పుడు దర్శకుడు పి. పుల్లయ్య, రచయిత సదాశివబ్రహ్మం నాటకంలోని అనేక ఘట్టాలను తొలగించారు. సినిమాటిక్‌గా పాత్రల స్వభావాన్ని కొంత మార్చి, హీరో ఎన్టీఆర్ కోసం గిరీశం పాత్రను కొంత హీరోయిక్‌గా చూపించే ప్రయత్నం జరిగింది. 'డామిట్ కథ అడ్డం తిరిగింది' అనుకుంటూ గిరీశం పాత్ర నిష్క్రమించడంతో నాటకం ముగుస్తుంది. సినిమా కోసం ఆ క్లైమాక్స్‌ను ఆసాంతం మార్చేశారు. చివరకు గిరీశం పాత్రకూ, బుచ్చెమ్మ పాత్రకూ పెళ్లి చేసేశారు.

కన్యాశుల్కం (1955) సినిమా వచ్చినప్పుడు మూల నాటకానికి విధేయంగా లేదంటూ సాహిత్యాభిమానుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. సహజంగానే సినిమాకు అనుకున్నంత ఆదరణ కూడా దక్కలేదు. కానీ, తీరా ఆ తర్వాత అదే సినిమా



రీ రిలీజులో... తొలినాళ్ల ప్రతిస్పందనకు భిన్నంగా ఉదయం ఆటలతో శతదినోత్సవం చేసుకోవడం విచిత్రం. అదే సినిమా ఇప్పుడు మధురవాణిగా సావిత్రి, గిరీశంగా ఎన్టీఆర్, బుచ్చెమ్మగా 'షావుకారు' జానకి నటన గురించి ప్రత్యేకించి చెప్పుకొనే క్లాసిక్‌గా మిగలడం విశేషం. కాలాన్నిబట్టి మారిన అభిరుచికీ, అభిప్రాయాలకూ అది దర్పణం. అందుకే, శ్యామ్ బెనగలే అన్నట్టు, "ఒక సాహితీసృజనను దర్శకుడు సినిమాగా రూపొందిస్తున్నప్పుడు, మూలరచనకు విధేయుడిగా ఉండాలని ఆశించడం సమంజసం కాదు."

హిట్ నవలలు... హిట్ సినిమాలవుతాయా?

అలాగని, సాహిత్యంలో విశేష ఆదరణ పొందినవన్నీ సినిమాలుగా వచ్చినప్పుడు అంతే ఆదరణ పొందుతాయా అంటే చెప్పలేం. అనుమానమే! సినిమా, నవల... రెండింటికీ కొన్ని పోలికలు ఉన్నప్పటికీ, రెండూ వేర్వేరు సృజన రూపాలు. దేని లక్షణాలు దానివే! దేని ప్రత్యేకతలు దానివే!! అందుకే, నవల, నవలిక, కథ లాంటి వాటిని ఎలాంటి మార్పులూ లేకుండా, యథాతథంగా వెండితెర మీదకు తీసుకురావడం సాధ్యంకాదు. పైగా, నవలను సినిమాగా మలిచినప్పుడు... ఆ వెండితెర వినోదం మరింత రక్తి కట్టడానికి, లేదంటే సామాన్య ప్రేక్షకులకు అర్థం కావడానికి నవలలో కొన్ని మార్పులు చేయక తప్పదని సినీ రూపకర్తలు భావిస్తారు.

ముఖ్యంగా, సంక్లిష్టమైన పాత్రల అంతరంగాన్ని చిత్రించే భాగాలను తెరపై దృశ్యరూపంలో తీసుకురావడం కష్టమని నవలలోని కొన్ని భాగాలను తొలగించడం, పాత్రల స్వభావంలో, సంఘటనల్లో కొన్ని మార్పులు చేర్పులు చేస్తుంటారు. అది నచ్చే విధంగా జరగకపోతే ఇటు నవలా రచయిత, అటు పాఠకులూ, ప్రేక్షకులూ కూడా మంచి నవలను సినిమాగా తీసి చెడగొట్టారంటారు. 'ది ఆల్కెమిస్ట్' (తెలుగు అనువాదం 'పరుసవేది') లాంటి బెస్ట్ సెల్లర్ రాసిన ప్రసిద్ధ బ్రెజిలియన్ రచయిత పాలో కోయెలో మాటల్లో చెప్పాలంటే, "పుస్తకమనేది పాఠకుడి మదిలో కనిపించే సినిమా. అందుకే, తీరా ఆ పుస్తకం వెండితెర కెక్కినప్పుడు వెళ్లి చూసొచ్చి, 'ఈ సినిమా కన్నా పుస్తకమే బాగుంది,' అని పెదవి విరుస్తుంటాం."

అలా అక్షర ప్రేమికులు తమకు ఇష్టమైన సాహితీకృషిని తీరా తెరపై చూశాక, తీవ్ర నిరాశకు లోనైన సందర్భాలు మనకు కోకొల్లలు. అలనాటి బ్లాక్ అండ్ వైట్ కన్యాశుల్కం నుంచి ఇటీవలి కొండపొలం దాకా అనేక సినిమాలకు సాహితీప్రియుల నుంచి పెదవి విరుపులు తప్పలేదు. అంతెందుకు... ప్రముఖ ఆంగ్ల రచయిత ఆర్.కె. నారాయణ్ ప్రసిద్ధ నవల 'ది గైడ్'ను ఆయన అనుమతితోనే అలనాటి హిందీ హీరో దేవానంద్ ఇంగ్లీషు, హిందీ భాషల్లో సినిమాగా తీశారు. గైడ్ (1965) సినిమా రిలీజై, సక్సెసై, అత్యధికంగా 7 ఫిల్మ్ ఫేర్ అవార్డులు సాధించినప్పటికీ, స్వయంగా రచయిత ఆర్.కె. నారాయణ్‌ను తృప్తిపరచలేకపోయింది.

సినిమాలపై సాహిత్యం...

సాహిత్యాన్ని ఇంతగా ఆధారం చేసుకున్న సినిమా అనే సాంకేతిక విప్లవం ఒక దశలో మళ్లీ సాహిత్యంగా అక్షరరూపంలోనూ ఇమిడిపోవడం మరో గమ్మత్తు. అలా జరిగిన సందర్భం- పాటల పుస్తకాలు, వెండితెర నవలలు, స్టోరీ బోర్డుతో సహా ప్రచురితమైన సినిమా స్క్రిప్టులు. ఇవికాక, చలనచిత్ర నిర్మాణ కళ, సినీరంగ విచిత్రాలు, ప్రముఖుల విశేషాలతో తెలుగులో పుస్తకాలు, మరో మాటలో చెప్పాలంటే సాహిత్యం రావడం వేరొక పార్శ్వం. 1940ల నుంచి ఈ సినిమా పుస్తకాల ప్రచురణ మొదలైనా ఇప్పుడు విస్తృతమైంది. అది విడిగా చర్చించాల్సిన విస్తృత అంశం.

సాహిత్యానికీ, సినిమాకూ పెరుగుతున్న దూరం... వేరైన దారులు...

నిజానికి, కథ, నవల, నాటకం ఏదైనాసరే దాన్ని ఆమూలాగ్రం చదివి, అర్థం చేసుకొని, దాన్ని సినిమా స్క్రీన్‌ప్లేకు అనుగుణంగా తిరగరాసి, సాహిత్యంలోని ఆత్మ పోకుండా చేయడం అంత సులభం కాదు. దానికి, సాహితీ, సినిమా రంగాలు రెండింటి మీదా సమానమైన పట్టున్న దర్శక, రచయితలు అవసరం. అలాంటివారు అంతకంతకూ తగ్గిపోతూ, 1990ల నుంచి సాహిత్యానికీ,

సినిమాకూ మధ్య దూరం పెరుగుతూ వచ్చింది. ఒకపక్క... కొత్త తరం ప్రేక్షకుల్లో సాహిత్య అధ్యయనం తగ్గిపోవడం దీనికి ఒక కారణం. అలాగే, మరోపక్క... సాహితాన్ని సినిమాలుగా మలుచుకొనే తీరిక, ఓపిక సినిమావాళ్లకూ తగ్గిపోవడం మరో కారణం. అంత పరిజ్ఞానం, సాహితీ అభినివేశం ఉన్నవాళ్లు తగ్గిపోయారు. ఇంకో పక్క... పాపులర్ సాహిత్యం సైతం ఇవాళ సినిమాటిక్‌గా మారడం, సినిమాను దృష్టిలో పెట్టుకొని నవలల రచన చేయడం లాంటివి వేరొక కారణం. ఇన్ని కారణాలతో... వర్తమానంలో తెలుగు సాహిత్యం దారి, సినిమా దారి... వేరు వేరయ్యాయి.

మొత్తంమీద మూకీల కాలం నుంచి ఇప్పటిదాకా సినిమా సాహిత్యాన్ని గమనిస్తే దేశం మారింది. కాలం మారింది. సినిమా వేషం మారింది. ఆ మార్పు మాటకూ, పాటకూ, తెరమీది దృశ్యానికీ... అన్నిటికీ వర్తిస్తుంది. కథాబలమే ఆయువుపట్టుగా భావించిన అలనాటి ధోరణి దగ్గర మొదలైన ఈ మాధ్యమం కథే లేకుండా సన్నివేశాలను కలిపికుట్టే ఈనాటి ధోరణికి రావడం తాజా విపరిణామం. హితకరమైన సినిమాలు, వాటిలో సాహిత్యం సకృత్తు అయినవేళ, ఇప్పటికీ 'సహితస్య భావమ్ సాహిత్యం' లాంటి నిర్వచనాలు వర్తిస్తాయా అన్నది ఎప్పటికీ చర్చనీయాంశమే. అయితే, ఇంత నిరాశలోనూ... అడపాదడపా అవకాశం ఉన్నప్పుడైనా మంచి పాట, మాటలకు తెలుగుతెర చోటిస్తూనే ఉంది. అదే ఉన్నంతలో ఊరట!

ఉపసంహారం..

ఇవాళ పుస్తకాలు చదవడమనే 'బుక్ కల్చర్' పోయింది. 'లుక్ కల్చర్' పెరిగింది. టీవీలు, సినిమాలు చూడడం అలవాటైపోయింది. ఇప్పుడు అదీ వెనకపట్టు పట్టి ఓటీటీ దూసుకొచ్చింది. కూర్చున్న చోటే చేతిలోని మొబైల్ ఫోన్‌లో యూ ట్యూబ్, సోషల్ మీడియా ఫార్వర్డ్‌లు, షార్ట్‌లు, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూసే సంస్కృతి ప్రబలింది. చదివే అలవాటే క్షీణిస్తున్న నేపథ్యంలో, సాహిత్యాన్ని ప్రజలకు దగ్గరకు చేయడానికి ఈ 'ఎడాప్టేషన్ ఆఫ్ లిటరేచర్ టు స్క్రీన్' చాలా కీలకం. అది ఏ రూపంలోనైనా ఫరవాలేదు. దీనివల్ల మన సాహిత్యాన్ని నవతరానికి దగ్గర చేయవచ్చు. అదే సమయంలో ఫ్యాక్షన్, యాక్షన్, వెకిలి కామెడీలతో నిండిన రొడ్డకొట్టుడు, మూస కథల నుంచి మన వెండితెరకు విముక్తి కలిగించవచ్చు.

అసలు సిసలు మానవ జీవితాన్ని చిత్రించాలనుకొంటే దర్శక, నిర్మాతలకు తెలుగు సాహిత్యం (నవలలు, కథలు, నాటకాలు) ఓ తరగని గని. కేవలం వాణిజ్య సూత్రాలకే అంటి పెట్టుకొని, మన సినిమాలకు కథల కొరత ఉందంటూ పదే పదే చెప్పడం వల్ల ఒకే మూసలోని సినిమాలే వస్తాయి. కాబట్టి, మన నిర్మాతలు, దర్శకులు, హీరోలు ఎక్కడెక్కడి హాలీవుడ్ సినిమాలు, కొరియన్, థాయ్ సినిమాల డీవీడీలలో వెతుక్కొనే బదులు, మన ఇళ్లల్లోనే అల్మారాల్లో అమ్మానాన్నల కాలం నుంచి భద్రంగా ఉన్న మన తెలుగు సాహిత్యం వైపు దృష్టి సారిస్తే, అప్పుడు ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

ఎప్పుడో 1956లోనే తన 70వ జన్మదినోత్సవ ఉపన్యాసంలో తాపీ ధర్మారావు చెప్పినట్టు, "...సినిమాను టెక్స్ట్ బుక్‌గా చదివే వాళ్లుండరు. కనుక సాహిత్యం అంతగా కనిపించకపోవచ్చు. అయినా, ఇందులోనూ సాహిత్యసేవ చెయ్యవచ్చు. ఏ వృత్తిలో ఉన్నా సేవకుడు తన గొప్పతనాన్ని చూపించవచ్చు." అలాంటి సాహితీ సేవకులు వచ్చినప్పుడల్లా మన తెరమీద సాహిత్యం తళుకులీనుతూనే ఉంటుంది. అలాంటివారు ముందుకొచ్చి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, అడివి బాపిరాజు, నోరి నరసింహశాస్త్రి, పిలకా గణపతిశాస్త్రి, తిలక్, బుచ్చిబాబు తదితరుల గొప్ప రచనల్ని తెరపై మలిచినప్పుడు కచ్చితంగా గొప్ప చిత్రాలు వస్తాయి. సినిమా రంగం స్థాయి, కళాత్మక విలువ పెరుగుతాయి. ఆరోజు వస్తుంది. రావాలని ఆశిద్దాం.

ఈ వ్యాసం పూర్తి పాఠాన్ని నాలుగు భాగాల్లో వినవచ్చు.



రెంటాల జయదేవ ఈనాడు దినపత్రికలో జర్నలిస్టుగా జీవితం ప్రారంభించి నెమ్మదిగా ప్రముఖ సినీ జర్నలిస్టుగా రూపొందారు. అనేకమంది సినీరంగ ప్రముఖుల్ని ఇంటర్వ్యూలు చేశారు. తెలుగు సినిమారంగంపై పరిశోధన చేసి, మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పుచ్చుకున్నారు. 2012 సంవత్సరంలో ఉత్తమ సినీ జర్నలిస్టుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది పురస్కారం, 'ఫస్ట్ రీల్' గ్రంథానికి ఉత్తమ సినీ గ్రంథ రచయితగా తెలంగాణ ప్రభుత్వ గద్దర్ పురస్కారం పొందారు. నివాసం హైదరాబాదు.

రేపటి తెలుగు నాటకం

డా. కందిమళ్ల సాంబశివరావు

విభిన్న రుచులు గల జనావళికి ఏకపత్ర సమారాధన చేసేది నాటకం అంటాడు కాళిదాసు. జాతిని జాగృతం చేసేది, జాతి జీవనాన్ని ప్రతిబింబించేది నాటకం అంటాడు ఆధునికుడు. వినోదం ప్లస్ విజ్ఞానం ఇంటూ సామాజిక స్పృహ మైనస్ అశ్లీలం ఈస్ ఈక్వల్ టు నాటకం అంటాడు నవీనుడు. నాటకం ఒక విద్యాపీఠం. ఉత్తేజ భావాలను సృష్టించే ఓ కర్మాగారం. చైతన్యాన్ని ఉద్దీపింపజేసే ఒక మహా శక్తి సాధనం. సాంఘిక సత్ప్రవర్తనకు దారిచూపే దివ్య జ్యోతి స్వరూపం. నిస్తబ్ద నిరాశలను చీల్చి చెండాడే వజ్రాయుధం. మానవుని ఔన్నత్య ప్రస్థానపు పవిత్ర దేవాలయం. తమస్సును చీల్చి ఉషస్సును చూపే దీపిక. వెలుగు నీడల సయ్యాటల రూపిక వ్యవస్థ. ముఖచిత్ర ఆవిష్కృత జ్ఞాపిక. ఆలోచనా ఆలోచనాల వీచిక దిశా నిర్దేశ. మానవ ప్రకృతి వికృతుల ప్రతీక. సమాజాభ్యుదయ పతాక. జనజీవన ప్రతిబింబాలకై పలు మేధస్సుల మధనం. మానవీయ కోణాల కథనం. అభ్యుదయ భావాల సదనం. అవ్యవస్థపై రణభేరిని మోగించే కథనం. సమత మమతల పరిరక్షణ రథనం. నాటకం అజ్ఞానం నుండి జ్ఞానానికి, అసత్యం నుండి సత్యానికి, సుషుప్తి నుండి చైతన్యానికి, మృత్యువు నుండి అమృతంగ మయత్వానికి నడిచి నడిపించేది నాటకం. కదిలేది కదిలించేది, పెను నిదుర వదిలించేది, పరిపూర్ణ బ్రతుకుదారులు వేసేది నాటకం. జనజీవన ప్రతిబింబము నాటకం. అయితే నాటక ప్రతిస్పందనం జీవితం చిటికెడు విషాదం పిడికెడు వినోదం, చారడు విజ్ఞానం, దోసెడు సందేశం ఇచ్చే నాటకం నవ్వుల పువ్వు లను పూయిస్తుంది. కన్నీటి జలపాతాలను సృష్టిస్తుంది. ఆత్మ శోధనకు ఆలంబనగా నిలుస్తుంది. కర్తవ్య దిశానిర్దేశాన్ని చేస్తుంది.

1860 ప్రాంతంలో కోరాడ రామచంద్రశాస్త్రిగారి మంజరీ మధుకరియంతో తెలుగు నాటక రచనకు అంకురార్పణ జరిగింది. 1880లో కందుకూరి వీరేశలింగం వ్యవహార ధర్మబోధిని నాటకాన్ని రచించి రాజమహేంద్రి, విజయనగరం బాలికా పాఠశాలలో విద్యార్థి నాటక సమాజం చేత ప్రదర్శింపజేశారు. నాటకం ప్రదర్శన కళ నాటక ప్రదర్శనకు నోచుకున్న తొలి నాటక రచయితగా కందుకూరి వారికి ప్రథమ తాంబూలం ఇచ్చారు. నాటకరచనకు ఒక సుస్పష్టమైన స్వరూపాన్ని ఇచ్చి నటునిగా దర్శకునిగా రాణకెక్కి ఆంధ్ర నాటక పితామహునిగా పేరుపొందిన ధర్మవరం రామకృష్ణ మాచార్యులు, జగత్ విఖ్యాత నటుడు బళ్లారి రాఘవ, ఎన్నో నాటకాలను అందించిన ఆంధ్ర చారిత్రిక నాటక పితామహుడు. కొలాచలం శ్రీనివాసరావు గొప్ప రచయితలుగా నాటక చరిత్రలో నిలిచిపోయారు. వాడుకభాషకు పట్టంకట్టి ప్రజాచైతన్యానికి నాటకాన్ని ఒక ఆయుధంగా ప్రయోగించిన గురజాడ కన్యాశుల్కం, పాత్రోచిత భాషకు పెద్దపీట వేసిన వేదం వారి ప్రతాపరుద్రీయం, సత్యనిష్టకు ధర్మ బోధకు ప్రబల తార్కాణంగా నిలిచిన బలిజేపల్లి వారి సత్యహరిశ్చంద్ర, సంఘ సంస్కరణకు సాధనాలుగా నిలిచిన కాళ్లకూరి నారాయణరావు వరవిక్రయం, చింతామణి, మధుసేవ తెలుగు నాటక రచనాప్రస్థానంలో మైలురాళ్లుగా నిలిచాయి. త్రిపురనేని నాటకాలు హేతువుకు సేతువు కట్టాయి. చిలకమర్తి, పానుగంటి వారి నాటకాలు నాటకప్రక్రియను మరింతగా సుసంపన్నం చేశాయి.

తెలుగువాడి నరనరంలో దేశభక్తిని పరవళ్లు తొక్కించి తెల్లవారి వెన్నులో వణుకు పుట్టించిన దామరాజు పుండరీకాక్షుడు

నాటకాలు ఒక చరిత్రను సృష్టించాయి. రాజమన్నార్ తప్పెవరది నాటకం అసమానతలను తర్జనితో హెచ్చరించింది. సుంకర, వాసిరెడ్డి రాసిన ముందడుగు, మాభూమి నాటకాలు తెలంగాణ సాయుధ పోరాటానికి ఊపిరులూదాయి. 1943లో తిరునగరి రామాంజనేయులు వెట్టిచాకిరి నాటికను రచించి భారతీయ నాటకరంగ చరిత్రలో తొలి ఆధునిక వీధి నాటక ప్రక్రియకు అంకురార్పణ చేశారు. అనిశెట్టి, పినిశెట్టి, రెంటాల, ఆత్రేయ, కొండముది గోపాలరాయ శర్మ వంటివారు తమ నాటకాలతో సాంఘిక నాటకరచనకు బలమైన పునాదులు వేశారు. తెలుగు నాటకం వివిధ కోణాలలో శాఖోపశాఖలుగా విస్తరించడానికి ఆంధ్ర నాటక కళాపరిషత్, ప్రజానాట్య మండలి ఆంధ్ర విశ్వ కళాపరిషత్ కృషి చిరస్మరణీయమైనది. నాటక పోటీవ్యవస్థకు బలమైన పునాదులు వేసి వందలాది పరిషత్తుల ఆవిర్భావానికి ఆంధ్ర నాటక కళా పరిషత్ ఒక స్ఫూర్తిని ఇచ్చింది. జనచైతన్యానికి నాటకంతో పాటు పలు జానపద కళారూపాలను అస్త్రశస్త్రాలుగా సంధించి పాలకుల గుండెల్లో ఫిరంగులను పేల్చిన ఘనత ప్రజానాట్య మండలికి దక్కుతుంది. నాటకానికి ప్రయోగతను అద్ది ప్రయోగ నాటకాలను విశ్వవిద్యాలయాలలో నాటకశిక్షణకు దిశానిర్దేశం చేశాయి.

ఎన్ఆర్ నంది రచించిన మరో మహెంజోదారో నాటకం డాక్టర్ చాట్ల శ్రీరాములు దర్శకత్వంలో ఆధునిక ప్రయోగాలకు పురుడు పోసి తెలుగు రంగవేదికపై ప్రయోగాత్మక నాటకాలకు వందల సంఖ్యలో ఆవిర్భవించడానికి స్ఫూర్తిదాయకంగా నిలిచింది. శతాధిక నాటక రచయితలుగా గుర్తింపు పొందిన కొడాలి గోపాల్రావు, డాక్టర్ కొర్రపాటి గంగాధరరావు, అటు గ్రామీణ ఇటు పట్టణ ఔత్సాహిక నటులు, కళా విద్యార్థులు వందల వేల సంఖ్యలో రంగప్రవేశం చేయడానికి భూమికగా నిలిచాయి. గొల్లపూడి నుండి యండమూరి వరకు హరనాథరావు, విజయభాస్కర్, ఇసుకపల్లి మోహన్రావు, పాటిబండ్ల ఆనందరావు, భరణి శశిమోహన్, నడిమింటి నరసింహారావు, డాక్టర్ పివిఎన్ కృష్ణ వరకు కృష్ణేశ్వరరావు నుండి మృత్యుంజయరావు వరకు కొన్ని వందలమంది నాటక రచయితల కలము నుండి జాలువారిన నాటకాలు, నాటికలు రచన పరంగా, ప్రదర్శనపరంగా ప్రేక్షకుల మదిలో సుస్థిర ప్రతిష్ట మయ్యాయి. స్థలాభావం వలన మిగిలిన రచయితల పేర్లు ప్రస్తావించనందుకు క్షంతవ్యుణ్ణి.

ఇక వర్తమాన నాటకరంగ స్థితిని సమీక్షిస్తే తెలుగు నాటక రంగానికి ఉభయ రాష్ట్రాలలో జరుగుతున్న దాదాపు 80 నాటక పరిషత్తులే ఆధరువుగా ఉన్నాయి. ఉన్నత ప్రమాణాలతో ఉన్న నాటికను ఒక సమాజం తయారు చేస్తే దాదాపు అన్ని పరిషత్తులలో ప్రదర్శన అవకాశాలను పొందగలుగుతుంది. ఈ పరిషత్తులలో కొంత వైవిధ్యాన్ని చూపుతున్నాయి. అపాజోమ్యుల విష్ణుభట్ల కందాళం ఫౌండేషన్ గత రెండున్నర దశాబ్దాల కాలంగా తెలుగు కథను నాటకీకరించే విధానానికి శ్రీకారం చుట్టింది. దీనితో దాదాపు



ఛత్రపతి శివాజీ నాటకంలో సన్నివేశం

300కు పైగా ప్రసిద్ధ తెలుగుకథలు నాటకీకరణకు నోచుకున్నాయి. కళల కాణాచి తెనాలి సంస్థ నాటకాలు నాటికలతోపాటు సాంఘిక పద్య నాటక ప్రక్రియను పోటీలలో ప్రవేశపెట్టింది. ఒంగోలు ఎన్టీఆర్ కళాపరిషత్ సాంఘిక నాటక నాటికలతోపాటు పద్య నాటకాలు యువ బాలల నాటకాలు, నాటికలు జానపద కళారూపాలకు పోటీలను నిర్వహిస్తూ పోటీవ్యవస్థకు ఒక వినూత్నశోభను సృష్టించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాంఘిక నాటక నాటిక పద్య నాటకాలతోపాటు బాలల యువ నాటికలను కూడా వైభవంగా నిర్వహించి నందులను ప్రదానం చేస్తుంది. నందీ నాటకోత్సవాల మూలంగా తెలుగు నాటకం సరికొత్త రూపాన్ని సంతరించుకుంది. 1998 వరకు సాంఘిక నాటకం నాటికలలో పరిమితమైన పాత్రలు నామమాత్రమైన రంగాలంకరణలతో ఉన్న స్థితి నుండి ఇతివృత్తానికి సన్నివేశానికి అవసరమైనన్ని పాత్రలు అద్భుతమైన రంగాలంకరణ ఆకర్షణీయమైన రంగోద్దీపనంతో బిగువుగా ఆకర్షణీయంగా ప్రదర్శనలు ఇచ్చే విధానం అమలులోకి వచ్చింది. ముఖ్యంగా శతాబ్ది తరబడి రాగాలతో మైకులకే పరిమితమైన పద్యనాటకం భావం, అభినయం, కళ్లు మిరుమిట్లు కొలిపే రంగాలంకరణలు, రంగోద్దీపనలతో శక్తిమంతంగా రూపుదిద్దుకుంది. కొన్ని పరిమితమైన ప్రఖ్యాత నాటకాలను మాత్రమే ఏళ్ల తరబడి ప్రదర్శిస్తున్న పద్యనాటక సమాజాలకు తమ ప్రతిభను వైవిధ్యాన్ని ప్రదర్శించడానికి దాదాపు 200కు పైగా కొత్త రచనలు వెలుగులోకి వచ్చాయి. దీనికితోడు బాలల యువ నాటికలను కూడా నంది నాటకోత్సవాలలో చేర్చడంతో వందలాదిమంది బాల యువ కళాకారులు రంగప్రవేశం చేయడంతో తెలుగు రంగస్థలం కొత్త శోభలతో పరవళ్లు తొక్కింది. కొన్ని సంస్థలు నాటిక నాటక రచనల

పోటీలను నిర్వహించటం కొన్ని పరిషత్తులు కొత్త నాటికలను మీదు మిక్కిలి ఇప్పటివరకు ఏ పోటీలలో పాల్గొనని నాటికలను మాత్రమే ప్రదర్శించాలనే నిబంధనను విధించడంతో ఎన్నో కొత్త రచనలు తామరతంపరగా పుట్టుకు వస్తున్నాయి. ప్రభుత్వం కూడా తమదైన శైలిలో ప్రోత్సాహాన్ని అందించడంతో నాటకం ఉత్తేజకరంగా కాకపోయినా సాఫీగా నడుస్తుంది.

తెలుగు నాటకానికి ప్రధానంగా నాలుగువిధాలుగా వేదిక లభిస్తుంది. ఔత్సాహిక నాటక సమాజాలకు పరిషత్తులు పోటీలను నిర్వహించడం వృత్తి నాటక సమాజాలుగా ఉన్న పద్యనాటక రంగం ఉత్సాహవంతుల గ్రామీణ యువత ప్రదర్శించే కమర్షియల్ నాటకం విశ్వవిద్యాలయ నాటక శిక్షణ విభాగాలు ఈ నాలుగు శాఖల వర్తమానస్థితిని లోలోతులకు వెళ్లి విశ్లేషిస్తే తెలుగు నాటకానికి ఒక వేదికను ఇచ్చి బ్రతికిస్తున్న ఘనత నిస్సందేహంగా నాటక పరిషత్తులది. అయితే నాటకాన్ని సజీవంగా ఉంచడానికి పరిషత్తు వ్యవస్థ దోహదపడుతున్న సరికొత్త నాటక ఆవిర్భావానికి ఇవి కుదుళ్లు కాలేకపోతున్నాయి. అక్కడక్కడ అద్భుతాల సృష్టి జరుగుతుందే కానీ చర్విత చర్వణమైన అరిగిపోయిన గ్రామోఫోన్ రికార్డుల రొదే ఇంకా కొనసాగుతుంది. ఇక్కడ డాక్టర్ చాట్ల శ్రీరాములుగారి మాటలను ప్రస్తావించుకోవడం ఎంతైనా సముచితం. తెలుగు నాటకంలో వస్తు పరిణామం ఉందిగానీ రూప పరిణామం లేదు. అందుకే జాతీయ స్థాయిలో తెలుగు నాటకం వికసితం కాలేకపోయింది. పోతుంది కూడా. నాటకాన్ని బ్రతికిస్తున్న పరిషత్తు వ్యవస్థ కొత్త నాటక ఆవిర్భావానికి కొత్త చిగుళ్లను అంకురించడానికి పెద్దన్న పాత్రను పోషించవలసిన సమయం ఆసన్నమైనది.

కొత్త శతాబ్దికి పూర్వం దాదాపు నాలుగైదు దశాబ్దాల సుదీర్ఘ కాలం పద్యనాటకం తెలుగు రాష్ట్రాలలో రాజ్యమేలింది. వ్యక్తిగత సమాజాల సంఖ్య తక్కువైనా కాంట్రాక్ట్ నాటక చట్రంలో వందలాది మంది కళాకారులు నాటకాలలో నటించేవారు. రాష్ట్రంలోని అన్ని పల్లెటూళ్లల్లో టికెట్ నాటక ప్రదర్శనలు జరిగేవి. దేవతా ఉత్సవాలలో ఉచిత నాటక ప్రదర్శనను ఏర్పాటుచేసేవారు. ప్రతి 10-15 పల్లెటూళ్లల్లో ఎక్కడో ఒకచోట నాటక ప్రదర్శనలు జరిగేవి కానీ ఆ స్థితి ఇప్పుడు తగ్గిపోయింది. పద్య నాటక ప్రదర్శనల సంఖ్య కూడా పరిమితంగానే ఉంది. ఇక గ్రామీణ వాణిజ్య నాటకాలు 1970 ప్రాంతంలో నుండి 2000 వరకు మూడు దశాబ్దాల కాలంలో ఈ ప్రదర్శనలు ఉధృతంగా జరిగాయి. గ్రామీణ ప్రాంత యువ యువత లక్షలాది రూపాయల ఖర్చుకు వెనకాడకుండా నాటకాలను ప్రదర్శించేవారు. అయితే ఈ నాటకాలలో 90కు పైగా శాతం విజయవంతమైన క్రైమ్ సినిమాలను మాతృకగా రూపొందించినవి కావడం గమనార్హం. అయితే 2000 సంవత్సరం తర్వాత గ్రామీణ ప్రాంతంలో వాణిజ్య నాటక ప్రదర్శనలు క్రమక్రమంగా తగ్గిపోతూ వచ్చాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయ థియేటర్ ఆర్ట్స్ కోర్సుతో ప్రారంభమైన విశ్వవిద్యాలయ నాటక శిక్షణా సంస్థలు 21వ శతాబ్దం మొదటివరకు ఎంతో పకడ్బందీగా జరిగాయి. విశ్వవిద్యాలయాలలో శిక్షణ పొందిన ఎందరో నటులు, దర్శకులు ఆ పరిజ్ఞానంతో ఎన్నో అద్భుతమైన ప్రయోగాలను చేశారు. తదనంతర కాలంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు విశ్వవిద్యాలయం వంటి ఒకటి రెండు విభాగాలు మినహా మిగతావి నామమాత్రంగా మిగిలిపోయాయి. విశ్వవిద్యాలయాలలో శాస్త్రీయవిజ్ఞానాన్ని, ప్రయోగ వైవిధ్యాన్ని రాష్ట్రంలోని ఔత్సాహిక నటులకు, దర్శకులకు కూడా ప్రత్యేక శిక్షణ శిబిరాలు వర్క్‌షాప్ ద్వారా విశదం చేసే వెసులుబాటును విశ్వవిద్యాలయాలు తప్పనిసరిగా కల్పించాలి. కానీ ప్రపంచీకరణ నేపథ్యంలో నిధులు నియామకాల కొరతతో కునారిల్లుతున్న విశ్వవిద్యాలయాల శాఖలు ఆ దిశగా ప్రయాణించలేక పోతున్నాయి. దీనికితోడు వర్తమాన నట విద్యార్థులలో అంకిత భావం కొరబడడం సినిమా బుల్లితెర ప్రవేశాలకు ఈ నాటక శిక్షణను ఒక మెట్టుగా భావించటం కూడా ప్రధాన లోపంగా కనిపిస్తుంది.


చాట్ల శ్రీరాములు

తెలుగునాట అటు సినిమారంగం, ఇటు నాటకరంగ ఆరంభ దశ నుండి ఇప్పటివరకు ఉత్తమ కళాఖండాలు ఎన్నో ఎన్నెన్నో వెలువడ్డాయి. చెత్తలో చిత్రరాజాలు ఉన్నాయి. చాలామంది ఆవేదన చెందుతున్నట్లు అటు సినిమాగాని ఇటు నాటకంగాని పతనావస్థలో మాత్రంలేదు. కాలానుగుణంగా జనావళి అభిప్రాయాలు అభిరుచుల్లో మార్పులు శరవేగంతో మారిపోతున్నాయి. ఈ సంధి దశలో నిమ్మొన్నతాలు, సుడిగండాలు ఉండటం చాలా సహజం. తెలుగు నాటకరంగంలో కూడా జాతీయస్థాయిలో నిలబడగలిగిన రచయితలు, నటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులు ఎందరెందరో ఉన్నారు. కానీ జాతీయవేదికపై తెలుగునాటక ఉనికి నామమాత్రంగా ఉండడంతో అసలు తెలుగు నాటకం లేదనో పనికి రానిదనో భావనలు అపప్రదలు చాలామందిలో ముసురుకుంటున్నాయి. డాక్టర్ చాట్ల శ్రీరాములు, దేశరాజు హనుమంతరావు, ఏఆర్ కృష్ణ, తల్లావర్జుల సుందరం, డాక్టర్

డిఎస్ఎన్ మూర్తి, ఎల్ సత్యానంద్, టిజే రామనాథ్, డాక్టర్ ఎం.ఎస్ చౌదరి, ఆర్ వాసుదేవరావు, ఎస్.ఎం భాషా, పాటిబండ్ల ఆనంద రావు వంటివారు ఎన్నో అద్భుత ప్రయోగాలకు పురుడు పోశారు. ప్రపంచీకరణ లోహగంటల చప్పుడు భారతదేశంలోకి పాదం మోపు తున్న తొలిదశలోనే ఆ సమస్య తీవ్రతను దుష్పలితాలను ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి ఆటబొమ్మలు, గొర్రెలు తిరగబడతాయి వంటి ఆధునిక వీధి నాటికలద్వారా దేశంలోనే తొలిసారిగా ప్రదర్శించటం విశేషం.

నిన్నటి, నేటి కాలాల నాటకరంగాల ఔన్నత్య ప్రస్థానాలను ఆరోహణ అవరోహణలను సహృదయ విశ్లేషణ చేసి రానున్న కాలంలోని నాటక రంగం ఎలా ఉన్నతోన్నతంగా వర్ధిల్లాలో ఒక సమగ్ర రూపకల్పన చేయవలసిన ఆవశ్యకత ప్రతి తెలుగు నాటక కళాజీవి భుజస్కంధాలపై ఉంది. నాటకానికి కీలక మూలకం రచన. తెలుగు నాటక ఆరంభదశ నుండి సంస్కరణవాదానికే పెద్ద పీట వేసింది. సమస్యలను ప్రతిబింబించడంలో, పరిష్కార మార్గాలను నిర్దేశించడంలో అన్ని ప్రక్రియల కన్నా నాటకమే నాలుగు అడుగుల ముందంజలో నడిచింది. సమస్యల చిత్రీకరణలో సమాజ దర్పణ ప్రతిబింబంలో జాతీయస్థాయిలో తెలుగు నాటక రచయిత తనదైన శైలిలో దిశానిర్దేశ పాత్రను పోషిస్తూనే ఉన్నాడు. అయితే నాటకరంగాన్ని ముమ్ముందుకు నడిపించి భవిష్యత్తులో దానిని మరింత పటిష్టపరిచి తెలుగు నాటక వైభవ ప్రాభవాలను దశదిశలా చాటించడానికి మేధోమథనం చేసి ఒక సమగ్ర ప్రణాళిక రూప కల్పనకు ఇదే నాంది వాక్య పఠన సమయం. వర్తమాన కాలంలోనే నాటక రచనలో స్పష్టత లేమి కొట్టవచ్చినట్లుగా కనిపిస్తుంది. అనేకానేక సమస్యలను ఒక నాటిక చట్రంలో బలవంతంగా బంధించి గందరగోళాలకు తానే తెరలను తొలగిస్తున్నాడు. నాటక రచయిత తాను సర్వజ్ఞుణ్ణి అని భుజాలను తట్టుకోకుండా ఇతర ప్రక్రియల సాహిత్య అనుశీలనను ఆవశ్యకంగా చేయాలి. అప్పుడే అతని భావనాజగతి పరిధి మరింత సుశాలం అవుతుంది.

నాటక ఇతివృత్తం తప్పనిసరిగా జీవన ప్రతిబింబంగా ఉండి తీరాలి. వర్తమాన నవతరం అవసరాలు అభివృద్ధిలను గుర్తించి ఆ నేపథ్యంగా రచనలు జరగాలి. ఈ రచనావ్యాసాంగం ఒక ఉద్య మంలా నడవాలి. జీవితంలోలాగానే రచనలో కూడా ఒక మార్మిక వేగం పెరగాలి. తెలుగు సంస్కృతి, తెలుగువారి అపురూపమైన జానపద కళారూపాల సంపదను ఇతివృత్తాలతో అనుసంధానం చేయాలి. జిలేబి చుట్టలు, చర్విత చరణాలు, కడవలకొద్దీ కన్నీళ్ల ప్రవాహాలు కాకుండా ఒక నవ్యత, ఒక అర్థవంతమైన ప్రయోగం, సందేశాల మేలు కలయికగా నాటకం ఉండాలి. ఇక్కడ సుప్రసిద్ధ సినీ దర్శకుడు కె. బాలచందర్ మాటలు ప్రతి నాటక రచయితకు ఒక కరదీపిక కావాలి. "పాయింట్ పాతదైతే కొత్తగా చెప్పు, అదే పాయింట్ కొత్తదైతే ఎలా చెప్పినా గుండెలను తాకుతుంది." ఈ మాటలు అక్షర సత్యాలు. స్ఫూర్తిదాయకం కావాలి. ఆ కొత్త వైపుకు ఆలోచనను సారించకుండా సక్సెస్ ఫార్ములా చట్ర ఊబిలోనే కూరుకుపోతున్న చాలామంది రచయితలు ఆగి ఒక్క క్షణం



కపిరాజు నాటికలో ఒక సన్నివేశం

ఆలోచించాలి. ప్రతి రచయిత ఏదో ఒక కోణంలో గొప్పవాడే. పాత పద్ధతిని త్రోసిరాజని ఎప్పటికప్పుడు నవ్యత్వం కోసం ఆలోచనలను సారిస్తాడో అతడే పురోగామి రచయితగా వేళ్లనుకోగలుగుతాడు. ఒక ఇతివృత్తాన్ని రచనగా మలచే సమయంలో తత్సంబంధిత నేపథ్య పరిశీలన అవగాహన విధిగా ఉండాలి. అందుకోసం కొంత అధ్యయనం, పరిశోధనలు చేయాలి. ఇది శూన్యమైతే ఆ రచనలో అస్పష్టత, గందరగోళం అడుగడుగున కనిపిస్తాయి. ఒక నాటక రచనను చదివినా, ఒక ప్రదర్శనను చూసినా, ఒక స్ఫూర్తిని స్పందనను కొత్త ఆలోచనను కలిగించే విధంగా రచనలు ఉండాలి. రచనాక్రమంలో నిర్దిష్ట ప్రణాళిక లోపం చాలా నాటకరచనల్లో కనిపిస్తుంది. మూస ధోరణి ఇష్టారాజ్యంగా కనిపిస్తుంది. అందుకే ముందుగా నాటక రచయితలకు వివిధ అంశాలపై శిక్షణ తరగతు లను తప్పనిసరిగా నిర్వహించాలి. రంగస్థల సాంకేతిక అంశాలపై కూడా వర్క్‌షాపులో అవగాహన కలిగించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అప్పుడే కొత్తదనం వైపు, ప్రయోగం వైపు రచయిత దృష్టికోణం మరలుతుంది. అయితే ఇక్కడ ఒక్క విషయంపై నాటక రచయితలు తమ తమ భేషజాలను విడనాడాలి. తమకు అంతా తెలుసు, తాము నేర్చుకునేది ఏమీలేదు, అసలు మాకు చెప్పేవారు ఎవరూ లేరు అన్న అహాన్ని చెరిపివేస్తే తూర్పు తలుపు తప్పకుండా తెరుచుకుంటుంది. వెలుగు రేఖలు పరచుకుంటాయి. జీవన తాత్వికతను కొత్త కోణంలో ప్రయోగిస్తే ఆ రచన ఏ కాలా కైనా చెక్కు చెదరకుండా ఉంటుంది.

ఇక తెలుగు నాటకం అనేక మార్గాలలో నడుస్తుంది. సాంఘిక నాటకం, పద్య నాటకం, ఆధునిక వీధి నాటకం వంటివి. ఇక పరిషత్తు నాటకం ప్రత్యేక ప్రయోగ ప్రదర్శనలు తమదైన శైలిలో నడుస్తూనే ఉన్నాయి. ఒకరికి ఒకరికి మధ్య ఆదాన ప్రదానాలు లేవు. ఒక సమిష్టి దృక్పథం లేదు. నాటకరంగ భవితపై సంఘటిత ప్రణాళిక రచన లేదు. అందరినీ సమన్వయపరిచే ఒక కార్యాచరణ యోచన అంతకన్నా లేదు. దీనిపై విస్తృతమైన చర్చోపచర్చలు జరగాలి. లోతైన మేధోమథనం జరగాలి. కేవలం పోటీలను నిర్వహించి ఈ ఏడాది మన పని ముగిసింది అని పరిషత్తు నిర్వా హకులు చేతులు దులుపుకోకుండా కొత్త తరాన్ని నాటకం వైపు నడిపించే బాధ్యతను స్వీకరించాలి. ప్రతి పరిషత్తు కొన్ని విద్యా

సంస్థలను ఎంపిక చేసుకొని బాలలకు, యువతకు నటనలలో శిక్షణ ఇప్పించి నాటికలను రూపొందించాలి. బాల, యువ నాటికలను పరిషత్తుల సమన్వయంతో జిల్లా రాష్ట్రస్థాయిలో నిర్వహిం చాలి. పరిషత్తు, నాటకం శరీరం, ప్రాణంలాంటివి. నాటకాన్ని పరిషత్తు కాపాడాలి. పరిషత్తును నాటకం బ్రతికించాలి. ఇది ఉభయతారక మంత్రం. అందరి లక్ష్యం లక్షణం కావాలి.

వేగంగా కదులుతున్న కాలానికి అనుగుణంగా నాటక రంగంలో కూడా సరికొత్త సాంకేతిక విప్లవానికి స్వాగతం చెప్పాలి. రంగస్థలంపై భౌతికంగా ప్రదర్శించడానికి అననుకూలమైన అసాధ్యమైన అంశాలను డిజిటల్ ద్వారా ప్రదర్శిస్తే అద్భుతంగాను జనరంజికంగాను ఉంటుంది. ప్రదర్శన రక్తికి అది ఎంతగానో దోహదపడుతుంది. అయితే టెక్నాలజీపై మోజుతో దానిపైనే పూర్తిగా ఆధారపడితే నాటిక జీవము అడుగంటిపోతుంది. అలా చేసిన ఎన్నో ప్రయోగాలు శిరోభారమైన ఉదంతాలు కూడా ఉన్నాయి. ఇటీవల అమెరికాలో జార్జ్ క్లూనే ప్రధాన పాత్రధారిగా గుడ్ నైట్ గుడ్ లక్ అనే నాటకాన్ని టీవీల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇది ఒక ప్రయోగమైనా అటువంటి ప్రయత్నాల మూలంగా ప్రేక్షకునికి నటునికి మధ్య ఉన్న దృశ్య సంబంధం తెగిపోతుంది. నాటకాన్ని రంగస్థలంపై ప్రత్యక్షంగా చూసినప్పుడు ప్రేక్షకునికి, ప్రేక్షకునికి ఎదురుగా నటించినప్పుడు నటునికి ఉండే ప్రత్యక్ష సంబంధం ఆత్మ సంతృప్తి వెలకట్టలేనివి. ఇక్కడ ప్రపంచ నాటక రంగ చరిత్రను ఒక్కసారి విశ్లేషిస్తే ఏ భాషలోనైనా మానవీయ బంధా లను హృద్యంగా కొంగొత్త కోణంలో వాస్తవికావాదంలో ప్రదర్శిం చిన, రచించిన నాటకాలే కాలానికి చెక్కు చెదరకుండా నిలిచాయి. దానికి సాంకేతికత అతికినట్లు ఉండాలే కానీ అతికించి నట్లు ఉ ండకూడదు. సామాజిక దృక్పథంతో ఒక కొత్తకోణంలో కొత్తశైలిలో నాటకరచన జరగాలి. ఎవరూ చూపని చేయని ప్రయోగ వైవిధ్యంతో అది ప్రదర్శనగా అవతారం ఎత్తాలి. అదే నిన్న నేటికే కాదు రేపటి కాలానికే కాదు ఎన్ని కాలాలకైనా చిరస్థాయిగా నిలుస్తుంది. మిలమిల మెరుస్తుంది. నాటక రచయితలు, నటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులు, నిర్వాహకులు, ప్రేక్షకులు అందరూ జాతీయ, అంతర్జాతీయ నాటకరంగ తీరుతెన్నులపై అవగాహనను పెంచుకోవాలి. ఇందుకు ప్రభుత్వం జాతీయ అంతర్జాతీయ ప్రదర్శనలను ఏర్పాటు చేయించాలి. తులనాత్మక అధ్యయన సదస్సులను నిర్వహించాలి. కొత్త నాటక ఆవిర్భావ వికాసాలకు ప్రణాళికారచన ఆచరణ విధానాలకు అడుగు వేయాలి.

డాక్టర్ డి. విజయభాస్కర్ చెప్పినట్టు, "మానవుని ఆనంద విషాదాల క్రమబద్ధమైన వ్యక్తీకరణే నాటకం. సృష్టి అంతసత్వం సృజనాత్మకత. విశాల విశ్వమంతా దాని రంగస్థలమే. సంపూర్ణ మానవ జీవిత ఆవిష్కరణకు ప్రతీక రంగస్థలం. నాటకం అంటే జీవితానికి ప్రతిసృష్టి. సమాజానికి భగవంతుడు ఇచ్చిన అలిఖిత శాసనం. ఆ నాటక ఆవిష్కరణ సముద్రమంత లోతుగా ఆకాశ మంత విశాలంగా ఉంటుంది. అది సృష్టి అంత విస్తృతమైనది. బిడ్డ సూక్ష్మరూపాన్ని దాచుకునే తల్లి గర్భంలా ఇంత అనంతత్వాన్ని విస్తృతిని తనలో పొదువుకుంటుంది. సమాజంలో వచ్చే మార్పులను రంగస్థలం ముందుగా దర్శించి సమర్థవంతంగా ఆకర్షిస్తుంది. ఇతర కళలు దానికి సమాహారంగా సహకరించి పరిపూర్ణతను చేకూర్చు తాయి. ప్రయోజనాత్మకమైనది నాటకం. సామాజిక ప్రయోజనమే దానికి ప్రాణాధారం," అని అంటారు. ఇది మొన్న నిన్న నేటి నాటక రంగానికే కాదు రేపటి నాటకరంగ దర్శనం, నిదర్శనం, నిర్వచనం.

రేపటి నాటక స్వరూప స్వభావాలను గూర్చి ఆధునిక నాటక ప్రయోగ పితామహుడు డాక్టర్ చాట్ల శ్రీరాములుగారి ఆలోచనలను ఇక్కడ ఉటంకించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. నాటకం కాల గమనంతోపాటు మార్పు చెందాలి. ఈరోజు మనం కోరుకునేది మనిషి భావాలకు దృశ్యాకృతిని కలిగించే నాటకం. నాటకాన్ని మాటల్లోకాక భావంతో చెప్పే నాటకం రావాలి, కావాలి. ఈ ఆలోచనాలోచనాలను ప్రతిబింబిస్తూ నవత ఆలోచనకు ఆకారం, యువత దిశానిర్దేశానికి శ్రీకారం, సమాజ చైతన్యానికి ప్రాకారమైన రేపటి తెలుగు నాటకం నిన్నటి నేటి స్వరూపాలను సమీక్షించి విశ్లేషించి క్రోడీకరించి రేపటి సరికొత్త నాటక ఆవిర్భావానికి స్వాగత గీతికలను ఆలపించాలి. రేపటి తెలుగు నాటకం జనజాగృతికి మరింతగా రాచబాటలు వేస్తూ నవ్య భవ్య ప్రయోగాలకు స్వాగత జయమంగళ గీతికలను పాడాలి. ఆ నాటక నూతన సృష్టికి ప్రతి రంగస్థల సూత్రధారుడు శుభస్వాగతం పలకాలని ఆశిద్దాం, ఆకాంక్షిద్దాం, అభిలషిద్దాం! తెలుగు నాటక కళామతల్లికి జయ జయ జయ జయహే!


ఆడ-లేదు సరికొత్త నాటక ప్రక్రియ


నాన్న నేనొచ్చేస్తా


పంపకాలు


పిపీలికం

శ్రవ్యనాటిక రూపంలో ఉన్న ఈ నాలుగు నాటికల్ని ప్రదర్శించడానికి ఒక ప్రయత్నం చేయవచ్చు.





కందిమళ్ల సాంబశివరావు ప్రస్తుత బాపట్ల జిల్లాలో జన్మించారు. చిలకలూరిపేట డి.ఆర్.ఎన్. ఎస్.పి.ఎస్.వి.ఎస్. కాలేజీలో పనిచేసి పదవీ విరమణ చేసారు. తెలుగు నాటకరంగం-నూతన ధోరణులు, ప్రయోగాలు అనే అంశంపై పిహెచ్.డి. చేసారు. గుంటూరు జిల్లా నాటకరంగ చరిత్ర పై డి.లిట్ చేసారు. వరదు, ఖడ్గసృష్టి, సైపై బోడెడ్లబండి, 18 నాటకాలు రచించి ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కళారత్న, కందుకూరి-గురజాడ పురస్కారాలు పొందారు.

తెలుగు భవిష్యత్తు: ప్రజలు, కథలు, భాషావికాసం

కన్నెగంటి రామారావు

ముందుగా నా గురించి కొన్ని మాటలు. నేను తెలుగుని కంప్యూటర్ యుగంలోకి తేవడానికి 1990 నుండి కృషి చేస్తున్నాను. నేను ప్రోగ్రామింగ్ భాషలపై పిహెచ్.డి. చేసాను. వృత్తిరీత్యా గణిత శాస్త్రం (లెక్కలు మాత్రమే కాదు), కంప్యూటర్ సైన్స్, ఇప్పుడు బయాలజీ రంగాలలో పనిచేస్తుంటాను. సాహిత్యపరంగా నా అభిప్రాయాల మీద నా వృత్తి, నా చదువుల ప్రభావం ఉంది.

అందరిలాగానే, నేను కూడా అనేక వాట్సాప్ గ్రూపులలో సభ్యుడిని. గుడ్ మార్నింగ్, ఇడ్లీకి అంతర్జాతీయ గుర్తింపు, భార్యల మీద జోకులు, తాగుబోతుల సమయస్ఫూర్తి వంటి మెసేజ్‌ల మధ్య, తెలుగు మీద పోస్టులు వస్తుంటాయి. తెలుగులో ఇంగ్లీషు పదాలు వాడినందుకు ఎగతాళి చేస్తూ, 'అంతా ఇంగ్లీషుమయం చేస్తున్నారు, తెలుగు చచ్చిపోతోంది!' అని ఒక గొంతుక ఆవేదన చెందుతుంది. మరొకటి, 'మన తెలుగు ఎంత అందమైనది! దీన్ని కాపాడుకోవాలి!' అని భాష గొప్పతనాన్ని పొగిడే పోస్టులు. ఆ తర్వాత వెంటనే, 'ఒకవేళ తెలుగుపదాలు వాడకపోతే మన భాష అంతరించి పోతుంది!' అనే హెచ్చరికలు. ఈ వాదనల్లో నిజమెంత? ఒక భాష నిజంగా చనిపోతుందా? తెలుగుభాష అంటే తెలుగువాడు మాట్లాడే భాషేనా? తెలుగు చచ్చిపోతే తెలుగువాళ్లు ఉండరా? ఇలాగ అనేక ధర్మ సందేహాలు. వీటిని పరిశీలించుకుందాం.

భాష చనిపోతుందా? మొదటి కోణం: నిరంతర పరిణామం

ఒక భాష చనిపోతుందా? అన్న ప్రశ్నకు మొదటి సమాధానం: భాష ఎప్పుడూ చనిపోదు, అది నిరంతరం పరిణామం చెందుతుంది. మన తెలుగు చరిత్రనే చూడండి. వందల సంవత్సరాలుగా, మన భాషలో ఎన్నో మార్పులు వచ్చాయి. మనం సంస్కృతం, పర్షియన్, అరబిక్, చివరికి ఇంగ్లీష్ నుండి అసంఖ్యాకమైన పదాలను స్వీకరించాం. ఇప్పుడు అవి మన దైనందిన జీవితంలో ఎంత సహజంగా కలిసిపోయాయో గమనించండి: 'రోజు' (పర్షియన్), 'తయారీ' (అరబిక్), 'వీలునామా' (పర్షియన్), 'ఖాలీ' (అరబిక్), 'బస్', 'ఫోన్', 'టీ', 'కాఫీ' (ఇంగ్లీష్). ఇవన్నీ ఒకప్పుడు అరువు తెచ్చుకున్న పదాలే. ప్రతి పదం దానితోపాటే కొత్త అర్థాలను తెచ్చింది లేదా కొత్త వస్తువుతోపాటే వచ్చింది. ఈ పదాలు మన భాషకు ప్రాణం పోశాయి, కొత్త ఆలోచనలను వ్యక్తీకరించడానికి సహాయపడ్డాయి. మరి ఇప్పుడు మనం ఇంగ్లీషు పదాలను వాడుతుంటే ఎందుకు భయం? ఇది భాషావికాసంలో సహజమైన ప్రక్రియ కాదా?

భాష ఒక జీవన వ్యవస్థ. అది కేవలం పదాల గుంపు కాదు; అది అద్దంలాంటిది, అచ్చులాంటిది కూడా. ఒకవైపు, అది మన ప్రపంచాన్ని ప్రతిబింబిస్తుంది. మనం చూసేవి, చేసేవి, విలువ ఇచ్చే వాటిని నమోదు చేస్తుంది. మరోవైపు, అది మనం వాస్తవ ప్రపంచాన్ని ఎలా అర్థం చేసుకుంటామో, మన భావనలకు, ఆలోచనలకు ఎలా ఆకృతి ఇస్తుందో తెలియజేస్తుంది. ప్రపంచం మారినప్పుడు, మన భాష కూడా మారాలి. లేకపోతే అది ఒక పెళుసైన కళాఖండంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఎంతో పూజనీయమైనదిగా భావించినా నిరుపయోగంగా మారుతుంది.

విదేశాల్లో ఉన్న తెలుగువారికి ఇది కేవలం సిద్ధాంతం కాదు, నిత్యజీవితంలో చూసే వాస్తవం. ఈరోజు కాలిఫోర్నియాలోనో, హైదరాబాద్‌లోనే ఉన్న ఒక పిల్లవాడు 'కోడింగ్', 'హాకథాన్స్', 'ఈ-కామర్స్', లేదా 'క్రెడిట్ స్కోర్స్' గురించి మాట్లాడవచ్చు. ఈ పదాలకు, భావనలకు శాస్త్రీయ తెలుగులో సరైన, తక్షణ పర్యాయ పదాలు లేవు. హైదరాబాద్‌లోని ఒక టెక్ స్టార్టప్‌లో, ఒక తెలుగు కుర్రాడు తన ఆలోచనను, 'ఇది సార్, మాది ఒక అగ్రిటెక్ ప్లాట్‌ఫామ్. రైతులకు డ్రోన్ సేవలు అందిస్తాం, ఈ-కామర్స్ ద్వారా

వాళ్ల ఉత్పత్తులు అమ్ముతాం,' అని వివరించినప్పుడు, అతను 'ప్రామాణిక తెలుగు' కోసం ఆలోచిస్తాడా, లేక తన ఆలోచనను స్పష్టంగా చెప్పడం గురించి ఆలోచిస్తాడా? నిత్యం మారుతున్న సాంకేతిక, వ్యాపార ప్రపంచంలో తెలుగుకు ఈ పదాలు అవసరం.

అయితే, ఇలాగే ఉండాల్సిన అవసరంలేదు. ఏ భాషకైనా జీవ శక్తి దాని అనుకూలత నుండే వస్తుంది. అది కొత్తపదాలను స్వీక రించగలగడం, సృష్టించగలగడం, కలపగలగడం. తెలుగు మాట్లాడే వారు కొత్త కథలను సృష్టించినప్పుడు, కొత్త యాసను తయారు చేసినప్పుడు, ఇతర భాషల నుండి స్వేచ్ఛగా పదాలను స్వీకరించి నప్పుడు, వారు భాషను పలుచబరచడం లేదు; వారు దాన్ని జీవంతో ఉంచుతున్నారు. ఉదాహరణకు, సినిమాల్లో 'అబ్బబ్బా, అంత సీన్ లేదు లేండి' అంటాడు. లేదా, 'మా బాస్ ఇచ్చిన అపాయింట్‌మెంట్ క్యాన్సిల్ అయ్యింది,' అంటాం. ఈ పదాలు తెలుగులోలేనివి కావు, కానీ సందర్భాన్నిబట్టి ఇవి సహజంగా మన మాటల్లోకి వస్తాయి. దీన్ని భాషాకాలుష్యంగా చూస్తామా, లేక భాష యొక్క సౌకర్యంగా చూస్తామా? వాస్తవానికి, తెలుగు 2025 వాట్సాప్‌గ్రూప్‌లో ఒక సజీవభాష ఇంగ్లీష్ నామ వాచకాలతో, హిందీ పంచులతో, అప్పుడప్పుడు ఎమోజీలు, మీమ్‌లతో నిండి ఉంటుంది.

భాష చనిపోతుందా? రెండో కోణం: సూక్ష్మతను కోల్పోవడం, భావాలను మొద్దుబారించడం

భాషకు నిజమైన ప్రమాదం కేవలం పదాలు అరువు తెచ్చు కోవడంవల్ల కాదు, దాని వ్యక్తీకరణ శక్తిని, ఆలోచనల సూక్ష్మతను కోల్పోవడం వల్లనే. జీవశాస్త్రాన్ని ఉదాహరణగా తీసుకోండి. జీవశాస్త్రం ఎంతో వృద్ధి చెందింది, ఎందుకంటే అది జీవరాశులను కేవలం 'జంతువు' అని కాకుండా, వాటిమధ్య ఉన్న సూక్ష్మభేదాలను అర్థం చేసుకుంది. ఉదాహరణకు, Vertebrates (సకశేరుకాలు), Invertebrates (అకశేరుకాలు) అని వర్గీకరించడం, Mammals (క్షీరదాలు) వాటి విశిష్ట లక్షణాలను గుర్తించడం. అలాగే భాష కూడా. అది కేవలం సమాచారాన్ని మార్పిడి చేసుకోవడం మాత్రమే కాదు, భావాలను, ఆలోచనలను, అనుభూతులను అత్యంత సూక్ష్మంగా వ్యక్తపరచగలగాలి. నిజానికి, మేధస్సు యొక్క ముఖ్య లక్షణాలలో ఒకటి: ఒకేలా అనిపించే ఆలోచనల మధ్య భేదాలను గుర్తించడం, అలాగే భిన్నంగా కనిపించే వాటిమధ్య పోలిక లను చూడటం. ఈ రెండింటిలో, మొదటిదానికి (సమానమైన ఆలో చనల మధ్య భేదాలను గుర్తించడానికి) భాష కీలకపాత్ర పోషిస్తుంది. నుయాన్స్ (nuance) అంటే ఒకేలా అనిపించే భిన్నమైన ఆలోచనల మధ్య, లేదా భావాల మధ్య ఉన్న సన్నని తేడాను, సున్నితత్వాన్ని స్పష్టంగా వ్యక్తం చేయగలగడం.

మనం అరువు తెచ్చుకున్న పదాలను సరిగా అర్థం చేసుకో కుండా, లేదా అనవసరంగా వాడినప్పుడు, భాష పలుచబడుతుంది. ఒక పదానికి అనేక అర్థాలను ఆపాదించడంవల్ల దాని స్వంత ఆలోచనాసూక్ష్మత పోతుంది. కొన్నిసార్లు, మనం అరువు తెచ్చు కున్న పదాల మూలం, చరిత్ర తెలియకపోవడంవల్ల, వాటి అర్థాలను తప్పుగా అన్వయించి హాస్యాస్పదమైన అర్థాలను సృష్టిస్తాం. ఉదా హరణకు, 'అడ్జస్ట్‌మెంట్' అనే ఇంగ్లీష్ పదం తెలుగులో తరచుగా నెగిటివ్ అర్థంలో వాడబడుతుంది, నిజానికి దానికి వేరే అర్థం ఉంది. 'ఆటిట్యూడ్' అంటే మనసులో ఉన్న ఒక పద్ధతి అయితే, తెలుగులో దాన్ని 'అహంకారం' అన్నట్లు వాడేస్తుంటాం. ఇలాంటివి భాషను సుసంపన్నం చేయవు, పైగా దాని వ్యక్తీకరణశక్తిని తగ్గిస్తాయి.

భాషకు నిజమైన మరణం పదజాలం అంతరించిపోవడం వల్ల కాదు, అది ఆలోచనలను, అనుభవాలను, సూక్ష్మభేదాలను వ్యక్తపరచలేనప్పుడు సంభవిస్తుంది. ఒక భాష కేవలం అరిగిపోయిన మాటలతో, ఒకే రకమైన భావోద్వేగాలతో నిండినప్పుడు, అది కేవలం ఒక బోలు ప్రతిధ్వనిగా మారుతుంది. సినిమాల్లోని డైలాగులు గమనించారా? 'నిన్ను చంపేస్తాను!', 'నేనంటే ఏమనుకున్నావ్?', 'నువ్వంటే నాకు ప్రాణం!' ఇలాంటివి ఎన్నోసార్లు వినే ఉంటాం. ఈ పదాల్లో కొత్తదనం, భావోద్వేగ సూక్ష్మత ఎక్కడ? భాష తనలోని వర్ణనాత్మకశక్తిని కోల్పోయినప్పుడు ఇలాంటి సమస్యలు వస్తాయి. ఉదాహరణకి, ఒకప్పుడు, 'కోల ముఖం', 'వంగపువ్వు రంగు చీర', 'మకారం ఉన్న మనిషి' అని వర్ణించేవాళ్లం. ఇప్పుడు 'చాలా మంచివారు', 'యాక్టివ్', 'కామన్' అని చెప్పేస్తున్నాం. వర్ణించే పదజాలం తగ్గిపోవడం, మన భావవ్యక్తీకరణను కుదించేస్తోంది కదా? అందరూ ఒకేలా మాట్లాడినప్పుడు, సూక్ష్మత కోల్పోయి నప్పుడు, భాష ఒక సజీవ సాధనం కాకుండా ఒక మొద్దుబారిన వాయిద్యంగా మారుతుంది.

ఆంగ్లభాష తన వ్యక్తీకరణ శక్తిని ఎలా పెంచుకుందో గమనిం చండి. అది శక్తివంతమైన వాక్యనిర్మాణాలను, విభిన్న వ్యక్తీకరణ పద్ధతులను, ఆధునిక యుగానికి తగిన కథనశైలులను, సమగ్రమైన పేరాలను (coherent paragraphs), తార్కిక నిర్మాణాలను రూపొందించుకుంది. ఉదాహరణకు, ఆంగ్ల జర్నలిజం స్పష్టమైన, ప్రభావవంతమైన వాదనలను నిర్మించడానికి సుసంపన్నమైన వాక్చాతుర్య నియమాల (rules of rhetoric) పై ఆధారపడుతుంది. అంతేకాదు, ట్విట్టర్, ఇన్‌స్టా రీల్స్, యూట్యూబ్ షార్ట్స్ వంటి షార్ట్-ఫార్మ్ కమ్యూనికేషన్ మాధ్యమాలు భాషను వేగంగా మారుస్తు న్నాయి. ఆంగ్లం ఈ మార్పులను స్వీకరించడమే కాకుండా, వాటి ద్వారా ప్రభావితం అవుతుంది, వాటిని ప్రభావితం చేస్తుంది కూడా. తెలుగులో మాత్రం, వార్తాశీర్షికల్లో పన్ (pun) లేదా అరిగిపోయిన 'పంచ్ డైలాగులు' మాత్రమే ప్రాధాన్యతను సంతరించుకుంటు న్నాయి. ఇది భాషలోని లోతైన, సూక్ష్మమైన వ్యక్తీకరణలకు ఆస్కారం లేకుండా చేస్తోంది.

కేవలం తెలుగుపదాలు వాడటంలేదు, నుడికారంలేదు అనడం క్యాన్సర్ ఉన్న మనిషికి తల మాసింది అని బాధపడటం లాంటిది. అసలు ప్రమాదం వేరేచోట ఉంది. భాషలో జరుగుతున్న ప్రసంగాల్లో, చర్చల్లో, యూట్యూబ్ వీడియోల్లో, తెలుగు వార్తా పత్రికల్లో ఉంది. ఒక పిల్లవాడు ఎకనామిక్స్ గురించి రాస్తుంటే చరిత్ర ఉన్న తెలుగుపదాలు దొరక్కపోవడంలో ఉంది. పదిమంది తెలుగులో ఎకనామిక్స్ గురించి మాట్లాడకపోవడంతో లేని ఒరవడిలో ఉంది ఈ ప్రమాదం.

నిర్జీవపదాల ప్రమాదం: సరికొత్త పదాల జీవితచక్రం

కొందరు భాషాభిమానులు కొత్త ఆలోచనలకు 'స్వచ్ఛమైన' తెలుగుపదాలను సృష్టించాలని ప్రయత్నిస్తారు. ఉదాహరణకు, 'ఇంటర్నెట్'కు పర్యాయపదంగా 'అంతర్జాలం' అనే పదం, లేదా Artificial Intelligenceకు 'కృత్రిమ మేధస్సు' అనే అనువాదం. ఇవి ఉద్దేశపూర్వకంగా సృష్టించిన పదాలు. ఈ పదాలకు తెలుగులో తక్షణ చరిత్ర ఉండదు, ప్రజల అనుభవాలతో నేరుగా సంబంధం ఉండదు. అవి 'మక్కీకి మక్కీ' అనువాదాలలాగా అనిపించవచ్చు. ఒక పదానికి చరిత్ర అనేది కేవలం దాని పుట్టుకతోనే కాదు, అది కాలక్రమేణా ప్రజల నోళ్లలో నాని, వారి అనుభవాలతో పెనవేసుకున్నప్పుడు, ఒక సామాజిక సందర్భాన్ని పొందినప్పుడు ఏర్పడుతుంది. ఈ కోణంలో, ఈ కొత్త పదాలు పుట్టినప్పుడు నిర్జీవంగానే ఉంటాయి. అయితే, మనం అంగీకరించాలి: నిరంతర వాడుక ద్వారా, పదేళ్ల తర్వాత 'అంతర్జాలం', 'కృత్రిమమేధస్సు' వంటి పదాలు కూడా మెల్లగా తెలుగు నిఘంటువులో స్థానం సంపాదించుకుని, వాటికంటూ ఒక చరిత్రను, ప్రజలస్పృహలో ఒక స్థానాన్ని పొందాయి.

కానీ, ఇది ఒక పెద్ద సవాలు. జర్మనీ, జపాన్‌లాంటి దేశాలు వాళ్ల భాషలో రాయరా? వాళ్లు పదాలు సృష్టించడం లేదా అని ప్రశ్నిస్తుంటారు. ఉదాహరణకి మ్యాథమెటిక్స్ జర్మన్‌లోనే రాస్తారు. కానీ వారికి ఒక ఒరవడి ఉన్నది. ఒక చరిత్ర ఉన్నది. సరిపడినంత మంది పాఠకులు ఉన్నారు. శాస్త్రజ్ఞులు ఉన్నారు. అన్నిటికన్నా ముఖ్యంగా ఆర్థికబలం ఉంది. తెలుగు చదువుకున్నవారికి సినిమా రంగం, జర్నలిజం, రాజకీయ ఉపన్యాసరంగం తప్ప ఉద్యోగాలు లేని రోజుల్లో, మనం జపాన్‌తో పోల్చుకోవడం ఎంత సమంజసం? మనకంటే, తలసరి ఆదాయం అక్కడ పదిహేను రెట్లు. పుస్తకాలు చదవడం కనీసం పదిరెట్లు!

అంతేకాదు, ఫ్రాన్స్ వంటి దేశాలు కూడా ప్రతీ కొత్త ఆంగ్ల భావనకు 'కంప్యూటర్', 'కంపైలర్' వంటి వాటికి తమ సొంత ఫ్రెంచ్ పదాలను సృష్టించడానికి ప్రయత్నించాయి. అయితే, అతి తక్కువ కాలంలోనే వారు ఆ ప్రయత్నాలను వదులుకోవాల్సి వచ్చింది. ఎందుకంటే, ఆంగ్లపదాలు ప్రపంచవ్యాప్తంగా, బిలియన్లమంది ప్రజల నిత్యవాడుక ద్వారా అత్యంత వేగంగా, విస్తృతంగా అర్థాలను పోగు చేసుకోవడం మొదలుపెట్టాయి; వాటికి ఒక బలమైన 'జీవిత చక్రం' ఏర్పడింది. మరోవైపు, ఫ్రాన్స్‌లో సృష్టించిన కొత్త పదాలు ప్రజల్లోకి చొచ్చుకుపోలేక, స్తబ్దంగా, నిర్జీవంగా మిగిలిపోయాయి. అదే భాషా మరణానికి ఒక నిర్వచనం వాడుక లేకపోవడం, కొత్త అర్థాలను పొందలేకపోవడం. ఈ కోణంలోనే మనం 'నిర్జీవపదాల' ప్రమాదాన్ని చూడాలి. ఒక భాషలో నిర్జీవపదాలు పేరుకుపోయినప్పుడు, అది ప్రజల ఆకాంక్షలను, ఆలోచనలను సరిగా వ్యక్తపరచలేక మొద్దుబారిపోతుంది.

భాషను ప్రజలే నడిపించాలి: సాహిత్యపు విష పరిష్వంగం నుండి విముక్తి

ఇక్కడ మనం అత్యంత సున్నితమైన, వివాదాస్పదమైన ఒక ప్రశ్నను అడగాలి: సాహిత్యం భాషకు మృత్యువా? ఈ వాక్యం వినడానికి ఆశ్చర్యంగా, ఆమోదయోగ్యం కానిదిగా అనిపించవచ్చు. కానీ, ఒక నిర్దిష్ట కోణంలో దీనిలో సత్యం దాగి ఉంది. సాహిత్యం భాషను ఒక మార్గంలోనే పెరిగేటట్లు చేస్తుంది. అది భాషకు ఒక పదునైన, నిర్దిష్టమైన పద్ధతిని, ఒక స్థిరమైన 'ప్రామాణికత'ను మాత్రమే ఆమోదిస్తుంది. ఉదాహరణకు, చారిత్రికపరంగా తెలుగు సాహిత్యం తరుచుగా అలంకారాలకు, అతిశయోక్తులకు, నిర్దిష్ట పద్య లక్షణాలకు ప్రాధాన్యతనిచ్చింది. జర్నలిజం కూడా సాహిత్య ప్రభావం మూలాన అసలు విషయం మర్చిపోయి అతిశయోక్తి, ఉపమానాలను ఖచ్చితత్వానికి (precision) బదులుగా వాడి, కవితావేశాన్ని, భావోద్వేగ వ్యక్తీకరణనీ మంచి వ్యాసంగా భ్రమపడుతూ రావడంతో తెలుగుభాషను పదును పెడుతుందన్న ఆశ పోయింది.

ఆంగ్ల భాష కేవలం కవిత్వం, కథలు చెప్పడానికే పరిమితం కాలేదు. అది తత్వశాస్త్రం (Philosophy), ఆర్థికశాస్త్రం (Economics), జీవశాస్త్రం (Biology), భౌతికశాస్త్రం (Physics), అకౌంటింగ్ (Accounting), సామాజిక శాస్త్రాలు (Sociology), ప్రకటనలు (Advertising) వంటి ఎన్నో రంగాలలో ఆలోచనలను వ్యక్తీకరించడానికి విస్తృతంగా ఉపయోగించబడింది. ఈ రంగాలలో అవసరమైన నిఖార్సైన భావవ్యక్తీకరణకు అది అనుకూలంగా మారి, తనను తాను సుసంపన్నం చేసుకుంది. తెలుగులో మాత్రం, ఈ విస్తృతమైన ఉపయోగం కనిపించదు, భాష కేవలం కొన్ని పరిమిత సందర్భాలలోనే వికసించేలా ఉంది.

నిజానికి, కథలు చెప్పడం ప్రాథమికంగా ముఖ్యమైనది. 'కథలు' అనగానే సాహిత్యం మాత్రమే దానికి ఏకైక వారసురాలిగా మనం భావిస్తాం. కానీ, అన్ని కథలు 'అనగనగా' అని ప్రారంభం కావు. ఒక వ్యాసం (essay), ఒక గ్రాఫ్ (graph), పౌరహక్కులపై ఒక చర్చ (discourse on civic rights), లేదా ఒక తాత్విక విశ్లేషణ (philosophy expos)- ఇవన్నీ తమదైన పద్ధతిలో కథలనే చెబుతాయి. ఒక అకౌంటింగ్ లెడ్జర్ (accounting ledger) కూడా ఒక కథనే వివరిస్తుందిఒక సంస్థ ఆర్థిక ప్రయాణాన్ని, దాని లావాదేవీలను. ఇలాంటి విస్తృతమైన 'కథన' రూపాలను గుర్తించడం, వాటికి భాషలో అవకాశం కల్పించడం ద్వారానే భాషకు నిజమైన ప్రాణం పోయబడుతుంది. అది బయటి ప్రపంచాన్ని, దాని వేల గొంతుకలను, లక్షల ప్రయోజనాలను, కోట్ల కథలను ప్రతిబింబిస్తూ భాషను సజీవంగా ఉంచుతుంది.

సాహిత్యం భాషకు పూర్తిగా శత్రువు కాదు, కానీ దాని మృత్యు వంటి కౌగిలి భాషను ఊపిరాడకుండా చేస్తోంది, దాన్ని నిత్య జీవితానికి, ఆధునిక అవసరాలకు దూరం చేస్తోంది. తెలుగుభాషను ఈ బంధనం నుండి విముక్తి చేయాల్సిన సమయం ఆసన్నమైంది. దీన్ని ఒక కళాఖండంగా చూస్తూ మ్యూజియాల్లో భద్రపరచడం కాకుండా, జీవితంలో ప్రతి భాగంలోనూ సజీవంగా, క్రియాశీలంగా మార్చాలి. విద్యారంగంలో (academic), సాంస్కృతిక రంగంలో (cultural), పౌర చర్చల్లో (civic), వాణిజ్యరంగంలో (commercial discourse) అది ధారాళంగా ప్రవహించాలి. మేము సాఫ్ట్‌వేర్ రాసేటప్పుడు 'వాయిస్ ఆఫ్ ది కస్టమర్' అని వాళ్ల అభిప్రాయాలు, అవసరాలకు ప్రధానపీఠం వేస్తాం. తెలుగు భాషాభివృద్ధిపై జరిగే చర్చల్లో, మనం ప్రధానంగా తెలుగు ఉపాధ్యాయులు, రచయితలు, జర్నలిస్టులు, సినీరంగ ప్రముఖుల అభిప్రాయాలనే వింటున్నాం.

వీరు సాధారణంగా భాషను ఒక నిర్దిష్టకోణంలో చూస్తారు. అది సాహిత్య ప్రామాణికత కావచ్చు, లేదా వినోదరంగ అవసరాలు కావచ్చు. అయితే, వీరు నిష్పాక్షికమైన పక్షాలు కారు. వారికి తమ స్వార్థ ప్రయోజనాలు, ఉదాహరణకు తమ రచనలకు ఆదరణ, లేదా తమ వృత్తికి గౌరవం ఉంటాయి. భాషను తమ దైనందిన కార్యకలాపాలకు, ఎన్నో వేల విభిన్న అవసరాలకు వినియోగించుకునే ప్రజల నిజమైన ప్రయోజనాలను, భావవ్యక్తీకరణ స్వేచ్ఛను వీరు తరచుగా పక్కన పెడుతున్నారు.

భవిష్యత్తు సరిహద్దు: భాషా వికాసానికి AI ఎలా సహాయపడుతుంది?

సాంకేతికత్ఐప్పుడు కృత్రిమ మేధస్సు (AI)- భాషను రూపొందించే కొత్త శక్తిగా మారింది. సంప్రదాయానికి ముప్పుగా AIని భయపడకుండా, తెలుగు వికాసానికి ఇది ఒక సాధనంగా చూడాలి.

AI ఇప్పటికే ఒక విషయం ఇస్తే వ్యాసం రాయగలదు, రెండు పేరాగ్రాఫ్‌లు ఇస్తే రెండు పేజీలు రాయగలదు, ఒక వీడియో ఇస్తే చూసి క్లుప్తంగా నాలుగు వాక్యాల్లో చెప్పగలదు. ఇది భాషను వ్యాప్తి చేయగలదు, ప్రజాస్వామ్యీకరించగలదు. సోషల్ మీడియా ఎంతో మంది కొత్త రచయితలను ఎలా సృష్టించిందో, అలాగే AI కూడా తెలుగు వ్యక్తీకరణను విస్తృతంగా వ్యాప్తి చేయడానికి సహాయపడుతుంది. ఇది అధికారాన్ని తిరిగి దాని స్వంత స్థానానికి తీసుకువస్తుంది: ప్రజల చేతుల్లోకి. దీనివల్ల మనం భాషా 'పవిత్రత' గురించి ఆందోళన చెందకుండా, గొప్ప కథలను సృష్టించడంపై, వైవిధ్యాన్ని, సూక్ష్మతను పెంచడంపై దృష్టి సారించవచ్చు.

అన్నిటికంటే, ఆశాజనకమైన విషయం ఏమిటంటే, అనువాదాలు అద్భుతంగా చేయగలగడం! ప్రస్తుతం AI సాంకేతికతతో అనువాదాలు చాలా అద్భుతంగా పనిచేస్తున్నాయి. అంటే, తెలుగులో వ్రాసిన లేదా మాట్లాడిన విషయాలను ఇంగ్లీష్ శ్రోతలకు, లేదా ఇంగ్లీషులో ఉన్నవాటిని తెలుగు శ్రోతలకు సులభంగా అందించవచ్చు. దీని ప్రభావాలు చాలా విస్తృతమైనవి. ఉదాహరణకు, మీరు తెలుగులో మాట్లాడితే అది జర్మన్లకు వారి మాతృ భాషలో అర్థం కావడం, వారు జర్మన్‌లో మాట్లాడితే అది మీకు తెలుగులో అర్థం కావడం. ఇది ఇప్పుడు సాధ్యమే. ఇది భాషా సరిహద్దులను తొలగించి, ప్రపంచవ్యాప్త కమ్యూనికేషన్‌కు కొత్త మార్గాలను తెరుస్తుంది.

ఇక్కడ ఒక ఆసక్తికరమైన అంశం: AI అనువాదాల నాణ్యత కొలవడానికి BLEU (Bilingual Evaluation Understudy) అనే మెట్రిక్ ప్రపంచ ప్రామాణికం. మన RTS ట్రాన్స్‌లిటరేషన్ స్టాండర్డ్ నాతో సహసృష్టికర్త అయిన పాపినేని ఆనంద కిషోరే ఈ మెట్రిక్ సృష్టించడం కావటం మనకి గర్వకారణం.

అయితే, AI వల్ల ఇక్కడ ఒక పెద్ద ప్రమాదం పొంచి ఉంది. మనం ఇంతకుముందు చర్చించినట్లుగా, AI అనేది ఇప్పటికే స్థాపించబడిన భాషా నమూనాల ఆధారంగానే రచనలను సృష్టించగలదు. ఎక్కువమంది ప్రజలు AI పై ఆధారపడినప్పుడు, సృజనాత్మకమైన, మౌలికమైన రచనలు తక్కువగా వెలువడతాయి. తత్ఫలితంగా, భాష తనను తాను నింపుకోవడానికి, కొత్తగా పరిణామం చెందడానికి చాలా నెమ్మదిగా కదులుతుంది. ఇది కంప్యూటర్ ప్రోగ్రామింగ్ రంగంలో ఇప్పటికే జరుగుతోంది. కొత్త ప్రోగ్రామింగ్ భాషలు లేదా ఫ్రేమ్‌వర్క్‌లు అంత వేగంగా రావడం లేదు. అక్కడ, కంప్యూటర్ ప్రోగ్రామర్లు తమ సృజనాత్మకత కోసం ఉన్నతస్థాయి (higher level)కి కదులుతున్నారు. మరి భాష కంటే సృజనాత్మకత దేనిలో ఉంది?

ఆ విధంగా, AI భాషను స్తబ్దుగా (ossify) చేస్తుందా? ఇది శాస్త్రవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తల మధ్య జరుగుతున్న ఒక తీవ్రమైన చర్చ. మనం చెప్పగలిగేది ఒక్కటే: ఈ సమస్య తెలుగు వారికి మాత్రమే ప్రత్యేకమైనది కాదు, ప్రపంచవ్యాప్తంగా అన్ని భాషలకు ఇది వర్తిస్తుంది. అందుకనే, తెలుగుకి మాత్రమే ఉండే ప్రమాదం ఏమీలేదు.

ముగింపు: తెలుగును బ్రతికించండి, బ్రతకనీయండి!

తెలుగు, ప్రతి గొప్ప భాషలాగే మారాలి; లేకపోతే అసంబద్ధంగా మారే ప్రమాదం ఉంది. దాన్ని సాహిత్యం, స్వచ్ఛతల గోడల్లో బంధించవద్దు. దాన్ని అన్ని రంగాల్లోనూ వాడుకోవడానికి ప్రోత్సాహం ఇస్తూ, అందరినీ ఆహ్వానిద్దాం. పదాలు, భావాలు అరువు తెచ్చుకోవడానికి, ఒక ఒరవడి ఆవిష్కరించడానికి ప్రోత్సహిద్దాం. ప్రపంచ అనుభవాలను మన స్వంతం చేసుకుందాం.

ఒక భాషకు నిజమైన మరణం పదాలు కోల్పోవడం కాదు, అది సూక్ష్మతను గ్రహించే, భేదాలను చూపించే, కొత్త తరాల్ని నిర్వచించే కొత్త కథలను చెప్పే శక్తిని కోల్పోయినప్పుడు. ప్రజలకు చెప్పడానికి కథలు ఉన్నంత కాలం, వాటిని వ్యక్తీకరించడానికి స్వేచ్ఛ ఉన్నంత కాలం తెలుగులో, ఇంగ్లీషులో, లేదా రెండింటిలోనూ మన సంస్కృతి నిలబడుతుంది.

చివరిగా, తెలుగును ఒక సజీవసాధనంగా చేద్దాం, ఒక అవశేషంగా కాదు. ప్రతి కొత్త పదాన్ని, ప్రతి అరువు తెచ్చుకున్న ఆలోచనను, ప్రతి డిజిటల్ సృష్టిని భాష బతికిందనడానికి నిదర్శనంగా జరుపుకుందాం. జ్ఞాపకాలలో మాత్రమేకాదు, ఆచరణలోనూ. ప్రజలు భాషను నడిపించడానికి అనుమతించినప్పుడు, టెక్నాలజీని మిత్రునిగా ఉపయోగించుకున్నప్పుడు, తెలుగు రాబోయే తరాలకు శక్తివంతంగా, అనుకూలంగా, వాస్తవంగా ఉంటుంది.



కన్నెగంటి రామారావు గుంటూరు జిల్లా సాపాడు గ్రామంలో పుట్టారు. ఐఐటీ మద్రాసులో కంప్యూటర్ సైన్స్ చేస్తున్న రోజుల నుంచీ తెలుగుని కంప్యూటర్లలోకి తేవడం మీద కృషి చేస్తున్నారు. 1988 లో ఆనంద కిశోర్‌తో కలిసి తెలుగుని ఇంగ్లీష్ లిపిలో రాయడానికి RTS అనే విధానం కనిపెట్టి ప్రాచుర్యంలోకి తెచ్చారు. ప్రస్తుతం డిట్రాయిట్, హైదరాబాద్‌ల మధ్యన గడుపుతూ ఉంటారు.

కృత్రిమ మేధాయుగంలో రేపటి తెలుగు

డా. కె. గీతామూర్తి

గత దశాబ్దిగా స్మార్ట్ ఫోనులు కమ్యూనికేషను రంగంలో సృష్టించిన అలజడి అంతా ఇంతా కాదు. దానితోబాటే ఫేసుబుక్కు, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్ ఫారాలు పుట్టుకొచ్చి మనుషుల మధ్య కమ్యూనికేషనుని రికార్డు స్థాయికి తీసుకెళ్లాయి.

టెక్నాలజీ అత్యధికశాతం మందికి అందుబాటులోకి రావడం వల్ల ప్రాంతీయ భాషలకు గిరాకీ ఏర్పడింది. మనిషికీ మనిషికీ మధ్య సంభాషణలో మాటకి బదులు రాత (టెక్స్ట్) కి ప్రాధాన్యత పుట్టుకురావడం వల్ల, ఇప్పటి కాలానికి తప్పనిసరి మొదటి తక్షణ అవసరం సులభ సాధ్యమైన కీబోర్డు లేదా టైపింగు సాధనం అయింది. మరో అడుగు ముందుకేసి వాయిస్ అసిస్టెంట్ (దీనిని "మాటమర" అని అంటున్నాను నేను) తో పనులు సాధించగలిగే టెక్నాలజీ తక్షణ అవసరంగా ఆవిష్కరించ బడింది.

తెలుగు సాంకేతిక చరిత్రని సూక్ష్మంగా చూస్తే, యూనీకోడ్ తెలుగులో ఈ-మెయిళ్లకి, వెబ్‌సైట్ల నిర్మాణానికి, చర్చావేదికలకు, ఆన్ లైన్ డిక్షనరీల నిర్మాణానికి సరికొత్త ద్వారాలను తెరిచింది. దానితో పాటు తెలుగు బ్లాగులు, పత్రికలు, తెలుగు వికీపీడియా వంటి వాటికి మార్గం సుగమమయ్యింది. ఒకప్పుడు తెలుగు టైపు చేయడానికి, యూనికోడ్ లో రాయడానికే కాక, నాన్-యూనికోడ్ ఫాంట్లనుండి భారతీయ భాషల వెబ్ సైట్లను, ఫాంట్లను యూనికోడ్ లోకి తర్జుమా చేసే సాధనంగా పద్మ సాఫ్ట్‌వేర్ బాగా ఉపయోగపడింది. ఇక "లేఖిని" వంటి సాధనాలతో ఆన్ లైన్ లో తెలుగు రాయడం సులభతరమయ్యింది. తర్వాత వచ్చిన "గూగుల్ ఇన్ పుట్ టూల్స్" తెలుగు వంటి అనేక భాషల్లో యూనికోడ్ టైపు సమస్యల్ని దాదాపుగా పరిష్కరించింది. మొబైల్ తో బాటూ అన్ని డివైజుల్లో తెలుగు టైపుకు ఇన్ స్క్రిప్ట్ కీ-బోర్డులకు బదులుగా ఫొనెటిక్ కీ-బోర్డులు వచ్చి సులభమార్గం పరిచేయి. ఇప్పుడు తెలుగులో రాయడం మాత్రమే కాదు, తెలుగులో సమాచార ప్రసారానికి స్పోటిఫై, ఐట్యూన్స్ వంటి ఆడియో, యూట్యూబ్, ఇన్స్టా వంటి వీడియో అనేక సాధనాలు, యాప్ లు ఉన్నాయి.

ఆన్లైన్ లో తెలుగు చర్చావేదికలతో ప్రారంభమయ్యి, బ్లాగులుగా విస్తరించి, సైట్లుగా రూపొంది, మీడియా, సోషల్ మీడియాగా విస్తృతి చెంది, మొబైల్ ఫోన్లలో దినదినాభివృద్ధి చెందుతూ ఉంది.

ప్రపంచవ్యాప్తంగా టెక్ దిగ్గజాలైన గూగుల్, యాపిల్, అమెజాన్, మైక్రో సాఫ్ట్ వంటివి

తెలుగుభాష వైపు మొగ్గుచూపడానికి రోజురోజుకీ అధికమవుతున్న తెలుగు వాడుకరుల సంఖ్యే ముఖ్యకారణం.

ఇవేళ రైల్వే రిజర్వేషన్లు, విమానాల రాకపోకలు, బ్యాంకులు, కార్లు, కర్మాగారాలు, శస్త్ర చికిత్సలు ఒక్కటేవిటి కంప్యూటర్లు లేనిదే ఆధునిక సమాజం లేదు.

ప్రపంచ వ్యాప్తంగా నానాటికీ మారుతున్న సాంకేతిక అవసరాలకు సరిపడా భాషలని సాంకేతీకరించుకోవలసిన అవసరం ఉంది. ప్రపంచ భాషల్లో కంప్యూటర్‌పరంగా గొప్ప వృద్ధిని సాధించిన భాషల దిక్కుగా తెలుగుభాష గత దశాబ్దికాలంగా వేగంగా ప్రయాణం సాగించడం చెప్పుకోదగిన విషయం.

ప్రపంచంలోని ఇతర భాషలతో పోలిస్తే తెలుగుభాష సాంకేతికీకరణ (Computerization)లో వెనుకంజలో ఉన్నా సోషల్ మీడియా, స్మార్ట్ ఫోన్ల పుణ్యమా అని తెలుగులో కమ్యూనికేషను అందరికీ అవసరమైంది. ఈ నేపథ్యంలో తెలుగు భాషా సాంకేతికీకరణ రోజురోజుకీ ముందంజ వేస్తుంది.



నానాటికీ విస్తరిస్తున్న కృత్రిమ మేధస్సువల్ల ఆరోగ్యం, విద్యా, వ్యాపార, కమ్యూనికేషన్ మొదలైన రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు కలుగుతున్నాయి.

ఈ దశాబ్దిలో వర్చ్యువల్ అసిస్టెంట్లు ప్రాధాన్యతని సంత రించుకున్న నేపథ్యంలో తెలుగుభాషకి సంబంధించిన సాంకేతిక అభివృద్ధి కోసం కృషి ఇతోధికంగా జరుగుతూ వస్తూ ఉంది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు) అనేది విస్తృత మైన అంశం. గత రెండు దశాబ్దాలుగా ఈ కృత్రిమ మేధస్సు అనే అంశాన్ని గురించి ఎక్కువగా వింటూ వస్తున్నాం. కృత్రిమ మేధస్సుతో గృహోపకరణాలు, కార్లు వంటివి నడపడం, మనుషుల మేధస్సును అనుకరించి ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం మాత్రమే కాక, మానవమేధస్సుతో చేయగలిగిన అన్ని పనులని యంత్రాలు చేయగలగడంవైపు పరిశోధన, కృషి జరుగుతూ ఉంది. అంటే కృత్రిమమేధస్సు మనిషి మెదడులా అభ్యసించడం, తర్కించి చూడడం, సమస్యలను పరిష్కరించడం, ఇంకాస్త ముందుకు వెళ్లి కృత్రిమమేధస్సుతోనే కృత్రిమమేధస్సుని నడిపించడం అనేవి లక్ష్యాలుగా కొనసాగుతూ వస్తున్నాయి.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్- కంప్యూటర్ సైన్స్, డేటా ఎనలటిక్స్, స్టాటిస్టిక్స్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, లింగ్విస్టిక్స్, న్యూరోసైన్స్, ఫిలాసఫీ, సైకాలజీ... ఇలా అనేక రంగాలని ప్రభావితం చేస్తూ ఉంది. ఈ దశాబ్దిలో వేగవంతమైన పురోగతి సాధించడం వలన, భారీ మొత్తంలో డేటా నిల్వ చేయడం, ప్రాసెస్ చేయగల సామర్థ్యంవల్ల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పుడు దైనందిన అనుభవాల్లో ఒక భాగంగా మారింది. స్మార్ట్‌ఫోన్లు, హోమ్‌డివైస్‌లు, ఆటో డ్రైవింగ్ ఫీచర్లు, చాట్ బాట్లు మొదలైనవన్నీ ఇందుకు ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో విస్తృత విభాగమైన జనరేటివ్ ఏఐ అనేది గత మూణ్ణాలుగేళ్లుగా ఎక్కువగా వింటున్న మాట. జనరేటివ్ ఏఐ ద్వారా టెక్స్ట్‌లు, ఇమేజులు, వీడియోలు, సంగీతం వంటి విస్తృతమైన అంశాల్ని ప్రాసెస్ చేయడం, పునరుత్పత్తి చేయడం మొదలైనవెన్నో సులభసాధ్యమవుతున్నాయి.

ఇందులో భాగంగా డీప్ లెర్నింగ్ అనేది అనేక రంగాల్లో విస్తృతంగా ఉపయోగించబడే శక్తివంతమైన సాంకేతికత. ఇందుకు సంబంధించిన ముఖ్యమైన అనువర్తనాలలో ఇమేజ్ రికగ్నైజేషన్, నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, టెక్స్ట్ టు ఇమేజ్ మొదలైనవి ఉదా హరణలుగా చెప్పుకోవచ్చు.

నేచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్‌కి సంబంధించిన టెక్నాలజీల చరిత్ర గురించి సూక్ష్మంగా చెప్పాలంటే, 1960-2000దాకా ప్రాచుర్యంలో ఉన్న రూల్ బేస్డ్ సిస్టమ్స్ గురించి మొదటగా చెప్పు కోవాలి. ఇవ్వబడిన వ్యాకరణ నియమాలు, నమూనాల ద్వారా రూపొందించిన వ్యవస్థ ఇది. పూర్తిగా ప్రశ్నలు, సమాధానాల వంటి పరిమిత డేటాపై ఇవి ఆధారపడి ఉండేవి. భాషలోని సంక్లిష్టతలని, సందర్భాలని ఈ మోడల్ గుర్తించలేకపోయేది. 1990 నుంచి 2010 వరకు వచ్చిన గణంకాధారిత ఎన్ఎల్పి పద్ధతుల్లో అ-gram మోడల్స్, Hidden Markov Models (HMMs), భాషాభాగాల టాగింగ్ (Part-of-speech tagging), వాక్య నిర్మాణ విశ్లేషణ (syntax parsing) ముఖ్యమైనవి. మొదటి గూగుల్ ట్రాన్స్‌లేట్, స్పీచ్ రికగ్నిషన్, స్పామ్ ఫిల్టర్లు ఇందుకు ఉదాహరణలు. ఈ మోడల్ పెద్ద పెద్ద వాక్యాలు, వాటి అంతరార్థాల్ని అర్థం చేసుకోవడంలో విఫలమైంది. 20132017ల మధ్య వచ్చిన వర్డ్ ఎంబెడ్డింగ్స్ (Word Embeddings) పదాలను మల్టీడైమెన్షనల్ వెక్టర్లుగా మార్చి వాటి అర్థాన్ని తెలుసుకునే ప్రయత్నం చెయ్యగా, తరువాత వచ్చిన Recurrent Neural Networks (RNNs), Long Short-Term Memory (LSTM) వంటి సీక్వెన్స్ మోడల్స్ పదాల వరుసను (sequence) గుర్తించి అర్థం చేసుకోగలిగేవి. ఇవి మెషిన్ ట్రాన్స్‌లేషన్, స్పీచ్-టు-టెక్స్ట్, టెక్స్ట్ జనరేషన్ మొదలైన వాటికి ఉపయోగపడేవి. తరువాత 2017లో వచ్చిన ట్రాన్స్‌ఫార్మర్స్ (Transformers) ఒక విప్లవమనే చెప్పాలి. 2017లో ప్రచురితమై, అత్యంత ప్రాచుర్యం పొందిన 'Attention is All You Need' అనే గూగుల్ మేధావులు, పరిశోధకుల పత్రం ద్వారా ట్రాన్స్‌ఫార్మర్స్ (Transformers) యుగం ప్రారంభ మైంది. దీని ద్వారా Self-attention అనే సాంకేతికతతో, ఇది ఒకే సమయంలో పదాల మధ్య సంబంధాలను అర్థం చేసుకుంటుంది. ఇంతకు ముందు ఉన్న RNNలకు ఉన్న పరిమితులను అధిగమించి GPT, BERT, T5 వంటి లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (LLMs)కు ఇదే పునాది అయ్యింది.

లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ ప్రత్యేకంగా టెక్స్ట్‌కి సంబంధించినవి. ఇవి విస్తారమైన టెక్స్ట్ డేటాతో శిక్షణ పొంది, మానవుల్లా భాషను అర్థం చేసుకొని, కొత్త సంభాషణల్ని రూపొందించగలిగేలా రూప కల్పన చేయబడ్డాయి. వీటి సాయంతో కోడ్‌ని రూపొందించడం, అనువాదాలు చేయడంలాంటి ఇతర పనుల్ని కూడా చేయవచ్చు.

సగటు మనిషి మెదడు సుమారు 2.5 మిలియన్ గిగాబైట్లు డిజిటల్ మెమరీ సామర్థ్యాన్ని నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగి ఉంటుంది. అయితే లార్జ్ లాంగ్వేజీ మోడల్స్ (LLM)కి ఒక పెటా బైట్‌కి మించి అత్యధికమైన డేటాని ఇవ్వవలసి ఉంటుంది. అంటే దాదాపుగా ఒక గిగా బైట్‌లో దాదాపుగా 180 మిలియన్ పదాలు ఉంటే, ఒక పెటా బైట్‌లో మిలియన్ గిగాబైట్లు ఉంటాయి. అంటే మొత్తం 180,000 బిలియన్లు లేదా 180 ట్రిలియన్ల పదాలని మించిన డేటా అన్నమాట. ఇంత పెద్ద మొత్తంలో డేటాపై శిక్షణ (Unsupervised Learning) పొందడంవల్ల లార్జ్ లాంగ్వేజీ మోడల్స్ సమర్థవంతంగా పనిచేస్తాయి.

ఈ ఎల్.ఎల్.ఎమ్.లు డీప్ లెర్నింగ్‌ని ఉపయోగించి విషయాల్ని అర్థం చేసుకుంటాయి. అంతేకాకుండా విషయాల్ని సంక్షిప్తీకరించడం, సృష్టించడం వంటి పనులను కూడా నిర్వ హిస్తాయి.

లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ ఆడియో ట్రాన్స్క్రిప్షన్, కంటెంట్ ఎడిటింగ్, కంటెంట్ జనరేషన్, కంటెంట్ సమ్మరైజేషన్, సెంటిమెంట్ అనాలసిస్ మొదలైనవి సులభంగా జరగడానికి ఉపయోగపడుతున్నాయి.

ఆడియో ట్రాన్స్క్రిప్షన్ అంటే వెబినర్లు లేదా కస్టమర్ సర్వీసుల కాల్స్ అన్నింటిని ట్రాన్స్క్రిప్ట్ తయారుచేయడం అన్న మాట. కంటెంట్ ఎడిటింగ్ అంటే ఉన్న కంటెంట్ని సమీక్షించడం, లేదా వాక్యనిర్మాణాలను మెరుగుపరచడం, సూచనలు ఇవ్వడం మొదలైన వాటి ద్వారా నాణ్యతను పెంచడం. కంటెంట్ జనరేషన్ అంటే, లక్ష్యాల్ని వివరిస్తూ సూచనలు అందజేస్తే కావలసిన కంటెంట్ని తయారుచేసి ఇవ్వడం అన్నమాట. అంటే మనం కష్టపడి ఆలోచించి, స్వయంగా టైపు చేయాల్సిన అవసరం లేకుండా అప్పటికప్పుడు ఈమెయిలు సంభాషణలు వంటివి వెంటనే పంపించడానికి కంటెంట్ జనరేషన్ ఉపయోగపడుతుంది. ఇక కంటెంట్ సమ్మరైజేషన్ అంటే విస్తృతమైన కంటెంట్ నుంచి ముఖ్యాంశాల్ని, సారాంశాల్ని, ప్రధానమైన విషయాల్ని తేలిగ్గా తయారుచేయడం. అందువల్ల పరిశోధనారంగంలో విస్తృతమైన అంశాల్ని సులభంగా అర్థం చేసుకోవడానికి వీలుపడుతుంది. ఇక కస్టమర్ రంగంలో కస్టమర్ల అవసరాలు అర్థం చేసుకుని, స్పందించడానికి వీలుగా భావోద్వేగ విశ్లేషణ అంటే సెంటిమెంట్ అనాలసిస్ అవసరం. అంటే అందజేసిన ఆర్టికల్స్, సోషల్ మీడియా పోస్టులు, కస్టమర్ రివ్యూలు, మొదలైనవన్నీ అప్పటికప్పుడు విశ్లేషణచేసి అందులో ఉన్న పాజిటివ్, న్యూట్రల్, లేదా నెగిటివ్ భావోద్వేగాలని విశ్లేషించడానికి ఉపయోగపడుతుంది. దానివల్ల ప్రాధాన్యతాంశాల్ని సులభంగా గుర్తించడానికి వీలవుతుంది. చాట్ బాట్లు ప్రత్యేకంగా కస్టమర్ సర్వీస్ రంగంలో ఉపయోగపడుతున్నాయి. సాధారణమైన ప్రశ్నలకు ఆటోమేటిగ్గా సమాధానాలు ఇవ్వడం ద్వారా కస్టమర్ సపోర్ట్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చాయి.

లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్లకు తోడ్పడుతూ వాటిని మెరుగుపరుస్తాయి. ఇక ఇటీవల కాలంలో ప్రాచుర్యం పొందిన చాట్ జీపీటీ, జెమినీ, లామావంటి సమాచార సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతుండడంవల్ల దక్షిణ ఆసియా భాషల్లో హిందీ, బెంగాలీ, తెలుగు, తమిళం వంటి అత్యధిక ప్రాముఖ్యత కలిగిన భాషలు అనేకం ప్రాముఖ్యత సంతరించుకోసాగాయి.

మన తెలుగు భాష, దక్షిణ భారతదేశంలో విస్తృతంగా మాట్లాడే భాషలలో ఒకటి మాత్రమే కాక, భారతదేశంలో నాల్గవ స్థానాన్ని పొందింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 8 కోట్లకు పైగా ప్రజలు తెలుగుభాషను మాట్లాడతారు. అమెరికాలో వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న దక్షిణ ఆసియాభాషల్లో తెలుగు అగ్ర స్థానంలో ఉంది.

తెలుగువంటి భాషల్లో ఎల్.ఎల్.ఎమ్ లు త్వరితగతిన అభివృద్ధి చెందాల్సి ఉంది.

ఎల్.ఎల్.ఎమ్లకు శిక్షణను ఇవ్వడానికి అవసరమైన ముఖ్యమైన దశలు ఏవిటంటే:

1. లక్ష్యాన్ని గుర్తించడం/ఉద్దేశాన్ని నిర్వచించడం: ఎల్.ఎల్.ఎమ్కు ఇవ్వబడిన లక్ష్యం ఆధారంగా ఎటువంటి డేటా వనరులను ఉపయోగించాలో నిర్ణయించాల్సి ఉంటుంది. LLMకు శిక్షణ ఇవ్వడం, ఫైన్-ట్యూన్ చేయడాల్ని బట్టి ఆ లక్ష్యం, వినియోగ సందర్భం కూడా మారవచ్చు.

2. పూర్వ శిక్షణ (ప్రీ ట్రైనింగ్): ఎల్.ఎల్.ఎమ్కు శిక్షణనివ్వడానికి విస్తృతమైన, విభిన్నమైన డేటా అవసరం. ఈ డేటాను సేకరించి శుభ్రపరచడం, ప్రామాణీకరించడం వంటివి చేయాలి.

3. టోకనైజేషన్: తీసుకున్న డేటాసెట్లోని టెక్స్ట్ను చిన్న యూనిట్లుగా విభజించాలి. దీనిద్వారా ఎల్.ఎల్.ఎమ్ పదాల్ని, పదాంశాలను అర్థం చేసుకోగలదు. టోకనైజేషన్ వల్ల డాక్యుమెంట్లు, పేరాగ్రాఫులు, వాక్యాలు మొదలైనవి చిన్న ముక్కలుగా విడగొట్టబడి, ఎల్.ఎల్.ఎమ్ కు విషయ సంగ్రహణ సులభమవుతుంది. ఈ ప్రక్రియద్వారా ట్రాన్స్ఫార్మర్ టెక్నాలజీలో న్యూరల్ నెట్వర్క్ను రూపొందించగలిగే వీలు కలుగుతుంది. అంతేకాకుండా సందర్భానుసార డేటాని రూపొందించగలిగే అవకాశం కలుగుతుంది.

4. ఇన్ఫ్రాస్ట్రక్చర్: ఎల్.ఎల్.ఎమ్ శిక్షణ కోసం శక్తివంతమైన కంప్యూటర్ లేదా క్లౌడ్-ఆధారిత సర్వర్ మొ.న గణనీయమైన కంప్యూటింగ్ వనరులు అవసరం. ఈ రకమైన వనరులు ఎంతో ఖర్చుతో కూడుకున్నవి. ఇందువల్ల స్వయంగా స్వంత ఎల్.ఎల్.ఎమ్ లను అభివృద్ధి చేయడం చాలా కష్టమైన పని.

5. శిక్షణ: శిక్షణా ప్రక్రియ కోసం బ్యాచ్ సైజు లేదా లెర్నింగ్ రేట్ వంటి పారామీటర్లను నిర్ణయించాలి.

6. ఫైన్-ట్యూనింగ్: శిక్షణ అనేది పునరావృతంగా జరిగే ప్రక్రియ. డేటాను మోడల్కు అందించడం, దాని అవుట్పుట్ను అంచనావేయడం, తర్వాత ఫలితాలను మెరుగుపరిచేలా పారామీటర్లను సర్దుబాటు చేయడం మళ్లీ మోడల్కు అందించడం ఇలా ఎన్నోమార్లు చెయ్యవలసి ఉంటుంది.

7. రీ ఎన్ఫోర్స్మెంట్ లెర్నింగ్: రీ-ఎన్ఫోర్స్మెంట్ లెర్నింగ్ అనేది లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ ను మెరుగుపరచడానికి ఉపయోగించే ఒక శక్తివంతమైన శిక్షణావిధానం. ఇది మానవసమీక్ష, ఎంపికల్ని ఉపయోగించి మోడల్ను మెరుగుపరచే ప్రక్రియ. ఇచ్చిన ఎంపికల్నిబట్టి మోడల్ ఏయే సమాధానాలకు ప్రాధాన్యతనివ్వాలో నేర్చుకుంటుంది.

8. మానవ వనరులు: వీటన్నిటితోపాటు శిక్షణ పొందిన ఇంజనీర్లు, భాషాశాస్త్రజ్ఞులు వంటివారు అధిక సంఖ్యలో అవసరమవుతారు.



ఇటీవలి కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో తెలుగు అభివృద్ధి

1. **భారత ప్రభుత్వం ప్రారంభించిన బహుభాషాభియాసం:** 'భాషిణి'వంటి ప్లాట్‌ఫారమ్‌లు భారతదేశంలోని భాషల్ని డిజిటలైజ్ చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. ఇందులో తెలుగు కీలకభాషగా ఉంది.

2. **AI మోడల్స్ & డేటాసెట్‌లు:** AI మోడల్స్‌కి అవసరమైన శిక్షణ కోసం తెలుగు భాషా డేటాసెట్‌లు (పత్రికలు, పాఠ్యాంశాలు, డైలాగ్‌లు మొదలైనవి) సేకరించబడుతున్నాయి. IndicBERT, AI4Bharat వంటి మల్టీ లింగ్వల్ మోడల్స్ తెలుగు డేటాపై కూడా శిక్షణ పొందాయి.

3. **మెషిన్ ట్రాన్స్‌లేషన్:** ఇతర భాషల నుండే కాకుండా, తెలుగు నుండి ఇంగ్లీష్, హిందీ వంటి భాషలకు అనువాదాలు చేసే మెషిన్ లెర్నింగ్ టూల్స్ అభివృద్ధి చెందుతున్నాయి. గూగుల్ ట్రాన్స్‌లేట్, మైక్రోసాఫ్ట్ ట్రాన్స్‌లేటర్ వంటి ప్లాట్‌ఫారమ్‌లు తెలుగు అనువాదాలను మెరుగుపరుస్తున్నాయి.

4. **వర్చువల్ అసిస్టెంట్‌లు**

వాయిస్ అసిస్టెంట్‌లు: Siri, Google Assistant, Alexa వంటి ప్లాట్‌ఫారమ్‌లు ఇప్పుడు తెలుగుభాషపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నాయి.

చాట్‌బాట్‌లు: బ్యాంకింగ్, ఈ-కామర్స్, హెల్త్‌కేర్, కస్టమర్ సపోర్ట్ వంటి రంగాలలో తెలుగు ఆధారిత చాట్‌బాట్‌లు వినియోగంలోకి వస్తున్నాయి.

వర్చువల్ లెర్నింగ్: తెలుగు మాధ్యమంలో విద్యారంగానికి సంబంధించిన కంటెంట్‌ని రూపొందించేందుకు AI ఆధారిత ప్లాట్‌ఫారమ్‌లు ముందుకొస్తున్నాయి.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం తెలుగు అభివృద్ధిలో ఎదురవుతున్న సవాళ్లు

డేటా కొరత: తెలుగులో ప్రామాణికమైన, శుద్ధమైన డేటా కొరత చాలా ఉంది.

మాండలికాలు: భాషలో ఉన్న ప్రాంతీయ మాండలికాలు మోడల్స్‌ను మరింత కష్టతరం చేస్తున్నాయి.

సాంకేతిక మద్దతు లేమి: చాలావరకు AI డెవలప్‌మెంట్ టూల్స్ తెలుగువంటి భాషలకు పూర్తిగా మద్దతునివ్వలేక పోతున్నాయి.

లక్షణ గ్రంథాల లేమి: సాంకేతిక అవసరాలకి సరిపోయే నిఘంటువులు, పర్యాయపద కోశాలు, శైలీ లక్షణ గ్రంథాలు, ఆధునిక వ్యాకరణాల కొరతవల్ల తెలుగు భాషా నియమావళులు రూపొందించడం కష్టతరం అవుతుంది.

భవిష్యత్ కార్యాచరణలు

స్థానిక భాగస్వామ్యాలు: విద్యాసంస్థలు, పరిశోధనా కేంద్రాలు, ప్రభుత్వాలు కలసి పనిచేయడం ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో తెలుగుభాషను త్వరితగతిన ముందుకు తీసుకువెళ్లవచ్చు.

డేటాసెట్‌ల లభ్యత: తెలుగుభాషలో ఎక్కువ డేటాని రూపొందించి, ఉచితంగా అందుబాటులో ఉంచడం అవసరం.

మల్టీ లింగ్వల్ మోడల్స్ అభివృద్ధి: GPT, BERT వంటి మోడల్స్‌ను తెలుగు సహా ఇతర భాషలతో కూడిన మల్టీ లింగ్వల్ మోడల్స్‌గా అభివృద్ధి చేయాలి.

తెలుగు AI ఉపకరణాల తయారీ: తెలుగు AI ఉపకరణాల తయారీ పెరగాలి. ప్రధాన సంస్థలు అందులో భాగస్వామ్యం కావాలి. ఉదాహరణకి స్మార్ట్ ఫోన్లలో తెలుగు టైపుకి ఎన్ని అనువర్తనాలు (యాపులు) ఉన్నా, ప్రధానంగా ఉపకరణాల తయారీదారులు అందించే కీబోర్డులే ఎక్కువమంది వాడతారు. అందుకు ఆయా యాపుల పనితనం, రుసుము, నిర్మాణ శైలి (యూజర్ ఇంటర్‌స్పేస్) మొదలైనవి కారణాలు కాగా, డివైసుల్లోని అంతర్గతంగా వచ్చే లాంగ్వేజ్ సెట్టింగ్స్ ద్వారా కీబోర్డులు వాడడం సులభతరం కావడం ప్రధాన కారణం. ఆయా సంస్థలు తెలుగు వైపు దృష్టి సారిస్తేనే తెలుగు అభివృద్ధికి అత్యధికంగా అవకాశం కలుగుతుంది. గూగుల్‌వంటి సంస్థలు తెలుగుభాష వంటి వాటిని పట్టించుకోవడం వల్లనే ఇవేళ మనం గూగుల్ ఇన్‌పుట్ టూల్స్, ట్రాన్స్‌లేట్, వాయిస్ టైపింగ్ వంటి అనేక కంప్యూటర్ ఉపకరణాలని తెలుగులో పొందగలుగుతున్నాం.

అమిత వేగంగా వృద్ధి చెందుతున్న టెక్నాలజీలలో ఇవేళ తెలుగు సులభంగా ఇమడడం వెనుక మన తెలుగు ఆచార్యులు, భాషా శాస్త్రవేత్తలు, పరిశోధకులెందరో కృషి ఎంతో దాగి ఉంది. తెలుగులో భాషాశాస్త్రపరంగాను, వ్యాకరణపరంగాను విశ్వవిద్యాలయ స్థాయిలో కృషి చేసిన ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారి 'ఎ గ్రామర్ ఆఫ్ మోడర్న్ తెలుగు' (A Grammar of Modern Telugu), 'ద్రవిడియన్ లాంగ్వేజెస్', 'తెలుగు వెర్బల్ బేసెస్', 'ఎ షార్ట్ ఔట్లైన్ ఆఫ్ తెలుగు ఫొనెటిక్స్', 'తెలుగు భాషాచరిత్ర' ఆచార్య చేకూరి రామారావు 'తెలుగు వాక్యం', ఆచార్య బూదరాజు రాధాకృష్ణగారి 'వ్యావహారిక భాషావికాసం', ఆచార్య పి.ఎస్. సుబ్రమణ్యంగారి 'ద్రావిడ భాషలు', ఆచార్య తూమాటి దొణప్ప గారి 'భాషా చారిత్రక వ్యాసావళి', ఆచార్య అయినవోలు ఉషాదేవి Acquisition of Telugu syntax, ధ్వన్యనుకరణ పదకోశం, Issues on Lexicography, డా॥ కె. గీతామాధవి 'కంప్యూటర్ భాషగా తెలుగు' వ్యాసాలు మొదలైవి ఎన్నదగినవి. ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావుగారు తెలుగు పద విశ్లేషిణి (Morphological Analyzer), వాక్యాలను విశ్లేషణ (Parser) చేసే ఉపకరణాల నిర్మాణం, ఒక భాష నుంచి మరో భాషకు అనువాదం చేసే

యంత్రానువాద వ్యవస్థలనూ (Machine Translation Systems), కంప్యూటర్లో రాస్తున్నప్పుడు తప్పు ఒప్పుల్ని దిద్దుకోనే 'దిద్దరి' అనే ఉపకరణం, పదనిష్పాదన చేసే ఉపకరణం (Morphological Generator), సాంఖ్యిక పదనిధి (digital corpora) వంటి ఎన్నో ఉపకరణాలను తెలుగూ తదితర భారతీయ భాషలకు తయారు చేశారు. ఇటువంటివి రూపొందించి భాషా శాస్త్రపరంగానేకాక, టెక్నాలజీపరంగా కూడా కంప్యూటరు రంగంలో తెలుగు భాషా వికాసానికి బాటలు వేశారు. భాషా పరిశోధకులు అక్షయ్ అయిత, 'లేఖిని' రూపకర్త వీవెన్, రైస్ ట్రాన్స్‌లిటరేషన్ స్టాండర్డ్ (RTS- Rice Transliteration Standard) అనే పేరుతో తెలుగుని ఆంగ్ల అక్షరాలతో వ్రాసే ప్రక్రియని సృష్టించిన ఆనంద్ కిశోర్, రామారావు కన్నెగంటిగార్లు, మొదటి తెలుగు వైబ్‌సైట్లు, సాఫ్ట్‌వేర్లు, ఫాంట్లు తయారుచేసిన కొలిచాల సురేశ్, వెన్న నాగార్జున, పద్మ ఇంద్రగంటి, రమణ జువ్వాడి, దేశికాచారి, చోడవరపు ప్రసాద్, శ్రీనివాస్ సిరిగిన, కిరణ్‌కుమార్ చావాగార్లు, మొదటి తెలుగు వెబ్ చర్చావేదికని ప్రారంభించిన కుమార్ అంపని, మధుసూదన్ ఓరుగంటిగార్ల వంటి ఎందరో భాషాశాస్త్ర పరిశోధనలు, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైదరాబాద్ మొదలైన విశ్వవిద్యాలయ విద్యార్థుల పరిశోధనాపత్రాలు ఈనాటి కృత్రిమ మేధస్సు రంగంలో తెలుగుభాషకు ఉన్నత స్థానాన్ని కల్పిస్తున్నాయి.

శబ్దరత్నాకరము, బ్రౌణ్య తెలుగు-ఇంగ్లీష్ నిఘంటువు, శంకరనారాయణ తెలుగు-ఇంగ్లీష్ నిఘంటువు, సూర్యరాయాంధ్ర నిఘంటువు, ఆంధ్రశబ్దరత్నాకరము, శ్రీహరి నిఘంటువు, తెలుగు పర్యాయపద నిఘంటువు వంటి అనేక ముద్రిత నిఘంటువుల సమాహారంగా వాడపల్లి శేషతల్పసాయి, కాలెపు నాగభూషణరావు సారధ్యంలో 'ఆంధ్రభారతి' ఆన్‌లైన్ నిఘంటువు రూపుదిద్దుకుని, నానాటికీ విస్తరిస్తూ, ఎంతో ఉపయుక్తంగా ఉంది. ఆచార్య వేమూరి వేంకటేశ్వర్రావుగారు రూపొందించిన 'వేమూరి నిఘంటువు', ఆచార్య వెల్చేరు నారాయణరావు 'తెలుగుదారి' ఆధునిక అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దుకున్నాయి.

తెలుగు భాషలో చాట్‌బాట్స్, వాయిస్ అసిస్టెంట్స్ నిర్మాణం, అభివృద్ధి వేగవంతంగా జరుగుతూ ఉన్న ఇప్పటికాలంలో భాషని కంప్యూటీకరించడం కోసం కాలంతో బాటూ మారుతూన్న భాషకి, భాషా స్వరూపానికి అనుగుణంగా ఆధునిక అవసరాలకి సరిపోయే నిఘంటువులు, పర్యాయపద కోశాలు, శైలీ లక్షణ గ్రంథాలు, ఆధునిక వ్యాకరణాలు తప్పనిసరిగా రూపుదిద్దుకోవాలి.

తెలుగుభాషను కృత్రిమ మేధస్సు రంగంలో భాగస్వామిని చేయడం ఒక సాంకేతిక, సాంస్కృతిక అవసరంగా మనందరం గుర్తించాలి. తెలుగుభాషలో డిజిటల్ పరిజ్ఞానాన్ని ఇతోధికంగా పెంచడం ద్వారా ప్రజలకు మరింత టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావచ్చు.



డా. కె. గీతమాధవి తూర్పుగోదావరి జిల్లాలో జన్మించారు. రచయిత్రి, గాయని, భాషా నిపుణులు. తెలుగునేలపై కొంతకాలం టీచర్‌గా పనిచేసి, అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో కంప్యుటేషన్ లింగ్విస్ట్‌గా పనిచేస్తున్నారు. కథ, కవిత, వ్యాసాలతో డజనుకు పైగా పుస్తకాలు ప్రచురించారు. అమెరికాలోని తానా నిర్వహించే తెలుగుబడి 'పాఠశాల'కు దశాబ్దికాలంగా కర్రిక్యులమ్ డైరెక్టర్‌గా సేవలు అందిస్తున్నారు. రచయితల సాహితీవేదిక వీక్షణం సమావేశాలను కాలిఫోర్నియాలో నెలనెలా నిర్వహిస్తున్నారు.

సాహిత్యము-సాహితీవేత్తలు - తొలి దశాబ్దాల తెలుగు టాకీలు

కిరణ్‌ప్రభ

సాహిత్యము, చలనచిత్రాలు- ఇవి చాలా ఆసక్తికరమైన అంశాలు.

తెలుగు టాకీలు ప్రారంభమైన 90 సంవత్సరాల తర్వాత 'సినిమా సాహిత్యం' అని, 'సినిమాయేతర సాహిత్యం' అని ఒక విభజనరేఖ కనిపిస్తోంది. కానీ తెలుగు టాకీలు మొదలైన 1930 దశాబ్దం ప్రారంభంలో ఈ విభజన రేఖ లేదని చెప్పుకోవాలి. తెలుగు సినిమా, అంటే టాకీ, ప్రారంభమయ్యే సమయానికి కొన్ని వందల ఏళ్ల క్రిందటి నుంచే తెలుగు సాహిత్యం ఉంది. పురాణ ఇతిహాసాలు, కావ్యాలు... వీటి ముందు తెలుగు సినిమా వయస్సు చాలా చాలా తక్కువ. మరీ ప్రాచీన సాహిత్యం కాకపోయినా కనీసం వీరేశలింగం గారి కాలం నుంచి చూసుకున్నా, 1930 దశాబ్దం ప్రారంభానికి తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు ప్రాచుర్యంలో ఉన్నాయి. కథలు, నవలలు, భావకవిత్వం, స్వాతంత్రోద్యమకవిత్వం ఇలా... వీటన్నింటికంటే ఆ కాలపు ప్రేక్షకుల్లో విపరీతంగా మమేక మైంది 'నాటక సాహిత్యం.' ఎందుకంటే మిగతా ప్రక్రియలు అర్థం చేసుకోవ డానికి అక్షరాస్యత అవసరం. కానీ నాటకాలు ఆస్వాదించ డానికి అక్షరజ్ఞానం అవసరం లేదు. అవి ప్రదర్శన ప్రక్రియ కావడంతో పాఠకుల కంటే ఎక్కువగా ప్రేక్షకుల్లో ప్రాచుర్యం పొందాయి.

సహజంగానే తొలిరోజుల్లోని తెలుగు టాకీలు ఆ కాలపు రంగస్థల నాటకాల్లో నుంచి రూపుదిద్దుకున్నాయి. అందువల్ల 'తెలుగు సినిమా సాహిత్యానికి పునాది తెలుగు నాటక సాహిత్యం' అని నిస్సందేహంగా చెప్పవచ్చు. కథ, మాటలు, పద్యాలుఇవి ఆ కాలపు నాటకంలోని కొన్ని ప్రధాన అంశాలు. 1930లకి నాటకాల్లో పద్యాలతోపాటు పాటలు కూడా వాడుకలోకి వచ్చాయి. అందువల్ల తెలుగు సినిమా తొలిరోజుల్లో చాలావరకు నాటకాల్లోని కథ, మాటలు, పద్యాలు, పాటలు ఆయా సినిమాల మాతృకలైన నాటకాల్లో నుంచి తీసుకున్నవి. నెమ్మది నెమ్మదిగా సినిమా దర్శకులు తమ సృజనాత్మకతకు పదునుపెట్టి, ప్రేక్షకుల అభిరుచిని దృష్టిలో ఉంచుకుని, మూల నాటకంలో లేని సంభాషణలు, అందులో లేని పాటలు, పద్యాలు సినిమాల కోసం ప్రత్యేకంగా రాయించుకోవడంతో సినిమా సాహిత్యం తనకంటూ ఒక సొంత పంథా రూపొందించుకోవడం ప్రారంభమైంది. మూల నాటకాల హక్కులు దొరకనప్పుడు ఇలాంటి సినిమా స్వంత రచనలు తప్పనిసరి అయ్యాయి. ఇంకా, క్రమక్రమంగా సినిమాలు రంగస్థల నాటకాలపై ఆధారపడడం తగ్గినకొద్దీ, సినిమా కథ, పాటలు, మాటలు. ఇవే 'సంపూర్ణ సినిమా సాహిత్యం'గా గుర్తింపు తెచ్చు కున్నాయి.

అసలు, ఈ సినిమా కథలు, మాటలు, పాటలు నిజంగా సాహిత్యమేనా? సాహిత్యానికి ఉన్న నిర్వచనాలు, ప్రమాణాల చట్రంలో ఇవి ఒదుగుతాయా అన్న చర్చకు వెళ్లడం లేదు. అక్కడ కూడా రచయితలు ఉంటున్నారు, వాళ్ల సృజనాత్మకతకు పూనకం తీసుకుని అక్షరయజ్ఞం చేస్తున్నారు అని కోణంలోనే వాటిని 'సినిమా సాహిత్యం' అందాం.

ఈ ఉపోద్ఘాతంతో, 1932లో విడుదలైన తొలి పూర్తిస్థాయి తెలుగు టాకీ భక్త ప్రహ్లాద నుంచి మొదలుపెట్టి 1949 చివరిదాకా వచ్చిన తెలుగు సినిమాలకు పనిచేసిన సాహితీవేత్తలు, కొన్ని సినిమాల్లో చోటు చేసుకున్న ఆ కాలపు కొన్ని సాహిత్యాంశాలను తెలుసుకుందాం.

మొట్టమొదటి టాకీ భక్త ప్రహ్లాదకే ధర్మవరం రామకృష్ణమా చార్యులుగారు రాసిన రంగస్థల నాటకం ఆధారం. ఈ రామ కృష్ణమాచార్యులుగారు రంగస్థల నాటకాల్లో ప్రవేశపెట్టిన కొత్త



ధర్మవరం రామకృష్ణమాచార్యులు


చందాల కేశవదాసు


బలిజేపల్లి లక్ష్మీకాంత కవి

ప్రక్రియ ఏమిటంటే నాటక రచయితలు కాకుండా వేరేవాళ్లు ఆ నాటకాల్లో పాటలు రాయడం. అట్లా ధర్మవరంవారి నాటకాల్లో కేవలం కొన్ని పాటలు మాత్రమే రాసిన రచయిత చందాల కేశవదాసుగారు. భక్త ప్రహ్లాదలో మూలనాటకంలోని పాటలతోపాటు చందాల కేశవదాసుగారు రాసిన పాటలు కూడా ఉన్నాయి. ఆ పాటలు, పద్యాలు ఆయన సినిమాకోసం ప్రత్యేకంగా రాశారా, లేక అంతకుముందే నాటకానికి రాస్తే, వాటిని సినిమాల్లో వాడుకున్నారా అన్నది స్పష్టంగా తెలియదు; రెండు వాదనలు ప్రచారంలో ఉన్నాయి. ఈ వివాదాన్ని పక్కన పెడితే, తొలి తెలుగు టాకీ సినిమా సాహిత్యపు రూపురేఖలకు కారణం ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు, చందాల కేశవదాసుగారు. అయితే భక్త ప్రహ్లాద విడుదల సమయానికి ధర్మవరంవారు జీవించలేరు. భక్త ప్రహ్లాద తర్వాత కూడా వరుసగా పౌరాణిక చిత్రాలే వచ్చాయి. కొన్ని సంవత్సరాల పాటు వచ్చిన ఏడు ఎనిమిది సినిమాల వరకు మాటల రచయితల విషయాన్ని ప్రత్యేకంగా పేర్కొనలేదు. బహుశా నాటకాల్లోని సంభాషణలకు దర్శకులు మార్పులు, చేర్పులు చేసుకుని ఉండొచ్చు, లేదా రచయితల పేర్లు ఎక్కడా నమోదు కాలేకపోవచ్చు.

భక్త ప్రహ్లాదలోని పాటల రచయిత చందాల కేశవదాసుగారు సినిమాల్లోకి రాకముందే సుప్రసిద్ధ కవి. శతకాలు, పద్య కావ్యాలు, రెండు నాటకాలు, సాహిత్య విశ్లేషణ వ్యాసాలు కూడా రాశారు. ఇతరులు రాసిన నాటకాలకు పాటలు రాసారు. అందువల్ల, తెలుగు సినిమాల్లో తొలి సాహిత్యవేత్తగా కూడా చందాల కేశవదాసుగారిని పరిగణించవచ్చు. ఆ తర్వాత ఆయన సతీ సక్కుబాయి, సతీ అనసూయ సినిమాల కోసం ప్రత్యేకంగా పాటలు రాశారు. అలాగే చందాల కేశవదాసుగారు రాసిన కనకతార నాటకం సినిమాగా రూపుదిద్దుకున్నప్పుడు, ఆ నాటకంలోని పాటలనుంచి కొన్నింటిని కనకతార సినిమాలో యథాతథంగా వాడుకున్నారు.

మరో ప్రసిద్ధ కవి-రచయిత చిలకమర్తి లక్ష్మీ నరసింహంగారు 1935లో సతీ సక్కుబాయిలో కొన్ని పాటలు రాశారు. ఈ విధంగా ఆ కాలపు తెలుగు సాహితీవేత్తలు సినిమాకి రాయడం అనివార్యం అయ్యింది, చాలా సంవత్సరాలు ప్రత్యేక రచయితలు రూపుదిద్దుకునే వరకూ.

అట్లా దీర్ఘకాలం సినిమాల్లో కొనసాగిన సాహితీవేత్తలలో ఒకరు బలిజేపల్లి లక్ష్మీకాంత కవిగారు 1935లో హరిశ్చంద్ర చిత్రానికి రచన చేయడానికి, పన్నెండేళ్ల క్రితం నుంచే సుప్రసిద్ధ నాటక రచయిత, కవి, నవల రచయిత. 1935కి సత్య హరిశ్చంద్ర నాటకాలు ప్రజల్లో చాలా ప్రాచుర్యంలో ఉన్నాయి. చాలామంది రాశారు, కానీ బలిజేపల్లివారు రాసిన 'సత్య హరిశ్చంద్రీయము' నాటకమే ప్రేక్షకుల్లో ఎక్కువ ప్రాచుర్యం పొందింది. అందుకనే 1935లో హరిశ్చంద్ర చిత్రానికి ఆయన నాటకాన్ని ప్రామాణికంగా తీసుకుని, సినిమా ప్రచార ప్రకటనల్లో బలిజేపల్లి లక్ష్మీకాంతకవిగారి పేరు ప్రముఖంగా ప్రస్తావించారు.

ఇతర సాహితీవేత్తలకు బలిజేపల్లివారికి ఉన్న వ్యత్యాసం ఏమిటంటే ఈయన రచనతోపాటు సినిమాల్లో నటించారు కూడా. 1935 నుంచి ఆయన చనిపోయే 1953దాకా సినిమారంగంలో కొనసాగారు. ఆ 18 సంవత్సరాల్లో అనేక పౌరాణిక, జానపద, సామాజిక చిత్రాలకు కథ, మాటలు, పాటలు సమకూర్చారు. ఆ దశాబ్దాల్లో ఇద్దరే 'స్టార్ రైటర్స్': బలిజేపల్లి లక్ష్మీకాంత కవిగారు, తాపీ ధర్మారావుగారు. తాపీ ధర్మారావు 1938లో విడుదలైన మాలపిల్ల సినిమా ద్వారా సినీరంగ ప్రవేశం చేశారు. అప్పటికే రచయితగా, పత్రికా సంపాదకుడిగా సుప్రసిద్ధులు. మాలపిల్ల తర్వాత కొన్ని దశాబ్దాలు తెలుగు సినిమాల్లో కొనసాగారు. ఆయన కూడా పౌరాణిక, సాంఘిక, జానపద చిత్రాలకు కథ, మాటలు, పాటలు రాశారు. కొన్ని సినిమాల్లో కేవలం పాటలు మాత్రమే

రాశారు. సినిమాల్లో కొనసాగుతూ, ఇతర సాహిత్య వ్యాసాంగాన్ని కొనసాగించారు. బలిజేపల్లివారైతే సినిమాల్లోకి వచ్చాక ఇతర సాహిత్యాన్ని కొనసాగించిన దాఖలాలు లేవు.

మాలపిల్ల ప్రసక్తి వచ్చింది కాబట్టి, సాహిత్యం, సినిమాల కోణంలో ఈ సినిమా గురించి మరికొన్ని విశేషాలు చెప్పుకుందాం. ఈ సినిమాకి కథ రాసిన ప్రముఖ రచయిత సంచలనాల చలం. ఈ సినిమా కోసం రాసిన కథ మాలపిల్ల అనే విషయాన్ని ఆయనే స్వయంగా తమ మ్యూజింగ్స్‌లో రాశారు. సినిమా టైటిల్‌లో కథా, మాటలు గుడిపాటి వెంకటచలం అని ఉంటుంది. మాలపిల్ల తరువాత చలంగారు చేసిన రెండు ప్రయత్నాలు విఫలమయ్యాయి.



గుడిపాటి వెంకటచలం

1948లో మహాత్మాగాంధీ చనిపోయిన తర్వాత ఫిబ్రవరిలో రాజమండ్రి నుంచి కొంతమంది యువకులు టి.వై. ప్రసాద్ ఆధ్వర్యంలో 'ఈస్టర్న్ ఆర్ట్ ప్రొడక్షన్స్' పేరుతో సినిమా కంపెనీ ప్రారంభించారు. వారు తీయబోయే గాంధీనగర్ సినిమాకి మాటలు చలంగారు, పాటలు శ్రీశ్రీగారు రాస్తారని నాలుగైదు నెలలు ప్రకటనలు ఇచ్చారు, కానీ సినిమా ప్రారంభమే కాలేదు. 1948లో ఇది జరిగింది, అప్పటికీ శ్రీశ్రీగారు ఇంకా సినీరంగ ప్రవేశం చేయలేదు.

దీని తర్వాత, చలంగారికి 1951లో మరో అవకాశం వచ్చింది. 'శాంతా ప్రొడక్షన్స్'వారు అరుణాచలం వద్ద ఉన్న చలంగారిని మద్రాసుకి పిలిపించారు. వారి సినిమా పేరు అనార్కలి. చలం గారు మాటలు రాస్తే, పాటలు దేవులపల్లి రచిస్తారని వారు చెప్పారు. ఇది పూర్తయి ఉంటే, తెలుగులో ఇద్దరు సుప్రసిద్ధ సాహితీవేత్తలు, బాల్యమిత్రులు (దేవులపల్లి, శ్రీశ్రీ) కలిసిన చిత్రం అయ్యేది. కానీ చలంగారు కొద్దివారాలు మాత్రమే మద్రాసులో ఉండి, 'నాకు ఈ వాతావరణం సరిపడదు,' అని అరుణాచలం వెళ్లిపోయారు. ఆ తర్వాత అనార్కలి సినిమా ముందుకు సాగలేదు.

ఇంకా మాలపిల్ల సినిమాకు తెలుగు సాహిత్యంతో ఉన్న సంబంధం ఏమిటంటే ఆ సినిమాలో బసవరాజు అప్పారావుగారు రాసిన భావగీతాలను చేర్చారు. అప్పటికి బసవరాజు అప్పారావు గారు చనిపోయి ఐదేళ్లు అయింది, బహుశా ఆయన భావగీతాల హక్కులు కొనుగోలు చేసి గూడవల్లి రామబ్రహ్మంగారు మాలపిల్లలో ఉపయోగించారు. తర్వాత ఆయన దర్శకత్వంలో తీసిన మరికొన్ని చిత్రాల్లో కూడా బసవరాజు అప్పారావుగారి భావ గీతాలు వాడుకున్నారు.

మాలపిల్ల చిత్రానికి కర్త, కర్మ, క్రియ అయిన గూడవల్లి రామ బ్రహ్మంగారు ఒక సాహితీవేత్త. ఈ సినిమా కంటే ముందే ఆయన పత్రికా సంపాదకుడు, నాటక రచయిత కూడా. ఈ విధంగా ఆ కాలపు తెలుగు సాహిత్యంలోని అనేకమంది ప్రముఖులను సినిమా లకు పరిచయం చేసింది మాలపిల్ల చిత్రం.

దీని తర్వాత రామబ్రహ్మంగారు తీసిన రైతుబిడ్డ చిత్రం కూడా మరికొంతమంది తెలుగు సాహితీ ప్రముఖులను వెండి తెరకు పరిచయం చేసింది. వారిలో ఒకరు కొసరాజు రాఘవయ్య చౌదరిగారు. ఆయన అప్పటికే పద్యాలు, గేయాలు, ద్విపద కావ్యాలు రచించిన కవిగా పేరు తెచ్చుకున్న వ్యక్తి. రైతుబిడ్డ సినిమాలో పాటల రచయితగా పరిచయ మయ్యారు. దీని తర్వాత 1941లో విడుదలైన అపవాదులో కూడా కొన్ని పాటలు రాసిన కొసరాజుగారు ఓ పదేళ్ల విరామం తర్వాత 1950ల నుంచీ సినీగేయ రచయితగా కొనసాగారు.

రైతుబిడ్డ సినిమా ద్వారా పరిచయమైన మరో సాహితీవేత్త, ప్రముఖ నవల, కథా రచయిత త్రిపురనేని గోపీచంద్‌గారు ఈ సినిమాకి సహ సంభాషణ రచయితగా పరిచయమయ్యారు. తరువాతి దశాబ్దాల్లో సినిమాలకు రచనలు చేయడమే కాకుండా సినిమా దర్శకుడిగా కూడా ఎదిగారు.

గూడవల్లి రామబ్రహ్మంగారి ద్వారా పత్రికారంగంలో పని చేయడానికి మద్రాసు చేరుకున్న మరో పండితుడు సముద్రాల రాఘవాచార్యులుగారు. ఆయన 1937లో విడుదలైన కనకతార సినిమాలో పాటలు, మాటలు రచయితగా పరిచయమయ్యారు. సముద్రాలగారు సినిమాల్లోకి రాకముందే దాదాపు దశాబ్దంపాటు అవధానాలు చేశారు, తెలుగు పండితుడుగా పనిచేశారు. గూడవల్లి రామబ్రహ్మంగారి సహచర్యంతో పాత్రికేయుడిగా పనిచేశారు. ఆయన రాసిన ఏ ప్రక్రియా పుస్తకరూపంలో వెలువడలేదు. కానీ సినిమాల్లోకి వచ్చేసరికి సముద్రాలగారిని 'పండితులు'గా గౌరవిస్తూ ఉండేవారు. దాదాపు 30 సంవత్సరాలు చిత్రసీమలోనే కొనసాగారు. సముద్రాల రాఘవాచార్యగారు చాలా సినిమాలకు కథ, మాటలు, పాటలు రాయడంతోపాటు కొన్ని సినిమాలకు దర్శకత్వం కూడా వహించారు.

తెలుగు సినిమామీద తెలుగు సాహిత్య ప్రభావంకి మరో ఉదాహరణ కాళ్లకూరి నారాయణరావుగారు రాసిన చింతామణి నాటకం. కాళ్లకూరి నారాయణరావుగారు తెలుగు టాకీలకు ముందే సుప్రసిద్ధ నాటక రచయిత. ఆయన రాసిన చింతామణి నాటకానికి వాళ్లబ్బాయి కాళ్లకూరి సదాశివరావుగారు 1933లో వెండితెర రూపమిచ్చారు.. కాళ్లకూరివారు రాసిన మరొక ప్రసిద్ధ నాటకం వర విక్రయం కూడా తరువాతి సంవత్సరాల్లో సినిమాగా రూపుద్దు కుంది. అయితే ఈ సినిమాలు వచ్చే సమయానికి కాళ్లకూరి వారు జీవించలేరు.

ఇంకా, తెలుగు టాకీల తొలిరోజుల్లోనే సినీరంగానికి పరిచయమైన మరో సాహితీయ ప్రముఖుడు కవికోకిల దువ్వూరి రామిరెడ్డిగారు. 1936లో విడుదలైన సతీ తులసి చిత్రానికి మాటలు, పాటల రచయితగా పరిచయమయ్యారు. దువ్వూరి రామిరెడ్డిగారు ఆ తర్వాత కూడా కొన్ని సినిమాలకు రచయితగా కొనసాగారు, ఒక సినిమాకి దర్శకత్వం కూడా వహించారు.

తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నండూరి సుబ్బారావుగారి 'ఎంకి పాటలు' అందరికీ తెలుసు. వేరే ఒక పాట, 'ఈరేయా నన్నొల్ల నేరవ రాజా' అనే పాట 1944లో తాసీల్దార్ సినిమాలో ఉపయోగించారు.

తెలుగులో నవలాధారిత తొలి చిత్రం బారిస్టర్ పార్వతీశం. మొక్కపాటి నరసింహశాస్త్రిగారి నవలను తీసుకుని ఈ సినిమాకి రూపం ఇచ్చారు, కానీ ఆయన ఈ సినిమాకి రచన చెయ్యలేదు.

1940ల్లో సినిమారంగానికి పరిచయమైన మరో సాహితీవేత్త పింగళి నాగేంద్రరావుగారు. సినిమాల్లోకి రాకముందే రంగస్థల నాటక రచయితగా సుప్రసిద్ధులు. 1941లో భలే పెళ్లి చిత్రానికి పాటలు, మాటలు రాయడం ద్వారా పరిచయమయ్యారు, కానీ వెంటనే నిలదొక్కుకోలేకపోయారు. 1948లో ఆయన *వింధ్యరాణి* నాటకం సినిమాగా రూపుదిద్దుకున్నప్పుడు కథారచయితగా పని చేశారు. ఇది కూడా గొప్ప గుర్తింపు తెచ్చుకోలేకపోయింది. మూడో ప్రయత్నంగా ఆయన రాసిన *గుణసుందరి కథ* ఘనవిజయం సాధించడంతో తెలుగు చలనచిత్ర పరిశ్రమలో పింగళివారి శకం ప్రారంభమైంది.

మరొక ఇద్దరు సాహితీప్రముఖుల ప్రస్తావనతో ఈ ప్రసంగాన్ని ముగిస్తాను. వాళ్లలో ఒకరు శ్రీ శ్రీగారు. తొలి చిత్రం ఆహుతి (డబ్బింగ్) 1950లో విడుదలైనప్పటికీ, శ్రీశ్రీగారి 'మహా ప్రస్థానం' సిగ్నేచర్ కవిత 'మరో ప్రపంచం మరో ప్రపంచం' 1940లో కాలచక్రం సినిమాలో కొద్దిమార్పులతో ఉపయోగించారు.

మరొక సాహితీ ప్రముఖుడు విశ్వనాథ సత్యనారాయణగారు. ఈయన రచన చేసిన ఏకైక చిత్రం ఆకాశరాజు 1951లో విడుదల అయింది. ఆ సంవత్సరమే జంధ్యాల గౌరీనాథశాస్త్రిగారి గీతాంజలి సినిమా కోసం రివేర్ స్క్రిప్ట్ రాశారు, కానీ అది ముందుకు వెళ్లలేదు.

ఇదంతా తొలి దశాబ్దాల్లోని తెలుగు టాకీలపై తెలుగు సాహితీవేత్తల ప్రభావం.

1932 నుంచి 1949 చివరిదాకా సుమారు 130 సినిమాలు విడుదలయ్యాయి. మనకున్న కాలపరిమితి దృష్ట్యా, వాటిలో కొన్నింటిని మాత్రమే, కొంతమంది సాహితీ ప్రముఖులను మాత్రమే, కొన్ని పుస్తకాలను మాత్రమే, కొన్ని పాటలను మాత్రమే ఉదహరించగలిగాను.

తెలుగు టాకీలు మొదలైనప్పటి నుంచి విడుదలైన ప్రతి సినిమాలోని సంక్షిప్త సమాచారం ప్రతిరోజూ ఒక YouTube షార్ట్ ద్వారా అందిస్తున్నాను. ఇది గత 250 రోజులు పైగా నడుస్తోంది. ఆసక్తికల ప్రేక్షకులు, పాఠకులు, శ్రోతలు వాటిని అనుసరించగలరు.



కిరణ్‌ప్రభ కవి, కథకుడు. పాత్రికేయులు, సంపాదకులు, టాక్ షో నిర్వాహకులు. నిరంతర అన్వేషి, 2004లో సృజనరంజని అనే వెబ్ పత్రిక స్వీయ సంపాదకత్వంలో మొదలెట్టి రెండేళ్లపాటు నడిపారు. 2007లో కౌముది వెబ్ మాసపత్రిక ప్రారంభించి నిర్విఘ్నంగా నడుపుతున్నారు. కాలిఫోర్నియాలో నివాసం.

కవిత్వం ఎందుకు?

కాసు

"The poetry of a people takes its life from the people's speech and in turn gives life to it; and represents its highest point of consciousness, its greatest power and its most delicate sensibility."

T.S. Eliot - "The Use of Poetry and The Use of Criticism"

భారతీయ సంప్రదాయం సాహిత్యాన్ని - తొలినాళ్లలో సాహిత్య మంటే కవిత్వమనే - ఆలోచనామృతమని అన్నా, కవిత్వమంటే ఇదీ అని అందరికీ ఆమోదయోగ్యమైన ఒక నిర్వచనమే లేదు మనకివాళ. అయితేనేం, ఈ లేమి కవిత్వాన్ని ఏ విధంగానూ బాధించలేదు. మానవాళి కనుగొన్నదేదైనా మానవాళికి ఉపయోగ పడేదే. కవిత్వం చెప్పడం, రాయడం ఆదిమసమాజాల్లో మొదలు కొని ఇవాళ్టిదాకా అనుభవాన్ని నెమరువేసుకోవడం, అనుభూతిని పంచుకోవడం శబ్దార్థాల మేలుకలయికతో 'ఆత్మకింపయిన భోజనం' పెట్టడం ద్వారా పరితల ఆత్మను తృప్తిపరచడం కవిత్వం అంతిమ లక్ష్యంగా మిగిలిపోతుంది. కవిత్వం, ఇతర కళారూపాల వలె, ఆత్మా విష్కారానికి ఉపయోగపడే సాధనం. మానవుడిలో భాష ఎలాగైతే ఒక సహజాతమైన hardwired ప్రక్రియావిశేషమో అనుభవాలకు చలించి వాటిని నలుగురితో పంచుకోవడమూ ఎలాగైతే సహజమో, కవిత్వావిర్భావమూ అలాగే సహజాతమైనది. సామాజిక కళారూపం కనుక కవిత్వం పాఠకులను ఎంతో ప్రభావితం చేసే గుణాన్నీ కలిగి ఉంటుంది. మారుతున్న కాలంతోపాటు మారినదల్లా కవితను వ్యక్తీకరించే తీరు మాత్రమే- అలంకారాలూ, భాష వగైరాలు. కవిత్వంలో అర్థం మాత్రమే ప్రాధాన్యతను కలిగి ఉండదు, దానికి శబ్దపుష్టి కూడా ఉండాలి. కవిత సంగీతభరితంగా ఉంటే చదువరులకు మనసుకెక్కుతుంది. కాలక్రమేణా కవిత సహజంగా లయ కోసమై వివిధ ఛందోరూపాలను తొడిగి పరిపుష్టమయింది. ఇవాళ్టికీ తెలుగుగడ్డపై verse libreతోపాటుగా ఛందో బద్ధమైన కవిత్వమూ వస్తోంది. కవిత్వం ఎందుకనే ప్రశ్నకు సమాధానం వివరంగా తెలియాలంటే, కవిత్వం ఏం చేస్తోంది అన్న ప్రశ్నకు సమాధానాలు వెతుక్కోవాలి. ఆదిమగీతాల్లో మనిషికి తన సమూహమే శ్రోతృ వర్గం, దైవమే తోడు. ఆదిమజాతులు తమ కవితలో తమ తమ భూముల ఔన్నత్యాన్నీ తమ చరితలనూ తమకూ దైవానికీ, తమకూ ప్రకృతికీ మధ్య గల సంబంధాలను నిక్షేపించారు. సుమేరియన్ పురాణంలో కథానాయకుడు అమృతత్వ సాధనకై సాహసించినది మొదలు మానవుడు ఎన్నెన్ని అడ్డంకుల నైనా ఎదుర్కొని ప్రాణాలను సైతం పణంపెట్టి ఊర్ధ్వలోకాలలో నిర్జరమైన నిరామయమైన అనశ్వరమైన జీవనానికై తపించాడు. యుధిష్ఠిరుడు సశరీరసాయుజ్యం పొందడానికి పూర్వం ఎన్నో యుగాలు గడిచాయి. శారీరకమైన అమృతత్వం కుదరదని తెలుసుకున్న నాయకులు తమ రాజ్యాలను సుభిక్షంగా ఉంచదలిచి తమ పేరును నిలబెట్టుకోవాలని కోరుకునేవారు. సప్త సంతానాలను విడిచిపెట్టి దివంగతులయ్యేవారు. తొలినాటి నుంచీ కవిత్వం జీవితానికి అర్థాన్ని అన్వేషిస్తూ మనిషి అంతిమ లక్ష్యాన్ని నిర్వచించే ప్రయత్నమే చేస్తూ వస్తోంది. ఆదిమసమాజల్లో కవే తాత్త్వికుడు, గణప్రజకు మార్గదర్శి, గుంపుకు పెద్ద దిక్కు. కవిత్వం ఎప్పుడూ చెప్పే మాటను సున్నితంగా హృదయంగమంగా చెబుతుంది. దీన్ని కాంతాసమ్మితంగా చెప్పడం అంటారు. గాథాసప్తశతినే పరిశీలిస్తే

అందులో అప్పటి ప్రజల దైనందిన జీవనం, ప్రకృతి సౌందర్యాన్ని ఒడిసిపట్టుకోవడం, స్త్రీపురుషుల సంబంధాలు ఇలా మొత్తం జీవితాన్నే కాచి వడబోసిన తేట ఉంది. కవి స్రష్ట, ఋషి, ద్రష్టానూ. సంగీతం నేరుగా మనసును తాకి ఏవో మాంత్రికలోకాలకు తీసుకెళ్లి నిద్రపుచ్చినా, సంగీతం asocial art కనుక, అది కవిత్వం చెయ్య గలిగేలా మనసును మెత్తబరిచి మనిషిని మర్నాటికి మనుషుల మధ్య జీవితానికి సంసిద్ధం చెయ్యలేదు. శాస్త్రవిజ్ఞానం పురోగతి సాధించిన పిమ్మట కవి వైజ్ఞానికుడిగానూ, తాత్వికుడిగానూ మిగలక పోయినా, మానవసంబంధాలపైనా మనిషి పైనా తనకున్న కళా నైపుణ్యంతో వ్యాఖ్యానిస్తూ తన ప్రాసంగికతను నిలబెట్టు కున్నాడు.

కలలు కనడం, కలలను సాకారం చేసుకోవడం, నిరంతరా న్వేషణ, అందాన్నీ ఆనందాన్ని అవిష్కరించడం వంటివి మానవునికి సహజాతాలు (instincts). కవిత్వావిర్భావానికీ మనిషి అంతరంగమే మూలం. పక్కనే పారుతున్న నదీ, చెట్లకి పళ్లూ ఉన్నాయి చాలులే అని మానవుడు అల్పసంతోషియై ఊరుకుంటే మనమీనాడీ ఆధునికసమాజాన్ని సృష్టించుకునేవాళ్లం కాము. ఒక అధ్యయనం ప్రకారం లోకంలో ప్రతి వ్యక్తీ కవిత్వం రాస్తాడు, చాలామంది మొహమాటంవల్ల తమ కవిత్వాన్ని దగ్గరివారితో తప్ప ఇతరులతో పంచుకోరు, పత్రికల్లో అచ్చు వేసుకోరు. లోకంలో ప్రతి వ్యక్తీ కవే. మానవుని కల్పనాశక్తిని భాష పూర్తిగా గిరిగీసి నియంత్రిచలేదుగానీ చాలామటుకు ఏతత్కల్పనాశక్తిపై ప్రభావం చూపగలదు. ప్రఖ్యాత ఇంగ్లిష్ మహాకవి టి.ఎస్. ఇలియట్ చెప్పినట్లుగా కవిత్వం ఒక జాతి ప్రజల నుడి నుంచి తన జీవాన్ని గ్రహించి అదే భాషకు ప్రాణం పోస్తుంది. ఇంకా, భాష శిఖరస్థాయి చైతన్యాన్ని ప్రతిబింబిస్తూనే భాష అత్యుత్తమ శక్తినీ దాని సున్నితపు సంవేదశీలతనూ కలిగి ఉంటుంది.

ఇదేమిటి, ఇదెందుకు అనే ప్రశ్నలు ప్రాథమికమైనవి. ఇటు వంటి fundamental ప్రశ్నలకు సమాధానాలు fundamentalsలోనే వెతుక్కోవాలి. వ్యక్తి సృజనాత్మక శక్తినీ, జాతి భాషోన్నత్యాన్నీ పెంపొందించే రచనలు చెయ్యవచ్చని ప్రతి భాషాసమాజమూ ఒక సవాలు విసురుతుంది. తెలుగులో శ్రీశ్రీ తన కవిత్వం తన జాతి జనుల నాల్కలపై ఆడే నుడిగా నిలవాలని ఆశించి, రచించి, కృత కృత్యుడయ్యాడు. గొప్ప కవిత్వం వ్యక్తికే కాక సమష్టికీ ఒక గుర్తింపు నిస్తుంది. ప్రాచీన సమాజంలో సోఫోక్లీజ్, దాంతే, వ్యాసవాల్మీకులు, తిరువళ్లువర్, ఆధునిక యుగంలో రవీంద్రనాథ టాగోర్, శ్రీశ్రీ ఇటు వంటి మహోన్నతులే. కవిత్వం సమాజంలో పెనుమార్పులకూ తావు నిస్తుంది. ఆదిశంకరుల అద్వైతమత ప్రాచుర్యం వెనుక ఆయన రచించిన కవిత్వమూ ఉంది. తెలుగునాట శ్రీశ్రీ మహాప్రస్థానం మొదలుకొని వచ్చిన విప్లవ కవిత్వం, శ్రీశ్రీవల్ల ప్రభావితులైన రచయితల రచనలూ తదనంతర కాలంలో విప్లవ సిద్ధాంత ఆచరణకు నడుంకట్టిన ఎంతోమంది ఔత్సాహికులకు దోహదంగా నిలిచాయి.

ఆఖరిగా కవిత్వం ఎందుకూ అంటే చెప్పవలసినవి మూడే వాక్యాలు. జార్జ్ బెర్నార్డ్ షా "I write for the same reason a cow gives milk" అన్నాడు. రెండు కవిత్వం అన్ని నాగరికతల్లోనూ సహజంగా పుట్టి పెరిగి మారుతూ వస్తోంది కనుక. మూడోది, కవిత్వం ఆత్మావిష్కారమనే అతి ముఖ్యమైన మెట్టుగా నిర్వాణ సోపానంలో నిలిచిపోతుంది.



వాసు అనే కలంపేరుతో రాస్తున్న న్యాయపతి శ్రీనివాస్ ఒరిస్సాలోని బరంపురంలో పుట్టి, రాయగడలో ఇంటర్ వరకు చదువుకొని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బి.టెక్ కంప్యూటర్ సైన్స్ చేసారు. బెంగుళూరులో డిఆర్‌డివో, హోలెట్ పాకార్డ్, టిసిఎస్‌లలో ఉద్యోగాలు చేసారు. వీరి కవితలు వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి. 'కాసేపు' అనే కవితాసంపుటి వెలువరించారు. ప్రస్తుతం కవిత్వ సంపుటాల సమీక్షలు రాస్తున్నారు. నివాసం బెంగుళూరు.

సాహిత్యం నుంచి సినిమాలోకి శ్రీశ్రీ

ముద్దుకూరి విజయ చంద్రకోస్

1950వ సంవత్సరంలో తన నలభయ్యవయేట శ్రీశ్రీ జీవితంలో రెండు ముఖ్యమైన సంఘటనలు జరిగాయి.

ఒకటి- మహాప్రస్థానం తొలిసారి ముద్రించబడి తెలుగు సాహితీ లోకంలో భూకంపం పుట్టించడం, శ్రీశ్రీ కీర్తిని చిరస్థాయి చేయటం.

రెండు- సినిమాకోసం శ్రీశ్రీ రాసిన తొలి పాటలు ఆహుతి డబ్బింగ్ చిత్రంలో రావడం, శ్రీశ్రీ తన ఆర్థిక ఇబ్బందులను అధిగమించి సినీరంగంలో స్థిరపడటం.

నిజానికి అంతకుమునుపే ఒక కమ్యూనిస్టుపార్టీ ఎన్నికల సభలో మొదటిసారి చండ్ర రాజేశ్వరరావు శ్రీశ్రీని మహాకవి అని సంబోధించారు. మహాప్రస్థానం గ్రంథరూపంలో రావడానికి ముందే శ్రీశ్రీని కవిగా, అభ్యుదయ కవిగా, తుదకు మహాకవిగా ఆంధ్రదేశం గుర్తించింది.

శ్రీశ్రీ అంచలంచెలుగా తెలుగు కవితాలోకానికి ఒక యుగ కర్తగా ఎదిగిన కాలం, ఆయన చుట్టూ ఉన్న పరిస్థితులు, అదే సమయంలో తెలుగు సినిమారంగంలో వస్తున్న మార్పులు, ఇవన్నీ గమనిస్తే సాహిత్యలోకం నుంచి సినిమారంగంలోకి శ్రీశ్రీ ప్రయాణం ఎలా జరిగిందో ఎందువల్ల జరిగిందో అవగతమవు తుంది. ఆ విశేషాలు కొన్ని ఈ వ్యాసంలో తలచుకునే ప్రయత్నం చేద్దాం.

ఇప్పుడు మరో రెండు దశాబ్దాల వెనక్కి, అంటే 1930వ సంవత్సరానికి వెళదాం. అప్పుడు శ్రీశ్రీకి 20 ఏళ్ల వయసు. ఆ సంవత్సరమే మద్రాసులో డిగ్రీ పూర్తిచేసి విశాఖపట్నం తిరిగి వచ్చాడు శ్రీశ్రీ.

చిన్నతనంలో వారిది బాగా కలిగిన కుటుంబం. కానీ అప్పటికే కొన్నేళ్లుగా ఆస్తి కరిగిపోతూ ఉంది.

అంతకు రెండేళ్ల క్రితమే తండ్రి ధనసహాయంతో, పురిపండా ముందుమాటతో కవితాసమితి ప్రచురణగా తన ఖండకావ్య సంపుటి ప్రభవ (1928) అచ్చయింది. స్థానికంగా మంచి కవిగా, స్థానికేతరుల దృష్టిలో కూడా వర్ధమానకవిగా గుర్తింపు వచ్చింది. ప్రభవ పద్యాలు ఈరోజున మనం చదివితే ఎవరో పెద్ద పండితుడు, ప్రౌఢకవి వ్రాసినట్టు వుంటాయి. 16-17 ఏళ్లయితే శ్రీశ్రీ ఆ పద్యాలు వ్రాయగలిగాడు. కానీ ఆయనకు అది పూర్తిగా సంతృప్తి కలిగించ లేదు. విశ్వనాథ, కృష్ణశాస్త్రి ప్రభావం తన మీద బలంగా ఉందని తెలుసు. కవిగా తన సొంత గొంతుక వినిపించాలని తపించేవాడు.

అబ్బూరి రామకృష్ణారావుగారితో పరిచయం జరిగిన తర్వాత విశ్వసాహిత్యంతో కూడా అనురక్తి మరింత గాఢమయ్యింది. భారతీయ, పాశ్చాత్య ఛందస్సులలో ప్రయోగాలు చేసేవాడు. 'I am poet of strange sentiments and shuddering sensations' అని ఒకసారి వ్రాసుకున్నాడు. ఈ క్రమంలో 1929లో అభివ్యక్తిలో వస్తువులో నవ్యతను చూపిస్తూ సుప్తాస్థికలు వ్రాశాడు. ఈరోజు చదివినా చాలా కొత్తగా ఉండే అద్భుతమైన కవిత ఇది.

కళ కోసమే కళ అని నమ్మి, కవిత్వమే జీవితంగా బతుకుతూ, 1930లో విశాఖపట్నం చేరిన శ్రీశ్రీకి పూర్తిగా చితికిపోయిన ఇంటి ఆర్థికపరిస్థితి తెలిసి వచ్చింది. ఆ సంవత్సరమే 63 రోజులపాటు టైఫాయిడ్ జ్వరం బాధించి ఆయనను మృత్యుముఖం వరకు తీసుకువెళ్లింది. జ్వరంతో ఉండగానే వారి ఇల్లు అప్పులవాళ్లు వేలం వేశారు. ఇంకా పై చదువులు చదవాలన్న తన కోరికను చంపుకుని ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టాడు.

అమెరికాలో 1930వ దశాబ్దాన్ని హంగ్రీ థర్టీస్‌గా అభి వర్ణిస్తారు. స్టాక్ మార్కెట్ కూలిపోయిన తర్వాత మొదలైన గ్రేట్

డిప్రెషన్ (ఆర్థిక మాంద్యం) అప్పటికే బ్రిటిష్ పాలన కింద కుదేలైన భారతదేశం మీద కూడా తీవ్రమైన ప్రభావం చూపించింది. అదో భయంకరమైన దశాబ్దం అని శ్రీశ్రీ వ్రాసుకున్నాడు. ఈ కాలంలో ఎక్కడా స్థిరంగా ఉద్యోగం నిలవలేదు.

ఇన్ని కష్టాల మధ్య కూడా సాహితీపిపాస తగ్గలేదు సరికదా పెరిగింది. మరొకవైపు కమ్యూనిజంపట్ల ఆకర్షణ పెరిగింది. ట్రైఫాయిడ్ నుంచి కోలుకునే రోజుల్లో తనకు భావకవిత్వంపట్ల అభిమానం తగ్గిపోయిందని గ్రహించాడు. అప్పుడే మొదటిసారి గురజాడని తెలుసుకున్నాడు. గురజాడ ప్రవేశపెట్టిన ముత్యాలసరం, ఇతర మాత్రాఛందస్సులు, వాడుక భాష, శ్రీశ్రీని విశేషంగా ఆకర్షించాయి. కన్యాశుల్కంలోని స్త్రీ పాత్రల గురించి 1932లో విశ్లేషిస్తూ వ్రాశాడు. ఫ్రెంచ్, జర్మన్ కవులను చదివి వచన కవిత్వంలోని ఒడుపులను తెలుసుకున్నాడు. వీటన్నిటి సహాయంతో కవిగా తన స్వంతగొంతుకను పట్టుకున్నాడు.

1933లో వాడుకభాషలో ముత్యాలసరం ఛందస్సులో జయభేరి వ్రాశాడు. అనుకున్నది సాధించిన ఒకానొక సంతృప్తి, ఒక విజయగర్వం, మహాప్రస్థానంలోని జయభేరి, ఐ, కవితా ఓ కవితా మొదలైన ఖండకావ్యాల్లో కనపడతాయి.

కవిగా ఇది శ్రీశ్రీ జీవితంలో ఎవరెస్టులాంటి దశ. మరో ప్రపంచం అన్న వ్యాసం వ్రాద్దామని మొదలు పెడితే అనుకోకుండా అప్రయత్నంగా 'మరోప్రపంచం మరోప్రపంచం మరోప్రపంచం పిలిచింది' అన్న గీతం, అయిదు నిమిషాల్లో కాగితంమీద ఒకరోజు సాక్షాత్కరించింది. గొప్ప కళాకారులు కళాసాక్షాత్కారం జరిగిన వేళల్లో అతీంద్రియ శక్తితో పనిచేస్తారు అనడానికి ఇదో ఉదాహరణ.

ఆకలి రోజులు, నిరుద్యోగం, కమ్యూనిస్టు భావజాలం, ప్రపంచంలో నెలకొంటున్న యుద్ధ వాతావరణం, స్పానిష్ అంతర్యుద్ధం, వీటన్నింటి మధ్యా మహాప్రస్థానం గీతాలు ప్రవహించాయి.

1938లో కొంపెల్ల జనార్దనరావు మరణవార్త తెలిసింది. 'తల వంచుకు వెళ్లిపోయావా నేస్తం' అని కొంపెల్లకు తన మహాప్రస్థానం అంకితం చేసారు. అదే సంవత్సరం ఆంధ్రప్రభలో ఉద్యోగం వచ్చి కుటుంబం మద్రాస్‌కు తరలి వెళ్లారు.

ఇదిలా ఉండగా మళ్లీ 1930వ సంవత్సరానికి వస్తే సినిమా రంగంలో కూడా ఒక విప్లవం మొదలవబోతూ ఉంది. అర్దేషిర్ ఇరానీ తొలిభారత టాకీ ఆలం ఆరా మొదలుపెట్టింది ఈ సంవత్సరంలోనే.

1931లో ఆలం ఆరా విడుదల అయిన వెంటనే తెలుగు తమిళ భాషల్ని కలిపి కాళిదాసు అనే సినిమా, పూర్తి తెలుగులో భక్త ప్రహ్లాద అర్దేషిర్ ఇరానీ నిర్మించారు. కాళిదాసు, భక్త ప్రహ్లాద సినిమాలకు హెచ్ఎం రెడ్డి దర్శకత్వం వహించారు. వీటన్నింటిలోనూ ఎల్వీ ప్రసాద్ నటించారు.

ఆ తొలిరోజుల్లో తెలుగుటాకీ, నాటకాలు ఇతిహాసాలు పురాణాలు ఆధారంగా నడిచింది. 1934లో సి. పుల్లయ్య నిర్మించిన లవకుశ ఘనవిజయం సినిమామాధ్యమం యొక్క జనాకర్షణను వాణిజ్యశక్తిని నిరూపించింది.



అభ్యుదయ సాంఘిక చిత్రాల దర్శక నిర్మాతగా గూడవల్లి రామబ్రహ్మం మాలపిల్ల (1938), రైతుబిడ్డ (1939) సినిమాలతో సంచలనాలు సృష్టించారు. తన సినిమాలన్నిటిలోనూ బసవరాజు అప్పారావు గేయాలను వాడుకుని భావకవిత్వాన్ని రామబ్రహ్మం సినిమాల్లోకి తీసుకొచ్చారు. సముద్రాల రాఘవాచార్యులు, తాపీ ధర్మారావు, కొసరాజు రాఘవయ్య చౌదరి, వేదాంతం రాఘవయ్య వంటి గొప్ప కళాకారులు రామబ్రహ్మం ద్వారానే సినిమాల్లోకి వచ్చారు. కూచిపూడి నృత్యాన్ని సినిమాల్లో ప్రవేశపెట్టిన ఘనత కూడా ఆయనదే.

దరిదాపు అదే సమయంలో ఆంధ్రప్రభలో ఉద్యోగం చేస్తూ మద్రాసులో ఉన్న శ్రీశ్రీకి సినిమారంగంలో మొదటి అవకాశం కాలచక్రం (1940) సినిమా ద్వారా కలిగింది. ప్రముఖ నటుడు బందా కనకలింగేశ్వరరావు కోరిక మీద తన మహాప్రస్థాన గీతాన్ని కొద్ది మార్పులు చేసి ఆ సినిమాలో వాడుకోవడానికి అనుమతించారు. (ఇస్తానన్న 25 రూపాయల పారితోషికం మాత్రం ఆయనకు అందలేదు)

40వ దశకంలో సినిమా నిర్మాణం మరింత ఊపందుకుంది. రచన పరంగా ఇది సముద్రాల శకం. ఆయనతోపాటు 1945 నుండి మల్లాది రామకృష్ణశాస్త్రి పనిచేసేవారు. తాపీ ధర్మారావు, సదాశివ బ్రహ్మం మొదలైనవారు కూడా రచన చేసేవారు. వాహినీవారు ఈ దశాబ్దంలో క్లాసిక్స్ అనదగ్గ చిత్రాలు నిర్మించారు. బివిన్ రెడ్డి బలవంతం మీద కృష్ణశాస్త్రి 1946లో మద్రాస్‌కు మకాం మార్చారు. గుణసుందరి కథ (1949)తో పింగళి నాగేంద్రరావు చిత్రరంగంలో నిలదొక్కునది కూడా ఈ దశలోనే.

మద్రాసులోని తెలుగు కవులకు పానగల్ పార్కు ఒక కేర్ ఆఫ్ అడ్రస్‌లా ఉండేది. మల్లాదివారు కొలువుదీరి అందరితో సాహిత్యచర్చలు చేయటం చూసినవారు ఆ రోజుల గురించి చాలా గొప్పగా చెప్తారు. ఆరుద్ర, శ్రీశ్రీ కూడా ఈ చర్చల్లో పాల్గొనేవారు. దీన్ని 'పక్షితీర్థం' అని సరదాగా అన్నారు శ్రీశ్రీ ఒకసారి.

ఆంధ్రప్రభ ఉద్యోగం పోయిన తర్వాత రకరకాల పత్రికల్లో పనిచేసినా ఎక్కడా స్థిరంగా ఎక్కువకాలం ఉండలేకపోయారు శ్రీశ్రీ. సాహితీ వ్యాసంగం మాత్రం కొనసాగేది. మహాప్రస్థానంలోని చివరి గీతాలనదగ్గ 'జగన్నాథ రథ చక్రాలు', 'గర్జించు రష్యా', 'నిజంగానే' నలభయ్యవ దశాబ్దంలోనే వ్రాసారు. అధివాస్తవిక రచన 'మంచి ముత్యాలసరాలు', 'ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమసమూహములు' వంటి కవితల రచన ఈ దశాబ్దంలోనే జరిగింది.

చందమామ మొదలుపెట్టేముందు 1945-1946 ప్రాంతాల్లో చక్రపాణి నాగిరెడ్డి ఆంధ్రజ్యోతి మాసపత్రిక కొంతకాలం నడిపారు. అప్పుడు చక్రపాణి అడగగా 'అందంగా మధురస నిష్యందంగా, పఠిత్ర హృదయ సంస్పందంగా' శ్రీశ్రీ మొదలుపెట్టి వ్రాసినవే సిరిసిరిమువ్వ కందాలు.

1948-49 సంవత్సరాల్లో నీరా ఔర్ నందా అనే హిందీ సినిమా తెలుగులోకి అనువదించవలసిన అవసరం వచ్చింది. అప్పటికి డబ్బింగ్ అనేది తెలుగులో లేదు. మల్లాది రామకృష్ణశాస్త్రి గారి సాయంతో శ్రీశ్రీ ఈ సినిమాకు ఈ సినిమాకు పనిచేసే అవకాశం వచ్చింది.

అదే శ్రీశ్రీ మాటలు, పాటలతో విడుదలైన మొదటి సినిమా, తెలుగులో మొదటి డబ్బింగ్ సినిమా, ఆహుతి (1950).

అలా శ్రీశ్రీ సినీరంగంలో ప్రవేశించడమే కాకుండా తనతో పాటు డబ్బింగ్‌కళను కూడా ప్రవేశపెట్టారు. మల్లాది చేసిన సహాయానికి కృతజ్ఞతగా తన మొదటి సినిమా పాటల సంకలనం 'పాడవోయి భారతీయుడా' పుస్తకాన్ని 1983లో ఆయనకు అంకిత మిచ్చారు.

ఆహుతి సినిమా పెద్దగా ఆడకపోయినా అందులో ఘంటసాల, బాలసరస్వతి పాడిన 'ప్రేమయే జనన మరణ లీల' పాటకు పేరు వచ్చింది. ఆ పాట సాహిత్యం నచ్చి, హెచ్ఎం రెడ్డి నిర్దోషి సినిమాలో అవకాశం ఇచ్చారు. నిర్దోషి విజయవంతమవడంతో శ్రీశ్రీని తన రోహిణి సంస్థలో నెలజీతం మీద తీసుకున్నారు.

మూనాస్ అనే కోటీశ్వరుడు అనేక భాషల్లో ప్రపంచం అనే సినిమా తీస్తూ తెలుగు వెర్షనుకు రచయితగా శ్రీశ్రీని ఎన్నుకున్నాడు. ఈ సినిమా నిర్మాణం జాప్యం జరిగి కొన్ని సంవత్సరాలు పట్టింది. ఒకపక్క హెచ్ఎం రెడ్డిగారి చెక్కు, మరోపక్క మూనాస్ పంపించే చెక్కు క్రమం తప్పకుండా ప్రతినెలా అయిదేళ్లపాటు అందడంతో పేదరికం తీరిపోయి నికరాదాయం ఏర్పడింది.

తర్వాత రోజుల్లో ఎడతెరిపి లేకుండా డబ్బింగ్ సినిమాల్లో పనిచేసి ఇతర రచయితలకు దారి చూపించి డబ్బింగ్ కింగ్ అనిపించుకున్నారు శ్రీశ్రీ. ఆ తరహా పనికి ఓష్ఠ్యాలు (ఉ-ఊ-ప-ఫ-బ-భ-మ) జాగ్రత్తగా గమనించుకోవడం, దానికి తగ్గట్టు అర్థం సరిపోయేలా తెలుగులో వ్రాయడం అతి ముఖ్యం. అనువాద చిత్రాలలో పనిచేయడానికి ఆయనకున్న శబ్దసంపద బాగా అక్కర కొచ్చింది.

మరోపక్క పీఏపీ, అన్నపూర్ణ, అనుపమ, పద్మాలయ, నవతరం మొదలైన సంస్థల స్ట్రెయిట్ సినిమాల కోసం ఎన్నో గొప్ప పాటలు ఆయన కలం నుంచి జాలువారాయి. మహాప్రస్థానం, ఖడ్గసృష్టి, సిపాలి సంపుటుల నుండి కూడా చాలా గీతాలు సినిమా పాటలుగా వచ్చాయి.

సర్వతోముఖమైన శ్రీశ్రీ ప్రతిభకు సినిమా మంచి వేదికగా పనిచేసింది. అల్లూరి సీతారామరాజు సినిమాకు వ్రాసిన 'తెలుగువీర లేవరా' గీతం తొలిసారి తెలుగు సినిమాపాటకు జాతీయ అవార్డును అందించింది.

అభ్యుదయ, విప్లవగీతాలతోపాటు 'నా హృదయంలో నిదురించే చెలీ', 'మనసున మనసై' వంటి మధురమైన ప్రేమ గీతాలు కూడా ఆయన వ్రాశారు. 'పాడవేల రాధికా' వంటి మనోహరమైన వీణ పాటల రచనకు వరవడి పెట్టింది ఆయనే. జావళి వ్రాస్తారా అని అడిగితే బొబ్బిలియుద్ధం సినిమాకు వ్రాసిన 'నిను చేర మనసాయెరా' ఒక గొప్ప పాట. వాగ్దానం సినిమాకు వ్రాసిన అత్యంత ప్రసిద్ధమైన సీతాకల్యాణం హరికథను, సర్దార్ పాపారాయుడు సినిమాలోని అల్లూరి సీతారామరాజు బుర్రకథను కూడా ఈ సందర్భంలో చూడవచ్చు.

నేటిభారతం సినిమాలోని 'అర్ధరాత్రి స్వతంత్రం' పాట ఆయన వ్రాసిన చివరి పాట. ప్రజాసాహితి ప్రత్రికకు వ్రాసిన 'కదలిరండి నవభారత నారీమణులారా' చివరి కవిత. వృత్తిగా సినిమాకు వ్రాసినా, తన ఇతర రచనావ్యాసంగాన్నీ, ప్రజా వుద్యమాలతో సాహచర్యాన్నీ కొనసాగించి కడకంటా మహాకవిగానే ఆయన జీవించారు అనడానికి ఈ చివరి గీతాలే నిదర్శనం.

ఆయన మరణించిన 42 ఏళ్ల తర్వాత కూడా తెలుగు సాహిత్యం పేరు చెప్తే చాలామందికి ముందుగా గుర్తొచ్చే పేరు శ్రీశ్రీ. ఆయన కోరుకున్నట్టుగా తెలుగుభాష నిలిచి వున్నంతవరకూ ఆయన కవిత్యం నిలిచివుంటుంది.



విజయ చంద్రహాస్ మద్దుకూరి సినీ జర్నలిస్టు కాకపోయినా సినిమాలపై అభిమానంతో పరిశోధనాపూర్వక వ్యాసాలు రాసారు. కొసరాజు పాటల మీద ప్రత్యేక శ్రద్ధతో వ్యాసాలు రాసి, 'కొసరాజు సినీసాహితి - వ్యాససంహిత' పుస్తకంగా ప్రచురించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా డాలస్‌లో నివాసం.

కథ కవితాప్రభ

ఈ కథ కవితాప్రభలో...

కథాప్రభ

1. అమెరికన్ డ్రీమ్
   - యాజి ... 150
2. నువ్వు-నేను-మనం
   - శారద ... 154
3. నిజం
   - మోదుగు శ్రీసుధ ... 160
4. డార్విన్‌తో కలిసి నడుస్తూ...
   - ఇంగ్లీష్: నిమ్మగడ్డ శేషగిరి
   - తెలుగు: దాసరి అమరేంద్ర ... 164
5. ఇంటికి చేరిన కథ
   - డా॥ రావు సిద్ధం ... 170
6. అద్వైతామృతం
   - శ్రీనివాస్ పబ్బరాజు ... 179
7. ఆకాస కోట
   - సంజనాపద్మం ... 182

కవితాప్రభ

1. కోణార్క్
   - మంత్రి కృష్ణమోహన్ ... 184
2. వద్దనుకునేవాళ్ల కోసం
   - మెర్సీ మార్గరెట్ ... 185
3. యుద్ధకాలంలో పిల్లలు
   - బాలసుధాకర్ ... 186
4. రెండో కాస్పు
   - తగుళ్ల గోపాల్ ... 187
5. తలుపు కొంచెంతెరిచే వుంచాను
   - పల్లిపట్టు నాగరాజు ... 188
6. నాతోనే నువ్వు - నాలోనే నువ్వు
   - గోగినేని శ్రీనివాస ... 189



అమెరికన్ డ్రీమ్

యూజి

శ్రీధర్ వాళ్ల అమ్మగారిని పిక్ చేసుకోవడానికి ఎయిర్‌పోర్టుకి బయలుదేరాను.

ఒక అరగంట క్రితం ఆవిడ ప్లేన్ ల్యాండ్ అయ్యింది. ఆవిడ దగ్గర ఫోన్ లేదు కాబట్టి, ఎవరో ఎయిర్‌లైన్ స్టాఫ్, ఆవిడ పేరున్న ప్లకార్డ్ పట్టుకొని నాకోసం ఎరైవల్స్ దగ్గర వెయిట్ చేస్తామని చెప్పారు. ఇంకా చాలా సమయం ఉన్నప్పటికీ, మాటిమాటికీ గడియారం వైపుకి చూడకుండా ఉండలేకపోతున్నాను.

ఫ్రీ వే ఖాళీగా ఉంది. అయినా మధ్య లేన్‌లో స్పీడ్ లిమిట్‌లో వెళ్తున్నాను.

పాలో ఆల్టో దాటి రెడ్‌వుడ్ సిటీ దగ్గరపడంగానే, మొదటి సారి శ్రీధర్‌ని కలసిన సందర్భం గుర్తుకొచ్చింది.

❖

ఓ సాయంత్రం, చీకటి పడుతున్న వేళ, రెడ్‌వుడ్ సిటీలో ఆఫీస్ పని ముగించుకొని, సన్నీవేల్‌లో ఇంటికి వెళ్లటానికి ఊబర్ బుక్ చేసుకున్నాను. ఆ యాప్ డ్రైవర్ పేరు బ్రాడ్లీ అని చూపిం చింది. ప్రొఫైల్ ఫోటో చూస్తే, ఎవరో రిటైర్డ్ రాక్ గిటారిస్ట్‌లా ఉన్నాడు. కాసేపట్లోనే, ఒక తెల్ల టొయోటా క్యామ్రీ వచ్చి ఆగింది. డ్రైవర్‌ని చూస్తే పక్కా ఇండియన్‌లా ఉన్నాడు. బక్క పల్చని శరీరం, లావైన చిరునవ్వు.

"నువ్వు బ్రాడ్లీ?"

"కాద్సార్, అతను కారు ఓనర్, నేను జస్ట్ డ్రైవర్."

త్వరగానే మాటా మాటా కలిసాయి. పేరు శ్రీధర్, వైజాగ్ నుంచి. తండ్రి బెస్తరి, శ్రీధర్‌కి ఆరేళ్లప్పుడు, ఒకరోజు పడవలో చేపలు పట్టటానికని వెళ్లి తిరిగిరాలేదు. తల్లి వైజాగ్ నేవల్ బేస్‌లో ఆఫీసర్ల ఇళ్లలో, పనిమనిషిగా చేసేది. తల్లితోపాటు పనిలోకి వెళ్లటం, ఆ ఆఫీసర్ల భార్యల మాటలు, వాళ్లు చూసే హిందీ/ఇంగ్లీషు ఛానెళ్ల వల్ల, ఆ రెండు భాషలూ బానే అబ్బాయి.

పదవ తరగతి గట్టెక్కిన తరవాత, ఒక క్రూస్ షిప్‌లో నాలుగేళ్లు పనిచేస్తూ ఇంటర్ కూడా పూర్తిచేశాడు. అతను పనిచేసే షిప్ లాస్ ఏంజెల్స్ పోర్టులో రిపేర్ల కోసమని ఒక వారంపాటు ఆగిపోయింది. అప్పుడే అతను మొదటిసారి అమెరికా గడ్డమీద కాలు పెట్టటం. విపరీతంగా నచ్చేసింది, మెరిసిపోతున్న రోడ్లు, మనుషులు - 'ల్యాండ్ ఆఫ్ ఆపర్చూనిటీస్.'

స్టూడెంట్ వీసాలు ఇచ్చే కమ్యూనిటీ కాలేజీలు వెతికితే, శాన్ ఫ్రాన్సిస్కో బే ఏరియా ప్రాంతంలో ఒకటి దొరికింది. అక్కడ అప్లై చేసిన కొద్ది నెలలకి వీసా కూడా వచ్చింది.

ఆ వీసా మీద క్యాంపస్‌లో పనిచేయగలిగిన ఇరవై గంటలలో వచ్చే ఆదాయం సరిపోకపోవటంతో, ఎవరి పేరుతోనో ఉన్న ఊబర్ అకౌంట్ ఉపయోగించి, డ్రైవింగ్ మొదలెట్టాడు.

"నేను చేస్తున్నది ఇల్లీగల్ అని తెలుసు," నిజాయితీ ఉట్టి పడుతున్న స్వరంతో, "కానీ వేరే దారి లేదు. నాకు ఇక్కడే ఉండాలని ఉంది. ఏదో ఒకటి చేసి సాధిద్దామని ఉంది."

నా ఇల్లు దగ్గర పడుతూ ఉండటంతో, మళ్లీ డ్రైవ్ చేసే అవకాశం కోసం తనే అడిగాడు.

"సర్... నా నెంబర్ నోట్ చేసుకోండి. మీకు ఎప్పుడు అవసరమైనా నాకు డైరెక్ట్‌గా కాల్ చెయ్యండి. అప్పుడు ఊబర్ వాడి షేర్ కూడా నాకు మిగులుతుంది."

ఒక న్యూస్ పేపర్ కాగితం త్రుంచి, తన నెంబర్ నాకు హడావిడిగా రాసి ఇచ్చాడు. మొదటి పరిచయంలోనే ఎందుకో నచ్చాడు. ఆ కాగితం పారెయ్యకుండా నా వాలెట్‌లో పెట్టుకొనేంతలా. ఆ తరవాత చాలాసార్లు నన్ను డ్రైవ్ చేశాడు. నేను బిజీగా ఉండటం వల్ల కొన్నిసార్లు మాటలు సాధ్యపడలేదు. కానీ అతడు నాతో మాట్లాడే అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉండేవాడన్న విషయం నేను గమనించకపోలేదు.

ఒక రాత్రి డ్రైవ్‌లో తనే నెమ్మదిగా మాటలు కదిపాడు.

"ఒక పర్సనల్ విషయం మాట్లాడచ్చా?"

"చెప్పు," ఫోన్లో ఈమెయిల్ చెక్ చేసుకుంటూ నేను.

"ఇక్కడికొచ్చే ఇండియన్లందరూ హెచ్-1 వీసాలతో హైటెక్ జాబులు, సన్నీవేల్‌లో అపార్ట్‌మెంట్లు."

బాధని కప్పలేని నవ్వు ఒకటి విడుస్తూ, "నేను, అడ్డదారి క్రూ వీసా, స్టుడెంట్ వీసా, ఫేక్ ఊబర్ జాబ్, నో లింక్డ్ ఇన్ ప్రొఫైల్, నో ఓ.పి.టి (వర్క్ పర్మిట్). అమ్మకివన్నీ తెలియదు. కొడుకు అమెరికాలో ఏదో కొలువు చేస్తున్నాడని అనుకుంటోంది.

"ఇక్కడ స్టూడెంట్లని చూస్తాను కదా, ఇంటర్న్ షిప్‌లు, చేతుల్లో మ్యాక్ బుక్‌లు, అప్పుడప్పుడూ వాళ్ల కార్లు నేను వ్యాలే పార్కింగ్ చేస్తాను. పైసా టిప్ ఇవ్వరు కదా, వాళ్లు నావైపు చూసే చూపు నేను తట్టుకోలేను. వాళ్లని చూస్తే అనిపిస్తుంది, జీవితాన్ని, రాంగ్ సైడ్ డ్రైవ్ చేస్తున్నానేమోనని."

వింటున్నానోలేదో అని రేర్ వ్యూ మిర్రర్‌లో ఒకసారి చెక్ చేసుకుని అన్నాడు.

"నాకు ఒకే ఒక్క స్ట్రైట్ రోడ్డు కనపడుతోంది. కొంచెం కష్టమైనా, అది లీగల్. అది కనక నేను ఫాలో అయితే, వీళ్లందరి కంటే కూడా నేను ఇంకా తల పైకెత్తుకొని తిరగగలను."

"ఏంటా రోడ్డు," నా ఫోన్‌ని పక్కకి పడేసి అడిగాను.

"MAVNI... మిలిటరీ యాక్సెషన్స్ వైటల్ టు ది నేషనల్ ఇంటరెస్ట్. ఈ ప్రోగ్రాంలో వాళ్లు సిటిజెన్స్ కాని వాళ్లని, హిందీ, కొరియన్‌లాంటి కొన్ని భాషలు తెలిస్తే, ట్రైనింగ్ ఇచ్చి మిలటరిలో తీసుకుంటారు. కొన్నాళ్లు యాక్టివ్ సర్వీస్ చేస్తే, డైరెక్ట్‌గా సిటిజెన్ షిప్ ఇస్తారు."

నేను సందేహిస్తూనే, "అది డేంజరస్ రోడ్డు కదా? మీ అమ్మ గురించి ఆలోచించావా?"

"ఆలోచించాను. ఒక రెండేళ్లు కష్టపడితే, నా అమెరికన్ డ్రీం సాధించుకోవచ్చు. అప్పుడు మా అమ్మనీ ఇక్కడికి తెచ్చుకోవచ్చు," ఒక నిశ్చయంతో అన్నాడు.

మరి కొద్దిరోజుల తరవాత నన్ను ఒకరోజు ప్రొద్దున్నే ఎయిర్‌పోర్ట్‌లో దింపటానికి వచ్చాడు. కాసేపు మౌనం తరవాత, కొంచెం సందేహిస్తూనే, అడిగాడు.

"ఒక్క సహాయం కావాలి, అడగచ్చా?"

"అడుగు, చేతనయితే చేస్తాను," కమిట్ అవ్వకుండా, నేను.

"అదే, నా ఆర్మీ ప్రోగ్రాం గురించి. బ్యాక్‌గ్రౌండ్ చెక్స్ చేస్తున్నారు. క్యారెక్టర్ రిఫరెన్స్ కావాలి. ఇచ్చేవాళ్లు అమెరికన్ సిటిజెన్ అయ్యుండాలి. సమాజంలో గుర్తింపు ఉండాలి. నేనెవరో బాగా తెలిసుండాలి. అలాంటివాళ్లు మీరు తప్ప నాకెవ్వరూ తెలియదు."

కొద్ది క్షణాలు ఆలోచించాను. నేను, ఒక సాఫ్ట్‌వేర్ ఎగ్జిక్యూటివ్. ఇలాంటి రిఫరెన్సులు ఎప్పుడూ ఇవ్వలేదు. అసలు నేనెవ్వరికి మద్దతిస్తున్నాను? శ్రీధర్‌కా లేక ప్రపంచమంతా అమెరికా చేస్తున్న యుద్ధాలకా? శ్రీధర్ అతని అమెరికన్ డ్రీం కోసమే అని సమాధానపరుచుకొన్నాను.

"తప్పకుండా. మొదటి నుంచీ నీలోని నిజాయితీ, కష్టపడే తత్వం నాకు బాగా నచ్చాయి. మంచి రికమండేషన్ ఇస్తాను."

మాట్లాడకుండా తలూపాడు శ్రీధర్.

కాసేపటి తరవాత, "మీకు ఈమెయిల్లో ఫాం పంపిస్తాను. చాలా ప్రశ్నలు ఉంటాయి. కొంచెం టైం పడుతుంది, అవి ఫిల్ చెయ్యాలంటే."

"ఫర్లేదులే, వీకెండ్‌లో కూర్చొని పూర్తిచేసి పంపిస్తాను."

"చాలా థ్యాంక్స్ అండీ... మీ హెల్ప్ ఎప్పటికీ మర్చిపోను."

ఒక వారం తరవాత శ్రీధర్ నుండి ఈమెయిల్ వచ్చింది. ప్రశ్నలు చిన్నవిగానే ఉన్నాయి. సమాధానాలే బాగా ఆలోచించి వ్రాయాల్సి వచ్చింది. కేవలం ఊబర్ పరిచయమేనైనా, కొంచెం ఎక్కువ తెలిసినట్లుగానే చెప్పాల్సొచ్చింది. అలాంటి వైట్ లైస్ నాకు అలవాటే.

కొన్ని వారాల తరవాత నాకు కాల్ చేశాడు శ్రీధర్.

"నాకు ఆర్మీలో అడ్మిషన్ వచ్చింది."

"కంగ్రాట్యులేషన్స్!"

"నా పేపర్ వర్క్ క్లియర్ అయ్యింది. బేసిక్ ట్రైనింగ్ నెక్ట్ వీక్ స్టార్ట్ అవుతుంది. ఫోర్ట్ జాక్సన్, సౌత్ కెరొలీనా."

"అంత త్వరగానా?"

"అవును. ఏదో అత్యవసర రిక్రూట్‌మెంట్‌ట. కానీ మీ సహాయం లేకుండా మాత్రం ఇది సాధ్యపడేదికాదు."

"నాది మాట సాయం మాత్రమే. పూర్తి క్రెడిట్ అంతా, నువ్వు పడ్డ కష్టానికీ, నీకే!"

"లేదు సర్. మీరు నా గురించి అంత మంచిగా, అంత గొప్పగా రాసుండకపోతే, ఇది జరిగేది కాదు. మీరు రాసింది చదివి, నా గురించి నాకే గొప్పగా అనిపించింది. థాంక్యూ!"

"నీకు నిన్నే పరిచయం చేసానన్నమాట!"

కొద్ది క్షణాలు అటువైపు నుంచి మాటలేదు.

"థాంక్యూ, ఉత్త లెటర్‌కే కాదు, ఫర్ ఎవ్విరి థింగ్!"

"గో మ్యాన్! అనుకున్నది సాధించు, ప్రపంచాన్ని జయించు!"

"ప్రయత్నిస్తాను, సర్!"

అప్పటినుంచీ ఫోన్ కాల్స్ కానీ, ఈమైల్స్ కానీ లేవు కానీ, టెక్స్ట్ మెసెజీలు మాత్రం శ్రీధర్ నుండి అప్పుడప్పుడూ వస్తూ ఉండేవి. అలా అతని మిలిటరీ జీవితం గురించి నాకు వివరాలు తెలుస్తూ ఉండేవి.

అక్టోబర్ 12

ఫోర్ట్ జాక్సన్ చేరుకున్నాను. మొదటి వారమంతా గజిబిజి. రాగానే నా ఫోన్ తీసేసుకున్నారు. ఈరోజే, తిరిగిచ్చారు!

నవంబర్ 4

రైఫిల్ ట్రైనింగ్ పూర్తయ్యింది. 32/40 టార్గెట్లు కొట్టాను. ఒక వైజాగ్ బెస్తరి కుర్రాడికి ఆ స్కోర్ ఎక్కువే!

డిసెంబర్ 2

మంచి ఫిల్టర్ కాఫీ తాగి ఎన్నాళ్లయిందో! ఈ మిలటరీ కాఫీ వేణ్నీళ్లు తాగినట్టుంటుంది.

డిసెంబర్ 22

ఈరోజు సాయంత్రం చిన్న బ్రేక్ దొరికింది. అందరం కలిసి ఏదో ఇంగ్లిష్ సినిమా చూసాం. సబ్ టైటిల్స్ లేవు. అయినా బాగా ఎంజాయ్ చేసా.

జనవరి 10

ఈరోజు అమెరికన్ సోల్జర్‌లాగా ప్రమాణ స్వీకారం చేయించారు. కొత్త బూట్లిచ్చారు. కొద్దిగా టైట్‌గా ఉన్నాయి. అయినా కంప్లయింట్ చెయ్యలేదు.

ఫిబ్రవరి 5

మమ్మల్ని ఒక ప్రదేశానికి డిప్లాయ్ చేసారు. ఎక్కడో చెప్పలేను. ఇక్కడ చాలా చల్లగా ఉంది.

ఫిబ్రవరి 22

ఇక్కడ తోటి సోల్జర్లు నిద్రలో ఏవేవో మాట్లాడుతూ ఉంటారు. కొందరైతే పాత పాటలు కూడా పాడుతూ ఉంటారు. పాపం వాళ్ల ఫామిలీలు గుర్తుకొస్తున్నాయేమో.

మార్చి 15

నాకు తరచు మా వైజాగ్ బీచ్, అమ్మ వండే చేపల పులుసు గుర్తుకొస్తున్నాయి. మామిడిపండ్లు కూడా. అమ్మ కూడా చాలా గుర్తు కొస్తోంది.

ఏప్రిల్ 9

ఈరోజు, ఇక్కడ చిన్నపిల్లలకి వాటర్ బాటిల్స్ పంచాము. ఆ పసి మొహాలలో ఎన్ని నవ్వులో! మమ్మల్ని చూసి అస్సలు భయ పడలేదు. చాలా హ్యాపీగా అనిపించింది... చాలా కాలం తరవాత.

ఏప్రిల్ 30

అంతా బాగానే జరుగుతోంది ఇక్కడ. నా అమెరికన్ డ్రీంకి చాలా దగ్గరగా ఉన్నానని కూడా అనిపిస్తోంది.

మే 15

ఈ నెలాఖరికి మళ్లీ వెనక్కి వచ్చే అవకాశం ఉందంటున్నారు. మా కమాండర్‌కి కూడా నేనంటే చాలా ఇష్టం. సిటిజెన్‌షిప్‌కి తప్పకుండా రెకమెండ్ చేస్తానన్నాడు. అమ్మనీ, మిమ్మల్నీ త్వరలోనే కలుస్తాను.

❖

ఫ్రీ వే మీద ఎయిర్‌పోర్ట్ ఎక్సిట్ సైన్ కనపడుతోంది. గడియారం చూసాను. ఫ్లైట్ ల్యాండ్ అయ్యి ఒక గంట కావస్తోంది. ఈపాటికి శ్రీధర్ అమ్మగారు బయటకి వచ్చి ఉంటారు.

దూరం నుంచి చూసే గుర్తుపట్టేసాను ఆవిడని. ముతక కాటన్ చీర, చేతిలో గుడ్డ సంచీ, చిన్న బ్యాగు. దగ్గరకు వెళ్లి నేను నమస్కారం అనగానే, అవిడా గుర్తుపట్టినట్టే తలాడించింది.

"మీరు మావాడి ఫ్రెండు కదా..."

"అవునాంటీ, మిమ్మల్ని నేనే తీసుకెళ్తాను."

ఆపైన ఆవిడ పెద్దగా మాట్లాడలేదు. ఆ గుడ్డసంచీని గట్టిగా పట్టుకొని, నేను ఆవిడ బ్యాగ్ తీసుకుంటే వెనకనే నడిచింది.

కారులో కొంత దూరం ప్రయాణం చేసాక, ఆవిడే మొదట నోరు విప్పింది.

"మీ గురించి చాలా చెప్పేవాడు మావాడు. మీరు వాడిని చక్కగా ఆదరించారట... అందరిలాగా కాకుండా."

ఎలా స్పందించాలో తెలియక, తలాడించాను.

"వాడు చిన్నగా ఉన్నప్పుడు, నా వెనకాలే తిరుగుతూ అన్ని పనులూ చేసేవాడు. ఇల్లు ఊడ్చటంలో, అంట్లు తోమడంలో, బట్టలు ఉతకడంలో, అన్నిటిలోనూ సహాయపడేవాడు. మామిడి పండ్లంటే చాలా ఇష్టం. మా నేవీ ఆఫీసర్ వాళ్లింటి నుంచి వాళ్లకి తెలియకుండా అప్పుడప్పుడూ తెచ్చి పెడుతూ ఉండేదాన్ని."

ఏదో గుర్తుకొచ్చినట్టుంది, తనలో తానే నవ్వుకుంది.

మళ్లీ ఆవిడే, "మావాడు అమెరికన్ సైన్యంలో చేరతాను, ఇక్కడ సిటీజెన్ అయ్యి, నన్ను కూడా, ఇక్కడికి తీసుకొస్తానని చెప్పాడు. వివరాలెప్పుడూ పెద్దగా చెప్పలేదు."

హఠాత్తుగా నా మొహం వైపుకి తిరిగి చూస్తూ అడిగింది, "ఈ సిరియా, అమెరికా పక్కనే ఉందా?"

"లేదాంటీ. అది అమెరికాకి చాలా దూరం. ఎక్కడో మిడిల్ ఈస్ట్‌లో ఉంది."

తలూపుతూనే, "మరి అంత దూరంలో, అమెరికన్ సైన్యం ఏమి చేస్తోంది? ఎవరితో పోరాడుతోంది? ఎందుకోసం?"

"ఆంటీ, ఆ పాలిటిక్స్ అర్థమవ్వాలంటే చాలా కష్టం."

"మీక్కూడా కష్టమేనా... మరి మా వాడికి అమెరికా సైన్యంలో చేరిన తరవాత సిటిజెన్‌షిప్ ఇచ్చారా?"

"లేదు. ఇంకా ఇవ్వలేదు."

"మరి సిటిజెన్‌షిప్ కూడా ఇవ్వలేదు.. అయినా వాళ్ల సైన్యంతో కలిసి, మనకి అర్థం కాని పోరాటం చేసాడా?"

నేను జవాబు ఇవ్వలేదు, ఇవ్వలేక.

"నేను వాడికి ఎన్నోసార్లు చెప్పాను. ఈ షిప్పులు, విదేశాలు వద్దురా. చక్కగా వైజాగ్‌లోనే ఏదో చిన్న ఉద్యోగం చూసుకోమని. కానీ వాడికి ఇవన్నీ వదిలేసి, పక్షిలాగా ఎగురుకుంటూ ప్రపంచాన్ని చూద్దామనే ఒక పిచ్చి ఆశ."

మిగిలిన దారంతా మౌనంగా గడిపాం.

మెమోరియల్ కార్యక్రమం ఫ్రీమాంట్‌లోని ఒక కమ్యూనిటీ సెంటర్‌లో జరుగుతోంది.

వరుసల్లో నీట్‌గా పేర్చిన కుర్చీలు. పూలగుచ్ఛాలతో నిండిన స్టాండ్లు. మధ్యలో టేబుల్ మీద, నలగకుండా మడిచి పేర్చిన అమెరికన్ జెండా. పెద్ద ఫోటో ఫ్రేములో మిలటరీ యూనిఫారంలో నవ్వుతూ మెరిసిపోతున్న శ్రీధర్.

ఆవిడ చాలా నెమ్మదిగా నడుస్తూ ఆ ఫోటో వైపుకి వెళ్లింది. కొడుకుని కాసేపు చూసుకుంది. పక్కనే ఉన్న కాఫిన్ వైపుకి నడిచి, చేత్తో తడిమింది. చేతిలో ఉన్న గుడ్డసంచీలో చెయ్యి పెట్టి వెతికి బయటకి తీసింది, ఒక మామిడిపండు. దానిని కాఫిన్ మీద పెట్టి, తనకి కేటాయించిన మొదటి వరుసలోని కుర్చీలో నా పక్కన వచ్చి కూర్చుంది.

ఎవరో చాలా చిన్న స్పీచ్ ఇచ్చారు. 'సర్వీస్', 'శాక్రిఫైస్', 'డ్యూటీ' లాంటి పదాలు దొర్లి పడ్డాయి.

ఆ అమ్మకి అవేవి అర్థం కాలేదు; ఆ పదాలకి అర్థమే లేదు.

నేను ఆ ఫోటో వైపే చూస్తూ ఉండిపోయాను.

కొన్ని అమెరికన్ డ్రీమ్‌లు ఇలానే ముగుస్తాయేమో!

కథాకాలం: 2017-2018. MANVI ప్రోగ్రాం 2017, ట్రంప్ మొదటి టర్మ్‌లో రద్దు చేసారు. 2018లో సిరియా నుంచి అమెరికా తమ సైన్యాన్ని ఉపసంహరించటం మొదలుపెట్టింది.





తెనాలి ప్రాంతంలో పుట్టి పెరిగిన యాజి పూర్తి పేరు శివ సోమయాజుల. అతి కొద్ది కథలు రాసినా మంచి కథలు రాసిన పేరున్న రచయిత. సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తున్నారు. నివాసం కాలిఫోర్నియా.



నువ్వు-నేను-మనం

శారద

డేవిడ్

స్టీఫెన్ చెప్పీ, చెప్పీ నస పెట్టడంతో ఈ యోగా రిట్రీట్ కొచ్చి పడ్డాను. అసలు ఇదంతా ఆ పాడు ఉద్యోగం మూలాన వొచ్చి పడింది.

రియల్ ఎస్టేట్ బిజినెస్ అంత దరిద్రం ఇంకోటి వుండదు. దినదినగండం, నూరేళ్లాయుషు. ఆ ఇళ్లు అమ్మే కక్కుర్తితో నేను చెప్పే అబద్ధాలకు నాకే వాంతొస్తుంది. ఎంత చేసినా, ఏదో తెలియని ఆందోళనా, అనిశ్చిత స్థితి! పెరిగిపోయిన షుగరూ, బ్లడ్ ప్రెషరూ! ఒక వారంరోజులైనా వుద్యోగపు ఒత్తిడినించి బయటకొచ్చి విశ్రాంతి తీసుకోకపోతే, నా బ్రతుక్కి గ్యారంటీ లేదన్నాడు డాక్టరు. తమ్ముడు స్టీఫెన్ బలవంతంగా ఇక్కడ రిజిస్టర్ చేసాడు. రెండు రోజులు చూసి, మెల్లిగా ఏదో ఎమర్జెన్సీ అని చెప్పి బయట పడతాను.

ఇవాళ పొద్దున తీసుకున్న మొబైల్ ఫోన్ సాయంకాలానికిగానీ ఇవ్వలేదు. ఇచ్చినట్టే ఇచ్చి, గంటసేపట్లో మళ్లీ లాగేసుకున్నారు. మళ్లీ రేపే ఇస్తారట, అదీ గంటసేపే! ఫోన్ చేతిలోకొచ్చేదాకా ప్రాణం పోయినట్టైంది. ఫోనూ, ఫోనూ అని వెంపర్లాడటమే కానీ, నాకు ఫోన్లు చేయడానికీ, మెసేజీలు పంపడానికి ఎవరున్నారని! ఎన్ని ఇళ్లు అమ్మానో, ఎంత డబ్బు సంపాదించానో అని లెక్కలేసే నా మేనేజరు తప్ప!

కేరెన్ ఫోన్ చేస్తుంది అప్పుడప్పుడు. అడిగే ధైర్యం లేదుకానీ, కేరెన్ ఒప్పుకుంటే తనని పెళ్లి చేసుకోవాలని వుంది. ఈ సంవత్సరం కొంచెం సేల్స్ పెరిగి వుద్యోగం నిలకడైతే అడిగేస్తాను.

రేపు పొద్దున్న మాతో యోగా చేయిస్తారట. నావల్లయే పనేనా? నాతోపాటు ఇంకో ఇద్దరిని ఒక టీంలో వేసారు. ఇద్దరూ ఏమంత స్నేహంగా అనిపించలేదు.

జానీ ఎందుకో నావైపు అనుమానంగా, కోపంగా చూస్తూ వుంటాడు. దున్నపోతులా వుంటాడు మనిషి. పొట్టకోస్తే అక్షర ముక్కైనా వచ్చో రాదో. ఏదో అబోరిజీనల్ వూరి నించి వచ్చాడట. వీళ్లని చదివించడానికీ, వీళ్లని మర్యాదస్తులని చేయడానికి ఎంతెంత డబ్బు ఖర్చు చేస్తుంది ప్రభుత్వం! అయినా వీళ్లింతే. అడుక్కొని తినాలనీ, తాగాలనీ ధ్యాస తప్ప బాగుపడే లక్షణాలే వుండవ్.

ఇంకో అతను ఇండియన్ అబ్బాయి, సాట్ తన పేరు. అతను కాస్త నయం. చదువుకున్నవాడిలా వుంటాడు. కానీ యెందుకో చాలా దిగులుగా వుంటాడు. చిన్నవాడే పాపం. అయినా, ఆ ఇండియన్స్ కూడా తక్కువ వాళ్లేంకాదు. అన్ని వుద్యోగాలు వాళ్లే ఎగరేసుకుపోతున్నారు. టేక్సీ డ్రైవర్‌లూ వాళ్లే, సాఫ్ట్‌వేర్ వుద్యోగాల్లో వాళ్లే, హాస్పిటళ్లలో డాక్టర్లూ వాళ్లే. మాకు మిగిలేది రియల్ ఎస్టేటు, లేదా కార్ల సేల్స్‌మెన్ వుద్యోగాలే.

బయట చీకట్లో చెట్లన్నీ జుట్టు విరబోసుకున్న దెయ్యాల్లా వున్నాయి. ఈ ఎండాకాలపు వేడీ, దోమలూ, పురుగులూ! ఫోన్ పక్కన లేకుండా నిద్రెలా పడుతుందో ఏమో!

బానీ

ఇదెక్కడి హెల్త్ సెంటర్! యోగా, మెడిటేషన్ అట. నేనింత వరకూ ఎప్పుడూ వినలేదు. అమ్మ ఎలాగో డబ్బు జమచేసి కట్టి పంపించింది. అమ్మ ఆఫీసులో పనిచేసే కేతీ ఇక్కడ వారంరోజులు వున్నదట. చాలా ప్రశాంతంగా వుంటుందనీ, ఒక్కసారి ప్రయత్నం చేసి చూడమనీ అమ్మతో చెప్పింది. దాని ఫలితమే ఇదిగో ఇలా, ఇక్కడ.

నేను కుదురుగా, ఎవరితోటీ దెబ్బలాడకుండా వారంరోజులు వుండగలనని అమ్మ ఎలా అనుకుందో! ఎల్లుండికల్లా ఇక్కణ్ణించి వెళ్లిపోయే ఉపాయం వెతకాలి. నిజానికి, నాకెక్కడా, మా ఇంట్లో కూడా బాగుండదు. అంతా బాగానే వున్నట్టున్నా ఏదో అసౌకర్యం, చిరాకు నాకు. అందరూ నావంక వింతగా చూస్తున్నట్టు అనిపిస్తూ వుంటుంది, ఎందుకనో!

చుట్టూ వున్న తెల్లవారికి మమ్మల్ని చూస్తే ఎంత అసహ్యమో నాకు బాగా తెలుసు. అందుకే ఆ డేవిడ్ ఎప్పుడూ నావంక చిరాగ్గా చూస్తాడు. మా అబొరిజీన్ తెగలవాళ్లంతా సోమరిపోతులనీ, తాగుబోతులనీ, ప్రభుత్వం సొమ్ము తేరగా తింటున్నామనీ వాళ్లకనిపిస్తుంది. అందుకే నేను వాళ్లని తప్పించుకోని తిరుగుతాను. లిండా, నా తోడబుట్టిందే అయినా, చదువుకోని ఉద్యోగం సంపాదించుకుంది. నాకే ఎందుకో చదువు వొంటబట్టలేదు.

ఏదైనా చిన్న ట్రైనింగులాగా చేసి వుద్యోగం సంపాదించుకోని నా పొట్ట పోషించుకుంటే చాలని అమ్మ ఆశ. నిజమే, కానీ నన్నూ, నా వాలకాన్నీ చూసి ఎవరూ వుద్యోగం ఇవ్వట్లేదు. అందరికీ నచ్చేలా నవ్వు మొహం పెట్టుకొని మాట్లాడడం నాకు రావటంలేదు. దానికి మనసులో కొంచెం ప్రశాంతత వుండాలి. నాకెక్కడ నుంచొస్తుంది? చిన్నప్పుడు నేను పెరిగిన వూళ్లో పెరిగుంటే ఎవరికీ మనశ్శాంతి అంటే ఏమిటో కూడా తెలిసుండేది కాదు. అంత భయంకరంగా వుండేది. ఆ వూరినించి బయటపడడానికి అమ్మ పడరాని పాట్లు పడింది. బయటికొచ్చి బ్రిస్బేన్ నగరంలో ఒక మూల ఇల్లు తీసుకున్నాం కానీ, ఇంకా నాకా వూర్లో వున్నట్టే అనిపిస్తుంది.

డేవిడ్ నావైపు కోపంగా చిరాగ్గా చూస్తాడు కానీ, ఆ ఇంకో అబ్బాయి, ఇండియా నుంచి వచ్చాడట, అతని పేరు సాట్. అతను అసలు ఎవరివంకా చూడడు. ఏదో తన లోకంలో తనుంటాడు. అతనిలాంటి ఇమ్మిగ్రంట్స్‌ని చూస్తే నాకు ఒళ్లు మండిపోతుంది. తెల్లవాళ్లు దోచుకున్నది చాలక ఇప్పుడు వీళ్లు కూడా పడ్డారు మామీద. వాళ్లనే వొదిలించుకోలేక చస్తూ వుంటే, వీళ్లొకటా?

పొద్దున్న ఫోనూ, సిగరెట్లూ, బీరు బాటిలూ అన్నీ తీసుకున్నారు. రేపటివరకూ బీరు తాగకుండా వుంటే చచ్చిపోతానను కున్నాను కాని, పరవాలేదు, బాగానే వున్నాను.

బయట చల్లటి గాలీ, చందమామా వున్నా బాగాలేదు. చందమామ, వెన్నెల, అచ్చం మా వూర్లోలాగే వుంది. మా వూరంటే పెద్దగా ఇష్టం వుండకపోయినా, బయట ప్రపంచం కంటే అక్కడే సురక్షితంగా అనిపిస్తుంది నాకు. ముఖ్యంగా తాతయ్యా, ఆయన చెప్పే కథలూ గుర్తొచ్చినప్పుడు. ఇలాటి వెన్నెలలోనే ముసలి తాత ఎన్ని కథలు చెప్పేవాడు. పర్వతాల గురించీ, సముద్రాల గురించీ, చెట్ల గురించీ, ఎన్నో ఎన్నెన్నో కథలు. ఈ వెన్నెలలోంచి ఆ కథలు ఇంకా నాకు వినబడుతూన్నట్టే వుంది. తాతయ్య తప్ప తనని ప్రేమించేవాళ్లెవరూ లేరు ఈ ప్రపంచంలో. తాతయ్య చచ్చిపోయి పదేళ్లవుతుంది. ఆ తరవాతే అమ్మ నన్నూ, లిండానీ తీసుకొని బ్రిస్బేన్ నగరానికొచ్చింది.

ఇక్కడ మా బంధువులు చదువుకున్న స్కూల్లోనే నేనూ, లిండా చేరి చదువుకున్నాం. ఏదో రోజులు గడిచిపోయాయి. ఇక ముందెలా జరుగుతుందో! ఏదైనా పని చూసుకుంటే కానీ, అమ్మనీ నన్నూ పోషించుకోలేను. ముందసలీ వారంరోజులు గడిచి బయట పడితే చాలు.

సాత్విక్

బోలెడు డబ్బు కట్టి ఈ వారంరోజుల రిట్రీట్ ప్రోగ్రాంలో చేరాను. పైగా లీవు పెట్టి మరీ. ఏమైనా ప్రయోజనం వుంటుందో లేదో. అసలు, అయిదేళ్లప్పుడు స్కూల్లో చేరిన తరవాత ఇలా తీరుబాటుగా ఎప్పుడూ లేను.

స్కూలు రోజులు సరేసరి. స్కూలూ, హోం వర్కూ, పరీక్షల మధ్య చిక్కుకుపోయిన బ్రతుకు. స్కూలు లేని ఎండాకాలం సెలవులు, దసరా సెలవులూ, ఏ సెలవులైనా సరే అమ్మ ఏదో ఒక కోర్సులో చేర్పించేది. అదయ్యేసరికి మళ్లీ బడీ, పరీక్షలూ మొదలు. అంతే, అలా ఇంజినీరింగు వరకూ, ఆ తరవాత మాస్టర్స్ చదవడానికి మెల్బోర్న్ చేరుకోవడమూ, ఉద్యోగమూ, పరుగే పరుగు. ఎంతసేపూ ఏదో ఒకదాని వెనక పరిగెత్తడం తప్ప బ్రతుకులో ఇంకేదీ లేకుండా అయిపోయింది, అలవాటైపోయింది. ఉద్యోగంలో బాగానే నిలదొక్కుకునేసరికి పెళ్లి ప్రస్తావన రానే వొచ్చింది. నీరజ, తనకి బాగా నచ్చింది. హైదరాబాదు అమ్మాయే. పెళ్లికి ముహూర్తాలు కూడా పెట్టబోతూ వుండగా, సంబంధం కేన్సిల్

చేసారు. ఆమెకి పూర్వాశ్రమంలోని బాయ్‌ఫ్రెండ్ ఇప్పుడు పెళ్లికి ఒప్పుకున్నాడట. నా ఖర్మ!

ఇంకా నయం! వచ్చే నెల వారంరోజులు సెలవు పెట్టి ఆమెని సర్‌ప్రైజ్ చేద్దామనుకున్నాడు. వున్న పరువు మొత్తం పోయేది.

ఏదీ పట్టనట్టు వుండడానికి ప్రయత్నించాను కానీ, నిరాశగా, నిస్పృహగా అనిపించింది. తను మొత్తంగా డల్‌గా అయిపోతున్నా నని అనిపించింది. ఈ డిప్రెషన్ నుంచి బయటపడేది ఎలా అని ఆలోచిస్తూ వుండగా, ఈ యోగా మెడిటెషన్ సెంటర్ గురించి చదివి, ఇక్కడ చేరాడు తను. ఇప్పుడు ఇదెలా వుంటుందో చూడాలి.

ఇద్దరు టీం మేట్స్ా మహత్తరంగా వున్నారు! జానీ పొడుగ్గా, లావుగా, విషపు చూపులు చూస్తూ వుంటే, ఇంకో అతను డేవిడ్, కోపంగా కాదుకానీ, విచిత్రంగా చూస్తూ వున్నాడు. మరి వాళ్ల సమస్యలేమిటో, ఎందుకని వచ్చారో!

రేపు యోగా చేయిస్తారట. ఇంతవరకూ తను యోగాసనాలు వేయలేదు. రేపు ఒళ్లు వొంగుతుందో లేదో. పొద్దున రాగానే తీసు కున్న మొబైల్ ఫోను. ఇంతవరకూ ఇవ్వలేదు వాళ్లు. ఫేస్ బుక్కూ, ఇన్‌స్టాగ్రామూ చూసే అలవాటు పెద్దగా లేదు కానీ వాట్సాప్ చూడకుండా ఏదో ఇబ్బందిగా వుంది.

కిటికీ తెరలు తెరచి బయటికి చూస్తే, ఎంత అందంగా వుంది బయట ప్రకృతి! నిశ్శబ్దంగా, ప్రశాంతంగా, ఏదో రహస్యం చెప్తూ వున్నట్టు. నిద్ర బరువుగా కళ్ల మీద పడుతున్నా, మంచి నిద్రపట్టి చాలా రోజులైంది. ఇవాళైనా నిద్ర పడితే బాగుండు.

డేవిడ్

మూడు రోజులైంది ఇక్కడ.

మొదటిరోజు కొంచెం ఇబ్బందిగా, విసుగ్గా అనిపించింది. అసలు వూరికే మనకి ఇంకొకళ్లు 'అది చేయి, ఇది చేయకు,' అని చెప్తూ వుంటే వినడం మహా కోపం నాకు. పొద్దున లేచిన దగ్గరినించీ, కాఫీ దగ్గర మొదలైన డిసిప్లీన్ రాత్రి పడుకోవడం వరకూ ఒకటే బాదుడు.

తర్వాత రోజు నుంచీ అలవాటైంది. మొదటిరోజు ముగ్గురికీ యోగాసనాలు కొంచెం కూడా రాలేదు. సాట్ ఇండియన్ అబ్బాయే అయినా, మాకంటే ఇబ్బందిపడ్డాడు. ఆసనాలు వేస్తూ వుంటే కింద పడ్డాడు. అందరం ఒకటే నవ్వు! తరవాత నేనూ కింద పడ్డాననే అనుకున్నాను. కానీ, జానీ కింద పడకుండా గభాల్న వచ్చి పట్టు కున్నాడు. అంతలోకే నా మొహంలోకి ఇబ్బందిగా చూసి వది లేసాడు. దబ్బుమని కింద పడ్డాను. అందరూ మళ్లీ నవ్వులు! మా ఇద్దరికంటే జానీయే నయం. ఒక్కకాలి మీద కొంచెమైనా నిల బడ్డాడు.

మెల్లిగా లంచ్, డిన్నర్ ముగ్గురమూ కలిసి తినడం మొదలు పెట్టాము.

సాట్, పాపం బ్రేక్ అప్ నుంచి కోలుకుంటున్నాడు. ఇంకా పెద్ద వయసూ మించిపోలేదు, ఈ అమ్మాయి కాకపోతే ఇంకో అమ్మాయి దొరుకుతుంది, దానికంత డిప్రెస్ అవడం ఎందుకో! అసలు ఈ కాలం పిల్లలకి ఓపికే వుండదు. ఇండియాలో వాళ్ల కుటుంబం గురించి చెప్తూ వుంటే ఎంత ఆశ్చర్యం వేసిందో! ఈ అబ్బాయికి ఓ అమ్మాయిని చూసి పెట్టటానికి ఎంతమంది వున్నారు అతని వెనక అని ఒక్క క్షణం ఈర్ష్యగా కూడా అనిపించింది.

జానీని చూస్తే జాలేసింది. చదువూ రాక, ఏ ట్రైనింగూ లేక, వుద్యోగమూ రాక, బ్రతకడం ఎంత కష్టం! నిలకడ ఉన్నట్టే వున్నాడు, కానీ నమ్మాలోలేదో!

నిన్న రాత్రి డిన్నర్ తరవాత అందరమూ బయట నక్షత్రాల కింద కూర్చున్నాము. జానీ వాళ్ల తాతయ్య చెప్పే వింతైన కథలు చెప్పాడు. ఎంత బాగున్నాయి ఆ కథలు! చందమామ గురించీ, భూమిని గురించీ, నీటిని గురించీ, అన్నీ కలిసి వుండడం గురించీ, అబ్బ, యెంత బాగున్నాయో! ఆ కథలు వింటూ వుంటే, ఒకలాటి ప్రశాంతత మనసంతా నిండుతూ వుంది. ఎవరిమీదా ఎటువంటి కోపమూ లేని ప్రశాంతత!

ఆ చెట్లకింది నించి లేచి లోపలికి రావాలని అనిపించనేలేదు. మళ్లీ రేపు పొద్దునే లేవాలంటే పడుకోవాలని లోపలికొచ్చేసాను. పడుకుంటే అమ్మానాన్నా గుర్తొచ్చారు. నా పదేళ్ల వయసులో ఇద్దరూ విడిపోయారు. కానీ అంతవరకూ చాలా సంతోషంగా వున్నాము. అమ్మా నాన్నా నన్ను తీసుకొని జూ పార్క్‌కీ, గోల్డ్ కోస్టులో డ్రీం వర్ల్డ్‌కీ తీసికెళ్లేవాడు నాన్న. అమ్మ నవ్వుతూ వుండేది. పిక్‌నిక్ లంచ్ తయారుచేసేది. సాండ్‌విచ్‌లూ, కేకులూ, ఆపిల్ పళ్లూ. యెంత బాగుండేవి ఆ రోజులు. అసలా తరవాత తను బ్రతుకులో అంత ప్రేమని పొందిందేలేదు. తనని మళ్లీ అలా ప్రేమించే మనిషెవరైనా దొరికితే, రియల్ ఎస్టేటు బిజినెస్సేమిటి, ప్రపంచాన్నే దున్నేయడూ! కిటికీ తెరచి పడుకుంటే, చల్లటి గాలికి కమ్మటి నిద్ర వస్తుంది. ఎన్నాళ్లయింది ఇంత మంచి నిద్ర పట్టి!

జానీ

హమ్మయ్య! మూడు రోజులు ఎలాగో గడిపాము. యోగా ఏదో కొంచెం చేయగలుగుతున్నా కానీ, మెడిటేషన్ అయితే కొంచెం కూడా రావడంలేదు నాకు. కళ్లు మూసుకొని గాలి పీలుస్తూ వొదులుతూ వుండమంటే, నావల్ల కావడంలేదు. పైగా ఏదో గురక లాటి చప్పుడు. పాపం, సాట్ నవ్వాపుకోలేకపోయాడు. డేవిడ్ నిలబడి ఏదో ఆసనం వేయబోయి కింద పడ్డాడు. అసలు అతన్ని పట్టుకోని ఆపాలని నేనేమీ అనుకోలేదు కానీ, అధాట్న పట్టు కున్నాను. అయినా, కొంచెం భయం కూడా వేసింది, అతనికి కోపం వస్తుందేమోనని. అతనికి కోపమేమీ రాలేదు, పైగా 'థాంక్ యూ!' అన్నాడు.

సాట్‌ది బ్రేక్ అప్ సమస్య అయితే, డేవిడ్‌ది ఆరోగ్య సమస్య. ఏ సమస్యా లేని మనుషులెవరైనా వున్నారా అసలు?

రాత్రి భోజనం చేసి అందరమూ బయట చుక్కల కింద కూర్చున్నాము. అందరూ తమ గురించి ఏదైనా చెప్పాలని మా ఇన్‌స్ట్రక్టరు అనడంతో నేను తాతయ్య గురించి చెప్పాను. చిన్నప్పుడు తాతయ్య ఎన్నో కథలు చెప్పేవాడు నాకు! ఈ మాట అనగానే అందరూ ఒక కథ చెప్పమని బ్రతిమిలాడారు. నాకు చాలా సిగ్గూ మొహమాటమూ అనిపించాయి.

ఎలాగో గొంతు పెకిలించుకోని తాతయ్య ఎప్పుడూ చెప్పే 'ఇంద్రధనుస్సు పాము' కథ చెప్పాను. అందరూ చాలా బాగుందన్నారు. సాట్ అయితే నేను వాడే మాటలు చాలా వాళ్ల భాషలాగే వుందని చెప్పాడు. అన్నిటికంటే ఆశ్చర్యం, డేవిడ్ నా చేయి పట్టుకొని, 'నువ్వు ఎంత అదృష్టవంతుడివి,' అన్నాడు. తాతయ్యని తలచుకుంటే నాకెంత గర్వంగా అనిపించిందో!

డేవిడ్ పడుకోవడానికని తన గదిలో కెళ్లబోతూ వుంటే ఆపి, నా బాగులోంచి టీట్రీ చెట్టు ఆకులతో చేసిన ఆయింట్‌మెంట్ ఇచ్చాను. అమ్మమ్మ దగ్గర నేర్చుకొని అమ్మ చేసిందది. అది రాసుకొని పడుకుంటే దోమలూ, పురుగులూ కుట్టవు. అదే చెప్పి ఇచ్చాను డేవిడ్‌కి. అతను చెట్ల కింద కూర్చున్నంతసేపూ పురుగులు కుడుతున్నాయని తెగ బాధపడ్డాడు. అతని అవస్థ చూసి సాట్ నవ్వాడు కూడా!

ఫోను రోజుకొక్క గంట మాత్రమే ఇస్తున్నారు. భోజనం చాలా పలచగా వుంటోంది. యోగా చేసిన తరవాత, చేసే పనేమీ లేక పోవడంతో గంటలు గంటలు బయట నడిచి వొస్తున్నాను. ఒళ్లంతా అలసి, మంచి నిద్రొస్తూంది. బయట వెన్నెలలోకి చూస్తే అమ్మా, లిండానే గుర్తొస్తున్నారు. ఎలా వున్నారో ఏమో! రేపు ఇద్దరికీ మెసేజీ పెడతాను.

సాత్విక్

హమ్మయ్య! మూడు రోజులు గడిచిపోయాయి. మొదటిరోజు కంటే కిందటి రెండురోజులూ బానే గడిచిపోయయి. పగటిపూట ఎండ దంచుతోంది కానీ, సాయంత్రమయ్యేసరికి చల్లగా అయిపోతూ వుంది. తెల్లవారుఝామునే లేవడం కొంచెం కష్టంగానే వుంది. పొద్దున్నా సాయంత్రమూ యోగసనాలు వేయిస్తున్నారు. మిగతా ఇద్దరికంటే నేను ఫరవాలేదనిపించినా, నాకూ ఆసనాలు వేయడం పెద్దగా చేతకావడం లేదు. అయితే, నిన్న యోగా మాస్టరు చెప్పిన మాటలు నాకు బాగా నచ్చాయి.

'ఇదేమీ పోటీకాదు. మీకెంత వీలైతే అంతే చేయండి. అసలిదనే కాదు, బ్రతుకులో ఏ విషయాన్నైనా పోటీలా తీసుకోకపోతే, ప్రశాంతంగా చేసుకుంటూ పోవచ్చు,' అన్నాడాయన. నాకా మాటలెంత నచ్చాయో! పుట్టినప్పటినించీ అన్నిటికీ పోటీపడడం పాడు అలవాటైపోయింది. వొదిలించుకోవాలి.

ఆ తరవాత మెడిటేషన్ చేసినంతసేపూ ఆ ఒక్క ఆలోచన మీదే మనసు నిలిపాను! 'బ్రతుకులో ఏది పోటీకాదు,' అనుకుంటూ కూర్చున్నాను.

భోజనం నాకు బానే వుంది కానీ మిగతా ఇద్దరూ పాపం బాగా ఇబ్బంది పడుతున్నారు. అయినా పాపం ఏమనకుండా తింటున్నారు. మేం ముగ్గురమూ కాక ఇంకో తొమ్మిది మంది వున్నారు. ముగ్గురేసి సభ్యులతో నాలుగు జట్లు.

రాత్రి భోజనం చేసిన తరవాత అందరమూ ఆరు బయట నక్షత్రాల కింద కూర్చొని కబుర్లు చెప్పుకున్నాము. ఎప్పుడో చిన్నప్పుడు సెలవులకని అమ్మమ్మా వాళ్ల ఇంటికెళ్లినప్పుడు, అలా ఆకాశం కింద పడుకున్నాను. మళ్లీ ఇన్నేళ్లకి.

జానీ వాళ్ల తాతయ్య చెప్పిన కథ చెప్పాడు. నాకయితే అచ్చం మా తాతయ్య చెప్పిన కథల్లాగే అనిపించింది. మాటలకి వెతుక్కుంటూ, మెల్లటి మెత్తటి స్వరంతో జానీ కథ చెప్తూ వుంటే నాకు నిద్రొచ్చింది.

పూర్వం, అంటే చాలా చాలా యేళ్ల క్రితం, భూమి అడుగు పొరల్లో ఒక ఏడురంగుల 'ఇంద్రధనుస్సు పాము' వుండేదట. ఒకరోజు ఆ పాము నిద్ర లేచి, బద్ధకంగా ఒళ్లు విరుచుకొని భూమి కింద పాకుతూ విహరించిందట. అది పాకినంత మేరా, భూమి పైన పర్వతాలూ, పచ్చికబయళ్లూ, సరస్సులూ, నదులూ తయారయ్యాయట. ఆ తరవాత ఆ పాము గాలినీ, నీటినీ, నిప్పునీ, ఆకాశాన్నీ తయారుచేసి, 'మీరంతా వేరు వేరు, అయినా ఒక్కటే. అందుకే కలిసి ఒక్కటిగా వుండండి. ఒకే శరీరంలోని వేరు వేరు భాగాలమని గుర్తు పెట్టుకోండి,' అని చెప్పి పంపిందట.

ఎంత బాగుందీ కథ అనుకున్నాను. అలాగే మూతలు పడుతున్న కళ్లతో లోపలికొచ్చి పడుకున్నాను.

ఫోన్ లేదు, వార్తలు తెలియదు, ఫేస్‌బుక్కు లేదు, రీల్స్ అసలే లేవు. ప్రాణానికి ఎంత హాయిగా వుందో! బయట చల్లటిగాలీ, పలచటి వెన్నెలా! కథలో పాము చెప్పినట్టు అన్నీ కలిసిమెలిసి వున్నాయి.

డేవిడ్

అబ్బ! యెంత గండం గడిచింది. ఇంక ఒక్కరోజే, రేపటితో ఈ కార్యక్రమం అయిపోయి రాత్రికి ఎవరి ఇళ్లకి వాళ్లం వెళ్లిపోతాం అనుకున్నాం భోజనాలప్పుడు. కాస్త మనసుకి ప్రశాంతత చిక్కింది, కావాలంటే మళ్లీ ఇంకోసారి రావొచ్చు అనుకున్నాను. రాత్రి భోజనం చేసి, కాసేపు బయట అందరితోపాటు కూర్చొని వచ్చాను. నిన్న యోగా మాస్టర్ ఒక గిటార్ తెచ్చి ఎవరికైనా పాటలొస్తే పాడమన్నాడు. నేను గిటార్ అందుకొని ఏదో వొచ్చీ రాని పాట మొదలు పెట్టాను. నాకు గుర్తున్న 'సౌండ్ ఆఫ్ మ్యూజిక్' పాట ఎత్తుకున్నాను. చిన్నప్పుడు అమ్మ నేర్పింది ఆ పాటలన్నీ. సాట్ తనకీ ఆ పాట

లొచ్చని గిటార్‌తోపాటు గొంతు కలిపాడు. అందరం నవ్వుకుంటూ పాడుకుంటూ కూర్చొని, తొమ్మిదింటికి లేచి వొచ్చేసాము.

ఎప్పట్లానే తొందరగానే నిద్రపట్టింది.

నిద్రలో ఏదో కల. అమ్మా నేనూ నాన్నా కారులో వెళ్తూ వున్నాము. నేను పాడుతూ వుంటే నాన్న విసుక్కుంటూ వున్నాడు. ఇంతలో అమ్మ, 'ఏదో వాసనొస్తుంది కార్లోంచి, చూడు మార్టిన్,' అంటూ వుంది. నాన్న కారు ఆపి దిగి చూస్తూ వున్నాడు. బాగా కాలుతున్న వాసన. ఫైర్ ట్రక్కు గణగణా మంటూ శబ్దం చేస్తూ వొస్తుంది.

వులిక్కిపడి లేచాను. అంతటా దట్టంగా అలముకున్న పొగలు, చుట్టూ అందరి కేకలు, పరిగెడుతున్న శబ్దం, ఆకులు కాలుతున్న వాసన. ఒక్క ఉదుటున రగ్గు పక్కన పడేసి బయటికి పరిగెత్తాను.

బుష్ ఫైర్! ప్రతీ యెండాకాలం తప్పని సమస్య ఇది. మిగతా వారంతా యేరీ? చుట్టూ చూసాను. మాస్టర్, జానీ అందరినీ లేపుతున్నారు. తలుపులు తెరుచుకొని బయటికి వొచ్చిన వారిని ఒక మూలన నిలబడమని పంపుతూ, ఫైర్ సర్వీసెస్‌కి ఫోన్లు చేస్తూ, ఎవరినీ కంగారు పెట్టకుండా వుండడానికి ప్రయత్నిస్తూ వున్నారు.

సాట్ కనబడకపోయేసరికి చాలా భయం వేసింది. గబగబా బిల్డింగ్ లోపలికి పరిగెత్తాను అతని కోసం. అతని గది తలుపులు తెరిచే వున్నయి. బిల్డింగ్ అంతా వెతికాను.

ఆఖరికి బిల్డింగ్ వెనక వున్న కిచెన్ అంటుకోవడంతో దాని పైకి బకెట్లతో నీళ్లు గుమ్మరిస్తూ కనబడ్డాడు. ఒక్కక్షణం మనసు కుదుటపడింది. మా ఇద్దరితోపాటు ఇంకో ఇద్దరు వొచ్చి చేరారు. నలుగురం కలిసి అక్కడ రేగబోతున్న మంటలు ఆర్పేసాము. జానీ, యోగా మాస్టర్, ఇంకొందరి సాయంతో, అందరి సామన్లూ బయట వేసారు. మంటలు లేనట్టే అనిపించింది కానీ, ఫైర్ సర్వీసెస్ వాళ్లు వొచ్చి నిర్ధారణ చేసేవరకూ, ఎవరమూ బిల్డింగు లోపలికెళ్లొద్దనీ, అక్కడే ఒక్క దగ్గర కూర్చోవాలనీ చెప్పారు మాస్టర్. బ్రతుకు జీవుడా అనుకుంటూ కూర్చున్నాము.

గంటన్నర క్రితం, గాలిలో ఏదో వాసన తేడాగా వొస్తుందని, జానీ లేచి మాస్టర్‌నీ ఇతర సిబ్బందినీ లేపాడట. క్షణాల్లో మంటలు అలుముకున్నాయి.ఫైర్ సర్వీసెస్ వొచ్చి అంతా సరిచూసి మమ్మల్ని లోపలికి పంపేసరికి దాదాపు తెల్లవారింది.

జానీ

ఇవాళ భోజనం చేసి చాలాసేపు బయటే కూర్చున్నాను. లోపలికొచ్చి పడుకుందామనుకుంటూ వుండగా గాలిలో ఏదో తేడా, ఏదో వాసన. నిద్ర పట్టలేదు. ఇంకొంచెం సేపయాక వుండబట్టలేక యోగామాస్టర్ దగ్గరికెళ్లి చెప్పాను. మేము మాట్లడుకుంటూ వుండగానే, చెట్లలో మంటలు మొదలయ్యాయి. ఎవరో ఎక్కడో సిగరెట్టు పీక పడేసి వుంటారు. అది అంటుకుంది. మంటలు అంటుకోవడం నాకేమీ కొత్తకాదు. అందరినీ నిద్రలేపి బయటికి తీసుకొచ్చాం.

మనుషులనీ సామాన్లనీ బయటికి చేరవేస్తూ వుండగానే, డేవిడ్ బయటికొచ్చాడు. నేను మాట్లాడుతూ వుండగానే, డేవిడ్ సాట్ కోసం వెతకసాగాడు. బిల్డింగులోకి మళ్లీ వెళ్లడం మంచిదా కాదా అని నేను ఆలోచిస్తూ వుండగానే డేవిడ్ లోపలికెళ్లిపోయాడు. అతని ధైర్యమూ, తనకేమీ కానీ సాట్ గురించి అతనికున్న అక్కరా చూసి మెచ్చుకోకుండా వుండలేకపోయాను.

ఆ తరవాత తెలిసింది, వాళ్లిద్దరూ కలిసి వెనక వున్న వంట శాలలమీద నీళ్లు గుమ్మరించి మంటలు చల్లార్చారని.

అంతా ముగిసిన తరవాత యోగామాస్టరూ, మిగతా అందరూ నన్ను పొగుడుతూ వుంటే నన్ను సిగ్గూ మొహమాటమూ ఉక్కిరిబిక్కిరి చేసాయి. నేనేనా, ప్రాణాలకి తెగించి అందరినీ కాపాడాలని ప్రయత్నించింది, అని ఆశ్చర్యం వేసింది కూడా. అసలింత వరకూ నాకు చుట్టూ వుండే మనుషులంటే అసహ్యం. అందరూ నన్ను అసహ్యించుకునేవారే అనే నమ్మకం వుండేది. అది నిజం కాదు, నన్ను ఇష్టపడేవారూ వుంటారు. నాది ఎవరికి పనికిరాని జన్మ కాదు. ఇవాళ నావల్ల కొన్ని ప్రాణాలు ముప్పు తప్పించుకున్నాయి. ఈరోజు తరవాత చాలామంది నన్ను ఇష్టంగా గుర్తు పెట్టుకుంటారు. నేనెవరికంటే భిన్నమయిన వ్యక్తిని కాను.

ఒకలాటి ప్రశాంతతా, సంతోషమూ, ఆత్మవిశ్వాసమూ నన్నావరించాయి.

సాత్విక్

నాకింకా అంతా కలలా వుంది. నిద్రపోయే ముందు, ఏదో పుస్తకం చదువుతూ, అలాగే నిద్రలోకి జారిపోయాను. మధ్యరాత్రి కలకలం, అడుగుల చప్పుడూ అవడంతో నిద్ర లేచాను. బయటి కొచ్చేసరికి యోగామాస్టరూ, జానీ, ఇంకొందరూ హడావిడిగా అందరినీ నిద్రలేపి గబగబా సామన్లతో బయటికొచ్చేయమని చెప్తూ వున్నారు. నేనూ వారితోపాటే నా బాగు తీసుకొని బయటికొచ్చాను. అంతా కలిపి బిల్డింగులో పాతిక, ముప్ఫైమందిదాకా వున్నాము. నేను బిల్డింగు వెనకవైపు ఎవరైనా వున్నారేమో చూద్దామని వెళ్లాను. అక్కడ కిచెన్ బిల్డింగు అంటుకోని మంటలు మొదలయ్యాయి. స్మోక్ డిటెక్టర్ కీచుమంటూ అరవడం ప్రారంభించింది.

ఇంకా మిగతావారు ఇటువైపు ఎవరూ రావడంలేదు. అందరూ బిల్డింగు ముందు భాగంలోనే వున్నట్టున్నారు. బిల్డింగులో కూడ అక్కడక్కడా మంటలు మొదలైనా, ఇంకా పూర్తిగా రాజుకో లేదు.

ఏమీ తోచలేదు. పక్కనే వున్న చిన్న బాత్రూములోకి వెళ్లి చూసాను. ఒక బక్కెట్టు కనిపించింది. దాన్లో నీళ్లు పట్టి వంటగది గోడలపై వున్న మంటల పైన గుమ్మరించాను. నాతోపాటు ఇంకొకరూ, ఆ తరవాత ఇంకొకరూ, అందరం కలిసి నీళ్లు కుమ్మ

రించడం మొదలుపెట్టాము. అయినా మంటలు అంతకంతకూ పెద్దగా అవుతున్నట్టే అనిపిస్తూ వుంది. ఇంతలో డేవిడ్ వచ్చాడు. ఒక్క క్షణం చూసి, మళ్లీ వెనక్కి బిల్డింగు లోపలికి పరిగెత్తాడు.

తలుపు పక్కగా తగిలించి వున్న నీళ్ల పైపుని తీసుకొని, అది తగిలించి వున్న పంపుని పూర్తిగా తిప్పి, నీటిధారని మంటల వైపు తిప్పాడు. మంట అయిదారు నిమిషాల్లో అదుపులోకి వచ్చింది.

అప్పటికిగానీ అందరమూ ఊపిరి పీల్చుకోలేదు. మిగతా అందరితోపాటు బిల్డింగు ముందుకొచ్చి కూర్చున్నాము. అందరూ మాట్లాడుకుంటున్నారు కానీ, నాకు నిశ్శబ్దంగా వుండాలని వుంది.

నాకసలు నమ్మలేనట్టుగా వుంది. ఇన్ని రోజులు నేను పిరికి వాణ్ణనీ, ఏ చిన్న సమస్య ఎదురైనా పారిపోతాననీ, నేనే కాదు, నేను తెలిసిన అందరూ అనుకునేవారు. అదెంత అబద్ధం!

డేవిడ్, జానీ, నేను, ముగ్గురమూ ఎంత విభిన్నమైన మనుషులమూ, విభిన్నమైన పరిస్థితుల్లోంచి వచ్చినవాళ్లమూ అయినా, ఒక పరిస్థితిలో ఒకేలా స్పందించాము.

మనమంతా వేరువేరు, కానీ ఒక్కటే! నవ్వొచ్చింది నా ఊహకి. తాతయ్య కథలో చెప్పింది ఇదే కాబోలు. 'మీరంతా వేరు వేరు, అయినా ఒక్కటే. అందుకే కలిసి ఒక్కటిగా వుండండి,' అన్నది ఇంద్రధనుస్సు పాము.

తెలతెల వారుతూ వుండగా అందరమూ లోపలికొచ్చాం. హాల్లోనే తలా ఒక మూల ఊరికే నడుం వాల్చాం. వేకువజాము చల్లటి గాలీ, సూర్యకాంతీ వెచ్చగా గదంతా పర్చుకుంటూ వుండగా, మెల్లగా అందరమూ కలిసికట్టుగా నిద్రలోకి జారిపోతూ వున్నాం. 'అందరం వేరు వేరే, కానీ అందరమూ ఒక్కటే,' నిద్రలోకి జారుతూ ఆ ఒక్క ఆలోచనే మనసులో మిగిలిపోయింది.



బ్రిస్బేన్ నగరంలో నివసించే శారద తెలుగులో, ఇంగ్లీష్‌లో కథలు, అనువాదాలు చేస్తూ వుంటారు. 1996లో మొదలైన కథారచనతో దాదాపు నలభై తెలుగు కథలు, ఇరవై అనువాద కథలూ ప్రచురించారు. రెండు కథాసంపుటాలు 'నీలాంబరి', 'మలయ మారుతం' వెలువరించారు. అనువాద నవల వీలునామా, తెలుగు నవల 'తమసోమా జ్యోతిర్గమయా' 'శంకరాభరణం' అనువాద కథల సంపుటి వెలువరించారు. నెచ్చెలి మాసపత్రికలో 'విజ్ఞాన శాస్త్రంలో వనితలు' శీర్షికన మహిళా శాస్త్రవేత్తలను పరిచయం చేస్తున్నారు. కథారచనతోపాటు సంగీతం ప్రియమైన వ్యాపకం. నీలాంబరి బ్లాగు నిర్వహిస్తున్నారు.



This souvenir is designed by

అక్షర క్రియేటర్స్

AG-2, 'A' Block, Mathrusri Apartments
Hyderaguda, Hyderabad 500 029
Phone: 99496 56668; Email: sakshara@gmail.com



నిజం

మోదుగు శ్రీసుధ

ఇంకో ఇరవైరోజుల్లో ఇండియాకి వెళ్లాడానికి అన్నీ ప్లాన్ చేసుకున్నా. వాసు కూడా నాతో వస్తానని చెప్పాడు.

ఈలోగా న్యూస్, మా అపార్టమెంట్‌లో ఉండే మార్టిన్‌ను ఎవరో షూట్ చేసారని.

ఎంక్వైరీ కోసం పిలిచారు. వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో కూర్చున్నా. వాళ్లు నాతో చాలా మర్యాదగా మాట్లాడుతున్నారు. బహుశా నేను ఇండియన్ అని కావచ్చు, లేక అమ్మాయినని అయినా కావచ్చు.

లేడీ కాప్ అడగడం మొదలుపెట్టింది.

"మీకు మార్టిన్ తెలుసా?"

'తెలుసా?' అంటే శుక్రవారం నాడు పెద్ద శబ్దాలతో వినబడే మ్యూజిక్ వల్లో, నిర్లక్ష్యంగా కార్ డ్రైవ్ చేసే పద్ధతివల్లో, చిన్న చిన్న బట్టలేసుకునే రకరకాల కొత్త అమ్మాయిలు అప్పుడప్పుడు కారిడార్‌లో కనిపించడంవల్లో, వాచ్‌మెన్ పీటర్‌వల్లో అతడు నాకు తెలుసు అని అనిపించేది.

అవేమీ చెప్పకుండా క్లుప్తంగా, "అతడు పైన పెంట్‌హౌస్‌లో ఉంటాడు," అని మాత్రమే చెప్పా.

"అతడితో మీకేమన్నా పరిచయం ఉందా?"

ఆ రాస్తున్న లేడీ కాప్ కొద్దిగా ముందుకు వంగింది. ప్రశ్న అడిగిన తీరే భిన్నంగా అనిపించింది.

"ఎప్పుడైనా ఎదురైతే 'గుడ్ మార్నింగ్' 'గుడ్ ఈవెనింగ్' అంతే. ప్రత్యేకమైన పరిచయం లేదు."

నిజంగా లేదా?

వారంరోజుల క్రితం మార్టిన్ కారిడార్‌లో ఎదురై, పనే గురించి హెచ్చరించాడు.

"పనే మీ ఇంటికి రాకుండా చూసుకో. వస్తే నువ్వే ఇబ్బందుల్లో పడతావ్," అని చెప్పాడు.

కానీ నేను అది కూడా చెప్పలేదు.

"ఇంకా..." అని ఆ లేడీ కాప్ నావైపు తదేకంగా చూస్తోంది. నా జుట్టు వైపు ఇష్టంగా చూసింది. ఇక్కడి వాళ్లకి ఇండియన్ జుట్టు అంటే చాలా ఇష్టం అని నాకు తెలుసు.

నా కళ్లలో ఏమి చూసిందో, "మీరేం భయపడవద్దు, ఇది ఫార్మాలిటీ మాత్రమే," అంది.

ఆ లేడీ కాప్‌కి పెద్దగా అనుభవం లేనట్టు కనిపిస్తోంది. కొత్తగా పోలీస్ ఉద్యోగంలోకి వచ్చినట్టుంది. ఆమె కళ్లలో ఇంకా దయ కనిపిస్తోంది. ఆమె ఇప్పటికీ మనుషుల్లో మంచిని చూస్తోంది.

లోపల నుండి ఆఫీసర్ వచ్చాడు.

"మిస్ పొన్ని, మీతో మాట్లాడాలి. లోపలికి వస్తారా?" అన్నాడు.

లోపలికి వెళ్లా.

నిజం చెప్పడం మంచిదా? వాళ్లు ఇది నాకిచ్చిన అవకాశమా?

"మీరు ఏమైనా గమనించినా, ఎవరిపైనైనా అనుమానం వచ్చినా, లేదా కొత్త వ్యక్తుల గురించి తెలిసినా మాతో చెప్పండి. మీ పేరు బయటకు రాకుండా చూస్తాం," అన్నాడు.

"సరే అండి," అని చెప్పి బయటకు వచ్చేశాను.

నా ముఖాన్ని ఎవరైనా పరిశీలంగా చూస్తే, నేనేదో దాస్తున్నా నని అర్థమైపోతుందేమో అనిపించింది.

రెండు రోజుల తర్వాత మార్టిన్ చనిపోలేదని, అతను హాస్పిటల్లో కోలుకుంటున్నాడని చెప్పారు. గ్యాంగ్‌స్టర్ కావడంతో పోలీసుల అదుపులో ఉన్నాడని తెలిసింది.

పీటర్ అన్నాడు, "మార్టిన్ కాల్చింది తన సిస్టరే, కానీ మార్టిన్ పోలీసులకు తానే కాల్చుకున్నట్టు చెప్పాడట."

సెక్యూరిటీ గార్డులు ఎలా ఇలాంటి విషయాలు తెలుసు కుంటారో తెలియదు!

దాంతో షనే గురించి పోలీసులకి చెప్పాలా వద్దా అన్న నా సమస్య తీరిపోయింది.

ఈ లోపలే వాసు హడావుడిగా ఫోన్ చేసి, "ఫ్యామిలీ ఎమర్జెన్సీ," ఇండియా వెళ్తున్నాను అని చెప్పి వెళ్లిపోయాడు.

వాసు వాళ్ల పాపకి బాగాలేదని వెళ్లాడని అతని క్లోజ్ ఫ్రెండ్ తరువాత చెప్పాడు.

వాసుకి పెళ్లైన విషయం ఇప్పటివరకు వాసు నాకు చెప్పక పోవడం ఆశ్చర్యంగా అనిపించింది.

నేను ఈ దేశానికి వచ్చి మూడు సంవత్సరాలైంది. నా కాంట్రాక్టు పీరియడ్ రెండు సంవత్సరాలు. ఆ రెండేళ్లు ముగిసిన తర్వాత ప్రతి ఆరు నెలలకు కాంట్రాక్టు పొడిగిస్తున్నారు. మాతో వచ్చినవాళ్లు నెమ్మదిగా వెళ్లిపోయినా నేను, వాసు మిగిలిపోయాము. టెక్నికల్‌గా నేను సౌండ్‌గా ఉండడం వల్లనేమో, నాకు మంచి పేరే ఉంది అక్కడ. నాతోపాటు వాసు ఉండిపోవడానికి కారణం అతని తెలివితేటల కంటే కూడా అతని ఓవర్ స్మార్ట్‌నెస్. వాసు నేనేదో తనకు ఎంతో దగ్గర మనిషిలాగా సలహాలు ఇచ్చేవాడు. నన్ను ప్రొటెక్ట్ చేస్తున్నట్లు ప్రవర్తించేవాడు. నామీద చాలా గౌరవం ఉన్నట్లు ఉండేవాడు. పనిచేయడానికి వచ్చిన ఆరుగురిలో వాసూ, నేనూ తెలుగువాళ్లం కావడం వల్లనేమో అతనిమీద ఒక సాఫ్ట్ కార్నర్ ఉండేది.

మేం వచ్చిన ఆరు నెలలకే షనే మా ఆఫీస్‌లో జాయిన్ అయింది. పని విషయంలో స్మార్ట్‌గా ఉండేది. ఇంటర్న్ వచ్చిన షనేను త్వరగానే ఫుల్ టైం తీసుకున్నారు. ఆమె ముఖంలో ఏదో కళ ఎదుటి వాళ్లని ఆకర్షిస్తుందనుకుంటా. తను నవ్వడం తక్కువ. నవ్వినా, పెదాలను కొద్దిగా సాగదీసి వదిలేస్తుంది. చిన్న కళ్లు, సూటిగా ఉండే ముక్కు, పల్చటి పెదాలు, చిన్న ఎర్రని వెంట్రుక లతో ఉన్న గుండుతో బక్కపలచగా ఉండే షనేను వెనక నుంచి చూస్తే ఎవ్వరూ అమ్మాయని అనుకోలేరు. చాలా నిర్లక్ష్యంగా నడుస్తూ చేతిలో సిగరెట్‌తో అప్పుడప్పుడు కనిపించేది.

కంపెనీలో చాలామంది ఆమెను 'హూడీ గర్ల్' అని పిలుస్తారు. ఏ సీజన్‌లో అయినా, ఎంత వేడి ఉన్నా హూడీ వేసుకొని వచ్చేది. ఆమె వేసుకునే డ్రెస్, స్పోర్ట్స్ షూస్, ఇవన్నీ వర్క్ ప్లేస్ రూల్సుకు విరుద్ధమే. అయినా ఆమెకు ఎలాంటి ఇబ్బంది ఎదురవ్వడం నేను చూడలేదు. ఆఫీసులో ఆమెంటే భయపడేవాళ్లు ఎక్కువ. ఎందు కులే, ఈమెతో పెట్టుకోవడం? అనుకుంటారు. మా ఎం.డి.తో ఆమెకి ఏదో లింక్ ఉందని, అందుకే అంత పొగరుగా ఉంటుందని చిన్నపాటి రూమర్లు ఉండేవి.

షనే వచ్చిన కొత్తల్లో నన్ను ఇష్టపడేది కాదు. కానీ నా దగ్గర పని నేర్చుకోవాల్సిన అవసరం వలన నాకు దగ్గరగా ఉండాల్సి వచ్చింది. నెమ్మదిగా అది స్నేహంగా మారింది. మొదట్లో నా ఇంటి పేరుతో మిస్ పొన్ని అని పిలిచేది. నెమ్మదిగా లీల అనడం మొదలు పెట్టింది. సంవత్సరం క్రితం నేను ఇల్లు కోసం వెతుకుతుంటే, తక్కువ రెంట్‌కి ఒక మంచి అపార్ట్‌మెంట్ చూసింది.

అక్కడ తనకి తెలిసినవాళ్లు ఉన్నారని, సేఫ్ అని చెప్పింది.

ప్రతి శుక్రవారం తనతో కలిసి నైట్ బార్‌కి వెళ్లి బిల్ నేను పే చేసేదాకా వచ్చింది మా స్నేహం. షనే తాగుతుంది, కానీ తాగి నట్టుగా కనిపించదు. బార్‌లో కూర్చున్నప్పుడు మాత్రం మాటల మధ్యలో ఆమె స్టేట్‌మెంట్స్ ఇస్తూ ఉండేది.

"ఇక్కడ కొద్దిగా బలహీనంగా కనిపిస్తే ఉపయోగించుకోవా లని చూస్తారు. నువ్వు బలంగా ఉండాలి, లేక తెలివిగా అయినా ఉండాలి."

"ఎప్పుడూ మనుషులను నమ్మకు, నమ్మిన తరువాత మోసం గురించి ఏడవకు. నమ్మడం అనేది మనల్ని మనం చేసుకునే మోసం." ఇలా ఉండేది ఆమె ధోరణి.

సహజంగా ఆమె ఉండే నిర్లక్ష్యానికి, ఈ మాటలకి మధ్య చాలా అంతరం కనిపించేది. తన పర్సనల్ విషయాలు మాత్రం ఎప్పుడూ చెప్పేది కాదు.

అప్పుడప్పుడు నా గురించి కూడా అడిగేది. నేను ఫ్యామిలీ గురించి, నాన్న అంటే చాలా ఇష్టమని, చెల్లిని నేనే చదివిస్తున్నానని, ఇంట్లో అప్పులు తీర్చడానికే విదేశానికొచ్చినట్లు చెప్పేదాన్ని. ఆమెకు ఇండియన్లు గురించి, వాళ్లు ఫ్యామిలీకి ఇచ్చే విలువ గురించి, వాటిని కాపాడుకోవడానికి మేము చేసే త్యాగాల గురించి చెప్పేదాన్ని. ఇష్టంగా వినేది.

నెమ్మదిగా షనేకి ఫ్యామిలీ, అనుబంధాలు, ఇండియా గురించి ఆసక్తి పెరిగింది.

ఒక శనివారం సాయంత్రం షనే చాలా ఎమోషనల్‌గా ఉన్నట్లనిపించింది. మందు ముట్టుకోలేదు, ముఖంలో విషాదం కనిపించింది.

హఠాత్తుగా, "నువ్వెవరినైనా ప్రేమించావా?" అని అడిగింది.

"ప్రేమించా, కానీ అది నా గ్రోత్‌కి అడ్డం అవుతుందని వదిలేశా," అన్నా.

ఆమె నావైపు చూసి ఒకలాంటి నవ్వు నవ్వింది. ఆ నవ్వుని తర్జుమా చేసేంత ధైర్యం చేయలేకపోయా.

కాసేపాగి నెమ్మదిగా, "నీకు ఏమైనా అఫైర్స్ ఉన్నాయా?" అంది.

ఆ ప్రశ్న చాలా అవమానంగా అనిపించింది.

అది గమనించిందేమో, "తప్పుగా అనుకోకు, నేను మామూలుగా అడిగాను," అంది.

నేను సమాధానం ఇవ్వలేదు.

ఆరోజు కొత్తగా రెండు మూడు విషయాలు తెలిసాయి. ఆమెకి ఆమె ఫ్యామిలీ అంటే ఇష్టం ఉండదు. ఆమె కుటుంబ సభ్యులను ఎవరినీ కలవడానికి ఇష్టపడదు అని.

తరువాత నాలుగు రోజులకే షనే ఉద్యోగం రిజైన్ చేసిందని తెలిసింది. కనీసం నాతో ఒక్కమాట కూడా చెప్పలేదు.

వాసుని అడిగాను, షనే ఎందుకు రిజైన్ చేసిందని.

"వాళ్ల గురించి ఏమి చెప్తావ్, క్యారెక్టర్ లేని మనుషులు. ఎవడో దొరికుంటాడు, వెళ్లిపోయి ఉంటుంది," అన్నాడు.

అతడి గొంతులో హేళన, అంతకుమించిన చీప్‌నెస్. షనే వాళ్ల టీంలోనే ఉండేది. వాసు ఇక్కడివాళ్లను అలా ఎందుకు చూస్తాడో తెలియదు కాని, దాన్ని నా దగ్గర ఎప్పుడూ దాచేవాడు కాదు.

"ఆమెతో కాంటాక్ట్ ఉండకపోవడం మంచిది," అన్నాడు.

ఆఫీస్‌లో ఎవరో సీక్రెట్ బాయ్ ఫ్రెండ్ ఉన్నాడని, అతనికి పెళ్లై పిల్లలు ఉన్నారని తెలిసాక వెళ్లిపోయిందని, ఆమె అన్న గ్యాంగ్ స్టర్స్‌తో కలిసి తిరుగుతాడని... ఇలా రకరకాల రూమర్స్ వచ్చాయి ఆమె వెళ్లిపోయాక.

ఇన్ని రోజులు ఫ్రెండ్‌షిప్‌లో తను ఇవేవి చెప్పకపోవడంతో, 'ఆమె నిజంగా నా ఫ్రెండేనా?' అనే అనుమానం కలిగింది.

❖

ఇది జరిగి మూడు నెలల తరువాత షనే నుంచి మెసేజ్ వచ్చింది:

"లీలా, నాకు కొన్ని రోజులు నీ రూమ్‌లో షెల్టర్ కావాలి. ఇవ్వగలవా?"

"వీళ్లతో ఎంత స్నేహంగా ఉన్నా ఇంటికి తెచ్చిపెట్టుకోవద్దు," అని వాసు హెచ్చరించాడు.

అది నాతో షనేకి ఉన్న స్నేహం చూసి అన్న మాట కావచ్చు.

"షనేలాంటి వాళ్లతో స్నేహం మంచిది కాదు. ఎవరిని ఎక్కడ ఉంచాలో నీకు తెలియదు లీలా! ఇక్కడివాళ్లు చాలా అవకాశవాదులు."

"మనం ఏమో అవకాశం అంది పుచ్చుకొని ఇక్కడికి వచ్చాం, వీళ్లేమో అవకాశవాదులా," అన్నా కొంచెం గట్టిగానే. షనే నాకు అంత క్లోజ్ అని అప్పటిదాకా నేనూ అనుకోలేదు.

"చూడు లీలా, ఎదగడానికి, డబ్బు సంపాదించడానికి మనం ఇక్కడ రేయింబగళ్లు కష్టపడతాము. అదంతా మనకోసం కాదు. మన ఫ్యామిలీకోసం," అన్నాడు.

చాలాసార్లు ఫ్యామిలీకోసం అనే మాట నేను ఎంతలా వాడతానో, వాసు అంతకంటే ఎక్కువే వాడుతుంటాడు. ఈ తరహా మాటలు మేమే కాదు దాదాపు ఇండియన్స్ సంభాషణల్లో తరచుగా వినిపిస్తూనే ఉండేవి.

ఎన్ని మాటలు మాట్లాడినా, పదిరూపాయల లాభం వస్తుందని అనిపిస్తే, నా ఉద్యోగం పోయినాసరే, నన్ను తొక్కేస్తాడేమో వాసు అనిపిస్తుంది. అదేమాట వాసుతో అంటే, "లీల ఇక్కడ మనం బ్రతకాడానికి వచ్చాము, మనకోసం మనం ఆ మాత్రం స్వార్థంగా ఉండాలి కదా! నేను నీ ఉద్యోగం వరకు మాత్రమే చేయగలను, అదే షనే అయితే పదిరూపాయల లాభం ఉంటే నిన్ను చంపేస్తది కూడా," అంటాడు వాసు పెద్దగా నవ్వుతూ.

ఎందుకో షనే గురించి వాసుతో వాదించడం నాకు ఇష్టం లేకపోయింది. షనేను కాదనడానికి నాకు పెద్ద కారణం కనబడలేదు. నిజం చెప్పాలంటే, ఆమె గురించి తెలుసుకోవాలనే ఆసక్తి నాలో ఉందేమో అనిపించింది.

షనేకు రమ్మని చెప్పా.

షనే ప్రవర్తన ఇదవరకులాగా లేదు. చీకటి పడ్డాక వస్తుంది, తెల్లవారకముందే వెళ్లిపోతుంది. ఆమె ఇక్కడికి వచ్చేది ఏదో గమనించడానికి అన్నట్లుగా ఉండేది. నా వస్తువులన్నీ తనవిలా వాడుతుండేది. నన్ను ఎలాంటి అనుమతి అడగకుండా, కిచెన్‌లోకి వెళ్లి వంట చేసుకొని తినేది. నన్ను కనీసం తింటావా అని అడిగేది కాదు.

"నువ్వు వండుకున్నాక నన్ను కనీసం తింటావా అని అడగవేంటి?" అన్నా ఓ రోజు నవ్వుతూనే.

"అడగాలా నాకు తెలీదు," అంది. తన మాటలు నిజాయితీగానే అనిపించాయి.

ఒక్కోసారి నన్ను పరీక్షించడానికి వచ్చిందా? అన్నట్లుగా అనిపించేది. నా ముందు సోఫాలో జారిపోయి కాళ్లు టీపాయ్ మీద వేసుకొని టీవీ పెట్టుకొని ఫుట్‌బాల్ చూస్తూ కూర్చుంటుండేది. నేను పనిచేస్తున్నా, సాయం కావాలా అని అడగదు. వచ్చిన మూడు రోజులకే నాకు చిరాగ్గా అనిపించింది. షనే పద్ధతి నచ్చడంలేదు. వాసు మాటలే నిజం ఏమో అనిపించేది.

ఆ లోపు కారిడార్‌లో మార్టిన్ కలిసాడు.

''షనే ఇక్కడ ఉండటానికి వీల్లేదు. లేకపోతే నువ్వే ఇల్లు ఖాళీ చేయాల్సి వస్తుంది,'' అని బెదిరించి వెళ్లిపోయాడు.

తనకెవరో తెలుసని తక్కువలో అపార్ట్‌మెంట్ ఇప్పించింది షనే, అంటే మార్టినేనా తెలిసిన వ్యక్తి. వెళ్లి వెళ్లి వీళ్ల గొడవల్లో ఇరుక్కున్నానా అనిపించింది. షనేకి మార్టిన్ గురించి చెప్పి, 'వెళ్లిపో,' అన్నా.

"అతడు ఏమీ చేయడు, అతడు నా స్టెప్ బ్రదర్,'' అంది.

"మరి ఎందుకు బెదిరిస్తున్నాడు?'' అన్నా.

"నా బాయ్ ఫ్రెండ్ నన్ను మోసం చేసాడని కోపంతో మార్టిన్ అతడిని షూట్ చేస్తానని చెబుతున్నాడు. నేను అడ్డుకుంటున్నా. నన్నేమీ చేయడులే,'' అంది షనే.

అయినా వెళ్లమని అన్నా.

"ఇంకొన్ని రోజులు టైం ఇవ్వు,'' అంది.

స్టెప్ బ్రదర్ పక్కనే ఉన్నా షనే నా దగ్గర షెల్టర్ అడగడం, అంతా గందరగోళంగా అనిపించింది.

ఖరాఖండిగా, "వెళ్లిపోవాలి,'' అన్నా.

"ఇక్కడ ఉండనిచ్చినందుకు థాంక్స్. నువ్వు నాకు మంచి స్నేహితురాలివి,'' అని చెప్పి షనే వెళ్లిపోయింది. ఆమె వెళ్లిపోవడం రిలీఫ్ అనిపించింది.

ఆ తరువాత నాలుగు రోజులకు ఈ కాల్పుల గొడవ.

ఎయిర్‌పోర్ట్ చెక్ ఇన్ అయ్యాను. సెక్యూరిటీ గేట్ వైపు నడుస్తున్నా.

"లీలా!'' అని షనే పిలుస్తుంది.

ఉలిక్కిపడ్డాను.

షనే వేగంగా వచ్చి హత్తుకుంది.

"నిన్ను మిస్ అవుతానేమో అనుకున్నా, నన్ను మర్చిపోకు,'' అని చెక్కతో చేసిన చిన్న నల్ల పిల్ల బొమ్మ ఇచ్చింది. మార్టిన్ ఎలా ఉన్నాడు అని, ఇంకా ఏవో అనుమానాలు అడగాలనుకున్నా, కానీ నవ్వుతూ కామ్‌గా ఉండిపోయా.

షనేలో ఏదో మార్పు. బక్క పలచటి శరీరం పైన చిన్న బేబీ బంప్, ఉలిక్కిపడ్డా. షనే కళ్లు మెరుస్తున్నాయి.

చేతికి ఉన్న బ్రాస్లెట్ ఆమెకి పెట్టి, "నువ్వు నీలానే ఉండు, టేక్ కేర్,'' అన్నా.

"యు ఆర్ నాట్ ఓన్లీ మై ఫ్రెండ్, యు ఆర్ మై ఫ్యామిలీ,'' అంది షనే నన్ను చుట్టుకుంటూ,

ఏది ఫ్యామిలీనో, దేన్నీ ఫ్యామిలీ అంటారో షనేకి, మార్టిన్‌కి తెలిసినంతగా నాకేమి తెలుసు. సిగ్గుగా అనిపించింది.

ప్లేన్ గాల్లోకి ఎగిరింది.

చుట్టూ సముద్రం ఉన్న ఈ చిన్న ప్రదేశంలో మనుషులు ఎన్ని సముద్రాలు మోసుకుని తిరుగుతున్నారో! కిటికీకి తల ఆన్చి కళ్లు మూసుకున్నా, అక్కడక్కడా చుక్కల్లాగా కనిపించే సంగతులన్నింటి మధ్య గీతలేవో మెరుస్తున్నాయి. పొరలు పొరలుగా అనుమానాలు విడిపోతున్నాయి. చెవుల్లో గుసగుసగా షనే ఏదో చెప్పి నవ్వుతుంది.



శ్రీసుధ మోదుగు పల్నాడు జిల్లాలో జన్మించారు. ప్రస్తుతం జమైకా దేశంలో వైద్యవృత్తిలో కొనసాగుతున్నారు. 2017లో తన మొదటి కవితాసంపుటిని ప్రచురించారు. తదనంతరం మరో రెండు కవితాసంపుటాలు, మూడు కథాసంపుటాలు వెలువరించారు. 'అంతర్హిత' వీరి తొలి నవల.



డార్విన్‌తో కలిసి నడుస్తూ...

ఇంగ్లీష్: డా॥ నిమ్మగడ్డ శేషగిరి

తెలుగు: దొసతి అమరేంద్ర

పురాతన స్పానిష్ పలుకుబడిలో గలాపగోస్ అన్నమాటకు తాబేలు అని అర్థం. ఈ గలాపగోస్ అన్నది ముప్పై అయిదు అగ్నిపర్వత ద్వీపాల సము దాయం. ఎక్వదోర్ దేశానికి చెందిన ఈ ద్వీపాలు దక్షిణ అమెరికా ఖండానికి వెయ్యి కిలోమీటర్ల పశ్చిమాన ఉన్నాయి. ప్రధాన భూఖండానికి అంత దూరంగా ఉండటం వల్ల అక్కడి జంతుజాలం ఆ ప్రధాన ఖండంలోని జీవజాలానికి భిన్న మైన, తమకే ప్రత్యేకమైన లక్షణాలను సంతరించుకొని పరిణామం చెందింది. ఉదాహరణకు, ఈ ద్వీపాలలో మనకు రాకాసి తాబేళు కనిపిస్తాయి. ఎగరడం రాని, ఈత మాత్రమే నేర్చిన కార్మొరాంట్ (Cormorant) పక్షులు కనిపిస్తాయి. ఈదే సామర్థ్యం సంత రించుకొన్న మన తొండల్లాంటి ఇగ్వానాలు (Iguana) కనిపిస్తాయి.

ఫిబ్రవరి 9, 2023న నేను బాగా ఉదయమే నిద్రలేచాను. మూడున్నర దశాబ్దాలుగా నేను కలలు కంటోన్న గలాపగోస్ యాత్ర కార్యరూపం పొందుతోంది గదా అన్న ఉత్తేజంతో మనసంతా నిండిపోయింది. ఎంతో ఉత్సాహంగా టాక్సీ పట్టుకుని గుయాకిల్ ఎయిర్‌పోర్టుకు దారితీశాను. అక్కడ విమానం పట్టుకుని శాంతా క్రూజ్ ద్వీపంలోని పుయెర్తో అయోరా (Puerto Ayora) అన్న పట్టణానికి చేరుకోవాలన్నది ఆనాటి ప్రణాళిక.

విమానానికి ఇంకా గంట సమయముంది. ఒక బొలోన్ దె వర్దె, దానితోబాటు కాఫీ తీసుకుని నా దగ్గర ఉన్న 'లోన్లీ ప్లానెట్' గైడ్ పుస్తకంలో తలదూర్చాను. దాని పుణ్యమా అని నా టీనేజి దశలోని ఎన్నో జ్ఞాపకాలు మనసులో మెదిలాయి.

అది 1984-86 సంవత్సరాల్లో నేను ఇంటర్మీడియెట్ చదువు తోన్న సమయం. అప్పటి పాఠ్యపుస్తకాల ద్వారా గలాపగోస్ ద్వీపాల గురించి మొదటిసారిగా విన్నాను. మళ్లీ ఆ తెలుసుకోవడం కూడా రెట్టింపు ఊపుతో జరిగింది. బోటనీలోకి వెళితే గలాపగోస్,

జువాలజీలోకి వెళితే మరింత గలాపగోస్! అదిగో ఆ క్షణాల్లో, ఆ దినాల్లో నాలో గలాపగోస్ ద్వీపాల మీద ఆసక్తి వేళ్ళూనింది.

ఈ ద్వీపాలు ఛార్ల్స్ డార్విన్‌తో ఎంతగానో ముడిపడి ఉన్నాయి. అలాగే 1859లో డార్విన్ ప్రతిపాదించిన జీవపరిణామ సిద్ధాంతానికీ దానిలో అంతర్భాగమైన ప్రాకృతిక ఎంపిక (Natural Selection) అన్న అంశానికీ ఈ గలాపగోస్ ద్వీపాలలో ఆయన జరిపిన విస్తృత పరిశోధనలే పునాదిరాళ్లు అయ్యాయి. వాటి గురించి క్లాసు పుస్తకాల్లో తెలిశాక వెంటనే మా నాన్నతో కలసి, హైదరాబాద్ ఆబిడ్స్‌కు వెళ్లి, 'ఆన్ ది ఆరిజిన్ ఆఫ్ స్పీసీస్,' అన్న పుస్తకం కొనేశాను. అప్పటికి నా వయసు పద్దెనిమిది. ఇంటర్ ముగిసి మెడికల్ కాలేజీలో అడ్మిషన్ కోసం ఎదురుచూస్తోన్న సమయం. ఆ వేసవి సెలవుల్లో డార్విన్ పుస్తకాన్ని అక్షరం వదలకుండా మథించాను. నాకది ఇప్పటికీ మరువలేని మధురస్మృతి.

మరో దశాబ్దం తర్వాత యూకేలో స్థిరపడ్డాక డేవిడ్ అటెన్‌బరో అన్న ప్రకృతి చరిత్రకారుడు బి.బి.సి. కోసం రూపొందించిన డాక్యుమెంటరీలు విరివిగా చూశాను. నా ఆసక్తి మరోసారి పురివిప్పింది. ఆ ద్వీపాలకు వెళ్లాలన్న టీనేజి ఆలోచన యూకే గడ్డ మీద ఒక సంకల్పంగా గట్టిపడింది.

❖

నేను వెళుతున్న శాంతాక్రూజ్ ద్వీపంలో విమానాశ్రయం లేదు. ఆ పక్కనే ఉన్న బాల్ట్రా ద్వీపంలో దిగి, అక్కడ్నుంచి శాంతాక్రూజ్ చేరుకోవాలి. బాల్ట్రా ద్వీపంలోని సీమోర్ ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే నులివెచ్చని చిరుగాలి మాకు స్వాగతం పలికింది. గలాపగోస్ ద్వీపాల్లో అడుగు పెట్టనే పెట్టాను. అవును. కల నిజమయింది. మనసులో ఉద్వేగం. ఎయిర్‌పోర్ట్‌లోని ఎరైవల్స్ ప్రదేశానికి వెళ్లడానికి కాస్తంత నడవాల్సి వచ్చింది. చేరీ చేరగానే మాకు అక్కడ ఓ పసుపుపచ్చని ఇగ్వానా కనిపించి పలకరించింది. మనుషులున్నారు అన్న పట్టింపే లేకుండా నిశ్చింతగా తిరుగుతోందా ఇగ్వానా! గలాపగోస్ ద్వీపాల్లోకి అడుగుపెట్టిన కొద్ది నిముషాల్లోనే అక్కడి జంతుజాల ప్రతినిధి నాకు ఆహ్వానం పలికిందన్నమాట.

ఆ జలసంధి దగ్గర బోటు పట్టుకుని కాసేపు ప్రయాణించి శాంతాక్రూజ్ ద్వీపానికి చేరుకున్నాం. మా పుయెర్తో అయోరా పట్టణం ఆ ద్వీపపు అవతలి కొసన ఉందట. నలభై కిలోమీటర్ల దూరం. బస్సులోగాని, టాక్సీలోగానీ వెళ్లాలి. 'మనిద్దరం టాక్సీ తీసుకుందాం. ఖర్చులు పంచుకుందాం,' అన్నాడు మిగేల్, నా సహ ప్రయాణీకుడు. నేను సంతోషంగా ఒప్పుకున్నాను.

పుఎర్తో అయోరా అన్నది శాంతాక్రూజ్‌లోని ప్రధాన పట్టణం. మొత్తం గలాపగోస్ ద్వీపాల్లోకెల్లా పెద్ద ఊరు. ఆ ద్వీపాలలో అది చక్కగా కేంద్రస్థానంలో ఉంది; వాటిల్ని శోధించడానికి వచ్చేవారికి ఆ ఊరు ఎంతో అనువైన వేదిక.

మేమంతా చక్కని, పచ్చని చెట్లమధ్య సూటిగా సాగిపోతున్న తారురోడ్డు మీద ప్రయాణించాం. కొన్ని కొన్ని చెట్లు ఎంతో కొత్తగా అనిపించాయి. టాక్సీ అలా సాగుతూ ఉండగానే నాకు దూరాన రోడ్డు మధ్య ఓ బండరాయి కనిపించింది. టాక్సీ వేగం తగ్గించాడు డ్రైవరు ఏంజెలో. తీరా చూస్తే అది బండరాయి కాదు- రాకాసి తాబేలు! తాబేలు రోడ్డు దాటేదాకా ఓపిగ్గా కారు ఆపి, ఆ పైన ముందుకు ఉరికించాడు ఏంజెలో. ఇలా తాబేళ్ల ఉనికిని గురించి హెచ్చరించే సైన్‌బోర్డులు రోడ్డుమీద ఉండటాన్ని గమనించాను.

పుఎర్తో అయోరా పట్టణంలో గలాప గోస్ నేటివ్ హౌటేల్ అన్నచోట రెండు రోజులు గడపాలన్నది నా ప్రణాళిక. ఆ హోటలు చూడ్డానికి ఎపార్ట్‌మెంట్ల బిల్డింగ్‌లా ఉంది. నాకు పై అంతస్తులో గది ఇచ్చారు. చూడగా అక్కడి ఎపార్ట్‌మెంట్లలో కుటుంబాలూ పిల్లలూ నివసిస్తోన్న ఛాయలు కనిపించాయి. కాస్సేపటికల్లా ఆ అపార్ట్‌మెంటు యజమానులు ఉండేది కూడా అక్కడే అని అర్థమయింది. అంటే నేను చక్కని గృహవాతావరణంలో ఉండబోతున్నానన్నమాట.

హోటల్లో చెకిన్ చేసిన వెంటనే మరి ఆలస్యం చెయ్యకుండా రహదారులు పట్టుకునే ప్రయత్నం చేశాను. ముందే మాట్లాడుకున్న ప్రకారం మిగేల్‌ని దింపి అరగంటలో ఏంజెలో తిరిగి వచ్చాడు. ఆ ద్వీపాల్లో తిరగాలంటే రెండు పద్ధతులున్నాయి: గైడెడ్ టూరు తీసుకోవడం; టాక్సీ తీసుకోవడం. బాధ్యత ఎరిగిన స్థానికుని తోడు లేకుండా, యాత్రికులు ఒక్కళ్లమే తిరుగుతాం అంటే అక్కడ ఒప్పుకోరు. వెళ్లిన ప్రతిచోటా మన పేరూ పాస్‌పోర్ట్ నెంబరూ నమోదు చేసుకుంటారు. అక్కడికి ఏ సమయానికి వెళ్లాం, ఎప్పుడు వదిలిపెట్టాం అన్నది గమనిస్తూ ఉంటారు.

శాంతా రోసా అన్న చిరుపట్నం మీదుగా మేము ఎల్ చాతో రాంచ్ (El Chato Ranch) అన్న తాబేళ్ల రక్షిత ప్రదేశాన్ని చేరుకున్నాం. అక్కడ విజిటర్స్ సెంటర్ చేరుకుంటున్నప్పుడు పది పన్నెండు రాకాసి తాబేళ్లు కనిపించాయి. ఆ ప్రదేశం వాటి సహజ ఆవరణం. అక్కడ గడ్డిని కొరుకుతూ తాబేటి నడక నడుస్తూ అవన్నీ నింపాదిగా సాగిపోతున్నాయి. ఆ పక్కనే ఉన్న బురద గుంటల్లో కొన్ని తాబేళ్లు కనిపించాయి. మొత్తం మీద ఆ ముప్పై ఎకరాల ప్రాంగణంలో ఎక్కడ చూసినా తాబేళ్లే తాబేళ్లు.

యూరోపియన్లు ఈ పసిఫిక్ ప్రాంతపు పశ్చిమ ప్రాంతాల్లో మొట్టమొదటగా తిరుగాడి శోధించినప్పుడు ఈ గలాపగోస్ ద్వీపాలను తమ నిత్యావసర వస్తువులను తిరిగి నింపే ప్రకృతి స్థావరాలుగా ఉపయోగించుకునేవారట. తాబేలు నీరూ తిండీ లేకుండా ఏడాదిపాటు ఉండగలదు. అంచేత వీటిని యూరోపియన్లు 'ఆహార నిల్వలు'లాగా ఓడల్లో భద్రపరచుకొనేవారట. ఆ ప్రక్రియలో వందలాది తాబేళ్లు హతమయ్యాయి. ఆహారంగానే కాకుండా, తాబేళ్లలోని కొవ్వు భాగం దీపాల్లోకి నూనెగానూ ఉపకరించేది. మొత్తానికి ఆ తాబేళ్లు పెనుముప్పును ఎదుర్కొన్నాయి. అదృష్టవశాత్తూ మారిషస్ ప్రాంతాల్లోని డోడో (Dodo) పక్షుల్లాగా ఈ తాబేళ్లు పూర్తిగా అంతరించిపోలేదు. అయినా యూరోపి

యన్ను రాకముందు అక్కడ పదిహేను రకాల తాబేళ్లు ఉండేవి; ఇపుడు పన్నెండు రకాలే మిగిలాయి.

తిరుగు ప్రయాణంలో నేను మా పుయెర్తో అయోరా పట్టణంలోనే ఉన్న ఛార్ల్స్ డార్విన్ రిసర్చ్ స్టేషన్ (CDRS) దగ్గర దిగిపోయాను. ఆ పరిశోధనా కేంద్రంలో వందలాది సైంటిస్టులు పనిచేస్తున్నారు. గలాపగోస్ ద్వీపాలలోని విలక్షణమైన జీవజాలాన్నీ వృక్షసంపదనూ పరిరక్షించే కృషిలో నిమగ్నమైన శాస్త్రవేత్తలు వారు.

లోన్‌సమ్ జార్జ్ అన్న ఒంటరి ప్రాణి ఆ కేంద్రంలో నివసించిన పేరు పొందిన తాబేలు. బహుశా అది చరిత్రలోనే ఎక్కువగా పేరు పొందిన తాబేలు అను కొంటాను. తాను చెందిన తాబేళ్ల జాతి ఉపవర్గంలో, గలాపగోస్ ద్వీపాల్లో తిరుగాడుతోన్న చిట్టచివరి ప్రాణి లోన్‌సమ్ జార్జ్ అని శాస్త్రజ్ఞులు గుర్తించాక పరిశోధనా రంగంలో దానిమీద ఆసక్తి పెరిగింది. దానికి తోడును వెదికి ఆ ఉపవర్గం అంతరించకుండా చేద్దామని ప్రపంచవ్యాప్తంగా ప్రయత్నాలు జరిగాయి. జంతుప్రదర్శనశాలల్లోనూ, ఇతర తాబేళ్ల ఆవాసాల్లోనూ ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. చివరికి 2012లో ఆ లోన్‌సమ్ జార్జ్ తుదిశ్వాస విడిచింది. అప్పట్లో అది అంతర్జాతీయ వార్త అయింది. డేవిడ్ అటెన్‌బరో (David Attenborough), సైమన్ రీవ్ (Simon Reeve)లు బి.బి.సి. కోసం తీసిన డాక్యుమెంటరీల్లో ఈ లోన్‌సమ్ జార్జ్ ప్రముఖంగా కనపడుతుంది.

ఛార్ల్స్ డార్విన్ 1835లో గలాపగోస్ ద్వీపాలకు రావడం, పరిశోధనలు జరపడం వల్ల, ఆ ద్వీపాల ఉనికి ప్రపంచానికి తెలిసింది. మానవ సంపర్కంవల్ల అక్కడ జరిగిన, జరుగుతోన్న పర్యావరణ విధ్వంసం ప్రపంచం దృష్టికి వచ్చింది. అక్కడ తిరుగాడుతోన్న గొర్రెలు, పందుల సంచార క్షేత్రాలను పరిమితం చేయడం, కుక్కలు, పిల్లుల విహారాలను నియం త్రించడం జరిగింది. బయట నుంచి వచ్చిన మొక్కలూ వృక్షాల వ్యాప్తీ విస్తరణలకూ అడ్డుకట్టలు ఏర్పడ్డాయి. ఇన్నిన్ని రకాల శ్రద్ధలు ఫలించి, 1978లో యునెస్కోవారు ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించి ప్రకటించిన మొట్టమొదటి పట్టికలో గలాపగోస్ ద్వీపాలు చోటు చేసుకున్నాయి. 'సజీవ సంగ్రహశాలలు, జీవపరిణా మానికి విలక్షణ తార్కాణాలు,' అంటూ యునెస్కో ఈ ద్వీపాలను కీర్తించింది.

❖

డార్విన్ 1809లో ఒక సంపన్న ఆంగ్ల కుటుంబంలో పుట్టాడు. అందరూ అనుకునేట్టు అతను బయాలజీ చదివిన మనిషి కాదు. ప్రాథమికంగా అతడిని భూగర్భశాస్త్రం బాగా ఆకర్షించింది. బాగా చిన్నవయసులోనే 1831-36ల మధ్య ఐదేళ్లపాటు హెచ్.ఎమ్.ఎస్. బీగిల్ అన్న ఓడలో సుదూర ప్రాంతాలలో తిరిగి శిలలనూ అగ్నిపర్వతాలనూ పరిశీలిస్తూ గడిపాడు. ఆ యాత్రలో భాగంగా 1835లో గలాపగోస్ ద్వీపాల్లో కొంతకాలం గడిపాడు. తన ఐదేళ్ల శోధనాయాత్రలో గమనించిన వన్యమృగాల భౌగోళికవ్యాప్తికి (Global Spread) తోడుగా తాను విభిన్న ప్రాంతాల నుంచి సేకరించిన శిలాజాలలో కూడా అదేరకమైన వ్యాప్తి కనిపించడం అతడిని అబ్బురపరచింది. ఆలోచనలలో పడవేసింది. ఫలితంగా 1838లో ప్రాణుల ప్రాకృతిక ఎంపిక (Natural Selection) సూత్రానికి రూపకల్పన చేశాడు. ఆ అంశాన్ని కొంతమంది ప్రకృతి శాస్త్రవేత్తలతో చర్చించాడు. వీటన్నిటి వెనుకా ఆయన గలాపగోస్ ద్వీపాలలో గమనించిన విషయాలున్నాయి. అవి అతని ఆలోచనలను ఒక గాటిన పెట్టడానికి సాయపడ్డాయి. ఈ దశ ముగిశాక ఆయన మళ్లా తన ప్రాథమిక అధ్యయన అంశమైన భూగర్భశాస్త్ర శోధనలో నిమగ్నమయ్యాడు. ఆ సమయంలో తాను రూపొందించిన ప్రాకృతిక ఎంపిక సూత్రాన్ని గురించి, అందుకు అవసరమయిన శాస్త్రపరమైన బుజువుల గురించీ ఆలోచించడం, అన్వేషించడం కొనసాగించాడు. చిట్టచివరికి గలాపగోస్ వెళ్లి వచ్చిన 24 సంవత్సరాల తర్వాత 1859లో, తన పరిశోధనా ఫలితాలను ది ఆరిజిన్ ఆఫ్ స్పీసీస్ అన్న పుస్తకంలో పొందుపరిచాడు. ఈ పుస్తకంలో జీవరాసుల ఆవిర్భావాన్ని గురించి తాను చేసిన ప్రతిపాదనలకు గలాపగోస్ ద్వీపాల్లో సేకరించిన వివరాలు కొంతవరకు ఉపకరించాయి.

ఛార్ల్స్ డార్విన్ సనాతన సంప్రదాయానికి చెందిన మనిషి. అతని కుటుంబం వారికి బైబులే ప్రమాణం. జీవరాసుల ఉద్భవాన్ని గురించి బైబిలు చెప్పిన దానికి, తన పరిశోధనల ఫలితాలకూ మధ్య ఉన్న దాటలేని అగడ్త డార్విన్‌ను చాలా కాలంపాటు కలవర పరచింది. బైబిల్ ప్రకారం భగవంతుడు సమస్త జీవరాసులనీ వారం రోజుల వ్యవధిలో సృష్టించి భూమిమీద వదిలాడు. తాను గమనించిన జీవపరిణామ విధానం బైబుల్లో చెప్పిన దానికి పూర్తిగా భిన్నం. ఈ భిన్నత్వాల వత్తిడి పుణ్యమా అని డార్విన్ తన పరిశోధనలను ప్రపంచానికి వెల్లడించకుండా ఇరవై ఏళ్లు అట్టేపెట్టాడు. అలా వెల్లడించడానికి తన ప్రతిపాదనలకు ఊతమిచ్చే బుజువుల్ని- శిలాజాలతో సహా, ఎంతో విస్తారంగా సేకరించాక కూడా వాటి ప్రచురణ గురించి ఒకటికి పదిసార్లు ఆలోచించాడు. తాను తర్కీదు పొందిన ఒక మతాధికారి కూడా అవడంవల్ల తన పరిశోధనలూ ప్రతిపాదనలు సూత్రాలు సిద్ధాంతాలు- చర్చి అధినేతల నుంచి, వాటి అనుయాయుల నుంచి ఎంత తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కొంటాయో డార్విన్‌కు తెలుసు. అందుకే ఆ తటపటాయింపు. ఈలోగా ఆల్‌ఫ్రెడ్ రసెల్ వాలెస్ (Alfred Russel Wallace) అన్న శాస్త్రవేత్త కూడా జీవపరిణామం విషయంలో ఇలాంటి పరిశోధనలే చేశాడని, ఇలాంటి ప్రతిపాదనలే చేస్తున్నాడని, వాటిల్ని ప్రచురించబోతున్నాడనీ తెలియ వచ్చింది. అది విన్న స్నేహితులు వత్తిడి చేయగా డార్విన్, 'ఆరిజన్ ఆఫ్ స్పీసెస్' పుస్తకం ప్రచురించాడు. ఆ పుస్తకం ప్రచురించిన మొట్టమొదటి రోజునే కాపీలన్నీ అమ్ముడుపోయాయి. గత 165 ఏళ్లుగా ఆ పుస్తకం సాధించిన

విజయాలు, ప్రపంచం మీద చూపించిన ప్రభావం- అదంతా ఒక చరిత్ర.

డార్విన్ తన ప్రతిపాదనల్లో మనుగడ పోరాటం- స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్, ప్రాకృతిక ఎంపిక- నేచురల్ సెలెక్షన్ అన్న మాటల్ని వాడతాడు. వీటితోపాటు ముడివడి వినపడే మనుగడ యోగ్యత- సర్వైవల్ ఆఫ్ ది ఫిటెస్ట్- అన్న పదబంధాన్ని రూపొందించింది మనమింతకు ముందు చెప్పుకున్న ఆల్‌ఫ్రెడ్ రసెల్ వాలెస్. ఆ పదబంధాన్ని స్వాగతించిన డార్విన్, దాన్ని తన ప్రతిపాదనల్లో కూడా విడదీయలేని భాగంగా చేశాడు. స్థూలంగా చెప్పాలంటే 'ప్రకృతి తనంత తానుగా ఏ జీవరాశినీ ఎంపిక చేసి ప్రోత్సహించదు; వాటిలో జీవన పోరాట పటిమ, మనుగడకు యోగ్యత ఉన్నవే జీవపరిణామ క్రమంలో నిలదొక్కుకుని ముందుకు సాగుతాయి,' అన్నది ఈ ప్రతిపాదనల సారాంశం. డార్విన్ ఆలోచన ప్రకారం మళ్లీ 'యోగ్యత' అంటే శారీరకశక్తిపరంగానో, మేధోపరంగానో ముందు వరసలో ఉండడం కాదు; 'మార్పు'కు సత్వరమే స్పందించి నిలబడగలగడమే మనుగడ యోగ్యత.

❖

మధ్య యుగాలనాటి కోపర్నికస్‌కు, ఆధునిక యుగపు తొలిదినాల నాటి డార్విన్‌కూ మధ్య కొన్ని పోలికలు కనిపిస్తాయి. కోపర్నికస్ మతశాస్త్రం- థియాలజీ చదివాడు. పోలెండ్ దేశపు చర్చి వ్యవస్థలో భాగస్వామి. అతని పరిశోధనలు, వాటికి ఆధారంగా నిలిచిన శాస్త్రీయమైన లెక్కలూ కొలతలూ, 'మనకు తెలిసిన విశ్వానికి కేంద్రబిందువు భూగోళం కాదు, సూర్యమండలం,' అన్నాయి. ఈ మాట బైబిల్‌కు విరుద్ధం. అంచేత, తన సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని బయలుపరచడానికి కోపర్నికస్ ఎంతగానో సంకోచించాడు. చివరికి బిక్కుబిక్కుమంటూ బయటపెట్టి నప్పుడు, ఎందుకైనా మంచిదని సదరు పుస్తకాన్ని పోప్ పాల్‌కి అంకితమిచ్చాడు. ఇంత జాగ్రత్త తీసుకున్నా ఆ పుస్తకం చర్చి నిషేధానికి గురి అవనే అయింది.

డార్విన్ రిసర్చి కేంద్రం నుంచి మా హోటలుకు నడిచి వెళుతూ మర్నాడు గలాపగోస్‌లోని మరో ఆసక్తికరమైన ద్వీపం బార్తొలోమెకు (Bartolomeo) ఎలా వెళ్లాలా అని ఆలోచించ సాగాను. మా హోటలుకు ఎదురుగానే ఓ ట్రావెల్ ఏజెంట్ ఆఫీసు కనిపించింది. వెళ్లాను. అరవైల మధ్య వయసులో ఉన్న ఓ స్థూలకాయుడు ఎవరితోనో మాట్లాడుతూ కనిపించాడు. ఇలా రేపు బార్తొలోమెకు వెళ్లాలని ఉంది అని చెప్పాను. 'రేపు అక్కడికి ఒకే ఒక్క బోటు వెళుతోంది. 300 డాలర్లవుతుంది,' అన్నాడతను. చివరికి 260 డాలర్ల దగ్గర బేరం కుదిరింది.

మర్నాటి కార్యక్రమం స్థిరపరచుకున్నాక పుయెర్తో అయోరా పట్టణ పరిశీలన ఆరంభించాను. సాగరతీరాన నడక ఆరంభించాను. అక్కడ ఉన్న చార్ల్స్ డార్విన్ ఎవెన్యూ అన్న వీధి- రెస్టరెంట్లు, షాపులు, చిన్న చిన్న మ్యూజియమ్‌లు, చిట్టి పొట్టి



మాన్యుమెంట్‌లు, ట్రాఫిక్ ఏజెంట్‌ల ఆఫీసులు, వాటన్నిటిలోకి వచ్చి పోయే మనుషులు- బాగా కళకళలాడుతూ కనిపించింది. ఆ మెయిన్ రోడ్డు నుంచి పక్కకు మళ్లే చిన్న వీధుల్ని గమనించినపుడు అక్కడ ఓ ఫుడ్ స్ట్రీట్ దర్శనమిచ్చింది. సహజంగానే ఆ వీధి దుకాణాల్లో సీ-ఫుడ్ విరివిగా దొరుకుతోంది.

నింపాదిగా ఆనాటి అనుభవాలను నెమరు వేసుకుంటూ హోటలు కేసి నడిచాను. మార్కెట్ వీధులకు పెడగా ఉన్న మా హోటల్లో, ఆ పొద్దుపోయిన సమయం సద్దుమణిగి ఉంటుందను కున్నాను. కానీ అక్కడ ఉత్సవ వాతావరణం పలకరించింది. స్థానిక జనాలంతా పోగుపడి కనిపించారు. లైట్ మ్యూజిక్ సాగిపోతూ ఉంది. ఏమో తెలియని శక్తి నిండిన స్పానిష్ సంగీతం పరిసరాలను ఆవరించింది. నేను ఒక పక్కన చేరి ఆ సంగీతాన్ని ఆస్వాదించ సాగాను. ఆ ఉదయం రిసెప్షనిస్టుగా పరిచయమయిన పాబ్లో ఆ క్షణాన వెయిటర్ అవతారం ధరించి కనిపించాడు. నేను వద్దు వద్దన్నా వినకుండా, 'మా హోటలు తరపున కానుక,' అంటూ ఓ బీరు చేతికి అందించాడు. ఆ చల్లని బీరుని గుటకలు వేస్తూ మరి మూడు పాటలు విన్నాను. విన్నాక మెల్లగా నా గదికి చేరి పడక ఎక్కాను.

❖

గలాపగోస్‌లో రెండవరోజు ఉదయాన అనుకొన్న ప్రకారం రేవు ప్రాంతానికి చేరుకున్నాను. అల్పాహారంగా ఓ బొలోన్ దె వర్దె అంది పుచ్చుకున్నాను. నవ్వొచ్చింది, వారం రోజులుగా ఎక్వదోర్‌లో ఉంటున్నాను గదా, అసలు సిసలు ఎక్వదోరియన్‌గా మారుతున్నా నన్నమాట!

నేను ఎక్కింది కూర్చోడానికీ భోజనాలకూ విడివిడి విభాగాలున్న, సిబ్బంది కోసం పడకగదులున్న, యాట్ (yacht) వర్గానికి చెందిన పెద్ద సైజు బోటు. ఫిలిప్ అన్న వ్యక్తి మా గైడు. కెప్టెన్‌తో బాటు మరో ఇద్దరు సిబ్బంది ఉన్నారు. నాలుగు పెద్ద వయసు అమెరికన్ జంటలు, నలభైలలోని ఓ ఇటాలియన్ వ్యక్తి, మలి ఇరవైలలోని ఓ ఎక్వదోర్ యువతి, నేను- ఇదీ మా యాత్రిక సమూహం. ఆ అమెరికన్ జంటలకు పూర్వపరిచయాలు ఉన్నాయి. మేమంతా యాట్ ఎక్కాక, పరస్పర అభివాదాలు ముగిశాక, ఆ అమెరికన్ జంటలు తమతమ కబుర్లలో మునిగిపోయాయి. ముందుకు వెళితే చక్కని దృశ్యాలు చూడవచ్చునన్న ఆలోచనతో

నేను ఫ్రంట్ డెక్‌కి చేరుకున్నాను. అక్కడ ఆ ఎక్వడోర్ యువతీ ఇటాలియన్ వ్యక్తీ సూర్యస్నానంలో మునిగిపోయి కనిపించారు. వాతావరణం చక్కని సూర్యరశ్మితో నిండి ఉంది. ఎంతో ఆహ్లాద కరంగానూ ఉంది. నన్ను గమనించిన వాళ్లిద్దరూ ఉత్సాహంతో పలకరించారు.

మేము వెళుతోన్న దారిలో ఏవేవో చిరుద్వీపాలు కనిపించాయి. గైడు ఫిలిప్ సాయంతో అక్కడ కనిపించిన పక్షులను గుర్తుపట్టే ప్రక్రియలో పడ్డాం. నీలి కాళ్ల బూబీలు, ఎర్రకాళ్ల బూబీలు, నజ్కా బూబీలు, పెలికన్లు కనిపించాయి. ద్వీపాల ఒడ్డున విశ్రమిస్తున్న సీల్‌లు, సీ లయన్‌లు కూడా కనిపించాయి.

బార్తొలోమో ద్వీపానికి కొండగుర్తులా పినకిల్ రాక్ అన్న నిడుపాటి శిల ఉంది. చిట్టచివర సూదిలాంటి మొన కలగిన ఆ శిలను చూస్తే ద్వీపానికి రక్షణ సమకూర్చుతోందా అనిపిస్తుంది. పడవ దిగి ఓ కిలోమీటరు నడిచి దగ్గరలో ఉన్న కొండ పైకి చేరితే ద్వీపమంతా ఒక్కసారిగా మన కళ్లముందు విచ్చుకుంటుంది. వయ్యారాలు పోయే సాగరతీరం, ఆ తీరాన్ని ఆభరణాల్లాగా అన్నివేపులా అంటి పెట్టుకుని ఉండే అతి నీలమూ ఆకుపచ్చా కలగలసిన సాగరజలాలు, నేనున్నా నంటూ నిట్టనిలువుగా ఓ పక్కన నిలచి కనబడే పినకిల్ రాక్- చూడచక్కని దృశ్యమది. రెండు కళ్లూ చాలవు. ఆ చిరుద్వీపపు ఉపరితలమంతా అనేక వర్ణాల సమ్మేళనం. ఆకుపచ్చని భూభాగాలు, వాటి పక్కన ఎరుపు నుంచి గోధుమరంగు మీంచి నలుపు వరకూ అనేక వర్ణాలలో వ్యాపించి కనిపించే బీడు భూమి- మొత్తం ద్వీపాన్నంతటినీ ఒకే ఫ్రేములో ఫోటో తీయగలిగితే అద్భుత వర్ణచిత్రంగా శోభిల్లే సుందరసీమ అది.

కాసేపు బార్తొలోమో ద్వీపంలో గడిపి మేమంతా ఆ దగ్గరలోనే ఉన్న సాంతియాగో ద్వీపం వేపు సాగిపోయాం. దారిలో మమ్మల్ని ఓ పెంగ్విన్‌ల సమూహం పలకరించింది. ధృవప్రాంతాలతో



ముడివడిన పెంగ్విన్‌లు, ఎండలు మండే ఉష్ణ మండలపు భూమధ్య రేఖా ప్రాంతంలో కనిపించడం ఎంతో వింతగా అనిపించింది. ఈలోగా మా మనసెరిగిన బోటు కెప్టెన్ స్పీడు తగ్గించాడు. పెంగ్విన్‌లను దగ్గరనుంచి చూసి ఫొటోలు తీసుకునే అవకాశం కల్పించాడు.

సాంతియాగో ద్వీపంలో మా బోటు లంగరు వేసింది. మేమంతా తళతళ మెరుస్తోన్న సన్నని ఇసుక మీదకు దిగాం. అక్కడి నల్లని రాళ్లమీద వందలాది ఎర్ర పీతలు తారాడుతూ కనిపించాయి. గుర్తుండిపోయే దృశ్యమది.

❖

బొర్తొలోమో నుంచి తిరిగి వస్తున్నప్పుడు స్థానిక యువతి దియానాతో బాగా మాటలు సాగాయి. 'మా చెల్లి డాక్టరు, కలిస్తే బాగుండేది. మీకు కుదిరితే ముగ్గురం కలిసి డిన్నరు చేద్దాం," అంది దియానా. సరేనని వెళ్లాను.

దియానావాళ్లు ఎంపిక చేసిన రెస్టరెంటు పేరు ఫ్రెఫె గ్యాస్ట్రో బార్. ఊరి మధ్యన, స్థానికుల ఇళ్ల నడుమ ఉంది. టాక్సీ పట్టుకుని చెప్పిన సమయానికి అక్కడికి చేరాను. దియానా, ఆమె చెల్లి ఎవెలిన్ సంబరంగా నన్ను ఆహ్వానించారు. రేడియోలజీ పరీక్షల సన్నాహాల వలన తాను బార్తలోమో ద్వీపానికి రాలేకపోయినా నన్ను ఇలా కలుసుకోగలగడం తనకు సంతోషంగా ఉందని చెప్పింది ఎవెలిన్.

అక్కచెల్లెళ్లిద్దరూ పూనుకొని చక్కని పదార్థాలను ఆర్డర్ చేశారు. ఎవెలిన్ ఆ రెస్టరెంటులో మాత్రమే దొరికే ఒక ప్రత్యేకమైన చేపల వంటకాన్ని తెప్పించింది: పిండిలో కూర్చి వేయించిన మధ్య రకం బరువున్న చేప, దానితోపాటు చిప్స్, ఇతర అనుపానాలు ఉన్న వంటకమది. దియానా కూడా మరో స్క్విడ్ బాణీ చేపల వంటకాన్ని ఆర్డర్ చేసింది. భోజనం ఎంతో బావుంది. బీరు కూడా దివ్యంగా ఉంది. చక్కని అనుభవం అది. ఎక్వడోర్ దేశాన్ని వదిలి పెట్టే సమయంలో, మెయిన్‌లాండ్‌కు వెయ్యి కిలోమీటర్ల దూరాన ఉన్న ద్వీపంలో, ఇద్దరు తెలివైన, చురుకైన, స్థానికులైన అక్కచెల్లెళ్ల ఆతిథ్యంలో చక్కని వీడ్కోలు భోజనం ఆరగించే భాగ్యం ఎంత మందికి కలుగుతుంది? అవును, యాత్రలు మనుషుల్ని దగ్గర చేస్తాయి. అనుబంధాలని ఏర్పరుస్తాయి. అపరిచితుల్ని క్షణాల్లో ఆప్తమిత్రులుగా చేస్తాయి. నాకీ ప్రయాణాల ఆసక్తే లేని పక్షంలో వీళ్లిద్దరితో ఇలా కబుర్లు చెప్పుకుంటూ అనుభవాలు పంచు కొంటూ డిన్నరు చేసే అవకాశం లభించేదా?!

❖

గలాపగోస్ ద్వీపాల్లో అప్పుడే రెండురోజులు గడిచిపోయాయి. మర్నాడు మధ్యాహ్నం బాల్ట్రా ద్వీపంలో విమానం పట్టుకుని గుయాకిల్ మీదుగా కీతోకి చేరుకోవాలి. కానీ అది ఎక్కడానికి బాల్ట్రా ద్వీపానికి వెళ్లాలి. అందుకు రెండు గంటలు పడుతుంది. దానికితోడు మరో రెండు గంటలని చేతిలో ఉంచుకోవడం క్షేమం. వెరసి నేను అన్నీ సర్దుకుని పుయెర్తో అయోరా వదిలి వెళ్లవలసిన సమయం వచ్చేసిందన్నమాట.

మర్నాటి ఉదయం బాగా పొద్దున్నే బయల్దేరి కాస్తంత దూరాన ఉన్న తోర్యూగా బేలోని బీచి చూసి వద్దామని బయల్దేరాను. అడవిలో నడక. బాగా ఉదయం కదా- దారి చెప్పేవాళ్లు లేరు. మనుషులు లేకపోయినా డార్విన్ ఆలోచనలకు ఊతమిచ్చిన ఫించ్ పక్షులు కనిపించి పలకరించాయి. చివరికి బీచ్ చేరుకోగలిగాను.

అప్పటికే బీచిలో జనాలు చేరి ఉండటం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. నేనే తెల్లవారీ వారకముందే వచ్చేశాను అనుకొంటోంటే, మరి వీళ్లు ఎప్పుడు ఇక్కడికి వచ్చి చేరారో! ఆ ఇసుకలోను, అక్కడి నల్లని రాళ్లమీదా పాకుతోన్న నల్లని తొండ ల్లాంటి ప్రాణులు కనిపించాయి. ఏమిటా అని పరిశీలించాను- మెరైన్ ఇగ్వానాలవి. మామూలు ఇగ్వానాలు భూమికే పరిమిత మయితే ఈ సముద్ర సమీపపు మెరైన్ ఇగ్వానాలు మెలమెల్లగా నీళ్లకు అలవాటు పడి, ఉభయచరాలు అయ్యాయన్నమాట. డజన్ల కొద్దీ ఇగ్వానాలు మనిషి జాడకు బెదరకుండా అక్కడ యథేచ్ఛగా తిరుగాడటాన్ని సంబరంగా చూశాను. ఇగ్వానాలతోపాటు అక్కడ పెలికన్లు, ఎర్రపీతలు, సీ లయన్లు, మరి కొన్ని పేరు తెలియని పక్షులూ కనిపించాయి. వాటన్నిటినీ చూసుకుంటూ ఆ సముద్ర తీరం వెంబడే గంటన్నర సేపు తిరుగాడాను.

పదకొండుకల్లా ఏంజెలో వచ్చేశాడు. టాక్సీ వెనక సీట్లో ఓ పెద్ద వయసు జంట. హోటలు దగ్గర ఒమేరొ, పాబ్లో, మరి ఇద్దరు సిబ్బందీ ఎంతో ఆప్యాయంగా నాకు వీడ్కోలు పలికారు. ఇదిగో, చిన్నవనిపించే ఈ వీడ్కోళ్ల వంటి విషయాలే యాత్రికుని మనసులో మెరుపుతీగల్లా చోటు చేసుకుంటాయి. కలకాలం గుర్తుంటాయి.

టాక్సీలో ముందు సీట్లో కూర్చున్నాను. వెనక ఉన్న పెద్దవాళ్లని పలకరించాను. వాళ్లూ ఉత్సాహంగా స్పందించారు. కానీ క్షణాల్లో వాళ్లిద్దరూ ఏదో విషయాన్ని గురించి ఎంతో సీరియస్‌గా చర్చించుకోవడాన్ని గమనించాను బహుశా ఏదో కుటుంబ వ్యవహారం అయి ఉండాలి. అంచేత వాళ్లను మరింత పలకరించడం, మాటల్లో పెట్టడం నాకు ఇష్టం లేకపోయింది. టాక్సీమనిషి ఏంజెలోతోనే అడపాదడపా ముచ్చట్లు.

మా టాక్సీ శాంతాక్రూజ్ ద్వీపపు దక్షిణకొస నుంచి ఉత్తర దిశగా సాగిపోయింది. దారిలో మెరక భూములూ అడవినేలలూ



వచ్చాయి. గత మూడురోజుల్లో ఈ రోడ్డుమీద వెళ్లడం నాకు ఇది మూడోసారి. యథాప్రకారం మాకు దారిలో రాకాసి తాబేళ్లు కనిపించాయి. ఈ తాబేళ్లు ఇలా మెరకభూముల్లోకి వచ్చే ఋతువు ఇది- మిగతా సమయాల్లో అవి ఆడవుల్లోని ఇతర ప్రాంతాల్లో తిరుగుతూ ఉంటాయని వివరించాడు ఏంజెలో. చివరకు పడవల రేవుకు చేరుకున్నాం. మళ్లా మా గలాపగోస్ ద్వీపాలకు ఎప్పుడొస్తారూ అని ఆప్యాయంగా అడిగాడు ఏంజెలో. 'వస్తాను. తప్పకుండా వస్తాను ఈసారి ఇంకా ఎక్కువ సమయం గడుపుతాను,' అన్నాను. ఒకరి కొకరం ఆత్మీయంగా వీడ్కోళ్లు చెప్పుకున్నాం.

విమానం పైకి ఎగిరినపుడు పై నుంచి నేను గత రెండు మూడురోజులుగా తిరుగాడిన ద్వీపాలు కనిపించి పలకరించాయి. ఆ ద్వీపాల మీద అడుగుపెట్టాను అన్న ఆలోచనే నాకు మరోసారి విభ్రమ కలిగించింది. డార్విన్ జీవపరిణామ సిద్ధాంతానికి పునాది వేసిన ద్వీపాలవి. జీవరాసుల గురించి ప్రపంచపు అవగాహనను సమూలంగా మార్చిన సిద్ధాంతానికి పుట్టినిళ్లవి. 190 ఏళ్ల క్రితం డార్విన్ చూసిన జీవజాలాన్నే నేనూ చూసి వస్తున్నాను. 40 ఏళ్ల క్రితం డార్విన్ రాసిన ఆరిజిన్ ఆఫ్ స్పీసీస్ పుస్తకాన్ని చదివి, ఏనాటికైనా గలాపగోస్ ద్వీపాలను చూడాలని చేసుకున్న సంకల్పం ఈనాటికి నెరవేరింది.

తిరిగి చూసుకుంటోంటే ఎంత అద్భుతమైన అనుభవం, అనిపిస్తోంది. ఏదో స్నేహపూరితమైన జురాసిక్ పార్కులో తిరుగాడినలాంటి అనుభవం!



డాక్టర్ నిమ్మగడ్డ శేషగిరి కాకినాడలో మెడిసిన్ చదివి ఇంగ్లండ్‌లో ఫోరెన్సిక్ సైకియాట్రిస్ట్‌గా స్థిరపడిన నిమ్మగడ్డ శేషగిరిగారికి యాత్ర లన్నా జీవితమన్నా అంతులేని పిపాస. పాతికేళ్లుగా ప్రపంచమంతా విస్తారంగా పర్యటించారాయన. తెలుగువారికి పెద్దగా పరిచయం లేని మధ్య అమెరికా, దక్షిణ అమెరికా దేశాలలో 2022, 2023లలో రెండు విడతలుగా ఐదు వారాలపాటు ఆ ప్రాంతాలలో కొలంబస్ రాకకు పూర్వం విలసిల్లిన నాగరికతల ఛాయలను వెదుకుతూ తిరుగాడారు. ఆయన తన అనుభవాలతో మూడు పుస్తకాలు ప్రచురించారు. వాటిలో రెండు పుస్తకాలను ఈ యాత్రా కథనాన్ని అనువాదం చేసిన దాసరి అమరేంద్ర అనువదించారు. ఆయన కూడా నిత్య పథికుడే.



ఇంటికి చేరిన కథ

డా॥ సిద్ధం రాజు

"రాజీ! రాజీ!! అయ్యగారు నిద్ర లేచారు కాఫీ చేసి తీసుకురా" హాల్లో నుంచి అరచి చెప్పింది ఉమ.

"అలాగే అమ్మగారూ," అంటూ గబగబా వంటింట్లోకి వెళ్లింది రాజి.

రాజి అసలు పేరు రాజమ్మ. నాలుగేళ్లుగా ఉమ ఇంట్లోనే పనిపిల్లగా వుంటోంది. ఉమ తండ్రి రాష్ట్ర రాజధానిలో పోలీస్ శాఖలో ఉన్నతాధికారి. అంచలంచలుగా పోలీసుశాఖలో ఐ.జి. హోదాదాకా పెరిగిన ఆయనకు లంచాలేవీ తీసుకోని నిజాయితీ పరుడైన ఆఫీసర్‌గా మంచి పేరు వుంది. ఐ.జి.గారి దగ్గరే రాజీ తండ్రి హోంగార్డుగా పనిచేస్తాడు. రాజీ తల్లితండ్రులకు రాజి కాకుండా యింకా ముగ్గురు ఆడపిల్లలు వున్నారు. వాడికి వచ్చే జీతానికి యిల్లు గడవటమే కష్టంగా వుంటుందని యిక వేరే చెప్పనవసరములేదు. దానికితోడు రోజూ తాగుడు అలవాటు. రాజి తల్లి ఆ యింటా ఈ యింటా పనిచేసి కొంత సంపాదిస్తుంది. ఇంటికి పెద్ద కూతురైన రాజీకి ఎప్పటికయినా హోంగార్డు లాంటి వుద్యోగం ఏదైనా యిప్పిస్తారన్న వుద్దేశ్యంతో ఏడో క్లాసు అయిపోగానే రాజి తల్లి మెల్లగా ఐ.జి.గారింట్లో పనిపిల్లగా పెట్టించింది.

ఉమకు డిగ్రీ పూర్తి కాగానే పెళ్లయింది. పెళ్లైయిన తరువాత సంవత్సరం తేడాతో వెంట వెంటనే యిద్దరు పిల్లలు పుట్టుకొచ్చారు. ఉమ భర్త వెంకట్ సివిల్ ఇంజినీరు. పెళ్లయేనాటికి రాష్ట్ర రాజధాని లోనే వుద్యోగం. కానీ తరువాత అక్కడికి దూరంగా వున్న వేరే వూరిలో మేనేజరుగా పెద్ద వుద్యోగం రావటంతో ఆ వూరుకు కాపురం మార్చాడు. ఇక ఉమ కూడా భర్తతోపాటు యిద్దరు పిల్లలనూ తీసుకొని కొత్త వూరులో కాపురానికి వచ్చింది. వాళ్లతో పాటే రాజి కూడా తన తల్లితండ్రులను వదిలి ఉమ ఇంట్లో పనిపిల్లగా కొత్త వూరుకి వచ్చేసింది.

కొత్త వూళ్లో ఆఫీసుకూ, పిల్లల స్కూలుకూ అనుకూలంగా దొరకటంతో అవసరం లేకున్నా, మూడు పడక గదులు, విశాల మయిన లివింగ్ రూముతో వున్న పెద్ద యిల్లు అద్దెకు తీసుకోవలసివచ్చింది. పిల్లలిద్దరినీ నాలుగు వీధుల అవతల వున్న ఇంగ్లీషు మీడియం స్కూల్లో చేర్పించారు. పెద్దది అమ్మాయి మూడో క్లాసు, రెండోవాడు అబ్బాయి రెండో క్లాసు.

ముందు వున్న ఇల్లు రాజీకి ఇరుకుగా వుండేది. ఇప్పుడు పెద్ద ఇల్లు కావటంతో రాజీకి తనకంటూ వేరుగా ఒక గది

అమరింది. రాజీ గది అంతా ఖాళీయే. మోజాయిక్ ఫ్లోరూ, చూస్తే బయటంతా కనిపించేలా కిటికీ, సీలింగు ఫ్యాను వగైరాలు. తను పడుకునే చాపా, దిండు, దుప్పట్లు, తన దుస్తుల బ్యాగు మినహా గది అంతా విశాలంగా విశాలంగా వుంది.

రోజూ పొద్దున్నే లేచి పాల ప్యాకెట్లు ఫ్రిజ్‌లో పెట్టి, యింటి లోపల హాలూ, వరండా, వంటగది వూడ్చి, బయటంతా శుభ్రం చేసి, పేపర్ ఇంట్లోకి తీసుకువచ్చి, టీపాయిమీద పెట్టి, పాలు ఫ్రిజ్‌లో పెట్టి, వాటర్ హీటర్ ఆన్ చేసే పనులన్నీ ఉమ నిద్ర లేచేలోపే అయ్యేవి. ఉమ నిద్ర లేచి పిల్లలను లేపగానే, యిద్దరికీ పేస్టూ, బ్రష్షులూ అందించి, వాళ్లు గొడవ చేయకుండా పళ్లు తోముకునే వరకు దగ్గరుండి, పాలు వేడి చేసి, బూస్ట్ కలిపిన పాలు పాపకిచ్చి, చిన్నోడికి దగ్గరుండి తాగించి, ఒక్కొక్కరిగా పిల్లలిద్దరికీ స్నానం చేయించి, స్కూల్ డ్రస్సు వేసి, తలదువ్వి రడీ చేసేసరికి గంటన్నర పైన పట్టేది. ఓపక్క పిల్లలిద్దరూ టీవీలో కార్టూన్లు చూస్తుంటే టిఫిన్లు తయారుచేయటం మొదలుపెట్టేది. ఈలోగా ఉమ వచ్చి పిల్లల హోం వర్క్ గురించిన ప్రశ్నలూ, సబ్జెక్ట్ పుస్తకాలు వున్నయోలేవో సరి చూసేసరికి రాజీ టిఫిన్లు రడీ చేసేది. టీవీ చూస్తూనే మెల్లగా టిఫిన్లు ముగించేసరికి స్కూల్ టైం అవనే అవుతుంది. బూట్లు వేసి పిల్లలిద్దరినీ తీసుకువెళ్లి స్కూల్‌లో దిగబెట్టి వచ్చేది.

స్కూల్ నుండి వచ్చిన కొద్దిసేపటి తరువాత వెంకట్ కూడా లేచి ముఖం కడుక్కొని నేరుగా హాల్లోకి వచ్చి న్యూస్ పేపర్ చదువు తుండగా కాఫీ తయారుచేసి తీసుకురావటం రాజీ రోజూ చేసే కార్య క్రమాలలో భాగం. భార్య ఉమతో మాట్లడుతూ, కొద్దిసేపు టీవీలో న్యూస్ చూసి స్నానానికి వెళ్లేవాడు. డ్రెస్ చేసుకొని ఆఫీసుకి తయా రయ్యేలోగా టేబుల్ పైన టిఫిన్ రడీగా పెట్టేది రాజీ. టిఫిన్ ముగించు కొని స్కూటర్ మీద ఆఫీసుకి వెళ్లిపోయేవాడు వెంకట్.

అటు వెంకట్ ఆఫీసుకి వెళ్లిన తరువాత ఉమ కూడా స్నానం ముగించి టిఫిన్ తినేసేది. గిన్నెలన్నీ కడిగి, బట్టలు ఉతికి ఆరేసి తను కూడా టిఫిన్ తిని ఆరోజుకు కావలసిన వంటకు ఉపక్రమిం చేది రాజి. వంట పూర్తి అవ్వగానే క్యారేజీలో సర్ది పిల్లల స్కూల్‌కి లంచ్ తీసుకు వెళ్లేది. పిల్లలు లంచ్ పూర్తి చేసిన తరువాత క్యారేజీలు యింటికి తీసుకువచ్చేది రాజీ.

ఆఫీసులో పనినిబట్టి వెంకట్ లంచ్‌కి ఒక్కొక్కరోజు ఒక్కొక్క వేళలో వచ్చేవాడు. భోజనం అయిన వెంటనే బయలుదేరి ఆఫీస్‌కి వెళ్లిపోయేవాడు.

సాయంత్రానికి కావలసిన కూరగాయలు తరగటంగానీ, వుతికిన బట్టలు ఆరాక మడిచి సర్దిపెట్టటంగానీ, ఇస్త్రీ చేయటం గానీ, టీవీ చూడడంలాంటి పనులతో రాజీకి మరో రెండు గంటలు గడిచేవి. ఈలోగా సుమారుగా పిల్లల స్కూల్ వదిలే టైం అయ్యేది. స్కూల్‌కి వెళ్లి పిల్లలను ఇంటికి తీసుకు వచ్చి, కాళ్లూ, చేతులూ, ముఖం కడిగి. తినటానికి ఏవైనా స్నాక్స్, జ్యూస్‌లాంటివి రెడీ చేసేది. వాటిని సరిగా తినీతినకుండా, తాగీ తాగకుండానే పక్కింటి పిల్ల లతో ఆడుకొవటానికి పరుగు తీసేవాళ్లు. సాయంత్రం వెంకట్ ఆఫీస్ నుండి ఇంటికి వచ్చేసరికి ఏడుగంటలు దాటేది.

రాజీ తన చదువు కొనసాగించినట్లైతే ఈపాటికి జూనియర్ ఇంటర్‌లో వుండేది. అయితేనేం తన కూతురు ఇంట్లో పని చేస్తున్నందుకుగాను ఐ.జి.గారు నెలకింతని రాజీ అమ్మకి ముట్ట చెపుతూనే వున్నారు. ఇక ఉమ వాళ్ల అమ్మ అడపాదడపా పండక్కో పబ్బానికీ చీరలనో, మిగతా ఆడపిల్లలకి పరికిణీలనో యిస్తూనే వుంది. వయసొచ్చిన పిల్ల కనుక రాజీకి కూడ ఉమ దగ్గరకి వచ్చే ముందే మూడు కొత్త లంగా వొణీలూ జాకెట్లతోపాటు ఉమ ఒకసారి వేసుకొని నచ్చక పక్కన పెట్టినవీ, కొద్దిగా బిగుతై ఫిట్ అయిన దుస్తులు కూడా చాలా యిచ్చి పంపింది.

ఇంట్లోవాళ్లకి వేరూ, రాజీకి వేరు అంటూ ఏమీలేదు. అందరికీ ఒకటే వంట. ఉమ కూడా పెట్టటంలో ఎక్కడా తక్కువచేసేది కాదు. నాన్‌వెజ్‌తో పాటు అప్పుడప్పుడు తెప్పించే పిజ్జాల్లోనూ, బర్గర్లలోనూ రాజీకి కూడా ఎంతో కొంత భాగముంటూనే వుంటుంది.

కొంచం నల్లగా ఛాయ తక్కువగా పీలగా వుండే రాజీ, వయసులో వున్న పిల్ల కావటం కావచ్చు, మంచి పోషకాహారం దొరకటం వల్ల కావచ్చు, వేళకు నిద్ర వుండటం వల్ల కావచ్చు, రోజూ పనిచేసి ఎక్సర్‌సైజ్ తోడవటం కావచ్చు, కొత్త వూరిలో నీరు పడటం వల్ల కావచ్చు, యివన్నీ కలగలిపి కొత్త వూరు వచ్చిన కొద్ది నెలల్లోనే, మిసమిసలాడుతూ అందంగా తయారైయింది.

కొత్త వూరిలో ఉమ వాళ్లు అద్దెకుంటున్న ఇంటి వోనర్ పెద్దావిడ రంగమ్మ, పాతకాలం మనిషి. ముందు రెండు గదుల్లో వుంటుంది. రంగమ్మ ఇంట్లో టీవీ లేదు. వెంకట్ భోజనం చేసి వెళ్లిన తరువాత టీవీ చూసేందుకు ఉమ ఇంట్లో దూరేది. అలా రెండు మూడు గంటలు టీవీ చూసే సమయంలో ఆ ఇంటి గురించీ ఈ ఇంటి గురించీ కబుర్లు చెప్పేది. పాతకాలం మనిషైనా పద్ధతిగల మనిషి. కేవలం వారి గురించి వీరి గురించి కబుర్లు చెప్పేది కాని ఎవరి గురించి చెడు చెప్పేది కాదు. ఉమ కూడా రంగమ్మ చెప్పే కబుర్లు కొన్ని వినీ కొన్ని వినననట్లు వూరుకునేది.

ఇలా కొనసాగే కబుర్ల పరంపరలో ఒకరోజు పక్కింటి వాళ్ల వివరాలూ, వాళ్ల భర్తలు చేసే వుద్యోగాలూ, వాళ్ల పిల్లల వివరాలూ పూసగుచ్చినట్లు చెప్పింది. మరొకవైపు ఉమ పిల్లలు పక్కింటికి పిల్లలతో ఆటలాడటానికి వెళ్లినట్లే పక్కింటి పిల్లలు కూడ ఉమ ఇంటికి వచ్చి అల్లరి చేస్తూ ఆడుకునేవారు. అప్పుడప్పుడూ టీవీ చూడడానికి వచ్చే రంగమ్మ రాజీకి కూరగాయలు వొలిచిపెట్టటం లోనూ, కోయటంలోనూ సహాయం చేసేది. రెండు మూడుసార్లు వాళ్ల పల్లెటూరి నుండి తీసుకువచ్చిన కొత్త పచ్చళ్లూ, తాటి ముంజలూ, జున్నుపాలు లాంటివి తెచ్చి ఇచ్చేది రంగమ్మ.

"ఏంటోయ్, రంగమ్మకి నువ్వు బాగా నచ్చేసినట్లున్నావే," రంగమ్మ ఇచ్చిన జున్ను తింటూ ఉమను అడిగాడు వెంకట్.

"అదేంలేదులే, పొయిన నెలలో క్యాంప్ మీద ఒకరోజు మా అమ్మా నాన్న మన ఇంటికి వచ్చారుగా, ఆరోజు పోలీస్ కార్లూ, పోలీస్‌జీపులూ, పోలీస్‌లూ చాలామంది వచ్చేసరికి ఈ వీధిలో

వాళ్లందరికీ మా నాన్న ఐ.జి. అనే విషయం పాకింది," చెప్పింది ఉమ. నవ్వేసి ఊరుకున్నాడు వెంకట్.

"ఈమధ్య నాకు పక్కింటివాళ్లు పరిచయం అయ్యారు. ఆ టైంలో రంగమ్మ కబుర్లు వినలేక తప్పించుకునేందుకు రోజూ ఒకటి రెండు గంటలు పక్కింటికి వెళ్లి వస్తున్నాను. ఎదురింటావిడ కూడ అదే టైంకి వచ్చి మాతో కలుస్తుంది. అందరం కూర్చొని సరదాగా మాట్లాడుకుంటాము," అంది ఉమ. రంగమ్మ ఇక్కడ టీ.వీలో తనకి కావలసిన చానల్ పెట్టుకొని చూస్తూ రాజీకి సహాయం చేస్తుంది.

"అయితే బోరు కొట్టకుండా కాలక్షేపం అవుతుందంటావు?" అడిగాడు వెంకట్.

"అవును, పక్కింటి వాళ్లాయనేమో టెలిఫోన్ ఆఫీస్‌లో జూనియర్ యింజినీరట, ఆ ఎదురింటాయనేమో పెద్ద ఫర్నిచర్ బిజినెస్ అట, రెండు షాపులు వున్నాయట."

'ఊ' కొట్టి ఊరుకున్నాడు వెంకట్.

"అన్నట్లు చెప్పటం మరిచాను, ఈమధ్య చాలామంది అమెరికా వెళుతున్నారట. అదేదో వైటూకె కోసం అమెరికాలో చాలా మంది ఇంజినీరులు అవసరమట. పక్కింటావిడ మరిది మొన్నటి దాకా వీళ్లింట్లోనే వుండేవాడట. ఇప్పుడు మద్రాస్‌లో కంప్యూటర్ కోర్స్ జాయిన్ అయ్యాడట. కోర్స్‌కి లక్ష రూపాయలు తీసుకొని, రెండు నెలలలో నేర్పుతారట," చెప్పింది ఉమ.

"ఓహో అలాగా, మరి లక్ష రూపాయలు కట్టి చేరాడటనా," అడిగాడు వెంకట్.

"అవునటండి, యింకా పదిహేను రోజుల్లో కోర్స్ అయిపోయి తిరిగివస్తాడట."

"మరి కోర్స్ అయిపోతే ఇక్కడికి ఎందుకు, నేరుగా అమెరికాకి వెళ్లిపోవచ్చుగదా. మద్రాస్ నుండి అయితే అమెరికాకి ఫ్లైట్స్ కూడా వుంటాయి," కొంచం వెటకారం విసిరాడు వెంకట్.

"చాల్లేండి మరీనూ! ఆయనకి పాస్ పోర్టూ, వీసా వచ్చేసరికి కొంతకాలం పడుతుందట," చెప్పింది ఉమ.

ఈలోగా రాజీ వచ్చి వెంకట్ తినేసిన జున్ను గిన్నె కడగటానికి తీసుకువెళ్లింది.

ఆరోజు వెంకట్ భోజనానికి ఇంటికి వచ్చేసరికి యింటి ముందు ఉమ, రాజీ, రంగమ్మ కాకుండా యింకా నలుగురు నిలుచొని వున్నారు. వెంకట్ స్కూటర్ రావటం చూసి పక్కకి జరిగి దారి ఇచ్చారు. గుమ్మం ముందు స్కూటర్ ఆపి స్టాండ్ వేసి అక్కడ వున్న వారినందరినీ ఒక సారి చూసి ఇంట్లోకి దారితీసాడు. ఉమ, రాజీ ఇంటి వోనర్ రంగమ్మ తప్ప మిగతా నిలుచుని వున్న మగవాళ్లు యెవరో అర్థంకాలేదు. సంగతేమైనా వుంటే ఉమ చెబుతుందిలే అని లోపలికి వెళ్లాడు వెంకట్. ఆ వెనుకే ఉమ కూడా ఇంట్లోకి నడిచింది.

రోజులానే నేరుగా చేయి కడుక్కుని డైనింగ్ టేబుల్ కుర్చీలో కూర్చున్నాడు. మామూలుగా అయితే రాజీ వచ్చి అందిస్తుంటే ఉమ వడ్డించేది. కాని రాజీ బయట గుమ్మం దగ్గరే ఏదో తప్పు చేసినదానిలా వుండిపోయింది.

"ఎవరు బయట చాలామంది వున్నారు?" ఉమ అన్నం వడ్డిస్తుంటే అడిగాడు వెంకట్.

"మన రాజీ ఎవరో రోడ్డునపోయే అబ్బాయితో మాట్లాడు తుందట, రంగమ్మ చూసి చెప్పింది."

"అవునా?" కొద్దిగా ఆశ్చర్యపోయాడు వెంకట్.

అంతలోనే తేరుకోని, "ఇంతకుముందే రంగమ్మ ఒకసారి చెప్పింది. ఎవడో కుర్రాడు కిటికీ వైపుకి చూస్తూ సైగలు చేయటం చూసిందని, మరి అప్పుడు రాజి కిటికీ దగ్గరే వుందా లేదా అనేది తెలీదు. ఎందుకంటే రంగమ్మకు అటు నుండి రాజీ వుండే కిటికీ కనపడదు," కూర వడ్డిస్తూ చెప్పింది ఉమ.

"అలాగా?" అన్నాడు వెంకట్ అన్నంముద్ద నోట్లో పెట్టు కుంటూ.

"అంతేకాదు, మన పిల్లలను స్కూల్‌కి తీసుకు వెళ్లేటప్పుడూ, వచ్చేటప్పుడూ క్యారేజీ తీసుకువెళ్లి తీసుకు వచ్చేటప్పుడూ కూడా దారిలో ఎవరితోనో మాట్లాడుతుందని తెలిసింది," చెప్పింది ఉమ.

"మరి తెలియకుండా యింకా ఏమైనా చేసిందేమో కూడా మనకి తెలీదు," అంది ఉమ ఫ్రిజ్‌లోంచి పెరుగు గిన్నె తీస్తూ.

"అవునులే యిక వయసొచ్చింది కదా వాళ్లలో త్వరగా పెళ్లి చేసేస్తారు కూడా. అనవసరంగా మనం ఆపటం దేనికి, వాళ్ల నాన్ననో అమ్మనో రమ్మని పిలిపించి రాజీని తీసుకెళ్లి పొమ్మను. మన దగ్గర వుండగా ఏదైనా అయితే అదో అనవసరమైన గొడవ అవుతుంది," అన్నాడు వెంకట్.

'ఊ' కొట్టింది ఉమ.

"అంతేకాదు, ఉన్నవీ లేనివీ చెప్పి అంతా కంపు కంపు చేస్తారు, మీ నాన్నకు కూడా డిపార్టుమెంటులో చెడ్డ పేరు వస్తుంది," పెరుగు వేసుకుంటూ అన్నాడు వెంకట్.

మళ్లీ 'ఊ' కొట్టింది ఉమ.

"నాకు అర్థమయిందిలే నీ ఆలోచన. రాజీ వెళ్లిపోతే ఇంటిపనీ వంటపనీ, పిల్లలని స్కూల్‌కి తీసుకువెళ్లటం, తీసుకురావటం యివన్నీ ఎలా అనేగా?" ఉమ మనసు పసిగట్టి అడిగేశాడు వెంకట్.

"అవునుకదా మరి యిద్దరు పిల్లలతో యింటిపని దాని తోడు లేకుండా చేసుకోవటం కష్టమే మరి," అంది ఉమ వాష్ బేసిన్ దగ్గర చేతులు కడుక్కుంటున్న వెంకట్‌కి టవల్ అందిస్తూ.

"చూద్దాంలే యిక్కడే ఎవరయినా పనిపిల్ల దొరుకుతుందేమో, నా ఆఫీసులో కూడా అడిగి చూస్తాను," అన్నాడు వెంకట్, ఉమ అందించిన టవల్‌తో మూతి తుడుచుకుంటూ.

ఇక ఆఫీసుకని బయటకు వెళ్లబోతూ, "ఇంతకీ అక్కడ నిలుచున్న వాళ్లంతా ఏవరూ?" అడిగాడు వెంకట్.

"ఓ వాళ్లా, ఇప్పుడే మీరు రాబోయే అయిదు నిమిషాల ముందే ఆ కుర్రాడు వచ్చి రోడ్డుమీద నుండే రాజీ కిటికీ వైపు సైగలు

చేస్తుంటే రంగమ్మ చూసి ఆ ఎదురింటి అయననీ, పక్కింట్లో పోర్షన్‌లో వుండే అయననీ పిలిచేసరికి అందరూ పొగయ్యారు ఆ కుర్రాడిని పట్టుకుందామని. వాళ్లంతా వచ్చేలోగా వాడు మోటర్ సైకిల్ మీద పారిపోయాడు,'' చెప్పింది ఉమ.

"సరే అయితే నేను ఆఫీస్‌కి వెళ్లొస్తా,'' అంటూ బయటకు నడిచాడు వెంకట్.

అక్కడే వున్న రాజీని చూసి, "అమ్మగారు పిలుస్తున్నారు లోపలికి వెళ్లు,'' అని చెప్పి స్కూటర్ దగ్గరికి నడిచాడు వెంకట్.

"అమ్మాయి మీకు చెప్పే వుంటుందిగా బాబూ, చాలారోజుల నుండి ఇక్కడే అటూ ఇటూ తిరుగుతున్నాడు వాడు, నన్ను చూస్తే మొహం అటు తిప్పేసుకొని, నేను లోపలికి వెళ్లగానే మళ్లీ వస్తాడు,'' అంది రంగమ్మ.

"అవును చెప్పింది, ఈసారి కనిపిస్తే పట్టుకోండి. ఫోన్ చేస్తే పోలీసులు వస్తారు, పట్టుకుపోయి చితక తంతారు,'' అన్నాడు వెంకట్.

"మీరు చెపితే ఇక తిరుగేముంటుంది బాబూ, పోలీసులు చిటికెలో పట్టేస్తారు,'' అన్నాడు అక్కడ నిలబడిన వాళ్లలో వొకడు. నవ్వేసి స్కూటర్ స్టార్ట్ చేసుకొని వెళ్లిపోయడు వెంకట్. ఐ.జి. ఒక్క రోజు కాంప్‌మీద ఈ వూరొచ్చి రెండు గంటలు వాళ్ల అమ్మాయి యింటికి వచ్చినందుకు వీధి వీధంతా తెలిసిపోయిందే అనుకుంటూ ఆఫీస్‌కి చేరుకున్నాడు వెంకట్.

ఈ విషయం జరిగిన పదిరోజుల తరువాత రాజీ వాళ్ల అమ్మకు సంగతంతా ఉమ అమ్మ ద్వారా తెలిసి రాజీని తీసుకు వెళ్లేందుకు వచ్చేసింది. రాజీకి సంబంధించిన సరంజామా అంతా సర్దించి కొంత డబ్బులు యిచ్చి పంపించేశారు. రాజీని పంపేటప్పుడు పిల్లలు బిక్కమొఖం పెట్టి యేడ్చేసారు కూడా. ఉమ కూడా చేసేది ఏమీలేక రాజిని పంపించేసింది. ఇంటి వోనర్ రంగమ్మ కుదిర్చిన పనిపిల్ల రెండురోజులుగా రాజీ నుండి రోజూ పనులు ఏమేమి చేయాలో, ఎలా చేయాలో తెలుసుకుంది.

కొత్తగా కుదిరిన పనిపిల్ల రాజీ కంటే చాలా చిన్నది. రోజులు గడిచేకొద్దీ కొద్దికొద్దిగా దారిలో పడుతుంది. కాని రాజీ లేని లోటు మాత్రం యింకా ఉమ ఫీల్ అవుతూనే వుంది. ఉమ దాదాపు వారంలో నాలుగు అయిదు రోజులైనా పక్కింటి వాళ్లతో కబుర్లాడటానికి వెళుతూనే వుంది. దానికితోడు యింకా పక్కనున్న రెండిళ్ల ఆడవాళ్లు కూడా జత కలిశారు.

ఒకరోజు మధ్యాహ్నం భోంచేసి ఆఫీస్‌కి వెళ్లిన వెంకట్ నాలుగు గంటల ప్రాంతంలో తిరిగి యింటికి వచ్చేసాడు. ఉన్న ట్లుండి వెంకట్ ఆ సమయంలో యింటికి రావటంతో ఉమకి కూడా అర్థం కాలేదు.

"ఏంటి ఈ టైంలో... బాగానేవున్నారా?'' అడిగింది ఉమ.

"అవును కొద్దిగా అలసటగా వుంటే పడుకుందామని వచ్చేశా,'' చెప్పాడు వెంకట్.

"వుండండి థర్మామీటర్ తీసుకువస్తాను,'' వేరే గదిలోకి నడిచింది ఉమ. థర్మామీటర్ చూస్తే జ్వరమేమీ లేదు. ఉమ మనసు కాస్త కుదుటపడింది.

"పిల్లలకు స్కూల్ వదిలే టైం కాలేదా??'' అడిగాడు వెంకట్.

"అవును యిప్పుడిక వచ్చే టైం అయ్యింది.''

"టీ ఎమైనా తాగుతారా?'' అడిగింది ఉమ.

"ఉండండి, ఇందాక పక్కింటి వాళ్లు వస్తే పకోడీలు చేసాను, వేడిగా వున్నాయి, తీసుకు వస్తా,'' అంటూ వంటగదివైపు నడువ బోయింది ఉమ.

"ఏమీ వద్దులే కొద్దిసేపు పడుకుంటాను,'' దిండు సరిచేసుకుంటూ అన్నాడు వెంకట్.

మరో ఐదు నిమిషాల్లోనే పిల్లలు స్కూల్ నుండి వచ్చారు. వస్తూనే డాడీ స్కూటర్ యింట్లో వుండటం చూసి, "డాడీ యివ్వాళ ఆఫీస్‌కి వెళ్లలేదా మమ్మీ?'' అడిగాడు చిన్న పిల్లాడు.

రోజూ మాదిరిగానే జ్యూస్‌తోపాటు, వేడివేడిగా వున్న పకోడీలు నోట్లో వేసుకొని పక్కింటికి పరుగెట్టారు పిల్లలిద్దరూ.

పనిపిల్లకి సాయంత్రం వండాల్సిన పనులు చెప్పి బెడ్ రూంలోకి వెళ్లి గడియపెట్టింది. వెంకట్ దగ్గరకి వెళ్లి, "తలకి అమృతాంజనం రాయమంటారా?'' వెంకట్ పక్కనే బెడ్ పైన కూర్చుంటూ అడిగింది ఉమ.

ఉమను దగ్గరికి తీసుకున్నాడు వెంకట్. భర్తకు దగ్గరగా వొదిగి పడుకుంది ఉమ.

"అమ్మలక్కలు చాలామంది చేరారే,'' వెంకట్ అడిగాడు తను ఆ సమయంలో యింటికి వచ్చినప్పుడు లేచి వెళ్లిపోయిన కబుర్లు చెప్పుకుంటున్న పక్కింటి ఆడవాళ్లను ఉద్దేశించి.

"చాలామంది ఎవరులే, పక్కింటి ఆవిడా ఎదురింటావిడా గురించి మీకు ముందే చెప్పాను. తరువాత ఆ మూడో యింట్లో ఆవిడ కూడా కలిసింది. ఆ నాలుగో ఆవిడ యిదే వీధిలో యింకా రెండిళ్ల అవతల వుంటుంది. ఆవిడ అప్పుడప్పుడూ కలుస్తుంది, రోజూ రాదు. వాళ్లయిన రైల్వేస్‌లో చేస్తారట,'' అందరి గురించీ చెప్పింది ఉమ.

"అలాగా,'' అని వూరుకున్నాడు వెంకట్.

"అన్నట్లు, పోయినసారి మీకు పక్కింటి అవిడ మరిది గురించి చెప్పాను గుర్తుందా?''

ఉమ మాటలని మధ్యలోనే తుంచేస్తూ, "ఆ ఎందుకు గుర్తు లేదు మద్రాసులో కంప్యూటర్ కోర్స్ ఏదో చేసాడనో, చేస్తున్నాడనో చెప్పావు,'' అన్నాడు వెంకట్.

"ఆ కోర్స్ అయిపోయి యిప్పుడు వీసా కూడా వచ్చేసిందట స్టాంపింగ్ కోసమని మళ్లీ మద్రాస్ నిన్ననే వెళ్లాడట. స్టాంపింగ్ అయిన వెంటనే అమెరికా వెళ్లిపోతాడట. వుద్యోగం రడీగా వుంది వెంటనే వచ్చేయమని అమెరికాలో వున్న వాళ్ల ఆఫీస్ మేనేజర్ తొందర చేస్తున్నాడట. ఇంకా పదీ పదిహేను రోజుల్లోనే అమెరికా

బయలుదేరుతాడట. మద్రాస్‌లోనే ఫ్లైట్ టిక్కెట్ కూడా కొనుక్కొనే వస్తాడట. అమెరికా వెళ్లటానికి కావలసిన డ్రస్సులూ, కోట్లూ, బూట్లూ, యింకా ఏవో లెదర్ గ్లౌజులూ, లెదర్ కోటు లాంటివి కూడా మద్రాస్‌లోనే మంచివి దొరుకుతాయట. అక్కడే వుండి అన్నీ కొనుక్కొని వస్తాడట," గుక్క తిప్పుకోకుండా అన్నీ వెంట వెంటనే చెప్పేసింది ఉమ.

"ఓహో త్వరలో అమెరికాకి వెళుతున్నాడన్నమాట?" అడిగాడు వెంకట్. ఆరోజు తను వెటకారమాడినది ఈరోజు నిజమయ్యిందే అనుకుంటూ.

"అవునండీ నేను చెప్పేనే యిదే వీధిలో వుంటున్న ఆవిడని, మీరిప్పుడే చూసారు కూడాను, వాళ్ల అన్న కొడుకు కూడా అమెరికా వెళ్లి నాలుగు నెలలు అయ్యిందట. అదేదో శాప్ అంటారట, వెంటనే అమెరికాలో వుద్యోగాలు యిస్తున్నారట కూడా, యిట్టే రెండు నెలలు కోర్స్ చేస్తే అలా వుద్యోగాలు వచ్చేస్తున్నాయట, మీలాగా కొన్నాళ్ళు వుద్యోగం చేసినవాళ్లు తొందరగా ఆ శాప్ నేర్చుకో వచ్చంట," ఉత్సాహంగా చెప్పింది ఉమ.

"వాళ్లంతా ఎమి చదివారేంటి?" అడిగాడు వెంకట్.

సరిగ్గా యిదే ప్రశ్నకోసం ఎదురుచూస్తుంది ఉమ యింత సేపూ.

"మీలాగే ఇంజినీరింగేనట, ఇంజనీరింగ్ చేసిన వాళ్లే ఎక్కువ మంది వెళుతున్నారట," చెప్పింది ఉమ.

"అలాగా," అని వూరుకున్నాడు.

"ఏమండీ మీరు కూడా ఇంజినీరే కదా ట్రై చెయ్యొచ్చు కదా," తను అడగాలనుకున్నది అడిగేసింది ఉమ.

లోలోపలే కొద్దిగా వెంకట్ ఉలిక్కిపడ్డాడు అటు తిరిగీ ఇటు తిరిగీ తన వైపే వచ్చిందే అనుకుంటూ.

"ఉమా! ఇంజినీరింగ్‌లో అనేక రకాలు వుంటాయి. నువ్వు చేసిన బీ.కాం లా ఒకటే బ్రాంచ్ వుండదు. నేను సివిల్ ఇంజినీర్. అలాగే మెకానికల్ అనీ, ఎలక్ట్రికల్ అనీ ఎలక్ట్రానిక్స్ అనీ, కంప్యూటర్స్ అనీ చాలా బ్రాంచ్‌లు వుంటాయి. కంప్యూటర్స్ చెసిన వాళ్లు బ్రిడ్జిలు ఎలా కట్టలేరో సివిల్ చేసిన వాళ్లూ కూడా కంపూటర్స్ చేయలేరు," ఉమకు నచ్చచెప్పబోయాడు.

"అందుకే కదండీ రెండు నెలలు కంప్యూటర్ కోర్స్‌లో ట్రైనింగ్ యిస్తారట. వాళ్లే వీసా వచ్చేలా చేస్తారట. అమెరికాకి వెళ్లిన తరువాత గెస్ట్‌హౌస్ కూడా యిస్తారట. వుద్యోగం వచ్చేవరకూ వాళ్లే భోజనం కూడా పెడతారట. వేరే చోట వుద్యోగం వస్తే ఫ్లైట్ టికెట్లు కూడా యిచ్చి పంపిస్తారట. వెళ్లిన చోటులో ఒక వారం హోటల్ కూడా యిస్తారట..." అదట యిదట అంటూ ఇన్ని విషయాలు చెబుతుంటే యీసారి నిజంగానే ఉలిక్కిపడ్డాడు వెంకట్.

ఇన్ని విషయాలు సేకరించిందా? ఇంకోవైపు ఉమను చూసి ఆశ్చర్యం వేసింది వెంకట్‌కి.

"చూడు ఉమా, ఇంజినీరింగ్‌లో మేము వాడాల్సిన సైంటిఫిక్ కాలిక్యులేటర్‌నే పూర్తిగా వుపయోగించటం నేర్చుకోలేదు. ఇక కంప్యూటర్ నాకేమి అర్థమౌతుందిలే. ఆ ఆలోచన మానుకో. ఇక్కడ నాకు యింకో రెండు సంవత్సరాలలో జనరల్ మేనేజర్‌గా ప్రమోషన్ కూడా వస్తుంది. జీతం కూడా పెరుగుతుంది. ఇద్దరు పిల్లలున్నారు హ్యాపీగా ఇక్కడే వుందాం. లేనిపోనివన్నీ విని ఆశలకు పోకు," సర్ది చెప్పబోయాడు వెంకట్.

"నేనేమయినా మిమ్మలను యిబ్బంది పడిపొమ్మన్నానా. రెండు నెలలేగా కోర్స్ చేస్తే అన్నీ వాళ్లే చూసుకుంటారంటున్నాను. యించక్కా మన పిల్లలిద్దరినీ అమెరికాలో చదివించుకోవచ్చు. అక్కడ బాగుంటుందట," బుంగమూతి పెట్టి ముద్దుముద్దుగా చెపుతుంటే నవ్వొచ్చింది వెంకట్‌కి.

"సరే చూద్దాంలే," అని వెంకట్ అనేసరికి ఉమ ముఖంలో కొంత ఆశ కనిపించింది.

"చూద్దామంటే కాదు, ఆ కంప్యూటర్ కోర్స్ చెప్పే ఇన్‌స్టిట్యూట్ పేరూ, అడ్రస్సూ కనుక్కుంటా ఈసారి కలసినప్పుడు."

"ఆలోచిస్తానులే... ఏదో పకోడీ చేశానన్నావు. యిప్పుడు పెట్టు," అన్నాడు అప్పటికి ఆ చర్చ అపేద్దామన్న వుద్దేశంతో.

ఆ మాటతో ఉమ ముఖం పై కొంత వెలుగు కనిపించింది.

పకోడీ తీసుకురావటానికి బెడ్‌రూము గడియ తీసి వంటింట్లోకి నడచింది ఉమ.

పదే పదే ఉమ చెప్పటం వలన కావచ్చు, అత్తా మామగార్ల నుండి ఉమ చేయించిన రికమండేషన్ కావచ్చు, ఆఫీస్‌లో తోటి ఉద్యోగులకి తెలిసినవాళ్లు వొకరిద్దరు కూడా అమెరికా వెళ్లినట్లు చెప్పిన విషయలే కావచ్చు, ఇంకా వెంకట్ ఫ్రెండ్స్‌లో కొంతమంది కూడా చెప్పిన మాటలవల్ల కావచ్చు, ఏదయితేనేం మొత్తం మీద యిది జరిగిన సంవత్సరం తరువాత ఆ మద్రాస్‌లో చెప్పిన రెండు నెలల కంప్యూటర్ ట్రైనింగు ఏదో పూర్తి చేసి, ఎట్టకేలకు ఉమ కోరిక నెరవేరి వెంకట్ ఫ్యామిలీ అంతా అమెరికా చేరారు.

వెంకట్‌కి అప్పటినుండి 'అమెరికా కష్టాలు' మొదలయ్యాయి. అమెరికా వచ్చిన సంవత్సరం వరకూ వుద్యోగం రాలేదు. ఆ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో నేర్పించినవీ, ముక్కున పెట్టుకు వచ్చినవేవీ సహకరించలేదు. ఈలోగా ఏవో కోత్త కోర్సులు వచ్చాయి. అమెరికాలో అవి చెప్పే నాధుడే లేడు. చిన్నప్పుడు ఇంగ్లీషు మీడియంలో చదివినా అమెరికా ఇంగ్లీషుతో యిబ్బందే. వాళ్లు మాట్లాడేది అర్థం కాదు, వెంకట్ మాట్లాడేది వాళ్లకు అర్థం కాదు. ప్రతీదీ ఒకటికి రెండుసార్లు వాళ్లు చెప్పవలసి వచ్చేది, అలానే ఒకటికి రెండుసార్లు వాళ్లకూ చెప్పవలసి వచ్చేది. అమెరికాలో ఇంగ్లీషుకీ యిండియాలో నేర్చుకున్న బ్రిటీష్ ఇంగ్లీషుకీ కూడా చాలా తేడా వుంది.

ఒక్కసారిగా యిండియా నుండి అమెరికా రాగానే ఒక కల్చరల్ షాక్‌కి గురైయ్యాడు వెంకట్. అందునా తను ఊహించినది ఏదీ యిక్కడ కనిపించలేదు. తను చిన్నప్పటి నుండి అల వరచుకున్న విద్యలేవీ యిక్కడ పనికి రాలేదు. ఏదో రెండు నెలలు ముక్కున పెట్టుకున్న దిక్కుమాలిన కంప్యూటర్ కోర్సుతో ఇక్కడ

జీవనం సాగించాలా? లేటు ముప్పై సంవత్సరాల వయసులో ఈ మార్పు ఏంటీ, పెళ్లైన పదకొండు సంవత్సరాల తరువాత మళ్లీ చదువేంటీ. హాయిగా, దర్జాగా ఏసీ రూంలో మేనేజర్ వుద్యోగం వదిలి, రెండు పెద్ద బ్యాగులతో ఆ వూరు ఈ వూరూ వుద్యోగం కోసం పరుగెట్టటం ఏంటీ? అదీ పట్టుమని సంవత్సరమో, రెండు సంవత్సరాలో కాకుండా మూడు నెలలూ, ఆరు నెలల వుద్యోగాలేంటీ. దానికితోడు చేరిన మొదటి వుద్యోగంలో ఒక వారం, మూడు నెలల తరువాత వచ్చిన రెండో వుద్యోగంలో మూడు వారాల్లో ఫైర్ అయ్యి వెనక్కి తిరిగిరావటమేంటి. ఈ అయోమయంతో వెంకట్ తీవ్రమైన డిప్రెషన్‌కు గురైయ్యాడు.

తాను అమెరికా వచ్చిన తొమ్మిది నెలల తరువాత ఫ్యామిలీని తెచ్చుకున్నా కిందామీదా పడుతూనే వున్నాడు. ఇంతటి కష్టాల లోనూ, అభివృద్ధి చెందిన దేశం కాబట్టి, హాయిని కలిగించేవి కూడా చాలా కనిపించాయి. మంచి గాలి, స్వచ్ఛమయిన నీళ్లు, వాతావరణం, అమెరికా పద్ధతులూ, పిల్లలు చదువుతున్న స్కూల్ బాగుండటం, పైగా పిల్లలకూ స్కూల్ నచ్చటం, దగ్గులూ, జలుబులూ, జ్వరాలూ లాంటివి రాకపోవటం, ఈగలూ, దోమలు, బల్లులూ, నల్లులూ వంటివి కనిపించకపోవటం, వెంకట్‌కి అమెరికాలో నచ్చిన కొన్ని అంశాలు.

తనలానే యిండియా నుండి అమెరికా వచ్చిన తోటి కన్సల్టెంట్‌లూ, ముఖ్యంగా అమెరికాలో పరిచయమయిన తెలుగు వాళ్లూ, యిచ్చే ప్రొత్సాహంతో ధైర్యం కూడగట్టుకొని మెల్లగా అమెరికా జీవితం నెట్టుకొస్తున్నాడు. నాలుగు నెలలూ, ఆరు నెలలూ వుద్యోగాలతో, వుద్యోగానికీ వుద్యోగానికీ మధ్యలో మరో రెండు నెలలో మూడు నెలలో బెంచ్‌లో వుంటూ సతమవుతూనే వుంది వెంకట్ జీవితం.

అమెరికా వచ్చి ఏడు ఏళ్లు గడిచిపోయినా ఉద్యోగాల్లో నిలదొక్కుకోవటం కష్టమైపోతుంది వెంకట్‌కి. రోజురోజుకూ మారుతున్న టెక్నాలజీని అందుకోవటంలో ఎప్పటికప్పుడు విఫలమవుతూనే వున్నాడు వెంకట్. అయితే అప్పటివరకూ పిల్లలకు అయిన ఖర్చులు పెద్దగా ఏమీలేవు. కానీ యిక రెండు మూడేళ్లలో అమ్మాయి కాలేజీలో చేరే టైం వచ్చింది. వెంకట్ చేసే చిన్న వుద్యోగాలతో వచ్చే జీతంతో యిప్పుడు కాలేజీ ఫీజులు కట్టేందుకు సరిపోదు. అదీకాక ఆపై మూడు నాలుగు సంవత్సరాలలో చిన్నవాడు కూడా కాలేజీకి వస్తాడు.

అయిదు సంవత్సరాల క్రిందట నమోదు చేసిన గ్రీన్ కార్డ్ యింకా రాలేదు, ఎప్పుడు వస్తుందో కనీసం ఆచూకీ లేదు. అటు గ్రీన్ కార్డ్, సిటిజన్స్ అయినవారి కంటే, హెచ్1బీ వీసాల్లో వున్నవారు పిల్లల కాలేజీ ఫీజులు ఎక్కువ కట్టాలి. దాంతో యిక యిండియలో తమకున్న ఆస్తులు కొద్దికొద్దిగా అమెరికాకు చేరవేసుకుంటూ పిల్లలను చదివిస్తున్నాడు వెంకట్.

ఇన్ని చేస్తున్నా అమెరికా కష్టాలు వెంకట్ వెన్నంటే వున్నాయి. ఆ సంవత్సరం అమెరికా ఆర్థిక మాంద్యంకు గురైయింది. ఒక్క సంవత్సరం పైగా ఎంత ప్రయత్నించినా వుద్యోగం లేక చాలా బాధ పడ్డాడు. ఎన్ని ధరఖాస్తులు పంపినా ఒక్కదానికీ ఇంటర్వ్యూ రాలేదు. ఇల్లు గడవటం కష్టం అయింది. యిండియా నుండి ఎంతోకొంత వస్తూనే వుంది. మారకం రేట్లతో పోలిస్తే నెలకు లక్షలు లక్షలు రూపాయలు అయిపోతున్నాయి.

ఉమకి కూడా ఏమి చేయాలో పాలుపోవటం లేదు. తనకున్న బీ.కాం ఎప్పుడో మరచిపోయింది. అయినా ఆ అర్హతతో అమెరికాలో ఏ వుద్యోగం వస్తుందో తెలియదు. చదివే రోజుల్లో తరువాత మళ్లీ ఎప్పుడూ ఇంగ్లీషు మాట్లాడే అవసరం కానీ, అవకాశం కానీ రాలేదు. అమెరికా వచ్చినప్పటి నుండీ కొద్దిగా మెరుగుపడినా ఎక్కడో షాపుల్లోనూ, రెస్టారెంట్లలోనూ అక్కడక్కడా మినహా మాట్లాడింది లేదు. ఇక ఆఫీసులో వుద్యోగం చేసిన అనుభవం యిండియాలో కూడా లేదు.

సరిగా ఇలాంటి సమయంలోనే ఒకరోజు యింటర్నెట్‌లో ఎడ్వర్‌టైజ్‌మెంట్ చూసింది ఉమ. అప్పుడే పుట్టిన బిడ్డను చూసుకొనేందుకు 'నేనీ' సహాయం కావాలి అని దాని సారాంశం. వున్న వూరులోనే ఇంటికి నాలుగు మైళ్ల దూరంలోనే కావటంతో ఆ ఎడ్వర్‌టైజ్‌మెంట్‌ని వెంకట్ ముందు వుంచింది.

"పిల్లలిద్దరూ కొద్దిగా పెద్దవాళ్లు అయ్యారు, నాకా ఇంట్లో పనేమీ పెద్దగా వుండదు. ఎంతోకొంత డబ్బులు వస్తాయి కదా, చేరతాను," అంది ఉమ.

"నువ్వా? 'నేనీ'గా చేస్తావా?" కొద్దిగా ఆశ్చర్యపోతూనే అడిగాడు వెంకట్

"ఏమి చేస్తే? ఏమౌతుంది? ఇక్కడ చాలామంది చేస్తారుగా. యిండియాలోలాగా కాదుకదా," అంది ఉమ.

"సరే నీ ఇష్టం నీకు నచ్చితే వెళ్లు," పరిస్థితి అర్థం చేసుకొని ఫ్యామిలీ కోసం తన వంతు సహాయం చేయటానికి ముందుకు వచ్చినందుకు ఉమను మనసులోనే మెచ్చుకున్నాడు వెంకట్.

ఎడ్వర్‌టైజ్‌మెంట్ చూపిస్తూ "అందులోని ఫోన్‌కి కాల్ చేసి మీరు మాట్లాడి అన్నీ విషయాలు కనుక్కోండి," ఫోన్ వెంకట్ చేతికిచ్చింది ఉమ.

ఫోన్‌ని స్పీకర్‌లో పెట్టి మాట్లాడాడు.

అటు వైపు ఫోను ఎత్తగానే, "హలో నా పేరు వెంకట్. మీరిచ్చిన ఆన్‌లైన్ ఎడ్వర్‌టైజ్‌మెంట్ చూసి కాల్ చేస్తున్నాను."

"ఓహ్ అవునా అండీ. నా పేరు శ్రీనివాసు. మేము 'నేనీ' కోసం చూస్తున్నాము. తెలుగువాళ్లైతే బాగుంటుందని చూస్తున్నాము, మా ఆవిడకు అంతగా ఇంగ్లీషు రాదు," అవతల నుండి ఎడ్వర్‌టైజ్‌మెంట్ యిచ్చినవారు మాట్లాడారు.

"నా వైఫ్ 'నేనీ'గా చేద్దామనుకుంటుంది, ఎడ్వర్‌టైజ్‌మెంట్‌లో యిచ్చిన అడ్రస్ ఆధారంగా మా ఇల్లు మీ ఇంటికి సుమారు మూడు మైళ్లు దూరం వుండొచ్చు," చెప్పాడు వెంకట్.

'అలాగా, అయితే మన ఇళ్లు అంత దూరమేమీ కాదు. మరి 'నేనీ'గా ఏమైనా అనుభవం వుందా? ఎప్పటి నుండి రాగలరూ?" అడిగాడు అవతల నుండి శ్రీనివాసు.

"నేనీగా అనుభవమైతే లేదు. అంటే ఏమేమి పనులు చేయవలసి వుంటుంది?" ఉమ కూడా వింటుందన్న వుద్దేశ్యంతో ఆ ప్రశ్న అడిగాడు వెంకట్.

"మాకు పదిహేను రోజుల క్రిందట బాబు పుట్టాడు. నేను ఆఫీస్‌కి వెళ్లినప్పుడు ప్రియ ఒక్కతే ఇంట్లో వుండాల్సి వస్తుంది. మా ఇంటి పక్కవాళ్లంతా అమెరికన్స్. ఇక్కడ మేముంటున్న కాలనీలో కూడా మాకెవ్వరూ తెలీదు. మాకు 'నేనీ' హెల్ప్ కావాలి," చేప్పాడు శ్రీనివాస్.

ప్రియ అంటే వాళ్లావిడ పేరు కాబోలు అనుకుంది ఉమ.

"ఎప్పటి నుండి కావాలి, రోజూ ఎన్ని గంటలు వుండాలి, ఏమేమి పనులు చేయవలసి వుంటుంది?" ఇందాక తను అడిగిన ప్రశ్నకు శ్రీనివాస్ నుండి సరైన సమధానం రాకపోయేసరికి మళ్లీ అడిగాడు వెంకట్.

"నేను ఆఫీసుకి వెళ్లే టైంకి వచ్చి, మళ్లీ నేను ఆఫీస్ నుంచి ఇంటికి వచ్చేవరకూ ఎనిమిది గంటలు వుండవలసి వస్తుంది. ప్రియకి టిఫిన్, జ్యూసులు, కాఫీ, లంచ్, టైంకి మెడిసిన్స్, యిక మా బాబుకు డైపర్లు మార్చటం. బెడ్‌లో క్లోత్స్ ఛేంజ్ చేయటం, స్లీప్ రొటీన్స్, క్లీనింగ్, రెగ్యులర్‌గా 'నేనీ' చేసే పనులు మాత్రమే చాలు. లాండ్రీ, ట్రాష్ క్లీనింగ్, బాత్ రూంస్ క్లీనింగ్ లాంటివి వీకెండ్స్‌లో నేనే చేసుకుంటాను," చెప్పాడు శ్రీనివాస్.

"సో రోజుకు ఎనిమిది గంటలు?" నిర్ధారించుకునేందుకు మళ్లీ అడిగాడు వెంకట్.

"అవునండి నేనీకి రోజూ యిక్కడే లంచ్, కాఫీ, టీ, టిఫిన్, స్నాక్స్ ఫుడ్ అంతా వుంటుంది. నెలకు పదిహేను వందల డాలర్స్, వారానికి అయిదు రోజులే, శనీ ఆదివారాల్లోనూ, శెలవు రోజుల్లోనూ నేనుంటాను గనుక అవసరం లేదు, వీలుంటే రేపటి నుండే జాయిన్ అవ్వొచ్చు," విపులంగా చెప్పాడు శ్రీనివాస్.

కావలసిన అన్నీ వివరాలు అందేసరికి యిక మట్లాడవలసిన వేవీ లేకపోవటంతో, "ఓ. కే. ఆలోచించుకోని సాయంత్రంలోగా చెబుతాము," అంటూ ఫోన్ ముగించాడు వెంకట్.

ఉమ వైపు తిరిగి, "ఇక నువ్వే అలోచించుకో. అడగాల్సిన వన్నీ అడిగాము అవన్నీ చేయాల్సి వుంటుంది మరి," అన్నాడు వెంకట్.

"ఆలోచించేదేముందిక. కనీసం యింటి అద్దెకూ, కరెంట్ బిల్లులికీ సరిపోద్ది కదా. యింట్లో వుండి మాత్రం చేసేదేముంది. అంతగా నచ్చకపోతే మానేస్తాను," నేనీగా వెళ్లేందుకే సిద్దపడింది ఉమ.

రెండు మూడుసార్లు ఆలోచించుకుని ఆ సాయంత్రానికి శ్రీనివాస్‌కి ఫోన్ చేసి చెప్పారు మరుసటిరోజు పొద్దున్నే ఏడున్నరకు వస్తుందని.

మొదటిరోజు వెంకట్ కారులో దించేలాగా, ఆ తరువాత నుండి ఉమ సొంతంగా కారు డ్రైవ్ చేసుకుని వెళ్లేలా అనుకున్నారు. అనుకునట్టుగానే ఉమ పొద్దున్నే లేచి తాను తయారయ్యి వెంకట్‌ని నిద్రలేపింది. వెంకట్ లేచి పది నిమిషాలలో కారులో సిద్ధంగా వున్నాడు.

"మళ్లీ సాయంత్రం ఆయిదు గంటలకు పికప్ చేసుకోవటానికి వస్తాను సరేనా," అడిగాడు వెంకట్ ఉమను దిగబెట్టి.

"అలాగే. నా దగ్గర ఫోన్ వుంది కదా ఏదైనా కావాలన్నా, ఆలశ్యం అయ్యేలా వున్నా, మీకు ఫోన్ చేస్తాలే," అంది ఉమ.

బయట నుండి చూస్తే యిల్లు పెద్దదే. విశాలంగా వుంది. ఆ ఏరియాలో యిళ్లు ఖరీదైనవే.

ఉమ కారు దిగి అనుకున్నట్టుగానే తనే వెళ్లి తలుపు దగ్గర వున్న బజర్ నొక్కింది.

ఈలోపు వెంకట్ కారు వెనక్కు తిప్పుకున్నాడు.

బజర్ నొక్కిన నిమిషంలోపే తలుపు తీసాడొక వ్యక్తి. దూరంగా కార్లో నుంచి చూస్తున్న వెంకట్‌కి అతనే శ్రీనివాస్ అయి వుండవచ్చు అనుకున్నాడు.

తలుపు తీసిన వ్యక్తి, "మీరేనా నేనీ?" అడిగాడు.

"అవునండి నా పేరు ఉమ," అంటూ పరిచయం చేసుకుంది.

"నేనేనండి శ్రీనివాస్‌ని, రండి లోపలికి రండి," అంటూ పక్కకి జరిగి లోనికి దారి చూపించాడు

అతడే శ్రీనివాస్ అని తెలిసిన తరువాత వెనక్కి తిరిగి అనుకున్నట్లుగానే వెంకట్‌ని వెళ్లిపొవచ్చు అన్నట్లు చేయి వూపింది.

"ఓ మీవారు కూడా వచ్చారా, లోపలికి తీసుకు రాకపోయారా, వచ్చి కాఫీ అయినా తీసుకునేవారు," మర్యాదపూర్వకంగా అడిగాడు శ్రీనివాస్.

"పర్వాలేదులెండి మరోసారి వస్తారు, అయనకు పని వుంది కూడానూ," అంది ఉమ యిల్లంతా కలియచూస్తూ.

"మీరోస్తున్నారని చెబితే ప్రియ యిప్పుడే లేచి బ్రష్ చేసుకుంటుంది. ఈపాటికి అయిపోయి వుండొచ్చు పిలుస్తాను మీరు కూర్చోండి," అంటూ లోపలికి నడిచాడు శ్రీనివాస్.

"ఆ ఎందుకండీ లేపటం నేనే వచ్చేదాన్ని కదా," అంది ఉమ హాల్లో వున్న సొఫాలో కూర్చుంటూ.

లోపలినుండే, "పర్వాలేదు యిది ప్రియ లేచే టైమే, మీరు కూర్చోండి," అన్నాడు శ్రీనివాస్.

మళ్లీ నిమిషం వ్యవధిలోనే లోపల నుండి తిరిగివచ్చి, "అయిపోయింది వచ్చేస్తుంది," అన్నాడు శ్రీనివాస్.

"మీరేం చేస్తుంటారు?" అడిగింది ఉమ.

"ఐ.టీయేనండీ. అమెజాన్‌లో ప్రాజెక్ట్ మేనేజర్‌గా చేస్తున్నాను," అన్నాడు శ్రీనివాస్

"ఓహో ఎన్నాళ్లైంది యూ.ఎస్ వచ్చి?" అడిగింది ఉమ.

"నాలుగేళ్లు అయ్యింది, పెళ్లైన ఆరునెలలకే నాకు ఆమెరికాలో వుద్యోగం వచ్చింది, యిద్దరం కలిసి వచ్చేశాము. అప్పటినుండి ఇక్కడ యూ.ఎస్.లోనే వుంటున్నాము. ఇంతకుముందు ఫ్లోరిడా

లో వుండేవాళ్లం. ఇక్కడికి వచ్చి రెండు సంవత్సరాలవుతోంది. పోయిన ఏడాదే ఈ యిల్లు తీసుకున్నాము,'' అడగక్కుండానే చాలా విషయాలు చెప్పేస్తున్నాడు శ్రీనివాస్

''మరి ప్రియ కాన్పుకి వస్తే మీ యింట్లో వాళ్లుగానీ, ప్రియ వాళ్లింట్లో వాళ్లుగానీ రాలేదా? పేరెంట్స్‌కి వీసా త్వరగా యిస్తారుగా?'' అడిగింది ఉమ

''అదో పెద్ద స్టోరీ లెండి. మాది లవ్ మ్యారేజ్, మా ఇంట్లో వాళ్లు వొప్పుకోలేదు. అందుకే గుళ్లో పెళ్లి చేసేసుకున్నాము. ఆ తరువాత లక్షా తొంభై గొడవలు జరిగాయి. మావాళ్లు, వాళ్లింట్లో వాళ్లతో మాట్లాడరు. ఇక్కడికి వచ్చిన తరువాత మళ్లీ యిండియా వెళ్లలేదు. యిక మీరు రోజూ వస్తూ వెళుతూ ఇక్కడే వుంటారుగా, కబుర్లు చెబుతూ ప్రియనే మీకు మొత్తం వివరంగా చెబుతుంది లెండి,'' అంటూ చెప్పుకుపోతూనే వున్నాడు శ్రీనివాస్.

ఇంతలో, ''ఏమండీ,'' అంటూ లోపలి నుండి పిలుపు వినబడింది.

ఆ పిలుపు ప్రియాదే అయివుంటుంది అనుకుంది ఉమ.

''ఆ ప్రియా రాగలవా లేక నేను రానా, యిక్కడ ఉమగారు వచ్చారు. వచ్చి పరిచయం చేసుకో''.

''ఆ నేనే వస్తున్నాను లెండి,'' అంటూనే ప్రియ లోపల నుండి హాల్లోకి వచ్చింది.

సోఫాలో కూర్చున్న ఉమ పక్కకు తిరిగి ప్రియ వైపు చూసింది.

హాల్లోకి వస్తూనే సోఫాలో కూర్చున్న ఉమను చూసింది ప్రియ.

సెల్‌ఫోన్ రింగ్ అవుతోంది. ఉమను దించేసిన తరువాత ఇంటికి తిరిగివెళ్లే దారిలో కార్ డ్రైవింగ్ చేస్తూనే ఫోన్ అందుకున్నాడు వెంకట్.

''ఎక్కడున్నారు మీరు,'' ఉమ దగ్గర నుండి వచ్చిన ఫోన్ అది.

''ఎక్కడుండేది ఏముంది, కార్ డ్రైవింగ్‌లో వున్నా. ఇంకా మూడు నిమిషాల్లో మనింట్లో వుంటా,'' అన్నాడు వెంకట్.

''వెంటనే కారు వెనక్కి తిప్పుకొని ఇక్కడికి వచ్చేయండి,'' అంది ఉమ.

అంతలోనే ఉమ దగ్గర నుండి ఫోన్ ఎందుకు వచ్చిందో అర్థంగాక, ''ఏంటి ఏమైంది?'' ఉమ గొంతులో కంగారు విని ఆదుర్దాగా అడిగాడు వెంకట్.

''మీరు ముందు వెంటనే రండి,'' అంటూ చటుక్కున ఫోన్ కట్ చేసింది ఉమ.

ఏమైయిందో అర్థం అవలేదు. కార్ వెనక్కి తిప్పి ఉమను వదిలిన చోటుకే పోనిచ్చాడు వెంకట్.

ఉమ గొంతులో కంగారు విని ఏమయిందోననే ఆత్రుత. నేనీగా చేయటం నచ్చలేదు కాబోలు అని తెలుసుకుందామనే ఉద్దేశ్యంతో ఈసారి వెంకట్ కాల్ చేసాడు ఉమకి.

''ఏమయింది బాగున్నావా? ఎనీ ప్రాబ్లం?'' అడిగాడు వెంకట్.

''వచ్చిన తరువాత చెబుతాను. ముందు ఎంత దూరంలో వున్నారూ, ఎంత టైంలో వస్తున్నారు చెబుతారా?'' గట్టిగానే అడిగింది ఉమ. సమాధానం ఇచ్చేలోపే మళ్లీ ఫోను పెట్టేసింది.

ఉమ యింకా కంగారులోనే వున్నట్లు అనిపించింది వెంకట్‌కి.

ఉమకి ఏమయిందోనని అలోచనలతో కారు కొద్దిగా స్పీడు పెంచి నడుపుతున్నాడు.

ఫోన్ పెట్టీ పెట్టకముందే మళ్లీ ఉమ నుండే ఫోన్.

''మూడు నిమిషాల్లో అక్కడ వుంటాను,'' అని వెంకట్ అటు నుండి ఉమ మాట వినకుండానే అనేశాడు.

వెంకట్ మాట ముగించేలోపే, ''వినండి, చెప్పేది వినండి ముందు... నేను వాళ్లింటి నుండి బయటకు వచ్చేసి రోడ్ మీద నడుస్తున్నాను. వాళ్ల యింటిదాకా వెళ్లనవసరంలేదు... మీరొచ్చేలోపు రోడ్ చివరలోనే కనిపిస్తాను,'' చెప్పింది ఉమ.

ఉమ స్పీడుగా నడుస్తూ మాట్లాడుతుందనే విషయం ఫోన్‌లో కొద్దిగా అయాసపడుతూ మాట్లాడిన తీరుతో అర్థమైపోతుంది వెంకట్‌కి.

''ఇంక రెండు నిమిషాల్లో వుంటా,'' వెంకట్ ఫోను కట్ అయ్యింది.

కారు కాలనీకి దగ్గరకు వచ్చేసరికే రోడ్డు మీద నడుస్తూ ఎదురుగా కనపడింది ఉమ.

కారు ఆపగానే డోరు తెరిచి లోపల కూర్చొని, ''పోనివ్వండి,'' అంది ఉమ.

కారును ముందుకు పోనిచ్చాడు వెంకట్.

''ఏంటి అక్కడ కండిషన్స్ నచ్చలేదా?'' అడిగాడు వెంకట్

ఉమ మాట్లాడలేదు.

''ఏంటి అలా వున్నావు ఏమైంది?'' మళ్లీ అడిగాడు వెంకట్

ఈసారి కూడా ఉమ మాట్లాడలేదు

కారును మెల్లగా డ్రైవ్ చేస్తూ ఇంటి దారిలో పోనిస్తున్నాడు వెంకట్.

చూడటానికి ఉమ క్షేమంగానే వుంది కనుక ఇక అసలు విషయం మెల్లగా ఉమ చెబుతుందిలే అని వెంకట్ చాలాసేపు ఉమను మాట్లాడించలేదు. ఉమ కూడ చాలాసేపు మౌనం వహించింది.

ఈ కొద్ది నిమిషాలలోనే ఆ యింట్లో ఏమి జరిగి వుండొచ్చు అని ఆలోచిస్తూ కారు నడుపుతున్నాడు. ఏమి జరిగిందోనని ఉత్కంఠ. మరికొంతసేపు యిద్దరి మధ్యా నిశ్శబ్దం. ఆరోజు సాయంత్రానికి వచ్చి పికప్ చేసుకోమని చెప్పిన ఉమ అలా వున్నట్లుండి అయిదు నిమిషాల్లోనే ఎందుకు వచ్చేసింది? కారణ మేమై వుంటుందో ఊహించలేకపోతున్నాడు వెంకట్. ఉమను ఎప్పుడూ అలా చూడలేదు.

ఎదురుగా ఎర్రలైటు పడితే ట్రాఫిక్ దగ్గర కొద్దిసేపు ఆపి మళ్లీ గ్రీన్‌సిగ్నల్ పడగానే కారు ముందుకు నడిపాడు. ఇల్లు దగ్గర పడేవరకూ యిద్దరి మధ్యా పూర్తి నిశ్శబ్దం.

కొంతసేపటికి వెంకట్ వైపు చూసింది ఉమ.

ఉమ వైపు చూసాడు వెంకట్.

చివరికి మౌనాన్ని వీడి నోరువిప్పింది ఉమ.

"ఇది నమ్ముతారా..." అన్న ఉమ వైపు అయోమయంగా చూసాడు వెంకట్.

ఊహకు అందని విషయాలేన్నో మెదడులో తిరుగాడుతుంటే, మనసులోని భావాలను అతి కష్టంమీద అణచి పెట్టుకుంటూ భారంగా చెప్పింది ఉమ

"ఆ శ్రీనివాస్ ముద్దుగా పిలుచుకుంటున్న తన భార్య ప్రియ ఎవరో కాదు..."

ప్రశ్నార్థకంగా ఉమ వైపు చూసాడు వెంకట్.

"రాజీ. మన రాజినే!" అని చెబుతున్న ఉమ మాటలు పూర్తి కాకుండానే

"ఎవరూ...? మన దగ్గర పనిచేసిన రాజమ్మా?" వెంకట్ ఒక్కసారిగా అవాక్కయ్యాడు

"రాజమ్మ... రాజీ... ప్రియ..."

'రాజీ. మన రాజీ ఎవరో రోడ్డునపోయే అబ్బాయితో మాట్లాడుతుందట, ఇంటి ఓనర్ రంగమ్మ చూసి చెప్పింది,' ఉమ అప్పుడు చెప్పిన మాటలు లీలగా మళ్లీ వినిపించాయి వెంకట్‌కి.

'రాజీ! రాజీ!! అయ్యగారు నిద్ర లేచారు కాఫీ చేసి తీసుకురా," హాల్లో నుంచి అరచి చెప్పింది ఉమ.

'అలాగే అమ్మగారూ,' అంటూ గబగబా వంటింట్లోకి వెళ్లింది రాజి.

పాత రోజులన్నీ కళ్ల ముందు గిర్రున తిరిగాయి.

రాజీ పడని జీవితం.

సుడులు తిరుగుతున్న ఆలోచనలతో వుండగానే, చివరి మలుపు తిరిగి కారు ఇంటికి చేరింది.



చీరాలలో పుట్టిన సిద్ధం వెంకటనారాయణరావు విజయవాడలో ఉన్నతాభ్యాసం చేసి అనంతరం తెలుగు రాష్ట్రాల్లో వివిధ ఉద్యోగాలు చేసి 2000 సంవత్సరంలో అమెరికాకి వచ్చారు. గత 20 సంవత్సరాలుగా మిచిగన్ రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉంటున్నారు. అప్పుడప్పుడు కథలు రాస్తుంటారు. సాహిత్యం అంటే అభిలాష.

Deepak Tolani

Senior Property Consultant

ORN 18715

deepak@classicproperties.ae

www.classicproperties.ae

+971 42 711 128

+971 42 711 116

+971 55 248 5849

CLASSIC PROPERTIES

KEY TO PROSPERITY



అద్వైతామృతం

పబ్బరాజు శ్రీనివాస్

కాల్గరీలోని జెనెసిస్ సెంటర్ కిటకిటలాడుతోంది. తెలుగు సమితి వారు నిర్వహిస్తున్న దీపావళి సాంస్కృతిక కార్యక్రమానికి వెయ్యి మందికి పైగా హాజరయ్యారు. రంగు రంగుల బట్టలతో, నగలతో ముచ్చట్లు చెప్పుకుంటున్న మహిళలు, వివిధ కాస్ట్యూమ్‌లతో ఉన్న కళాకారులూ, హడావిడిగా అటూ ఇటూ తిరిగే కార్యకర్తలూ, ఆటలాడుతూ పరిగెత్తే పిల్లలూ, ప్రదర్శన స్టాల్స్ పెట్టుకున్న స్పాన్సర్లూ, చాలానే కోలాహలంగా ఉంది.

అతిథుల జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకుని శరణ్, రాబీ హాల్లోకి అడుగుపెట్టారు.

"అబ్బా! ఇంతమంది తెలుగువాళ్లని చూసి ఎంత కాల మైందో!" అన్నాడు శరణ్ ఉత్సాహంగా.

కెనడాలో దిగగానే తన పేరు రాబీగా మార్చుకున్న రమణ, చిరాగ్గా మొహంపెట్టి, "ఇక్కడికి వచ్చినా మనవాళ్ల బుద్ధులు ఇంకా ఆ పాతకాలంనాటివే. అవే నగలు, అవే కబుర్లు. అవే నాటకాలు, అంతా సేమ్ సేమ్. ఎప్పటికి మారుతారో! ఈ కంట్రీకి వచ్చి నప్పుడు కాస్త ఇక్కడ పద్ధతులు, అలవాట్లు నేర్చుకుంటే ఈ సమాజంలో ఇమడగలము కదా," అన్నాడు.

"అప్పుడే మొదలెట్టావ్! నీతో ఎప్పుడూ ఇదే గొడవ. అదుగో, ప్రోగ్రాం మొదలయ్యేలా ఉంది. రా కూర్చుందాం," అంటూ శరణ్ ముందుకు నడిచాడు. రాబీ అతని వెనకే వెళ్లాడు.

వాళ్లు ఖాళీ సీట్లు వెదికి కూర్చునేసరికి, ఒక చిన్న పిల్లాడు, బహుశా ఆరేడేళ్లు ఉంటాయేమో, మైకు ముందు నిలబడి గొంతు సవరించుకుని చక్కగా పాటను ఆలపించసాగాడు.

ఉనికి తెలుగు... మనికి తెలుగు
పరవశించు పలుకు తెలుగు
ఎదలో నాదమ్ము తెలుగు
మన అణువణువూ తెలుగు

మంచి ముత్యాలసరము... మన జన్మకు వరము
తియ్యని తేనియల పంచు తేట తెనుగుతనము
కూచిపూడి నాట్యము... విజయనగర వైభవము
కృష్ణదేవరాయ విరచిత భువనవిజయము

అన్నమయ్య కీర్తనము... ఆటవెలది పద్యము
అసమానము అవధానము... అద్భుత ఆంధ్ర నాట్యము
అల్లూరి విప్లవము... కందుకూరి సంస్కరణము
శ్రీరాముల త్యాగము... తెలుగుసీమ ఉద్భవము

ఇన్నిచ్చిన మన భాషకు మనమేమిస్తున్నాము?
మనికిని మనుగడ పేరిట కప్పెట్టేస్తున్నాము
నొప్పెడితే అమ్మా అని విలవిలలాడే మనము
మన అమ్మకు నొప్పెడితే విసుగు చూపుతున్నాము

బిడ్డల ఆదరణ లేని తెలుగుతల్లి కంట నీరు
తుడిచే తీరిక లేక పరుగులు తీస్తున్నాము
ఎక్కడిదీ న్యాయము... ఎంతవరకు సమ్మతము?
ఈ తప్పును సరిదిద్దే బాధ్యత గలవారము
ఈ తప్పును సరిదిద్దే బాధ్యత గలవారము

ఉనికి తెలుగు... మనికి తెలుగు
పరవశించు పలుకు తెలుగు
ఎదలో నాదమ్ము తెలుగు
మన అణువణువూ తెలుగు

భావోద్వేగంగా ఆ పిల్లాడు పాడుతుంటే అక్కడ వింటున్న వారి రోమాలు నిక్కబొడుచుకున్నాయి. హాలంతా నిశ్శబ్దం అయిపోయింది. పాట పూర్తయ్యేసరికి హాలు చప్పట్లతో నిండిపోయింది. ఆ అబ్బాయి అందరికీ నమస్కరించి వేదిక నుండి దిగిపోయాడు.

ఎంసీగా వ్యవహరిస్తున్న నలభై ఏళ్ల రామమోహన్, సభని ఉద్దేశించి మాట్లాడుతూ, "ఈరోజు మనందరికీ గర్వకారణం. మన సమితిని స్థాపించిన మొదటితరం వారు ఒకరు ఈరోజు మన మధ్యన ఉన్నారు. వారు- మన తెలుగుభాషకు, అలాగే కెనడా దేశానికీ చేసిన సేవలను గుర్తిస్తూ ఇటీవలే గవర్నర్ జనరల్ అవార్డు స్వీకరించిన శ్రీ అద్వైత్‌గారు. ఈనాటి కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా రావడం మనందరికీ చాలా సంతోషంగా ఉంది. వారిని వేదికమీదకి వచ్చి దీపప్రజ్వలనం చేయవలసినదిగా కోరుతున్నాను," అన్నాడు.

అందరూ చూస్తుండగా డెబ్భై ఏళ్ల ఒక వ్యక్తి వేదికవైపు నడిచి వెళ్లాడు. అతని చెయ్యి పట్టుకుని, ఇందాక పాడిన అబ్బాయి కూడా వెళ్లాడు. పెద్దాయన ముఖంలో కాలాన్ని జయించిన ప్రశాంతత, అనుభవాల పరిపక్వత స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇంతలో రాబీ ఫోన్ బీప్ అయింది. అతను ఎవరా అని చూసాడు. అమ్మ నుంచి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. విసుక్కుంటూ, చదవకుండా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి వేదికవైపు దృష్టి మరల్చాడు.

రామమోహన్ మాట్లాడుతూ, "ఇప్పుడు శ్రీ అద్వైత్‌గారికి పుష్ప గుచ్ఛము ఇవ్వవలసినదిగా ఆయన మనవడయిన చిరంజీవి సమీహన్‌ని కోరుతున్నాము," అన్నాడు.

అద్వైత్‌తోపాటు వేదికనెక్కిన అబ్బాయి కార్యకర్తలు ఇచ్చిన పుష్పగుచ్ఛాన్ని తాతయ్యకి ఇచ్చి, తాతయ్య పాదాలకు నమస్కరించి ఆశీస్సులు తీసుకున్నాడు.

"ఇప్పుడు శ్రీఅద్వైత్‌గారిని మాట్లాడవలసినదిగా కోరుతున్నాను," అన్నాడు రామమోహన్. ఒక కార్యకర్త ఆయన చేతికి మైక్ ఇచ్చాడు.

రాబీ, శరణ్‌తో మెల్లగా, "ఈ పాత పద్ధతులు, భాషపై మమకారాలు దేనికి? జీవితంలో ముందుకు సాగడానికి, ఉద్యోగంలో పైకి రావడానికి ఉపయోగపడని వాటిని పట్టుకుని వేలాడటం దండగ," అని వ్యాఖ్యానించాడు.

శరణ్ అతని మాటలు పట్టించుకోలేదు.

అద్వైత్ మైక్ అందుకుని, "నేను సరిగ్గా నలభై ఏళ్ల క్రితం ఇదే ఊళ్లో, నా మూలాలతో సంబంధం పెట్టుకోవడం ఎంత నిరుపయోగమో, జీవితంలో పైకి రావడానికి ఉపయోగపడని వాటిని పట్టుకుని వేలాడటం దేనికి? అని ఆలోచించిన రోజులు నాకు గుర్తున్నాయి," అన్నాడు. ఆ మాట వినగానే రాబీ ఒక్కసారిగా నిశ్చేష్టుడయ్యాడు. అతను తను విన్నది నమ్మలేకపోయాడు. ఆసక్తిగా అద్వైత్‌వైపు చూడటం మొదలుపెట్టాడు.

అద్వైత్ తన ప్రసంగాన్ని కొనసాగించాడు.

❖

"హైదరాబాదులోని బంజారాహిల్స్‌లో పెరిగిన నేను, చిన్నతనం నుంచే కెనడా కలలు కనేవాడిని. పాతికేళ్ల వయసులో ఇంజినీర్‌గా టొరంటోకు వలసవచ్చాను. మూడేళ్ల తరువాత అక్కడ నుండి నేను ఇక్కడికి వచ్చి స్థిరపడిపోయాను. కెనడియన్ సమాజంలో కలిసిపోవడం పెద్ద సవాలుగా అనిపించలేదు. నేను త్వరగా కెనడియన్ స్నేహితులను సంపాదించుకున్నాను, ఐస్ హాకీ ఆటను నేర్చుకున్నాను. వీకెండ్‌లలో పబ్‌లకు వెళ్లడం మొదలుపెట్టాను. తెలుగులో మాట్లాడటం తగ్గించేసి, ఇంట్లో కూడా ఆంగ్లంలోనే ఎక్కువగా మాట్లాడేవాడిని. నా ఫోన్ నుండి తెలుగు పాటలు మాయమయ్యాయి, వాటి స్థానంలో పాశ్చాత్య సంగీతం చోటు చేసుకుంది."

"మొదట్లో తెలుగు పండుగలను గుర్తుచేసుకునే నేను, క్రమంగా వాటిని పట్టించుకోవడం మానేసాను. దీపావళి, సంక్రాంతి వంటి పండుగలకు తక్కిన తెలుగు స్నేహితులు గుడికి వెళ్లి సంబరాలు చేసుకున్నప్పుడు, నేను స్నేహితులతో కలిసి స్కీయింగ్‌కు లేదా హైకింగ్‌కు వెళ్లేవాడిని. 'ఇంకా అవే పాత పద్ధతులు, సంప్రదాయాలు,' అని నా కెనడియన్ స్నేహితులతో తెలుగువారిని ఉద్దేశించి నవ్వేవాడిని.

"'మీరు కెనడాలో ఉన్నారని మర్చిపోయారా? ప్రపంచం మారుతోంది, మనం కూడా మారాలి!' అని నన్ను కలిసిన కొద్ది మంది తెలుగువారికి కూడా అయాచిత సలహా ఇచ్చేవాడిని. నా మత విశ్వాసాలపై కూడా నాకు సందేహాలు మొదలయ్యాయి. దేవుడు, పూజలు అన్నీ మూఢనమ్మకాలుగా అనిపించాయి."

అద్వైత్ చెప్పుకుంటూ పోతున్నాడు. వింటున్న రాబీకి ప్రతి మాటా ఒక శూలంలా గుచ్చుకుంటోంది.

"నాకారోజు బాగా గుర్తుంది. నా దృక్పథాన్నీ, నా జీవితాన్నీ మార్చేసిన రోజు అది. నిజంగా నేను పునర్జన్మ ఎత్తాను ఆరోజు.

"రోజంతా కెనానాస్కిస్‌లో హైకింగ్ చేసి నేను, నా స్నేహితులు ఎవరి కార్లలో వాళ్లము కాల్గరీకి తిరిగి బయలుదేరు తుండగా నా కారు ఎందుకో స్టార్ట్ అవడానికి మొరాయించింది. నా కెనడియన్ స్నేహితులు ఏవేవో అర్జెంటు పనులున్నాయని చెప్పి, నాకోసం ఆగకుండా వెళ్లిపోయారు. నేను కాసేపు కుస్తీపట్టిన తరువాత నా కారు మొదలయింది.

"అయితే డ్రైవింగ్ మొదలుపెట్టిన పావుగంటకే బ్రేకులు పని చెయ్యడం మానేసాయి. రోడ్డు మలుపు తిరిగే సమయానికి వేగం తగ్గించలేకపోయాను. దానితో నా కారు రోడ్డు మీద నుంచి కిందకి జారి, వేగంగా దిగువన ఉన్న నది వద్దకు ఉరకలేసింది. నేను ఆ

రోజు బ్రతకననుకున్నాను. ఎదురుగా వచ్చిన ఒక చెట్టుని ఢీ కొట్టి, కారు ఆగిపోయింది. తలకి బలమైన గాయాలు తగిలి, నేను కారులో స్పృహ తప్పిపోయాను.

"కాసేపటికి నేను కళ్లు తెరిచి చూసేసరికి ఆంబులెన్సు వచ్చి నన్ను అందులో ఎక్కిస్తున్నారు. ఆసుపత్రికి హెలీకాప్టర్‌లో తీసుకు వెళ్లి, నాకు చికిత్స చేసారు. నేను ఎక్కడున్నానో వాళ్లకి ఎలా తెలిసిందని అడిగాను.

"ఎవరో పెద్దాయన నన్ను చూసారని, ఆయన హైవేవద్దకు వచ్చి, దారిని పోయే కారుని ఆపి వాళ్లకి చెప్పాడని తెలిసింది. ఆరోజుల్లో సెల్‌ఫోన్లు లేవు మరి. ఆ కార్ డ్రైవర్ దగ్గరలో ఉన్న ఫోన్ బూత్ నుండి ఫోన్ చేసి చెబితే, హెలికాప్టర్ వచ్చిందిట. ఆ పెద్దమనిషి గురించి వాకబు చేస్తే, కష్టంమీద ఆయన కాల్గరీ హిందూమందిర్‌లో పూజారికి దూరపు బంధువు అవుతారని, ఏదో ప్రత్యేకమైన పూజలు చెయ్యడానికి స్పెషల్ వీసా మీద వచ్చారని తెలిసింది.

"తెలిసిన వెంటనే వెదుక్కుంటూ వెళ్లాను. ఆయన తెలుగు వారని తెలిసి ఆశ్చర్యపోయాను. పూజలు పూర్తయ్యాక ఆయన్ని, బంధువులు కొండల వద్దకు తీసుకువచ్చారని, ఆయన నన్ను అక్కడ చూసారని చెప్పారు.

"'ఇదంతా దైవనిర్ణయమని, నా గొప్ప ఏదీ లేదని,' ఆయన చెప్పినప్పుడు, నాలో అంతర్మథనం మొదలయింది. నేను బలవంత పెట్టినా ఆయన నా వద్ద నుండి ప్రతిఫలం ఏమీ తీసుకోలేదు. మనిషి సుఖంగా బ్రతకడానికి కావలసినది ధనార్జనకన్నా ముఖ్యం మనఃశాంతి అనీ, అది లేనప్పుడు ఏమున్నా అన్నీ దండగేనని ఆయన చెప్పినప్పుడు, నిజం నాకు నెమ్మది నెమ్మదిగా బోధపడింది.

"ఆ సంఘటన నా జీవితాన్ని మార్చేసింది. ఆయన కాల్గరీలో ఉన్నంత కాలం, నేను వారిని తరచుగా కలుసుకోవడం మొదలు పెట్టాను. వారు భారతీయ సంస్కృతి, తెలుగు సంప్రదాయాల గురించి ఎన్నో విషయాలు చెప్పారు. నేను నెమ్మదిగా నా దృక్పథాన్ని మార్చుకోవడం మొదలుపెట్టాను. తెలుగు పుస్తకాలు చదవడం ప్రారంభించాను. తెలుగు పండుగలలో పాల్గొనడం మొదలు పెట్టాను. నా కెనడియన్ స్నేహితులతో తెలుగు సంస్కృతి గురించి మాట్లాడటం మొదలుపెట్టాను.

"కొద్దికాలంలోనే నేనూ, నా స్నేహితులం కొంతమంది కలిసి ఇక్కడ తెలుగుసమితిని ప్రారంభించాము. మేమంతా కలిసి తెలుగుభాషను ప్రోత్సహించడానికి, తెలుగు సంస్కృతిని కెనడియన్ సమాజంలో పరిచయం చేయడానికి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించాము. 'మన మూలాలు మన బలం, అవి కోల్పోతే మన ఉనికిని కోల్పోతాం,' అని నేను బహిరంగంగా చెప్పడం మొదలుపెట్టాను. కెనడియన్ సమాజంలో సంపూర్ణంగా కలిసిపోయినప్పటికీ, నా తెలుగు గుర్తింపును సగర్వంగా ప్రకటించుకున్నాను. అన్నిటికన్నా ముందు నేను తెలుగువాడిని. మీలో ఒకడిని."

❖

అద్వైత్ ప్రసంగం ముగియగానే, సభామందిరం కరతాళ ధ్వనులతో మార్మోగిపోయింది.

చప్పుడు సద్దుమణిగిన తరువాత, రామమోహన్ ఆయనతో, "మిమ్మల్ని కాపాడిన ఆ వ్యక్తి ఎవరు? ఇప్పుడు ఎక్కడున్నారు?" అని అడిగాడు.

"ఆయన నా ప్రాణదాత. వారి పేరు శ్రీ వెంకటరమణాచార్యులు. ప్రస్తుతం ఆయన వారి స్వస్థలమైన కాకినాడలో ఉంటున్నారు," అని అద్వైత్ చెప్పిన మాటలు విని, రాబీ ఉరఫ్ రమణ వెక్కివెక్కి ఏడవసాగాడు.

అది చూసి శరణ్ గాభరాపడి, "రాబీ, ఏమైంది? ఎందుకలా ఏడుస్తున్నావు?" అని అడిగాడు.

"నలభై ఏళ్ల క్రితం, నా తాతయ్య ఈయనలో ఇంత మార్పు తెచ్చాడు. ఆ తాతయ్య మాటలు నిర్లక్ష్యం చేసి, నేను ఎందుకూ పనికిరాని ఆలోచనలతో ఇలా తయారయ్యాను," అన్నాడు రమణ కళ్లు తుడుచుకుంటూ.

"అవునా!" అన్నాడు శరణ్ ఆ మాటలు విని. ఒకక్షణం ఆలోచించి, "ఈరోజు కూడా నీ తాతయ్య ఈయన రూపంలో నీకు మళ్లీ మార్గోపదేశం చేశారనుకో. లేకపోతే ఇప్పుడు, ఇక్కడ, ఎవరో ఆయన గురించి నలభై ఏళ్ల క్రితం జరిగిన సంఘటన చెప్పడం అద్భుతం కాదూ?" అన్నాడు.

"అవును, ఇది అద్భుతం. అనుభవైకవేద్యం," అన్నాడు రమణ. అతను తన కన్నీళ్లు తుడుచుకుని, లేచి నిలబడి, మిగిలిన వారితోపాటు అద్వైత్‌కు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చాడు. ఆ క్షణంలో రమణకు ఒక కొత్త దృక్పథం, తన 'తెలుగు'తనంపట్ల గౌరవం ఏర్పడింది.

❖

ప్రోగ్రాం పూర్తయ్యాక, హాలు బయటికి వెళ్లి రమణ వాళ్ల అమ్మకి ఫోన్ చేసాడు.

"అమ్మా, రమణని మాట్లాడుతున్నాను. నువ్వు, నాన్నా బాగున్నారా? ఆరోగ్యం జాగ్రత్త. నేను బాగానే ఉన్నాను. నాకోసం బెంగ పెట్టుకోవద్దు. ఇప్పుడే ఇక్కడేం జరిగిందో తెలిస్తే నువ్వు ఆశ్చర్యపోతావు..."

ధర్మో రక్షతి రక్షితః
ఓం తత్సత్।



పబ్బరాజు శ్రీనివాస్ వృత్తిరీత్యా గణకుడు. తెలుగంటే ప్రాణం. తెలుగులో ఒక నవల , ఒక కథల సంకలనం, ఒక శతకం ప్రచురించారు. ప్రస్తుతం మరొక నవల, కథల సంకలనం, పద్య రూపంలో రామాయణం వ్రాసే ప్రయత్నంలో ఉన్నారు. ఇంగ్లీషులో ఆరు నవలలు, ఒక కథాసంకలనం ప్రచురింపబడ్డాయి. ఇవికాక, వాట్సాప్‌లో 'గగన వీధి' తెలుగు పత్రిక ఛానల్ నిర్వహిస్తున్నారు. నివాసం కాల్గరి.



ఆకాస కోట

సంజనాపద్మం

ఈ కతల ఐదు పేరు - పన్నగాండు, పన్నగత్తె, కూంతురు, కొడుకు, మనవండు. అనిక నేను. అప్పుడు లెక్క ఆరు. అయితె నాకు ఈడ పని, కత చెప్పేదె.

నాకు ముందర ఈడ రెండు ఎద్దులు ఉండెనంట. కూడా నాలుగు పాల్ పితికే ఆవులుం.

"ఇదే అమ్మ మన సొత్తు, గట్టి సొమ్ము, నీ కడసి కాలం దాంకు ఉండి నిన్ను కాపాడు," అంట చెప్పి మన పన్నగత్తెను పెళ్లి చెశి పెట్టినారు.

మొదటి బిడ్డ కూంతురు, అనిక నిండా ఏండాదిలు తాలి కొడుకు. రెండు బిడ్డలు అయ్యినాక మన పన్నగాండు చచ్చి పొయ్యినాండు అంట. ఇప్పుడు కతల నాలుగు పేరు.

బతికేదానికే ఏమి చేసేది అంట తెలవకొండ పొయ్యినప్పుడు, కొదిగ కొదిగ ఓటి ఓటిగ నా అమ్మేదానికి ఆరంబిచ్చిరి. మొదట్ల ఎద్దులును అమ్మింది మన పన్నగత్తె.

"మనం ఇంక బండి కట్ట నా పొయ్యెము, నడిసితె సాలదా?"

కొడుకు చదువూము, కూంతురు పెళ్లీము మిచ్చం ఉండిన ఆవులును తినిది అంట.

అనిక కొదిగ ఏండాదిలు తాలి నన్ను తీసిరి. ఒగ సెకండ్ - హేండ్ టివిఎస్ 50. ఒగ చెట్టిగారు ఇంట్లా ఏదో మూలల మొండిగా నిలిసికొని ఉండిన నేను, ఈ ఇంటికి వచ్చి చేరితి. కొడుకును పల్టెం లా ఉడిసి పిలిసెది, పనికి పొయ్యెది, బారం మోసెది అంట ఆ ఇంట్లా పన్నగాండు చేసిన అన్నీ పనినూ నేనే చేసితి.

పెళ్లి అయ్యిన కొత్తల ఉండే సిగ్గు మారగా, నా దెగ్గిర కొదిగ దినం రానే లెదు పన్నగత్తె. అనిక తోలి పలగినాక నేను లెకొండ ఒగ పని నడవదు ఇంట్ల. 'డుర్ర్ డుర్ర్,' అంట నా సద్దు వినితేనే పని నడుసు ఆడ.

ఒగ నాండు, కొడుకుకు కొత్త పాంతలు వేసి, పన్నగత్తె ను దెగ్గిర ఇంట్లా ఉండి ఒగ కొత్త సీర తీసి కత్తికొని, కూంతురు ఇంటిలా ఒగ విసెషానికి పోతిమి. నన్ను స్టేండ్ వేసి నిలిపేసి, ఒగ నాలుగు ఎట్టులు ఎత్తి పెట్టలేదు, అదిలోగ కూంతురు పరుగెత్తి వచ్చింది.

"ఓరో సొమ్ము కానకొండ పోడిసెనంట, అమ్మా ఇట్టనే తిప్పి ఇంటికి పోడువు, లోగ రావద్దు. ఓటీము లేనాళ్లు అంట చెప్పి దొంగ పట్టం కట్టేస్తురు, ఇది దాంకు పడింది చాలదా? నేండూ వచ్చి ముక్కును కోసికొని పో పొయ్యేరా? ఈడ నన్ను కట్టి ఇచ్చి ఓటీ లేనాళ్లు అంట దినముం నేను వినేది చాలు, ఇంక మనకు దొంగ పట్టం వేరా కావలన," అంట ఏడిసికొనె చెప్పింది.

పన్నగత్తెకు మూతియే లేదు. తిప్పి ఓటీము మాటాడకొండ నన్ను ఎత్తుకొని, ఎట్ట వచ్చి ఇళ్లూ చేరితిమో మాకే తెలవలేదు. వచ్చిన దోవ అంతా ఒగే ఏడుపే. నేను ఏడవ, ఆపె ఏడవ అంట.

నాటిలుండి విసనమే ముయ్యలేదు పన్నగత్తెకు. ఓటీ లేనాళ్లు అనితే దొంగలు అయ్యిపోతుమా అంట కొపం వచ్చె ఆపెకు. అయితే ఏమీ చేసేదానికి లేదు. లత్చుమికు దోవ సరస్వతే అనే నట్టగా, ఒగ తీరుమానం తోడుగా, మన కొడుకును బాగ చదవపెట్టి పెద్దమనిసి చెయ్యాల, అదే మనం ఇచ్చే ఒగే సొత్తు అంట ముడివు చేసింది.

కష్టమో నష్టమో, అప్పులో సప్పులో లచ్చుమిను అమ్మి కొడుకుకు సరస్వతిని కొనేదానికి చూసె ఆపె. కొడుకు ఐతే వాండి

లొకాల ఉండినాండు. వాండికి ఇది అన్నీము కనిపించని గూండుల ఇంకొగ తాలాం మారగా తెలిసె.

వాండు పుట్టినప్పుడే అమ్మ తోడ కోపాని, బరువును అన్నీ మోసికొని పుట్టినట్టగా ఉండినాండు. వాతేరులును చూసి వెరిసేది, పల్టెం అనితే వెరిసేది, ఇంకా ఏల, ఓరీ కూడ ఐనా మాటాడాల అనితే వెరిసేది. వాండికి పెట్టి చేసేది ఏమి అనితే ఓరికూము తెలవదు. ఏ వేల చూసినా, ఎదో మాను పైకనొ మాడిలనొ కుచుండి, కాలు పైక పైక కాలు వేసి మేఘాలల కుందేలు పెట్టికొని ఉండుతుండు.

వాళ్ల అబ్బ ఉండినదాంకు, బాగనే ఉండినాండంట కొడుకు. అబ్బ చచ్చినాక ఉండిన తావే తెలవకొండ పోడిసినాండు. నిజంగా ఎదైనా తప్పు అయ్యిపోయనా, లెదు వాండు వాండి కన్నుకు మత్తుకు తెలిసే దోవల నడిసికొని ఉండాండ అంట చెప్ప ముడంజలేదు పన్నగత్తెకు. వాండి తోడనే ఎప్పుడూ ఉండే నీడకు, తననే తిట్టుకొనింది ఆపె.

ఒగ నాండు, కూంతురు చెయ్యి బిడ్డను ఎత్తుకొని వచ్చి కొదిగ దినం ఇంట్లా ఉండీంది. ఆ బిడ్డను చూసి ఎన్నో దినం తాలి మొదటి పాలిగ నవ్వినేండు కొడుకు.

"పాప, నీకు ఒగ కత చెప్పుతునా," అంట అదుగితే బిడ్డ నవ్వికొనే తలను ఆటు. మేఘాల కుందేలు పెట్టే కతలా తోడు చేరిసికొనినాండు అల్లుండినూ. కత తీరేదానిలోగా బిడ్డ నిద్దర పోదుసు.

"ఒగ నాండు, వీళ్లు అందరినూ ఉడీసేసి, నా లోకానికి నిన్ను పిలుచుకొని పొయ్యేను పాప. మనం ఇద్దురు మట్టుకు, వేర ఓరుం లేకొండ," అంటా నిద్దరపొయ్యే బిడ్డను చూసి చెప్పినాండు.

నాండు పల్టెంలా అందరి ముంద్రోట, "ఎట్ట రా ఇట్ట ఓటీకు కాన దద్దిగ ఉండావు," అంట తిట్టేసె వాతేరు. దాంట్ల ఉండి వాండికి దద్ది అంట పట్టం పెట్టేసిరి అందరూము. ఏడుసికొనే ఇంటికి వచ్చినాండు. ఇంట్లా వచ్చి బిడ్డతోడ కతలు చెప్పుకొని ఉండిన వాండిని చూసీ, "నువ్వు ఆకాస కోట కత్తింది చాలు, పొయ్యి చదువురా దద్ది," అంట చెప్పె వాండి అమ్మనూ. ఏడుపు మారి కోపంగా అయ్యింది. బిడ్డ దెగ్గిర వచ్చి, "మనం వెళ్లపొయ్యేము," అంటా చెప్పినాండు.

బిడ్డ నవ్వె. పొయ్యే దోవల తినేదానికి కొదిగ తీపులు ఎత్తి జోపుల వేసికొనినాండు. నడింగే చెయ్యిల బిడ్డను ఎత్తుకొని పరుగెత్తినాండు.

వాండి నించి ముడింజిన అలవుల ఒగ తిరుగుబాటు. ఇంక ఓరు చెప్పేది విని ఉండేది లేదు, వాండి కత వాండే రాసుతుండు అంట ముడివు చేసినాండు.

బిడ్డలను కానం అంట తెలిసేదానంట్లోగ బాగ సీంకటి అయ్యి పొడిసె. పన్నగత్తె, కూంతురు నన్ను ఎతుకొని అందరూ చేరి తొలావె దానికి ఆరంబిచ్చితిమి. పన్నగత్తె తోలితే, కూంతురు ఒగ టార్చ్ లైట్ పెట్టి చూసుకొనే వచ్చె. రెండు వీది తాలి ఒగ చిన్న గుడి లోగ బిడ్డకు తీపులును తినపెట్టికొని కుచుండికొని ఉండినాండు కొడుకు.

'డుర్ర్ డుర్ర్,' అంట నా సద్దు వినపడింది మొదట్ల. బయం వాండిని రెండు చేతుల్ల ఈడిసి పెట్టింది. ఏడ పొయ్యేదో ఎట్ట పొయ్యేదో తెలవలేదు వాండికి.

వచ్చి నన్ను స్టేండ్ వెసి నిలిప పన్నగత్తె. బిడ్డను ఎత్తేదానికి చూసినాండు కొడుకు. తన అమ్మను చూసిన తోడనె బిడ్డ ఏడిసే దానికి ఆరంబిచ్చె. అవసరంల ఏమి చేసేదో తెలవలేదు వాండికి. వాండి ముడివును బయమే ఎత్తె. ఆ ఓగ నిమ్షాల, బిడ్డను ఆడనే ఉడిసేసి పరుగెత్తినాండు. వాండి కాలులు వాండిని ఏడకైనా లేదు అన్నీ తావకూ ఒగే సమయం మోసేనట్టగా.

ఆనాండు ఏమో చెప్ప కూడ ముడంజ లేనది మారి పోయ వాండి లోగ. తిరుగి కూడ చూడకొండ పరుగెత్తే తన కొడుకును చూసి ఏమి చెయ్యలనొ తెలవలేదు పన్నగత్తెకు. పరుగెత్తి పొయ్యి వాండిని కట్టి పెట్టి, అంతా సెరి అయ్యిపోవు అంట చెప్పాల అంట ఉండింది ఆపెకు. బదులుగా కూంతురు కొపంగా సద్దు వేసితే నా పైక వాలికొని, గొంతుల ఒగ ముద్ద తోడ ఆడనే నిలిసె. ఎంతనో చెప్పాల అంట ఉండింది ఆపెకు పల్టెం ఒద్దు అనితే ఒద్దు, చదువు రాలేదా ఉడిసైయచ్చు, నా నించి ఒటీము ఇచ్చేదానికి ముడంజలేదు అనినా, నువ్వు చాలు, నువ్వేరా నా గట్టి సొమ్ము అంట. అయితే నోటిల మాటలు రాలేదు. ఆ అపె కట్టిన ఆకాస కోట ఇట్ట పడితే, ఏమి చేసేదో తెలవకొండ, నన్ను కూడా ఉడిసిపెట్టి, అట్టనే ఏడకో నడిసేదానికి ఆరంబిచ్చె ఆపె. కొడుకు ఒగ తావ, పన్నగత్తె ఒగ తావ పోతే, ఏమీ చేసేదానికి ముదంజకొండ అట్టనే నిలిసితి నేను. ఇంక మా కతల ఎందురో?

Glossary

పన్నగాండు - మొగుడు, పన్నగత్తె - పెండ్లాము, సొత్తు - ఆస్తి, పల్టెం - బడి, పాంతలు - బట్టలు, ముక్కును కోయ్యి - అవమనించుకొని, విసనం - దుక్కం, ముయ్యలేదు - తీరలేదు, వాతేరు - ఉపాధ్యుడు, దద్ది - పనికి కానాండు, వెళ్లు - బయిలుదేరు, తొలావు - వెతుకు, ముడివు - తీర్మానం



తెలుగు చదవటం, రాయటం రాని మార్వారి సంజనాపద్మం కోయంబత్తూరు ప్రాంతంలో ఉండే తెలుగు కుటుంబాలు మాట్లాడుకునే తెలుగులో కథలు రాయడానికి చిన్నప్పట్నించే ప్రయత్నం చేసి ఎనిమిదో తరగతిలో ఉండగానే కొన్ని కథలు రాసి, 'రేగడి నీడల్లా' అనే పుస్తకం ప్రచురించింది. కొచ్చిలో నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ లీగల్ స్టడీస్‌లో బి.ఏ., ఎల్.ఎల్.బి ఆనర్స్ చదువుతోంది. ఆ ప్రాంత జీవితం పై నవల రాసే ప్రయత్నంలో ఉంది.

కోణార్క్

మంత్రి కృష్ణమోహన్

కాలం పాక్షికంగా చెరిపేసిన చిత్రం
ఈ సూర్య దేవాలయం
చెరిపేయడం సాంతం
ఒక్కసారిగా జరగలేదు సుమా!

ఒక కాలం చెరిపినది కాదు
అనేక కాలాలు అనేకమార్లు
మనుషుల చేతుల్తో–
ప్రకృతి చేతుల్తో–
పెద్ద చెరిపివేతలు కొన్నైతే
చిన్న చిన్న చెరిపివేతలు కొన్ని

కాలం, మనుషుల చేతులనెడి
ప్రకృతి చేతులనెడి
రబ్బరుతో చెరిపేస్తే
రాలిన నుసి ఉందే–
అదీ ఒక్కచోట లేదు
అక్కడక్కడే రాలిపడినా
అది అక్కడా అక్కడా
భద్రపరచబడింది కొంత కొంత

కొంత కొంత అప్పుడప్పుడూ
దొంగిలించబడింది కూడా
ఆ చెరిగిన గీతల జాడలు
ఇపుడు ఎవరికి మాత్రం తెలుసు స్పష్టంగా!

తిరిగి గీసే చిత్రం ఎంతమాత్రం కాదు
కాలం గీసిన చిత్రం కదా
కాలమే చెరిపేసిన చిత్రం కదా
తక్కిన ఆ నుసి ఏ గాలిలోనో
ఏ ధూళిలోనో ఏ అరణ్యంలోనో
భూగర్భంలోనో సముద్రంలోనో
కొంత సముద్రాలు దాటి కూడానేమో!

ఒకరు స్వహస్తాలతో గీసి చెరిపిన చిత్రాన్నయితే
పునర్లిఖించవచ్చునేమో
కానీ ఇది కాలం చేసిన పని!

మనిషి కూర్చబోయే చిత్రం అసమగ్రమే కానీ,
ఆ అసమగ్ర చిత్రాన్నే
ముందు ముందు కాలం
సంబరంగా తిలకిస్తుంది, పులకిస్తూ!



మంత్రి కృష్ణమోహన్ ప్రకాశం జిల్లాలో జన్మించారు. రెండు కవితాసంపుటాలు ప్రచురించారు. వృత్తిరీత్యా గణితశాస్త్ర ఉపాధ్యాయులు. 2013 సంవత్సరానికిగాను కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కారం లభించిన తొలి కవి. నివాసం ప్రకాశం జిల్లా మార్కాపురం.

వద్దనుకునేవాళ్ల కోసం

మెర్సీ మార్గరెట్



నువ్వెందుకో నిరాసక్తతో ఉన్నావ్. నావైపు కన్నెత్తి కూడా చూడలేదు. జ్వరంతో ఉన్నావని నీ గొంతు ఎందుకో నీ మాటే వినటం లేదని నువు బాధపడుతుంటే నేను ఆ కిటికీలోంచి బయటకు చూస్తూ అలాగే కూచుండిపోయాను.

నువు నాతో అన్నావ్ కదా, చాలామందికి ఔషధం కావాలి కాని నొప్పి కలగకూడదు. అందమైన స్వప్నాలు కావాలి కాని కళ్లు మూతలు పడకూడదు. కొన్నిసార్లు నిద్ర లభించాలి కానీ కలలు ఉండకూడదు. పాటలు కావాలి కానీ, స్వరాలు లభించకూడదు.. ఎందుకో వాళ్లు కోపంగానో ప్రేమగానో కొన్ని కావాలని కొన్ని అసలే వద్దని అనుకుంటారు అని...

నేనూ నీకొకటి చెప్పనా... నీలాగే చాలామంది నావ కావాలి అనుకుంటారు కానీ, నది కావాలని అనుకోరు. ఆనేక రంగులు కురవాలని అనుకుంటారు కానీ, దేహం మీద ఒక నీలి పింఛం పూయాలని అనుకోరు.

నీపై ప్రేమ వర్షించాలి. కానీ దారి లేనిచోట నన్ను వదిలేసి వచ్చిన విషయం నీకు గుర్తుండదు. ఎందుకు అలా ఉన్నావని నిన్ను అడగను కానీ...

చిన్ని పిచ్చుక ఒకటి ఇంకొంచెం సేపటికి ఇక్కడ కిటికీ దగ్గర కొస్తుంది. నేను పడుకున్నప్పుడు ఇన్ని గింజలు అది తినటానికి వెయ్యి. ఈ నిద్ర ఇవ్వాళ నను లాక్కుంటుంది. రేపటికి మేల్కోవాలంటే ఇవ్వాల్టికి పడుకోవాలి. రేపటికి నిన్ను ప్రేమించాలంటే ఇవ్వాల్టి నేనూ నన్ను ఇంకొంచెం బతికించుకోవాలి. ఈ నీలి రాత్రులు నాకోసం మాత్రమే గడప దగ్గర తచ్చాడుతున్నాయి. కోపగించుకోకు.





మెర్సీ మార్గరెట్ విరివిగా కవితలు రాస్తున్నారు. కేంద్ర సాహిత్య యువ పురస్కారం లభించిన తొలి కవయిత్రి. రెండు కవితాసంపుటాలు ప్రచురించారు. వివిధ జాతీయ కవిసమ్మేళనాల్లో కవితలు వినిపించారు. నివాసం హైదరాబాదు.

యుద్ధకాలంలో పిల్లలు

బాలసుధాకర్



పెద్దలంతా కలిసి నిస్సహాయులై
శత్రువు ముందు చేతులెత్తేసిన వేళ
పిల్లల చిరునవ్వు వొక్కటి భరోసాగా
మిగులుతుంది

కంచెలను దాటి సంకెళ్లను ఛేదించి
తుపాకీ బాయ్నెట్ ల ఆగ్రహాన్ని ధిక్కరించి
సరికొత్త కలని దాచిన గుప్పిళ్లను
ప్రపంచం ముందు ప్రేమనిండిన కళ్లతో
విప్పుతారు పిల్లలు

నగ్నంగా ఏ అరమరికలు లేకుండా
దేశ సరిహద్దులు దాటి విరబూసే పువ్వులు
పిల్లలు

నల్లబల్ల మీద పిచ్చిగీతలను చెరిపేసినట్టే
లేత లేలేతచేతులతో యుద్ధాన్నే సమూలంగా
తుడిచి పారేసే ధీశాలులు పిల్లలు

తల్లిని తండ్రిని ఇంటిని స్నేహితులను
కోల్పోయీ కోల్పోయీ కోల్పోయీ అలసి
పాశవిక యుద్ధక్రీడలో కడ ప్రాణాలతో మిగిలి
హెచ్చుతగ్గుల లోకాన్ని నిలేసి ప్రశ్నిస్తారు
పిల్లలు

బాంబుల మోతలు ఫిరంగీల ధ్వనులు
నెత్తుటేరులు పారే వీధుల్లోంచి
సన్నని సనసన్నని పెదాలపై నెత్తురంటినా
చెరగని నవ్వుతో మొలకెత్తేది
ఎప్పుడైనా ఎక్కడైనా పిల్లలే పిల్లలే

శిధిలాల కింద రోజులు రోజులు గడిచి
పిల్లలే ఎందుకు బతుకుతారో
ఒక చీకటి తొలగిన రాత్రి నెలవంకతో
కబుర్లాడుతూ జవాబవుతారు పిల్లలు

నిప్పుల సెగలు గక్కుతున్న గాజాలోనైనా
అబూజ్ మడ్ గిరిశిఖరాల్లోనైనా
ఏ యుద్ధం లేనట్టు భ్రమ కలిగించే
ఒకానొక మృతదేశపు నడిమధ్యలోనైనా

అమాయకంగా మట్టిలో గూళ్లు అల్లుకునే
పిల్లల చేతుల్లోనే
మళ్లీ మళ్లీ ప్రాణం పోసుకుంటుంది
ఏ గాయపడ్డ దేశమైనా



బాలసుధాకర మౌళి అతి తక్కువ వయసులో ఇప్పటికే ఏడు కవితాసంపుటాలు ప్రచురించిన కవి. విరివిగా రాస్తున్న అతికొద్దిమంది కవుల్లో ఒకరు. వీరి కవితాసంపుటికి 2019లో కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కారం లభించింది. ఇటీవలే కథలు రాస్తున్నారు. ఒక కథాసంపుటి ప్రచురించారు. విజయనగరం జిల్లా గర్భాంలో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు.



రెండో కాన్పు

తగుళ్ల గోపాల్

చెల్లెలి మొదటి కాన్పుకు
అమ్మ ఉన్నది, అన్నీ చూసుకుంది

ఎల్లిపాయ కారం నూరి
ఓ డబ్బ నిండ పెట్టుకుంది
పచ్చిబాలింతకు గాలి తాకకుండా
కుచ్చుకుచ్చుల చెవులకుల్లా అయ్యింది
తొలుసూరున మనువడు పుడితే
మెడలో వెండి కత్తిబిళ్లె నవ్వింది
పిలగాడికి ఏ గాలి సోకొద్దని
దిష్టిపూసల దండైయ్యింది

పదకొండొద్దుల నాడు చూడాలి–
చేయి పెడితే కాలిపోయే జెరమున్నా
ఇల్లిల్లు తిరిగి పురుడుకు పిల్చింది

దాసుకున్న పైసలతోటి
ఇరవై ఒక్కరోజు ఖర్చులను బాయికెల్లదీసింది
కుట్లు మానేదాకా
కూస్తున్నకాడికే కురాడును మోసింది
ఉత్త మనిషి కాదని
వాకిలి దాటి పోలే

ఎప్పటి పురుటి బట్టలను అప్పుడే
యాష్టగొనకుండా పిండి ఆరేసింది
ఎండపొలుపుకు పసిబిడ్డను చూపి
లోకం కండ్లు పచ్చవడకుండా చేసింది

కీసర కొట్టి ఏడుస్తుంటే
అంత్రాలు కట్టించింది

మనువడు నిద్రల అదురుకుంటే
పొర్కతోటి దిష్టి తీసింది
అయిదు తీర్ల ఆకుల్లో
బువ్వ ముద్దలను కట్టి మీదంగ తిప్పి
మూడుబాటల్ల పడేసొచ్చింది

అమ్మమ్మ వైనవు, మాకేం లేదా అని
మరదలు వరసైనోళ్లు అంటే,
'నువు తాగినంత పోపిస్తూ పా,' అని షర్తు గట్టింది

ఇయ్యాల అమ్ముంటే ఎంత ఉరుకులాడునో–

మొదటి కాన్పు తల్లిగారిది
రెండో కాన్పు అత్తగారిది అని
అనుకున్నదేమో పిచ్చితల్లీ!
ఏ కాన్పు అయిన తల్లి అవసరం లేకుండా ఉంటుందా?

మూడు నెల్లదాకా
సన్నీల్లల్ల చేయి పెట్టనీయని ప్రేమ కదా అమ్మంటే
తడక మీద పారిన కాకరకాయలను
ఒడి నిండా దాసుకొని తెచ్చె ప్రేమ కదా అమ్మంటే

ఎడ్డిదైన, గుడ్డిదైన అమ్ముండాలి
అంబలైనా, గంజైనా
మన కుండల కలిగిందే మనకు

రెండో కాన్పుకు
చెల్లెలును చూసుకోవడానికి అమ్మ లేదుగానీ
మనుమరాలు ఏడిస్తే ఊకించడానికి
అమ్మ కట్టుకున్న చీర
ఇంకా ఉయ్యాలై వేలాడుతుంది



తగుళ్ల గోపాల్ మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించారు. 2016లో 'తీరొక్క పువ్వు' నానీల సంపుటి వెలువరించాడు. 2019లో 'దండకడియం' కవితాసంపుటిని తీసుకొని వచ్చారు. దీనికి కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం-2021 లభించింది. ప్రస్తుతం వెల్దండ మండలం అజిలాపురం గ్రామంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు.

తులుపు కొంచెం తెరిచే వుంచాను

పల్లిపట్టు నాగరాజు

మంచు కురిసి కురిసి ముద్దైన సాయంత్రాన
కరెంటుబోయిన రెండు గదుల ఇంటిలోపల
నీ నవ్వుల్ని నెమరేసుకుంటూ
తలుపు కొంచెం తెరిచాను.

చిమ్మచీకటి కమ్ముకున్నపుడల్లా
దీపాన్ని వెలిగిస్తూనో
నువ్వే దీపమై వెలుగుతూనో కూకునే
మన నట్టింట...
నన్నో ఒంటిరి దీపంగా వెలిగించుకుని
తలుపు కొంచెం తెరిచాను

బయటా చీకటి
లోపలా చీకటి
దేశమంతా ద్వేషపు మేఘాలు కురుస్తున్న చీకటి
తలుచుకుంటేనే మనస్సు కలుక్కుమంటోంది

❖

ఇపుడే నువ్వు రావని తెలిసినా
పొద్దుని కనుబొమ్మల మధ్య దిద్దుకుని వచ్చే
నీ రేపటి కోసరం
మనసు నిండా ప్రేమను విత్తుకుంటూ
మన తలుపు కొంచెం తెరిచి వుంచాను

❖

ప్రతి శుక్రవారం నువ్వు ముగ్గై పూసే
గుమ్మం అవతిలివైపుకి తొంగి చూస్తూ
నీ పట్టీల సడి వినపడకున్నా
వంటగదిలోంచి హాల్లోకి
హాల్లోంచి వరండాలోకి
తిరుగుగాడే పాదాలను
మననం చేసుకుంటూ
మనసు తలుపు మరికాస్త తెరిచే వుంచాను

ఈ పూట నువ్వు పూలు కోయలేదని
మూతి ముడుచుకున్న నందివర్ధనం సాక్షిగా
నా ఒంటరి అడుగుల్ని
మెట్లు కూడా కసురుకుంటున్నాయి

❖

పిల్లలు తూనీగలై తిరుగుతుంటే
నవ్వు తోటై పరిమళించే మన ఇల్లు
కిటికీల కళ్లతో ఎదురుచూస్తున్నట్టు

చెలిమి తప్ప ద్వేషం లేని
ప్రేమోదయాల కోసరం
ఆశగా ఎదురుచూస్తున్న లోకం మాదిరి

ప్రేమ కాంతి దీపాలై
మీరొచ్చే వీధివైపు పదే పదే చూస్తూ
తలుపు కొంచెం తెరిచే వుంచాను

అందరం కలిసుంటేనే కదా
ప్రేమ తోటలై విరబూస్తేనే కదా
ఇల్లైనా దేశమైనా అందంగా వుంటుందని
బడిలో చదువుకున్న పాఠాలు
గుండెల్లో తేనెటీగలై మూగుతున్న సమయాన
మన ఇంటి తలుపు మరికొంచెం తెరిచే ఉంచాను



చిత్తూరు జిల్లాలో జన్మించిన పల్లిపట్టు నాగరాజు తెలుగు ఉపాధ్యాయులు. రాయలసీమ వ్యవహారిక భాషలో వెలువరించిన 'యాలై పూడ్సింది' అనే తొలి వచన కవితాసంపుటికి కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కారాన్ని 2022లో అందుకున్నారు.

నాతోనే నువ్వు - నాలోనే నువ్వు

శ్రీనివాస గోగినేని



భుజాన్ని తట్టి స్ఫూర్తిని ఇచ్చే ధైర్యం నీవు
ఆనందంలో హాయిని ఇచ్చే అనుభూతి నీవు
చీకటిలో దారిని చూపే చుక్కాని నీవు
నిదురలో నను వీడని కల నీవు
నాతోనే నువ్వు – నాలోనే నువ్వు

ఆపదలో అక్కర వచ్చే స్నేహం నీవు
సందేహం లో వివరణ ఇచ్చే గురువు నీవు
పరాజయంలో అవకాశం చూపే వివేచన నీవు
నిరాశలో ఆశలు రేపే విశ్వాసం నీవు
నాతోనే నువ్వు – నాలోనే నువ్వు

ఎందరిలో ఉన్నా ఎవరూ లేరనిపించే వంటరి నీవు
ఎల్లెడలా నాతోనే నడిచే సహచరి నీవు
ఎల్లప్పుడు నాతో వాదించే గడుసరి నీవు
ఎన్నెన్నో ఉన్నా సరిపోదనిపించే తుంటరి నీవు
నాతోనే నువ్వు – నాలోనే నువ్వు

జీవన పోరాటపు గాయాలకు ఔషధం నీవు
విషాదంలో సొంతం అనిపించే ఆత్మీయత నీవు
నిస్సత్తువలో నిలబెట్టే శక్తి నీవు
విధ్వంసంలో అంతం కానివ్వని జీవం నీవు
నాతోనే నువ్వు – నాలోనే నువ్వు

మనసుని కుదిపి ప్రశ్నలు వేసే సందేహం నీవు
వద్దనుకున్నా గుర్తుకుతెచ్చే ఆలోచన నీవు
నా కోసమే జన్మించిన నా కవల నీవు
నాతోనే జీవించి నాతోనే కడతేరే నా అంతరంగం నీవు
నాతోనే నువ్వు – నాలోనే నువ్వు



విజయవాడలో జన్మించిన వీరు 1999లో అమెరికా రాకముందు సివిల్ ఇంజనీర్‌గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో అనేక సంవత్సరాలు పనిచేసారు. మిచిగాన్‌లో భార్య పద్మశ్రీతో పాటు నివసిస్తున్న వీరు కొద్దికాలంపాటు సాఫ్ట్‌వేర్ కన్సల్టెంట్‌గా పనిచేసినప్పటికీ ప్రస్తుతం ట్రాన్సమెరికా ఫైనాన్సియల్ అడ్వైసర్స్ వారి రిజిస్టర్డ్ రెప్రెజెంటేటివ్‌గా ఆర్థిక సంబంధిత సేవలు అందిస్తున్నారు. తెలుగుభాష పై మక్కువతో చిన్న చిన్న కథానికలు, కవితలు రాస్తుంటారు.

NEW YORK LIFE

SERVICES OFFERED:

- Individual Life Insurance
- Health Insurance-Individual & Group*
- Disability Income Insurance
- Long Term Care Insurance
- Guaranteed Lifetime Income Annuity**
- Guaranteed Future Income Annuity**
- Fixed Deferred Annuities

PERSONAL & BUSINESS PLANNING FOR:

- **Personal:** College Funding
- **Business:**
  - Buy-Sell Funding
  - Executive Bonus
  - Key Employee Insurance
- **Retirement Planning**
- **Estate Planning**
- **Voluntary Payroll Deduction**



(972)-822-1734

ayarlagadda@ft.newyorklife.com

5005 Lyndon B Johnson Freeway, Suite 1600, Dallas, TX 75244.

APPARAO YARLAGADDA

* Products available through one or more carriers not affiliated with New York Life Insurance Company, dependent on carrier authorization and product availability in your state or locality.
** All guarantees are based on the claims paying ability of the Issuing Company, issued by New York Life Insurance and Annuity Corporation, or New York Life Insurance Company

SMRU1927057

FAMOUS MEATS

Best Compliments

FRANCHISE OPPORTUNITY

OUR OTHER LOCATIONS

Farmington Hills, MI
Troy, Michigan
Colombus, Ohio
Cinicinnati, Ohio
Indianapolis, Indiana
Quincy, Boston
Naperville, Illinois
Schaumburg, Illinois
St Louis, Missouri
Jacksonville, Florida
Austin, Texas

Explore our Franchise Opportunity and open the door to your business success!

CONTACT US

www.famousmeatsusa.com

TEK Labs Inc

Kindling the Thist for knowledge

Learn/Practice/Innovate/Master you skills in Advanced Embedded Systems

ARE YOU AN ELECTRICAL / ELECTRONICS / COMPUTER ENGINEERING STUDENT ?
SHAPE UP YOUR SKILLS IN COMPETITIVE EMBEDEED DOMAIN



- We place our candiadtes with our 15+ Direct Clients in Automotive domain
- Excellent Instructions with over 15 years industry experience
- Hands on job oriented training with real time projects
- 24 x 7 Lab Assess for students to practice and learn
- Help with resume preparation
- Help with interview questions
- Interview support
- On-project support
- Marketing Team for a quick placements on a client project
- E-Verified employer
- Excellent referral bonus program
- Small class size so you get personal attention from the instructor
- Competitive Salary (Percentage Ratio)
- H 1 B Visa & GC sponsorship
- Free Accommodation is available in MI for Students and out-of-town applicants for the duration of the Training Program until placement on Client Project

For More Details

24155 suite # 204 Drake Rd Suite 200-B, Farmington Hills, Michigan - 48335
Phone : (248) 246-1865
Email-Id: info@teklabsinc.com | www.teklabsinc.com

E- Verify Comapny | Certified Dun & Bradstreet Credibility Corp | BBB Accredited

SHOORA EB5

GREEN CARD THROUGH EB-5 INVESTMENT



I-956F & I-526E APPROVED

Green Card.
Priority Processing.
Trusted Investment.
All in One.

What is EB-5

With the EB-5 program, your capital unlocks U.S. permanent residency- no sponsor needed, with faster approval via Rural Priority Visas, meaning less waiting for you and your family.

Why Families Choose Us

- Trusted & Transparent Investment
- Fully USCIS-Approved Project
- Faster Green Card Approvals
- Proven Track Record

LIMITED EB-5 SPOTS AVAILABLE

APPLY NOW!

SCAN TO BOOK YOUR FREE CONSULTATION

info@shooraeb5.com +1 (470)-720-1638 shooraeb5.com

provincesoft

యువప్రభ

ఈ యుపప్రభలో...

1. నా జన్మభూమి ఎంత అందమైన దేశమూ...
   - వీక్ష గంగా ... 194

2. How My Teluguness Transcends Borders
   - *Palle Sumana* ... 196

3. Telugu Literary Analysis
   - *Shivani* ... 198

4. A Telugu Canadian's Pursuit of the North American Dream
   - *Bezawada Vishal* ... 200

5. My Home
   - *Charishma Andra* ... 202

6. My World
   - *Taran Yarlagadda* ... 204



నా జన్మభూమి ఎంత అందమైన దేశమూ...

వీక్ష గంగా

నేను వీక్ష గంగా. నేను పుట్టినప్పుడు, నా అమ్మమ్మ నేను అబ్బాయిని అవుతానని గట్టిగా నమ్మింది. నన్ను ఇంటికి తీసుకు వచ్చిన వెంటనే, ఆమె నన్ను చూడాలని చాలా ఆత్రుతగా ఉంది. నాన్న నన్ను ఆమె దగ్గరకు తీసుకెళ్లి, నేను అమ్మాయిని అని చెప్పగానే, అమ్మమ్మ మొదటి స్పందన చాలా ఆశ్చర్యంగా ఉంది. ఆమె ఇలా అంది, 'ఏదో తప్పు జరిగి ఉంటుంది, వాళ్లు వేరే బిడ్డను ఇచ్చారేమో తనిఖీ చేయండి. నేను ఇది అబ్బాయి అనుకున్నాను!' అవును, నేను అబ్బాయిని కాదు.

నేను భారతదేశంలోని హైదరాబాద్‌లో, ఏప్రిల్ 15, 2013న జన్మించాను. ఇది వసంతకాలం ప్రారంభమయ్యే నెల, కొంతమంది దీన్ని "చిలిపి నెల" అని కూడా పిలుస్తారు. భారతదేశంలో పుట్టడం వల్ల, నా కుటుంబంతో కలిసి నేను జరుపుకున్న అనేక సంప్ర దాయాలు మరియు పండుగలకు సంబంధించిన మధురమైన జ్ఞాపకాలు నాకు చాలా ఉన్నాయి.

అయితే, నాకు నాలుగేళ్ల వయసప్పుడు, నా తల్లిదండ్రులు వారి ఉద్యోగాల నిమిత్తం అమెరికాకు వెళ్లాల్సి వచ్చింది. ఆ తర్వాత, నా తమ్ముడు కాలిఫోర్నియాలో జన్మించాడు. అమెరికాకు మారడం నాలో చాలా మార్పులు తెచ్చింది- నా భాష, దుస్తులు, జుట్టు కత్తిరించుకోవడం వంటివి. కానీ నాలో ఎప్పుడూ మారకుండా ఉన్న ఒక విషయం ఏమిటంటే, భారతీయ ఆహారం పట్ల నాకున్న ప్రేమ. నాకు ఇష్టమైన ఇండియన్ ఫుడ్ ఏదైనా ఉందా అని ఎవరైనా అడిగితే, అది నిస్సందేహంగా పాలక్ పన్నీర్ అనే చెబుతాను.

ఇంతకు ముందు చెప్పిన మార్పుల గురించి మాట్లాడుతూ, మా సంప్రదాయాలు పూర్తిగా మారిపోలేదని, కానీ కొంతవరకు మారాయని చెప్పాలి. ఉదాహరణకు, సంక్రాంతి లేదా దీపావళి వంటి పండుగలు వచ్చినప్పుడు, ఇక్కడ నాకు పాఠశాలకు సెలవు ఉండదు. మా కుటుంబం కేవలం టపాకాయలు కాల్చడం, పూజ చేయడం వరకే పరిమితం అవుతుంది. కానీ మేము భారతదేశంలో ఉన్నప్పుడు, పాఠశాలకు సెలవు ఇచ్చి, కుటుంబం మరియు స్నేహితులతో కలిసి చాలా సంతోషంగా, ఉత్సాహంగా జరుపుకునే వాళ్లం. భారతదేశంలో పండుగలు అంటే పాఠశాలలకు సెలవులు, బంధువుల ఇళ్లకు వెళ్లడం, స్నేహితులతో ఆడుకోవడం, వీధులన్నీ కళకళలాడటం. ఆ పండుగ వాతావరణాన్ని, ఆ సెలవుల ఆనందాన్ని ఇక్కడ చాలా మిస్ అవుతాను. భారతదేశంలో నేను చిన్నపిల్లగా ఉన్నప్పుడు, సంక్రాంతి పండుగకు అమ్మమ్మతో కలిసి గొబ్బెమ్మలు పెట్టడం, ముగ్గులు వేయడం నాకు చాలా ఇష్టమైన పని. ఆ రంగుల ముగ్గులు, గొబ్బెమ్మల అలంకరణ నాకు చాలా ఆనందాన్నిచ్చేవి. ఇక్కడ అమెరికాలో ఉన్నప్పుడు ఆ ముగ్గుల రంగులను చాలా మిస్ అవుతాను. పండుగలే కాదు, భారతదేశం లోని వేసవి సెలవులంటే కూడా నాకు చాలా ఇష్టం. ముఖ్యంగా ఆ కాలంలో దొరికే తాటిముంజలు, మామిడికాయలు తినడం అంటే నాకు చాలా ఇష్టం. ఇక్కడ అవి దొరకవు, ఆ రుచులను, ఆ జ్ఞాపకాలను కూడా చాలా మిస్ అవుతాను.

నన్ను భారతదేశం లేదా అమెరికా - ఏది ఇష్టమని ఎవరైనా అడిగితే, నా తక్షణ సమాధానం ఎప్పుడూ భారతదేశం అనే ఉంటుంది. భారతదేశం ఎందుకు ఉత్తమం అని చాలామంది ఆశ్చర్యపోవచ్చు. నేను అనేక కారణాల వల్ల భారతదేశాన్ని ఎంచుకుంటాను. కానీ అన్నిటికంటే ముఖ్యమైనది కుటుంబం. ఇక్కడ అమెరికాలో, నాకు, నాన్నకు, అమ్మకు, నా తమ్ముడికి మాత్రమే దగ్గరి బంధం ఉంది. కొన్నిసార్లు ఇంటికి వచ్చినప్పుడు ఎప్పుడూ అదే ముగ్గురు ముఖాలను చూడటం కొంచెం ఒంటరిగా, కొన్ని సార్లు విసుగుగా అనిపిస్తుంది. భారతదేశంలో అయితే, నన్ను చూడటానికి, మాట్లాడటానికి చాలామంది బంధువులు ఉంటారు- మా అమ్మమ్మ, తాత, నాయనమ్మ, తాత ,పెదనాన్న, పెద్దమ్మ, మామయ్య, అత్తయ్య... ఇంకా చాలామంది.

మా కుటుంబం ఇక్కడికి మారిన తర్వాత, నేను చాలా విషయాలలో మారాల్సి వచ్చింది. భారతదేశంలో, జడలు వేసుకోవడం, సాంప్రదాయక దుస్తులు ధరించడం చాలా సాధారణం, సరైనది కూడా. నేను ఇక్కడికి వచ్చిన కొత్తలో కూడా వాటిని ధరించే దాన్ని. కానీ నేను పాఠశాలకు వెళ్లడం ప్రారంభించిన తర్వాత, తోటి పిల్లలు నన్ను గమనించడం, గుసగుసలాడుకోవడం మొదలు పెట్టారు. దాంతో నేను నా రూపాన్ని పూర్తిగా మార్చుకోవాలని నిర్ణయించుకున్నాను. నేను జుట్టును పోనీటెయిల్స్‌గా కట్టుకోవడం, చొక్కాలు మరియు లెగ్గింగ్స్ వంటివి ధరించడం ప్రారంభించాను. కొంతకాలం తర్వాత, నా ఇంగ్లీష్ భాష మెరుగుపడింది. పిల్లలు నాతో మాట్లాడటం, ఆడుకోవడం ప్రారంభించారు. ఆ అనుభవం నుండి నేను నేర్చుకున్న ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, స్నేహితులను చేసుకోవడానికి, మనం వేరే గ్రహం నుండి వచ్చిన ఏలియన్‌లా కాకుండా, మిగతావారితో కలిసిపోవడానికి ప్రయత్నించాలి.

మెల్లగా నాకు తెలుగులో మాట్లాడటం కష్టంగా అనిపించడం మొదలైంది, ముఖ్యంగా భారతదేశంలో ఉన్న మా అమ్మమ్మ, తాతయ్యలతో ఫోన్‌లో మాట్లాడేటప్పుడు సరైన తెలుగు పదాలు గుర్తుకు వచ్చేవికావు. ఇది నాకు చాలా బాధ కలిగించింది, ఎందుకంటే వాళ్లతో నేను మనసు విప్పి మాట్లాడలేకపోతున్నానని అనిపించింది. అప్పుడు నా మాతృభాష తెలుగును మర్చిపోకుండా ఉండటానికి, ముఖ్యంగా మా బంధువులతో చక్కగా మాట్లాడగలిగేలా ఉండటానికి నా తల్లిదండ్రులు ఒక మంచి మార్గం చూపించారు. ఇక్కడ అమెరికాలో మనలాంటి తెలుగు పిల్లల కోసం 'మనబడి' అని ఒక పాఠశాల ఉందని వాళ్లు తెలుసుకున్నారు. నేను మనబడిలో చేరడం నాకు చాలా ఉపయోగపడింది.

మనబడి వల్ల నాకు కలిగిన అతి ముఖ్యమైన లాభం ఏమిటంటే, భారతదేశంలో ఉన్న మా అమ్మమ్మ, తాతయ్య, నాయనమ్మ, తాత- ఇలా అందరితో నేను తెలుగులో మాట్లాడగలిగాను. ఫోన్లో వాళ్లతో మాట్లాడేటప్పుడు నాకు తెలుగు రావడం వల్ల వాళ్లు చాలా సంతోషించేవారు. నా మనసులోని మాటలు వాళ్లకు తెలుగులో చెప్పడం నాకు చాలా సులువుగా ఉండేది.

నేను భారతదేశంలో ఉన్నప్పటి నుండి ఇప్పటి వరకు చాలా మారిపోయాను. ఇప్పుడు మీరు ఆలోచించండి, మన భారతదేశం నుండి అమెరికాకు మారిన తర్వాత మీరు ఎలా మారారో!



Veeksha, a 12-year-old currently in the 6th grade. Her favorite things to do are swimming and reading books. She recently completed Manabadi studies last year, and this year she giving back by volunteering as a Balaguruvu. On the sports front, she actively working towards earning herTaekwondo black belt and also a member of the SAC swim team



How My Teluguness Transcends Borders

Palle Sumana

It is an odd thing, perhaps, to celebrate Sankranthi in Michigan. Yet, on Sankranthi morning, my mother chalks muggulu on the pavement and stairs leading to our house, as icicles hang heavy overhead and the grass is covered in snow. She then diligently cooks paramannam and carefully folds sweet poornalu while humming old Telugu songs, filling the house with the aroma of ghee and jaggery. The kitchen table disappears beneath platters of ariselu and pulihora as I dutifully hang paper marigolds around our windows in a langa voni, topped with a hoodie to combat the cold.

Like us, Sankranthi has adapted to our new home. Born in sun-baked fields and rice paddies, it is also now subject to the harsh, wintery Januaries in Michigan but is not deterred or diminished.

Slowly but surely, people begin gathering at our house. Uncles arrive in with their wellstarched pattu panchas, tied with a practiced flick, and begin to take pictures together as they gently tease each others for the new white hairs that have cropped up since they met last. Aunties, wrapped in dazzling pattu saris, glide across our living room with authority and meet my mother in the kitchen, their laughter echoing. Cousins too stroll in, the younger ones with their noses in their phones and the older ones helping their parents bring in hotpots full of sambar and payasam.

They are our relatives by choice, our relationships forged not by blood but through decades of friendship, shared immigrant experience, and daily acts of community in a land that was once foreign, now home. We are a family in every way that matters: the kids grew up together and the adults are now growing old together.

When it's time to eat, we arrange banana leaves on the hardwood floor and everyone sits cross-legged, chattering on about sweet nothings as steam from the rice mounds rises against the winter air, with the fireplace crackling in the background.

Eating on the floor, with banana leaves, is an act of connection: to the earth, to each other, to the millions who have done the same before us. Tradition is about anchoring oneself in something deeper than geography. As I watch new parents teach their toddlers how to eat sugarcane and uncles and aunties trade stories about their childhoods, the roots of Telugu culture sink in quietly, stubbornly, into new soil.

The Native American botanist, Robin Wall Kimmerer, writes in her book Braiding Sweetgrass that we are all immigrants to this land, having come from

divine origin. The way we become native to a place is by tending to its land.

My mother, by hosting Sankranthi celebrations, creating community, and nurturing the land around our home, embodies this, indigenizing coastal, tropical Teluguness in the cold, clay soil of Michigan. Every spring, she coaxes tomatoes and gongura, chillies and sunflowers out of the ground. She weaves the vines of bottle gourd plants against netting on our wall and shares the harvest with our neighbors. Every handful of dirt she spreads, every seed she presses into the earth, is an act of gratitude and belonging, of creating a Telugu home.

I grumble about having to help out in the garden, especially in the heat of the summer. But the first tomatoes that burst through with a bright red against their green foliage, the dew that collects on peonies in the morning, and the fragrance of basil plants after rain all serve as reminders that we are all keepers of something larger than ourselves. Whether in a sprawling South Indian field or a small Michigan backyard, that the rituals are the same: tilling the soil, feeding the earth, and giving thanks for what grows.

Teluguness, and Sankranthi, are about bounty and sharing. In celebrating Sankranthi in our adopted home, we are not only honoring our heritage but also making a promise to our new home that we will take care of it. Ironically, it is by performing the Telugu ritual of serving and honoring the land that we become native to America. We become, in the truest sense, people who belong, people who tend, nurture, and celebrate.

And so, as I see my mother water her plants in the soft light of a Michigan sunset, I know that my Teluguness belongs here, and everywhere, that it is not bound by place or language. Teluguness is not about a land, it is about the land. Teluguness is lushness, the act of stewardship, the ability to create green, the need to care for land and water, the capacity to make the earth sing. Teluguness itself is a living thing and like all life, it finds a way to grow and thrive anywhere.



Palle Sumana studing in Colombia University, New York. She lives in Michigan.



Telugu Literary Analysis

Shivani

Although born distant from the land of our Telugu heritage, songs like 'Brahma Kadigina Paadamu' by the great Saint Annamacharya sing softly through time showing faith, humility and devotion that help light our way through this modern, ever-changing world. The song is a meditation in motion, a hymn that grounds the soul and uplifts the spirit.

In the first stanza, also known as the pallavi, the first line says 'Brahma Kadigina Paadamu,' showing that even the creator of the entire universe bows down at the feet of Vamana, an avatar of Vishnu, with humility. The wisdom the gods follow causes humility to evade none. Here the creator becomes the worshipper, symbolizing the feet as Brahman, which is touched upon in the second sentence. The second sentence, 'Brahmamu daane ni paadamu,' speaks at great lengths of how the very lotus feet of Srimanna-rayana are the very essence of Brahman - eternal truth, knowledge, and bliss. The cleaning of these feet represents purification, showing that spiritual greatness does not come with power but with the ability to surrender.

In the second stanza, or charanam 1, the first line - 'Chelagi vasudha golichina nee paadamu' - refers to the feet that, through leela, or divine play, gave birth to the earth. This creation is not depicted as chaotic or violent but as a graceful, rhythmic act - symbolizing that the universe itself began in harmony. The next line, 'Bali tala mopina paadamu,' speaks to the moment when the Lord, in his Vamana form, gently placed his foot on King Baliµs head. Rather than using force, this divine gesture brings the mighty king to surrender - not through domination, but through humility and grace, showing that true surrender leads to liberation. In the third line, 'Tala kaga gaganamu tannina paadamu,µµ the imagery shifts to Vishnu's cosmic form, Trivikrama, whose foot stretches to the sky. This act symbolizes the Lordµs transcendence - his ability to surpass all realms, touching even the heavens. Finally, 'Bala ripu gachina paadamu' reminds us that these same feet protected Indra from King Baliµs growing pride, ahankaram. The entire stanza paints a picture of divine feet that create, humble, transcend, and protect - ultimately upholding dharma, the righteousness that preserves balance in the universe.

In Charanam 2, the first line - 'Kamini pÄ•pamu kaá¸•igina pÄ•damu' - translates to 'the feet that washed away the sins of a woman.' This line reflects the Lord's boundless compassion, reminding us that no one is beyond forgiveness. Even those burdened by sin are welcomed, not judged, when they turn toward devotion. The second line, 'PÄ•mutala niá¸•ina pÄ•damu,' refers to the Lordµs feet resting upon serpent heads, an allusion to Krishna subduing the serpent Kaliya. Here, the feet represent calm mastery over ego and danger -symbolizing the divineµs quiet power to transform chaos into peace. In the third line, 'Premapu ÅšrÄsati pisikeá¸•i pÄ•damu,' Goddess Lakshmi, the deity of wealth and prosperity, is described pressing the Lordµs feet out of pure love.

This shows that even in the divine realm, loving service is an expression of devotion. It reminds us that humility lies at the heart of true service. Finally, 'PÄ•miá¸•i turagap' pÄ•damu' describes the Lordµs feet as coral-red and horse-like. The vivid image suggests not only radiance and beauty but also speed and strength. It evokes the purity and divine knowledge of Haya-griva, another manifestation of vishnu - symbolizing that the Lordµs movement is both swift and purposeful, carrying grace, wisdom, and power.

In Charanam 3, Annamacharya reveals the profound relationship between the seeker and the divine through the symbolism of the Lordµs feet. The opening line, 'Parama yogulakku pari pari vidhamula,' meaning 'To the great yogis, in countless ways,' reminds us that the divine does not appear in a single form but reveals itself uniquely to each soul based on their path and readiness. The next line, 'Paramosagedi nÄ« pÄ•damu,' or 'your feet grant the highest state of truth,' affirms that these sacred feet are not merely symbols of holiness - they are moksha itself, the liberation from the endless cycle of rebirth and suffering. In 'TiruvÄ“nkaá'-agiri tiramani chÅpina,' we learn that the Lord's very footsteps gave sanctity to the Tirumala hills, showing how His presence transforms ordinary places into centers of worship and grace. The final line, 'Parama padamu nÄ« pÄ•damu,' declares that the Lordµs feet are the supreme state - the ultimate truth that every yogi seeks. Through these verses, the poet quietly guides us to reflect on surrender, divine presence, and the personal, transformative path toward spiritual freedom.

Throughout the passage, the word »»»Paadamuµµ is repeated over and over again, showing that there is nothing more divine, pure and liberating than the feet of God.

Over my years of singing, I have come to learn many Annamacharya kritis are more than just devotional hymns; they are rich tapestries of Telugu poetry filled with meaning that transcends time and tradition, revealing truths that help us navigate the modern world today. Although the song may be devotional, songs like 'Brahma Kadigina Padamu' speak deeply about the value of humility and quiet strength in surrender. Reminds everyone that grace begins where ego ends.

అన్నమయ్య కీర్తన - బ్రహ్మ కడిగిన పాదము

రాగం: ముఖారి తాళం: ఆది

ఆరోహణ: స రి2 మ1 ప ని2 ద2 స

అవరోహణ: స ని2 ద1 ప మ1 గ2 రి2 స

పల్లవి: బ్రహ్మ కడిగిన పాదము
బ్రహ్మము దానె నీ పాదము

చరణం-1: చెలగి వసుధ గొలిచిన నీ పాదము
బలి తల మోపిన పాదము
తలకగ గగనము తన్నిన పాదము
బలరిపు గాచిన పాదము
బ్రహ్మ కడిగిన పాదము (ప)

చరణం-2: కామిని పాపము కడిగిన పాదము
పాముతల నిడిన పాదము
ప్రేమపు శ్రీసతి పిసికెడి పాదము
పామిడి తురగపు పాదము
బ్రహ్మ కడిగిన పాదము (ప)

చరణం-3: పరమ యోగులకు పరి పరి విధముల
పరమొసగెడి నీ పాదము
తిరువేంకటగిరి తిరమని చూపిన
పరమ పదము నీ పాదము
బ్రహ్మ కడిగిన పాదము (ప)
బ్రహ్మము దానె నీ పాదము



మహాత్మాగాంధీ అనుయాయి, గాంధేయవాది నిమ్మగడ్డ వెంకటకృష్ణారావుగారి మునిమనవరాలు. అమెరికాలో పుట్టి పెరుగుతున్నా తెలుగులో పాటలు పాడుతుంది, రాస్తుంది. సామాజిక సేవ పట్ల ఆసక్తి, భగవద్గీతా పఠనం పట్ల అనురక్తి ఉన్నాయి. మిచిగన్ యూనివర్శిటీలో డిగ్రీ చదవడానికి వెళుతోంది.



A Telugu Canadian's Pursuit of the North American Dream

Growing Up as a Telugu Canadian and Living the North American Dream

Bezawada Vishal

I was born in Vijayawada and raised in Toronto, Canada—two worlds that shaped my identity. A proud graduate of the University of Toronto with a double major in Computer Science and Statistics, and a minor in Mathematics, I now serve as a Canadian entrepreneur and the Youth Chair for the 24th National Conference of TANA.

The Telugu Identity in a New Land

One thing I've carried with immense pride is being Telugu. My family moved to Canada when I was five years old, and my younger brother was born here. Back then, Indian representation in my school was scarce—I was one of only two Indian students in my entire elementary school. But it didn't take long for me to become the go-to classmate for math help (my mother still insists I inherited those skills from her!). That early experience reinforced my belief in the intelligence and resilience of Telugu people.

My parents were deeply connected to our heritage and passionate about community service. Within two years of immigrating, they were actively involved in the Telugu Cultural Association of Greater Toronto (TCAGT), the largest Telugu association in Canada. And as the child of community-involved parents, I was inevitably "dragged" to cultural events, whether I liked it or not. At the time, I didn't fully appreciate them. But now, I see how those gatherings shaped my sense of belonging. They gave me fluency in Telugu, a love for our traditions, and, of course, the ability to crack sarcastic Godavari jokes that always entertained those around me!

Giving Back to Our Roots

Through non-profit organizations like TCAGT, TANA, APNRT, and Lions Clubs International, my family and I helped organize charitable initiatives—water purification projects, mega eye camps, school renovations, and educational scholarships. The satisfaction of giving back to our people and communities in India remains unparalleled, and this commitment, largely shaped by my father, Surya Bezawada, became my lifelong goal: to help as many people as possible.

The Language That Connects Generations

A defining moment in my Telugu journey came when my grandfather, Madhavrao Parvathaneni, and grandmother Baby Sarojini visited us in Toronto the summer I was 13. Their singular mission? Getting me to complete the Pedda Balasiksha. And trust me, when

a Thata and Ammamma have one goal, escaping is impossible! By the end of those two months, I was reading Telugu fluently. To this day, I can't write it perfectly, but being able to read Telugu—especially when visiting India—is something I hold dear.

It's frustrating that Telugu isn't widely recognized in Canada. More often than not, people assume I'm Tamil simply because they're unfamiliar with our language. That's something I want to change. By speaking only Telugu at home, engaging in cultural associations, and staying connected to our literature, I strive to keep the language alive.

Technology, AI, and Telugu Representation

Professionally, I've always been captivated by the intersection of technology and creativity. During the Hollywood writers' strike, I was invited as an AI expert on TV9 Telugu Channel's Burning Topic to discuss artificial intelligence's impact on the entertainment industry. Not only was it a proud moment for me professionally, but it was also an opportunity to represent young Telugu talent on an international stage.

Telugu people are among the smartest and most capable in the world—we've seen leaders like Satya Nadella rise to the highest ranks. And as a Telugu-speaking Canadian living the North American Dream, I am proud to be part of that legacy.

Because, as the saying goes— Desa bhashalandu Telugu lessa.



Bezawada Vishal was born in Vijayawada and raised in Toronto, Canada. He graduated from the University of Toronto with a double major in Computer Science and Statistics, and a minor in Mathematics. A Canadian entrepreneur, he currently serves as the Youth Chair for the 24th TANA National Conference. He was also featured as an AI expert on TV9's Burning Topic during the Hollywood strike.



My Home

Charishma Andra

My name is Charishma Andra. I was born in Kansas, but Michigan has been my home since I was 4 years old. I live in Novi, one of the most diverse and welcoming cities in the state, and I'm about to enter 11th grade. Growing up here, I've come to appreciate how truly special Michigan is-not just to live in, but to visit and experience. While Michigan might not always be the first place people think of when planning a vacation, those who overlook it are missing out on a state full of beauty, culture, innovation, and heart.

Michigan is often called the "Great Lakes State" for a good reason. We're surrounded by four of the five Great Lakes-Lake Michigan, Lake Superior, Lake Huron, and Lake Erie-making Michigan home to more freshwater coastline than any other state in the U.S. That means beaches, boating, kayaking, and breathtaking views are always close by. Our lakes aren't just stunning-they provide some of the cleanest, best-tasting water in the entire country. People come from all over to experience the peacefulness of a Michigan shoreline or the fun of a summer day on the water.

But there's more to Michigan than just natural beauty-we're also a place of innovation and history. Michigan is the birthplace of the American automobile industry. Thanks to Henry Ford and his revolutionary assembly line, the world was forever changed right here in our state. Today, visitors can learn all about this legacy at the Henry Ford Museum in Dearborn, where history, creativity, and invention come to life. And the spirit of innovation is still strong-Michigan continues to lead the nation in automobile engineering and production, proudly earning its title as the automotive capital of the world.

For those who love unique adventures, Michigan offers some unforgettable places. The Mackinac Bridge, one of the longest suspension bridges in the world, connects the Lower and Upper Peninsulas and is a stunning symbol of our state. Just across the bridge lies Mackinac Island, where cars are banned, and visitors travel by horse-drawn carriage or bike. With its historic architecture, scenic views, and famous fudge shops, it feels like stepping back in time.

Beyond nature and history, Michigan is also a center for world-class education. The state is home to some of the nation's top universities. The University of Michigan in Ann Arbor consistently ranks among the best public universities in the country, known for its research, medicine, and global impact. Michigan

State University in East Lansing is another academic powerhouse, especially recognized for its programs in science, agriculture, business, and veterinary medicine. We also have smaller, prestigious schools like Kalamazoo College, Hope College, and Wayne State University-each contributing to Michigan's legacy of academic excellence. Whether you're looking to study engineering, medicine, arts, or business, Michigan's universities offer something for everyone, right in the heart of the Midwest.

As a student growing up in Novi, I've seen how Michigan brings people together from all cultures and walks of life. Our schools, communities, and cities are beautifully diverse. This diversity doesn't just make Michigan welcoming-it makes it stronger, smarter, and more connected. You'll find that whether you're visiting Detroit's vibrant music and art scene, tasting food from around the world at a cultural festival, or joining in a local event in a small town, there's a strong sense of pride and community wherever you go.

Now, Michigan might not sound like the "ideal" vacation spot at first. We're not filled with palm trees or red carpets, and we don't promise year-round sunshine like California or Florida. But that's exactly what makes Michigan special. Here, you'll find peaceful hikes, clean lakes, charming downtowns, and genuine people. We offer four real seasons, each with its own personality-from colorful autumn leaves to magical winter snowfalls, fresh spring blooms, and lively summer lakeshores.

So why should you visit Michigan? Because it's a place that quietly surprises you. It's where history meets the future, where nature meets innovation, and where you'll find both adventure and peace. Whether you're walking through a college campus in Ann Arbor, touring the Henry Ford Museum, biking on Mackinac Island, or watching a sunset over Lake Michigan, there's something here that stays with you long after you leave.

Michigan isn't just a state-it's an experience. And for me, it's home.



Charishma Andra going into 11th grade this fall at Novi High School. She loves spending her time doing creative and active, like dancing and listening to music. She has been learning Bharatanatyam since she was five years.

My World

Taran Yarlagadda

Hello, my name is Taran. I'm an eighth-grader living in Holmdel, Jersey. I'm here to share my experience living as a second-generation Telugu in America. I have always loved going to India and staying with my grandparents, and the summers when I go there are always the most memorable and fun times I've ever had. One thing that's awful about being a second-generation Telugu is that my grandparents chose to stay in India instead of moving here. And because of that, I've had a really loose connection with them because I've rarely seen them. I've only seen them once or twice every three to four years, which has not allowed me to have a nice connection with them. Another thing is that there are only three or four other Indians who live in my township. And because of that, I've had to open up to a lot of new people who are from different cultures. For example, on my soccer team, I was the only Indian and also the only non-American person on my team. And so that was a unique experience trying to connect to these people who were so different from me, who had different interests than me. It was a unique experience. But I've been able to make a lot of friends.

Being Indian has allowed me to make a lot of friends. My closest friends are all Indian because we share such a similar culture and heritage. I've been able to talk with them about a lot of stuff that I don't have with people who are not Indian. And also, my local temple is a great community. They have a plethora of teachers who teach various courses, from Vedic math to languages like Tamil and Kannada to courses like Vishnu Sahasranamam. And it's just a really nice experience. I've been taking classes there since I was a kid, and I've always enjoyed learning more about my culture and things that my ancestors once did back when they lived in India. So it was a nice thing to experience. Another thing is the culture and our history. Our epics about our ancestors are some of the most interesting stories I've ever read.

The Ramayana and Mahabharata are some of my favorite books, and I really enjoy reading them. Finally, it's a unique experience. We're living in a country where most people don't understand the Hindu and Hindu practices. I've often found myself trying to explain our religious epics, like the Ramayana and the Mahabharata, as well as why we don't eat beef. But anyways, that's my experience living here as a second-generation Telugu in America. Thank you.



Taran Yarlagadda is in 8th grade, living in Holmdel, New Jersey. His grant parents live in Hyderabad. His favourite sport is soccer.

వ్యాసప్రభ

ఈ వ్యాసప్రభలో...

1. తెలుగు నాటకరంగం - యువత, నవత, భవిత
   - కె. శాంతారావు ... 206
2. శతవసంతాల కళాహేల, శతసహస్ర చైతన్యజ్వాల- ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్, కాకినాడ
   - దంటు భాస్కరరావు ... 209
3. తెలుగు సినిమా సాంకేతిక వైభవం
   - శ్రీ అట్లూరి & జలపతి ... 214
4. తెలుగెందుకు?
   - సింహాద్రి కిరణ్ ... 220
5. అమెరికాలో ఎం.ఏ. తెలుగు-ఒక ఆహ్లాదకరమైన అనుభవం
   - యార్లగడ్డ శివరాం ... 224
6. తెలుగుపాట సాహిత్యం: ఒక మధురానుభూతి ప్రస్థానం
   - భాగవతుల శ్రీలక్ష్మి ... 227
7. ఊరి పేర్ల కత
   - అడుసుమిల్లి శివ ... 229
8. రోజువారీ మాటల్లో ఆంగ్లపదాలు
   - వేములపల్లి రాఘవేంద్ర చౌదరి ... 232

సీనియర్ సిటిజన్స్ ఫోరం వ్యాసాలు

9. అంతర్జాల ఆవరణలో సంభాషణలు - తరాల మధ్య బంధాలు ... 233
10. అంతర్జాల ఆవరణలో అనుభవాల కలబోత... అందరం ఒక్కరుగా, అవధులకతీతంగా! ... 235
11. అంతర్జాల ఆవరణలో స్వీయసాధనానుభవాలు... ఒకే దీప్తి, అనేక మార్గాలు ... 239
12. అంతర్జాల సమావేశంలో సంభాషణలు... తరాల మధ్య వ్యవహారాలలో వివేకం ... 243
13. మాటల నుండి అస్తిత్వంవైపు సమష్టి ప్రయాణంలో నాలుగు చిరు అడుగులు ... 245
14. మానసిక ఆరోగ్యం (The Art of Letting Go)
    - ఆరి సీతారామయ్య ... 247
15. మాట మారింది, మాధ్యమం మారింది, రచయితలు మారాల్సిన సమయం వచ్చింది
    - అనిల్ అట్లూరి ... 249
16. From Curry Leaves to Croplands
    - *Pulugurtha Hari* ... 242
17. Feathered Friends of Michigan
    - *Bollineni Sam* ... 255

తెలుగు నాటకరంగం - యువత, నవత, భవిత

కె. శాంతారావు

చర్యకు ప్రతిచర్యే నాటకం.

ప్రపంచంలో జరిగే పరిణామాలు మానవ స్వభావంలో జరుగుతాయి. ఉన్న మార్పులు అనుభవసహితంగా రంగస్థలం చర్చిస్తుంది. విశ్లేషిస్తుంది. అది సహేతుకంగా నిర్భయంగా నిజాయితీగా. అప్పుడు అది మానవాళ జీవితాన్ని గంధరగోళం నుండి స్పష్టపరుస్తుంది. భయాన్ని పోగొడుతుంది. జీవితంపట్ల ఆసక్తిని అనురక్తిని చిగురింపచేసి ముందుకు నడిపిస్తుంది. నాటకం జీవితాన్ని ప్రతిబంబిస్తుంది, జీవితం నాటకానికి ప్రతిస్పందిస్తుంది అనే సూక్తి ఈ కోణం నుండే ఆవిర్భవించింది. అయితే ఆధునిక నాటకం అక్కడికే పరిమితం కాలేదు. సమాజం ఎట్లున్నదో తెలపడమే కాదు ఎట్లుంటే బాగుంటుందో కూడా కొత్తగా సూచిస్తుంది. అందుకే నాటకాన్ని జాగృత స్వప్నం అని కూడా వివరిస్తున్నారు ఆధునికులు.

ఎవరు అవునన్నా కాదన్నా మనకి ఇష్టమున్నా లేకున్నా 1990 సంవత్సరం నుండి ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు అమలవుతున్నకొలదీ మానవ జీవనసరళిలో పెను మార్పులు సంభవిస్తున్నాయి. సామ్రాజ్యవాద కార్పొరేట్ విధానాలు ద్రవ్య పెట్టుబడితో దేశ దేశాలను ఆక్రమిస్తున్నాయి. అంటే అక్కడే సహజ వనరులపై కన్నేస్తూ ఆ దేశ ప్రజలను మార్కెట్‌తో ముంచెత్తుతున్నాయి. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు నిరుపేద దేశాలకు ఒక ప్రక్క నీరు, గాలి, పౌష్టికాహారం, విద్య, వైద్యం, ఇంధనం వంటి కనీస సౌకర్యాలు అందక మరోప్రక్క కాలుష్య కాసారాలుగా మారుతున్నాయి. యుద్ధాలు సంభవిస్తూనే ఉన్నాయి. పసిపిల్లలు, స్త్రీలు, అమాయకులు బలైపోతున్నారు. ఈ భయంకర భౌతిక వాస్తవం నుండి నాటక కళాకారుడే కాదు ఏ కళాకారుడు తప్పించుకోజాలడు.

అమెరికా ఎంఐటి (మసాచ్యూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేదిక పై నుండి గాజాలో జరుగుతున్నది నిర్ద్వందంగా నరమేధమే అని మేఘా వేమూరి విస్పష్టంగా ధైర్యంగా ప్రకటించింది. పాలస్తీనావాసులకు మద్దతుగా తాము అంటే ఆ విశ్వవిద్యాలయ విద్యార్థులు ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. తెలుగు సంతతి విద్యార్థిని అయిన ఆమె ఇంకా ఈ విధంగా కూడా చెప్పారు. ఎక్కడైనా అన్యాయం, అసత్యం, అమానవీయం అనిపించిన సందర్భాల్లో యువత బాధితులకు గొంతుగా నిలవాలి అని వక్కాణించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రాజ్యానికి వ్యతిరేకంగా ఈ వ్యాఖ్యలు చేయటం, నిజంగా ఎంత సాహసం. తెలుగువారికే కాదు యావత్ మానవాళికే ఆమె ఒక ఆదర్శం ఒక గర్వం.

అందుకే మహాకవి శ్రీశ్రీ అంటాడు, 'కొంతమంది యువకులు, యువతులు రాబోవు యుగం దూతలు పావన నవ జీవన బృందావన నిర్మాతలు,' అని. మన భారతదేశంలో యువ శక్తికి నవశక్తికి సంకేతం భగత్‌సింగ్. దేశంకోసం, ప్రజలకోసం ప్రాణాలు తృణప్రాయంగా ఎంచి ఉరికొయ్యను ముద్దాడిన అమరత్వం భగత్‌సింగ్‌ది.

ఈ త్యాగం, సాహసం, మానవత్వం వంటి సుగుణాలు సహజంగా యువతలో ఉంటాయి. వాటిని నాటకం రసాస్వాదనతో సుసంపన్నం చేయగలదు. ఎప్పుడు? యువతను సత్యశోధనతో ప్రాపంచిక దృక్పదం వైపు మరల్చినప్పుడు. మరలా ఆ కృషి నాటకమే

గొప్పగా చేయగలదు. ఇది బింబ ప్రతిబింబ ధర్మంగా ఎల్లడలా వ్యాపించగలదు. కావలసింది చైతన్యవంతమైన జోక్యం.

గ్రీకుశాస్త్రం ఏం చెప్తున్నది? మానవ సమూహం తమ ప్రక్షాళన కోసం నిర్వహించే క్రతువు నుండే అంటే కెథోరిసిస్ నుండే నాటకం ఉద్భవించినట్టు చెప్తుంది. యువతను నాటకరంగంలో విస్తృతంగా తీసుకురాగలిగినప్పుడు ఆ విధంగా తమ తప్పులు తెలుసుకోవడంతోపాటు నూతనోత్తేజంతో సమాజానికి దేశానికి సేవ చేయగలరు. నాటకం పుట్టుకే మానవజాతికి ఒక దిద్దుబాటు, ఒక దివ్య తేజస్సు.

అయితే ప్రపంచీకరణ నేపథ్యంలో మానవుడు నానాటికి పరాయీకరణ చెందుతున్నాడు. ప్రకృతి నుండి సమాజం నుండి కుటుంబం నుండి చివరకు తన నుండే తాను విడిపోతున్నాడు లేదా దూరమవుతున్నాడు. ఎందుకు పుట్టానో ఎందుకు జీవిస్తున్నానో గ్రహింపు లేక యంత్రంగా మారిపోతున్నాడు. లక్ష్యం లేక దిశానిర్దేశం లేక ఎటో కొట్టుకుపోతున్నాడు. నాటకం సమిష్టికృషితో మనుషులను దగ్గర చేయగలదు. మనిషిలోని మనిషిని కూడా దగ్గర చేయగలదు. మనిషిలోని మనిషితనాన్ని మేలుకొల్పగలదు. నాటకం ఒక్కటే మనిషిని మనిషిగా సజీవంగా చూపుతూ జ్ఞానేంద్రియాలను సెన్సస్‌ను చక్కగా పని చేయించగలదు. అందుకే ఎంఐటి, నాసా, ఐఐటి వంటి సైన్స్ ఇంజనీరింగ్ టెక్నాలజీ సంస్థలో రంగస్థల శాస్త్రాన్ని ప్రత్యేకంగా బోధిస్తున్నారు.

ఇక్కడో విషయం మనం చెప్పుకోవాలి. ప్రస్తుతం మన భారత దేశం జనాభా సంఖ్యలో ప్రపంచంలోనే అగ్రదేశం. 140 కోట్లు దాటి చైనాను అధిగమించాం. 30 సంవత్సరాల లోపు వయసు గలవారు మన దేశంలో 60% ఉన్నారు. అంటే 84 కోట్లమంది. అందుకే మన దేశాన్ని యంగ్ ఇండియా 'యువభారత్'గా పిలుస్తున్నారు. ఇదే నిష్పత్తి మన తెలుగువారికి వర్తిస్తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ రాష్ట్రాల్లోనూ ఇతర దేశాల్లోనూ ప్రాంతాల్లోనూ మన తెలుగువారిని కలిపితే దాదాపు 100 కోట్లమందికి పైగానే ఉంటారు. వారిలో 60% అంటే ఆరు కోట్ల మంది 3-18 సంవత్సరాల మధ్య వయసుగల చదువుకునే విద్యార్థుల సంఖ్యను గమనంలోకి తీసుకుంటే వారు మూడు కోట్లమంది ఉంటారు.

చదువుతో పాటు వీరికి భాషా నైపుణ్యాలు, జీవన నైపుణ్యాలు తప్పనిసరి. అందుకే రంగస్థలం ద్వారా విద్యాబోధన అనేది ఒక అద్భుత మాధ్యమంగా విద్యాసంస్థల్లోకి నేడు చొచ్చుకు వస్తున్నది. కళల ప్రాధాన్యం గుర్తెరిగిన వారు దానిని తప్పక ఆచరిస్తున్నారు. భాగస్వామ్యం పద్ధతి ద్వారా (పార్టిసిపేటరీ మెథడ్) ద్వారా విద్యార్థులను నిత్యం చేతనావస్థలో చురుగ్గా ఉంచగలుగుతున్నారు. పని చేస్తూ నేర్చుకోవటం (లెర్నింగ్ బై డూయింగ్) ద్వారా విద్యార్థి ప్రతిదీ అనుభవసహితంగా ప్రాక్టికల్‌గా నేర్చుకోగలడు. ఆనందంగా నేర్చుకోవటం (జాయ్‌ఫుల్ లెర్నింగ్) అంటే ఇదే. ఆటపాటలతో బోధన. కథను పాటను అభినయంతో ఆకర్షణీయంగా చెప్పటం, పాడటం, కథను, పాటను నాటకంగా మలిచి ప్రదర్శించటం అన్నీ ఈ పద్ధతిలోకే వస్తాయి. తద్వారా పిల్లలకు ఎంతో ఆత్మస్థైర్యం వస్తుంది. తమ జీవితంలోకి ఆ విధంగా చిన్నప్పటి నుండే నాటక ప్రపంచాన్ని ఆహ్వానించి నాణ్యమైన జీవితం పొందేందుకు తమ మార్గాన్ని సుగమం చేసుకోగలరు. నాటకం లోకానువృత్తానుకరణం గనుక లోకజ్ఞానాన్ని కూడా పెంపొందించుకోగలరు. అన్నిటికంటే ముఖ్యంగా ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోగలరు. కేవలం బట్టీ కొట్టి పరీక్షలు రాసి మార్పులు ర్యాంకులు పొందే సంకుచిత యాంత్రిక విధానానికి ఇది పూర్తి విరుగుడు. మహనీయుడు నటదిగ్గజం బళ్లారి రాఘవ నాటక కళాకారునికి శాస్త్రీయ శిక్షణ అవసరం అని చెప్పిన విషయం తెలిసిందే కదా.

ప్రస్తుతం మన తెలుగు నాటకరంగాన్ని రేఖామాత్రంగా గమనించినట్లయితే ప్రాచీన వీధి నాటకం అక్కడక్కడ మారుమూల పల్లెల్లో తారట్లాడుతూనే ఉన్నది. దీనినే వీధి భాగోతం, చిందు భాగవతం, బయలు నాటకం, యక్షగానంగా కూడా పిలుచుకుంటున్నారు. కొన్ని సారుప్యతలు, బేధాలు ఉండవచ్చు. ఆసక్తి ఉన్న యువత వీటిని నేర్చుకుంటూనే ఉంటుంది. ఇంకా స్త్రీ పాత్ర పురుషులే పోషిస్తున్నారు. వీటిలో రౌద్ర, వీర రసాలు ప్రదర్శించే టప్పుడు ఒక రకమైన పూనకానికి, ఉద్రేకానికి మధ్య గల సున్నితమైన స్పృహలో కళారూపాన్ని ప్రదర్శిస్తుంటారు. ఈ కళారూపానికి ఇదే ప్రధాన ఆకర్షణ కావచ్చు. రాయలసీమ, తెలంగాణ ఉత్తరాంధ్ర పల్లెల్లో ముఖ్యంగా ఆదివాసి దగ్గర ప్రాంతాల్లో ఈ కళారూప ఛాయలు గమనించవచ్చు.

తెలుగు జానపద నాటకం తగ్గిపోతున్నది. ఒకప్పుడు సురభి వంటి ప్రముఖ సంస్థలు బాలనాగమ్మ, కాటమరాజు కథ, ప్రతాప రుద్రీయం వంటి గొప్ప నాటకాలు ప్రదర్శించేవి. ప్రస్తుతం పాఠశాలలో తెనాలి రామకృష్ణ, మర్యాదరామన్న వంటి లఘు నాటికలు ప్రదర్శిస్తున్నారు. శరణదాసు వంటి ఆధునిక జానపద నాటకాలు అంతంత మాత్రమే.

20 శతాబ్దంలో తెలుగు ప్రజలను ఉర్రుతలూగించిన పౌరాణిక పద్యనాటకం కొనసాగుతున్నది. పూర్తిగా నాటకాలుగాను భిన్న నాటకాల్లోని భిన్న అంకాలను ఒక సమాహారంగా కూర్చి ప్రదర్శిస్తున్నారు. రాయలసీమలో పద్యనాటకానికి విశేషాదరణ ఇప్పటికీ ఉన్నది. పద్యాలు వాద్యహోరులో కొట్టుకుపోవటం, పద్యం బెత్తుడు రాగం బారుడు అన్న చందంగా పద్యఘర్షణ సాగటం, భావం అర్థం కాకపోవటం- వెరసి పాత్రోచిత అభినయం దెబ్బ తినటం ఇంకా చాలాచోట్ల కొనసాగటం విచారకరం.

సాంఘిక నాటిక నాటకాలకు పరిషత్తులే ఆలంబనగా ఉంటున్నాయి. ఉభయ రాష్ట్రాలలో దాదాపు 100కు పైగా పరిషత్తులు ఉ

ంటున్నాయి. ఎక్కువ భాగం ప్రతి ఏట ఈ పరిషత్ పోటీలు జరుగుతున్నాయి. ప్రభుత్వం నిర్వహించిన నందీ నాటకోత్సవాలు కూడా పరిషత్ పోటీల బాటలోనే నడిచాయి. అయితే ఆ ఉత్సవాల్లో యువతకు, బాలలకు ప్రత్యేక విభాగ పోటీలు ఉండటం వలన అవి ప్రత్యేక ప్రోత్సాహంగా పనిచేశాయి. వందల సంఖ్యలో నాటకాల్లో పాల్గొనేవారు. అలాగే చాలాచోట్ల జరుగుతున్న బాలోత్స వాల్లో నాటకాల్లో ఏకపాత్ర అభినయాల్లో బాలలు పాల్గొంటున్నారు.

ఆధునిక వీధి నాటకలు, కళాజాతాలు ప్రజానాట్యమండలి వంటి సంస్థలు, ఎన్జీఓలు అక్కడక్కడ ప్రదర్శిస్తున్నాయి. వీటిలో యువత పాల్గొంటున్నది.

ఏ రంగం ముందుకు పోవాలన్నా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ పరిశోధన అభివృద్ధి తప్పనిసరి. అయితే మన తెలుగు నాటక రంగంలో ఈ ఆర్ అండ్ డి విభాగ పాత్ర నామమాత్రమే. ప్రపంచ నాటకరంగంలో వస్తున్న మార్పులు గమనించినప్పుడు మన నాటక స్థాయిని మనం తెలుసుకోగలం. అలాగే మనం ప్రదర్శిస్తున్న నాటకాలపై సహేతుకమైన విశ్లేషణ విమర్శ కూడా అవసరమే. ఈ రెండింటిపై ఆధారపడే మనం మన నాటకాన్ని మన ప్రజలకు అవసరమైన రీతిలో మనకు మనం కొత్త పుంతలు తొక్కించగలం. ప్రజా చైతన్యం ఇందుకు గీటురాయిగా నిలుస్తుంది. అలాగాక కేవలం బహుమతులు, ప్రశంసల వద్దనే ఆగిపోతే మనం తెలియ కుండానే మన నాటకాన్ని మన చేతులతోనే ఆపుకున్నవారమై పోతాం.

బాలలను, యువతను ఈ నాటకరంగంలోకి విస్తృతంగా తీసుకురావాలంటే మూసధోరణిని బద్దలుకొట్టక తప్పదు. బళ్లారి రాఘవ, డాక్టర్ రాజారావు, కె. వెంకటేశ్వరరావు, ఏఆర్ కృష్ణల మాదిరి నాటక శిక్షణకు ప్రాధాన్యత ఇయ్యాలి. శిక్షణాసంస్థలు నెలకొల్పాలి. శిక్షణ శిబిరాలు, వర్క్‌షాపులు విరివిగా నిర్వహించాలి. విద్యా లయాల్లో కళాశాలలో ఓ కో-కర్రిక్యులం యాక్టివిటీగా (విద్యా బోధనతో సమాంతరంగా) నాటక శిక్షణ ప్రదర్శనలు సాగాలి. క్రీడలు, కళలు, నాటకం లేకుండా మనిషి వికాసం అసాధ్యం.

దీంతోపాటు వృత్తి నాటకం ఎదగాలి. గతంలో సురభి నాటక సంస్థలు తమ వృత్తి నాటకంతో నాటకానికి పర్యాయపదంగా నిలిచాయి. వృత్తి ప్రవృత్తి వేరు కాదని నిరూపించాయి. ఇప్పుడు కూడా చాలామంది నాటకం అంటే అంకితభావం కలిగిన యువత తప్పక ఉంటారు. వారికి సరైన వేదిక నిర్మించి వారిని పూర్తికాలం నాటకరంగానికే వెచ్చించే కార్యకర్తలుగా మరల్చితే మన తెలుగు నాటకానికి ఎనలేని ప్రయోజనం చేకూరుతుంది. భవిష్యత్తులో ఈ ఖాళీ పూరించబడుతుందని ఆశిద్దాం.

నానోభావోపు సంపన్నం
నానావస్థాంతరాత్మకం
లోకానువృత్తానుకరణం నాటకం

నాటకంలో కనిపించని జ్ఞానంగాని, శిల్పంగాని, విద్యగాని, కళగాని, యోగంగాని, కర్మగాని లేనేలేవు అన్న భరతముని శ్లోకాన్ని నిజం చేద్దాం. ఎంత డిజిటల్ వ్యాప్తి జరిగినా నాటకం నిత్యం సజీవమే.



కృష్ణాజిల్లాలో జన్మించిన కె. శాంతారావు వామపక్ష ఉద్యమాలతో ఎదిగిన మనిషి. నాటకాల మీద మక్కువతో ఆ రంగంలో కృషి చేస్తున్నారు. ప్రధానంగా వీధి నాటకాలు ప్రదర్శన, శిక్షణ వీరి ప్రత్యేకత. బాలలకు నాటకాల్లో శిక్షణ ఇస్తూ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారు. నాటక ప్రయోక్త. నివాసం హైదరాబాదు.

శతవసంతాల కళాహేల, శత సహస్ర చైతన్యజ్వాల - ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్, కాకినాడ

దంటు భాస్కరరావు

ఒక దేశం, ఒక జాతి, ఒక సమాజం అభివృద్ధి కేవలం భౌతికమైన నాగరికత ద్వారానే కాదు, సాంస్కృతిక వికాసం పైన ఆధారపడి వుంటుంది. భౌతిక అవసరాలు తీర్చే శాస్త్ర, సాంకేతిక రంగాలేకాక, విద్య, విజ్ఞానం, వినోదం, మనోవికాసానికి ఎంతో అవసరం.

కందుకూరి వీరేశలింగంగారి చైతన్యస్ఫూర్తితో రాజమహేంద్ర వరం కేంద్రంగా, రాష్ట్రమంతటా సాంస్కృతిక ఉద్యమం ప్రారంభమైంది. సాహిత్యం, నాటకం ఇత్యాదులు సంస్కరణోద్య మాలులో భాగమై అన్ని రంగాలను ప్రభావితం చేశాయి. ఆ ప్రకంపనలు కాకినాడకు తాకాయి. సింగీతం అబ్బాయిగారనే వెంకట్రావుగారు, జగన్నాధపురంలో 1913 లో 'యువజన ఆనంద నిలయం' అని ప్రారంభించారు. వారికి పులవర్తి వెంకయ్యగారు చేదోడుగా నిలబడ్డారు. పల్లి హనుమంతరావు, యరగల సత్తిరాజు గార్లు ఎమెచ్యూర్ సంస్థను ముందుకు తీసుకుపోయారు. అబ్బాయి గారు, వెదురు మూడిశేషగిరిరావు, జయంతి భావన్నారాయణ కవి, పండ్రవాడ కేశవరావు, తుర్లపాటి సుబ్బారావు, దినవాహి కృష్ణమూర్తి, మొసలికంటి బాయన్నపంతులు, కందుకూరి మూర్తిరాజు, వల్లూరి జగన్నాధరావు, ముప్పిడి జగ్గరాజులాంటి ఉద్దండులైన నటులు, ఆయనకు సహకరించి, నాటక ప్రదర్శనలు ప్రారంభించారు. కాని, దానిని, కొనసాగించలేకపోయారు.

1916 సం॥లో గొప్ప సంకల్పంతో, స్ఫూర్తితో నలుగురు యువకులు, 1) శ్రీ దంటు సూర్యారావు (సీనియర్), 2) శ్రీ గండికోట జోగినాధం, 3) శ్రీ మాదిరెడ్డి రామానుజాలనాయుడు, 4) జనాబ్ ఖాసిం సాహేబ్, ఎందరో కళాకారుల ప్రోత్సాహంతో 'ది యంగ్మెన్స్ హేపీ క్లబ్'గా పేరును మార్చి జగన్నాధపురం (కాకినాడ) యనమండ్ర సూరయ్యగారి ఇంట్లో ప్రారంభించారు. ఏలూరుపాటి వెంకటరత్నం, సామర్తి బుచ్చిరాజు, దేవినేటి జగన్నాయకులు, మొదలైన వారి సహకారంతో మంచి ప్రదర్శనలు ప్రారంభించారు.

తదుపరి 'ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్' సినిమారోడ్డు, కాకినాడలో మెజిస్టిక్ ధియేటర్ నిర్మించి దాని ఆవరణలోనే 'ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్'ను కొనసాగించారు. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో, బ్రిటిష్‌వారి పాలనాకాలంలో 'ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్' 09/1926-1927గా, రిజిష్టర్ చేసి, కొనసాగించారు.

'ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్' సంవత్సరాల తరబడి, కళాకారు లకు, సంగీత, సాహిత్య, నృత్య, నాటకాలపై అవగాహన కల్పించి, సాధన చేయించింది. అనేకమందిని విద్యార్థులుగా చేర్చుకొని, వారికి ఉచిత భోజన, వసతి సదుపాయంతోపాటు స్కాలర్‌షిప్‌లు ఏర్పాటుచేసి, మంచి కళాకారులుగా తర్ఫీదు ఇచ్చారు. వారిలో నిష్ణాతుడిగా ఎదిగిన వారే రేలంగి వెంకట్రామయ్య, నల్ల రామ్మూర్తి. వీరు తరువాత సినిమాల్లో ప్రఖ్యాత హాస్యనటులగా ఎదిగారు. నటీమణులకు, నృత్యం, నాటకం పద్యగానాదుల్లో తర్ఫీదు ఇవ్వబడింది. అందులో రాణించిన తరువాత సినిమా కథానాయకగా వెలుగొందిన వారిలో శ్రీమతి అంజలీదేవి ఒకరు.

అద్భుతమైన నటులుగా, ది యంగ్‌మెన్స్ హేపీక్లబ్ తీర్చిదిద్దిన వారిలో, కొవ్వాడ సూర్యనారాయణ, భద్రిరాజు భాస్కరరాజు, పసుపర్తి పార్వతీశం, సామిన రంగారావు, యం. నాగభూషణం, శ్రీమతి కొటారి శకుంతల, కొటారి అలివేణి, యన్. రాఘవ కుమారి, రజనీకాంతం, కామేశ్వరి, పిళ్లారిశెట్టి సూర్యారావు, యం.వి.

రమణమూర్తి, యస్.పి. లక్ష్మణస్వామి, ఎ. రామరాజు, పెండ్యాల సుబ్బారావు, శ్రీమతి సూర్యాకాంతం (సినీనటి), సి.యస్.రావు (సినీ డైరక్టర్) డోలక్ సత్యం (సినీమ్యూజిక్ డైరెక్టర్), ఆదినారాయణరావు (సినీ మ్యూజిక్ డైరక్టర్) యస్.వి. రంగారావు (సినీనటుడు), చించినాడ సన్యాసిరావు, పామర్తి బుచ్చిరాజు, ఏలూరుపాటి వెంకట రత్నం, పసుపులేటి సత్యం, దేవర జగన్నాయకులు, కురుముద్దాలి రామచంద్రరావు మొదలగు వారు ప్రముఖనటులుగా ఈ సంస్థ నుండే ఎదిగారు.

దంటు సూర్యారావు (సీనియర్), గండికోట జోగినాధం, మాదిరెడ్డి రామానుజులు నాయుడు, జనాబ్ ఖాగిం సాహేబ్, వడ్లమాని విశ్వనాధం, అనేకమంది కళాకారుల, కళాభిమానుల శ్రమదానంతో, ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్ నాటక ప్రదర్శనశాల నిర్మాణం చేసారు.

దంటు సూర్యారావుగారు కార్యదర్శిగాను, గండికోట జోగినాధంగారు నట శిక్షకుడిగా మాదిరెడ్డి రామానుజులునాయుడు గారు, క్రమశిక్షణ భద్రతా నిర్వాహకుడిగా, ఖాశింసాహెబ్‌గారు నిర్మాణ సంరక్షకుడిగా బాధ్యతలు నిర్వహించేవారు.

మొట్టమొదట వందమంది జీవితకాల సభ్యులతో వంద రూపాయలు సభ్యత్వ రుసుముగా ప్రారంభించారు. అంకిత భావంతో కృషిచేసారు.

రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకంగా అనేక, పద్య, గద్య నాటకాలు, సాంఘిక నాటకాలు కొనసాగించారు. అందులో కొన్ని ముఖ్యమైన నాటకాలు- 1. లవకుశ, 2. భీష్మ, 3. శ్రీ కృష్ణరాయభారం, 4. కర్ణ, 5. కృష్ణార్జున యుద్ధం, 6. ధ్రువ విజయం, 7. పాదుకా పట్టాభిషేకం, 8. బృహన్నల, 9. రామదాసు, 10. హరిశ్చంద్ర, 11. సుభద్రా పరిణయం, 12. విప్రనారాయణ, 13. కృష్ణలీలలు, 14. తారా శశాంకం, 15. వీరభిమన్యు, 16. శ్రీకృష్ణతులాభారం, 17. భక్త ప్రహ్లాద, 18. ప్రమీలార్జునీయం, 19. పద్మవ్యూహం, 20. షిరిడీ సాయిబాబా మహాత్యం, 21. శరణం అయ్యప్ప, 22. నరకాసుర వధ, 23. సక్కుబాయి, 24. సత్యభామ విజయం, 25. ఖిల్జీ రాజ్య పతనం, 26. ఆలీ బాబా 40 దొంగలు, 27. అల్లాఉద్దీన్ అద్భుత దీపం, 28 రంగూన్‌రౌడి, 29. జవహరీబాయి, 30. బొబ్బిలి యుద్ధం, 31. విజయసింహా, 32. రాణీప్రమీల, 33. కనకతార, 34. చింతామణి, 35. వరవిక్రయం, 36. మధుసేవ, 37. కన్యా శుల్కం, 38. లోభి, 39. జోన్లీ కాటర్, 40. కనకపుష్యరాగం, 41. పసుపు-బొట్టు పేరంటానికి, 42. గాజుపాత్ర, 43. హక్కుదారులు, 44. సింహాద్రి అప్పన్న, 45. నందోరాజ భవిష్యతి, 46. నీలినీడలు, 47. రిక్రియేషన్ క్లబ్, 48. పుణ్యస్థలి, 49. నాల్గోకోతి, 50. సిరిమువ్వ, 51. రోషనార, 52. దీక్ష, 53. నవ్వండి ఇది విషాదం, 54. గాంధీ టు డే 55. మైట్ ఈజ్ రైట్, 56. అర్ధనాదీశ్వరం, 57. వసంతసేన, 58. కంఠాభరణం, 59. తులసితీర్థం, 60. నాలుగిళ్ల చావడి, 61. ఊరుమ్మడి బతుకులు, 62. అల్లసాని పెద్దన, 63. దేశమును ప్రేమించమన్నా, 64. అంధ్ర ప్రస్థానం, 65. మాధవసేవ, 66. అరణ్యాంతం, 67. బబ్రువాహన, 68. కన్నీటికి నోరొస్తే, 69. కన్నీటికి నోరొస్తే, 70. సర్ ఆర్డర్ కాటన్, 71. అమృతా హాస్పిటల్, 72. టోటోచాన్, 73. నరనారాయణం, 74. గగన కుసుమాలు, 75. తులసి పెళ్లి.

ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్, కళాసేవలో భాగంగా, దేశ స్వాతంత్ర్య సముపార్జనకు ఎన్నో నాటక పదర్శనలు నిచ్చారు. దేశభక్తి యుత చైతన్యాన్ని నాటక ప్రదర్శనల ద్వారా నిరూపించారు.

1948లో ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్, (కాకినాడ సూర్యకళా మందిర్ లో) నాటక పోటీలు నిర్వహించారు. ఆ పోటీలకు ప్రముఖ హిందీనటుడు, రంగస్థల విరాట్ స్వరూపుడు, పృధ్వీరాజ్‌కపూర్ గుణ నిర్ణేతగా (జడ్జ్) ఆహ్వానించబడ్డారు. ఆనాటి, నాటక పోటీల్లో 'మహానటి సావిత్రి' విజయవాడ టీమ్ నుండి పాల్గొని, అద్భుతంగా నటిస్తే ఆమె నటనకు ముగ్ధుడై పృధ్వీరాజ్‌కపూర్, అభినందనలు తెలియజేస్తూ తనకు వేసిన పూలమాలను తీసి, సావిత్రి మెడలో వేసి, 'మంచి భావి నటిగా వర్ధిల్లు,' అని దీవించారు. వెంటనే మద్రాస్‌లో నున్న లెజండ్రీ డైరక్టర్ శ్రీ ఎల్.వి. ప్రసాద్‌గారికి సావిత్రిని హెరోయ్యిగా రికమండ్ చేసారు. సావిత్రిని సినీరంగానికి ఆవిధంగా పరిచయం చేసారు.

ఈ ఘనకు ముందే, ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్, నటులైన అంజలీదేవి, ఆదినారాయణరావు, రేలంగి వెంకటరామయ్య, శ్రీమతి సూర్యకాంతం, గండికోట జోగినాధం, బి.ఎ. సుబ్బారావు, ర్యాలి సీతారామయ్య, కొవ్వాడ రామచంద్రరావులను సినీ పరిశ్రమకు తీసుకువెళ్లారు. తరువాత ఎస్.వి. రంగారావు, గిరిజ, కాకినాడ శ్యామల మ్యూజిక్ డైరెక్టర్‌గా సత్యం వెళ్లి మద్రాస్‌లో సినీపరిశ్రమలో స్థిరపడ్డారు.

ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్, తమ పద్యనాటకాలు, సాంఘిక నాటకాలు, నృత్యనాటకాలు, నాటికలు ప్రదర్శిస్తూనే, జైత్రయాత్ర కొనసాగిస్తూనే, కాకినాడలో భారతీయ-బహుభాషా నాటకాలు, బెంగాలీ, మరాఠీ, ఒరియా, హిందీ నాటకాలు, ప్రదర్శింపజేసి, ఆనాటి ప్రేక్షకుల మన్ననలు పొందింది.

క్లబ్ జీవితకాల సభ్యులు, క్లబ్ డోలక్ ఆర్టిస్టాగా పరిచితులు, తరువాత సినీ మ్యూజిక్ డైరెక్టరుగా ప్రసిద్ధుడైన సత్యంగారి ఆధ్వర్యంలో, శ్రీయుతులు చిత్తూరు వి. నాగయ్య, ఘంటశాల వెంకటేశ్వరరావు, శ్రీమతి సుశీల, శ్రీమతి ఎల్.ఆర్. ఈశ్వరి, పిఠాపురం నాగేశ్వరరావు, తదితర ప్రముఖ సినీ ప్లే బ్యాక్ సింగర్స్‌తో కాకినాడ-ఆనందభారతి గ్రౌండ్స్‌లో సంగీత విభావరి ఏర్పాటుచేసి అద్భుతంగా నిర్వహించింది.

ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్, తన సుదీర్ఘ కళాసేవలో ఎందరో కవుల్ని, కళాకారుల్ని, రప్పించి, నాటకాలు వ్రాయించి ప్రదర్శించింది.

కాళ్లకూరి నారాయణరావుగారు, కాకినాడలో ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్‌లోనే, క్లబ్ కోసం, 'చింతామణి' నాటకాన్ని రచించారు. తరువాత వరవిక్రయం, మధుసేవ రచించారు. క్లబ్ ఆ నాటకాలతో

ప్రదర్శనలతో ఆంధ్రరాష్ట్రంలోనూ, రాష్ట్రేతర ప్రాంతాలలోను, ఉర్రూతలూగించింది.

గండికోట జోగినాధంగారు 'చింతామణి' నాటకంలో సుబ్బిశెట్టి పాత్రకు, ఒక గొప్ప ఒరవడి సృష్టించి, క్లబ్‌కు శిఖరాయ మానమైన కీర్తిని తీసుకొచ్చారు. అలాగే, తర్వాత అనేకమంది కవులు, రచయితలు క్లబ్ కోసం నాటకాలు వ్రాశారు. వాటిలో కొన్ని-

ఆకెళ్ల వెంకట సూర్యనారాయణగారి భక్తపోతన, అల్లసాని పెద్దన పద్యనాటకాలతో నంది నాటకోత్సవాల్లో వుత్తమ ప్రదర్శన లుగా బహుమతులు అందుకొన్నాయి.

శారదా ప్రసన్నగారి 'దేశమును ప్రేమించుమన్నా' పద్య నాటకంతో నంది నాటకోత్సవాల్లో వుత్తమ ప్రదర్శన తదితర పరిషత్తుల్లో క్లబ్ బహుమతులు అందుకుంది.

'మార్గశీర్ష'గారి 'పసుపు-బొట్టు-పేరంటానికి' నాటకంతో రాష్ట్రంలోని అన్ని పరిషత్తులలో వుత్తమ బహుమతులు అందు కొంది.

రాఘవరావు (క్లబ్ కార్యదర్శి), పలు నాటికలు రచించి, ప్రదర్శించడం జరిగింది. భారతుల రామకృష్ణ సి.ఎన్. మూర్తిగార్లు, నాటికలు వ్రాసి క్లబ్ కోసం ప్రదర్శించి పరిషత్తులతో బహుమతులు అందుకొన్నారు.

నక్కా వెంకటేశ్వరరావుగారి సిరిమువ్వ నాటిక అనేక పరిషత్తుల్లో ఎన్నో బహుమతులు గెల్చుకొంది.

సి.యన్. మూర్తిగారి అంధప్రస్థానం, మాధవసేవ ఏ దేశ మేగినా, అరణ్యాంతం నాటికలు ప్రదరిర్శంచి క్లబ్‌కు ఎన్నో బహు మతులు తెచ్చిపెట్టింది.

డబ్బీర్ ఉమాశంకర్‌గారి 'మైట్ ఈజ్ రైట్' నాటిక క్లబ్ ప్రదర్శించింది.

సత్యనాధన్ వ్రాసిన 'నవ్వండి ఇది విషాదం', 'గాంధి టుడే,' నాటికలు పలు పరిషత్తుల్లో ప్రదర్శించి ఎన్నో బహుమతులుతో ప్రశంశలు అందుకుంది.

రాజస్థాన్, జైపూర్ యూనివర్శిటీ థియేటర్ ఆర్ట్స్ విభాగాధి పతి ప్రొఫెసర్ తూము శివప్రసాద్ రచన 'టోటో చాన్' నాటిక క్లబ్ ప్రదర్శించింది. యువ కళాకారులతో యమ్. రమణ వ్రాసిన 'నరనారాయణం' రచన, దర్శకత్వంలో పలు పరిషత్తుల్లో ప్రదర్శించి ఎన్నో బహుమతులలో ప్రశంసలు అందుకొంది.

కంచర్ల సూర్యప్రకాశరావు గారి 'కన్నీటికి నోరెస్తే' నాటకం నాటకోత్సవాల్లో ప్రదర్శించారు. ఆకెళ్ల వెంకట సూర్యనారాయణ గారి అమృతా హాస్పిటల్ నాటకం క్లబ్ ప్రదర్శించింది.

జాతీయ, అంతర్జాతీయ 'థియేటర్ ఒలింపిక్స్' నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వారి నాయకత్వాన నిర్వహించిన ప్రదర్శనల్లో భాగంగా బెంగుళూరులో, 'అల్లసాని పెద్దన' పద్యనాటకం ప్రదర్శించి, భారత ప్రభుత్వం ద్వారా సత్కారాన్ని అందుకొంది.

ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్‌లో శిక్షణ పొందిన కళాకారిణులు

1) అంజలీదేవి 2) గిరిజ 3) సూర్యకాంతం 4) చిత్తజల్లు అంజమ్మ 5) బాదం సుబ్బలక్ష్మి 6) వై.వి. అన్నపూర్ణ 7) పి. కామేశ్వరి 8) పి. పద్మ 9) సుజాత 10) చిత్తజల్లు కృష్ణవేణి 11) రెడ్డిరత్నం 12) కుమారి రాఘవ 13) సుహాసిని 14) కాకినాడ శ్యామల 15) చిత్తజల్లు జయ 16) పి. మణిబాల 17) రత్నం 18) కె. విజయలక్ష్మి 19) దూసి అనురాధ

క్లబ్‌లో శిక్షణ పొందిన నాటక కళాకారులు

1. దంటు సూర్యారావు, 2. దంటు భాస్కరరావు, 3. గండికోట జోగినాధం, 4. మాదిరెడ్డి రామానుజులనాయుడు, 5. జనాబ్ మహమద్ ఖాశిం సాహెబ్, 6. ర్యాలి సీతారామయ్య, 7. కొవ్వాడ సూర్యనారాయణ, 8. కొవ్వాడ రామచంద్రరావు, 9. యనమండ్ర సూరయ్య, 10. వేదనభట్ల నరశింహమూర్తి, 11. మూర్తిశ్రీ, 12. యస్.వి. రంగారావు, 13. రేలంగి వెంకటరామయ్య, 14. కొండూరి సూర్యనారాయణ. 15. వడ్లమాని వెంకటరమణ, 16. వడ్లమాని విశ్వనాథం, 17. నల్ల రామ్మూర్తి, 18. మద్దూరి బుచ్చన శాస్త్రి, 19. యస్.పి. లక్ష్మణస్వామి, 20. పిళ్లారిశెట్టి సూర్యారావు, 21. చించినాడ సన్యాసిరావు, 22. పామర్తి బుచ్చిరాజు, 23. దేవర జగన్నాయకులు, 24. కురుముద్దాలి రామచంద్రరావు, 25. నండూరి సుబ్బారావు, 26. చాగంటి కృష్ణమూర్తి, 27. సత్యనాధన్, 28. బొడ్డు రాజబాబు

క్లబ్ నాటకాలు తీర్చిదిద్దిన దర్శకులు

1. దంటు సూర్యారావు, 2. గండికోట జోగినాధం, 3. బి.ఎ సుబ్బారావు, 4. ఆదినారాయణరావు, 5. సత్యం, 6. కె.వి. రమణారావు, 7. పంతం సత్యనాధన్, 8. నక్కా వెంకటేశ్వరరావు, 9. రాఘవరావు, 10. ఆకెళ్ల వెంకట సూర్యనారాయణ, 11. కె. వెంకటేశ్వరరావు, 12. సి.ఎన్. మూర్తి, 13. కమలాకర్, 14. తూము శివప్రసాద్, 15. యస్.యస్.ఆర్. గురుప్రసాద్, 16. పంపన దయానంద్‌బాబు, 17. డి.ఎస్.పి. రావు, 18. యస్.కె. అమీర్, 19. ఎమ్. వి. రమణ, 20. ఒ.వి.ఎస్. వరప్రసాద్

శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో, వినోదం, విజ్ఞానం ప్రేక్షకులకు, అందించడంలో, సినిమా, టి.వి., ఇంటర్నెట్, సెల్‌ఫోన్, సీరియల్ ఛానల్స్ మొదలైనివి వచ్చి, ప్రజల్ని, ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నకాలంలో నాటకం మారుతున్న పరిస్థితులను అనుగు ణంగా లేకుంటే నాటక ప్రదర్శనలు బ్రతకడం కష్టమని గ్రహించి, ప్రపంచవ్యాపితంగా శాస్త్ర సాంకేతికతను ఉపయోగించుకొని, కాలానికి ఎదురొడ్డి పోరాడి రాణిస్తుంది. సాంకేతిక, శాస్త్రవిజ్ఞానం అవధులు లేని విశ్వరూపం ప్రదర్శిస్తుంటే... వాటికి తగినట్టు రంగ స్థలం, కళారూపాలు పోటీపడేలా తయారుచేయకపోతే కష్టమని భావించిన ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్ అధునాతన ఆడిటోరియం నిర్మాణం చేపట్టి, ఎందరో కళాప్రియుల, కళాపోషకుల, ప్రజా నాయకుల, అధికారుల, ప్రభుత్వం దగ్గర నుండి, కళాకారులు కేశే

దంటు సూర్యారావు (జూనియర్) నాయకత్వాన ఆర్థిక వనరులు సమీకరించి, ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్ దంటు కళాక్షేత్రం నిర్మించారు. రవీంద్రభారతి (హైదరాబాద్) ఆడిటోరియంతో పోటీ పడేలా అధునాతన థియేటర్ నిర్మాణం జరిగింది. శత వత్సరాల సాంస్కృతిక కళాసారథిగా కళాక్షేత్రం ది. 13-08-2014 అత్యాధునికమైన లైటింగ్, సౌండ్ సిస్టమ్, స్టేజ్ కర్టెన్స్, వుడెన్ ప్లాట్‌ఫాం, సెంట్రలైజ్డ్ ఎయిర్ కండిషన్, జనరేటర్ సదుపాయం, 500 సీటింగ్ కెపాసిటీతో, రెండు గ్రీన్‌రూములతో అద్భుత ఆడిటోరియం తయారైంది. సాంకేతిక నిపుణులు శ్రీ వై.యస్.యన్. మూర్తి బెంగుళూరు, శ్రీ వి. రామమూర్తిగార్ల నిర్దేశికత్వంలో నిర్మాణం జరిగింది.

అధునాతన 'దంటు కళాక్షేత్రం' తయారైన తరువాత నూతన థియేటర్ ప్రవేశమునకు 'శ్రీ కె.వి.యస్. సీతారామ్' శ్రీమతి రాధా రమణిగార్లు పూజాకార్యక్రమంతో ప్రారంభించారు. రాజస్థాన్, జైపూర్ యూనివర్శిటీలో థియేటర్ ఆర్ట్స్ విభాగంలో అధిపతి శ్రీ తూము శివప్రసాద్‌గారి ప్రయోగ నాటకం 'బారిష్టర్ పార్వతీశం' ప్రదర్శన 2016లో ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్ సెంటినరీ సెలబ్రేషన్‌లో నూతన థియేటర్ ప్రారంభించబడింది.

ప్రస్తుత క్లబ్ (ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్) 100 మంది జీవిత కాల సభ్యులతోను, 70 మంది పేట్రన్ సభ్యులతోను, 70 మంది చీఫ్ ప్యాటరన్ సభ్యులతోను- వీరిలో 10 మంది కార్యనిర్వాహక సభ్యులుగాను, 10 మంది కమిటీ సభ్యులు గాను 2 సంవత్సరాలు కొక పర్యాయం సర్వసభ్య సమావేశము ద్వారా ఎన్నుకోబడి, నిర్వహించబడుతున్నది.

ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్-దంటు కళాక్షేత్రంల జమ-ఖర్చులు విధిగా ఆడిటర్ ద్వారా ఆడిట్ చేయబడి, జిల్లా రిజిస్ట్రారు గారితో రెన్యూవల్ ప్రతిఏటా చేయబడుతున్నది.

ది యంగ్మెన్స్ హేపీ క్లబ్ ఆశయాలు

1. నాటకాల ప్రదర్శనల ద్వారా వసరంజకమైన వినోధాన్ని ప్రేక్షకులకు అందించడం.
2. నాటకాల ద్వారా ప్రదర్శనల ద్వారా మనోవికాసాన్ని విజ్ఞానాన్ని పెంపొదించడం.
3. ఆనందకర మానవ సంబంధాల్ని అభివృద్ధిచేయడం
4. కుల మతాలకతీతంగా మానవీయ కోణాన్ని దర్శింప జేయడం.
5. సకల జనుల సౌభాగ్యం కోసం కృషి చేయడం.
6. గొప్ప కళాకారులు సత్కరించడం, గొప్ప కళాకారుల్ని తయరు చేయడం.
7. సంగీత, సాహిత్య, నృత్య నాటకాల్లో తర్ఫీదు ఇవ్వడం.
8. మానవాళిలో మనోవికాశంకోసం సాంస్కృతిక ఉద్యమాన్ని కొనసాగించడం.



9. మనిషి యాంత్రికమై పోతున్న తరుణంలో అతనిలో రసజ్ఞత నింపి, సృజనాత్మకతవైపు నడపడం
10. ధనమే అన్నిటికి మూలమని, యూజ్ & త్రో ప్రవృత్తికి గురై, నేరస్వభావాన్ని నింపుకుంటున్న మనిషిలో మానవత్వం మేలు కొల్పాలనే ఆశావాదంతో క్లబ్ తన కార్యకలాపాలను సాగిస్తున్నది.

క్లబ్ నిర్వహించిన నాటకోత్సవాలు, పోటీలు

1. 1941 - సిల్వర్ జూబ్లీ ఫంక్షన్ నిర్వహణ
2. 1948 - సూర్య కళామందిర్లో 4 రోజులు పాటు నాటిక పోటీలు నిర్వహించింది.
3. 1963-64 - నాటిక పోటీలు నిర్వహించింది.
4. 1966 - గోల్డెన్ జూబ్లీ ఫంక్షన్ నిర్వహించింది.
5. 1976 - ప్లాటినం జూబ్లీ ఫంక్షన్ నిర్వహించింది.
6. 1981 - బళ్లారి రాఘవ & తెలుగు నాటకరంగం శత జయంతి వుత్సవాలు వారం రోజులు నిర్వహించింది.
7. 1991 - నాటకోత్సవాలు నిర్వహించింది.
8. 1993 - అఖిలభారత స్థాయి నాటక పోటీలు ప్రతిష్టాత్మకంగా సూర్యకళామందిరంలో నిర్వహించింది.
9. 2005 - అజో-విభొ-కందాళం ఫౌండేషన్ మరియు ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్ సంయుక్తంగా నాటిక పోటీలు-సాహిత్య సభలు నిర్వహించింది.
10. 2018 - ఎ.పి.ఎఫ్.డి.సి. (ఆధ్వర్యంలో) మరియు ది యంగ్ మెన్స్ హేపీ క్లబ్ సంయుక్త నిర్వహణలో 21 రోజులు, పద్య, సాంఘిక నాటికల పోటీలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించ బడ్డాయి.
11. 2019 - కీ.శే. దంటు సూర్యారావు స్మారక నాటకోత్సవాలు జాతీయస్థాయి నాటకపోటీలు ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్ మరియు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆర్థిక వనరులతో నిర్వహించడం.
12. 2021 - కీ.శే. దంటు సూర్యారావు స్మారక నాటకోత్సవాలు.
13. 2022 - అజో-విభొ-కందాళం ఫౌండేషన్ మరియు ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్ సంయుక్త నిర్వహణలో రెండవ పర్యాయం కథానాటికల పోటీలు - సాహిత్యసభలు నిర్వహించడం.

14. 2023 - కాకినాడ కల్చరల్ అసోసియేషన్, కాకినాడవారి జాతీయస్థాయి నాటికల పోటీలు నిర్వహించడం.
15. 2022 - ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్ ఆధ్వర్యాన సినీ గాయకులు నేమాని పార్థసారధి, శ్రీమతి ఎస్.పి. శైలజ గార్ల సంగీత విభావరి (కిన్నెర అర్ట్స్, హైద్రాబాద్) మరియు ఎన్ఎస్ఓడబ్ల్యూ ఆస్ట్రేలియా వారి 'సుధామ' డిజిటల్ ప్రదర్శనలు జరిగాయి. ఇవి దంటు సూర్యారావు స్మారక నాటకోత్సవాల్లో భాగంగా జరిగాయి.

తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన పిదప ఆ రాష్ట్ర కళాకారుల / సంస్థల ప్రోత్సాహంలో భాగంగా నాయకురాలు నాగమ్మ చారిత్రాత్మిక నాటకం ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్ ప్రదర్శింపజేసింది.

నాటక కళా అభివృద్ధి కొరకు నిర్వహించిన సెమినార్లు.

తెలుగు నాటక పోటీలు - గుణ నిర్ణయం - వక్తలు

1. పోలవరపు సూర్యప్రకాశరరావు, 2. కొడాలి ఆది శేషయ్య, 3. కొడాలి గోపాలరావు, 4. గుడిమెట్ల వెంకట సుబ్బారావు, 5. జి.యస్.ఆర్. మూర్తి, 6. శ్రీ జానకీ జాన్‌గార్లు పాల్గొని నాటక పోటీలలో గుణ నిర్ణయం విధానాలు జడ్జిమెంటు గురించి వివరించారు.

తెలుగునాటక దర్శకత్వం - ప్రదర్శన నటనారీతులు పై నాటక దర్శకులతో ఏర్పాటుచేయడం జరిగింది. ఇందులో పాల్గొన్న ప్రజ్ఞావంతులైన దర్శకులు-

1. కె. వెంకటేశ్వరరావు (డైరెక్టర్, ఆంధ్రా యూనివర్శిటీ) 2. అత్తిలి కృష్ణారావు (డైరెక్టర్, ఆంధ్రాయూనివర్శిటీ) 3. మలిరెడ్డి బాబి (పిఠాపురం) నాటకరంగ విశ్లేషకులు 4. శ్రీ కబీర్ దాస్ (విజయవాడ) ధియేటర్ ఆర్ట్స్

ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్, కాకినాడ ద్వారా గౌరవ పురస్కారాలు అందుకున్న ప్రతిభామూర్తులు

1. పృథ్వీరాజ్ కపూర్, 2. అంజలీదేవి, 3. ఆదినారాయణ రావు, 4. సత్యం, 5. రేలంగి వెంకట్రామయ్య, 6. ధూళిపాళ, 7. అక్కినేని నాగేశ్వరరావు, 8. భానుమతి రామకృష్ణ, 9. కె. విశ్వనాథ్, 10. దాసరి నారాయణరావు, శ్రీ జంధ్యాల, పి. సుశీల, సి.ఎస్. రావు, 14. ఎమ్.ఎస్. రెడ్డి, 15. కృష్ణవేణి, 16. కె. విజయలక్ష్మి, 17. బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి 18. జి. రత్నకుమారి, 19. బాదం సుబ్బలక్ష్మి, 20. గొల్లపూడి మారుతీరావు, 21. మొదలి నాగభూషణ శర్మ, 22. పతివాడ సూర్యనారాయణ, 23. ఆకెళ్ల వెంకట సూర్యనారాయణ, 24. మండలి బుద్ధప్రసాద్, 25. కె. శాంతారావు, 26. కెర్ల వెంకటేశ్వర రావు, 27. యస్.కె. మిశ్రో, 28. తుర్లపాటి కుటుంబరావు 29. యస్.టి. సాయి, 30. సి.యస్. రావు

కాకినాడ నగరంలోని కళాసంస్థలు, నాటక పరిషత్ సంస్థలు, శ్రీ పద్మనాభం స్మారక నాటక కళాపరిషత్, అల్లూరి సీతారామరాజు, స్మారక నాటక కళాపరిషత్, నవరస నాటక కళాపరిషత్, శ్రీమూర్తి కల్చరల్ అసోసియేషన్, ఉమా ఆర్ట్స్ శ్రీ సాయి కార్తిక్ వెల్ఫేర్ క్రియేషన్స్, సీతారామాంజనేయ నాట్యమండలి, కళావాణి సంస్థలు నిర్వహించే పరిషత్‌లకు, ప్రదర్శనలకు ది యంగ్‌మెన్స్ హేపీ క్లబ్ దంటు కళాక్షేత్రం థియేటరును ఉచితముగా యిచ్చి, వారి కళాసేవ లను ప్రోత్సహించడం జరిగింది. దంటు కళాక్షేత్రంలోని ది హాల్సిల్స్ హాలును నగరంలోని అన్ని ఔత్సాహిక సంస్థల వారికి కళాసాధన కోసం ఉచితంగా యివ్వడం జరుగుచున్నది. అలాగే సంగీత విభావరి సంగీత కళాకారులకు, సాహిత్యసభలకు ఉచితంగా యివ్వడం జరుగుచున్నది.

ది యంగ్‌మెన్స్ హేపీక్లబ్ స్థాపించిన నాటి నుండి మరియు తదితర సంస్థలతో కలిసి ప్రదర్శనలు ఏర్పాటు చేసినవి ప్రేక్షకులకు ఉచిత ప్రవేశముతో సరసజ్ఞతతో ఆలరించడం జరుగుతుంది. దంటు కళాక్షేత్రం ఎ.సి. ధియేటర్ నిర్మాణం జరిగిన తరువాత కూడా ప్రేక్షకులను అలరించడమే లక్ష్యంగా ఉచిత ప్రవేశాన్ని కొనసాగిస్తుంది.



దంటు భాస్కరరావు యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ ప్రస్తుత అధ్యక్షులు. క్లబ్ వ్యవస్థాపకులు దంటు సూర్యారావుగారి మనవడు. కాకినాడలో పుట్టి, పెరిగిన వీరు వారసత్వంగా వచ్చిన షిప్పింగ్ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. వీరికి కాకినాడతోపాటు మరో పదమూడు షిప్పింగ్ కేంద్రాలు ఉన్నాయి.

తెలుగు సినిమా సాంకేతిక వైభవం

శ్రీ అట్లూరి & జుపతి

ఉధృతిగా పారుతున్న నదిలో ఒక బాబుని చేతిలో ఎత్తుకొని వెళుతున్న మహిళ... రాయితో చేసిన భారీ శివలింగాన్ని భుజాలపై మోసిన ఆజానుబాహుడు.... ఎగసిపడుతోన్న జలపాతంలో ప్రేమ జంట యుగళగీతం, కళ్లు చెదిరే రాజభవనాలు, మహిస్మతి రాజ్యంలో జరిగే యుద్ధాలు, ఆకాశాన్ని అంటిన విగ్రహాన్ని కూల్చే హీరో, తాడిచెట్లను వంచి వాటిపైకి ఎక్కి కోటలోకి దూకే సైన్యం...

థియేటర్లో పై దృశ్యాలు చూసిన తెలుగు ప్రేక్షకుడి నుంచి వచ్చిన స్పందన ఒక్కటే- నోరు వెళ్లబెట్టడం.

వేలాదిమంది జనం, ఒక్క పోలీసు అధికారి... అంతమంది జనాన్ని ఒంటరిగా ఆపడం. ఆ సీన్లో కనిపిస్తున్న వేలాదిమంది జనం నిజంగా నటించారా గ్రాఫిక్స్‌లో సృష్టించారా తెలియనంతటి మాయాజాలం... సింహాలు, తోడేళ్లు రాగా హీరో ఒక వాహనం నుంచి దూకి బ్రిటిష్ సైన్యాన్ని తుదముట్టించిన సన్నివేశంలో లాజిక్ గురించి ప్రశ్న మదిలోకి రాకుండా చేసిన సన్నివేశ బలం, ఏది నిజమో, ఏది గ్రాఫిక్కో తెలియనంతగా అల్లుకుపోయిన వీరోచిత పోరాట దృశ్యం...

అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో సినిమా చూసిన దర్శక దిగ్గజం స్టీవెన్ స్పీల్‌బర్గ్ నుంచి చేసిన పని ఒక్కటే- దర్శకుడి ప్రతిభకి సలాం కొట్టడం.

స్మగ్లర్ అయిన హీరో వెంట పడుతున్న పోలీసులు... వారికి చిక్కకుండా తాను దొంగలించిన ఎర్రచందనం దుంగలను నదిలో వేసి వాటిని డ్యామ్‌గుండా సురక్షితంగా తన స్థావరానికి చేర్చే సన్నివేశం... డ్యామ్ గుండా దుంగలను ఎలా పంపించారు? అది నిజంగా తీసారా ? గ్రాఫిక్స్ అంత సహజంగా ఉంటాయా?

అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన పుష్పరాజ్ తెలివిని చూసి బీహార్, ఉత్తరప్రదేశ్‌లోని సాధారణ హిందీ ప్రేక్షకుడి నోటి నుంచి వచ్చిన మాట ఒక్కటే- వావ్ తెలుగు సినిమా.

హనుమంతుడు రూపం ఆకాశాన్నంటింది అనిపించేలా చూపించిన హనుమాన్ సినిమాని చూసిన మహారాష్ట్ర ప్రేక్షకుడి ఫిదా అవడం, మహాభారత గాథకి, సైన్స్ ఫిక్షన్‌కి లంకె పెట్టి హాలీవుడ్ తరహా గ్రాఫిక్స్‌తో మెస్మరైజ్ చేసిన కల్కి దర్శకుడి ఊహాశక్తి ఆలిండియా ఆడియన్స్ ఫిదా అవడం వెనుక విజయ రహస్యం తెలుగు సినిమా సాంకేతిక దర్పమే.

తెలుగు సినిమాల్లో కనిపిస్తోన్న సాంకేతికత, గ్రాఫిక్స్ మాయాజాలం ఒక్కసారిగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారితీసింది. ఆస్కార్ వేదికపై తెలుగు సినిమా వైభవకేతనం రెపరెపలాడింది. కానీ బాహుబలితోనే, రాజమౌళి రాకతోనే తెలుగు సినిమాకి సాంకేతిక వైభవం దక్కింది అనడం, అనుకోవడం పొరపాటు. రాజమౌళి తెలుగు సినిమాని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాడు అనడంలో సందేహంలేదు. ఆయన భారతీయ సినిమాల గ్రాఫిక్స్ వర్క్‌ని హాలీవుడ్ స్థాయికి తీసుకెళ్లాడు అని చెప్పడంలో కూడా ఎలాంటి మీమాంస అక్కర్లేదు. అయితే, ఈ టెక్నిక్ సత్తా టాకీల కాలం నుంచే పెరుగుతూ వచ్చింది అన్నది కూడా నిజమే.

ఆది నుంచి ఆర్భాటమే

ఈనాడే కాదు తెలుగు సినిమాకి మొదటినుంచి భారీతనాన్ని తలపించే హంగులు, సాంకేతిక పొంగులు బలంగా నిలిచాయి. తెలుగు సినిమా బుడి బుడి అడుగులు వేస్తున్న కాలం నుంచే

సాంకేతికంగా ఎదగడానికి, మిగతా భారతీయ చిత్రరంగాలకు భిన్నంగా ఉండేందుకు ప్రయత్నించింది. తొలినాళ్లలో తెలుగు సినిమాల కథలు పురాణాలు, ఇతిహాసాల చుట్టూ తిరిగాయి.

మరి పురాణగాథలను, జానపదకథలను రక్తికట్టించేలా అంటే కేవలం సంభాషణలు, పద్యాలు, పాటలు సరిపోవు అని మన తొలి నాటి దర్శక, రచయితలు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు గ్రహించి, చిన్న చిన్న ప్రయోగాలు టాకీల యుగం మొదలయినప్పటి నుంచే ప్రారంభించారు.

1934లో విడుదలైన చిత్తజల్లు పుల్లయ్య చిత్రం లవకుశలోనే యుద్ధ సన్నివేశాల్లో బాణాలు ఆకాశంలోకి వెళ్లడం వంటివి చూపించడంలో సాంకేతికత హంగులు చేర్చడం వంటివి మొదలు పెట్టారు. అవి చాలా బేసిక్ టెక్నిక్‌లే అనుకోండి. ఓ బెంగాలీ సినిమా కోసం ఉపయోగించిన రథాల్ని, సెట్టింగుల్ని సినిమాకి వాడారు. కానీ కెమెరాతో చిన్న ట్రిక్స్ చేశారు. ఈ సినిమా నుంచే తెలుగు చిత్రరంగంలో టెక్నిక్ ప్రయోగాలకు నాంది పడింది. ఆ తర్వాత వచ్చిన జానపద, పౌరాణిక చిత్రాలు పెద్దగా ప్రయోగాలు చెయ్యలేదు. బాలరాజు వంటి భారీ విజయం సాధించిన చిత్రాల్లో కూడా సాధారణ పద్ధతిలోనే కెమెరా వర్క్ కనిపిస్తుంది. జనం అంతా ఆశ్చర్యపోయిన మొదటి సాంకేతిక అబ్బురం- 1949లో విడుదలైన కీలుగుర్రం.

కాశీమజిలీ కథల ఆధారంగా తీసిన కీలుగుర్రం చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు నటించారు. మీర్జాపురం రాజాసాహెబ్ నిర్మించి, దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి డీఎల్ నారాయణ కెమెరా వర్క్ అందించారు. కథ ప్రకారం ఎగిరే కీలుగుర్రాన్ని చూపించాలి. ఇప్పటిలా గ్రాఫిక్స్ లేని ఆ కాలంలోనే డీఎల్ నారాయణ చేసిన ప్రయోగాలు ఆనాటి జనాలను అబ్బుర పరిచాయి. కీలుగుర్రం నిజంగా ఎగురుతున్నట్లు చూపించడంలో, లేదా భ్రమింపచేయడంలో కెమెరామెన్ విజయం సాధించారు. అయితే ఈ సినిమాలో ట్రిక్ ఫోటోగ్రఫీ మ్యాజిక్ చేసింది ఎం.ఏ. రెహమాన్. కెమెరామెన్ నారాయణకు రెహమాన్ సహాయం అందించారు. రహమాన్ అప్పటికే ట్రిక్ ఫోటోగ్రఫీ, స్పెషల్ ఎఫెక్ట్స్‌లో పేరు తెచ్చుకున్నారు. కీలుగుర్రం బొమ్మని కళాదర్శకుడు టి.వి.ఎస్. శర్మ రూపొందించగా రెహమాన్ ట్రిక్ ఫోటోగ్రఫీతో మాయ చేశారు. తెలుగు సినిమారంగానికి సంబంధించి ట్రిక్ ఫోటోగ్రఫీలో ఇది ముందడుగు.

మలుపు తిప్పిన మార్కస్ బార్ట్లే

అయితే సాధారణ ట్రిక్ ఫోటోగ్రఫీ స్థాయిని దాటి సినిమా గ్రామర్‌కి గ్లామర్‌ని జోడించిన వ్యక్తి, శక్తి మాత్రం మార్కస్ బార్ట్లే.

మహాదర్శకుడు కేవీ రెడ్డితో మార్కస్ అప్పటికే రెండు సినిమాలకు పని చేసినప్పటికీ తన కెమెరా పనితనాన్ని చూపింది మాత్రం పాతాళభైరవితోనే. ఎన్టీ రామారావు హీరోగా కేవీ రెడ్డి దర్శకత్వంలో విజయా బ్యానర్‌లో నాగిరెడ్డి-చక్రపాణి నిర్మించిన



ఈ జానపద చిత్రంలో బార్ట్లే సృజనాత్మకత కనిపించింది. ఈ సినిమాలోనే బార్ట్లే మొదటిసారిగా ట్రిక్ ఫోటోగ్రఫీని ఎక్కువగా వాడారు. చంద్రుడి నేపథ్యంలో చూపించిన సన్నివేశాల కోసం, తెరపై ఒక వృత్తం గీసి, దానిని చంద్రుడిలా కనిపించేలా వెలిగించారు. అలాంటి సన్నివేశాల్లోని అన్ని పాత్రల నీడలు చంద్రుడి నుండి దూరంగా ఉండేలా చూసుకున్నారు.

ఈ సినిమా కోసం భారీ సెట్లు వేశారు. విజయా సంస్థకు భారీ ఖర్చుతో కూడిన మొదటి చిత్రం. కథ పరంగా కోట సన్నివేశాలు, మాయల మరాఠీ సన్నివేశాలకు సెట్లు కీలకం. అందుకే బార్ట్లేతోపాటు ఎడిటర్లు, కళాదర్శకులు తమ ప్రతిభని చూపించారు. 'ప్రేమకోసమై వలలో పడనే...', 'కనుగొన గలనో...' వంటి పాటల్లో వైప్స్, జె కట్స్ వంటి టెక్నిక్స్ కనిపిస్తాయి. 1951లో విడుదలైన ఈ సినిమా ఘన విజయం సాధించింది. ఈ విజయమే తెలుగు సినిమాని మలుపు తిప్పిన మాయాబజార్ సినిమా ఆలోచనకు ప్రాణం పోసింది.

తెలుగు సినిమా తీవి

మాయాబజార్- తెలుగు సినిమా వైభవానికి ప్రతీక.

తెలుగు చిత్రసీమకన్నా ముందే హిందీలో, తమిళంలో భారీ సెట్స్‌తో దృశ్య ప్రధాన చిత్రాలు తీయాలనే పట్టుదల మొదలైంది.1948లో విడుదలైన తమిళ చిత్రం చంద్రలేఖ భారీతనానికి ఉదాహరణగా నిలిచింది. బాలీవుడ్‌లో రాజ్‌కపూర్, బిమల్‌రాయ్ వంటి వారు విజువల్‌గా అదిరిపోయే సినిమాలు తీసి కొత్త పంథాని సృష్టించారు. ఆ తరుణంలో కేవీ రెడ్డి, విజయా సంస్థ పౌరాణిక కథతో భారీతనం ఉట్టిపడే సినిమా తీయాలనుకొని శశిరేఖ పరిణయం కథను రాయించారు. తర్వాత అదే మాయాబజార్‌గా మారింది.

కేవీ రెడ్డి దర్శకత్వ కెరీర్‌లో అత్యున్నతంగా నిలిచింది మాయాబజార్ చిత్రం. ఆయన ఆలోచనలు, ఊహలకు అనుగుణంగా, స్క్రిప్ట్‌ని బట్టి సినిమా నిర్మాణం జరిగినా... ఆ సినిమా ఈనాటికి గొప్ప చిత్రంగా నిలవడంలో ప్రధాన పాత్ర వహించింది మాత్రం సాంకేతిక నిపుణులే, ముఖ్యంగా బార్‌ట్లే. ఈ సినిమాలో ఆయన చేసిన ప్రయోగాలు, ఎన్నో విన్యాసాలను అవలీలగా సృష్టించిన విధానాలు ఇప్పటికీ కొన్ని మిస్టరీగానే ఉండిపోయాయి.

భారతీయ సినిమాలో మొదటిసారిగా ఇండోర్ లైటింగ్‌తో వెన్నెలను తలపించేలా చేసిన మొదటి చిత్రం మాయాబజార్, మొదటి కెమెరామేన్ బార్‌ట్లే.

'లాహిరి లాహిరి లాహిరిలో...' పాటని అవుట్ డోర్‌లో తీసింది తక్కువ. స్టూడియోలోనే ఎక్కువగా తీశారు. తన లైటింగ్‌తో వెన్నెలని సృష్టించారు బార్‌టే. ఘటోత్కచుడి సన్నివేశాలు, 'వివాహ భోజనంబు...' పాటలో వాడిన ట్రిక్ ఫొటోగ్రఫీ కూడా అద్భుతమే. స్టాప్ మోషన్ అనే యానిమేషన్ టెక్నిక్‌ని మొదటిసారిగా దక్షిణ భారత సినిమా ఇండస్ట్రీలో వాడిన చిత్రం ఇదే. కేవలం లడ్డూలు మింగే షాట్‌లను తీసేందుకు నాలుగు రోజులు పట్టింది.

ఇక సెట్స్ గురించి ఎంత చెప్పినా తక్కువే. మాధవపెద్ది గోఖలే, కళాధర్ వేసిన సెట్లు మరో ప్రపంచంలోకి తీసుకెళ్లాయి. ఈ రోజు బాహుబలి, కేజీఎఫ్ చిత్రాల్లోని 'వరల్డ్ బిల్డింగ్' గురించి మనం గొప్పగా మాట్లాడుకుంటున్నాం. కానీ మాయాబజార్ సినిమా మొత్తం 'వరల్డ్ బిల్డింగే' కదా. 300 నుంచి 400 మంది సెట్ కళాకారులు పనిచేశారు వీటి కోసం. మినియేచర్ రూపాలతో ద్వారకని తలపించేలా చేశారు.

బార్‌ట్లే ఫోటోగ్రఫి, గోఖలే, కళాధర్ కళాదర్శకత్వ ప్రతిభలకు తోడుగా ఎడిటర్లు జంబులింగం, కళ్యాణసుందరం ఒక మేజిక్ సృష్టించారు. భారతదేశ సినిమా చరిత్రలో సాంకేతికంగా ఉన్నతంగా రూపొందిన మొదటి భారీచిత్రం ఇదే. ఈనాటి అవతార్, బాహుబలిని మించిన స్థాయి అప్పట్లో మాయాబజార్‌ది.

మాయాబజార్ తర్వాత భారీ పౌరాణిక చిత్రాలు తీయడం సులువైంది. భారీతనం సాధారణం అయిపోయింది.

భారతదేశ సినిమా చరిత్రలో కెమెరా పరంగా ఎన్నో ప్రయోగాలు (సినిమా స్కోప్ సహా) చేసిన కెమెరామెన్‌గా, లైటింగ్ విషయం లో కింగ్‌గా పేరొందిన కెమెరామెన్ వీకె మూర్తి. దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు పొందిన కెమెరామెన్ మూర్తి. అయితే, మూర్తికన్నా ముందే కెమెరాపరంగా గొప్ప ట్రిక్స్ చేసి చూపించిన ఘనత తెలుగు సినిమాకే దక్కుతుంది... బార్‌ట్లే కారణంగా. ఆ సినిమా విజయంతో తెలుగు సినిమా మొత్తంగా నిర్మాణ విలువలు పెంచుకొంది.

జానపదాలు, పౌరాణికాలు, సాంకేతిక ప్రయోగాలు

అయితే, బార్‌ట్లే ఆ తర్వాత ఒక్క జగదేకవీరుని కథలో తప్ప మిగతా తెలుగు సినిమాల్లో మళ్లీ మాయాబజార్ స్థాయి ప్రయోగాలు చెయ్యలేదు. ఎన్టీఆర్ హీరోగా కేవీ రెడ్డి తీసిన జానపద చిత్రంలో హీరో శిలగా మారే సన్నివేశం, శివశంకరీ పాటలో ఎన్టీఆర్ ఐదు రూపాల్లో కనిపించడం వంటివి ప్రముఖంగా చెప్పుకోవాలి. ఈ సినిమాకి ఒక తమిళ చిత్రం ఆధారం. ఆ సినిమాలోనూ హీరో ఐదుగురిగా కనిపించే పాట ఉంది. మాస్క్ షాట్ పద్ధతిలోనే బార్‌ట్లే తమిళంలో కన్నా తెలుగులో ఇంకా అద్భుతంగా తీశారు.

బార్‌ట్లే తర్వాత రెహమాన్, సెల్వరాజ్ (ఇద్దరు మిత్రులు), రవికాంత్ నగాయిచ్ తెలుగు సినిమారంగానికి సాంకేతిక ఉన్నతి అందించారు.

ట్రిక్ ఫొటోగ్రఫీ మహిమ అంటే ఎలా ఉంటుందో ప్రేక్షకులకు, తెలుగు సినిమా దర్శకులకు, ఆ మాటకొస్తే బాలీవుడ్‌కి రుచి చూపించిన కెమెరామెన్ రవికాంత్ నగాయిచ్. ఎన్టీఆర్ తీసిన సీతారామ కళ్యాణం (1961) చిత్రంతో ఆయన కెమెరామెన్‌గా మారారు. కానీ అంతకుముందే పలు హిందీ, తెలుగు సినిమాలకు 'స్పెషల్ ఎఫెక్ట్స్' వర్క్ చేశారు. మొదటి సినిమా సీతారామ కళ్యాణంతోనే అందరి దృష్టిలో పడ్డారు.

ఈ సినిమాలోని రావణుడు పేగులు తీసి రుద్రవీణ వాయించే సన్నివేశాల చిత్రీకరణ రవికాంత్ నగాయిచ్ ప్రతిభకు మచ్చుతునకలు. రావణానుగ్రహ సన్నివేశాన్ని చిత్రీకరించడంలోనే రవికాంత్ నగాయిచ్ గొప్ప ప్రతిభ గురించి తెలిసిపోయింది. రావణుడు పదితలలను చూపించేందుకు తొమ్మిది డమ్మీ తలలు చేసి చూపించొచ్చు. కానీ అందులో సహజత్వం ఉండదు. అందుకని ఎన్టీఆర్ విభిన్న ఎక్స్‌ప్రెషన్స్‌ని మాస్క్ షాట్లుగా తీసి ట్రిక్ ఫోటోగ్రఫీ టెక్నీక్‌తో చిత్రీకరించారు. ఆ పదితలలు రకరకాల భావాలను పలికించే విధంగా రావాలంటే నటుడు ఒకేచోట నిల్చోవాలి. ఇది తీయడానికి దాదాపు 10 గంటలు పట్టిందట. ఆ పదిగంటలు ఎన్టీఆర్ ఓపిగ్గా సెట్‌లోనే ఉన్నారు. అలాగే పదిగంటలపాటు తీసి ఆ ట్రిక్‌ని సాధించారు. ఇలాంటి ఎన్నో ప్రయోగాలు రవికాంత్ నగాయిచ్ చేశారు.

గులేబకావళి కథ, శ్రీకృష్ణార్జున యుద్ధం, శ్రీకృష్ణ పాండవీయం వంటి సినిమాల్లోనూ రవికాంత్ నగాయిచ్ తన పాటవాన్ని చూపించారు.

వీరాభిమన్యు చిత్రం రవికాంత్ నగాయిచ్ ప్రతిభకి మరో తార్కాణం. ఈ సినిమాలో ఎన్టీ రామారావు శ్రీకృష్ణుడిగా విశ్వరూపం ప్రదర్శించే సన్నివేశం అద్భుతమైన ట్రిక్ ఫొటోగ్రఫీకి ఉదాహరణగా నిలుస్తుంది. అలాగే ఈ సినిమాలో కనులవిందుగా ఉండే పాటలను కూడా ప్రత్యేకంగా ప్రస్తావించాలి. ముఖ్యంగా 'అదిగో నవలోకం...' అనే పాటని శోభన్‌బాబు, కాంచనపై చిత్రీకరించిన విధానం, ఫోటోగ్రఫీ, కళాదర్శకత్వం కలగలిసిన తీరు ఆ తర్వాత అనేక చిత్రాల పాటలకు స్ఫూర్తిగా నిలిచింది. కేవలం తెలుగులోనే కాదు తమిళంలో కూడా ఈ పద్ధతిని పాటించారు. వి. శాంతారాం చిత్రాల తరహాలో తీశారు ఈ పాటని.

ఆ తర్వాత నగాయిచ్ ఈ జానర్ నుంచి తప్పుకొని ఇండియాలో 'ఏజెంట్' చిత్రాల మేకింగ్‌ని పరిచయం చేశారు. కృష్ణ నటించిన *గూఢచారి 116* భారతదేశంలో మొదటి స్పై (గూఢచారి) చిత్రం. ఆ సినిమాకి మల్లికార్జునరావు దర్శకత్వం వహించారు. కానీ హాలీవుడ్ స్పై సినిమాల పద్ధతిని తన కెమెరా ద్వారా చిత్రీకరించి, తెలుగు సినిమా సాంకేతిక స్థాయిని పెంచారు. ఆ తర్వాత హిందీలో అదే చిత్రాన్ని ఆయన స్వీయ దర్శకత్వంలో ఫర్జ్ పేరుతో రీమేక్ చేశారు. హిందీ సినిమాకి 'స్పై' సినిమా జానర్ పరిచయం చేసిన ఘనత కూడా తెలుగు సినిమాకి దక్కింది.



బి. విఠలాచార్య

ఎన్టీఆర్ నటించిన పౌరాణిక చిత్రాల్లో మొదట చాలా ఉన్నత సాంకేతిక విలువలు కనిపించాయి. కానీ తర్వాత ఎన్టీఆర్ టెక్నిక్ కన్నా తన స్టార్‌డమ్‌ని, తన నటనను బలంగా నమ్మారు. అందుకే వాటిపై ఎక్కువ ఆధారపడలేదు. 1960లలో ఎక్కువ టెక్నాలజీని వాడిన దర్శకుడు మాత్రం విఠలాచార్య.

విఠలాచార్య రాకతో జానపద చిత్రాల పద్ధతి ఊపందుకొంది. *బందిపోటు, అగ్గిపిడుగు, మంగమ్మ శపథం* వంటి సినిమాలతో మాయలు, మంత్రాలు, గుర్రాల స్వారీ, కత్తి ఫైట్స్ వంటివి మొదలయ్యాయి. విఠలాచార్య మార్క్ మాయలు, మంత్రాలూ, రవికాంత్ నగాయిచ్ వంటి వారి ట్రిక్ ఫోటోగ్రఫీ కలిసి ఒకరకమైన కొత్త టెక్నిక్‌ని పరిచయం చేసింది. కన్నడవాడైన విఠలాచార్య మొదట కెరీర్‌ని కన్నడ సినిమాలోనే మొదలుపెట్టినా ఆయన బాగా పేరు తెచ్చుకున్నది, 'విఠలాచార్య మార్క్ సినిమా' అనే ముద్ర వేసుకున్నదీ తెలుగు సినిమాలతోనే. ఎన్టీఆర్‌తోనే కాదు కాంతారావుతో, అలాగే జయమాలినితోనూ *జగన్మోహిని* వంటి సినిమాలు తీసి 'మాయలు మంత్రాల'కు సంబంధించి, దెయ్యాల చిలిపి చేష్టలకు సంబంధించి ఒక టెక్నికల్ గ్రామర్ సృష్టించారు. అదే పద్ధతిని ఇప్పటికీ ఇండియన్ సినిమాలో అనేకమంది పాటిస్తున్నారు.

విఠలాచార్య అనగానే మంత్రాలు, తంత్రాల సినిమాలు తీసిన దర్శకుడు అనే భావన ఉంది కానీ విఠలాచార్య తెలుగు సినిమాకి ఆయన ఒక విధమైన కొత్త గ్రామర్‌ని, ట్రిక్ ఫోటోగ్రఫీకి క్రేజ్ తెచ్చిన దర్శకుడుగా పేరుపడ్డారు అన్న విషయాన్ని చాలామంది గుర్తించడం లేదు.

ఇక తెలుగు సినిమా సాంకేతికంగా అద్భుతంగా పురోగతి సాధించడంలో కీలకపాత్ర పోషించిన హీరో సూపర్‌స్టార్ కృష్ణ. ఎన్టీఆర్ ఛరిస్మా, గొప్ప నటన ముందు మిగతా విషయాలు దిగదుడుపు. ఇక ఏఎన్నార్ సాంఘిక చిత్రాల నటుడిగా మరో గొప్ప స్టార్‌గా ఉన్నారు. అలాంటి మహావృక్షాలు ముందు నిలదొక్కుకోవాలంటే కొత్త పంథాలో వెళ్లాలి అని భావించి కృష్ణ కొత్త జానర్ చిత్రాలను తెలుగువారికి పరిచయం చేశారు. మోసగాళ్లకు మోసగాడు సినిమాతో కౌబాయ్ చిత్రాలు, *గూఢచారి 116*తో స్పై థ్రిల్లర్ చిత్రాలను తీసుకొచ్చారు. దర్శకులు, కెమెరామెన్‌లు కూడా కృష్ణ సినిమాల విషయంలో ప్రయోగాలు చేశారు.

తెలుగులో మొదటి సినిమా స్కోప్ అల్లూరి సీతారామరాజు, మొదటి 70 ఎంఎం చిత్రం సింహాసనం కూడా కృష్ణ ఖాతాలోనే ఉన్నాయి.

కె ఎస్ ఆర్ దాస్, డూండి వంటి మేకర్స్, వీఎస్ఆర్ స్వామి వంటి కెమెరామేన్‌ల కారణంగా కృష్ణ సినిమాలు గ్రాండ్‌గా, రిచ్‌గా, టెక్నికల్‌గా స్ట్రాంగ్‌గా ఉండేవి. గుర్రం కాలుకి కెమెరా కట్టి ఛేజ్‌లు తీసింది వీఎస్ఆర్ స్వామి కృష్ణ సినిమాలతోనే, ట్రైన్ ఫైట్‌లు హాలీవుడ్ సినిమాల తరహాలో దక్షిణ భారత సినిమాలో తీసింది కూడా కృష్ణ చిత్రాల్లోనే. మోసగాళ్లకు మోసగాడు, అల్లూరి సీతారామరాజు, సింహాసనం వంటివి ఇండియన్ సినిమాలో కొత్త చరిత్రని లిఖించాయి. తెలుగు సినిమాని సాంకేతికంగా గొప్పగా నిలిపాయి.

అయితే, 1970, 1980 దశకాల్లో గొప్ప సాంకేతిక చిత్రాలు రాలేదు తెలుగులో. హిందీలో షోలే వంటి సినిమాలు రాలేదు. బాపు తీసిన సీతా కళ్యాణం కెమెరా వర్క్ పరంగా కాస్త చెప్పుకోదగ్గది ఆ సమయంలో. అలాగే అక్కినేని హీరోగా పూర్తిగా అవుట్ డోర్‌లో తీసిన అందాల రాముడు మరో ప్రయోగం.

వంశీ వంటి దర్శకులు సితార, అన్వేషణ వంటి సినిమాల్లో ఎడిటింగ్ పరంగా, షాట్‌లు తీసే విధానపరంగా కొత్తదనం చూపినా... సాంకేతికంగా గొప్ప మెరుపులు ఏమీ లేవు. 1980వ దశకం చివరలో మాత్రమే తెలుగు సినిమా టెక్నికల్‌గా మరో మలుపు తిరిగింది. 80లలో తెలుగు సినిమా ఇతర సినిమాలకు ఆదర్శంగా నిలిచింది ఫైట్స్ విషయంలో. ముఖ్యంగా చిరంజీవితో సినిమాటోగ్రాఫర్ లోకేసింగ్ చిత్రీకరించిన ఫైట్స్ ఆ తర్వాత చాలా తెలుగు, తమిళ చిత్రాలకు ఒక కొత్త ఒరవడిని సృష్టించాయి.

రామ్‌గోపాల్‌వర్మ శకం

రామ్‌గోపాల్‌వర్మ రాకతో తెలుగు సినిమా కొత్తశకం మొదలైంది. తెలుగు సినిమా సాంకేతికంగా కూడా మరింతగా ఎదిగింది. ముఖ్యంగా సౌండ్ డిజైన్, కెమెరా వర్క్ విషయాల్లో నూతనత్వం వచ్చింది. వర్మ కొత్త టెక్నాలజీని తీసుకురాలేదు. కానీ 1980, 90లలో పక్కా కమర్షియల్ చట్రంలో ఇరుక్కొని, మేకింగ్‌లో, టేకింగ్‌లో ఎటువంటి కొత్తదనం, భారీతనం లేకుండా సాగుతున్న తెలుగు సినిమాకి ఒక కుదుపు ఇచ్చి మొత్తం సినిమా తీసే విధానాన్ని

మార్చారు. వర్మ స్ఫూర్తితో వచ్చిన దర్శకులు, సాంకేతిక నిపుణుల వల్ల తెలుగు సినిమా చాలా మార్పులకు లోనైంది అనేది వాస్తవం.

స్టడీకామ్ షాట్‌లకు మనదేశంలో క్రేజ్ తీసుకొచ్చింది కూడా వర్మ చిత్రాలే. స్టడీకామ్ కెమెరాలు శివ చిత్రంకన్నా ముందే ఉన్నాయి. కానీ దాన్ని తొలిసారిగా వాడింది రామ్‌గోపాల్‌వర్మ. దీప్ పాల్ అనే స్టడీకామ్ ఆపరేటర్‌ని తీసుకొచ్చి శివ సినిమాలో ఛేజ్‌లు, ఫైట్స్‌లు తీశారు వర్మ. ఆ తర్వాత దాదాపు అన్ని సినిమాల్లో స్టడీ కామ్ షాట్‌లు కామన్ అయిపోయాయి. శేఖర్ కపూర్ బాండిట్ క్వీన్, మణిరత్నం దిల్ సే, బాంబే వంటి చిత్రాల్లో విరివిగా వాడారు.

వర్మ తీసిన శివ సినిమాతో సిక్స్ ట్రాక్ ఫోనిక్ రికార్డింగ్ సౌండ్‌తో సినిమాలు చెయ్యడం సాధారణం అయిపోయింది. ఆ తర్వాత కొన్నాళ్లకు డీటీఎస్ (మొదటి డీటీఎస్ తెలుగు చిత్రం తెలుగు వీర లేవరా), డాల్బీ మూవీ ట్రెండ్ వచ్చింది. మొదటి డాల్బీ సౌండ్ వాడిన భారతీయ చిత్రం కూడా తెలుగు చిత్రమే. కమల్‌హాసన్ హీరోగా రూపొందిన ద్రోహికి ఆ ఘనత దక్కింది.

శివ సినిమా తర్వాత మేకింగ్ పై ఎక్కువ దృష్టిపెట్టారు రాఘవేంద్రరావు, బి గోపాల్, కోడి రామకృష్ణ వంటి కమర్షియల్ చిత్రాల దర్శకులు. శివ స్ఫూర్తితోనే కోడిరామకృష్ణ శత్రువు సినిమా తీశారు.

గ్రాఫిక్స్‌కి బీజం

1990లో బి. గోపాల్ తీసిన బొబ్బిలిరాజా చిత్రంలో ఒక పాటలో యానిమేషన్‌ని జోడించారు. 'కన్యాకుమారి కనపడదా దారి...' అనే పాటలో వెంకటేష్, దివ్యభారతి యానిమేషన్‌తో చూపించిన జంతువులు, పక్షులను ఆశ్చర్యపడేలా చూపించారు. ఇది చాలా బేసిక్ యానిమేషన్. కానీ ఒక పాటలో యానిమేషన్ జోడించిన మొదటి తెలుగు సినిమా కూడా ఇదే కావడం విశేషం. తమిళంలో రజినీకాంత్ సినిమాలో మొదటిసారి వాడారు. ఆ స్ఫూర్తితో తెలుగులో కూడా తీసుకొచ్చారు. తెలుగు సినిమాలో గ్రాఫిక్స్, యానిమేషన్‌లకు అలా అడుగులు పడ్డాయి.

బాలకృష్ణ హీరోగా సింగీతం శ్రీనివాసరావు తీసిన రెండు చిత్రాలు... మనదేశంలో కొత్త ప్రయోగాలే. ఆదిత్య *369* భారతీయ సినిమాలో మొదటి సైన్స్ ఫిక్షన్ చిత్రం. దాదాపు మరో పాతికేళ్ల వరకు సైన్స్ ఫిక్షన్ చిత్రాలు రాలేదు. ఇక భైరవద్వీపం చిత్రంలో 2D యానిమేషన్ గ్రాఫిక్స్ వాడారు. ఒక విధంగా చెప్పాలంటే కంప్యూటర్ గ్రాఫిక్స్ వాడిన మొదటి తెలుగు సినిమా ఇదే.

అయితే వర్మ తీసుకొచ్చిన మార్పు కొన్నేళ్లు మాత్రమే కొనసాగింది. ఐదారు ఏళ్లకే మళ్లీ అందరూ పాతపద్ధతిలో రొడ్డ కొట్టుడు సినిమాలు తీయడం మొదలుపెట్టారు. ఆ సమయంలో మన తెలుగు దర్శకుల కన్నా తమిళ దర్శకులు టెక్నికల్‌గా గొప్పగా ఉండేలా సినిమాలు తీయడం ప్రారంభించారు. భారీతనంతో కూడిన నిర్మాణ విలువల కోసం వారు తపించారు. కుంజుమోహన్, ఏఎం రత్నం వంటి నిర్మాతలు, శంకర్ వంటి దర్శకులు తమిళ సినిమాని సాంకేతికంగా ఇండియాలోనే టాప్‌లో ఉండేలా చేశారు.



1995లో కోడిరామకృష్ణ దర్శకత్వంలో నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డి తీసిన అమ్మోరు విజువల్ ఎఫెక్ట్స్‌పై దృష్టి పెట్టింది.

అమ్మోరు విజయంతో శ్యాంప్రసాద్ రెడ్డి గ్రాఫిక్స్, విఎఫ్ఎక్స్ సినిమాలు తీయాలని బలంగా నమ్మారు. దానికోసం ఆయన చాలా కష్టపడ్డారు, ఏళ్లపాటు శ్రమించారు, కోట్లు ఖర్చుపెట్టారు. ఆయన స్ఫూర్తితో ఎం.ఎస్.రాజు దేవి, దేవిపుత్రుడు వంటి సినిమాల్లో గ్రాఫిక్స్ బాగా వాడారు. కానీ దేవిపుత్రుడు నిరాశ పరిచింది. చిరంజీవితో దర్శకుడు గుణశేఖర్ తీసిన మృగరాజు చిత్రంలో పులి సన్నివేశాల కోసం గ్రాఫిక్స్ వాడారు కానీ వాటి క్వాలిటీ ఘోరం. దాంతో గుణశేఖర్ వంటి దర్శకులు భారీ సెట్స్‌తో సినిమాలు తీసే ట్రెండ్‌కి తెరలేపారు. గ్రాఫిక్స్ బదులు సెట్స్‌తో రిచ్‌నెస్ తీసుకురావాలని ప్రయత్నించారు. అలా తీసింది... ఒక్కడు.

ఒక్కడు చిత్రంలో చార్మినార్ సెట్ దక్షిణాది చిత్రాల్లో కొత్త ఒరవడి సృష్టించింది. ఆ తర్వాత గుణశేఖర్ తన తదుపరి చిత్రం అర్జున్‌లో మధుర మీనాక్షి దేవాలయాన్ని సెట్ వేసి నిజమని తల పించేలా చేశారు. కానీ, ఇవేవీ తెలుగు సినిమాలు సాంకేతికంగా గొప్పగా ఉంటాయి అని ఇతర భాషా ప్రేక్షకులు అనుకునేలా చెయ్యలేదు.

ఇది రాజమౌళి యుగం

గ్రాఫిక్స్‌ని విరివిగా వాడడం మొదలుపెట్టిన తర్వాతే భారత దేశం మొత్తం తెలుగు సినిమావైపు చూపు వేసింది. ఇప్పుడు ప్రపంచమే ఇటు చూస్తోంది. దీనికి బీజం మాత్రం శ్యామ్‌ప్రసాద్ రెడ్డి ప్రయోగాలు, రాజమౌళి సాహసాలు కారణం. ఎంతో ఖర్చుతో, ఎంతో ప్రయాసతో అయన కోడి రామకృష్ణ డైరెక్షన్‌లో తీసిన అంజి



సినిమా దారుణ పరాజయం పాలైంది. చిరంజీవిని ఇండియానా జోన్స్ హీరో తరహాలో చూపించాలని శ్యామ్‌ప్రసాద్ రెడ్డి చేసిన ప్రయత్నం ఫలించలేదు. అనుకున్న విధంగా గ్రాఫిక్స్ రాలేదు. అయితే, ఆ సినిమా ఫెయిల్ అయినా ఆయన విజువల్ ఎఫెక్ట్స్ కోసం చేసిన ప్రయత్నం ఇతర దర్శకులకు స్ఫూర్తినిచ్చింది. దర్శకుడు శంకర్, శ్యామ్‌ప్రసాద్ రెడ్డిల విజన్ స్ఫూర్తితో రాజమౌళి తన సినిమాల్లో కూడా భారీగా విజువల్ ఎఫెక్ట్స్ ఉపయోగించడం మొదలుపెట్టారు. యమదొంగ సినిమాతో అనుకున్న క్వాలిటీ పొందలేదు కానీ మగధీరతో ఒక్కసారిగా కలకలం సృష్టించారు.

మగధీర విజువల్స్ అందరినీ ఆశ్చర్యపరిచాయి. ఆ సినిమా విజయంతో రాజమౌళి ఈగ, శ్యామ్‌ప్రసాద్ రెడ్డి అరుంధతి మొదలుపెట్టారు. ఇద్దరూ విజువల్స్ విషయంలో అదరగొట్టారు. ఈగ సినిమా మన దేశంలోనే మొదటి క్రీచర్ మూవీ అనుకోవచ్చు. ఒక క్రిమిని గ్రాఫిక్స్‌లో తీసి సినిమా అంతా వాడిన మొదటి చిత్రం. ఇక అరుంధతి సినిమా హారర్ థ్రిల్లర్స్‌ని కొత్త పుంతలు తొక్కించింది. అన్ని భాషల్లో ఇలాంటి సినిమాలు వచ్చేలా చేసింది

ఈగ రాజమౌళిని గ్రాఫిక్స్ విషయాల్లో 'మకుటం'లేని రాజుగా నిలిపితే... బాహుబలి చిత్రం దేశమంతా నివ్వెరపోయేలా చేసింది. భారతీయ సినిమారంగంలోనే సాంకేతికంగా చాలా అడ్వాన్స్‌గా రూపొందిన చిత్రం బాహుబలి. ఈ సినిమాలోని విజువల్ ఎఫెక్ట్స్ హాలీవుడ్ చిత్రాలకు సరిసమానంగా ఉంటాయి బాహుబలి సినిమాతో రాజమౌళి దేశాన్ని జయిస్తే, ఆర్ ఆర్ ఆర్ చిత్రంతో గ్లోబల్ మార్కెట్‌ని కైవసం చేసుకున్నారు. బాహుబలి తర్వాత దేశం మొత్తంగా సినిమా మేకింగ్ క్వాలిటీ, బడ్జెట్లు అన్నీ మారిపోయాయి.

బాలీవుడ్‌లో బ్రహ్మాస్త్రలు, కన్నడసీమలో కేజీఎఫ్‌లు, కాంతారాలు, కోలీవుడ్‌లో పొన్నియన్ సెల్వన్‌లు వచ్చాయి అంటే అదంతా బాహుబలి మహిమ.

భవిష్యత్ మనదే!

తెలుగు సినిమాలో ప్రయోగాలు, సాంకేతిక అద్భుతాలు ఏళ్ల తరబడి జరుగుతున్నా మనకి రావాల్సినంత గుర్తింపు పదేళ్ల క్రితం వరకు రాలేదు. మొదట్లో బాలీవుడ్ చిత్రాలు డామినేట్ చేసేవి. ఆ తర్వాత బెంగాలీ చిత్రాలు, కొన్నాళ్లు మలయాళ చిత్రాలు, మరికొన్నాళ్లు తమిళ చిత్రాలు. రాజమౌళి తెలుగు సినిమాని మలుపు తిప్పడం, ఆ తర్వాత వచ్చిన దర్శకులు తెలుగు సినిమాని మరింత ముందుకు తీసుకుపోవడంతో ఇప్పుడు మన చిత్రసీమ దేశంలో నెంబర్ వన్‌గా ఎదిగింది. ప్రపంచ చిత్ర సీమలకు చెందిన చిత్రపటంలో మన తెలుగు సినిమాకు ప్రముఖ స్థానం దక్కిందిప్పుడు.

అయితే, రాబోయే కాలంలోనూ మనదే పైచేయిగా ఉంటుందా? ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ హవా నడుస్తోంది. రానున్న రోజుల్లో గ్రాఫిక్స్, విజువల్స్, కథనం చెప్పే విధానం... అన్నిట్లోనూ ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఉంటుందనటంలో సందేహం లేదు. ఈ కొత్త సాంకేతికతను అంది పుచ్చుకొని మన తెలుగు ఫిలిం మేకర్స్ మరింతగా ముందుకెళ్తారా లేదా అనేది చూడాలి.

అలా అందిపుచ్చుకుంటూనే ఇప్పుడున్న ఆధిపత్యం తెలుగు సినిమాకి కొనసాగుతుంది. మన మార్కెట్ మరింత పెరుగుతుంది. రాబోయే కాలంలోనూ కొత్త తరం దర్శకులు, నిర్మాతలు రాజమౌళి వేసిన మార్గాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఆశిద్దాం.



శ్రీ అట్లూరికి సినిమాలు, ఫొటోగ్రఫీ పట్ల మక్కువ. జలపతితో కలిసి తెలుగుసినిమా డాట్‌కామ్ నిర్వహిస్తున్నారు. అమెరికాలో నిర్మితమయ్యే అనేక తెలుగు సినిమాలకు పి.ఆర్.గా పనిచేశాడు. తానాపత్రికలో సినిమా కాలమ్ నిర్వహిస్తారు. పిట్స్‌బర్గ్, పెన్సిల్వేనియాలో నివాసం.

తెలుగు ఫిల్మ్ జర్నలిజంలో పాతికేళ్ల అనుభవం ఉన్న సినీవిమర్శకుడు జలపతి. ఈనాడు టెలివిజన్‌తో కెరియర్ ప్రారంభమైన జలపతి ప్రస్థానం వివిధ ఛానెళ్ల మీదుగా తెలుగు సినిమాడాట్‌కామ్ దగ్గర స్థిరపడింది. పూనా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఫిల్మ్ అప్రిసియేషన్ కోర్సు చేశారు. నివాసం హైదరాబాదు.



తెలుగెందుకు?

సింహాద్రి కిరణ్

అవిభాజ్య ఆంధ్రదేశంలో పుట్టి, పెరిగి జీవనభృతి కోసం టెక్నాలజీ రంగంలో ఉద్యోగం చేస్తూ తమిళనాడు, మహారాష్ట్రల మీదుగా అమెరికా వలస వచ్చి, గత 25 సంవత్సరాలుగా ప్రవాసాంధ్రుడిగా జీవిస్తూ, అందులో రమారమి చివరి 16 సంవత్సరాలు సిలికానాంధ్ర మనబడిలో తెలుగు ఉపాధ్యాయుడిగా ఒక వ్యాపకం చేపట్టినా, తెలుగుభాష మీద ప్రేమ తీరక మొన్నీమధ్యనే తెలుగులో స్నాతకోత్తర పట్టా (MA) విద్యనభ్యసించి, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో తెలుగు ఉపన్యాసకుడిగా కూడా పని చేస్తున్న నాకు, అతి తరచుగా ఎదురయ్యే ప్రశ్న, ముఖ్యంగా ఇంకా నలభయ్యవపడిలోకి రాని తెలుగువారినించి వచ్చే ప్రశ్న: తెలుగెందుకు?

అనంతపురం నించి అనకాపల్లి వరకు, ఆలంపూర్ నించి ఆదిలాబాదు వరకు సంప్రదాయ పెళ్లిళ్లలో కూడా పప్పన్నం, పులిహోర స్థానాన్ని బిర్యానీ కబళించేసినా, ఎండాకాలంలో మామిడి పండు తినకుండా ఉండలేని తెలుగుదనం మాత్రం వదులుకోలేదు. వేలకొద్దీ రూపాయలు ఖర్చు పెట్టైనాసరే, ఒక్క మామిడిపండే కాదు, ఆవకాయలు, గోంగూర పచ్చళ్లు కూడా అమెరికా, ఆస్ట్రేలియాలతో పాటు ప్రపంచంలో ఎక్కడున్నా తెప్పించుకు తినేస్తారే తెలుగువారు, ఎందుకని? పోనీ ఏదోలే అలవాటైన ప్రాణం, రుచి మరిగిన నాలుక అని సరిపెట్టుకుందామనుకున్నా, విదేశంలోనే పుట్టి విదేశంలోనే పెరుగుతున్న రేపటితరం వారికి పిజ్జా, బర్గర్లతో పాటూ, ఆవకాయ అన్నం కూడా అలవాటు చెయ్యడం దేనికి? ఇంతింత కారాలున్న ఈ ఊరగాయలు, కారప్పొడ్లు చారెడు నెయ్యి వేసి మరీ పిల్లలకు ప్రేమగా తినిపించి అలవాటు చేయిస్తారు. మరి సంప్రదాయ పదార్థాలను అంత ప్రేమతో అలవాటు చేస్తున్నవారికి మరి మన సంప్రదాయ భాషను కూడా అంతే మమకారంతో నేర్వడం, నేర్పించడం ముఖ్యం కాదా?

ఒకప్పుడు ఏ కుటుంబంలోనైనా ఒక బాబో, పాపో పుడితే నూటికి తొంభై శాతం, మరీ ముఖ్యంగా వాళ్ల కుటుంబంలో మొదటి సంతానమైతే వాళ్ల వంశంలోని పెద్దవాళ్ల పేరు పెట్టుకునే ఆచారం కాలక్రమంలో పాతచింతకాయ పచ్చడై నెమ్మదిగా కనుమరుగై పోయింది. అర్థం, పర్థం లేకపోయినా తెల్లవాళ్లైనా తేలికగా పలక గలిగితే చాలు అని పొట్టిగా, నాజూగ్గా ఉండే రెండక్షరాల పేర్లు పెట్టుకునే కాలం వచ్చేసింది. కానీ గ్రహగతులు, ముహూర్తాల పట్ల ఇప్పటికీ విధేయత సడలకపోగా, విధిరాతను కూడా తామే మార్చే ప్రయత్నం చేస్తూ ప్రకృతి సహజంగా పుట్టేవరకు ఎదురు చూడకుండా, ఆ పుట్టబోయే బిడ్డ గ్రహగతులను కూడా నిర్ణయించే అధికారం తమదిగా భావించి, ముహూర్తము నిర్ణయించుకుని మరీ కాన్పుకి ఏర్పాట్లు చేసుకునేవారికి, తమ ఉనికికి, సాంస్కృతిక అభ్యున్నతికి కారకభూతమైన భాషని, ఆ బలాల్ని తరువాతి తరానికి అందించే ప్రయత్నం చెయ్యడం కర్తవ్యం కాదా?

వ్యవసాయాధారిత వాణిజ్యంతో ఒప్పారిన భారత భూభాగంలో తెలుగు రాష్ట్రాల్లో రైతులు పొద్దున్నే చద్దిమూట విప్పుకు తినే సంప్రదాయాన్ని, కాలక్రమేణా వచ్చిన నాగరికత అపహాస్యం చేస్తూ బ్రెడ్డులు, జాములు, సీరియల్స్‌ని గొప్ప ఉపాహారాలంటూ మనమీదకి ఎగదొస్తే, కొత్తొక వింతంటూ అందిపుచ్చుకున్న తెలుగు వారు, మళ్లీ అదే పాశ్చాత్య దేశాల శాస్త్రవేత్తలు కొన్ని దశాబ్దాల పాటు పరిశోధనలు చేసి మరీ, 'బామ్మ మాట, చద్ది మూట' వీటిని

మించిన ఆరోగ్యం లేదనగానే, కప్పుడు పెరుగుని, 'ప్రో బయోటిక్' అంటూ వేలంవెర్రిగా మాల్స్‌కి వెళ్లి మరీ కొనుక్కు తింటున్నారే? మరి అదే పాశ్చాత్యదేశాల శాస్త్రవేత్తలు పరిశోధనలు చేసి మరీ నిరూపణలు చూపిస్తున్నా, ప్రాథమికవిద్యను మాతృభాషలో నేర్పించడానికి తెలుగువారికి మనసొప్పడం లేదెందుకనో? కనీసం రాత్రి ఆ పిల్లల్ని పడుకోపెట్టేటప్పుడైనా తెలుగులో జోలపాట పాడదామనే ఇంగితజ్ఞానం ఉండాలనుకోవడం అత్యాశ కాదు కదా?

పిల్లలకు ఎనిమిదేళ్లు నిండాక సమాజహితాన్ని కోరుతూ, బాధ్యత గల వ్యక్తిగా నడుచుకునేట్టుగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసుకున్న గురుకుల వ్యవస్థ నించి, పట్టుమని నాలుగేళ్లయినా నిండని పిల్లలను రాబోయే రోజుల్లో కార్యాలయాలకు బానిసలుగా బతకడానికి కావాల్సిన అర్హతల కోసం, వారి ఉజ్వల భవిష్యత్ కోసమేనంటూ లక్షల ఫీజులు జమకట్టి మరీ కాన్వెంట్ స్కూళ్లకు పంపే తెలుగువారు, వారు ఈ పోటీ ప్రపంచంలో ఎదురయ్యే అపజయాలను, అవమానాలను తట్టుకుని నిలబడి ధైర్యంగా బ్రతకగలిగే స్థైర్యాన్ని కూడా నేర్పాలని గుర్తించరెందుకనో? తాతయ్య పక్కన కూచోబెట్టుకుని చెప్పే శతక పద్యాలు, అమ్మమ్మ, నాయనమ్మలు చెప్పే నీతికథల విలువని, వాటివల్ల పిల్లలలో పెంపొందే వ్యక్తిత్వానికి ఖరీదు కట్టలేమని గుర్తించడం, ఆ వారసత్వ సంపదని కొనసాగించాల్సిన జవాబుదారీతనం తమది కాదా?

సరే, ఇలా చెప్పుకుంటూ పోతే, ఒక పుస్తకమే రాయచ్చు. అందుకని 'తెలుగెందుకు' అనే ప్రశ్నకి వాళ్లకీ, వీళ్లకీ చెప్పే సమాధానాలని పక్కనపెట్టి అల వైకుంఠపురం సినిమాలో త్రివిక్రమ్ చెప్పినట్టుగా, "హే, ఆడూ యీడూ వద్దబ్బా, మన ముచ్చటే చెప్పుకుందాం"లాగా, కడుపులో చల్ల కదలకుండా చక్కగా టెక్నాలజీ ఉద్యోగం చేసుకుంటూ బతికేస్తూ, మళ్లీ ఈ తెలుగులో MA ఎందుకు? స్టాన్‌ఫోర్డ్‌లో అధ్యాపకుడిగా అదనపు బరువు లెందుకు అనే ప్రశ్నలకు నా సమాధానాలు చెప్తాను.

నా వేలు పట్టుకుని బియ్యంలో 'ఓం నమః శివాయః సిద్ధం నమః' అని రాయిస్తూ, నాతో చెప్పిస్తూ ఎవరు అక్షరాభ్యాసం చేశారో గుర్తులేదు కానీ, కాస్త ఊహతెలిసిన వయసులో తరగతిలో రాగయుక్తంగా మా తెలుగుమాష్టారు పాడిన పోతనగారి పద్యం, 'కాటుక కంటినీరు చనుకట్టు పయింబడ' వింటూ, దాని గురించి ఆయన వివరణ చెప్తుంటే కళ్లలో ఒక సన్నని కన్నీటిజీర కారడం మాత్రం ఇప్పటికీ నాకు గుర్తుంది. అలానే దాశరథీ శతకంనించి, 'భండన భీముడార్తజన బాంధవుడు' పద్యాన్ని చెప్తూ "భేరికా ఢాండ డఢాండ ఢాండ నినదంబులజాండము" పాదం చదివినప్పుడు ఒక్క ముక్క అర్థం కాకపోయినా రోమాలు నిక్కపొడుచుకోవడం, ఒకరకమైన ఆవేశం కలగడం గుర్తుంది. అలా తేలిక పదాల వేమన, సుమతీ శతక పద్యాలైనా, అనేకానేక శబ్దార్థ అలంకారాలతో వినగానే ఆకట్టుకునే పోతనగారి భాగవత పద్యాలయినా బాగా బట్టీ పట్టేయడం, అందరూ మెచ్చుకుంటుంటే గర్వ పడిపోవడం బహుశా తెలుగుభాషపై నేను మక్కువ పెంచుకోవడానికి కారణాలను కుంటా.

అలా ప్రాథమిక పాఠశాల వయస్సునించి, ఇంచుమించుగా ఇంటర్మీడియట్ కాలేజీ రోజులవరకు మేము ఉండే కాలనీలో ఆంధ్రప్రభనించి ఈనాడు వరకు రోజువారీ వార్తాపత్రికలు, ఆంధ్రజ్యోతినించి స్వాతి వరకు వార పత్రికలు, విపుల నించి చతుర వరకు మాస పత్రికలు, చందమామ నించి బాలజ్యోతి వరకు పిల్లల మాసపత్రికలు, మధుబాబు నించి యండమూరి వరకు, యద్దనపూడి నించి మాలతీ చందూర్ వరకు రకరకాల నవలలు ఒకరింటి నించి మరొకరింటికి జరిగే కుండమార్పిడి ఏర్పాట్లలో నాకు తెలీకుండానే నాకు తెలుగుభాషలో ప్రవేశం, అభినివేశం కలిగితే కుటుంబ వారసత్వంగా వచ్చిన వాక్సుద్ధి, మా అక్క స్పెషల్ తెలుగులో చేసిన డిగ్రీ మరి తెలుగు ఎం.ఏ.ల వల్ల గురజాడ నించి వీరేశలింగం వరకు, చలం నించి శ్రీశ్రీ వరకు, కృష్ణశాస్త్రి నించి కాళోజీ వరకు, గిడుగు నించి బుడుగు వరకు తెలుగు సాహిత్యంలో ప్రముఖులు, కనీసం వారి రచనల పేర్లు అయినా తెలుసుకునే అవకాశం, సాహిత్యం పట్ల ఆసక్తి, అనురక్తి పెరిగాయి.

మీరు అతిశయోక్తి అనుకున్నా ఇక్కడ ఒక నిజం చెప్పక తప్పదు. అప్పట్లో శ్రీశ్రీ కవిత్వపు భావజాలంలో తీవ్రంగా మమేకమై పోయిన నేను గణితంలో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసుకుని, భారత దేశంలో టెక్నాలజీ రంగంలో ఉద్యోగం చేస్తూ, అమెరికా వెళ్లడానికి అవకాశం వచ్చినప్పుడు, అప్పటి మద్రాసులో వీసాకోసం మౌంట్ రోడ్‌లో ఉన్న కాన్సులేట్ ఆఫీసు ముందు, ముందురోజు రాత్రి నించి బారులు తీరి నిలుచున్న జనాలని చూస్తూ, బాటసారి కవిత లోని 'కూటికోసం, కూలికోసం' వాక్యాలను గుర్తు చేసుకుంటూ ఏసేమిరా అని తిరస్కరించిన రోజులు ఉన్నాయి. ఇదేదో నా గొప్ప కోసం చెప్పడం కాదు, ఒక వ్యక్తి మీద ముఖ్యంగా యుక్తవయస్సులో, సాహిత్యం యొక్క ప్రభావం ఎంతగా ఉంటుందో చెప్పడానికి ఒక ప్రయత్నం.

సరే, కాలచక్రంలో ఒక దశాబ్దం పైగా తిరిగిపోగా, ముద్దు ముద్దుగా మాటలు చెప్పే వయసొచ్చిన కూతుళ్లతో జీవితం అందంగా, ఆనందంగా జరుగుతుండగా, నాకు తెలీకుండానే నాలో ఒక రకమైన అంతర్మథనం మొదలైంది. గతమెంతో ఘనచరిత్ర కలిగిన నా భాషా వారసత్వం నాతోనే ఆఖరా? మనం వంశపారంపర్యంగా వద్దనుకున్నా వంకరముక్కులు, బట్టతలలు, బీపీలు, మధుమేహాలు, ఆఖరికి కాన్సర్లు కూడా రేపటితరానికి ఇచ్చేస్తున్నామే, కనీసం తెలుగులో అక్షరమాలతోపాటు, ఓ నాలుగు శతకపద్యాలు, మరో నాలుగు భాగవత పద్యాలు అయినా పిల్లలకు నేర్పకపోతే ఎలా అన్న ఆవేదన మొదలై, తొలుత సొంతగా, ఆ తరువాత సిలికానాంధ్ర మనబడిలో భాషా సైనికుడిగా నా ఈ తెలుగు మాష్టారి పాత్రకు తెరలేపింది. ఈ పదహారేళ్ల ప్రయాణంలో ఎన్నో మధురానుభూతులు, సంస్థాగతంగా లక్షకు పైగా పిల్లలకు అక్షరాభ్యాసం

చేస్తే, వ్యక్తిగతంగా కొన్ని వందలమందికి చేసుంటాను. ప్రతీ అందమైన గులాబీ కింద ఒకటి, రెండు ముళ్లున్నట్టే అక్కడక్కడా కొన్ని చేదు అనుభవాలున్నా అవి నాకెన్నడూ పట్టలేదు, నా ప్రయాణానికి అడ్డంకి కాలేదు.

ప్రపంచంలో ప్రతీ వ్యక్తినీ ఏదో ఒక రూపంలో స్పృశించిన మహమ్మారి, కోవిడ్. ఆ ఉపద్రవం చాలావరకు వ్యక్తులకు, కుటుంబాలకు చేటు చేసినా, ప్రపంచానికి కొద్దోగొప్పో, మేలు కూడా చెయ్యకపోలేదు. ఇంచుమించుగా ప్రతి వ్యక్తినీ, వారి అస్తిత్వాన్ని గురించి తీవ్రంగా ఆలోచించేలా చేసి, జీవితం శాశ్వతం కాదనీ, బొందిలో ప్రాణం ఉండగానే కేవలం జీవన భృతికోసమే కాకుండా జీవితాన్ని నిజంగా జీవించే ప్రయత్నం చెయ్యాలనే భావజాలం కాస్త ప్రబలడానికి సహకరించింది. బయట ఆఫీసు, ఇంట్లో సోఫా తప్ప మరో విషయం తెలియనివారు ప్రపంచాన్ని చుట్టివచ్చే యాత్రికులైతే, భోజనం చేశాక ఇంట్లోనే కనీసం పదడుగులైనా నడవని వారు మారథాన్ రన్నర్ లయ్యారు. ఆ కోవలోనే నేను ఎం.ఎ. తెలుగు విద్యార్థినయ్యాను.

తెలుగుభాషలో, సాహిత్యంలో తమకంటూ ఒక గుర్తింపుని పొందిన వారినించి, ఈ కాలంలో కూడా కేవలం ఉద్యోగం కోసం కాకుండా భాషమీద మక్కువతో, ఏదో సాధించాలన్న తపనతో మొన్నీమధ్యనే Ph.D. పట్టాలు పొందిన యువశక్తి మేళవింపుతో ఆచార్య చుండూరి మృణాళిని సిలికానాంధ్ర విశ్వవిద్యాలయం (ఇప్పుడు ఆర్య యూనివర్సిటీ) తెలుగు విభాగ అధినేత్రిగా ఏర్పాటు చేసిన అధ్యాపక బృందంతో, ఇంటి గడప దాటకుండా, కంప్యూటర్ తెరముందు కూర్చుని, పురాతనకాలం నించి రాబోయే AI యుగం వరకు తెలుగు భాషా, వ్యాకరణ, సాహిత్యాల పరిణామక్రమాలపై అవగాహన పెంపొందించుకోవడానికి వెచ్చించిన రెండున్నరేళ్ల కాలం ఒక గొప్ప అనుభవాన్నిచ్చింది. చాలావరకు యాంత్రికంగా జరిగే మన జీవితాల రోజువారీ పరుగుపందాల నించి ఇది నిజంగా ఒక చక్కటి ఆటవిడుపు. దానికి తోడు, వయసు 70 దాటినా మనసు, ఆలోచన, ఉత్సాహం 20లు దాటనీయకుండా, అటు టెక్నాలజీని, ఇటు సాహిత్యాన్ని సమపాళ్లలో సమన్వయిస్తూ జీవిస్తూ, ఎందరికో మార్గదర్శిగా ఉంటూ వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికాని నడిపిస్తున్న వంగూరి చిట్టెన్ రాజుగారు సహాధ్యాయి అయితే, ఆ అనుభూతే వేరు. నాతోపాటు మరో పదిహేను మంది భాషా ప్రేమికులకు దొరికిన అరుదైన భాగ్యం అది.

అయితే ఇక్కడో విషయం తప్పక చెప్పాలి. ఈ ఎం.ఏ. చదువు మమ్మల్ని అందలాల్నెక్కిస్తుందన్న అపోహలో ఎవ్వరమూ లేము. భాషా ప్రేమికులుగా, 2000 సంవత్సరాల వయసున్న ఒక ప్రాచీన భాషావారసత్వానికి ప్రతినిధులుగా, ఆ వారసత్వానికి అర్హులుగా ఉండడానికి ఏదైనా చేయాలన్న తపనతో ఈ చదువు పూర్తిచేశాం. అంతే. కనీసం మాలో కొందరమైనా, ఇంకా ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని Ph.D. లు, మరియు AI రంగానికి కావలిసిన LLM తయారీలకు తగ్గట్టుగా కార్యాచరణ చేయాలని ప్రయత్నాలు చేస్తున్నాం. అయితే, నేనెప్పుడూ ఊహించని ఒక విచిత్రం ఇక్కడ జరిగింది. ఇటు కుమార్లు, అటు స్విమ్మింగులు, మరోపక్క నాట్యం, కుదిరితే అదనంగా సంగీతం అంటూ మన పిల్లల్ని ఐదేళ్ల వయసునించే రాబోయే రోజుల్లో వారికి మంచి భవిష్యత్తుకి కావాల్సిన అన్ని అర్హతలు ఉండాలంటూ ఎన్నెన్నో నేర్పిస్తున్న తల్లితండ్రులున్న ఈ కాలంలో, ఆ జాబితాలో తెలుగు భాష కూడా ఒకటవ్వాలని తాపత్రయపడే మాలాంటి భాషా సైనికులకు ఆ తల్లితండ్రులనించే ఎదురయ్యే ఒక మాట, 'ఇక్కడే పుట్టి, ఇక్కడే స్థిరపడే మా పిల్లలకు తెలుగువల్ల ఏమిటి ప్రయోజనం?' నేను ముందే చెప్పిన చాలా సమాధానాలు వారికి అంతగా రుచించవు. కానీ, అలా తెలుగుకు దూరంగా పెరిగిన ఆ తెలుగు పిల్లలే యూనివర్సిటీ స్థాయికి వచ్చేసరికి, మిగతా దేశాల విద్యార్థుల మధ్యలో తామెవరు, తమ భాషా, సాంస్కృతిక వారసత్వమేమిటని తమని తాము ప్రశ్నించుకొని, సమాధానాలు తెలియక, ఆ అన్వేషణ మొదలుపెడుతున్నారు. అదుగో సరిగ్గా అలా సమాధానాలను వెదకడం మొదలుపెట్టిన కొందరు విద్యార్థుల పట్టుదలతో, విశ్వవిద్యాలయ అధికారులకు వాళ్లు చేసిన అర్జీలతో, ఎందరినో కూడ తీసుకుని కొన్ని వందల సంతాకాల సేకరణతో 2024-25 విద్యా సంవత్సరానికిగాను, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం పిల్లలు నేర్చుకోవడానికి వారి లాంగ్వేజ్ సెంటర్ వారు అంగీకరించే ప్రపంచభాషల జాబితాలోకి తెలుగు కూడా వచ్చి చేరింది.

అయితే సెప్టెంబరులో తరగతులు ప్రారంభించాలంటే, ఆగస్టు వరకు ఇంకా ఉద్యోగానికి కావాల్సిన అర్హతల జాబితానే తయారుకాలేదు, ఉద్యోగానికి దరఖాస్తులు కోరుతూ ప్రకటన కూడా జారీ కాలేదు. ఎట్టకేలకు ప్రకటన వచ్చింది, అదీ ఎలాగంటే పాఠాలు చెప్పాల్సిన వ్యక్తికి తెలుగులో కనీసం ఎం.ఏ. డిగ్రీ అయినా ఉండి, అధ్యాపకులుగా కొంతైనా పూర్వ అనుభవం కలిగి, విశ్వవిద్యాలయానికి వచ్చి, అక్కడి తరగతి గదిలో స్వయంగా చెప్పగలిగి, పనిచేయడానికి వీసా అవసరం లేకుండా, అమెరికా గ్రీన్ కార్డ్ లేదా పౌరసత్వమో ఉన్నవాళ్లు కావాలని. అయినా ఇది పూర్తి నిడివితో, కుటుంబ పోషణకు సరిపోయేంత జీతం వచ్చే ఉద్యోగమూ కాదు. అదీకాక ఇదేమీ విస్తృతంగా ప్రచారం జరిగే ఉద్యోగ ప్రకటనా కాదు. మరి అంత తొందరలో ఆ తెలుగును బోధించడానికి అధ్యాపకులు ఎక్కడనించి వస్తారు? భగీరథ ప్రయత్నానికి ఏమాత్రం తీసిపోని పంథాలో మళ్లీ ఈ పిల్లలే ఆ పనినీ తమ భుజాలకెత్తుకుని అమెరికాలో అప్పటికే తెలుగుశాఖలున్న మరో రెండు మూడు విశ్వవిద్యాలయాలలో ప్రొఫెసర్లను సంప్రదించడం, ఆ మాట, ఆనోటా ఈనోటా పడి, మా గురువుగారు మృణాళినిగారికి తెలియడం, ఆవిడ వెంటనే నాకు తెలియచేసి ఆ ఉద్యోగానికి దరఖాస్తు చేయమని నన్ను ప్రోత్సహించడం, అత్యంత వేగవంతంగా పనులు జరిగి

స్టాన్‌ఫోర్డ్ చరిత్రలో తెలుగు భాషాబోధనకి నేను తొట్టతొలి అధ్యాపకుడిగా నియామకం కావడం చకచకా జరిగిపోయాయి. ఇది కేవలం నా వ్యక్తిగత విజయం కాదు, ఒక భాషకి, జాతికి అందిన విజయం. ఒక వారసత్వానికి దొరికిన గౌరవం. కానీ తమాషా ఏమిటంటే, అది దక్కడానికి కృషి చేసినది, సాధించినదీ, భాషాభిమానులమంటూ దాని విస్తృతికోసం పనిచేస్తున్న మన తరం వాళ్లు కాదు. ఇక్కడే పుట్టి పెరిగే మా పిల్లలకు ఈ తెలుగెందుకు, దీన్ని నేర్చుకుని వాళ్లేం సాధిస్తారు అని మనం పరిచయం కూడా చెయ్యని మన పిల్లలే, అందులో ఓనమాలు కూడా తెలియని ఆ పిల్లలే, మా మూలాల గురించిన కనీస అవగాహనైనా మేము పొందాలి. అని తపించి, దానికి కంకణం కట్టుకుని మరీ సాధించారు. ఎందరో విద్యార్థులు దేనికోసం పాటుపడ్డా, అందరూ కలిసి సమష్టి కృషి చేసినా ముందుండి నడిపించిన ఒక ఇద్దరు పిల్లల పేర్లు మనవి చెయ్యడం నా కనీస భాద్యత. వాళ్ల పేర్లు: అనన్య వాసిరెడ్డి, మహతి మంగిపూడి. 'తెలుగెందుకు?' అన్న ప్రశ్నకు అనన్య రికార్డ్ చేసి ఇచ్చిన ఆడియో ఫైల్‌ని ఇక్కడ జత పరుస్తున్నాను. అలానే, ఇదే యూనివర్సిటీలో అమెరికాలోనే పుట్టి, పెరిగిన ఒక శ్వేత జాతీయురాలు, శైవ సాహిత్యంలో Ph. D. పట్టాకోసం చదువుకోవడం ఒక ఎత్తైతే, ఆ అమ్మాయి నా తరగతిలో చేరి, తెలుగు నేర్చుకోవడం మరో ఎత్తు. 'తెలుగెందుకు?' అన్న ప్రశ్నకు ఆ అమ్మాయి రికార్డ్ చేసి ఇచ్చిన ఆడియో ఫైల్‌ని కూడా ఇక్కడ జతపరుస్తున్నాను.

మరొక్క మాట చెప్పి ముగిస్తాను. చిన్నతనం భారతదేశంలో జరిగిన అనేకమంది నా సమవయస్కులకు చిరపరిచితమైన ఒక అనుభవం: వేసవికాలం రాత్రుళ్లు ఆరుబయట మంచాల్లోనో, లేదూ మేడమీద చాపలేసుకునో పడుకోవడం. చల్లని వెన్నెలని ఆస్వాదిస్తూ, జిలుగుల వెలుగుల నక్షత్రాలను అబ్బురంగా చూడడం, సప్తర్షి మండలం ఎక్కడుందని వెతకడం ఒక రోజువారీ అనుభవంగా ఉండేది. కానీ ఈమధ్య భారతదేశం వెళ్లినప్పుడు, ముంబైలో ఉంటున్న నా మేనల్లుడింటికి వెళ్లినప్పుడు, వాడి మూడేళ్ల కూతురు ముద్దు ముద్దు మాటలతో పుస్తకంలో ఆకాశంలో చంద్రుడి బొమ్మ చుట్టూ ఉన్న నక్షత్రాలను చూపిస్తూ, ఆకాశంలో ఈ కంతలేమిటి (holes) అని అడిగిందట. అవి కంతలు కావని, వాటిని నక్షత్రాలంటారని చెప్పి, వాతావరణ కాలుష్యంతో మసకబారిపోయిన ఆ కాంక్రీటు కీకారణ్యంలో పాపకి ఆకాశంలో చుక్కలు ఎప్పుడూ కనబడట్లేదని, అదేపనిగా ఒక వారాంతం రెండు మూడు గంటల కారు ప్రయాణం దూరంలో ఒక ఊరికి తీసుకువెళ్లి ఆ రాత్రికి అక్కడ ఉండి, ఆకాశంలో నిండా ఉన్న నక్షత్రాలను చూపించి, ఇదిగో ఆకాశం ఇలా ఉంటుందని చూపించాడుట. ఎందుకో, మనం ఇప్పటికైనా కళ్లు తెరిచి కాస్త శ్రద్ధ పెట్టి తెలుగుభాషను, సంస్కృతిని, సంప్రదాయాన్ని ఈ తరానికి పరిచయం చెయ్యకపోతే, ఆ చుక్కల అనుభవం భాషకి పట్టడానికి మరెంతో కాలం పట్టదని అనిపిస్తోంది.

ఆ దిశగా మనందరం, మనవంతు కృషి చెయ్యాలని పిలుపునిస్తూ, చెయ్యమని అర్థిస్తూ, చేస్తారని ఆశిస్తున్నాను.



సింహాద్రి కిరణ్ స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో లాంగ్వేజ్ సెంటర్‌లో తెలుగుభాష బోధన చేస్తున్నారు. అమెరికాలో తెలుగు అధ్యాపకత్వంపై విశేష అనుభవం ఉంది. సిలికానాంధ్ర నిర్వహించే మనబడిలో చాలాకాలం పనిచేసారు.

అమెరికాలో ఎం.ఏ తెలుగు - ఒక ఆహ్లాదకరమైన అనుభవం

యార్లగడ్డ శిరీష

ట్రింగ్ ట్రింగ్ అని ఫోన్ మోగింది. అక్కడ భారతదేశం ఫోన్‌లో మా అమ్మ. ఇక్కడ మా ఆవిడ. "అత్తమ్మా, నాకు భయంగా ఉంది. శివా డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడేమో అని అనుమానంగా ఉంది. ఎప్పుడూ ఉద్యోగమని, వ్యాపారమని, స్నేహితులని, డిట్రాయిట్ తెలుగు అసోసియేషన్, తానా అంటూ బయట తిరిగే వాడు. ఈమధ్య ఇంట్లో నుంచి బయటికి అసలు వెళ్లటంలేదు, ఆఫీసు , పిల్లలకు ఏమైనా పని ఉంటే తప్ప. నాకెందుకో భయంగా ఉంది. శివా డిప్రెషన్‌లోకి వెళ్లిపోయాడేమో అని." మా అమ్మతో నా భార్య ఫోనులో పలికిన చిలకపలుకులు.

మా ఆవిడ చెప్పింది నిజమే. దానికి కారణం డిప్రెషన్ కాదు. నేను చదువుకుంటున్న ఎం.ఏ. తెలుగు. చదువు ధ్యాసలో పడిపోయి సరదా తిరుగుళ్లు అన్నీ తగ్గిపోయాయి. భార్య మాటలు గుర్తుకు వచ్చి నిజంగా డిప్రెషన్‌లోకి వెళ్లిపోయానా అనే ఒక చిన్న మీమాంస. గోపీచంద్‌గారు వ్రాసిన 'అసమర్థుని జీవయాత్ర' పుస్తకంలోని సీతా రామారావు పాత్ర అయిపోతున్నానేమో అని ఒక చిన్న సందేహం మొదలైంది. అసలు అమెరికాలో తెలుగు అవసరమా? నేను ఎందుకు 45 సంవత్సరాల వయస్సులో చదువుతున్నాను? అమెరికాలో ఈ తెలుగు నాకు ఎలా ఉపయోగపడుతుంది? చాలా మంది అమెరికాలో ఎంఏ తెలుగు కూటికా గుడ్డకా అంటూ హేళన కూడా చేశారు. తెలుగు రాష్ట్రాల్లోనే తెలుగు మాధ్యమం పోయింది. తెలుగును ఒక సబ్జెక్టుగా కూడా చదవటానికి చాలామంది ఇప్పుడు ఇష్టపడటం లేదు. నేను ఇప్పుడు వ్రాస్తున్న ఈ వ్యాసం ఎంతమంది చదువుతారు? అసలు తెలుగు లిపిని చదవగలిగేవారు ఎంతమంది ఉన్నారు? మరి నేను ఎందుకు చదువుతున్నాను?

కూచిభొట్ల ఆనంద్‌గారు ఒకరోజు డెట్రాయిట్ వచ్చినప్పుడు, మన యూనివర్సిటీలో ఎంఏ తెలుగు కోర్సు మొదలుపెట్టామని చెప్పగానే నాకు వెంటనే నేర్చుకోవాలని అనిపించింది. ఎంతైనా సిలికానాంధ్ర యూనివర్సిటీ, ఇప్పుడు ఆర్య యూనివర్సిటీగా మారింది. అమెరికన్ యూనివర్సిటీ కనుక యూనివర్సిటీలో అడ్మిషన్ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టాను. దానిలో భాగంగా ప్రొఫెసర్స్, లెక్చరర్స్ దగ్గరి నుంచి రికమండేషన్ లెటర్లు అవసర మయ్యాయి. నాకు చిన్నప్పుడు తెలుగు నేర్పిన బండ్ల మాధవరావు గారిని విజయవాడ వెళ్లి కలిసి నాలోని ఈ తపన తెలిపితే ఆయన ఎంతో సంతోషించి నాకు రికమండేషన్ లెటర్ ఇచ్చారు. ఇకపోతే నా చిన్నప్పటి నుంచి తెలుగు సాహిత్యరంగంలోని నిష్ణాతులతో మా నాన్నగారికి ఉన్న సంబంధ బాంధవ్యాలను దగ్గరగా చూసిన వాడిని. అప్పట్లో ఏదో మా నాన్నకు తెలిసిన స్నేహితులు, పరిచయస్థులు అనుకున్నాను కానీ ఈ ఎం.ఏ. తెలుగు కోర్సు చదవటం మొదలుపెట్టిన తర్వాత వారి గురించి తెలుసుకుంటుంటే వీరేనా నేను ఇన్ని రోజులు మా నాన్నగారితో చూసిన గొప్పవారు? ఆహా ఏమి నా అదృష్టం అనిపించింది. మా నాన్నగారి సాంగత్యం లో నాకు తెలియకుండానే తెలుగుభాష మీద ఒక జిజ్ఞాస మొదలైంది.

మా ఆవిడ అన్నట్లు నేను అసలు ఇంట్లో నుంచి బయటికే వెళ్లటం మానేసాను. జనజీవన స్రవంతితో మళ్లీ ఒకసారి కలుద్దాం అనుకుని మా ఆవిడతో ఒకరోజు చెప్పాను. స్నేహితులతో బయటికి వెళ్దాం అనుకుంటున్నాను. రాత్రి వచ్చేటప్పుడుకి ఆలస్యమవుతుందని. నన్ను పై నుంచి కిందికి ఒకసారి తేరిపార చూసి,

"వెళ్లండి," అంటూ నిష్టూరంగానే తల ఊపింది. ఆ 'వెళ్లండి' అనే శబ్దంలో చాలా రకాల అర్థాలు నాకు అర్థమయ్యాయి.

పింగళి సూరనగారు 'రాఘవపాండవీయం' అనే ఒక ద్వ్యర్థి కావ్యం వ్రాసారు. ద్వ్యర్థి కావ్యం అంటే ఆ కావ్యం చదివితే మీకు రెండు అర్థాలు కనపడతాయి. రాఘవ అంటే రాముడు. పాండవ అంటే పాండవులు. రాముడికి పాండవులకి సంబంధం ఏంటి? ఆయన వ్రాసిన 'రాఘవపాండవీయం' రామాయణాన్ని తలుచుకుంటూ చదివితే అంతా రామాయణమే. అదే కావ్యాన్ని మళ్లీ భారతాన్ని తలుచుకుంటూ చదివితే అంతా భారతమే! అంటే ఒక కావ్యంలో రెండు అర్థాలన్నమాట, మా ఆవిడ 'వెళ్లండి' అని చెప్పినట్టు.

ఇక చేసేది ఏముంటుంది? మా ఆవిడతో, "సర్లే... ఆలా బయటకు వెళ్లి 'గాలి' పీల్చుకుని వస్తాను," అని బయటకి నడిచాను. గాలి అంటే నా ఉద్దేశ్యం వేరు శ్రీనాధుని చాటువులు లాగా. చాటువు అంటే సరదా, వ్యంగ్య భావనలతో కూడిన పద్యం. ఉదాహరణకి,

కం. సిరిగల వానికి చెల్లును
తరుణుల పది యారువేల తగ పెండ్లాడన్
తిరిపెమున కిద్ద రాండ్రా?
పరమేశా! గంగ విడుము పార్వతి చాలున్

శ్రీనాథ మహాకవి చెప్పిన చమత్కారమైన చాటు పద్యం ఇది. ఒక మండు వేసవికాలంలో ఆ మహాకవి పల్నాటిసీమలో ప్రయాణం సాగిస్తున్నాడట. దాహంతో గొంతెండిపోతోంది. చుట్టుప్రక్కల ఎక్కడా చుక్క మంచినీరు లేదు. దారిలో ఎక్కడో పెద్ద శివుని విగ్రహం కనబడిందట.

పరమేశ్వరా! శ్రీకృష్ణునికి పదహారు వేలమంది భార్యలున్నారంటే అర్థం ఉంది. ఆయన కోటీశ్వరుడు. పోషించే సమర్థత ఉంది కాబట్టి ఎంతమందినైనా చేసుకొంటాడు. (తిరిపెం) బిచ్చం ఎత్తుకొని బ్రతికే నీకు పార్వతి , గంగ అంటూ ఇద్దరు పెళ్లాలెందుకయ్యా? ఆ పార్వతిని నీవు ఉంచుకుని గంగని మాకు వదిలెయ్యి అని అర్థం. ఇక్కడ గంగ అంటే నీరు. ఇక్కడ శ్రీనాధుని ఉద్దేశ్యం వేరు.

కొన్నిసార్లు నా భార్య నన్ను కొన్ని పనులు చేయమన్నప్పుడు నాకు కోపం నషాళానికి అంటుతుంది. ఆవిడతో గొడవకు దిగుతాను. నేను ఎం.ఏ తెలుగు చేస్తున్నప్పుడు సాహిత్యవిమర్శ అనే ఒక సబ్జెక్టు విపరీతంగా ఆకర్షించింది. ప్రతిదాన్ని మరొక కోణంలో చూస్తూ ఒక విమర్శ చేయాలి. సీత రాముడిని బంగారు జింక తీసుకురమ్మని అడిగినప్పుడు- ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో భర్త భార్యని చిరాకుగా చూసి బంగారు జింక ప్రపంచంలో ఎక్కడైనా ఉంటుందా అని అడుగుతాడు. అతని కోపం కూడా నషాళానికి అంటుతుంది. ఎవరో చాకలివాడు ఏదో అన్నాడని భార్యను ఇంటి నుంచి పంపించటం ఏమిటి? అసలు ఇతను దేవుడా అని రాముడు గురించి ఒక చిన్నపాటి సందేహం కలుగుతుంది. ఇదంతా ఒక విమర్శ. భార్య భర్త తగువులాడుకోవటం ప్రస్తుత పరిస్థితుల్లో సహజం. కానీ రామాయణంలో ఎక్కడా కూడా రాముడు సీతతో గొడవపడినట్లు లేదు. రాముడు పితృవాక్య పరిపాలకుడు అనే ఉంది కానీ భార్యావిధేయుడు అని ఎక్కడాలేదు. నేనే కనుక రామాయణం వ్రాసి ఉంటే దీని గురించి ఖచ్చితంగా ప్రస్తావించేవాడని.

ఇక అమెరికాలో మన పనులన్నీ మనమే చేసుకోవాలి. ఉదయం ఐదున్నర గంటలకు మొదలయ్యే ఉరుకుల పరుగుల హడావిడి రాత్రి 11 వరకు సాగుతూనే ఉంటుంది. భార్యాభర్తలు ఇరువురూ ఉద్యోగ, వ్యాపార సమస్యలతో సతమతమవుతూ అలసిపోయి సాయంత్రం ఇంటికి వచ్చిన తర్వాత పిల్లల క్లాసులని వంట అని బట్టలు ఉతుక్కోవడం అంటూ ఒక చిన్న యుద్ధమే మొదలవుతుంది. అలాంటి సందర్భంలో నా భార్యలోని ఒక విప్లవశక్తి బయటకు వస్తుంది. నన్ను వశం చేసుకుంటుంది. విప్లవం అనగానే నాకు ముందుగా గుర్తుకు వచ్చేది శ్రీశ్రీగారు. ఆయన రాసిన మహాప్రస్థానం. అరసం, విరసం వంటి సంస్థలు. అరసమంటే అభ్యుదయ రచయితల సంఘం. విరసం అంటే విప్లవ రచయితల సంఘం. వీళ్లందరూ ఈ కాలానికి చెందినవారే! కానీ 500 సంవత్సరాల క్రితమే అన్నమయ్య వ్రాసిన సంకీర్తనలు చదువుతుంటే , వాటిలో ఆయన నాకు ఒక సంఘసంస్కర్తలా కనిపించాడు. బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే అన్న సంకీర్తన చూస్తే, మనకు ఇది చాలా బాగా అర్థం అవుతుంది. ఇవన్నీ నేను ఎం ఏ తెలుగు వల్ల తెలుసుకున్న విషయాలే.

తెలుగు అనగానే మనకు ముందుగా భయం వేయటానికి కారణం వ్యాకరణం. మనందరికీ తెలిసిన సంధులకు ఒక సూత్రం ఉంటుంది. దాన్ని నేర్చుకుని మనం బడిలో ఎలాగోలా బ్రతికి బట్ట కట్టేసాం. ఎం.ఏ తెలుగు చదువుకుంటున్న సమయంలో నాకు అర్థమైనది ఒక సంధికి ఎన్నో ఎన్నెన్నో సూత్రాలు ఉంటాయని. తెలుగు సాహిత్యచరిత్ర గురించి చదువుతుంటే, ఆనాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, మతపరమైన పరిస్థితులు ఎలా ఉండేవో కూడా మనకు అర్థం అవుతుంది. ఆశ్చర్యపరుస్తుంది కూడా. కౌరవులకు, పాండవులకు జరిగిన యుద్ధంలో తెలుగువారు కౌరవుల తరపున యుద్ధం చేశారు అనే విషయం తెలిసినప్పుడు అవునా! అంటూ ముక్కున వేలు వేసుకున్నాను.

ఒక్కోసారి పరీక్షలకు సన్నద్ధం అవుతున్నప్పుడు ఈ తెలుగు మనకెందుకురా బాబు అనుకుంటూ అసలు తెలుగు ఎవడు కనుక్కున్నాడు? అని నిట్టూర్పులు విడుస్తూ ఉన్నప్పుడు తెలిసిన విషయం ఏమిటి అంటే 'నాగబు' అనేది తెలుగులోని మొట్టమొదటి పదం. ఇవి అన్నీ తెలుగు అధ్యయనం వలన తెలిసినవే.

చిన్నప్పుడు సినిమాలు చూస్తూ పాటలు వచ్చినప్పుడు ఏదో లయబద్ధంగా ఉన్నాయి అనుకుంటూ ఆ నాట్యవిన్యాసాలను చూస్తూ మురిసిపోవడమే తెలుసు. కానీ ఇప్పుడు పాట వచ్చినప్పుడల్లా మనసు, బుద్ధి రెండూ పాటలోని సాహిత్యంవైపు వెళ్లి ఆలోచించేటట్లు చేస్తుంది.

సి. నారాయణరెడ్డిగారు వ్రాసిన 'ప్రపంచ పదులు'లో 'నమ్మలేని సరుకు ఉంటే అమ్మకాన్ని నిందించకు,' అంటారు. ఈ తెలుగుని నేను విపరీతంగా నమ్మాను. నేర్చుకుంటున్నాను. ఇది ఓ సముద్రం. నేర్చుకోటానికి ఒక జీవితకాలం సరిపోదు. నా ఈ వ్యాసానికి అంతూ ఉండదు. గొల్లపూడి మారుతిరావుగారు చదువు ఎందుకు అంటే ఈ విధంగా చెప్పారు. "ఆర్థిక అవసరాల కోసం, ఉపాధి కోసం మాత్రమే కాకుండా... ఒక భాషను జ్ఞానంకోసం నేర్చుకోవాలి. ఒక భాషను విజ్ఞానంకోసం నేర్చుకోవాలి. అది ఒక త్రోవ మాత్రమే. గమ్యం కాదు."

16. వ్యక్తిగత విశ్వాస ప్రయాణం: తన బాబాయిగారి ఆహ్వానంతో ఈ సమావేశానికి వచ్చిన ఈ యువతి (అమెరికాలో పుట్టి, పెరిగినది) తన ప్రత్యేకమైన ఆధ్యాత్మిక మార్గాన్ని వివరించారు. తానే ఈ సమూహంలో అతి పిన్న వయస్కురాలినని భావించిన ఆమెకు, తనకంటే చిన్నవారు కూడా ఉన్నారని తెలుసుకున్నప్పుడు సంతోషం కలిగిందన్నారు. భారతీయ మూలాలు కలిగిన కుటుంబంలో పెరిగినా, ఆమె సాంప్రదాయిక హిందూ ఆచారాల నుండి విభేదించి, కళాశాల దినాల్లో క్రైస్తవ మతాన్ని అవలంబించారు- ఇది ఆమెకు వ్యక్తిగతంగా చాలా అర్థవంతమైన నిర్ణయం అయ్యింది. ప్రస్తుతం ఆమె నిబద్ధత కలిగిన క్రైస్తవురాలిగా, వారంలో ఒకసారి చర్చికి హాజరవుతారు, ప్రతిరోజు బైబిల్ చదువుతారు, నెలకు ఒకసారి జరిగే 'కమ్యూనియన్' (యేసు త్యాగాన్ని స్మరించుకునే విధి)లో పాల్గొంటారు. తన విశ్వాసం ఈ సమావేశంలోని ఇతరులకంటే భిన్నంగా ఉండవచ్చని ఆమె అంగీకరించినా, అన్ని మతాలను గౌరవిస్తానని స్పష్టం చేశారు. ఆమెకు, యేసును విశ్వసించడంవల్ల స్పష్టత, ఓదార్పు, ఒక లోతైన జీవితార్థాన్ని అందుకోవటం జరిగిందన్నారు.

సమావేశం ఈ శక్తివంతమైన వాక్యాల ప్రదర్శనతో ముగిసింది.

"నమ్మకం అనేది తెల్లవారుజామున చీకటిలో రాబోయే కాంతిని ముందుగానే అనుభూతి చెంది పాట పాడే పక్షి."

-రవీంద్రనాథ్ ఠాగూర్

"మీరు మీ గురించి ఎంత ఎక్కువ తెలుసుకుంటే, అంత స్పష్టత ఉంటుంది. ఆత్మ జ్ఞానం అనేది అంతములేని పయనం- ఇది మీరు సాధించేసేది కాదు, ఒక ముగింపుకు చేరేది కాదు. ఇది ఒక అనంతమైన నదిలాంటిది."

- కృష్ణమూర్తి



అంతర్జాల సమావేశంలో సంభాషణలు...

తరాల మధ్య వ్యవహారాలలో వివేకం

'తరతరాల విజ్ఞత - జీవితానుభవాల నుండి నేర్చుకోవడం' అనే అంశం మీద జనవరి 12, ఆదివారం, మధ్యాహ్నం 2:00 నుండి 4:00 గంటల వరకు జరిగిన సభ విజయవంతంగా నిర్వహించ బడింది. ఈ కార్యక్రమంలో విభిన్న తరాల వ్యక్తులు పాల్గొని అర్థ వంతమైన చర్చ జరగడానికీ, ఆత్మపరిశీలనకూ అవకాశం కల్పించారు.

హాజరైన వారు తమ వ్యక్తిగత అనుభవాలనూ ఆలోచనలనూ ఉదారంగా పంచుకున్నారు. తద్వారా ఎవరికివారు తమ అభిప్రాయాలను పునఃపరిశీలించుకునే అవకాశం కల్పించారు. ఈ చర్చ ప్రధానంగా క్రింది ప్రశ్నమీద కేంద్రీకృతమైంది:

"గతంలోకి చూస్తూ, జరిగిపోయిన విషయాలను మీరు మార్పు చేయగలిగితే, అప్పటి మీకు, ఇప్పటి మీరు ఏ మార్పులు చేయమని చెబుతారు? దేనిని ఇంకా ఎక్కువగా చేయమని చెబుతారు?"

చర్చ నుండి ముఖ్యాంశాలు

ఎప్పుడూ ఫిర్యాదులు చేయడంవల్ల కలిగే దుష్ఫలితాలు: నిరంతరం మనమీదేగానీ ఇతరులపైనగానీ ఫిర్యాదులు చేస్తూ ఉండటం వలన మనలో మనకు స్వాతిశయం కల్పించే న్యాయ భావన కలుగవచ్చు, కానీ ఎప్పుడూ ఫిర్యాదులు చేయడం ఫలితంగా ఆరోగ్యం, సంతోషం, మనశ్శాంతి క్షీణించవచ్చు. ఇతరులనుగానీ మనల్ని మనమేగానీ మన్నించడం ద్వారా ఈ ఫిర్యాదుల దుష్ప్ర భావాలను కొంత నివారించవచ్చు.

పాల్గొనడంలో సమతుల్యత: నేర్చుకోవడానికి మాట్లాడటమే గాక, శ్రద్ధగా వినడం కూడా అవసరం. అమెరికా వారి సంస్కృతిలో, మాటకారులు ఎక్కువగా నాయకత్వ స్థాయిలోకి వెళతారు, వినే వారు అనుచరులుగా మిగిలిపోతారు. మాట్లాడేందుకు ముందుకు రావడం, దానితోబాటు శ్రద్ధగా వినే నైపుణ్యాన్ని మెరుగు పరుచు కోవడం ద్వారా నాయకత్వ అవకాశాలను పెంచుకోవచ్చు.

స్వయంగా సృష్టించుకున్న అడ్డంకులను అధిగమించడం: 'యాజమాన్యంలో విదేశీయులకు అవకాశాలు ఉండవు,'లాంటి ఆలోచనలు మన పురోగతిని అడ్డుకుంటాయి. భారతీయ మూలా లున్న అనేకమంది CEOల విజయాలు ఇలాంటి ఆలోచనలు నిరాధారాలని నిరూపించాయి. ఆత్మవిశ్వాసం, స్వాభిరుచిని అనుసరించడం ఎదుగుదలకు మార్గం చూపుతాయి.

పెద్దల వద్ద నుండి జ్ఞానం: పెద్దల మాటలు వినడం ఎంత విలువైనదో తమ వంతు వచ్చి పిల్లలను ఒక దారిన పెట్టే ప్రయత్నం చేస్తున్న సమయంలో స్పష్టమవుతుంది- చలికాలంలో సరైన దుస్తులు ధరించడం లాంటి చిన్న విషయాల్లో కూడా!

పెద్దల సలహాలను పట్టించుకోకపోవడం వల్ల కలిగిన దుష్పరి ణామాల గురించి వివరించడం పిల్లలకు గుణపాఠాలు చెప్పడం లాంటిది.

ఇతరుల అభిప్రాయల నుండి రక్షణకు తాపత్రయం: తనను తాను నిరంతరం. సమర్థించుకోవటానికి తాపత్రయపడటం తన శక్తిని కోల్పోయే పనికిరాని అలవాటు. వృత్తిపరంగా సమర్థించు కోవడం కొన్ని సందర్భాల్లో అవసరం కావచ్చు. కానీ వ్యక్తిగత

జీవితంలో, ఎక్కువగా వినడం, తన అభిప్రాయాన్ని వ్యక్తపరచడం, ఆతర్వాత ముందుకు సాగడం ఉత్తమమైన మార్గం. సమయ పరంగా చూస్తే 90% సందర్భాల్లో సమర్థించుకోవడం అనవసరం.

విఫలతను విజయానికి మెట్టుగా మార్చుకోవడం: విఫలత కారణంగా ఆత్మవిశ్వాసం కోల్పోవద్దు. దాన్నుంచి నేర్చుకొని, ముందుకు సాగడం నిజమైన పురోగతికి దారి చూపిస్తుంది.

అవసరంలేని వాదనలు వదిలివేయడం: చిన్న విషయాలపైన వాదనలు చేయకుండా దూరంగా ఉండటం మనస్సుకు ప్రశాంతతను అందిస్తుంది. ప్రతి వివాదంలోనూ గెలవాల్సిన అవసరంలేదు.

గతం నుండి నేర్చుకోవడం: గతాన్ని (వ్యక్తిగతం, సాంస్కృతికం లేదా విద్యా సంబంధమైనదైనా) అర్థం చేసుకోవడం తప్పిదాలు పునరావృతం కాకుండా నివారిస్తుంది, కొత్త అవకాశాలను కల్పిస్తుంది కూడా.

కార్యాచరణ శక్తి: ఆలోచనల దగ్గరే ఆగిపోతే భవిష్యత్తును మార్చలేము- అవి కార్యరూపం దాల్చినప్పుడే నిజమైన మార్పు సాధ్యమవుతుంది. కార్యాచరణ మాత్రమే అవకాశాలను వాస్తవాలుగా మార్చగలదు.

భయాన్ని ఎదుర్కొని అధిగమించడం: ఆందోళనతో భయంతో స్తంభించిపోకుండా, వాస్తవాన్ని అంగీకరించడం, భయం వెనుక ఉన్న కారణాలను తగిన రీతిలో అర్థం చేసుకోవడం, ముందుకు సాగే ధైర్యాన్ని పెంపొందిస్తాయి.

ఇతరుల మెప్పు మాత్రమే ముఖ్యం అనే బంధం నుండి విముక్తి: స్వాభిమానం విలువైనది. ఇతరుల మనసును గెలుచుకోవడానికి అనవసరంగా ప్రయత్నించాల్సిన అవసరం లేదు.

ప్రతిఒక్కరినీ వారికి తగిన రీతిలో మాత్రమే గౌరవించండి, అలాగే అవసరమైనప్పుడు 'లేదు, కాదు' అని చెప్పేందుకు వెనుకాడవద్దు.

ఆత్మావలోకనం ద్వారా పురోగతి: రెండు సంవత్సరాలకు ఒకసారైనా వృత్తి నిర్వహణ గురించి సింహావలోకనం చేసుకోవడం సరికొత్త అవకాశాలను గుర్తించడానికి సహాయపడుతుంది.

అలాగే, పిల్లల్ని సంప్రదాయ విజయమార్గాల్లోకి నెట్టకుండా, వారి అభిరుచులు ఏమిటో తెలుసుకుని వాటి దిశగా ప్రోత్సహించడం నిజమైన తృప్తినిస్తుంది.

సన్నిహిత సమాజంలో ఎదగడం: చిన్న సమాజాల్లో పెరగడం వల్ల బంధాలు మరింత గాఢంగా ఏర్పడతాయి, అయితే అలాంటి సమాజాల్లో స్వతంత్ర ఆలోచన, ఉన్నదున్నట్లుగా మాట్లాడటం కొంత ఘర్షణను కలిగించవచ్చు. ఇలాంటి సవాళ్లను అర్థం చేసుకుని, అనుకూలంగా మార్చుకుని ముందుకు సాగడం జీవిత సాఫల్యానికి ఒక కీలక నైపుణ్యం.

ఈ సమావేశం ఆసక్తికరంగా ఉపయోగకరంగా కొనసాగింది. పాల్గొన్నవారి మధ్య సంబంధాలు బలోపేతం కావడానికీ, ఆత్మపరిశీలన చేసుకోవడానికీ, కొత్త విషయాలు తెలుసుకోవడానికీ సహకరించింది.



అంతర్జాల సమావేశంలో సంభాషణలు...

మాటల నుండి అస్తిత్వంవైపు సమిష్టి ప్రయాణంలో నాలుగు చిరు అడుగులు

2025 తానా సమావేశ నాయకత్వం మండవ ప్రసాద్‌గారికి సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ కమిటీ అధ్యక్షతను అప్పగించటం, ఆ భాద్యతలను ఆయన స్వీకరించటంతో అక్కడ ఒక నూతన కార్యక్రమమానికి నాంది పడింది. మూడు దశాబ్దాలకు పైగా స్వీయ-అభివృద్ధి మరియు నాయకత్వ శిక్షణ అనుభవంతో, సాంప్రదాయానికి మించిన ఒక కొత్త రకమైన సంభాషణల అవకాశాన్ని ఆయన ఊహించారు - సమాజ స్థాయిలో అంతర్జాల ఆవరణ యందు జరిగే 'అస్తిత్వపరమైన సంభాషణలు' (ontological conversations).

లక్ష్యం స్పష్టంగా ఉంది: ప్రతి జీవితం విలువైనది, ప్రతి గొంతు ఏదో ప్రత్యేకమైన విషయాన్ని అందించగలదు. ఇక్కడ ఎవరికీ బోధించాల్సిన అవసరం లేదు. మనం సమాచారాన్ని ఇచ్చే ప్రయత్నం చేయటంలేదు, కానీ పాల్గొనే ప్రతివారు నిజజీవిత అనుభవాలను పంచుకోవాలని ఆశిస్తున్నాము. 'సంపూర్ణ భాగస్వామ్యంతో అందరం పండుగలా జీవిద్దాం,' అనే నినాదం ఆధారంగా, ఈ సమావేశాలు ఎక్కువ మందికి అవకాశం కల్పించే విధంగా రూపుదిద్దుకుంటున్నాయి. ప్రధాన జూం (Zoom) గదిలో నైనా లేదా చిన్న సమూహ చర్చాగదిలోనైనా, ప్రతి ఒక్కరికీ తమ జీవిత అనుభవాలను పంచుకునే అవకాశం ఉంటుంది. ఇక్కడ లక్ష్యం కేవలం పాల్గొనడం మాత్రమేకాదు, నిజాయితీగా అనుభవాల్ని పంచుకోవడం, శ్రద్ధగా వినటం ద్వారా పూర్తిగా ప్రస్తుత క్షణాల్లో ఉండగలగటం.

ఈ జట్టులో మొదటిగా చేరింది కాకరాల శ్రీమన్నారాయణ గారు, తర్వాత ఆరి సీతారామయ్యగారు. ఈ ఇద్దరూ అద్భుతమైన వ్యక్తులు. వ్యక్తపరచిన విషయాన్ని సహృదయంతో విని, ఈ ప్రయాణమంతటిలో తోడుగా నడిచారు, నడిపించారు. కాలక్రమేణ బృందం బలపడుతూ పదకొండు మంది నిబద్ధత గల సభ్యులుగా విస్తరించింది. మేము పరస్పర గౌరవంతో, అందరి దృక్కోణాల్ని పరిశీలించుకొంటూ, భిన్నాభిప్రాయాలను పరిష్కరించుకొంటూ, కార్యాచరణ విషయంలో ఎప్పుడూ ఏకమై ముందుకు సాగాము. ఈ పరస్పర గౌరవం, సమిష్టి లక్ష్యపు భావనలే మా సాఫల్యానికి మూలకారణం.

వారం వారంగా, మా జట్టు ఈ ముఖ్యమైన ప్రశ్నలను ఎదుర్కొంది: హృదయపూర్వకంగా పంచుకోవడానికి ఏ విషయాలయితే బాగుంటుంది? ప్రతి సంభాషణకు ఎన్ని ప్రశ్నలు సరిపోతాయి? సంభాషణలు స్వేచ్ఛగా, కలివిడిగా సాగటానికి కార్యక్రమాన్ని ఏవిధంగా రూపొందించాలి? ఈ సంభాషణలలో పాల్గొనటానికి మిత్రులను ప్రేరేపించటం, ఆహ్వానించటం మొదలైన కార్యక్రమాలను ఏవిధంగా నిర్వహించాలి? ముఖ్యంగా, పాల్గొన్న సభ్యుల అనుభవాల సారాన్ని ఎలా సంగ్రహించాలి?

సిద్ధంగా ఉన్న కార్యాచరణ పథకం ఏమీలేదు. సమావేశాలు వెలిసాయి చేస్తూ నేర్చుకోవడం, వింటూ సృష్టించడం జరిగింది.

ఈ నాలుగు సాంఘిక సంవాదాలు సాగిన తీరుగానే సమాధానాలు-

1. ‘తరాల మధ్య వ్యవహారాలలో వివేకం’- జీవితానుభవాల నుండి నేర్చుకోవడం.
2. ‘తరాల మధ్య బంధాలు’ - సంబంధాలు-సంభాషణలు,
3. ‘అందరం ఒక్కరుగా, అవధులకతీతంగా!’- ఒక్క మానవత్వం, అనేక బంధాలు
4. ‘ఒకే సత్యం, వివిధ మార్గాలు’- నమ్మకాలు, ఆచారాలు, అంతర్గత శోధనలు.

ఇవి కేవలం కార్యక్రమాలు మాత్రమే కాకుండా, స్వచ్ఛమైన అంతరంగాలు, అవకాశాలు, సమిష్టి సృజన కలిసి నడచినప్పుడు భవిష్యత్తులో ఏమి సాధ్యమవుతుందో ప్రస్తుతంలో చూపించే సజీవ రూపాలుగా నిలుస్తున్నాయి. ఈ భవిష్యత్తు, మానవ సంబంధాలను విభజించే గోడల వల్ల కాదు, కలుపుకునే వంతెనల వల్ల నిర్మితమవుతుంది. ఇక్కడ విమర్శకు బదులు కుతూహలం, ఒక్కటైన మానవత్వం మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

ఈ మొదటి నాలుగు అడుగులు చిన్నవి, సాధారణమైనవి, కానీ లోతైనవి - అనుబంధం, అవగాహనల పరిణామ దశలో నిశ్శబ్ద విప్లవం. ఈ ప్రయాణం కొనసాగుతున్నకొద్దీ, కలిసి నడుస్తూ, వింటూ, ఒక కొత్త ప్రపంచాన్ని నిర్మించటానికి ఇవి మరింత మందిని ప్రేరేపించాలని ఆశిస్తున్నాము. అలాంటి ప్రపంచంలో ప్రతి కథకు ప్రాముఖ్యత ఉంటుంది, ప్రతి జీవితం గౌరవించబడుతుంది.

ప్రత్యేక కృతజ్ఞతలు

తానా 2025 నాయకత్వం- అచంచలమైన మద్దతు, సహకారం వాణి ఆరిగారు - ప్రారంభ ప్రధాన ప్రశ్నను రూపొందించడం, శ్రీనివాస్ పిన్నమనేనిగారు - తెలుగు సారాంశాల సృష్టిని మొదటిసారిగా సూచించి, ప్రోత్సహించడం.

మా జట్టు

మండవ ప్రసాద్ (అధ్యక్షులు), కాకరాలు శ్రీమన్నారాయణ (సహ-అధ్యక్షులు), ఆరి సీతారామయ్య, కొండా శ్రీధర్, లక్ష్మి సలీం, మండవ శిరీష, చలసానిరావు, మన్యం సత్యశ్రీ మండవ అరుణ, మన్యం రావు, యెలమంచి రవి.

మానసిక ఆరోగ్యం (The Art of Letting Go)

ఆది సీతారామయ్య

మీరెప్పుడైనా వాట్సాప్ మెస్సేజ్‌లు చూస్తూ కారు నడిపారా? భుజానికీ చెవుకీ మధ్య ఫోన్ ఇరికించి మాట్లాడుతూ వంట చేశారా? టాయిలెట్ సీట్ మీద కూర్చుని పుస్తకం చదివారా? మీరేకాదు, చాలామంది చేసే పనులే ఇవి. అంటే మనసు మనం చేస్తున్న పని మీద ఉండదు. మరెక్కడో ఉంటుంది. అందుకే ఒళ్లు దగ్గర పెట్టుకుని పనిచెయ్యి అంటారు మనవాళ్లు. అంటే శరీరాన్ని దగ్గర పెట్టుకుని అనికాదు, మనసుని చేస్తున్న పనిమీద పెట్టమని.

పైన చెప్పిన ఉదాహరణల్లో మనం బుద్ధిపూర్వకంగా మనసుని మరోచోటుకి తీసుకెళ్తున్నాం. మనసు రోడ్డుమీద లేకుండా కారు నడిపితే జరిగే నష్టం గురించి మీకు చెప్పాల్సిన అవసరం లేదు. తెలిసి కూడా మనం మనసుని రోడ్డుమీద నుంచి ఫోన్ మీదకు మళ్లిస్తుంటాం. అది కేవలం నిర్లక్ష్యం. కానీ చాలాసార్లు మనసు మన ప్రమేయం లేకుండానే చేస్తున్న పనిమీద నుంచి దూరంగా వెళ్తుంది. అలా ఎందుకు జరుగుతుంది? మనసు ఎక్కడకెళ్తుంది?

మనసు చేసే పని ఆలోచించడం. ఆలోచనలకు మూలం మన అనుభవాలు. పూర్వానుభవాలను గుర్తు చేసుకుని పదేపదే విశ్లేషిస్తూ ఉంటుంది మనసు. జరగాల్సిన పనులు చెడితే వాటి పర్యవసానాలెలా వుంటాయో పూర్వానుభవాల ఆధారంగా ఊహిస్తూ ఉంటుంది. కోతి కొమ్మ నుంచి కొమ్మకి దూకినట్లు మన మనసు రోజుకు దాదాపు పదివేలకు పైగా ఆలోచనలు చేస్తుందట. వాటిలో ఎనభైశాతానికి పైగా విచారం కలిగించే ఆలోచనలు. గతాన్ని తవ్వి నిరాశ, నిస్పృహ, కోపతాపాలు, అసూయ, పగ, సిగ్గు లాంటి అపరాధభావాలను బయటికి తెచ్చే ఆలోచనలు కొన్ని. లేక జరగాల్సిన పనులు అనుకూలంగా జరగవేమోనని ఆందోళన కలిగించేవి కొన్ని.

శ్రద్ధగా మనసుని మనం చేస్తున్న పనిమీద ఉంచగలిగితే, అది మామూలుగా ముందు వెనుకలకు చేసే సంచారాలను కొద్దిసేపైనా ఆపవచ్చు. అంటే ఆ కొద్దిసేపైనా దిగులు, విచారం, ఆందోళనల నుంచి తప్పించుకోవచ్చు.

కానీ, వినటానికి సులభంగా ఉన్నా, చేస్తున్న పనిమీద మనసు పెట్టడం సులభం కాదు. చాలా ప్రయత్నం అవసరం అవుతుంది. స్వేచ్ఛగా తిరిగే అడవి గుర్రాన్ని ఒక చోట కట్టేసి ఉంచితే ఎంత ఇబ్బంది పడుతుందో ఊహించండి. కాని కొన్నాళ్లకు అలవాటు పడుతుంది. తెంచుకుని పారిపోదామనే యోచన మానుకుని అక్కడే నిలబడి ఉంటుంది. మనసుకి కూడా ఇలాగే చేస్తున్న పనిమీద ఉండేట్లు శిక్షణ ఇవ్వవచ్చు.

ఎంత అలవాటు పడిన గుర్రాన్నయినా తాడేసి కట్టెయ్యకపోతే చుట్టుపక్కల ఉన్న గడ్డి, మరో గుర్రమో ఆకర్షించవచ్చు. అలాగే జరిగిపోయిన, జరగాల్సిన విషయాల్లో మునిగి ఉండే మనసును ప్రస్తుత కార్యం మీద నిలకడగా ఉంచాలంటే గతాన్ని తొవ్వాల్సిన అవసరం, ముందున్న కాలం గురించి ఆందోళన పడాల్సిన అవసరం కొంతైనా తగ్గిస్తే మంచిది.

అసలు గతాన్ని గురించిగానీ, భవిష్యత్తు గురించిగానీ మనసు ఎందుకు ఆలోచిస్తుంటుంది? మన అధీనంలో (ప్రస్తుత కార్యం మీద) లేని మనసు అసంకల్పితంగా (auto-pilot) చరిస్తుంటుంది. కొందరి మనసు ఎక్కువగా గతంలోకి వెళ్తుంటే, మరికొందరి

మనసు ఎక్కువగా భవిష్యత్తులోకి వెళ్తుంది. గడిచిపోయిన విషయాల గురించి ఆలోచిస్తూండటం వలన మానసిక వ్యాకులత (depression) కలగవచ్చు. స్నేహితుడని అనుకున్నానే. ఇలా మోసం చేస్తాడా? అన్నదమ్ములు అక్కచెల్లెళ్లనుకుని నమ్మానే. ఇలా చేస్తారా? అతనికి ఎంత సహాయం చేశాను! నాకు అవసరం అయినప్పుడు కనపడనుగూడా లేదే! ఇలాగ తప్పులన్నీ ఇతరులవేగాదు, మనం చేసిన తప్పులు కూడా బాధిస్తూనే ఉంటాయి. అయ్యో, అలా చెయ్యకుండా ఉండాల్సింది. తొందరపడి అలా మాట్లాడకుండా ఉండాల్సింది. వాళ్లు నన్ను నమ్ముకున్నారు, అవసరానికి వాళ్లకు సహాయం చెయ్యలేకపోయాను. ఇలాగ మనకు హాని కలిగించిన వారిని గుర్తుచేసుకుంటూ ఉండటం కంటే క్షమించి వదిలెయ్యడం మన మానసిక ఆరోగ్యానికి మంచిది. చేసిన తప్పులు నెమరు వేసుకుంటూ ఉండటం కంటే ఇక అలాంటి తప్పులు చెయ్యను అని గట్టిగా నిర్ణయించుకుని మనల్ని మనమే మన్నించుకోవాలి. అలా చెయ్యగలిగితే మనసు గతంలోకి సంచారం చేసి బాధాకరమైన జ్ఞాపకాలను తొవ్వితీయడం కొంత తగ్గుతుంది. చేస్తున్న పనిమీద మనసు పెట్టడం కొంత సులభం అవుతుంది.

మనసును ప్రస్తుతానికి దూరంగా ఉంచే మరో కారణం జరగాల్సిన పనుల గురించి పదేపదే ఆలోచిస్తూ ఉండటం, అవి సక్రమంగా అనుకూలంగా జరగవేమోనని ఆందోళన (anxiety) పడుతూ ఉండటం.

ఉదాహరణకు, చాలాకాలం తర్వాత ఉద్యోగానికి ఒక ఇంటర్వ్యూ వచ్చింది. మీరు ట్రాఫిక్‌లో ఉన్నారు. ఇంటర్వ్యూ సమయానికి చేరలేకపోవచ్చు. ఫోన్‌చేసి చెప్పగలిగితేసరే, కానీ ట్రాఫిక్ లో ఉండి పదేపదే విచారించి ప్రయోజనంలేదు. రేపు పరీక్ష ఉంది. చదవటం ఉపయోగకరం, కానీ పాసవుతానో లేదో, ఫెయిలయితే లేక మంచి మార్కులు రాకపోతే తల్లిదండ్రులు ఏమంటారో- ఇలాంటి ఆలోచనల వలన ప్రయోజనం లేదు, చదువు చెడటం తప్ప. చాలాసార్లు మనం ఊహించి భయపడే సమస్యలు సత్య దూరంగా, విపరీతంగా ఉంటాయి. అందువల్ల అనవసరమైన ఆలోచనలు వదిలేస్తే ఆందోళన పడాల్సిన అవసరం కొంతైనా తగ్గుతుంది.

చేస్తున్న పనిమీద మనసుపెట్టడం ప్రయత్న పూర్వకంగా జరగాలి. చేస్తున్న పని ఏదైనా ధ్యాస దానిమీదే ఉండాలి. చెవుల్లో ఇయర్ బడ్స్ (ear buds) పెట్టుకుని ఏదో వింటూ చెట్ల మధ్య బాటమీద నడుస్తూ ఒక్కసారి ఎగిరిపడిందొకావిడ. దోవకు అడ్డంగా వెళ్తున్న పామును ఆలస్యంగా చూసింది. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ మెట్లుదిగాడొక పెద్దాయన. కిందపడి ఇప్పుడు మంచంలో ఉన్నాడు. రెండు కాళ్లూ కదలవు. మనసుని ప్రయత్నపూర్వకంగా చేస్తున్న పనిమీద ఉంచినట్లయితే పైన చెప్పిన రెండు ప్రమాదాలూ జరిగేవికాదు.

నేను ఒకేసారి రెండు మూడు పనులు చెయ్యగలను (multi-tasking) అనుకుంటారు కొందరు. నిజానికి మనసు ఒక సమయంలో ఒక్క పనిమాత్రమే చెయ్యగలదు. Multi-tasking అంటే ఒక పని నుంచి మరో పనిమీదికి మనసుని తొందరగా మళ్లించడం మాత్రమే. రెండూ ఒకేసారి చెయ్యడం కాదు.

చేస్తున్న పనిమీద మనసుపెట్టడం ఒక అలవాటు కావాలి. దీనిమీద మనసు పెడతాను, దానిమీద పెట్టనవసరం లేదు అనుకోవడంలో వింతేమీ లేదుగానీ, ఇందాక చెప్పినట్లు మనసు మన అధీనంలో లేనప్పుడు వ్యాకులత కలిగించే లేక ఆందోళన కలిగించే ఆలోచనల్లో మునిగి ఉంటుంది. అందువల్ల చేస్తున్న పని ఏదైనా సరే, అలవాటుగా దానిమీద మనసు పెట్టగలిగితే అది మన మానసిక ఆరోగ్యానికి మంచిది.



ఆరి సీతారామయ్య ప్రకాశం జిల్లాలో పుట్టి చీరాలలో చదువుకుని లక్నో యూనివర్శిటీలో పిహెచ్.డి. చేసారు. అనంతరం జర్మనీ, ఫ్రాన్స్, అమెరికాలలో ఉన్నతవిద్య అభ్యసించి, మిచిగన్ రాష్ట్రంలో ఓక్లాండ్ యూనివర్శిటీలో బయో మెడికల్ సైన్సెస్ ప్రొఫెసర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. రెండు కథాసంపుటాలు- గట్టు తెగిన చెరువు, కెన్యా టు కెన్యా ప్రచురించారు. ఓల్గా స్వేచ్ఛ నవల ఇంగ్లీషులో అనువాదం చేసారు. నివాసం వాషింగటన్ డి.సి.

మాట మారింది, మాధ్యమం మారింది, రచయితలు మారాల్సిన సమయం వచ్చింది

అట్లూరి అనిల్

సోషల్ మీడియాని తెలుగులో సాంఘిక మాధ్యమాలు అని పిలుచుకుందాం. ఈ మాధ్యమాలలో ఒకటైన ఫేస్‌బుక్‌లో ఒక తరం తెలుగులో రచనలు చేస్తూ కొంత గుర్తింపు తెచ్చుకున్నది. సాంఘిక మాధ్యమాలలో ఇది ఒక్కటేకాక ఇంకా చాలా వున్నవి. వాటి గురించి తరువాత ప్రస్తావిస్తాను.

కడలి తొలి రచన బహుశ 2017-18 ప్రాంతాలలో మాతృక లోనో అరుణతారలోనే ప్రచురణకి నోచుకుంది. కడలి 2019లో తన మొదటి పుస్తకం ప్రచురించింది. ఆ పుస్తకం పేరు లెటర్స్ టు లవ్. ఆ ఉత్తరాలు తొలుత ఫేస్‌బుక్ లోనే వెలువడ్డాయి. బహుశ తన తరం రచయితలలో ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేసుకున్న తరువాత పుస్తకంగా వెలువడినవి ఆమె రచనలే అనుకోవచ్చు.

డిసెంబరు 2019లో కోవిడ్-19 ప్రపంచంలోకి వచ్చిందని గుర్తించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) మార్చ్ 2020లో గ్లోబల్ పాండెమిక్ (Global Pandemic) గా గుర్తించి ప్రకటించింది. ప్రపంచంలో చాలా దేశాలు లాక్ డౌన్ ప్రకటించాయి. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. అనేక ఇతర కార్యకలాపాలతోపాటు ఆ ఆసక్తి వున్నవారు సాహిత్యం వైపు కూడా మళ్లారు. చదవడం మాత్రమే కాక రాయడం కూడా. ఇది ఒక్క తెలుగులోనే కాదు, ఇతర భాషల్లో కూడా. అప్పటిదాక స్థబ్దుగా ఉన్న తెలుగుభాషకి కోవిడ్ ఒక విధంగా కొత్త ఉత్తేజాన్ని, నూతన ఉత్సాహాన్ని ఇచ్చి తెలుగు పాఠకలోకాన్ని విస్తరింపజేసింది.

కాలగతిలో వేగం పెరిగింది. శ్రోతలు, వీక్షకులు కూడా వేగం పట్ల ఆకర్షితులయ్యారు. ఇండియాలో ఇంటర్నెట్ గంటకి వంద రూపాయల నుంచి పాతిక రూపాయలకి, పది రూపాయలకి పడిపోయింది. 1995 ప్రాంతాలలో 10 నుండి 15kbల వేగం వున్నది ప్రస్తుతం 1GBకి దాటింది. తొంభైలలో' 'రా వచ్చి ఇక్కడ కంప్యూటర్ ముందు కూర్చో,' అనేది ఇంటర్నెట్. ఈరోజున జేబులోకి వచ్చి చెప్పినట్టు వింటోంది. స్పీడ్ యుగమైపోయింది.

కడప నివాసి ఒక రచయిత, "అచ్చు పత్రికల వాళ్ల అంగీకారం కోసం చూసిచూసి విసుగెత్తి వాళ్లకి పంపడం మానేసాను. ఫేస్ బుక్‌లో నన్ను ఫాలో అయ్యేవాళ్లు నా కథ పడగానే చదివి వెమ్మటే నాకు తమ రెస్పాన్స్ తెలియజేస్తున్నారు. అది చాలు నాకు," అని అన్నాడు.

చిన్ని అజయ్ తన తొలి కథని 2018లోనే ఫేస్‌బుక్‌లోనే పోస్ట్ చేసాడు. సాయివంశీ తన మైక్రో కథలన్నింటిని ఫేస్‌బుక్‌లోనే పోస్ట్ చేసుకున్నాడు. అదే పేరుతో తరువాత అది పుస్తకంగా కూడా వచ్చింది. సోలమన్ విజయకుమార్ 2019లో తన కథలని ఫేస్ బుక్‌లో పోస్ట్ చేసుకోవడం మొదలుపెట్టాడు. 2020 నవంబరులో 'మునికాంతపల్లి కథలు' సంపుటిగా వెలువడినవి. ఈ మిలినియల్ రచయితలు (వివిధ వయస్సులకి చెందిన రచయితలున్నారు కాబట్టి వీళ్లల్లో మిలినియల్స్ అని విడిగా వర్గీకరించడం కష్టం కాని అదే సులభంగా వుంటుందని ఆ పదం వాడుతున్నాను) ఫేస్‌బుక్‌కి మాత్రమే పరిమితం అనుకుంటే తప్పుడు పోస్ట్ షేర్ చేసినట్టే. ఎందుకంటే అవతల ఇన్‌స్టాగ్రామ్ కూడా వుంది. సృజన తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ 'సృజనాత్మకం' కథలు ప్రచురించుకుంటోంది. తను రాసిన కథలు కొన్ని కథాలోగిలి, ప్రజాశక్తి, సాక్షి

అచ్చుపత్రికలలో కూడా వెలువడ్డాయి. ఇక చలనచిత్ర పరిశ్రమలో తన ఉనికిని చాటుకోవడానికి సిద్ధపడుతున్న అనిల్‌రెడ్డి 2021లోనే తన మొదటి కథని ఫేస్‌బుక్‌లో ప్రచురించాడు. దానితోపాటు మరో ఇరవై కథలతో 'నర్సంపేట కథలు'గా వచ్చాయి.

వర్డ్‌ప్రెస్ బ్లాగులుండేవి. గూగుల్-బ్లాగర్ కూడా వుండేది. కాదు, ఇప్పుడు కూడా వున్నాయి. కానీ, ఈరోజున సాంఘిక మాధ్యమాలు ఇస్తున్న సంతృప్తిని అవి ఇవ్వలేకపోతున్నాయి. తక్షణ స్పందనలు బ్లాగ్స్ ఇవ్వలేకపోతున్నాయి. పైగా వాటిని నిర్వహించడానికి కొంత శ్రమ అవసరం. షేరింగ్ కూడా సోషల్ మీడియాలో సులభం.

రవి మంత్రి డబ్లిన్‌లో వుంటాడు. ఇన్‌స్టాగ్రాంలో రీల్స్, స్టోరీస్, పోస్టులు చేసుకుంటూ వుంటాడు. 2023లో తను రాసిన నవల 'అమ్మ డైరీలో కొన్ని పేజీలు' సేపియన్ స్టోరీస్ మాతృసంస్థ అయిన అజు పబ్లికేషన్స్ ప్రచురించింది. ఈ వ్యాసం రాసే నాటికి ఆ నవల దాదాపుగా 18 పునర్ముద్రణలు పొందింది. సుమారుగా లక్షా ఎనభై వేల ప్రతులతో దూసుకు పోతోంది. అవికాక స్పెషల్ ఎడిషన్ వెయ్యి ప్రతులు అదనం.

ఈ వివరాలన్నీ ఎందుకు చెప్తున్నానంటే మాధ్యమాలు మారాయి. వాటితోపాటు పాఠకులు కూడా మారారు. వాళ్ల అభిరుచులు మారాయి. రచయితలు కూడా తమ రచనలు చేసే పద్ధతులు మార్చుకోవలసిన సమయం ఆసన్నమయ్యింది. తమ రచన పాఠకులతో పంచుకోవాలనుకునే వారికి ఇది వర్తిస్తుంది.

నిన్న మొన్నటి వరకూ రచయితలు కథలు రాసేవారు. ఇవాళ ఆ కథలని పంచుకునేవాళ్లయ్యారు. అంతేకాదు, పాఠకులు మన కథల్ని ఎలా చదువుతున్నారు, ఎక్కడ విమర్శిస్తున్నారు, ఎలా అభినందిస్తున్నారు తక్షణమే తెలుసుకుంటున్నారు. రచయితలలో ఈ మార్పుని తెచ్చింది సోషల్ మీడియా. అది ఒక్కటేనా అంటే కాదు, పైన నేను ఉదహరించిన కారణాలు కాక మరికొన్ని వున్నాయి. ఉదాహరణకి యూట్యూబ్. యూట్యూబ్‌లో ఈరోజున అనేక వందల కథలున్నాయి. వాటన్నింటికి కాపీ రైట్ వున్నదా లేదా అన్నది తరువాతి అంశం. శ్రోతలున్నారు వాటికి. వందల్లో కాకపోతే పదుల్లో వున్నారు కొన్నింటికి. ఈ సోషల్ మీడియాలో కొన్ని ఇబ్బందులు కూడా వున్నాయి. లైకులు, లవ్వులకి అలవాటుపడి చిన్నపాటి 'సద్విమర్శ'ని సహించలేకపోవడం. ఆ అసహనం మూలంగా రాస్తున్న ప్రక్రియలో నిజాయితీ లేకపోవడం, వస్తువులో లోపం, వ్యాకరణ దోషాలు చెలరేగిపోవడం జరుగుతోంది. తద్వారా పాఠకుడు దూరమవ్వడం. అంతేకాదు, 'కువిమర్శ' మూలంగా ఒక రచయిత రాయడం మానేస్తున్నాడు.

అంతేకాక, సోషల్ మెడియా సరికొత్త ఒరవడికి తెర తీసింది. చిన్న చిన్న వాక్యాలు తీవ్రమైన భావనలు, తక్షణ స్పందనల యుగం ఇది. ఇదే ప్రస్తుత మార్గం. బహుశ రానున్న సమీప భవిష్యత్తు కూడ ఇలాగే వుంటుంది. గతంలోలాగా కథ రాసినవాడు కాగితం మీదే వుండడు, కాగితం మీద రాయడం అంటూ వుంటే! ఇంకా కొంత మంది కాగితం మీదే రాసేవారు ఉన్నారు. కానీ వారు కూడా తరువాత దాన్ని స్క్రీన్ మీదకి తీసుకువెళ్లటం తప్పటంలేదు. అది ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌గానో, ఫేస్‌బుక్ స్టేటస్‌గానో లేక బ్లాగ్ పోస్ట్‌గానో వెలుగు చూడవచ్చు. ఇక ఆ కథలకి వ్యాఖ్యలు, షేర్లు, లైకులే ప్రాణం. రచన పుట్టిన క్షణమే పదిమందికి చేరడం సాధ్యమవుతోంది. కాకపోతే ఈ రచయితలు కొంత బాధ్యత తీసుకుని రాయాల్సి వుంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఉండే తెలుగు రచయితలు, తెలుగుమాటను మరిచిపోకుండా తమ రచనలు కొనసాగిస్తున్నారు, అది ఏ ప్రక్రియలోనైనా. ఇది గర్వించదగ్గ విషయం. కానీ వాళ్లు ఎదుర్కునే సవాళ్లు కూడా వున్నవి. అవేమిటో ఎందుకో చూద్దాం.

భాషా పరిణామాన్ని అనుసరించలేకపోవడం. ప్రాంతీయ అస్థిత్వ వాదాలు భాషని ప్రభావితం చేస్తున్న సందర్భంలో భాషలో వస్తున్న మార్పులని గమనించలేకపోవడం, గుర్తించినా అనుసరించలేకపోవడం! ఉదాహరణకి మాండలికాలు, యాస లాంటివి తీసుకుందాం. ప్రతి వందమైళ్లకి ఆచారా వ్యవహారాల్లోను, బాష, సంస్కృతుల్లోను మార్పు సహజం అని భాషాశాస్త్రవేత్తలు కూడా తెలియజేస్తున్నారు, వాటిని గుర్తించలేకపోవడం మూలంగా. ఉదాహరణకి: చనుప, నెరవు, తెరువు, దడము, బడిమి, పుంత, నడవ, మయి, జాడ, ఓణి, కంతి, చొప్పు- వీటన్నింటిది ఒకటే అర్థం, తెలుగులో దారి అని.

మాతృభూమికి దూరంగా వుండటం మూలంగా తెలుగులో మాట్లాడుకునే అవకాశాలు, అలాంటి పరిసరాలు, సందర్భాలు లేకవడం వల్ల భాసకి పదును పెట్టుకునే వీలు లేకపోవడం మరొక్క కారణం. అలా భాష నిర్జీవమైపోవడం. దాని మూలంగా రచనల మీద కూడా ఆ ప్రభావం పడుతుంది.

తెలుగు సమాజాలకి దూరంగా వుండటం వల్ల సామాజిక మార్పుల పట్ల అవగాహనలేమి. యువత ఆలోచనలు వేగంగా మారిపోతున్నాయి. వాటిని బట్టి కథలు రాయల్సి వచ్చినప్పుడు దృష్టి లోపం మూలంగా కథని ప్రతిభావంతంగా చెప్పలేకపోవడం మరొక అవరోధం. గతంలో తెలుగు సాహిత్యంలో LGBTQ వస్తువుని తీసుకుని రాసిన కథలు అతి తక్కువ. అలాగే వివాహేతర / వివాహ రహిత సంబంధాల మీద కూడా. ఇవే కాకుండా స్త్రీవాదం (స్త్రీల అస్థిత్వం), దళితవాదం (దళితుల అస్థిత్వం), ప్రాంతీయవాదం, భాషావాదాలు కూడా వున్నాయి. వెతుక్కుంటూ వెళ్తే వాటితోపాటు మరికొన్ని తెలుస్తాయి. ఇలాంటి అంశాలు అర్థం చేసుకుంటే కథకుడు పాఠకులకు దగ్గిర అవ్వగలుగుతాడు.

సమకాలీన సాహిత్యం చదవండి

గతకాలపు సాహిత్యం - క్లాజిక్స్ మంచివే. మరీ ముఖ్యంగా భాషకి సంభందించినవి. అంతేకాదు, వ్యాకరణం కూడా తెలుస్తుంది. కథా వస్తువుని ఆయా రచయితలు ఎలా కథనం చేసారో కూడా

తెలుసుకోవచ్చు. తెలుసుకోవడం మూలాంగా మరొక కొత్త కోణంలో ఆ కథని మీరు చెప్పగలుగుతారు.

తెలుగులో సంభాషణకి తగిన మార్గాలు వెతికి మాట్లాడటానికి ప్రయత్నించండి. మాట్లాడుతున్నప్పుడు వినడం తప్పనిసరి. కమ్యూనికేషన్ స్కిల్స్‌లో మాట్లాడం ఒక్కటే కాదు, వినడం కూడా ఒక కళ. వినడం మూలంగా సున్నితమైన భావాలని వాక్యాల్లో పొదగడం మరింత సులభతరమతుతుది.

సాంఘిక మాధ్యమాలు/సోషల్ మీడియాని వేదికగా చేసుకోండి, వ్యక్తిగతమైన ప్రచారం కోసమే కాదు. మీ రచనలు పదిమందికి చేరాలంటే అత్యంత సులభమైన మార్గం.

'కృష్ణమ్మ కలిపింది ఇద్దరిని,' 'మనమంతా...', 'ఓనమాలు', సినిమాలకి సంభాషణకర్త, పాత్రికేయుడు, రైటర్స్ మీట్ సంస్థాపకుడు ఖదీర్‌బాబు కూడా దాదాపు పన్నెండు కథలు ఫేస్‌బుక్‌లో మాత్రమే ప్రచురించాడు. ఫేస్‌బుక్‌లో ప్రచురితమైన తన మొదటి తెలుగు కథ జీరో బ్లడ్. ఇటీవల ప్రచురించిన కథ 'కే భాగ్యరాజా కథ'. తన కథలన్నీ తరువాత అనేక సంపుటిల్లోను సంకలనాలోను స్వీకారానికి నోచుకున్నాయి.

గూండ్ల వెంకటనారాయణ 'గరికపాటోడి కతలు'లో తొలి కథ 'ఎన్నాళ్లకో పోలేరు జాతర' కథని 2022లో మొదట సోషల్ మీడియాలోనే వెలుగు చూసింది.

పాలపిట్ట, వెలుగు, నేటి నిజం పత్రికల్లో నందు కూసినర్ల కథలు వచ్చాయి. మొదట అవన్నీ కూడా సోషల్ మీడియాలోనే వచ్చాయి.

తెలుగు సాహిత్యం నిలకడగా నిండుగా వుండే సరస్సు కాదు. నది ఎప్పటికీ ఒకే మార్గంలో ప్రవహించదు. కాలక్రమంలో తానెదుర్కొనే నేల, గడ్డ, వానల ప్రభావంతో మార్పులు చెందుతూ తన దారి మార్చుకుంటూ ప్రవహిస్తుంది. అలాగే భాష కూడా ఒక స్థిరమైన చట్రంలో ఇమడదు. కాలంతోపాటు అదీ మారుతుంది. దేశాల, ప్రాంతాల ప్రభావాలకు లోనవుతుంటుంది. ప్రతి తరమూ దానిని తమకు కావలసిన పద్ధతిలో ఉపయోగపడేలా మార్చుకుంటుంది. ప్రవహించే నది తన దారి మార్చుకున్నా సహజంగా తాను తాకిన ప్రతి దానికి ప్రాణం పోస్తుంది. భాషా స్వరూపాలు మారినా భావాన్ని, అనుబంధాన్ని నిండుగా మోస్తుంది. భాష కూడా అంతే. అలాగే ప్రసారమాధ్యమాలు.

ఇందాక అన్నట్టు కోవిడ్ / కరోనా తరువాత తెలుగులో అచ్చుపత్రికలు చాలామట్టుకు తగ్గిపోయినవి. పత్రికల పంపిణీవ్యవస్త దారుణంగా దెబ్బతింది. ఆ లోటు పూడ్చడానికా అన్నట్టు వెబ్‌సైట్‌లు మొదలయ్యాయి. ఉదాహరణకు కొన్ని: యువర్‌కోట్ (YourQuote.in), మాతృభూమి (matrubhumi.com), స్టోరీమిర్రర్ (StoryMirror.com), కహానియా (kahaniya.com), టెర్రిబ్లీ టైనీ టేల్స్ (TerribyTinyTales.com). వీటన్నింటిలోను తెలుగులో రాసే తెలుగు కథకులున్నారు. సీరియల్స్ రాసేవారు కూడా వున్నారు. అలాగని తెలుగు పత్రికలు లేవని కాదు. వాటిలో కొన్ని: ఉదయిని, ఈమాట, కథామంజరి, కౌలిమి, కౌముది, నెచ్చెలి, భూమిక, సంచిక (మాసం/వారం), సారంగ, తెలుగుతల్లి కెనడా, వసంతమేఘం, విహంగ. ఇవికాక ఇంటర్నెట్‌తోపాటు ఆఫ్‌లైన్ పత్రికలు- సహరి (వారంమాసం) లాంటివి కూడా వున్నవి.

అలాగే కాలప్రవాహంలో నిరంతరం రూపుమాపుకుంటూ ముందుకు సాగే నదికి, నూతన ప్రసార మాధ్యమాలు, ముఖ్యంగా సాంఘిక మాధ్యమాలు (social media) ఆ ప్రవాహానికి వేగం చేకూర్చినప్పటికీ, మనకి 'నీరు పల్లమెరుగు' అనే సామెత చందాన, దాని గమ్యం ఎప్పటికీ మానవతావిలువల దిశలోనే ఉండాలి. వ్యక్తిగత అనుభూతులు, సమాజ స్పందన, భాషాపరిరక్షణ ఈ మూడు కోణాల మధ్య సమతుల్యత సాధించగల రచయితే సాహిత్యాన్ని సమకాలీనంగా, జీవితానుబంధంగా నిలిపే శక్తిని పొందగలడు.



గొప్ప సాహితీ నేపథ్యం ఉన్న కుటుంబంలో (త్రిపురనేని రామస్వామి చౌదరి మనవడు) జన్మించిన అట్లూరి అనిల్ స్వస్థలం మద్రాసు. మద్రాసులో చదువుకుని హైదరాబాద్ వచ్చారు. అడపాదడపా కథలు, వ్యాసాలు రాస్తారు.

From Curry Leaves to Croplands: A Desi Journey into the U.S. Agriculture Farming

Pulugurtha Hari
Agriculture Forum Co-Chair

The Seed of a Dream

Ten years ago, my farming journey took root in the quiet corners of my backyard in Troy, Michigan.sparked by a deep yearning to reconnect with the vegetables of my Indian childhood. I planted bitter gourd (kakara kaya), eggplant (vankaya), okra (benda kaya), sorrel leaves (gongura), and a variety of gourd vines.not just for nourishment, but for nostalgia. Yet no plant held as much meaning as the sacred curry leaf. Its aroma wasn•ft just familiar.it was spiritual, evoking vivid memories of my mother•fs kitchen. That single plant became more than a crop; it became the soul of a vision that would soon grow far beyond my backyard.

Backyard Beginnings: Growing More than Vegetables

My backyard was more than a garden.it became a space for experimentation, reflection, and cultural connection. Without formal training, I learned through observation, instinct, and wisdom from fellow Desi gardeners. My wife was an equal partner.composting scraps, weeding, harvesting, and planting with care. Together, we created not just a garden but a shared labor of love. I introduced small innovations like trellises and a 50-foot tunnel for climbers, helping our vegetables thrive with sunlight and space.



The Desi Farmer's Mindset in America

As an Indian-American, my approach to farming was shaped by a blend of ancestral knowledge and modern adaptation. I remembered my grandparents talking about the lunar cycle, neem-based pest control, and companion planting. But the American climate, soil types, and growing zones were different. I had to understand frost dates, USDA planting maps, and how to extend the season in colder months. Yet the Desi mindset helped.Growing Indian vegetables in Michigan soil was a challenge

From Garden Rows to Farming Goals

The shift from backyard gardening to agriculture farming didn•ft happen overnight. It began with a bold

question: What if I could scale this up? That question led to learning about land leasing, soil health testing, weed management, and crop rotation. I started exploring Michigan•fs agriculture support systems, extension services, and immigrant farmer programs. My background in product management gave me a strategic lens.I approached farming like a startup: start small, validate, scale smart. Slowly, what began as a backyard effort began to take

shape as a viable, purpose-driven farming venture. Now, I•fm working toward building a sustainable operation on larger land, focused on growing culturally important crops like saffron, okra, and more.

My passion for growing Indian vegetables didn•ft stop at the backyard fence.it pushed me to think bigger. That passion eventually drove me to purchase a larger piece of agricultural land with the dream of scaling up into purposeful farming. Over six months, I immersed myself in research to find the right crop that would suit both the climate of Michigan and my long-term goals. That•fs when I stumbled upon an unexpected revelation: Southeast Michigan shares a strikingly similar climate to Kashmir, the famed region for cultivating saffron. The discovery lit a spark in me. The idea of growing saffron.a crop rich in heritage, value, and rarity.felt both bold and meaningful. That moment marked the beginning of a startup vision: to grow saffron right here on American soil, starting with a portion of my newly acquired land.

Cultural Legacy Meets Modern Agri-Vision

This journey is deeply Desi at heart. It•fs about honoring where I come from while embracing the tools and opportunities of where I am now. Sharing produce with neighbors, teaching younger generations about traditional Indian vegetables, and dreaming of a day when kakara kaya sits proudly at farmers markets across America.this is what keeps me going. My goal is not just to grow crops, but to grow awareness, connection, and a bridge between cultures. From curry leaves in a pot to croplands stretching across Michigan soil, this is more than farming. It's a legacy in the making.

My Saffron (Kumkum Puvvu) Adventure: A Journey Rooted in Heritage and Innovation

My journey with saffron.known in Telugu as Kumkum Puvvu.began as a natural extension of my passion for Indian agriculture. Crocus sativus, the botanical name for saffron, is traditionally grown in the cold, hilly terrains of Kashmir in northern India. Each delicate flower produces only three red stigmas, which are carefully hand-harvested and dried to become the vibrant saffron threads we all know. These threads, small and reddish-brown, are cherished for their rich aroma, intense flavor, and vibrant hue.



This saffron farm is a fresh and exciting initiative by Hari Pulugurtha, launched under the brand Michigan Gold Saffron by Nickwan Inc. The journey began in the summer of 2024 with months of careful planning, research, and planting. By fall, the first vibrant saffron blooms emerged.celebrating a successful debut harvest across one and a half acres in the serene fields of Grass Lake, Michigan. We are actively sharing more updates and stories on our newly launched website: nickwan.com.

Saffron holds a sacred and cultural place in Indian life. In culinary traditions, it features prominently in Indian, Middle Eastern, and Mediterranean cuisines. At Tirumala Tirupati Devasthanam, saffron is blended with scented elements to enrich the divine fragrance of temple rituals. It is also used in the preparation of sacred offerings such as *Laddu prasadam* and *Theertham*. Beyond its spiritual and culinary value, saffron has drawn scientific interest for its potential medicinal and anticancer properties. But due to its labor-intensive cultivation.requiring thousands of flowers to produce just a few grams.saffron remains one of the world•fs most expensive spices by weight.

My dream to grow saffron in the U.S. took shape after months of research into climate compatibility. I was surprised to learn that Southeast Michigan, especially areas like Grass Lake, shares a remarkably similar climate profile with Kashmir during saffron•fs growing season. This discovery became the turning point. I reached out to the University of Vermont (UVM), which has conducted pioneering research through its North American Center for Saffron Research & Development. Their team generously shared insights and data that helped guide my efforts in cultivating saffron on my farmland in Grass Lake.

Saffron is a hardy crop, but it has specific needs. It thrives in well-drained soil with controlled irrigation and doesn't tolerate waterlogging. It grows best in organic-rich soil.traditionally fertilized with cow dung.and prefers a pH range of 6.0 to 7.5. The planting units, called corms (which resemble tulip bulbs), are planted 6 to 8 inches deep in late summer. The flowering season begins in late September and continues into

early November, lasting around 4 to 6 weeks. Flowers must be harvested early each morning, and the delicate red stigmas are carefully separated.

To preserve their potency, stigmas are dried in an oven at around 210•‹F for about 7 minutes.though this may vary depending on the moisture level. Once dried, the saffron threads must be stored in airtight containers to maintain their fragrance, color, and medicinal quality. I package and brand the product in grams, aiming to offer authentic, Michigan-grown saffron that honors both the legacy of Indian agriculture and the promise of American innovation.

Another inspiring journey in the world of Desi farming comes from LVS Organic Farms in Morrisville, North Carolina. Lakshmi, a passionate grower, has cultivated this vibrant 2-acre organic haven over the last six years. Her farm thrives on traditional Indian farming practices– no pesticides, just pure, naturally enriched soil through thoughtful crop rotation. LVS specializes in fresh, locally grown Indian vegetables like Munagaku,Avisaaku, yellow pumpkin, snake gourd, bitter gourd, and eggplants. The farm bursts with summer leafy greens, reflecting a true commitment to sustainable, chemical-free cultivation. You can explore more about Lakshmi•fs farming story on her Facebook page.

Starting Agriculture Farming in the U.S. - Simplified Guide

1. Vision & Planning
- Define goals: hobby, side income, or full-time.
- Choose crops based on climate, demand, and interest.
- Draft a farm plan (budget, scale, timeline).

2. Land & Soil
- Prioritize land with good sunlight, drainage, and access.
- Test soil via MSU Extension ($20.25) for pH, nutrients (NPK), and amendments.

3. USDA Support
- FSA: Microloans, land loans.
- NRCS/EQIP: Grants for irrigation, fencing, conservation.
- Register your farm at a USDA service center for a farm number.

4. University Help (e.g., MSU Extension)
- Free advice on crops, pests, soil health.
- Webinars, weed ID, and organic strategies.

5. Water & Irrigation
- Secure water (well, pond, municipal).
- Use drip irrigation (EQIP may subsidize).

6. Weed/Pest Control
- Combat weeds with mulch, fabric, or organic sprays.
- Monitor pests via MSU/IPM guides.

7. Soil Health
- Amend soil per test results (compost, lime, etc.).
- Plant cover crops (clover, rye) off-season.

8. Legal & Business
- Register as LLC/sole proprietorship if selling.
- Track finances for grants/loans.

9. Funding
- USDA Microloan: Up to $50K for equipment/ expenses.
- Check state grants (e.g., MSU Product Center).

10. Community
- Join local co-ops or MSU/USDA farmer meetups.
- Network with immigrant farmers for niche crops.

11. Key Takeaways
- Start small, leverage USDA/MSU resources, and prioritize soil/water.
- Grants/loans ease costs; mentorship accelerates learning.

A Canvas of Soil, Spirit, and Sankalpam: Concluding a Desi Farmer's Journey in Bloom

This journey.from curry leaves in a pot to saffron fields under the Michigan sky.has been nothing short of a living oil painting. Each season added new textures, each harvest brought color, and every setback taught me to layer with patience and grace. Like a brush guided by devotion, my hands shaped this vision not just with seeds, but with sankalpam (sacred intent).

To all who dream of farming in a new land: let your story be painted with purpose. Begin with roots of memory, water it with faith, and let your land bloom like a masterpiece.grounded in dharma, nurtured by family, and guided by your inner light.

Because in the end, the most beautiful legacies are not just grown.they are lovingly painted, season by season, on the vast canvas of life.



Hari Pulugurtha is an Indian-American IT Product Manager, first generation farmer and oil-on-canvas artist based in Michigan. He founded Michigan Gold Saffron by Nickwan Inc. He also voluteers at Bharatiya Temple preparing and serving prasad to devotees on every Sunday.

Feathered Friends of Michigan

Bollineni Sam

Birdwatching

Birdwatching, also known as birding, is a popular hobby enjoyed by millions. It involves observing birds in their natural habitats, either for recreation or as a form of citizen science.

Here are some fun facts

- **Popularity:** Over 46 million Americans participate in birdwatching and feeding.
- **Mental Health Benefits:** Studies show that observing birds can improve mental well-being and happiness.
- **Economic Impact:** Birdwatching contributes significantly to the economy, with billions spent on equipment and travel, and generating millions in tax revenue.
- **Backyard Birding:** A large majority of birders enjoy watching birds from their homes.
- **Citizen Science:** It can be a form of citizen science, where observations contribute to scientific research.
- **Unique Bird Adaptations:** Birds have fascinating adaptations, like the black skimmer's specialized eyes for skimming water and the ability of some birds to sleep while flying.
- **Cultural Significance:** Birds have been symbols in various cultures throughout history, representing things like the soul, wisdom, and resurrection.
- **Learning about Nature:** It encourages closer observation of nature and its ecosystems.

Birds of Michigan

Michigan is a bird lover's paradise, with its diverse habitats ranging from Great Lakes shorelines to dense forests and wetlands. Let's take a look at what makes birding in the Great Lakes State so special.

Local Birds of Michigan

Michigan is home to over 400 bird species, including common year-round residents like the Northern Cardinal and the American Robin, which is also the state bird. Some of the most common and beloved include:

- **Black-capped Chickadee** - Michigan's most frequently spotted backyard bird.
- **American Robin** - The state bird, known for its cheerful song and rusty red breast.
- **Downy Woodpecker** - A small, energetic woodpecker often seen at feeders.
- **Tufted Titmouse** - Gray bird with a small crest, often found in woodlands.
- Northern Cardinal, Blue Jay, Mourning Dove, and American Goldfinch are also frequent visitors to backyards and parks.

Unique and Notable Species

- **Kirtland's Warbler:** A rare warbler that breeds in young jack pine forests.
- **Piping Plover:** A threatened shorebird that nests on sandy Great Lakes beaches.
- **Sandhill Crane:** A tall, stately bird with long legs and a red patch on its head.





- **Bald Eagle:** A large, majestic bird of prey, often seen near water.
- **Pileated Woodpecker:** The largest woodpecker in Michigan, with a distinctive red crest.

Migrating Birds of Michigan

Michigan is a major stopover for migratory birds during spring and fall. Some notable migrants include:

- Red-winged Blackbirds
- Sandhill Cranes
- Canada Geese
- Yellow Warblers
- Eastern Kingbirds
- Black-throated Green Warblers
- Wood Thrushes

Peak migration seasons are March to June (spring) and August to November (fall).

Magee Marsh - Warbler Capital of the World

Magee Marsh along the shores of Lake Erie has become known as the "Warbler Capital of the World" and hosts the largest birding festival in the US every May. One visit and you'll see why so many birders love coming to Magee Marsh each spring! Warblers and other migrants are literally everywhere in this region.

These tiny, colorful birds congregate on the lake's southern shore to rest and refuel before attempting the flight across Lake Erie. More than 150 species of song birds including 37 species of warblers have been seen at Magee Marsh during spring and/or fall migration. These birds travel about 1,800-mile direct flight across the Atlantic to South America.

- Warblers galore: Blackburnian, Yellow, Black-throated Green, Magnolia, and more.
- Scarlet Tanagers, Baltimore Orioles, Rose-breasted Grosbeaks
- Thrushes: Wood Thrush, Swainson's Thrush
- Flycatchers, Vireos, and Kinglets
- Raptors: Bald Eagles, Ospreys, and various hawks

Birding hotspots around Great lakes

- Magee Marsh, OH
- Indiana Dunes State Park, IN
- Point Pelee, Ontario, Canada
- Tawas Point State Park, MI
- Whitefish Point, MI

Here are some top-rated places in Michigan's avian wonders:

- Shiawassee National Wildlife Refuge (Saginaw) - A haven for waterfowl and migratory birds.
- Kellogg Bird Sanctuary (Augusta) - Known for its trails and educational programs.
- Seney National Wildlife Refuge - Main Unit (Germfask) - Offers scenic drives and a variety of water birds.
- Haehnle Sanctuary (Grass Lake) - Especially famous for Sandhill Crane sightings.
- Michigan Avian Experience (Brooklyn) - A small but highly knowledgeable birding site.
- Capital City Bird Sanctuary (Lansing) - Great for spotting local wildlife.
- Arcadia Marsh Nature Preserve (Arcadia) - A gem for wetland birding.
- Sarett Nature Center (Benton Harbor) - Offers indoor and outdoor birdwatching opportunities.

Kensington Metro Park in Milford (MI) is a fantastic birding destination, especially for beginners and families. With its scenic trails, woodlands, and lakes, it's known for being a peaceful place to walk and observe birds. Visitors often spot sandhill cranes, herons, swans, and a variety of songbirds. The park's





nature center and well-maintained paths make it easy to explore without needing to venture far from the city.

The birds that are often found hand-feeding at Kensington Park include Black-capped Chickadees, Tufted Titmice, White-breasted Nuthatches, and Downy Woodpeckers.

Bird Watching & Photography Gear

To get started, you don't need much, but the right gear can elevate your experience.

- Binoculars - A must-have. Look for 8×42 or 10×42 models for a good balance of magnification and field of view.
- Field Guide or App - Apps like Merlin Bird ID or Audubon Bird Guide are great for quick identification.
- Camera - A DSLR or mirrorless camera with a telephoto lens (300mm or more) is perfect for capturing birds in flight.
- Spotting Scope - Ideal for long-distance viewing, especially near lakes or open fields.
- Comfortable Clothing - Neutral colors, sturdy shoes, and weather-appropriate layers.
- Notebook or Birding App - To log your sightings and track your progress.



Sam Bollineni Mechanical Engineer and work for Ford Motor Company. Birdwatching & Bird Photography, Playing Basket Ball and Tennis, Marathon running and Gardening are hobbies. Passionate in teach math to young kids.

ధన్యవాదాలు

A PROJECT BY

GHR INFRA | LAKSHMI INFRA | urban blocks Realty

Building Permission No.: 003505/BP/HMDA/0728/SKP/2024
TG RERA Registration No.: P02400009538
Website: https://rera.telangana.gov.in

THERE CAN BE NO ASSET, MORE PRECIOUS THAN YOUR LIFE.

THE
CASCADES
NEOPOLIS

life appreciates here



7.34	6	,560-3,390 sq	95-4,825 sq ft	ft	2,00,000+ sq ft	2
ACRES	LOO S	3 BHK UNIT REA	UNIT AREA	FLOOR-TO-FLOOR HEIGHT	CLUBHOUSE & AMENITIES	IPADS

SBI
PROJECT FUNDED BY STATE BANK OF INDIA
OVERSEAS BRANCH, HYD

+91 9481 14 14 14
www.thecascades.in
SCAN TO KNOW MORE

PRICE STARTING
₹3 cr onwards*

NEOPOLIS, HYDERABAD

AASRITHA

Experience Luxury Living At

AERO
VILLAS

Just 10 minutes from Shamshabad Airport

4BHK PREMIUM VILLAS WITH PRIVATE POOL

+91 888 999 5255

www.aerovillas.in

*T&C Apply

41 Acres | **360** Villas | **25+** Amenities

